మన సుకృతము



అఖిల

అఖిల భారత పత్రిక జనవరి 2004



అస్తిత్వము

అస్తిత్వము[1] కాకతాళీయమో, ఒక గుడ్డివాడు విసిరిన రాయో లేక ఎవడో అనామకుడు చేసిన ఓ వెర్రిచేష్టయో కాదు. అది సాక్షాత్తు భగవంతుని నర్తనశాల.

జీవితము ఎలాగో సంభవించిన గుడ్డి యంత్రం కాదు. అర్థం పర్థం లేని వ్యర్థప్రస్థానమూ కాదు, నిష్ప్రయోజనమూ కాదు. అదొక మహాసత్యావిష్కరణ కోసం చేసే దీర్ఘప్రయాణం – మూగతపస్సు. తనలో నిక్షిప్తమైన దైవాన్ని క్రమక్రమంగా వికసింపజేసే మహాప్రస్థానం.

అస్తిత్వము ఒక ఇంద్రజాలమో లేక ఎండమావో, మరొకటో కాదు. అది ఒక భ్రాంతీ కాదు, నిష్ప్రయోజనంగా అనవసరంగా ఆవిర్భవించిన మాయా కాదు. ఒక మహాసత్యం తనలో తాను సృష్టించుకొన్న అద్భుత ప్రపంచం.

*

ఆవిర్భావమనగా పరమేశ్వరతత్త్వంలోని ఒక ఉదంతం మాత్రమే కాదు – చిరంతనమైన ఆ మహా మహిమాన్వితుని తనువు, ముఖము – అతని శక్త్యానందముల కలకలము.

*

అస్తిత్వమనగా జీవితాన్ని తిరస్కరించుట కాదు – అన్వేషించుట, మనుగడ సాగించుట.

మూలం: శ్రీఅరవిందులు

---

[1] .Existence = బ్రతుకు

పరిణామ ప్రక్రియ ఊర్ధ్వగమనము

ఈ ప్రకృతిలో ఒక ఆరోహణ క్రమమున్నది. అది రాయినుంచి చెట్టువరకు, చెట్టునుంచి జంతువువరకు, జంతువునుంచి మనిషి వరకు సంభవించింది. అందుకని మనిషి తనే పరిణామ ప్రక్రియకు మకుటమని, తనకంటె ఎక్కువ స్థాయి యింకేమీ లేదని భావిస్తాడు. కాని అది చాలా పెద్ద పొరపాటు. భౌతికప్రకృతి దృష్ట్యా మనిషి కూడా ఒక జంతువే – ఆలోచించగలిగిన, మాటలాడే జంతువు. కాని తన భౌతిక జీవితసరళిలోను, బుద్ధులలోను, జంతులక్షణాలే భాసిస్తాయి! సృష్టి యిలాంటి లోపభూయిష్టమైన జీవితో ఎందుకని తృప్తి చెంది వుండాలి? జంతువులోనుంచి మనిషి ఆవిర్భవించినట్లుగానే మనిషిలోనుంచి మరో మనిషి – అజ్ఞానానికి బానిసగావుండే స్థాయినుంచి ఎదిగి ఊర్ధ్వముఖంగా పరిణామం చెంది – అదే బాహ్యారూపమును కలిగియు, అంతకు మించిన చేతనను పొందిన జీవి ఎందుకు రాకూడదు?

ఈ సత్యాన్ని మనకు బోధించటానికే శ్రీఅరవిందులు అవతరించారు. మానవుడు ప్రస్తుతం ఓ మానసికస్థాయికి చెందిన జీవి. కాని అతడు కూడా పరిణామంలో ఒక స్థాయి మాత్రమే కదా. తత్కారణంగా అతనికి కూడా మరియొక నూతన చేతనను (Truth-Consciousness) పొందగలిగే అవకాశం ఉందని వారు చెప్పారు. సంపూర్ణమైన, సమగ్రమైన, సలక్షణమైన, సుందరమైన, ఆనందమయమైన, సంపూర్ణచైతన్యముగల జీవితమును పొందగలిగే అవకాశము కూడ కలదని వక్కాణించారు.

మూలం: శ్రీమాత

మనిషి అంటే

మనిషి ఈ పృథ్విపై మనస్సు, ప్రాణం, శరీరం రూపాలలో తనను తాను అన్వేషించుకొందుకు తనను తాను పరిపూర్ణ అనుభవజ్ఞుడిగా ఆవిష్కరించేందుకు ఉద్యమిస్తున్న ఆత్మ.

*

భారతీయ భావవేదికపై మనిషి అనగా అనేక చేతనారీతుల అభివ్యక్తం, ఆత్మసాక్షాత్కారానికై ప్రచలితమైన ఆత్మ. దైవ రూపాన్ని ఆవిష్కరించుకోగల శక్తి – ఆత్మచైతన్య భిత్తికగా పరిణామం చెందుతున్న ప్రకృతి ఒడిలోని చిదాత్మ! అతడొక విభూతి; ఒక చిరంతన అస్తిత్వం! ద్వైభావనా సాగరంలోని ఒక నిరంతర తరంగం! చిదగ్నికుండ జన్యమైన నందాదీపం! స్థూలదృష్టికి సాధారణ జీవే అయినా సూక్ష్మస్థాయిలో అతడు తాను ఆరాధించే దేవతలనే అధిగమించగల అసామన్యుడు! సాధారణ జంతుప్రవృత్తి అతని నైజంలో అర్ధభాగం మాత్రమే కాని, నిజానికి మనిషి అంతకు మించిన త్రివిక్రమ భావ జీవ రసాయన సంపుటి. అతడి ఆంతరిక వాస్తవం ఒక దివ్యచైతన్య దీపిక! భౌతికపరిమితుల్ని అధిగమించగల దివ్యసత్తాకము. ఈ భూమండలం మీది చరాచర జీవరాశిలో అధమస్థాయి మానవ తత్త్వంనుంచి అసాధారణ దివ్యభూమికకు ఉద్గమించగల ఒకానొక అతిలోక దివ్యశక్తి అతడు. ఇదే భారతీయ సంస్కృతి మనిషికి నిర్దేశించిన తొలి ఆదర్శం! తొలి ధ్యేయం.

మూలం: శ్రీఅరవిందులు

భూలోక జీవితం

జీవితం దివ్య అభివ్యక్తే కాని అపరిపూర్ణము. జీవితంలో, భూమిపైన, శరీరంలో 'ఇహైవ' ఇక్కడే అని ఉపనిషత్తు చెప్పినట్లు దైవత్వాన్ని ఆవిష్కరించుకోవాలి. ఇక్కడే ఆ సర్వోత్తీర్ణ మహిమను, కాంతిని, మాధుర్యాన్ని మన చేతనలో సాధ్యమైనంతవరకు యథార్థ సత్యంగా ఆవిష్కరించుకొని ప్రకటించాలి.

*

'ఋతచిత్' అని వేదమన్నది – నేను 'అతిమానసం' (Supermind) అన్నాను. అది విజ్ఞానఘనం. నీవెంత ప్రయత్నించినా లభించని పరమార్థమది. ఒక ఉపనిషత్తులో మనోమయ పురుషునికి పై అంతస్తులో విజ్ఞానమయ పురుషుడున్నాడని చెప్పబడినది. జీవాత్మ దాని పరిధిలోకి ఎగబ్రాకి తద్వారా ఆత్మానందం పొందాలి, ఈ ప్రకృతి పరిణామంలో ఆ స్థితి లభిస్తే పరిణామ సాఫల్యం లభించినట్లు. అప్పుడు జీవితవృక్షం చిటారుకొమ్మన ఫలించినట్లు ఈ శరీరంలోనే అది సాధ్యం. ఈ శరీరంలోనే అవతరింపచేసుకోవాలి. ఆ శరీరం పరిపూర్ణ దివ్య శరీరం. పృథ్వీతలంపైన దివ్యజీవనం – మధుర బృందావనం – మొలుస్తుంది అని మనమనవచ్చు. మన మానవజాతి బంగారు కల ఫలించినట్లే, చాలామంది ఋషులు, ప్రవక్తలు, మతాలు ఆకాంక్షించినట్లు.

మూలం: శ్రీఅరవిందులు

మానవుని రూపాంతరీకరణము

రూపాంతరీకరణ మనగా ఉన్నతచైతన్యం మనోప్రాణిక దైహికాలలోకి దిగివచ్చి వాటి స్థానాన్ని ఆక్రమించుట.

*

ఆత్మ ద్రవ్యరాశిలో జీవధాతువుగా అంకురించి, తన మూల ప్రకృతిలోనే ఉండి అత్యున్నత ఆత్మభూమికలకు అధిరోహిస్తుంది. ఈ ఉద్గమనంలో అది అటు ఉన్నతోన్నత శిఖరాలను, ఇటు నిమ్నాతి నిమ్నతరాలను స్పృశిస్తుంది. రెండింటిని కలుపుతుంది. ఆ ఆత్మజ్యోతి అన్ని బహుముఖీనమైన కాంతుల్ని, శక్తుల్ని కూడకట్టుకొని భౌతికవస్తు ప్రపంచంలోకి దిగుతుంది. అనేకానేక ఓజశ్శక్తుల రూపాలలో తనకు తాను అభివ్యక్తం చేసుకొంటుంది. ఈ భౌతికజగత్తును మరింతగా దైవ విభూతిమయం చేస్తుంటుంది. ఈ పరిణతరూపంలో (transformed matter) ఆత్మపదార్థం భౌతికబంధాలకు బందీ అయిపోదు. ఓ పెద్ద సంకెలగా మారిపోదు. ద్రవ్యానికి కూడా తన స్పర్శతో దైవత్వభావనను కలిగించి సత్యాన్వేషణకు ఒక సమర్థవంతమైన ఉపకరణంగా మార్చుకొంటుంది. ఆత్మయే ఈ మార్పునకు కారకం, ప్రేరకం అవుతుంది. అంతమాత్రాన ద్రవ్యరాశి తనలో నిబిడీకృత అంతశ్శక్తుల్ని కోల్పోదు. తన పద్ధతుల్ని మార్చుకోదు. కాని ఆత్మస్పర్శవలన ద్రవ్యరాశి తన అనంత శక్తియుక్తుల్ని సాధనా సాధ్యాలను తన ప్రణాళికల ఆంతర్యాలను బహిర్గతం చేస్తుంది. వీటి ఆచరణలో ఉన్నత ఫలితాల్ని ప్రదర్శిస్తుంది. ఫలితంగా భౌతిక ద్రవ్యరాశి తన వెనుక అజ్ఞాతంగా వున్న దివ్యప్రకాశాన్ని ఆవిష్కరిస్తుంది. The divine life will reject nothing that is capable of divinisation; all is to be seized, exalted, made utterly perfect.


మూలం: శ్రీఅరవిందులు



The Future (భవిష్యత్తు)

The incarnate dual Power shall open God's door,
Eternal supermind touch earthly Time.
The superman shall wake in mortal man
And manifest the hidden demigod
Or grow into the God-Light and God-Force
Revealing the secret deity in the cave. ...
Then in the process of evolving Time
All shall be drawn into a single plan,
A divine harmony shall be earth's law,
Beauty and Joy remould her way to live: ...
The frontiers of the Ignorance shall recede,
More and more souls shall enter into light,
Minds lit, inspired, the occult summoner hear
And lives blaze with a sudden inner flame
And hearts grow enamoured of divine delight
And human wills tune to the divine will,
These separate selves the Spirit's oneness feel,
These senses of heavenly sense grow capable,
The flesh and nerves of a strange ethereal joy
And mortal bodies of immortality. ...
Nature shall live to manifest secret God,
The Spirit shall take up the human play,
This earthly life become the life divine.

Sri Aurobindo



శ్రీఅరవిందులు

ప్రపంచ చరిత్రలో శ్రీఅరవిందుల స్థానము ఒక ప్రవక్తగా కాదు సరికదా ఒక దార్శనికునిగా కూడా కాదు. అది పరమేశ్వరుని సంకల్పము. ఆయన యిచ్ఛా విలసనము.

*

శ్రీఅరవిందులు ఇప్పుడున్న మతాలకు పోటీగా మరొక మతాన్ని స్థాపించేందుకు రాలేదు. ఈ పాతవ్యవస్థను, సాంప్రదాయాలను కూలద్రోసి రాబోవు బంగారు భవిష్యత్తుకు ఒక మార్గమునేర్ప రచేందుకే వారు అరుదెంచారు.

మూలం: శ్రీమాత

శ్రీఅరవిందుల ఆశీస్సులు

అసతోమా సద్గమయ।
తమసోమా జ్యోతిర్గమయ।
మృత్యోర్మా మృతం గమయ॥
ఓం శాంతిః! శాంతిః! శాంతిః!

(బృహదారణ్యకోపనిషత్తు I. 3. 28)

తథాస్తు
శ్రీఅరవింద

అసత్తునుండి సత్తునకు, తిమిరమునుండి తేజమునకు, మృత్యువునుండి అమరత్వమునకు. ఓం శాంతిః! శాంతిః! శాంతిః!

తథాస్తు
శ్రీఅరవిందులు



శ్రీమాత

దివ్యమాత సర్వభూతములకు తల్లియైన పరమేశ్వరుని చైతన్యమూ, శక్తీ.

*

ఓం ఆనందమయి చైతన్యమయి సత్యమయి పరమే

మూలం: శ్రీఅరవిందులు

ఓం – ఆమెయే ఆనందము
ఆమెయే చైతన్యము
ఆమెయే సత్యము
ఆమెయే పరము

*

యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా।
యా దేవీ సర్వభూతేషు శక్తిరూపేణ సంస్థితా।
యా దేవీ సర్వభూతేషు శాంతిరూపేణ సంస్థితా।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః॥

ఆమెయే సర్వభూతములందు తల్లిరూపంలో వసించే పరదేవత
ఆమెయే సర్వభూతములందు శక్తిరూపంలో వసించే పరదేవత
ఆమెయే సర్వభూతములందు శాంతిరూపంలో వసించే పరదేవత
ఆమెకు వందనములు, ఆమెకు వందనములు, మళ్లి మళ్లి
ఆమెకు వందనములు.

భరతఖండము

భారతదేశం అజరామర భరతశక్తి; ఒక మహనీయ ఆధ్యాత్మిక భావనకు సజీవ చైతన్య శక్తిస్వరూపం; కాలప్రవాహంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని నిలబడగలగడానికి, పునర్వికాసం చెందడానికి వెనుకగల రహస్యం అదే. ఆమెను కాపాడుతూవచ్చిన పరమాద్భుత, సనాతన శక్తి అదే.

*

భారతదేశం అన్ని దేశాలకు గురువు. జగద్గురువు, ప్రగాఢమైన, అంతుచిక్కని వైక్లబ్యాలకు, వైకల్యాలకు గురైన మానవాత్మకు ధన్వంతరి వంటిది. సర్వమానవాళి జీవితాన్ని వినూతన పంథాలలో తీర్చిదిద్దడానికి, శాంతిని పునరుద్ధరించడానికి భారతదేశం మరోసారి మహాయజ్ఞం సాగించవలసిన తరుణం ఆసన్నమైనది. భగవంతుడు ఆమెకు నిర్దేశించిన భవితవ్యం అదే.

*

భారతావని నెరవేర్చవలసిన దివ్యకార్యానికి, ప్రపంచ భవితవ్యాన్ని సఫలీకృతం చేయడంలో ఆమె నిర్వహించే పాత్రకు చరిత్రపుటలే తార్కాణాలు. ప్రస్తుతం ఆమె అనుభవిస్తున్న కష్టాలు, కడగండ్లు, అగ్నిపరీక్షల వెనుక నున్న రహస్య మిదే. మన ఆత్మతేజోమయ విస్ఫూర్తికి తగిన రూపాలను తిరిగి రూపుదిద్దుకోవాలి. ఈ స్ఫూర్తికి శక్తివంతమైన, కొంగ్రొత్త రూపకల్పనలకు, కొంగ్రొత్త మార్గాన్ని మనం ఆవిష్కరించాలి; తదనుగుణంగా నూతన సాధనా సంపత్తిని సంసిద్ధం చేసుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

మానవాళి సమైక్యత

ప్రాణులన్నియు ఒకే చిదాత్మలో ఏకమై యున్నను శరీరధారుల నందున వేరుపడి యున్నవి. అజ్ఞానవశమున అవి తాము విశ్వాత్మ (సమిష్టి 'నేను') యొక్క అంశలమనియు, తమ మనో ప్రాణదేహముల కాధారమైన చైతన్యమొక్కటే ననియు తెలుసు కోలేకున్నవి. యోగం ద్వారా అహంకార తెర తొలగినప్పుడు వాటికి ఆత్మజ్ఞానము, సర్వాంతర్యామియైన భగవత్సాక్షాత్కారము కలుగును.

మూలం: శ్రీఅరవిందులు

మానవజాతి సమైక్యతను ఒకే వేషభాషల నవలంబించుట వలనయో లేక ఒక వర్గము వారు ఇతరులను లొంగదీయుట వలనయో సాధ్యము కాదు. వివిధ జాతుల సంయోజన మేర్పడి, ఒక్కొక్క జీవి తన సంస్కృతి, సాంప్రదాయములకు అనువగు స్థానమును సంపాదించి, సమిష్టి కార్యకలాపములలో చురుకుగా పాల్గొనగలిగినప్పుడే మానవాభివృద్ధికి దోహదపడు సుస్థిరమైన ఐక్యత సంభవించగలదు. ఆ సంఘమునందు ఐక్యత నిరవధికముగా కొనసాగుటకు దానికి విస్తృతము, ఉన్నతమునైన కేంద్రమొకటి (సర్వ మానవ సౌభ్రాతృత్వ రూపమున) ఉండుట అవసరము. ఇంకను ఆ సంఘములో విభిన్నభావముల ప్రకటనకు సంపూర్ణ స్వాతంత్ర్య ముండవలెను.

*

మానవులలో ఐక్యతను ఒకే బాహ్యప్రవృత్తి ద్వారా గాక, ఆంతరిక నిత్యాఖండ ఏకత్వానుభూతి వలననే సాధించవీలగును.

మూలం: శ్రీమాత



అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి 2004

ఉపోద్ఘాతము

మానవ కళ్యాణానికి గతంలో అనేక ప్రయత్నాలు జరిగినై. కాని చెప్పుకోతగ్గ ఫలితాలు లేవనే చెప్పాలి. ఎక్కడో ఏదో లోపమున్నది. మనస్సే దీనికి కారణము. మరి ఏం దారి.? ఋగ్వేదంలో ఋత-చిత్ (Truth Consciousness) యొక్క ప్రసక్తి వున్నది. మనస్సు కతీతమైన అనేక చేతనాస్థాయిలను దాటి వెళ్లినప్పుడు ఇది కనపడుతుంది. శ్రీఅరవిందులు దీనిని అతిమనస్సు (Supermind) అన్నారు. అనేక సంవత్సరాలు తపోదీక్షలో మునిగి, భగీరథ ప్రయత్నం చేసి, దానిని పట్టుకున్నారు (భగీరథుడు గంగను భూమ్మీదికి తెచ్చినట్లు). పట్టుకోవటమే కాకుండా దానిని క్రిందికి దింపారు. 1956 లో అది భూలోకంలోకి ప్రవేశించటం కూడ జరిగింది. ఇంకేమి – ఈ భూమి పావనమైనది. సావిత్రిలో చెప్పినట్లు:

> The Superconscient conscious grow on earth,
> The Eternal's wonders join the dance of Time
>
> (*Savitri*, p. 330)

మనమిక మనస్సు అనే అంధకారంలో పడికొట్టుకోనవసరం లేదు. అతిమానసిక చైతన్యము మనల్నిపుడు పరివేష్టించి వున్నది గదా. దాని ద్వారా మన ఐహిక జీవితమును కూడ దివ్య చరితార్థము చేయగలము.

సంపాదకుడు

21 ఫిబ్రవరి 2004

శ్రీమాత 126 జన్మదిన మహోత్సవము

Aditi M.

అదితి – M (శ్రీమాత)
అదితి అనగా పరమేశ్వరుని అఖండచైతన్యము, శక్తి, ఆనందములు; – M (శ్రీమాత) వాటి సజీవరూపము, పరమ ప్రేమా, జ్ఞానమూ, శక్తి.

*

అదితి – M (శ్రీమాత) తనలో పరమేశ్వరుణ్ణి ధరించి వుంటుంది. సమస్త లోకములను నడిపిస్తున్న దివ్యచైతన్యమూ, శక్త్యానంద ములు – పరాశక్తి, పరాప్రకృతి, మహామాయ *(యయేదం ధార్యతే జగత్)*

శ్రీఅరవిందులు

29 ఫిబ్రవరి విశేషము

29 ఫిబ్రవరిని శ్రీమాత 'ది డే ఆఫ్ ది లార్డ్' అన్నారు. ఈ యేడు 'భూలోకంలో అతిమానసావిర్భావము' అని ఆమెచే అభివర్ణింపబ డిన ఆ సుదినముయొక్క 12 వ జయంతి. 'ది గోల్డెన్ డే' అనగా సువర్ణ సుదినము అని కూడ అన్నారు. భూలోకముయొక్క ఆధ్యా త్మిక చరిత్రలో ముఖ్యాతి ముఖ్యమైన ఈ దివ్యావిర్భావము కొరకే శ్రీమాతారవిందులు అనేక దశాబ్దములు శ్రమించిరి. దీనిని త్వరిత పరచుటకే చివరికి శ్రీఅరవిందుల దేహత్యాగము చేయవలసి వచ్చింది.

మనమెంత అదృష్టవంతులమో శ్రీమాత యిచ్చిన ఈ సందేశాన్ని బట్టి తెలుస్తుంది.

KK ఈ క్షణికమైన శరీరానికి జన్మదినోత్సవము జరుపుకొనుటవలన కొంతమంది ముచ్చట్లు తీరవచ్చును.

చిత్ శక్తి ఆవిర్భావమంటారా – అది ఈ సృష్టిలో నిరంతరం జరుగుతూనే ఉంటుంది కాబట్టి దానికి మనము ఎప్పుడు పడితే అప్పుడు జోహారులు అర్పించుకోవచ్చు.

కాని ఒక సరికొత్త లోకము – అతిమానసలోకపు ఆవిర్భావాన్ని కళ్ళారా చూసి ఆనందించటమనేది చాలా అపురూపమైన అవకాశము – ఎప్పుడోగాని ప్రాప్తించని మహావిషయము.

శ్రీమాత

(*CWM* Vol. 15, p. 198)

29 ఫిబ్రవరి – సువర్ణ దినము
మన గాఢ ఆకాంక్ష ప్రతిఫలించి తీరుతుంది
స్వర్ణోజ్జ్వల కాంతి ప్రసరణం

జ్ఞానస్వరూపం దీపం. భగవంతుని స్వరూపమే జ్ఞానం. అది తెలియకపోవటమే అజ్ఞానం, అదే సకల వ్యత్యాసాలకు అనర్థాలకూ మూలం. ఆ మూలాన్ని సమూలంగా రూపుమాపాలంటే జ్ఞానాన్ని పొందాలి. జ్ఞానతేజస్సును ధరించాలి, భరించాలి. అప్పుడు అనంత తేజోవలయమవుతుంది విశ్వం. అచట అప్పుడు అంధకారానికి ఆనవాళ్ళయినా దొరకవు. ఏకత్వం పరిఢవిల్లుతుంది, అమరత్వం సిద్ధిస్తుంది. తాను పొందిన ఆ తేజోసాక్షాత్కారాన్ని శ్రీఅరవిందులవారు, అందరికీ అందించటానికి, ఆ అనిర్వచనీయానుభూతిని **'The Golden Light'** *అన్న భావగీతంలో* **(sonnet)** *అక్షరబద్ధం చేసారు. ఆ గీతానువాదమిది.*

మీ సువర్ణ తేజస్సు నా మేధోవలయంలో ప్రవేశించింది
ఆ కాంతి పరిష్వంగంలో నా మనోకుహారంలోని వెలసిపోయిన గదులు
జ్ఞానతేజోలంకృత అతీంద్రియోపరితలానికి దీటుగా విరిసినవి,
ఓ ప్రశాంత ఓజస్తేజోలంకరణం, ఓ ఓంకారజ్వాల

నా శిరస్సునుండి స్వరపేటికపై జాలువారింది మీ సువర్ణతేజస్సు,
నా వాక్కంతా ఇప్పుడు వేద పదబంధ స్వరకల్పన
ఆ నిశ్చల చింతన, నా ఏకైక స్వరమా! నీ స్తోత్రమాలిక;
నా మాటలు సురాపానమత్తచిత్తములు, దైవోన్మత్తములు.

మీ అమృతత్త్వంలో నా మనుగడను మర్దించి
మీ స్వర్ణకాంతిస్రవంతులు నా హృదయంలో సంగమించాయి.

ఇప్పుడు నా దేహం ఓ దేవాలయంగా ఎదిగింది, మీ ఆవాసంగా మారింది
దాని భావోద్వేగములన్నీ ఏకాగ్రతతో మీ వైపే మరలి ఉన్నవి.

ఇప్పుడు మీ స్వర్ణకాంతులు నా పాదాలచెంత పారాడుచున్నవి
నేనున్న ధరిత్రి ఇపుడు మీ ఖేలావని, మీ పీఠం.

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

పై పద్యపు ఆంగ్లమూలం:

The Golden Light

Thy golden Light came down into my brain
And the grey rooms of mind sun-touched became
A bright reply to Wisdom's occult plane,
A calm Illumination and a flame.

Thy golden Light came down into my throat,
And all my speech is now a tune divine,

A paean-song of thee my single note;
My words are drunk with the Immortal's wine.

Thy golden Light came down into my heart
Smiting my life with Thy eternity;
Now has it grown a temple where Thou art
And all its passions point towards only Thee.

Thy golden Light came down into my feet:
My earth in now thy playfield and thy seat.

Sri Aurobindo

(*SABCL* Vol. 5, p. 134)

భూలోకంలో అతిమానసావిర్భావము

29 ఫిబ్రవరి 1956

బుధవారం నాటి సామూహిక ధ్యానములో జరిగిన విశేషము:

నేటి సాయంకాలము దైవము ప్రత్యక్షముగ మన మధ్యన భౌతిక స్థాయిలో మూర్తీభవించెను. నేను ఈ విశ్వమునంతను మించిన బ్రహ్మాండమైన, సజీవమైన ఒక బంగారు రూపము నైతిని. ఈ లోకమును దైవము నుండి వేరుచేసిన బంగారు ద్వారము నా యెదట ప్రత్యక్షమైనది.

నేను దానిని చూసి ప్రేరేపితమై, "సమయమాసన్నమైనది", అని సంకల్పించి తక్షణమే ఒక పెద్ద బంగారు సమ్మెటను రెండు చేతులతో పైకెత్తి ఒక్క దెబ్బతో ఆ ద్వారబంధమును పటాపంచలు గావించితిని.

P.T.O

ఇక అప్పుడు పైనుండి అద్భుతమైన అతిమానసవృష్టి – చైతన్యవృష్టి, జ్యోతిశక్తుల వృష్టి ఈ భూగోళంమీదికి ధారాళంగా గుప్పించింది.

శ్రీమాత

(*CWM* Vol. 15, p. 202)

29-9-1914

శ్రీమాత తన 'ప్రార్థనలు, ధ్యానములు' లో 25 సెప్టెంబరు 1914 న ఈ విధంగా రాసుకున్నారు.

ఓ దివ్యజననీ...
దైవము సంకల్పించినాడు, నీవు నెరవేర్చెదవు:
పుడమిపై ఒక నూతనభానుడు ఉదయించును..
ఒక నూతన ప్రపంచం సృష్టించబడును,
పూర్వము చేసిన వాగ్దానములు తీర్చబడును.

29-3-1956

పై ప్రార్థన క్రిష్ణలాల్ అనే చిత్రకారుడు వేసిన వర్ణచిత్రము క్రింద ముద్రించబడి 29 మార్చి 1956 ప్రణామములప్పుడు పంచబడినది. అప్పుడు శ్రీమాత దానినీ విధంగా సవరించారు:

1956
29 ఫిబ్రవరి – 29 మార్చి

ఓ పరమేశ్వరా! నీవు ఆదేశించితివి, నేను పాలించితిని.
పృథ్విపై ఒక నూతన భానుడు ప్రాదుర్భవించినాడు
ఒక నూతన లోకము సృష్టించబడినది
గతములో చేసిన వాగ్దానములు తీర్చబడినవి.

(*CWM* Vol. 1, p. 249; Vol. 15, p. 103)


విషయసూచిక

New year message (1 January 2004)

There are no conditions for receiving the influence of Sri Aurobindo and the Mother except faith, an entire sincerity in following the spiritual path and a will and capacity to open oneself to the influence; but this capacity usually comes as the result of sincerity and faith.

Sri Aurobindo

చేతనా హర్మ్యము – ఆరోహణాధిరోహణలు



మనమెంత అజ్ఞానులం! మనకి భౌతికపదార్థాన్ని గురించి తెలుసు. మనస్సంటే ఏమిటో తెలుసు. కాని ఈ రెండు ఎక్కడినుంచి వచ్చినయ్యో తెలియదు. పైనుంచి ప్రాథమిక చైతన్యం వచ్చింది. శిలలు పుట్టినాయి. ఆ చేతనాస్థాయి పెరుగుతూ వచ్చింది. మనస్సు ఆవిర్భవించింది. కొంతమంది యోగులు ఇంకా పైస్థాయి నందుకోగలరు. కాని దానిని క్రిందికి తీసుకురాలేరు. ఎవరో మహాపురుషులు అవతరించి ఆ పనిచేయాలి.

– సంపాదకుడు

చేతన ఒక నిచ్చెన లాంటిది. అది ఒక్కొక్క యుగంలోను ఒక్కొక్క స్థాయిలో రాణిస్తూ ఉంటుంది. యుగాంతంలో ఒక మహాపురుషుడుదయించి నిచ్చెన పైమెట్టు ఎక్కుతాడు. ఎవ్వరు చూడని మరో చేతనాస్థాయి నందుకుంటాడు. పదార్థమయ లోకాన్ని వదిలేసి ఉన్నత స్థాయిని చేరుకోవడం సాధ్యమే. కానీ అలా చేరుకున్నప్పుడు ఆ సాధారణభూమికతో సంబంధం తెగిపోతుంది. ఆ విధంగా పదార్థమయ చైతన్యంతో సంసర్గాన్ని వదలకుండా

అవతార ప్రయోజనము

ఉన్నతస్థాయిని చేరి అక్కడ నుంచి అనేక భూమికల ద్వారా అట్టడుగు చైతన్యంతో అనుసంధానం ఏర్పాటు చేయడమే యుగ కర్తల ధ్యేయము. అలా చేయడంతో పై స్తరాలకూ, అట్టడుగు స్తరాలకూ అంతరం లేకుండా సంసర్గాన్ని ఏర్పాటు చేయడమే అవతార పురుషుల కర్తవ్యం. ఈ విధంగా ఒక్కొక్క అవతారం పైకి అధిరోహిస్తూ ఒక్కొక్క సోపాన పంక్తిని చేరుతూ పోయిన ప్పుడు ఒక్కొక్క నూతన సృష్టి జరుగుతూ వచ్చింది.

అతిమానస సోపానము

నేడు పొందుతున్న స్తరాన్ని శ్రీఅరవిందులు అతిమానస మన్నారు. దీని ప్రభావంతో మానవచైతన్యం ఈ అతిమానస లోకంలో ప్రవేశించినప్పటికీ వైయక్తిక రూపం వదలుకోదు. అది తిరిగి వచ్చి నూతన సృష్టిని స్థాపిస్తుంది. అయితే ఇదే చరమశ్రేణి అని మాత్రం అనుకోగూడదు. ఇంకా ఎన్నో స్థాయి లున్నాయి. ప్రస్తుతం ఆ అతిమానసాన్ని పృథ్వి పైకి తేవడానికి కృషి చేస్తు న్నాము. తద్వారా ఈ లోకాన్ని పునర్వ్యవస్థీకరించాలనీ, సత్య పరిపాలనను పునః ప్రతిష్ట చేయాలనీ మా సంకల్పము. అది నిజంగా ఒక సక్రమమైన వ్యవస్థ కావాలి. ప్రతిదీ నియమిత స్థానంలో సుస్థిరం కావాలి. దీన్ని ప్రధానంగా నిర్వహించవలసిన మహాశక్తి, సర్వమంగళ స్వరూపురాలైన మహాసరస్వతి.

అతిమానసము క్రియాశీలి

పై స్థాయిలోని అతిమాన సాన్ని అట్టడుగు పదార్థ మయ జగత్తులో ప్రవేశపెట్టాలంటే పైకీ కిందికీ సునాయసంగా సంచరించగలగాలి. ఈ విధంగా చేయటానికి కావలసిన కృషి చైతన్యంలోపల జరగాలి. అది అవతార పురుషులకే సాధ్యము. వారు ఎక్కడ వున్నా, ఏ పరిస్థితిలో ఉన్నా ఆ చర్య జరుగు తూనే ఉంటుంది. వారు ఒక గదిలో నిర్బంధింపబడినప్పటికి, ఎవరితో సంబంధం లేకుండ ఒంటరిగా ఉన్నా చెతన్యానికి సంబం ధించిన ఈ పని చేస్తూనే ఉంటారు. వారు గుర్తింపు కోరరు. అతి మానస చైతన్యాన్ని పదార్థమయ జగత్తులో చొప్పించే ఈ కార్య

నిర్వహణకోసం వారి కెట్టి పదవులూ, అధికారాలూ అక్కర్లేదు. వారి కృషి ఫలితంగా సాధారణ మానవునికి అతిమానసంతో చైత న్యాత్మక అనుబంధం ఏర్పడినప్పుడు ఒక నూతన సృష్టి జరుగు తుంది. నూతన వ్యవస్థతో ఒక నమూనా నగరం ఏర్పడి, ఒక పరి పూర్ణ ప్రపంచానికి (perfect world) దారి తీయగలదు.

అనువాదం: డా॥ అ. ప్రభావతి, డా॥ అ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 3, pp. 178-79)

చేతనా స్తరములు[1]

ఈ సృష్టి మన భౌతిక నేత్రాలకు కన్పిస్తున్న పదార్థమయ జగ త్తుతో సరి కాదు. ఈ భౌతిక భూమికలకు పైన యితర భూమిక లున్నాయి. అవి అతిభౌతిక భూమికలు – ప్రాణభూమికలో ఎన్నో పొరలు. అలాగే మనోభూమికలో ఎన్నో పొరలు. అతిమానస చేత నలో పరమపురుషుని ఆనంద చైతన్యశక్తి దశలో ఎన్నో పొరలు ఉన్నాయి. ఈ పదార్థమయ జగత్తుయొక్క స్థితికి, గతికి మూల ములు ఆ అతిభౌతిక భూమికలే. అక్కణ్ణుంచి నిరంతరం ఈ భూమ్మీదకు వర్షించే శక్తులే ఈ జగజ్జీవనమునకు హేతువులు; దానిని అజ్ఞాతస్థాయి నుండి ధగధగాయమైన మహోన్నత స్థితికి పరిణమింప జేస్తాయి. దాని ముందర మానవమేధ ఒక మిణు గురు పురుగు మాత్రమే.

ఆ పరమ జ్యోతిస్సునకు ఈ సాంద్ర తమోమయమైన పదార్థస్థితికి నడుమ ఆశ్చర్యకరమైన చైతన్యభూమికలు నిచ్చెన మెట్లలాగే వున్నాయి.

మనస్సు పైన లోకములు

అదొక అవిచ్ఛిన్నమైన చేతనా సోపానముల పరంపర – ఒక

---

[1] Planes స్తరములు, లోకములు, భూమికలు

సోపానానికి, దాని పై సోపానానికి మధ్యన ఎడముండదు. అయితే మనమా ఉన్నత సోపానముల నధిరోహించేటప్పుడు అంచెల వారీగా చేతనోద్దీపనము కలుగుతుంది. ఒక్కొక్క అంతస్తుది ఒక్కొక్క విచిత్రచైతన్యము. ఈ చేతనాస్థాయిలను ఉన్నత మనస్సు, ప్రబుద్ధమనస్సు, స్వతః స్ఫురణము (Higher mind, Illumined mind and Intuition) అనవచ్చు. ఈ స్తరము లన్నిటిని దాటిన తరువాత అధిమనస్సు (Overmind) లోకి ప్రవేశించ వచ్చును. ఇంకా అనేక స్తరముల ద్వారా పయనించి అనేకానేక పరివర్తనముల పిదప అతిమనస్సు లేక విజ్ఞానము (Supermind or Divine Gnosis) కనబడుతుంది.

ఈ స్తరములను గురించి మనము వివరంగా తెలుసుకో వాలి. అవి కేవలం మనం చూసి ఆనందించటం కాదు. మనం వాటిలోకి ప్రవేశించినప్పుడు మన ప్రకృతిలో మౌలికమైన మార్పు వస్తుంది. ఇక ఈ మనస్సు, దాని ఆలోచనలు ఎందుకు పనికిరావు. ఈ లోకంలో ఆలోచనాశీలమైన మానవులున్నట్లుగానే ఆయా లోకాలలో ఆయా ధర్మాల ననుసరించిన మరొక రకమైన జీవు లుంటారు. మన మక్కడికి వెళ్లినపుడు మనకి కూడ ఆ విధమైన స్ఫూర్తి కలిగి మనం దేవతాస్వరూపుల మౌతాము.

పై పేరా ఆంగ్లమూలం:

(In themselves these grades are grades of energy-substance of the Spirit: for it must not be supposed, because we distinguish them according to their leading character, means and potency of knowledge, that they are merely a method or way of knowing or a faculty or power of cognition; they are domains of being, grades of the substance and energy of the spiritual being, fields of existence which are each a level of the universal Consciousness-Force constituting and organising itself into a higher status. When the powers of any grade descend completely into us, it is not only our thought and knowledge that are affected, – the substance and very grain of our being and

consciousness, all its states and activities are touched and penetrated and can be remoulded and wholly transmuted. Each stage of this ascent is therefore a general, if not a total, conversion of the being into a new light and power of a greater existence.)

*

అతిమనస్సు, అధిమనస్సు

అతిమనస్సే గనుక ఆదినుండి ఒక సృజనాత్మక శక్తిగా ఇక్కడ తన పని ప్రారంభించి ఉంటే, మనం ఇపుడు చూచే ప్రపంచం వంటి వస్తువు అసంభవమై ఉండేది; దాని సృష్టి ఆదినుండి కూడ దివ్యప్రకాశంతో నిండి ఉండేది. అపుడు ద్రవ్యంయొక్క నిశ్చేతన లోపల ఎట్టి అంతర్లయనం ఉండేది కాదు. అందుచేత ద్రవ్యమందు చేతనయొక్క ప్రయాసపూర్ణమైన ఎట్టి క్రమపరిణామం కూడ ఉండేది కాదు. మన ఇప్పటి ప్రపంచం అధిమనస్సు సృష్టి గనుక, విశ్వంయొక్క పై సగానికి, క్రింది సగానికి నడుమ ఒక గీత గీయబడింది. అది పరార్థం, ఇది అపరార్థం అనే పేర్లు వచ్చినాయి. పరార్థం, సత్తు, చిత్తు, ఆనందం, మహస్సు (అతిమానసం) లతోను, అపరార్థం మనః ప్రాణ, ద్రవ్యాలతోను కూడి ఉంది. ఈ గీత మధ్యవర్తి అయిన అధిమనస్సు. ఇది స్వయంగా ప్రకాశమయమే అయినా, మనసు సంపూర్ణ అవిభాజ్య అతిమానస తేజస్సునుండి వేరుచేస్తుంది. ఇది నిశ్చయంగా అతిమనస్సుమీదే ఆధారపడినా, దానిని విభజించి, విరజిమ్మి, వేరువేరు రూపాలు, శక్తులు, సర్వ విధ బహుత్వాలలోనికి విచ్ఛిన్నం చేస్తుంది – స్వీకరిస్తూనే విచ్ఛిన్నం చేస్తుంది. ఇలా విచ్ఛిన్నం చేయబడిన ప్రతి వస్తువు మరల, పరిగణించేవాని చేతన మరింత తగ్గినపుడు, మానసిక మానవునికి గన్పించినట్లు, ఏకైక సత్యంగానో, లేక ప్రధాన సత్యంగానో కన్పించగా, తక్కినవి గౌణంగానో, తద్విరుద్ధంగానో తోచవచ్చు.

*

లోకాల ధర్మములు

ఒక్కొక్క లోకానికి ఒక్కొక్క ధర్మ ముంటుంది. ఒక లోకపు సత్యాలు ఆ పై లోకాలకు వర్తించకపోవచ్చు. ఉదా: అహము, కోరికలు మనో, ప్రాణిక, దైహికాలున్న అజ్ఞానలోకపు లక్షణాలు. అవి లేని మనిషి ఎందుకు పనికిరాని మొద్దు రాచ్చిప్పోతాడు. కాని మనం పైకి వెళ్ళిన కొలది, కామాహంకారాలు ఇక సత్యాలుగా గన్పిం చవు. అక్కడవి యథార్థపురుషుని, సత్యసంకల్పాన్ని వికృత పరచే అనృతాలు (falsehoods). అలాగే దైవశక్తులకు, అసురశక్తు లకు నడుమ జరిగే సంఘర్షణమిచ్చట ఒక సత్యం; కాగా మనం పైకి వెళ్ళిన కొలది దాని సత్యం అల్పతర మవుతూ, చివరికి అతిమనస్సునందు అదృశ్యమవుతుంది. ఈ సంఘర్షం కాక, ఇతర సత్యాలు అక్కడ కూడ మిగులుతాయి కాని, అవి అక్కడ తమ స్వభావాన్ని, ప్రాముఖ్యాన్ని, సకలమందు తమకుగల స్థానాన్ని మార్చుకుంటాయి. పోతే సవ్యక్తిక, నిర్వ్యక్తికాల నడు మగల అంతరం లేక వ్యత్యాసం అధిమనస్సుయొక్క సత్యం; కాగా అతిమనస్సునందు వాటికి వేరువేరు సత్యత లేదు. అక్క డవి అవిచ్ఛేద్యంగా ఏకం. కాని ఎవడు అధిమనస్సు – సత్యా లను వశం గావించుకుని అనుజీవించడో, అతడు అతిమానస సత్యాన్ని చేరుకోలేడు. అందుకని సాధకుడు ప్రతిమెట్టు మీద తన పాదాలను గట్టిగా నిలిపి, వాటికి విశ్రాంతి నివ్వాలి. అది శిఖ రాన్ని చేరుకునేందుకు ఆవశ్యకం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మపూడి కోటేశ్వరరావు; ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి; చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి)

(*CWSA*. Vol. 12, pp. 248-49/ *Essays Divine and Human*, p. 241; *SABCL* Vol. 19, pp. 937-38; Vol. 22, pp. 243, 258)

అతిమానసం అంటే ఏమిటి?

'అతిమానసము' (Supermind) అనే పదము తొలుత నాచే వాడబడినది. అప్పుడి నుండి ప్రజలు అతిమానసము అన్న పదాన్ని మనస్సుకు పైనున్న భూమిక లన్నిటికీ ఉపయోగిస్తున్నారు.

*

మేము ఒక స్థాయి చేతనను 'అతిమానసము' అని పేర్కొన్నాం. కాని ఆ పదం సందిగ్ధానికి తావిచ్చింది. ఎందుకంటే ఆ పదం సాధారణ మనస్సుకంటె మేలైన ఉన్నత మనస్సుగా భావింపబడిందేకాని, సమూల పరివర్తనం చెందిన మనస్సుగా గ్రహింపబడలేదు. లేదా అందుకు భిన్నంగా, మనస్సు కావల నున్నదంతా అతిమానసంగా పరిగణింపబడింది. ఆ కారణంగా అది విస్తారంగా ఎంచబడి చివరకు అనిర్వచనీయ పరమాత్మగా కూడ ఊహించబడింది. 'అతిమానసం' యొక్క అర్థానికి హద్దు లేర్పరచుటకై మనం 'సత్యచేతన' అనే సహాయకారియైన పదాన్ని అంగీకరిద్దాం.

*

అతిమానసంయొక్క ప్రధాన గుణం సత్యచేతనము. అది తన అంతర్గత ప్రకృతి ద్వారా తన వెలుగువలన సత్యాన్ని, గ్రహించగలదు. అది జ్ఞానం కోసం ప్రయత్నించనవసరం లేదు. సహజంగా జ్ఞానం కలిగే వుంటుంది.

*

మనస్సు చేతనయొక్క అత్యున్నత శక్తి కాదు. ఎందుకంటే సత్యం మనస్సుయొక్క స్వాధీనంలో లేదు. అది కేవలం సత్యంయొక్క అజ్ఞాన అన్వేషి. మనస్సు కావల చేతనయొక్క అతిమానస లేక విజ్ఞానశక్తి వుంది. సత్యం శాశ్వతంగా దాని స్వాధీనంలో వుంటుంది. ఈ అతిమానసము తన మూలంలో క్రియాత్మక చేతనయే; పరమాత్మయొక్క అనంతజ్ఞానము, అనంత సృజనశక్తి దాని సహజధర్మములు.

*

మనస్సుకన్న ఉన్నతమైన క్రియాత్మక సంకల్పము మరియు జ్ఞాన తత్వము ఏకత్వ – అనేకత్వముల మధ్యనున్న శక్తి.

*

అతిమానసము, సచ్చిదానందానికి నిమ్నసృష్టికి మధ్యన వుంది. అది మాత్రమే దివ్యచేతనయొక్క స్వయం నిర్ణయ సత్యాన్ని కలిగి వున్నది. అదే సత్య సృష్టికి అవసరమైనది.

*

విశ్వాతీత పరమ సచ్చిదానందము అన్నిటికన్న పైన వున్నది; అతిమానసము దాని స్వీయ ఎరుక శక్తి, ప్రపంచపు ఎరుక శక్తి. ప్రపంచం ఆ సచ్చిదానందంలోనిదే కాని బైటిది కాదు.

*

Supermind at its highest reach is the divine Gnosis, the Wisdom-Power-Light-Bliss of God by which the Divine knows and upholds and governs and enjoys the universe.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: బి. నరసింహయ్య

(*SABCL* Vol. 26, p. 110; Vol. 18, pp. 123-25; Vol. 16, p. 70; Vol. 17, p. 7; Vol. 18, p. 122; Vol. 22, p. 239; Vol. 17, p. 73)

ఈ భూమిమీద అతిమానసము ఆవిర్భవించనున్న దని గతంలో చేసిన వాగ్దానములు ఇప్పుడు నెరవేర్చ బడినవి.

ఆ అతిమానసము నేడిక్కడ ఆవిర్భవించి, తన కర్తవ్యమును నిర్వహించుచున్నది. ఎంత గుడ్డివాళ్ల యినా, నమ్మకం లేని వాళ్లయినా, అజ్ఞానులైనా ఈ విషయాన్ని గుర్తించే రోజు వచ్చి తీరుతుంది.

శ్రీమాత

అతిమనస్సు[2] యొక్క లక్షణములు

మనస్సు కతీతమైన జ్ఞానము

అతిమనస్సుయొక్క ప్రధాన లక్షణం తాదాత్మ్య జ్ఞానం – ఈ జ్ఞానంచేత సర్వాత్మ తెలియబడుతుంది. దివ్యసచ్చిదానందం తెలియబడుతుంది. అంతేకాక, అభివ్యక్త-సత్యం సైతం తెలియబడుతుంది. ఏలన, "సర్వం ఖల్విదం బ్రహ్మ", "వాసుదేవః సర్వం" కదా. పోతే మనస్సు అజ్ఞానానికి ఉపకరణంగా తెలుసుకోవాలని మాత్రమే ప్రయత్నిస్తుంది. కాగా అతిమనస్సు జ్ఞానవంతమైన జ్ఞాత; ఏలన అది జ్ఞాన, జ్ఞేయములతో ఏకం, అందుచేత అది సర్వవస్తువులను తన స్వీయ సత్యంయొక్క వెలుగులో, తానే అయిన వాటి యథార్థ ఆత్మయొక్క వెలుగులో చూస్తుంది. అది నిష్క్రియశక్తి మాత్రమే కాక, సక్రియ శక్తి కూడ. జ్ఞానం మాత్రమే కాక, జ్ఞానము ననుసరించి ప్రవర్తించే క్రియాశక్తికూడ. కావున దానికి తన స్వీయశక్తి ఉంది. ఈ శక్తిలో అది సరాసరి ప్రకాశ, సత్యాత్మకమైన తన స్వీయప్రపంచాన్ని అభివ్యక్తం చేయగలదు. కాగా ఈ ప్రపంచమందు సర్వం ఏకంయొక్క సామరస్య, సమైక్యాల మీద సచేతనంగా ఆధారితమై ఉంటుంది; అజ్ఞాన ఆవరణచేత గాని, ఏ ఇతర మారువేషంచేతగాని, ఏమాత్రం చెదిరిపోదు. అందుచేత అతిమనస్సు సమస్త సంభవ అభివ్యక్తిని అతిక్రమించి ఉండేది కాదు. అయితే అది ఈ ప్రపంచంయొక్క మన ప్రస్తుత మనః ప్రాణ దేహాత్మకత్రయానికి పైన ఉంది.

*

సత్యజ్ఞానము దాని ధర్మము

అతిమనస్సు వాస్తవముగా అజ్ఞానరహితమైన సత్యచైత

---

[2] Supermind ని తెలుగులో 'అతిమనస్సు' కన్నా 'పరమమనస్సు' అంటే బాగుంటుందని ఈ అనువాదకుని అభిప్రాయము. దీని కాధారంగా శాస్త్రాలను కూడా ఉటంకిస్తున్నారు. తైత్తిరీయ సంహిత (కృష్ణయజుర్వేద సంహిత, 5-5-1-4 – "అగ్నిః అవమో దేవతానాం విష్ణుః పరమః" – దేవతలలో అగ్ని అధమ (దోషయుత, కామ) మనసు; విష్ణువు పరమ (నిర్దోష, శుద్ధ) మనస్సు. కాని 'అతిమనస్సు' అనే పదము ఇంతవరకు చలామణిలో ఉండి బాగా పాతుకుపోయింది.
– సంపాదకుడు

న్యము. అయితే ఈ అజ్ఞానమే మన ప్రస్తుత మధ్యస్థ స్వరూపానికి ఆధారము. ప్రకృతి మనలోని అజ్ఞానమును రద్దుపరచి మనకు ఆత్మజ్ఞానమును, విశ్వజ్ఞానమును, సత్యచైతన్యమును ప్రపంచములో మనము నిర్వర్తించవలసిన కార్యమును గురించిన అవగాహనను మనకు సమకూర్చ యత్నించుచున్నది. అతిమనస్సు సత్యచైత న్యమే ఐనందున దానిలో సత్యజ్ఞానము, శక్తి అంతర్గతమై యున్నవి. అది తనదైన ఋజుమార్గమున లక్ష్యమును చేరగలదు. దాని కార్య క్షేత్రము బహువిస్తారము, అసమానమూను. ఇందుకు కారణము – సత్యజ్ఞానము అతిమనస్సుయొక్క సహజలక్షణము. అది జ్ఞానము నార్జింప నవసరము లేదు. జ్ఞానమునది స్వతహా కలిగియున్నది. దాని ఆరోహణ క్రమము అజ్ఞానమునుండి అసంపూర్ణ జ్ఞానము నకుకాక, సత్యమునుండి అధికసత్యమునకు, సరైన ప్రత్యక్ష జ్ఞానమునుండి ఇంకను గాఢమైన ప్రత్యక్ష జ్ఞానమునకును, కొంత అంతర్జ్ఞానమునుండి మరింత అంతర్జ్ఞానమునకును, పెరుగుచున్న వైశాల్యమునుండి మరింత వైశాల్యము ద్వారా చివరకు అనంత త్వమునకును దారితీయును.

సర్వజ్ఞత సర్వకర్తృత్వము

దాని శిఖరములు సర్వజ్ఞత్వ మునకును, సర్వశక్తివంత సర్వ కర్తృత్వమునకును ప్రతీకలు. అది పరిణామమార్గమున తనను తాను అభివ్యక్తము చేసుకొనుచు దశలవారిగా పరాకాష్టను చేరు నప్పుడు దానిలో కొంచెమైనను అజ్ఞానముకాని, అపోహకాని వుండుటకు అవకాశమే లేదు. దాని ఆద్యంతములు సత్యము, జ్ఞాన ముగాక వేరేమియు కాదు. దాని జ్ఞానము సత్యమైనట్లే, దాని కార్యము కూడ సత్యమే. అది తన కార్యనిర్వహణలో తడబడు టగాని, జారిపడుటగాని ఎన్నటికి జరుగదు. అతిమనస్సులో భావావేశములుకూడ సత్యమునే పాలించును. సంశయ భ్రమలకు లోనుగావు, సత్యధర్మములకు దూరము కావు, సౌందర్యానంద ములను దుర్వినియోగపరచవు, ఋజుమార్గమును వదలిపోవు. అతిమనస్సులో విజ్ఞానము తప్పు దారిపట్టించదు, స్థూలత్వమును పొందదు. ఇందుకు భిన్నముగా సాధారణ (కామ) మనస్సులోని

తెలివి (బుద్ధి) అజ్ఞానాహంకార మమకారములను దోషములతో కూడి స్థూలమై అతిమనస్సుయొక్క పరిపూర్ణతను కోల్పోయి తిరస్కారము, సంశయ, దుర్వినియోగములకు లోనగుచున్నది. అతిమనస్సునుండి వెలువడు అసంపూర్ణ వాక్కు కూడ సత్యమునే సంతరించుకొని అధికసత్యమునకు దారితీయును. దాని అసంపూర్ణక్రియయును చివరకు సఫలమై సమాప్తమగును.
(*SABCL* Vol. 16, pp. 41-42)

*

ఈ విశ్వమందలి స్థావర జంగమాత్మక వస్తుజాలమంతయును నిత్యాద్వయాఖండ పరమేశ్వరుడు తననుండి, తన స్వరూపమైన చైతన్యమునుండి తనలోనున్న స్వయం సాక్షాత్కారాత్మక, స్వయం నిర్ణయాత్మక, స్వయంప్రకటనాత్మక చైతన్యశక్తివలన అభివ్యక్తమైనవే. ఆ అనంతుడు తన స్వీయజ్ఞానాత్మక శక్తివలన తననుండి విశ్వమును అభివ్యక్తము చేయగల మహాధర్మము (law)ను మొదట వెలువరించి దాని కనుగుణముగా మన యింద్రియముల కనుభవమగుచున్న ఈ భౌతికజగత్తునేగాక దాని వెనుకనున్న సూక్ష్మరూపములను కూడ నిర్ణయించును. ఆ అనంతశక్తి ఇట్లు నిర్వహించుటకు అచేతనగాని, మనోకల్పనగాని, చాపల్యముగాని కారణములు కావు. దానికున్న అనంతమైన దివ్యస్వాతంత్ర్యము, ఆ స్వాతంత్ర్యమువలన లభించిన అనంతమైన అవకాశములు, ఆ అవకాశములను వినియోగించుకొని అనంతవైవిధ్యముగల సృష్టి చేయవలెనను దివ్యసంకల్పము, ఆ సంకల్పమును ఆచరణలో పెట్టించగల ధర్మము (law) సృష్టించబడిన సమస్త వస్తువులను వాటి స్వరూపస్వభావముల కనుగుణముగా పరిణామము చెందునట్లు నిర్బంధించుచున్నవి.

చిచ్ఛక్తి (చైతన్యశక్తి) నుండి మొదట ఆవిర్భవించిన మహావిజ్ఞానము (అతిమనస్సు, లోగోస్) తనను తాను అనంత వైవిధ్యముగల వస్తువులనుగా విభజించుకొని తనకు జగన్మాత (చిచ్ఛక్తి) నుండి లభించిన క్రియాశక్తి సహాయముతో ఆ వస్తువులకు రూపముల నేర్పరచి వాటన్నింటిలోను పరిణామము సిద్ధింపజేయుటకు

వాటిలో క్రియాశక్తితో కూడి ప్రవేశించును. మానవచైతన్యము ప్రకటించగల మనోవిజ్ఞానముకంటె ఈ మహావిజ్ఞానము ఎన్నో రెట్లు అధికమైనది. అధిక శక్తిసంపన్నమైనది. మహాధర్మము నను సరించి సృష్టికార్యమును సమర్థవంతముగా నిర్వర్తించగల ఈ అనంత మహావిజ్ఞానమునే మనము సౌలభ్యముకొరకు అతిమనస్సు (Supermind) లేక శుద్ధజ్ఞానము (Gnosis) అనుచున్నాము.
(*SABCL* Vol. 21, pp. 756-57)

*

అతిమనస్సుయొక్క లక్షణమైన సత్యచైతన్యము, పరమ మనోజ్ఞా నము (మహావిజ్ఞానము) ఒక్కటే. అది సంపూర్ణము. అది తనను తాను ఐచ్ఛికముగా సంకోచింప జేసికొనినను లేక పాక్షికముగా అభివ్యక్తము చేసికొనినను దాని స్వరూపము మారదు. దాని సంకోచావస్థ అజ్ఞానమువలన సంభవించునది కాదు. ఇంకను అది అజ్ఞానమునకు దారితీయదు. ఆ స్థితిలో జ్ఞానము లేకపోవు టగాని, జ్ఞానమును బిగపట్టి వుంచుటగాని జరుగదు. అప్పుడు సత్యచైతన్యము ప్రకటింపబడక పోయినను అది అతిమనస్సులో అంతర్గతముగా నుండును. వీటన్నిటికంటె ముఖ్యము అచ్చట వైరుధ్యము లుండవు. మన మనస్సుకు తోచు అనుకూల ప్రతి కూల భావములు అతిమనస్సులో సరైన సంబంధము కలిగి సమ న్వయము చెంది వుండును. సామాన్యదృష్టికి గోచరించు విరుద్ధ భావములు సంపూర్ణముగ సమత్వము పొందుటయే అతిమనస్సు యొక్క ప్రధానలక్షణము. అతిమనస్సులో చేరిన పరిమిత వస్తువు అనంతమును పరిమితము చేయజాలదు. పైగా అది తానే అనంత మైనట్లు భావించును. సాపేక్షికము, అనిత్యమునైన వస్తువు నిత్య వస్తువుతో విరోధించక దానితో సరైన సంబంధము కలిగి యుండి తనను తాను నిత్యవస్తుస్వరూపిణిగానే భావించును.

కాలము శాశ్వతమునకు ప్రవాహరూపము. శాశ్వతమును క్షణములో ననుభవించ వీలగును. శుద్ధచైతన్య స్వరూప పరిపూర్ణ పరమేశ్వరుడు అతిమనస్సులో దివ్యచైతన్యరూపములో నున్నాడు. అతిమనస్సు, దాని అభివ్యక్తరూపమైన ప్రపంచము సత్యములు

కావున జగన్మిథ్యావాదము చెల్లదు. స్వయం ఖండనకు లోనగు మాయావాద సహాయముతో అతిమనస్సుయొక్క అస్తిత్వమును నిరూపించ నవసరము లేదు. దేవుడు సత్యమని తెలిసికొనుటకును, దేవుని దర్శించుటకును జీవితమునుండి పారిపోనక్కర లేదు. విశ్వమంతటితో తాదాత్మ్యము చెంది జీవించుటవలనగాని విశ్వాతీత సమాధిస్థితిలోగాని దేవుని దర్శించవచ్చును.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి), డా॥ కోట. వెంకటేశ్వరరావు (గుంటూరు)

(*SABCL* Vol. 16, pp. 44-45)

అతిమానస విజ్ఞానముయొక్క ఆవశ్యకత

సృష్టికంతటికి మానవజన్మ ఉత్కృష్టమైనది. మానవుడు నేటి వరకు చాలా ప్రగతి సాధించాడు. కాని అదంతా కూడ కేవలం తన మానసిక మసకవెలుగు మీద ఆధారపడినదే. అంతకంటె ప్రమాణమైన దివ్యజీవనము. మనస్సుకంటె ఉన్నతమైన అతిమానసము వలననే సాధ్యము. కాబట్టి మనం దానికోసం ఆకాంక్షించి, తపించి, ఎలాగైనా సరే దానిని గ్రహించి, మన ప్రకృతిని దాని వెలుగులో ఉద్దీపింపజేసికొని, దివ్యజీవనమును సొంతము చేసుకొనెదము గాక. — *సంపాదకుడు*

ఈ భూమి మీదనే మానవుడు దివ్యజీనవాన్ని అనుభవించాలి. మానవ ప్రకృతిలో మౌలికమైన మార్పు – పరిణామము ద్వారా గాని, లేక విప్లవాత్మకమైన మార్పువలన గాని – రావాలి. అయితే నేటి మానవుడు మనోప్రాణికదైహికములకు బద్ధుడై యున్నాడు. ఆతని జీవితమూ అంతే. వాటిని అధిగమించవలెనన్నచో పూర్ణ చైతన్యమును, ఆధ్యాత్మికశక్తిని పొందవలసి యున్నది. అప్పుడు

గాని ఈ మనోప్రాణిక దైహికముల క్షుద్రరూపములు అతనిని వదలవు. అప్పుడుగాని వాటి ఉన్నతరూపములను పొందలేవు. ఒక ఘనతర చైతన్యము, ఘనతరశక్తి వచ్చి ఈ మనోప్రాణిక దైహిక ప్రస్తుత రూపములను దివ్య ప్రతిరూపములుగా మలచును. అవి యిక అజ్ఞానపు తెరలు కాబోవు – దివ్యజ్యోతి, దివ్యశక్తి, దివ్యజీవన విధానములకు వాహికములు. ఇది సాధ్యమేనా అనే సందేహం కలుగవచ్చు. దానికి జవాబు (Supermind) అతిమానసము.

ఈ సందర్భంలో మనం ఒక సంగతి గుర్తు తెచ్చుకోవాలి. జడపదార్థం కంటె జంతుజీవనము ఎంత గొప్పదో, జంతువుల కంటె మనస్సు ఎంత గొప్పదో, అలాగే ఈ మనస్సుకంటె గొప్ప శక్తి ఒకటి ఉండాలి కదా! దాని పేరే Supermind అది ఈ మనిషి యొక్క మనస్సులోకి, శరీరంలోకి, మొత్తం జీవితంలోకి ప్రవేశించి వాటిని పూర్తిగా ప్రక్షాళనం గావించి నూతన రూపములను సృష్టిస్తుంది.

*

అతిమానస మనగా ఈ పదార్థగత మనోమయ జీవితానికి అతీతమైన మరియొక శ్రేణి. ఈ భూమిమీద జడపదార్థము, మనస్సు, జీవము ఎలాగైతే సృష్టించబడినవో అదే విధంగా, ఈ పదార్థమయ జగత్తులో, ఈ కాలప్రవాహంలో, దాని సమయ మాసన్నమైనప్పుడు అతిమానసము (Supermind) ఆవిర్భవించవలసి యున్నది. నిజం చెప్పాలంటే ఈ మనస్సులోను, జీవితంలోను, పదార్థంలోను అతిమానసము అంతర్లీనమై యున్నది. కాని అది తన శక్తిని పూర్తిగా ఉపయోగించలేదు. ఎందుకు కొరగాని కొయ్యయిన ఈ అర్భకత్రయము అందుకు పనికిరాదు.

అదొక నిస్సహాయమైన పరిస్థితి. ముందుకు సాగనివ్వదు. పైనుంచి అతిమనస్సు అనే వజ్రాయుధం దిగివచ్చి ఈ భూమిమీద ఆవిష్కారమై ఈ భౌతిక, ప్రాణిక, మానసిక విభాగములలో తనను తాను ప్రకటించుకున్నప్పుడే మానవునికి వాటివలన ప్రయోజనము కలుగుతుంది. అప్పుడే మన వ్యవహారమంతా

పూర్తిగ దైవికక్రియగా మారి దివ్యజీవన మనేది సాధ్యమవుతుంది. మరో సంగతి మనం తెలుసుకోవాలి. జడపదార్థంలో జీవము, మనస్సు పూర్వమే నిమగ్నమై వున్నవి కనుక అవి కాలక్రమేణా పరిణామగతిలో బహిర్గతమై పుట్టినవి. అనగా మొదట అంతర్లయమైన శక్తియే తరువాత బహిర్గతము కాగలదు. అటులకాని యెడల అది అసంభము.

అతిమనస్సు (Supermind) దానియొక్క సత్యచేతన (Truth-consciousness) ఆవిర్భవించి తీరుతాయి – నేడో రేపో. వాటి ఆవిర్భావము రెండు విధాలుగా జరుగుతుంది. పైనుంచి దిగిరావటం అనగా దివ్యశక్తి ఆవిర్భావము (a self-revelation of the Spirit) మరియు ప్రకృతి గతమైన పరిణామ ప్రక్రియ (an evolution in Nature). The ascent is necessarily an effort, a working of Nature, an urge or nisus on her side to raise her lower parts by an evolutionary or revolutionary change, conversion or transformation into the divine reality and it may happen by a process and progress or by a rapid miracle. The descent or self-revelation of the Spirit is an act of the supreme Reality from above which makes the realisation possible and it can appear either as the divine aid which brings about the fulfilment of the progress and process or as the sanction of the miracle.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 16, pp. 41-44)

అతిమనస్సు ఉన్నదా?

(సందేహం – సమాధానం)

పరాచైతన్యము క్రిందికి దిగివచ్చి శిలనుంచి మానవుల వరకు గల అనేక చరాచర రూపములను తాలుస్తుంది. ఈ నిమ్నరూపములు అభివృద్ధి చెందుతాయి. పరిణమించి ఊర్ధ్వచైతన్యమువైపు మనుగడ సాధిస్తాయి. కాని జడపదార్థానికి మొదట్లో, ఆ పరిణామము చెందక ముందర, తనకంటె గొప్పవైన ప్రాణులు, జీవుల రాకను గురించి తెలియదు. భౌతికవాది కూడ అంతే – ఆత్మ ఒకటి వుంటుందని, అతిమానసము అనేది ఒకటి వుంటుందని నమ్మడు. అతని అజ్ఞానమే దీనికి కారణము.

సంపాదకుడు

భూలోకంలో దివ్యజీవనమా?

భౌతికప్రపంచంలో దివ్యజీవనం సంభవమంటే భౌతికవాదులు ఒప్పుకోరు. ఆత్మకు, ఈ జీవపరిణామానికి ఒక ఆధ్యాత్మిక గమ్యం వున్నదని అంగీకరించే తత్త్వశాస్త్రం సైతం దివ్యజీవితాన్ని ఆవిష్కరించే శక్తి భూమికి లేదని విస్పష్టంగా ప్రకటిస్తుంది. భూమినుండి, శరీరం నుండి నిష్క్రమించిన పిమ్మటే దివ్యజీవనం సాధ్యమని ఆ తాత్వికుల ఉద్దేశ్యం. ఈ సృష్టి సర్వస్వం మాయ, భ్రాంతి కాకపోయినా, స్వచ్ఛమైన ఆత్మలోగాని, లేక మరో సూక్ష్మ భౌతికభూమికలో మాత్రమే దివ్య ఆధ్యాత్మిక జీవనం (అస్తిత్వం) సంభవ మవుతుంది అని వారు భావిస్తారు. దివ్యజీవితంగానీ, దివ్యమైనది ఏదైనా ఈ భూమిపై త్వరలో సిద్ధించేందుకు అనేక అవరోధములు ఉన్నాయని మానవహేతువు భావిస్తుంది.

మనస్సుయొక్క అపనమ్మకం

అతిమనస్సు వంటి సుస్పష్టంగా గుర్తించతగినది ఏదైనా నిర్దిష్టంగా, సమగ్రంగా అభివ్యక్త మయ్యేంతవరకు లేదా ఈ పృథ్విపై అవరోహించి, పృథ్వి చైతన్యాన్ని తన వశం చేసుకొ

నేంతవరకు అసలు అతిమనస్సు వున్నదా అని మనం నిశ్చయంగా నమ్మలేము. అంతవరకు మన మనసే సమస్త విజ్ఞానానికి న్యాయ నిర్ణేత. సమస్త జ్ఞానాన్ని సూచించే క్షేత్రం అదే. ఒక నిశ్చయమైన యథార్థజ్ఞానం మనస్సుకు లేదు. అన్నింటినీ మనస్సు సందేహిం చాల్సిందే. అన్నింటినీ పరిశీలించాల్సిందే. దేనిమీదా గట్టి నమ్మకం లేదు. అందుకనే ఏ సందేహానికి ఆస్కారం లేని పరమ ప్రమాణం – దానిని అతిమనస్సు అను లేక ఋతచిత్ (సత్య చైతన్యం) అను – అవసరమున్నది. అటువంటి జ్ఞానం వుండి తీరాలి. అటుల కానియెడల అసలు జీవితానికి అర్థంగానీ, లక్ష్యము గానీ విముక్తిగానీ లేదు. మరి మనమెందుకు బ్రతుకుతునట్టు?

అతిమనస్సు ఎందుకు?

ఆ సత్యచైతన్యం లేకుండా చైతన్యం తన పరమార్థాన్ని సాధించలేదు. అది లేకుండా తనదైన మహోన్నత ఫలితం ఉండదు. ఒక ఫలితం లేని, పరిణామంలేని ఒక శూన్యం, ఒక అవమానకరమైన పరాభవమే దాని అంతం. తనలోని సత్యం ఏమిటో అది తెలుసుకోవాలి. తన అస్తిత్వపు లక్ష్యమే సత్యం అని అది గ్రహించాలి. అజ్ఞానంలో వున్న సత్యం, జ్ఞానం అజ్ఞానం ద్వారా సత్యం, జ్ఞానం పొందాలని అది కోరుకున్నంతవరకు తన అసలు సత్యమేమిటో గ్రహించలేదు. అది తనలో ఒక శక్తిని వికసింపజేసుకోవాలి లేదా అందుకోవాలి. తెలుకోవడం, చూడడం, తన శక్తిని తన వశం చేసుకోవడం ఇవన్నీ దాని లక్షణాలే. ఇదే అతిమనస్సు. దీనిని గనుక మనం అంగీకరిస్తే మిగతా అంత స్పష్టంగా అవగాహన అవుతుంది.

సృష్టియొక్క లక్ష్యము ఆత్మయే

ఈ ప్రపంచం వెనుకగల సంపూర్ణ సత్యాన్ని మనం తిన్నగా వెదికి పట్టు కోలేకపోతున్నాము. ఈ ప్రపంచం ఎలా వుండాలి, ఎలా వుండితీరాలో ఆ విషయంలో వైఫల్యం చెందకూడదు. అసలు అనిశ్చితత్వం ఇక్కడే గందరగోళం సృష్టి స్తోంది. ఈ ప్రపంచం భౌతికపదార్థంపై ఆధారపడినట్లు కనిపి స్తోంది. అందుకు సందేహం లేదు. (అసలు యథార్థాన్ని అది

దాస్తోంది). కాని దాని శిఖరం మాత్రం పరమాత్మ (Spirit). ఈ పరమాత్మ వైపు ఆరోహణమే లక్ష్యం కావాలి. దాని అస్తిత్వానికి అదే పరమార్థం. ఈ సృష్టికి ఒక అర్థం, ఒక ప్రయోజనం అది సూచిస్తోంది. పరమాత్మ సార్వభౌమ, శిఖరాగ్ర అస్తిత్వం నుండి మనకు లభించే సహజమైన నిర్ధారణకు అపరిపూర్ణమైన, అపభ్రంశమైన ఆధ్యాత్మిక జ్ఞానం అడ్డుపడుతోంది. ఈ అజ్ఞానం బుద్ధి జనితం. అసలు జ్ఞానాన్ని సంపాదించడంలో ఈ బుద్ధి తొందరపాటుతో పాక్షికంగా మాత్రమే ప్రయత్నించినట్లు కనిపిస్తోంది.

ప్రపంచము ఆత్మచే పరివ్యాప్తము

పరమాత్మ సర్వవ్యాపకమైనది, మన అస్తిత్వంలోని రహస్యసారం అని భావించకుండా, ఉన్నత శిఖరాల నుండి మనవైపు అది చూస్తోందని, మిగతా సృష్టినుండి మనల్ని వేరుచేసి మనల్ని అత్యున్నత శిఖరాలవైపు ఆకర్షిస్తున్నదని ఈ బుద్ధి భావిస్తోంది. అందువల్ల మన విశ్వ, వ్యష్టి అస్తిత్వం ఒక మహామాయగా కనిపిస్తోంది. ఈ మాయనుండి బయటపడడం, ఈ విశ్వ, వ్యష్టి అస్తిత్వపు చైతన్యంలో మనం లయించిపోవడం – అది ఒకే ఒక ఆశ అని, ఏకైక విముక్తి అనే భావన కలుగుతున్నది. లేదా ఈ భూమి అజ్ఞానం, బాధలు, అగ్నిపరీక్షలతో నిండిన ప్రపంచం అని, సుదూర స్వర్గంలోకి పారిపోవడం మన ఏకైక భవితవ్యం అనే భావన ఏర్పడింది. ఈ భూమిపై మనకు దివ్యమైన ప్రయోజనం లేదు. భూమిపై ఎంత గొప్ప పరిణామం వచ్చినా ఈ శరీరంలో ఎటువంటి సాఫల్యం లేదు. ఎటువంటి విజయప్రదమైన పరివర్తన లేదు. పృథ్వీజీవనంలో ఒక మహోన్నత లక్ష్యం నెరవేరే అవకాశాలు లేవు.

అతిమనస్సు దిగివచ్చుట

కాని అతిమనస్సు గనుక వుంటే, అది భూమిపై అవతరిస్తే, అదే గనుక మానవజీవితాన్ని శాసించే సూత్రమైతే, మనస్సుకు అసంభవమైనది సంభవం అవడమే కాదు, అనివార్యమవుతుంది. మనం జాగ్రత్తగా పరిశీలిస్తే, తమదైన పరిపూర్ణత్వం కొరకు, దివ్యసాఫల్యంకొరకు, తమదైన నిరపేక్ష మహత్వంకొరకు

మనసు, జీవనం తమ అత్యున్నత శిఖరాలలో శ్రమిస్తుండడం మనం గమనిస్తాం. ఇది, విశ్వానికి అతీతంగా, మరెక్కడో గలది మాత్రమే గాకుండా – ఈ నిరంతర పరిణామానికి, అంతులేని జనన, పునర్జన్మ చక్రభ్రమణానికి, వలయాకార ప్రకృతి అధిరోహణానికి అర్థం, నిజమైన సంకేతం. కాని అతిమనస్సు అవరోహణంవల్ల, మనస్సు, జీవనం తమ అవధుల్ని దాటి సఫలీకృతం పొందడంవల్ల సృష్టిలో దాగిన అసలు రహస్య ఉద్దేశ్యం, ప్రకృతి, పరమాత్మల నిక్షిప్త పరమార్థం సంపూర్ణంగా సమావిష్కృతమవుతుంది. పూర్తిగా సాక్షాత్కారం అవుతుంది.

పదార్థంలో అతిమనస్సు అంతర్లీనత

ఇది అతిమనస్సుయొక్క పరిణామగతమైన విశిష్టాంశం. కాని నిజానికి ఈ భౌతిక ప్రపంచంలో అతిరహస్యంగా వున్న నిరంతర సూత్రం అదే. మొత్తం సృష్టికి రహస్యంగా ఆధారభూతమైనది అదే. బాహ్యానికి మాత్రం అచేతనాత్మకంగా కనిపించే ఈ సృష్టిలో చైతన్యం ప్రబుద్ధమవడాన్ని సాధ్యం చేసేది, సుదృఢం చేసేది ఇదే. మహోన్నత ఆధ్యాత్మిక వాస్తవం వైపు ప్రకృతిని అధిరోహించేటట్లు ఒత్తిడి చేసేది అదే. అది నిజానికి ఇంతకు ముందే ఉన్నటువంటి అస్తిత్వ భూమిక. అది శాశ్వతం. పరమాత్మ, పదార్థం కలుసుకునే మణిహారం. తన సత్యం, తన వాస్తవంలో ఈ ప్రపంచ పరమార్థాన్ని, లక్ష్యాన్ని దాచుకున్నది. ఆ పరమార్థం, లక్ష్యం నిశ్చయంగా నెరవేరేటట్లు అదే చేయగలదు.

ఈ ప్రపంచం ఏకమాత్ర సత్త అభివ్యక్తి

ఈ దివ్యదర్శన తేజోమయ వీక్షణంలో ఈ ప్రపంచం తన ఏకత్వపు, సంపూర్ణత్వపు పరిధిలో ఒకే పరమ పురుమని (పరమాత్మ) అభివ్యక్త వైభవంగా తనకు తాను బహిర్గతం చేసుకుంటుంది. ప్రకృతి పరమాత్మ అభివ్యక్త మహాశక్తిగా ఆవిష్కృతమవుతుంది. ఈ భౌతిక పదార్థంలో పరిణామం పరమాత్మయొక్క క్రమానుగత స్వీయ సాక్షాత్కార ప్రక్రియగా సాగిపోతుంది. శతకోటి ప్రపంచాల దివ్యసమాహారం

పదార్థజనిత ప్రపంచంనుండి పరమోన్నత పరమాత్మ జ్యోతిర్మయ ఔన్నత్యాలవైపు ఒక అధిరోహణా నిశ్రేణికగా మారడం మనం గమనిస్తాం. భౌతికపదార్థ నిర్మిత విశ్వంలోని ఈ అధోలోకం లోకి సైతం ఇక ఏమాత్రం ముసుగు ధరించకుండా దుర్గ్రాహ్యా మైన రహస్యంగా కాకుండా ఎరుకతో, చైతన్య ప్రదీప్తమై పర మాత్మ మహోన్నత సాక్షాత్కారం సంభవమౌతుంది. ఆ ప్రయో జనం సిద్ధిస్తుంది. అంతేకాదు భగవంతుని దివ్య విభూతులన్నీ సర్వసమగ్రంగా ఈ భూమిపై అభివ్యక్తమవుతాయి.

ఈ సృష్టి ఇక ఎంతమాత్రం దుర్గ్రాహ్య ప్రహేళిక కానవ సరం లేదు. పరమాశ్చర్యచకితమైన సృష్టి తన రహస్యాన్ని తొల గించి వేస్తుంది. అస్పష్ట రేఖలు, గజిబిజిగా కనిపించే వ్రాతలు, గీతలు స్పష్టం అవుతాయి, సుగ్రాహ్యమవుతాయి. ఇట్టి మహావిష్క రణలో అతిమనస్సు తన సహజస్థానం ఆక్రమిస్తుంది. ఈ సృష్టి లోని సంక్లిష్టతకు దిగ్భ్రాంతి చెందిన బుద్ధికి అది ఎంత మాత్రం సందేహాస్పదమైన అంశం కాబోదు. ఎంతమాత్రం ప్రశ్నార్థకం కాబోదు. మనస్సు, జీవం, పదార్థం ఈ మూడింటి స్వభావాల అనివార్య ఫలితంగా, వాటి అర్థం, వాటి నిక్షిప్త సూత్రాలు, లక్ష ణాల సాఫల్యంగా, వాటి అపరిపూర్ణత స్థానంలో నిలిచే పరి పూర్ణత్వంగా, సర్వమానవాళి అధిరోహించే సర్వోన్నత శిఖరంగా, దివ్యమహత్వ పూర్ణ అస్తిత్వం, చైతన్యం, ఆనందాల చిట్టచివరి అధ్యాయంగా, ఈ సృష్టి ఆవిర్భావం వెనుక చిట్టచివరి మహో న్నత ప్రయోజనంగా, మనం చూస్తున్న ఈ పురోగామి ప్రకృతి మహాభివ్యక్తి ప్రస్థానంయొక్క మహోజ్వల లక్ష్యంగా అతిమనస్సు భాసిస్తోంది. అదే సృష్టి సర్వస్వాన్ని సచ్చిదానంద అమృతావి ష్కరణల మహోదయాల వైపు, అంతిమ సూర్యోదయాలవైపు నడుపుతున్నది. మానవాళి యుగయుగాలుగా కలలు కన్న దివ్య జీవన మహాభ్యుదయం అదే! అదే!!

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

(*SABCL* Vol. 16, pp. 61-65)

వేదములలో అతిమనస్సుయొక్క ప్రసక్తి

మనస్సు కావల వుండే ఈ 'అతిమానసము' ఎక్కడి నుంచి ఊడిపడింది? మన మహర్షులు దీనిని దర్శించారా? దర్శించిన యెడల ఆర్ష విజ్ఞానంలో కనీసం దీని సూచనలైనా వుండాలి కదా! వేదఋషులు అతిమానసాన్ని దర్శించి వుండవచ్చు. కాని దానిని ఈ భూమి మీదకి తీసుకొనివచ్చి జీవితమును పరివర్తింపజేసే ప్రయత్నం మట్టుకు జరుగలేదు. — సంపాదకుడు

విజ్ఞానమయ పురుషుడు

ఋత-చిత్ అనే మాటను నేను ఋగ్వేదం లోంచి తీసుకొన్నాను. ప్రశస్తంగా జీవుని మూలసత్యంగా భాసించే చైతన్యమై, ప్రచలిత రూపంలో వెలిగే ఋతమై సువిశాల సంపన్నతతో ఆత్మ జాగృతినీ స్మృతినీ సాధ్యం చేస్తుందని శబ్ద సూచన. ఉపనిషత్తులలో రెండు మూడు చోట్ల నిజాన్ని (సత్యం) తెలుసుకొనే భావనగా అతిమనస్సు ఉదహరింపబడటం ఒక విధంగా బీజమాత్రం (సూచన) గానే వున్నది. మానసిక, ప్రాణిక, భౌతిక రూపాల కతీతమైన విజ్ఞానమయ పురుషుని విషయమిది. సూత్రప్రాయమైన ఈ సూచన అంతకుమించి వికసించకుండానే మన హైందవ సాంప్రదాయంలో కనుమరుగైపోయింది. ఈ ఆలోచన నాకు వేదోపనిషత్తుల ద్వారా రాలేదు. — నా అంతట నేనే దర్శించి గ్రహించాను. పూర్వం నిర్వచించిన జ్ఞానంగా కూడా తీసుకోలేదు. అతిమనస్సును దర్శించాక వేదోపనిషత్తులు చూపిన కొన్ని దివ్యానుభూతులు కూడా తోడై రూఢి కలిగింది.

*

సత్యము బంగారుమూతతో కప్పబడి వుంటుంది

అజ్ఞాన లోకాలకు పైనుండే స్థితిలో ప్రకాశమయ భువనాన్ని వేద ఋషులు చూడ ప్రయత్నించినట్లు తోస్తుంది. ఉపనిషత్తులు సూర్యదేవుని పరాత్పర సత్యంగా పోల్చాయి. ఆ అతీత సత్యంలోకి వెళ్ళి రాగలము. కాని

సూర్యుని వాకిలి దాటి వెళ్ళినవారు తిరిగి రాలేరు. అధిమనస్సు పైనున్న బంగారుమూతను తొలగించి అతిమనస్సులోకి ప్రవేశిస్తే విముక్తి అని అర్థం. వేదమే సత్యాన్ని ఇంకొక సత్యం కప్పివుంచి నట్లు చెబుతున్నది. ఇదే సవితృ దేవుడు రథాశ్వాలను వదలివేసి అసంఖ్యాక కిరణాలను ఒకటిగా చూపి అదే గమ్యంగా అనుగ్ర హించడం. సత్యంయొక్క ముఖం బంగారుమూతతో కప్పబడిందని ఈశోపనిషత్తు సూచించింది. దీనిని తొలగిస్తే సత్యలోకం వస్తుంది. 'సోహమస్మి' గా ఏకైక పురుమని జ్ఞానమే కళ్యాణతమమైన సూర్య వర్చస్సు. అతిమనస్సులోని వివిధావస్థలే ఈ సూర్య సంకేతాలు.

*

వేదఋుషులు అతిమానసతలాన్ని చేరారా అన్న విషయాన్ని చెప్ప లేను. ఆరోహించాలని ఆశించారు. మనసులో వెలిగే లోకాలు 'స్వర్' శబ్దంగా విదితము. ఈ విషయాన్ని ఉపనిషత్తులు సూర్య కిరణాల లోనికి చొచ్చుకొని తిరిగి రావచ్చుననీ, సూర్యునిలో ప్రవేశిస్తే మాత్రం తిరిగి రావడం అసాధ్యమనీ తెలిపాయి; ఎందు కంటే అతిమనస్సు నధిరోహించటమే కాని అవరోహణా కార్యం ఎలా నిర్వహించాలో చెప్పలేదు.

*

అతిమనస్సే ప్రాచీన ఋుషులు పేర్కొన్న అతివిశాల చిత్సత్త (Truth Consciousness). ఇంతవరకు కొంత అస్పష్టంగా, క్షణి కంగా, పరోక్షంగా దానిచే ప్రభావితులైనా దానిని భూచైతన్యం లోనికి తెచ్చి ప్రతిష్ఠించలేదు. అతిమనస్సును భూమ్మీదికి తీసు కురావడమే మన యోగలక్ష్యం.

*

ఇక్కడ భావగర్భితాలైన వేద ఋుక్కులు మనకు సహాయపడతాయి. దివ్యవాక్కుగా అమృతపరమైన అతిమనస్సు రహస్యంగా తెర లోంచి వెలుగులు సత్యాలుగా చిమ్మి చూపుతుంది. తద్వారా అతి మనస్సనేది సాధారణ చైతన్యావధులను మీరి సత్యమునే అన్నిట చూపుతుంది. భావనలూ, సాధ్యాలూ, ఏర్పాట్లూ, దర్శనాలూ, పలు కులూ, చేతలూ, కదలికలూ అన్నీ సత్యాలే. అవే అమోఘంగా

ధర్మబద్ధంగా పని చేస్తాయి. వెలిగే సత్యమే తేజస్సు తావులో జీవి సమగ్రమైన ఉనికి తెలుస్తుంది. స్వయంగా తనను తానే మరచి పోయిన నిగూఢత గానీ, అస్పష్ట గందరగోళంగా గానీ వుండవు. వేద పరిభాషలో ఈ సత్య ధర్మ జ్ఞాన సమన్వయ దర్శనమే ముఖ్యంగా పేర్కొనబడినది.

అతిమానస దేవతలు

ఎంతో పైన రహస్య లోకాలలో వుండే దేవతలే ఈ అతిమానసిక శక్తులు. అక్కడే పుట్టి తమ సొంత యింట్లో వుంటూ సత్య జ్ఞానాన్ని ఎరిగి చైతన్యంలో సంకల్పదృష్టితో సమర్థులైన కార్య దక్షులు. ఆ చైతన్యశక్తి కార్యోన్ముఖమై సృష్టికార్యం పరిపూర్ణమై అవగాహనతో ప్రత్యక్షంగా చేయదగిన కార్యాన్ని సక్రమంగా చేస్తుంది. ఈ జ్ఞానస్ఫూర్తి సంకల్పశక్తిని పొరపాటునైనా దారి తప్పనీయదు. సత్వరమే కార్యసిద్ధి ముగుస్తుంది. ఇక్కడ వెలుగూ, శక్తీ ఒకటైపోయి కోరడం తడవు లయబద్ధమైన జ్ఞానప్రకంప నలు, అడగకనే తడుముకోనీయక, సంపూర్ణసిద్ధి నిశ్చయంగా లభిస్తుంది. దివ్యమైన ఈ స్వభావం రెండు శక్తులనూ తానే వేగంగా ఏర్పరచుకొని స్వయంగా కనిపించే మూలసత్యాన్నీ, సారాన్నీ ప్రకటించి తన వెలుగు చూపి జీవుని వునికినే నిర్ద్వం ద్వంగా ప్రదర్శించి తన సృజనయే సమస్తానికీ మూలకారణమని నిరూపిస్తుంది.

దివ్యదృష్టి, దివ్యశ్రవణము

వేదద్రష్టలు ఋత చిన్మయ జీవికి (truth-conscious soul) రెండు మహాశక్తులున్నట్లు వర్ణించారు – అవి 'దివ్యదృష్టి', 'దివ్య శ్రుతి'. వీటి ద్వారా జ్ఞానమే కార్యోన్ముఖమై సత్యమే దృష్టిగా, సత్యమే శ్రవణంగా వర్ణింపబడి మానవ మానసిక స్వభావంనుండే అవి ప్రతిఫలించి సుదూరంగా దర్శనానుభూతులుగా, శక్తులుగా ప్రభవించడం.

అనువాదం: టి.యస్. రామచంద్రరావు

(*SABCL* Vol. 18, p. 117 f/n; Vol. 22, p. 69; Vol. 26, p. 112; Vol. 22, pp. 102-03, 101; Vol. 18, pp. 124-25)

మనస్సుకు అతిమనస్సుకు మధ్య స్తరములు

యోగప్రస్థానంలో అనేక లోకాలు కనబడతాయి. రోదసీ యానములో ఇంతవరకు సృష్టించబడిన సూర్యచంద్రాదులే కనబడతాయి. కాని యోగయానంలో నువ్వు ఇంతవరకు తెలియని జ్ఞానసీమలను దర్శించగలవు. మనస్సునుండి బయలుదేరి ఒక్కొక్క మెట్టు పైకెక్కుతూ వుంటే, వెయ్యి ప్రభలతో వెలిగిపోయే, మిరిమిట్లుగొలిపే అద్భుతలోకాలు కనబడతాయి. వీటి పేర్లు వరుసగా ఊర్ధ్వ.మానసము (Higher mind), *ప్రదీప్తము* (Illumined mind) *స్వయం స్ఫురితము* (Intuition) *అధిమానసము* (Overmind) *అతిమానసము* (Supermind) *ఇవి మానవమేధకు గాని, తెలివితేటలకు గాని అందని గంభీరమైన ద్యులోకములు, చేతనా శ్రేణులు.*

— సంపాదకుడు

అతిమనస్సు, అధిమనస్సు (Supermind and Overmind)

అతిమనస్సనగా, అజ్ఞానమునకుగాని, విభజన సూత్రమునకుగాని, తావులేని తావుండజాలని దివ్యప్రకృతియొక్క సంపూర్ణ సత్య చైతన్యము. అది సర్వదా పరిపూర్ణమైన జ్ఞానము, వెలుగులతో నిండియుండును. మరియు మానసిక దృష్టి, ప్రక్రియలకు అతీతమై అందరానిదై యుండును. అతిమానసమునకును, మనస్సునకును మధ్య చైతన్యముయొక్క అనేక అంతరములు, పొరలు, భూమికలు ఉన్నవి. వానిని అనేక విధములుగ పరిగణించవచ్చును. మనస్సు దాని స్వభావమును తత్త్వమును, వాటి మూలముగ ఏర్పడిన దాని సంచలనములను బట్టియు ఆయా భూమికలయొక్క ప్రభావము వలనను, అధికమగు వికాసమును, శక్తిని, విశాలతను కలిగి యుండును. ఈ అంతస్తులలో అధిమానసమే చివరి మెట్టు. అది వెలుగులతో, శక్తులతో నిండి విరాజిల్లుచున్నది. కాని, దానిని పైనున్న దానితో పోల్చిచూచిన, అక్కడ నుండి ఆత్మపూర్ణము, అవిభాజ్యమునగు జ్ఞానమునుండి అధోముఖమై అజ్ఞానములోకి వచ్చే హద్దుగ గ్రహించవలెను. అది పరమసత్యము

నాధారము చేసికొని ప్రవర్తించినను ఇక్కడనే అది సత్యముయొక్క వేర్వేరు అంశములతో శక్తులతో విభక్తమై ప్రత్యేక స్వతంత్ర సత్యములుగ పని చేయుటకు మొదలిడును. ఈ విధానము మన సాధారణ మనస్సు, ప్రాణము, జడతత్త్వములను చేరువరకు కొనసాగుచుండును. అంటె, ఊర్ధ్వమున నున్న అవిభాజ్యమైన సత్యము నుండి, విభజన, ఖండ ఖండములగుట జరుగువరకు సాగును. అధిమానసమునకు స్వభావసిద్ధమైన గుణము ప్రధానముగ, సమగ్రముగ, సంపూర్ణముగ సమన్వయపరచి, ఏకోన్ముఖమైయుండు జ్ఞానము, లేక సర్వదా ఏకరూపమై యున్న కారణముచేత సర్వము సర్వదా సమన్వయపూర్ణమై యుండు జ్ఞానము కలిగియుండుట. ఇది అధిమానసములో (Overmind) లేదు. అతిమానసములో మనస్సంబంధమైన విభాగములు, వ్యతిరేకతలు అంతరించును. విభజించి ముక్కలు చేయు మనస్సు సృష్టించు సమస్య ఇక్కడ అంతరించును. సత్యమొక సంపూర్ణజ్యోతిగ గోచరించును. అధిమానసములో అజ్ఞానం ముట్టడించదు కాని, దాని ప్రథమదశ ప్రారంభమై, పతనమును అనివార్యము చేయును.

*

అతిమానసమే ఏకైక సత్యము. అదియే తన శక్తులను నిర్ణయించి విడుదల చేసి అభివ్యక్తము చేయుచున్నది. ఈ శక్తులన్నియు సామరస్యముతో వ్యతిరేకతలు లేక, ఒకదానినొకటి ఢీకొనక అన్నిటిలోను నెలకొనియున్న ఒకే అద్వైత సంకల్పము ననుసరించి, బహుముఖములు కలిగి, ఏకరూపముగ పనిచేయుచున్నవి. అధిమానసము బహువిధ సత్యములను, వాటి శక్తులను గ్రహించి వేనికవి ఒక ప్రత్యేక బలసంపన్నములైనవిగ చేసి తదనుగుణమైన ఫలితములను సాధించి పని చేయును. అది చేయు క్రియలలో గోచరమగు సామరస్యము, ఎక్కువగ పాక్షికము, బాహ్యావిషయము మాత్రమేగాని, స్వతఃస్సిద్ధము, అనివార్యము కాదు. మరియు అధిమానసముయొక్క ఉన్నతస్థితి నుండి క్రిందికి దిగివచ్చిన తరువాత, విభజన ఒకదాని నొకటి ఢీకొనుచు, వివిధ శక్తుల మధ్య పోరాటము పెరిగి, విభజన పైచేయి గలదై విజృంభించి అజ్ఞానము

పెచ్చు పెరిగి జీవితమంతయు సంభావ్యాంశముల పోరాటముగను అర్ధసత్యముల సంఘర్షణకారులైన కలవరములుగను, పరిష్కరింపబడని బాహ్యాపరిష్కారాభేద్యములైన చిక్కులుగ, సమస్యలు తయారగును.

*

The Supermind is the total Truth Consciousness; the Overmind draws down the truth separately and gives them a separate activity – e.g. in the Supermind the Divine Peace and Power, Knowledge and Will are one. In the Overmind each of these becomes a separate aspect which can exist or act on its own lines apart from the others. When it comes down to Mind they turn into an ignorance and incapacity – because Knowledge can come without a will to support it or Peace can be disturbed by the action of Power etc.

హైందవ సంప్రదాయము చైతన్యముయొక్క అంతస్తుల మధ్య, శక్తుల మధ్య ఏమీ భేదమును చూడలేదు. ఒకటి అధిమానసము, రెండవది అతిమానసము. ఈ కారణముచేత ప్రాచీనులు మాయనే (అధిమానస శక్తి లేదా విద్యా విద్యాశక్తినే) విశ్వసృష్టి శక్తిగ భావించిరి. ఆ విధముగ వారు అర్ధభాగమే వెలుగై ప్రకాశించు అధిమానసము వద్ద ఆగిపోయి, పరివర్తన రహస్యమును తెలిసికొనలేకపోయిరి. కాని, వైష్ణవ తాంత్రిక సంప్రదాయములు కొంతవరకు అంధప్రయత్నము చేసినవి. మరియు అప్పుడప్పుడు, విజయపు పొలిమేరలకు గూడ జేరినవి. మిగిలిన అన్ని సంప్రదాయములు వాని ప్రయత్నములకు అవరోధములై సక్రియమైన దివ్య (dynamic divine) సత్యమును కనుగొనలేకపోయినవని నా భావన. తత్సంప్రదాయములు తేజఃకాంతు లవతరించగనే, అదియే పరమోత్కృష్టమైన దివ్యతేజస్సుగ, జ్ఞానజ్యోతిగ భావించి, దాని నతిక్రమించి పైకి పోక, అక్కడనే ఆగిపోయిరనవచ్చును. లేదా అది కూడ మాయాలీల అని భావించి దాని నతిక్రమించి, ఒకానొక నిశ్చల, నిర్వికార, నిశ్శబ్దస్థితి గల పరతత్త్వ

ములో లయించిపోవుటయే తాము చేయతగిన పనిగ భావించి, స్థిరపడిరని చెప్పవచ్చును.

Higher Mind (అధిమనస్సు):

Our first decisive step out of our human intelligence, our normal mentality, is an ascent into a higher Mind, a mind no longer of mingled light and obscurity or half-light, but a large clarity of the Spirit. Its basic substance is a unitarian sense of being with a powerful multiple dynamisation capable of the formation of a multitude of aspects of knowledge, ways of action, forms and significances of becoming, of all of which there is a spontaneous inherent knowledge. It is therefore a power that has proceeded from the Overmind, – but with the Supermind as its ulterior origin, – as all these greater powers have proceeded: but its special character, its activity of consciousness are dominated by Thought; it is a luminous thought-mind, a mind of Spirit-born conceptual knowledge. An all-awareness emerging from the original identity, carrying the truths the identity held in itself, conceiving swiftly, victoriously, multitudinously, formulating and by self-power of the Idea effectually realising its conceptions, is the character of this greater mind of knowledge....

Illumined Mind (ప్రబుద్ధ మనస్సు)

This greater Force (than the higher Mind) is that of the Illumined Mind, a Mind no longer of higher Thought, but of spiritual light. Here the clarity of the spiritual intelligence, its tranquil daylight, gives place or subordinates itself to an intense lustre, a splendour and illumination of the Spirit: a play of lightnings of spiritual truth and power breaks from above into the consciousness and adds to the calm and wide enlightenment

and the vast descent of peace which characterise or accompany the action of the large conceptual-spiritual principle, a fiery ardour or realisation and a rapturous ecstasy of knowledge....

Intuition (స్వతః స్ఫురణ)

But these two stages of the ascent (Higher Mind and Illumined Mind) enjoy their authority and can get their own united completeness only by a reference to a third level; for it is from the higher summits where dwells the intuitional being that they derive the knowledge which they turn into thought or sight and bring down to us for the mind's transmutation. Intuition is a power of consciousness nearer and more intimate to the original knowledge by identity; for it is always something that leaps out direct from a concealed identity. It is when the consciousness of the subject meets with the consciousness in the object, penetrates it and sees, feels or vibrates with the truth of what it contacts, that the intuition leaps out like a spark or lightning-flash from the shock of the meeting; or when the consciousness, even without any such meeting, looks into itself and feels directly and intimately the truth or the truths that are there or so contacts the hidden forces behind appearances, then also there is the outbreak of an intuitive light; or, again, when the consciousness meets the Supreme Reality or the spiritual reality of things and beings and has a contactual union with it, then the spark, the flash or the blaze of intimate truth-perception is lit in its depths. This close perception is more than sight, more than conception: it is the result of a penetrating and revealing touch which carries in it sight and conception as part of itself or as its natural consequence. A concealed or slumbering identity, not yet recovering itself, still remembers or conveys by the intuition its

own contents and the intimacy of its self-feeling and self-vision of things, its light of truth, its overwhelming and automatic certitude.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: మానాప్రగడ శ్రీరాములు ('వ్యక్తియందలి వివిధ భాగములు, భూమికలు' నుండి)

(*SABCL* Vol. 22, pp. 257-258; *Guidance from Sri Aurobindo – Nagin Doshi,* Part I, 1974 edn. pp 256-257; *SABCL* Vol. 22, p. 250; Vol. 19. pp. 939-40, 944, 946-47)

వెలుగు మానస జీవులు – ఒక నూతనసృష్టి

'వెలుగు మానస' మంటే ఏమిటండి? "ఏవేవో పెద్ద మాటలతో మమ్మల్ని మభ్య పెట్టకండి" అని అంటారేమో! బహుశః మన పూర్వీకులైన వానరాలకు కూడ ఇటువంటి సమస్యే ఎదురై వుండవచ్చు. కొన్నాళ్లకి ఆ వానరుడే 'మనస్సు' అనే కిరీటాన్ని ధరించి నరుడుగా తయారయ్యేడు. యుగధర్మం మారుతూ వుంటుందనేందుకు ఇంతకంటె బలమైన తార్కాణమేం కావాలి? అలాగే యిప్పుడు మానవునికికూడ కాలం తీరిపోయింది. మనస్సుయొక్క రాజ్య మంతరించింది. మనిషిలోంచి అతిమానవుడు ఉత్పన్న మౌతాడు. ఇందుకు పైనుండి ఆజ్ఞ వచ్చేసింది. ఆ వెలుగు, ఆ పరంజ్యోతి, ఆ నూతన చేతన అరుదెంచి మన మధ్యన తాండవమాడుతోంది. మనం దాని కోసం నడుం బిగించి దీక్షితులమైపోవాలి. అదే మన ఏకైక లక్ష్యం కావాలి. అప్పుడది మనలోకి ప్రవేశించి మన నుత్తేజ పరుస్తుంది. దాని ఫలితమే వెలుగు మానసం (Mind of Light), రాబోవు సూపర్ మేన్‌కు నాంది.

– సంపాదకుడు

అతిమానసజీవులకు నాంది

పదార్థము తనలో సజీవమైన జీవులను రూపుదిద్దుకొను

వరకు, అచరములను తయారుచేసింది. అప్పుడు ప్రాణము వృక్ష జాతిలోని నిమ్నచైతన్యమునుండి, తెలివిగల జంతురూపము నిర్మాణమగువరకు పెరిగినది. వాటినుండి ఆలోచనాపరుడైన మానవుడు ఆవిర్భవించువరకు ప్రకృతి శ్రమించినది. ప్రాణశక్తిలో ప్రతిష్ఠితమైయున్న మనస్సు, బుద్ధిని వివిధరకములైన జ్ఞాన-అజ్ఞానములను, సత్య-అసత్యములను, క్రమముగ పెంపొందించినది. ఆ క్రమములో, ఆధ్యాత్మిక దృష్టి, వికాసములను చేరువరకు వృద్ధి పొందినది. ఇప్పుడు, అతిమానసమును, సత్యపరమైన సత్తను, పారదర్శకముగా చూచుచున్నది. మనస్సుయొక్క ఈ విధమైన ఆరోహణలో, వెలుగుమానసం ఒక దశలో యున్నది. అది అనివార్యమైన దశ. అది మానవుని ఆరోహణలో ఒక పరిణామ మంత్రమై ఒక నూతనమానవుని పరిణమింపజేయును. ఈ అభివృద్ధి, ఆరోహణాకార్యక్రమములో, ఉన్నత శ్రేణులకు పోగల తనదేయగు మానవరూపములను, శక్తులను వృద్ధి పొందించును. ఈ మధ్యంతర మానవరూపములు, అధికాధికముగ, ఆధ్యాత్మికతకు, ప్రకాశమానమగు వెలుగులకు ఉన్ముఖమై తుదకు దైవత్వముతో నిండిన మానవత్వము కలిగి, దివ్యజీవనమును సాగించగల తుదిమెట్టుకు పరిణతిలోనికి తీసికొని పోవును.

*

భువిపై దివ్యజీవనము

నూతన మానవజాతి భూమిపై భౌతిక శరీరములో మానసిక జీవులుగ, ఒక నూతన మానసిక జాతిగ ఆవిర్భవింతురు. కాని, విశ్వమయ అజ్ఞానముయొక్క ప్రస్తుత ప్రభుత్వము నుండి విముక్తి చెందినదై యుండును. అది పరిపూర్ణతనందిన మనస్సు, వెలుగు మానస వశమై యుండును. ఆ వెలుగు మానసము అతిమానసముయొక్క సత్య-చైతన్యమునకు లోబడి తాబేదారి కర్మలు చేయుటకు శక్తి కలిగియుండును. ఏమైనప్పటికీ సత్యసంధానము గల మనస్సుయొక్క సంపూర్ణ సామర్థ్యముతో పనిచేయును. ఆ మనస్సు, జీవితము దాని ఆలోచనా క్షేత్రములో రెండవ రకమైన కర్మలు (అతిమానస కర్మలు కాదు) చేయగలదు. అది అంతే

గాదు, భూలోకములోని దివ్యజీవనములో భాగముగ రూపుదిద్దు కొనగలదు. మరియు అజ్ఞానములో పూర్తిగగాని ఎక్కువగాని కాక, జ్ఞానములో పరిణామము చెందును. అందలి ఆరంభదశలో ఉండి పనిచేయును.

దివ్యజీవనపు ప్రారంభదశ

నేటి కాలములోని వైపరీత్యములు, కలవరపాట్లను (గందరగోళములను) వెలుగుమానసము తొలగించగలదు. మానవజాతిలో ఏ భాగమైనను, ఆ స్థితిని అందుకొనలేకపోయినను, దాని సంభావ్యత తెలిసినదై, ఎరుకతో ఆ మార్గమువైపు మరలగలదు. జాతి జీవితము, వికాసము కలదై ఉద్ధరింపబడును. అస్పష్టములు, పశుపరములైన దాని అశక్తతలు, ఒకానొక నూతన సామరస్యమును, ఫలమును పొందగలవు. మేము, భవిష్యత్తులో సంభావ్యమగు ఆ మార్పును దర్శించి, మానవజాతి వెలుగులోనికి ఉద్ధరింపబడి, ఆధ్యాత్మికసత్త కర్మలు సంభవించగలవనియు, సత్య-చైతన్యము యొక్క ప్రకాశము, వెలుగు మానవజాతిని పరిపాలించగలదనియు, మానసిక స్థాయిలోకూడా ఇది సంభవించ గలదనియు, తద్రీత్యా దివ్యజీవన ప్రారంభదశ వంటిది, ఉపక్రమింపబడగలదనియు విశ్వసించుచున్నాము.

*

అతిమానస పుత్రులు

ఒక నూతన మానవత్వము ఆవిర్భవించి, వికసించ వలెనన మా భావములో, ఒకానొక మానవజాతి అజ్ఞానములో పుట్టి, జ్ఞానాన్వేషణ చేయు మనస్సుగల జాతి కాదు. మేము భావించు మానవ జాతియొక్క మూలసూత్రము, అజ్ఞానములో ఆవిర్భవించిన మనస్సైనప్పటికి, అది వెలుగు (జ్ఞానము) యొక్క సహజ యజమాని కాకపోయినప్పటికి, వెలుగు నన్వేషించు సాధనమై యుండవలెను. అది వెలుగులో సహజముగ నివసించునది కాకపోయినను, వెలుగునకున్ముఖమై యుండవలెను. అది అజ్ఞానమునుండి, విముక్తి చెందిన సత్యచైతన్యము కాకపోయినను, వెలుగునకు వివృతమై వెలుగు నాకాంక్షించునదై యుండవలెను. అంటే దానిలో వెలుగు

నిలబడి, సత్యములో జీవించగలిగి, సత్యచైతన్యము కలిగి యుండ వలెను. దాని జీవిత వ్యవహారములలో అది జ్ఞానముయొక్క పరోక్షానుభూతికాక, ప్రత్యక్షానుభూతిగల 'వెలుగుమానసమై' యుండ వలెను. ఆ సాధనము (ఆ వెలుగుమానసం) యొక్క మానసిక తత్త్వము, అజ్ఞానముకాక వెలుగై (జ్ఞానమై) యుండవలెను. దాని అత్యున్నత స్థితినుండి అది, అతిమానసములో ప్రవేశించుటకు శక్తిగలిగి యుండును. ఈ వెలుగును మనస్సుతో ప్రభావితమైన జాతి సభ్యులనుండి, భూలోక ప్రకృతి పరిణామమునకు నేతలుగ రూపుదిద్దుకొను అతిమానసజాతి సభ్యులుగా భావించబడుదురు. వెలుగుమానసముయొక్క అత్యుత్తమ ఉన్నతశ్రేణికి చెందిన అభివ్యక్తి జీవులు, అతిమానస సాధన సామగ్రి, అతిమానసములో ఒక భాగము లేదా దానిచే ముందుకు త్రోయబడిన ఒకానొక శక్తి మాత్రమే కాగలదు; అతిమానస మానవత్వములో, అతిమానసతత్త్వములో ప్రవేశించుటకు ఒక మెట్టు మాత్రమే యగును. ఈ కార్యము (దాని) కంటె, మానవజాతి వెలుగుమనస్సును సాధించి నిలబెట్టుకొన గలిగినచో, మానవుడు, ఇప్పుడు తాను చేయుచున్న యోచనలు, భావములు, ఉనికి మొదలగు సామాన్య మానవ లక్షణములను అతిక్రమించి, మనస్సుయొక్క మహోన్నతమైన శక్తులను దాటి మానవ అతిమానస శ్రేణులకు మధ్యగల మానవాతీత శ్రేణులలోనికి ప్రవేశించగలడు.

*

సత్య, జ్యోతి జ్ఞానముల వాహికము

ఇది ఈ వెలుగుమానసము చివరి మెట్టు. ఇక్కడ అతిమానసము, తన్ను తాను తానెన్నుకొని సంకుచితత్వముతో కప్పిపుచ్చుకొని పనిచేయును. తన ఆవిర్భావ కార్యక్రమములోకూడ ఇట్లే సంకుచితమై పనిచేయును. కాని దాని స్వతస్సిద్ధమైన గుణము మారక, మూలతత్వములో సత్యచైతన్యముగనే యుండును. వెలుగుమనస్సులో పనిచేయు సంకుచిత సత్యచైతన్యముయొక్క క్రియాకలాపములలో, వెలుగు, సత్యము, జ్ఞానము కలవు. కాని వీటిలో, అజ్ఞానము, అంధకారము పొరపా

టులు చోటుచేసికొనలేవు. ఇది జ్ఞానమునుండి జ్ఞానమునకు ప్రసరించును. ఈ వెలుగు మానససీమలో మనము, సత్యచైతన్యమునుండి, అజ్ఞాన పొలిమేరలో ప్రవేశించలేదు. ఇక్కడ (ఈ వెలుగు మానససీమలోని) విధానములు – పద్ధతులు – స్వప్రకాశములో చూచుట, భావించుట, తెలిసికొనుట చేయును. ఇందలి కర్మలు కూడ, స్వసిద్ధి కలవై, ఆ వెలుగుసీమలో పనిచేయును. ఇక్కడ తెలియనిదానికై అన్వేషించుట, ఏదో పోయినదానికై వెతుకులాడుటవంటి తత్తరపాటు ఉండును. ఇక్కడి కర్మలన్నియు, విజ్ఞాన (స్వజ్ఞాన) భరితము, విజ్ఞానశక్తి, సూత్రము (ధర్మము) లతో నిండియుండును. సంపూర్ణమైన అతిమానస భూమికనుండి, మనోభూమికలోనికి అవతరణ కలదు. కాని వెలుగుమానసము, తనంతటతానుగ సంకుచితమైనప్పటికి, తెలివిలేని చైతన్యము (agnostic consciousness) ఆత్మజ్ఞానము లేక తాను చేయు పనులు తెలియనిది కాదు. అది తనకుతానుగ తెలిసికొనుట లేక విపులమైన గ్రహణశక్తిగల చైతన్యమును కలిగియున్నది. ఆ శక్తి నేరుగ విషయమును సమీపించి దానిని గ్రహించి తెలుసుకొనగలదు. అది చేరవలసిన వస్తువును చేరలేకపోవుటగాని, దానికొరకు చీకటిలో వెతుకుటగాని స్వల్ప వెలుతురులో వెతుకులాడుటగాని, చేయనవసరము లేదు. ఆ చైతన్యము, ఆత్మ విషయములలో దాని ప్రకృతి విషయములలోగాని, నేరుగ చూచుట, తెలిసికొనుట, వాటిని (వెంటనే) తట్టి వశపరచుకొనుట చేయును. మనము వెలుగు మానస సీమలో ప్రవేశించినప్పటికి (వెలుగుమానసము చేరినప్పటికి) స్వతస్సిద్ధముగ దానిలో ప్రతిష్ఠితమైయున్న అతిమానస ధర్మము నుండి విడివడలేదు.

వెలుగు మానసికము – ఒక మధ్యంతర స్థాయి

అధిమనస్సుతో ప్రారంభమయ్యే అధికాధికమైన సంకుచితత్వము, ఇక్కడ కూడ ఉన్నది. అతిమానస సత్యముయొక్క సంపూర్ణమైన వెలుగు శక్తులనుండి, అధిమనస్సు ఒక ప్రకాశమానమగు పొలిమేర (హద్దు) చే విడదీయబడినది. అయినప్పటికి అతిమానసము,

దానికి (అధిమనస్సుకు) ఇవ్వగల అన్నిటిని, అది స్వయముగ అందుకొనుటకు అధికారము కలిగి యున్నది. అధిమానసము నుండి, క్రింది భూమికలకు దిగుటలో, సంకుచితత్త్వము ఎక్కువై దాని సహజ క్రియాశీలతలో మార్పు చెందును. అధిమానసము నుండి దిగు మొదటిమెట్టు స్ఫూర్తి మనస్సు, రెండవమెట్టు వికసిత మనస్సు – అక్కడ నుండి నేను నామకరణముచేసిన ఉన్నతమనస్సు (మూడవ మెట్టు) వెలుగుమానసము ఒక అవస్థాంతర మార్గము (transitional passage) దానిగుండా, అతిమానసము, అతిమానవత్వములనుండి, వికసిత మనస్సు వరకును పోవచ్చును.

*

అతిమానసపు ఊడలు

ఈ వెలుగుమానసము జన్మించి, తనదేయగు గుర్తింపుగల ఆత్మ, యథార్థమైన స్థితి దాని సహజ క్షేత్రము కలదు. అది పరిస్థితుల సహజస్వరూపములనుబట్టి తెలియుచున్నది. వర్తమానములో ప్రబలియున్న పరిణామకార్యక్రమము ననుసరించియు, వస్తుప్రకృతి ననుసరించియు, ఈ వెలుగుమానసమునకు రెండు దశలు కలవు. మొదటిది: ఈ వెలుగుమానసము అజ్ఞానమునుండి తన్ను తాను సమీకరించుకొనుచు, తన సాధనసామగ్రిని కూడబెట్టుకొనుచు, తన రూపురేఖలను నమూనాలను ఆదిలో ఎంత అసంపూర్ణములైనను, వాటిని పూర్ణత్వములోనికి రూపుదిద్దుచు క్రమముగ అజ్ఞానపరిధులను అతిక్రమించి, వెలుగుసీమలోనికి, తనదేయగు వెలుగులోనికి ప్రవేశించువరకు మొదటిదశ. ఇక రెండవదశలో, ఈ వెలుగుమానసము తనకు సహజమైన ఉన్నతతేజస్సులో, తన్ను తాను వృద్ధిపొందించుకొనుచు, తన ఉన్నత స్వరూపములను తీసుకొని, అతిమానస సీమను జేరి దానియొక్క ప్రతినిధిగ గాని, దానియొక్క నిమ్నస్థితిగ గాని జీవించును. ఈ రెండుదశలలోకూడ తనకు చెందిన, సంబంధించిన శ్రేణులను తీర్చిదిద్దుచు, తత్సంబంధమైన జీవులను ఆవిర్భవింపజేయును. ఆ వ్యక్తులు వెలుగుమానసమును ధరించినవారై దానికి యోగ్యమైన జీవితమును

సాగింతురు. ఈ విధముగ అజ్ఞానములోకూడ ప్రప్రథమముగ మానవుని ఆరోహణ జరిగి దివ్యజీవన శిఖరము లందుకొనవచ్చును. పిమ్మట, ఈ వెలుగుమానసము ప్రకాశమును ఆధారముచేసికొని, విజ్ఞానమయ మనోస్వభావమును చేరవచ్చును. ఇది మానవుని పరివర్తనద్వారా సంభవించి, అతిమానసమును చేరకపూర్వమే, భౌతికచైతన్యములోనే పరివర్తనము చెందిన మానవత్వములో ప్రకాశమానమగు దివ్యజీవనమును సాధించవచ్చును.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదము: మానాప్రగడ శ్రీరాములు ('భువిపై
అతిమానస ఆవిర్భావము' నుండి)

(*SABCL* Vol. 16, pp. 68-69, 60-66,.67, 71-72, 69)

Architects of Immortality

From '*Savitri*'

I saw the Omnipotent's flaming pioneers
Over the heavenly verge which turns towards life
Come crowding down the amber stairs of birth;
Forerunners of a divine multitude,
Out of the paths of the morning star they came
Into the little room of mortal life.
I saw them cross the twilight of an age,
The sun-eyed children of a marvellous dawn,
The great creators with wide brows of calm,
The massive barrier-breakers of the world
And wrestlers with destiny in her lists of will,
The labourers in the quarries of the gods,
The messengers of the Incommunicable,

The architects of immortality.
Into the fallen human sphere they came,
Faces that wore the Immortal's glory still,
Voices that communed still with the thoughts of God,
Bodies made beautiful by the spirit's light,
Carrying the magic word, the mystic fire,
Carrying the Dionysian cup of joy,
Approaching eyes of a diviner man,
Lips chanting an unknown anthem of the soul,
Feet echoing in the corridors of Time.
High priests of wisdom, sweetness, might and bliss,
Discoverers of beauty's sunlit ways
And swimmers of Love's laughing fiery floods
And dancers within rapture's golden doors,
Their tread one day shall change the suffering earth
And justify the light on Nature's face.

Sri Aurobindo

(*SABCL* Vol. 28, pp. 343-44)

ది డివైన్ సూపర్ మేన్

'సూపర్ మేన్' అనగానే పిల్లల కార్టూన్ బొమ్మలలోని కండలు తీరిన మనిషి గుర్తుకు వస్తాడు. కాని మన సూపర్ మేన్‌ది కేవలం కండబలం కాదు. బుద్ధికి బృహస్పతి అనిపించే మేధా శక్తీ కాదు. అది మనస్సుకంటె ఘనమైన మహోమనస్సు. మనిషి ఎంత నాగరీకుడైనప్పటికీ అతని బ్రతుకు బానిస బ్రతుకే – మనస్సుకు బానిస, మన సూపర్ మేన్ అటులగాదు. అతనికి దివ్యబ్రహ్మాస్త్రములను పోలిన మహోమనస్సు వున్నది.

– సంపాదకుడు

This is thy work and the aim of thy being and that for which thou art here, to become the divine superman and a perfect vessel of the Godhead. All else that thou hast to do, is only a making thyself ready or a joy by the way or a fall from the purpose. But the goal is this and the purpose is this and not in the power of the way or the joy by the way but in the joy of the goal is the greatness and the delight of thy being. The joy of the way is because that which is drawing thee is also with thee on thy path and the power to climb was given thee that thou mightest mount to thy own summits.

నీ కర్తవ్యమంటూ యేదైనా వుంటే అది యిదే. నీ లక్ష్యం యేమిటని ప్రశ్నించావనుకో దానికి జవాబు యిదే. నువ్వు ఆనందాన్ని కోరుకున్నట్లయితే యింతకు మించిన ఆనందం మరొకటి లేదు. నువ్వు ఆనందమని భ్రమిస్తున్న స్వప్నం, సుషుప్తి, ఆత్మ విస్మృతి యివన్నీ పరిమితమైనవి. విచ్ఛిన్నమయిపోయేవి. కాని యిది పరిపూర్ణానందం, నీ అసలు రూపం. *నీ నిజస్వరూపమేమిటో తెలుసా? దైవమే. మిగిలినదంతా విచ్ఛిన్నకరమైనది. వికృతరూపమైనది. ఈ సత్యాన్నే నీ కళ్ల ముందర ఉంచుకొని, ప్రతి విషయంలోను, ప్రతిక్షణము దానికి విధేయమైపోవలసిందే!*

మేలిముసుగులో వున్న మోమును, ఆ ముసుగు తొలగించి చూడడానికి బదులుగా ఆ ముసుగే ముఖమని నమ్మబలుకుతాడొకడు; కాని నీ లక్ష్యం మాత్రం నువ్వు మారడం. స్వీయ పరివర్తన మానవస్వభావంలోనే వుంది. ఆత్మపరివర్తనే అతడి నిజమైన స్వభావం. అదే నిజమైన ఆధ్యాత్మిక లక్ష్యమైన ఆత్మోత్థానం.

ఆత్మ అంటే యేమిటి! దానిని అధిగమించడం యేమిటి? ఆత్మపరివర్తనం అంటే యేమిటి? ఇక్కడే నువ్వు పొరబడి తప్పు చేయకూడదు. నిన్ను నీవు తెలుసుకోవడంలో తప్పు జరిగిందంటే మాత్రం, అది నిన్ను సకలకష్టాలలోను ముంచెత్తి సమస్త సందేహాలకు కారణమవుతుంది.

నువ్వు అధిగమించవలసినది యేదంటే, యిప్పుడు బాహ్యంగా నీకు కనిపిస్తున్న నీవెరిగిన వ్యక్తి – పదార్థానికి, ప్రాణానికి బానిసయినవాడు. ఆ రెండూ కాకపోతే మనసుకి బానిసయిన మానవజీవిగా వుంటున్నవాడు. ఇది అతిగాఢమైన, ఘోరమైన పరాధీనత. మనస్సుకి బానిస కావడం అంటే మనసకరూపాన్ని చూసి దానికి దాస్యం చేయడమే.

పరిణామం చెందవలసిన నీ ఆత్మ – పదార్థం, ప్రాణం, మనస్సు అనే తెరల మరుగున నీలోనే వున్నది. అదే ఆధ్యాత్మిక శక్తులు కలిగిన దివ్యమానవుడు, పురుషోత్తముడు. బుద్ధిజీవిస్థాయి నధిగమించి, దివ్యమానవుడు కావడం కోసమే భౌతికజీవితం మీద ఆధిపత్యం సాధించాలి. ప్రస్తుతం యే ప్రకృతి చేతిలో కీలు బొమ్మగా వున్నావో ఆ ప్రకృతిని జయించిన రాజువు కావాలి. ఏ ప్రకృతి శక్తయితే నిన్ను పాదాలక్రింద తొక్కిపట్టిందో దానిని యెత్తిపడేయాలి. బానిసగా కాక స్వేచ్ఛగాను, భిన్నత్వంగా కాక, ఏకత్వంగాను, మృత్యువుకి లొంగిపోయే అశాశ్వతంగా కాక అమృతత్వం గాను, అంధకారంలోకాక పరిపూర్ణ దివ్యదీప్తి గాను, దుఃఖం, బాధల దోబూచులాటలో కాక సంపూర్ణ దివ్యానందం గాను, దుర్బలత్వంతో పతనం చెందడం కాక అమితశక్తివంతుడిగా ఔన్నత్యం సాధించాలి. పరిమితస్థాయి నధిగమించి అనంత జీవనం సాధించాలి. పరమాత్మగా అతడిలో ఐక్యం కావడమంటే అదే. To become thyself is to be this and all that flows from it.

Be free in thyself, and therefore free in thy mind, free in thy life and thy body. For the Spirit is freedom.

Be one with God and all beings; live in thyself and not in thy little ego. For the Spirit is unity.

Be thyself, immortal, and put not thy faith in death; for death is not of thyself, but of thy body. For the Spirit is immortality.

జీవుడిలో అమృతత్వమే అనంతత్వం, జాగృతి, పరమా నందం. పరమాత్మ అనంతుడు. పరిమిత జీవితాలు అనంతత్వం నుండి ఉద్భవించినదే.

సకల సృష్టిలో నీ వున్నావు. అందుచేత దానిలో యేదైనా నువ్వు కాగలవు. వాటిలో నువ్వు లేనట్లయితే, నీకు అస్తిత్వమే లేదు. నీలో యేదైతే వుందో అదే నీ జీవాత్మలో అభివ్యక్తమవు తుంది. బాహ్యంగా కనిపిస్తున్న నీ యీ రూపం. నీ నిజరూపం కాదు. బాహ్యరూపానికి బానిసగా నువ్వెందుకుండాలి?

ఇంకా యెదుగు. నిన్ను నీవు అధిగమించు. పరివర్తన సాధించు. నువ్వు మనిషివి. మనిషి సంపూర్ణస్వభావం మన ప్రస్తుత తత్వంకంటె ఉన్నతంగా పరివర్తన చెందడం. మొదట వ్యక్తి పశుప్రాయుడు. పశుప్రాయుడైనవాడు తరువాత స్థాయికి పరివర్తన చెందాడు. ఆలోచనాపరుడు, వస్తునిర్మాత, సౌందర్యా న్వేషకుడు అయ్యాడు. ఈ ఆలోచనాపరుడి స్థాయినించి జ్ఞాన సాధకుడు కావాలి. వస్తునిర్మాతస్థాయినించి సృష్టికర్తగా తన సృష్టికి తాను అధిపతి కావాలి. సౌందర్యాన్వేషణ స్థాయినించి ఆ సౌందర్యంలో ఆనందాన్ని అనుభవించేవాడుగా, భౌతికతనుండి శాశ్వతత్వం సాధించాలి. ప్రాణికంనుండి జీవాత్మ అమృతత్వా నికి, ఆ తర్వాత అనంతత్వ శక్తిని సాధించాలి. మానసికమైన, పాక్షికజ్ఞానంనుంచి పరిపూర్ణదీప్తి వెనుకగల దివ్యదర్శనాన్ని సాధించాలి.

To possess these is to become the superman; for [it] is to rise out of mind into the supermind. Call it the divine mind or Knowledge or the supermind; it is the power and light of the divine will and the divine consciouness. By the supermind the Spirit saw and created himself in the worlds, by that he lives in them and governs them. By that he is Swarat Samrat, self-ruler and all-ruler.

Supermind is superman; therefore to rise beyond mind is the condition.

To be the superman is to live the divine life, to be a god; for the gods are the powers of God. Be a power of God in humanity.

To live in the divine Being and let the consciousness and bliss, the will and knowledge of the Spirit possess thee and play with thee and through thee, this is the meaning.

This is the transfiguration of thyself on the mountain. It is to discover God in thyself and reveal him to thyself in all things. Live in his being, shine with his light, act with his power, rejoice with his bliss. Be that Fire and that Sun and that Ocean. Be that joy and that greatness and that beauty.

When thou hast done this even in part, thou hast attained to the first steps of supermanhood.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: నడిమింటి విజయలక్ష్మి, బి.యస్. రాఘవ


(*SABCL* Vol. 17, pp. 74-75)

అతిమానసానికి సన్నద్ధమగుట

అతిమానసజీవి ఎక్కడనుంచి వస్తాడు? అతనిని నీలోనే ఆవిష్కరించుకోవాలి. నీవు అతిమానసాన్ని అందుకున్న తరువాత ఆ శక్తిని నీలోకి ఆహ్వానించుకోవాలి. నిరంతర తపన, అంకురిత దీక్ష, గంభీరమైన ఏకాగ్రతలవలన మనలోనే దానికి రూపమివ్వాలి. — *సంపాదకుడు*

ప్రశ్న: అతిమానసమెలా ప్రవర్తిస్తుంది? దానినెలా ఆహ్వానించాలి? ఏ రూపంలో అది అభివ్యక్తమౌతుంది?

శ్రీఅరవిందులు 'On the Veda' అనే గ్రంథంలో ఈ ప్రశ్నకి సమాధానాలు చెప్పారు. శ్రీఅరవిందుల పుస్తకాలలో వెతుక్కుంటే మన ప్రశ్నలన్నిటికీ జవాబులు దొరుకుతాయి.



The Mother

నిరంతర తపనవలన, నిరంతర వ్యాప్తి జెంది, ఆత్మ పరి పూర్ణతను పొందినపుడు, దైవేచ్ఛ నీయందు పనిచేయడం ద్వారా నీలో అతిమానసలోకము ఏర్పడవలెను.[3]

అంటే – అతిమానస జీవి, అతిమానసలోకము నీలో ఏర్ప డాల్నంటే చైతన్యవికాసంతో నిర్విరామంగా సాధన సాగిస్తూ ముందుకు నడుస్తూనే ఉండాలి. ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు ఓ సారి వురుకులు పరుగులతో కాస్సేపు కృషి చేసి తర్వాత చతికి లబడటం కాదు. జీవుడు యెల్లవేళలా తదేక భావనతో కృషి సాగిస్తూ సర్వదా ఈ వ్యాపకంలోనే వుండాలి.

అతిమానస మనేది ఈ విశ్వంలో కలదట; అది మనలో అభివ్యక్తమైతే ఎంత బాగుంటుంది! అని కాస్సేపు అనుకుని, తర్వాత లౌకిక వ్యవహారాలలో తలమునకలై ఉండటం సరికాదు. ఇందుకు దైవకృప నపేక్షించాలి. నీలో ప్రగాఢమైన ఆకాంక్ష వుండాలి. దివ్యచిత్త అనుసంధానంతో చైతన్య వికసనం పొందాలి. ఇది తప్పనిసరి అని శ్రీఅరవిందులు స్పష్టంగా చెప్పారు. ఇందుకై తగిన తీవ్రకృషి లేకుండా అమ్మో! ఇది నా వశం కాదనుకుంటే – అసలు దీనిని అపేక్షించమని ఎవరు నిన్ను బలవంతపెట్టారు? అని ప్రశ్నించవలసి వస్తుంది. దివ్యచైతన్యాన్ని మనలో ఆవహిం చుకునే అర్హత పొందటానికి, మన మెంతో శక్తివంతులము కావాలి. అది అసామాన్యమైనది. అల్పత్వంతో ప్రాపంచిక వ్యవహారాలలో తలమునకలై వున్నవారికి అనల్పమైన అతిమానస చైతన్యాన్ని ఆవహించుకునే తీరిక ఎక్కడిది?

దీని ఆంగ్లమూలం:

("The supramental world has to be formed or created in us by the Divine Will as the result of a constant expansion and self-perfecting"

That is to say, to hope to receive, use and form in oneself a supramental being, and consequently a supramental world,

---

[3] శ్రీఅరవిందులు *'The Secret of the Veda' SABCL* Vol. 10, p. 375

there must first of all be an expansion of consciousness and a *constant* personal progress; not to have sudden flights, a little aspiration, a little effort, and then fall back into somnolence. This must be the *constant* idea of the being, the *constant* will of the being, the c*onstant* effort of the being, the *constant* preoccupaion of the being.

If for five minutes in the day you happen to remember that there is something in the universe like the supramental Force, and that, after all, "it would be nice if it manifested in me", and then all the rest of the time you are thinking of something else and are busy with other things, there is not much chance that it would come and do any serious work in you.Sri Aurobindo says this quite clearly and precisely. He does not tell you that *you* will do it, he says it is the Divine Will. So don't come and say, "Ah! I can't". No one is asking you to do it. But there *must be* enough aspiration and adhesion in the being to make the expansion of the being, the expansion of consciousness possible. For, to tell the truth, everybody is small, small, small, so small that there is not enough room to put any supramental in! It is so small that it is already quite filled up with all the ordinary little human movements. There must be a great widening to make room for the movements of the Supermind.)

ముందు మనలను మన మెంతో విశాలపర్చుకోవాలి. ఆధ్యాత్మిక పురోగతిని గాఢంగా ఆకాంక్షించాలి. ఉన్నతచైతన్యాన్ని, దివ్యజ్ఞానాన్ని, దివ్యసత్యాన్ని, విశ్వజనీనతను ప్రగాఢంగా కోరుకోవాలి. అన్నిటికి మించి తరగని సద్భావనామధురంగా బ్రతకాలి. పరిమిత జ్ఞానంతో సంతృప్తిపడి కాలక్షేపం చేయుటంవల్ల లాభం లేదు.

ఇదంత సులువుగా అయేదేనా!

భౌతిక ఆవరణం లోనికి అతిమానసం అవతరించినపుడు నేను చేయవలసిన హెచ్చరికలు ఆనాడే చేశాను. ఈ దివ్యశక్తి వెనువెంటనే దృశ్యమానమవుతుందని గాని, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికసిద్ధి పొంది అలవోకగా కాంతిశిఖరాల నధిరోహిస్తారనిగాని నేనేమీ ప్రకటన చేయలేదే! ఇందుకు సమయం పడుతుందని చెప్పాను. అయ్యో! విషయాలు మరింత జటిలమైనవే అని నిరుత్సాహపడేవారి పట్ల నేను చేయగలిగేదేమి ఉంటుంది, విచారించటం తప్ప. అతిమానసశక్తిని ఇక్కడ శంకించడం అవివేకం. ఇక్కడ మన అర్హత ఏపాటిదనేది గమనార్హం. నిజంగా చిత్తశుద్ధి వుండి పరిపూర్ణమైన ఆకాంక్షతో అతిమానసాన్ని పొందగలిగి వున్న సందర్భాలలో జటిలమైన సమస్య లనుకొన్నవి మంచులా విడిపోయిన దాఖలాలు వున్నాయి.

మనోజిజ్ఞాస వేరు, ప్రగాఢమైన ఆకాంక్ష వేరు. బుద్ధి నైపుణ్యంతో మాటల గారడీలు, భావ విన్యాసాలు ప్రదర్శించవచ్చు. అంతవరకే వాటి విలువ. పోతే, అధిమానసచైతన్య సాధనకి ప్రగాఢ ఆకాంక్ష, అంతరంగ ఇచ్ఛాశక్తి అత్యంత ఆవశ్యకం. ఇవి లేకుంటే అతిమానసచైతన్య సాధన అసాధ్యమే! అతిమానసం కంటబడాలంటే తీవ్రసాధన తప్పనిసరి. నిజం చెప్పాలంటే మన మనుగడ అందుకోసమే. జీవితానికి విలువ సార్థకత అదే మరి!

శారీరక రూపాంతరీకరణం, భారరహిత తేజస్సుతో ప్రకాశిస్తూ ఉండి, ఏకకాలంలో పలుచోట్ల దర్శనమిస్తూ ఉండటం – లాంటి అద్భుతాలు గురించి ఇక్కడ ఊహించడం, ప్రస్తావించడం అనుచితమౌతుంది. ఇందుకు సమయం పడుతుంది.

ఆత్మనిగ్రహం, ఆత్మావలోకనం, శారీరక నిగ్రహం, స్పష్టమైన విషయపరిజ్ఞానం, తొట్రుపాటు లేకపోవటం, ముందుచూపు, తాదాత్మ్యత – ఇవి ఉన్నతచైతన్య సాధనలో అగుపించే తొలి లక్షణాలు. సంశయాత్మక పరిస్థితి ఉండదు. అంతరాదేశం వినిపిస్తుంది.

ఇందుకు ఎంతో అర్హత పొందాలి.

*

నువ్వు అతిమానస చైతన్యాన్ని పొందావన్న గుర్తులు:

1. పరిపూర్ణమైన సమతానుభవం

2. సమగ్ర నిస్సంశయాత్మక పరిజ్ఞానం

సంపూర్ణత సాధించాలంటే సహజ సమత్వభావన కావాలి. ఇది భౌతిక, మానసికస్థాయి కార్యకలాపాలన్నిటా వ్యక్తం కావాలి. సమగ్ర, నిస్సంకోచమైన తాదాత్మ్యతానుభవ జ్ఞానం (infallible knowledge through identity) వలననే ఇది సాధ్యపడుతుంది.

దీని నాకాంక్షించే దివ్యచైతన్యశక్తి నావహించుకునే టందులకు సంసిద్ధులై దాని తాలుకు పరిణామ ప్రక్రియని స్వేచ్ఛగా సాగనివ్వాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 8, pp. 204-07; Vol. 15, pp. 110-11)

సమాచార పత్రం

BONNE ANNEÉ – నూతనవర్ష శుభాకాంక్షలు. 1 జనవరి 2004 నాడు శ్రీమాత జపాను దేశంలోని చిత్రము, శ్రీఅరవిందుల పాండిచ్చేరిలోని చిత్రపటములతో కూడిన సందేశ (శ్రీఅరవిందులది) పత్రము ఆశ్రమంలో పంచబడినది. ప్రాతఃకాలమున 6 నుంచి 6-30 వరకు ఆశ్రమవాసులు, ఇతరులు ఆశ్రమంలోను, స్కూలు ప్రాంగణంలోను సునీల్‌గారి సంగీతముతో ధ్యానము చేసిరి. 21 ఫిబ్రవరి నాడు శ్రీమాత జన్మదినోత్సవము ఆశ్రమములోను, దేశ విదేశాలలోని అనేక కేంద్రములలోను జరుపబడును. 29 ఫిబ్రవరి – The Golden Day, The Day of Lord. ఆ రోజున ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమము లుండును. 23 ఫిబ్రవరి నుండి 5 మార్చి 2004 వరకు డా॥ మంగేష్ నడ్కర్ణిగారు 'సావిత్రి' కి బదులు శ్రీఅరవిందుల 'గీతావ్యాసముల' పై ఒక సదస్సును నిర్వహించ దరు. దీనికి అందరూ ఆహ్వానితులే.

17th November 2003

Sitting calm and quiet remember the Mother and open yourself to Her. This is the rule of meditation.

Sir Aurobindo

ప్రశాంతంగా కూర్చొని శ్రీమాతను స్మరిస్తూ, ఆమెకు వివృతము కమ్ము. ధ్యానము చేయుటకు ఇదే చక్కటి మార్గము.

శ్రీఅరవిందులు

24th November 2003

The realisation of the Divine is the one thing needful and the rest is desirable only in so far as it helps or leads towards that or when it is realised, extends or manifests the realisation.

Sir Aurobindo

దైవమును ప్రాప్తించుకొనుటయే మన ఏకైక కర్తవ్యము; ఇతరములు అందుకు దోహదము చేయునవిగాని, దారితీయునవిగాని లేక దైవము ప్రాప్తించినప్పుడు దానిని వృద్ధిపరచునవిగాని అయితేనే ముఖ్యములు.

శ్రీఅరవిందులు

5th December 2003

Sri Aurobindo has given up his body in an act of supreme unselfishness, renouncing the realisation in his own body to hasten the hour of the collective realisation. Surely if the earth were more responsive, this would not have been necessary.

The Mother


రామాయణం గురించి శ్రీఅరవిందులు



అఖిల

అఖిల భారత పత్రిక

మార్చి 2004



ఉపోద్ఘాతము

వేదాలు ఉపనిషత్తుల పేరు చెప్పగానే మనుషులు పారిపోతారేమో గాని రామాయణ, భారతాలు చెప్పగానే పండితుల దగ్గరనుంచి పామరుల వరకు అందరూ ఇష్టపడతారు. రామాయణ మహాభారతాలు ఈ దేశానికి మూలస్తంభాలు; జాతి రక్తనాళాలలో ప్రవహించే జీవనదులు. ఈ జాతి జీవనాన్ని ప్రతిబింబించే మహాకావ్యాలు. లక్ష శ్లోకాలుగల మహాభారతం ప్రపంచంలోకల్లా అతి పెద్దదైన గ్రంథరాజము. అందులో కళలు, సకలవిద్యలు, శాస్త్రాలు అంతర్లీనంగా నిక్షిప్తమై వున్నాయి. వేదాంతం కూడ కఠినమైన పదజాలంతో కాకుండా కథలలో అందరికి అర్థమయే రీతిలో అంతర్లీనంగా నిక్షేపించబడింది. కొంతమందికి రాముడు, కృష్ణుడు నిజంగా అవతారాలేనా, అలా అయిన యెడల కొన్ని సందర్భాలలో వారు సాధారణ మానవుల్లా ప్రవర్తించారేమిటి అనే అనుమానం రావచ్చు. ఇటువంటి సంశయాలకు సమాధానాలు, అవతార పురుషులకు సంబంధించిన నిశిత వివేచనను కూడ ఈ సంచికలో చూడండి.

— సంపాదకుడు

రామాయణం గురించి శ్రీఅరవిందులు

విభాగము – I

విభాగము – II

ప్రాచీన భారతమంతా వేదోపనిషద్భూతమని గ్రహించవచ్చు. మహాత్ముల దివ్యదర్శనమే జాతికి మార్గదర్శకమైనది. ఉపనిషద్దర్శనమే రామాయణ, మహాభారతములందు చిత్రింపబడి, మానవ జీవితంలో ప్రతిబింబించబడినది కదా!

శ్రీఅరవిందులు

పరిచయము

భారతదేశం విస్తృతంగానూ, మరియు సమగ్రతపట్ల అవధానం తోనూ నిజంగా ఏ రంగంలో తన ప్రయత్నం కొనసాగించలేదు? విజయం పొందలేదు? నిర్మాణం చేయలేదు? ఆధ్యాత్మికంగానూ, వేదాంతపరంగానూ, ఈ దేశం సాధించిన విజయాన్ని గురించి ప్రశ్నించవలసిన పనే లేదు. ఎంతో మానసిక వికాసం పొందింది. దేశంలో సాహిత్యం వెల్లివిరిసింది. వేదాలు, ఉపనిషత్తులు మరియు భగవద్గీత మాత్రమేకాక, అంత ప్రధానం కాకున్నా, ఆ క్షేత్రంలో అతిశక్తిమంతమూ, సుందరమూ అయినవీ, నిరుపమానమైన ధార్మిక-తాత్త్విక కవితకు పెన్నిధులైనవీ అగు రచనలెన్నో ఉన్నాయి. ఐరోపా ఖండంలో ఇంతటి బృహద్రచనలు చేసే ప్రయత్నాలేమీ జరగనే జరగలేదు. కాని దొడ్డ జాతీయ నిర్మాణ మైన మహాభారతం కవితా సాహిత్యాన్ని తన పరిధిలోకి ఇము డ్చుకొని సుదీర్ఘ కాలానికి చెందిన జన జీవనాన్ని సమగ్రంగా వ్యక్తం చేసింది. న్యాయబద్ధమైన ఒక లోకోక్తి స్వాతిశయంగా 'మహాభారతంలో లేనిది భరతవర్షంలో లేదు' అని అభివర్ణించింది.

ఆ తరగతికే చెందిన రామాయణం మరొక రచన. ఇది మహోత్తమ శ్రేణికి చెందిన కావ్యం. అత్యుదాత్తమూ, సుందరమూ అయిన ఈ మహాకావ్యం నైతికధర్మాన్నీ, సగం దివ్యత్వంతో నిండిన పరాక్రమవంతమైన మానవ జీవితాన్ని చిత్రించింది. కవి తకు చెందిన శోభ, సమగ్రత, ఆశ్చర్యకరమైన సంపన్నత, సము న్నత సంస్కారానికి చెందిన భావసంపద, పులకరింపు, ఊహ, క్రియ, సాహసం – వీటితో నిండిన ఈ ఆదికావ్యం సంప్రదాయ సిద్ధమైన చిత్రాతిచిత్ర సాహిత్యానికి రూపకల్పన గావించింది.

అనువాదం: శిరోమణి సముద్రాల లక్ష్మణయ్య

(*SABCL* Vol. 14, pp. 185-86)

రామాయణ భారతాల రచనాశిల్పము

రామాయణ భారతాలు ఈ జాతిలో పడుగు పేకలవలె అల్లుకొనిపోయిన పురాతన గాథలు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ వాటి ప్రధానాంశములు. అంతేగాక ఈ కథలలో నైతిక సామాజిక విలువలు, రాజకీయాలు, కళలు, విద్యలు, సకల శాస్త్రాలు – ఒకటేమిటి ఒక జాతి జీవనానికి, మనుగడకి కావలసినదంతా వీటిలో వర్ణింపబడి వున్నది. వీటి రచయితలు భారతీయ చింతన, ధర్మములు, ఆధ్యాత్మిక విషయాలు సామాన్యజనులకు కూడ సులభంగా బోధపడేటట్లు నేర్పుగా కథలలో అంతర్భాగంగా తీర్చిదిద్దిన మహాశిల్పులు. *– సంపాదకుడు*

ఈ రామాయణ భారతాలు రెండూ రెండు వీరగాథలు – వాటి కవే సాటియై ప్రపంచంలో ఈ కోవకు చెందిన ఇతర గ్రంథాలకంటె భిన్నంగా వున్నాయి. అలనాటి ప్రాచీన వీరచరిత్రను ప్రతిబింబించినప్పటికి వాటి స్వరూపం సమున్నతస్థితి నందుకొన్న బౌద్ధిక – నైతిక – సాంఘిక సంస్కృతికి చెందిన కాలానికి సంబంధించినది. అది పరిపక్వమైన ఆలోచనతోనూ, గాంభీర్యంతోనూ, నైతికప్రబోధంతోనూ మహత్తరమైనదిగా రూపొందింది. అందువల్ల ఈ కావ్యాలు ప్రాచీన కథలు, గాథలకంటే పూర్తిగా భిన్నమైనవి. దృష్టి వైశాల్యంలో, హోమరిక్ (Homeric) ప్రబంధాలకంటె ఎంతో ఘనమైనవి. వీటికిగల గుణాతిశయమును, కవిత్వసమగ్రతను గురించి నేనిప్పుడు మాట్లాడటం లేదు. అదే సమయంలో పురాతనత్వము, నేరుగా సూటిగా ప్రసరించే శక్తి, నూతనత్వము, శ్రేష్ఠత్వము, జీవనాడి, ఓజస్వితా సౌందర్యాలలో నిరాడంబరత్వము – అనే అందలి గుణాలు వాటిని వర్జిల్ (Virgil) లేక మిల్టన్ (Milton) ఫిరదౌసి లేక కాళిదాసు ఘనంగా నిర్మించిన కావ్యాలకంటె భిన్నమైన తెగకు చెందినవి. నైతిక, బౌద్ధిక మరియు తాత్త్విక చింతనయొక్క క్రియతో, అభివృద్ధితో వీరలక్షణ సమన్వితమూ, వేగవంతమూ అయిన జీవితశక్తికి

చెందిన సహజమైన ఉచ్ఛ్వాసముయొక్క ఈ వింత కలయిక నిజంగా ఒక విశిష్ట లక్షణం. ఈ ప్రబంధాలు జాతి యువతకి సంబంధించిన వాణి. ఆ యువత నవీనము, సుందరము, ఉల్లాస మైనదే కాక వివేకవంతము, గంభీరము, సమగ్రలక్షణ సమేతమై నది. అయితే ఈ వ్యత్యాసం ఉపరిగతమైనది మాత్రమే. స్వరూ పంలోనూ, నిర్మాణంలోనూ, వైశాల్యంలోనూ కూడా మౌలికమైన మరొక భేదం ఉన్నది.

ప్రాచీన వైదికవిద్యలోని ఒక ముఖ్యాంశము విశిష్టమైన సంప్రదాయానికి చెందిన జ్ఞానం. అదే ఇతిహాసం. తరువాతి కావ్యాల నుండి మహాభారత రామాయణాలను వేరుపరచటా నికి ప్రాచీన విమర్శకులు ఈ దివ్యాంశాలనే ప్రయోగించారు. ఒక విశిష్ట కథగా సృజనాత్మకమైన ప్రయోజనానికై, లేదా ఆధ్యాత్మికం లేదా ధార్మికం, లేదా నైతికం, లేదా ఆదర్శప్రాయమైన వస్తుసిద్ధికై వినియోగింపబడిన ప్రాచీన చారిత్రక లేదా పౌరాణిక సంప్రదా యమే ఇతిహాస మనబడింది. మహాభారత రామాయణాలు చాలా పెద్ద ఎత్తులో ఈ తరగతికి చెందిన ఇతిహాసాలై ఒక బృహత్ప్రయో జన సిద్ధికై ఉద్భవించాయి. వీటిని రచించిన కవులు, తదనుబంధ సాహిత్యాన్ని సృష్టించినవారు రమణీయమైన పద్ధతిలో, గంభీర మైన ప్రక్రియతో ఒక ప్రాచీన కథను చెప్పడానికో లేక ఆసక్తి కరమైన అర్థవంతమైన దిశలో కవితను రూపొందించడానికో మాత్రమే ఉద్దేశించినవారు కారు. ఐతే ఈ రెండు ప్రయోజనాలను వారు విజయవంతంగా సాధించగలిగారు. వారీ కావ్యాలను జీవిత శిల్ప నిర్మాణకర్తలుగా, సృజనాత్మక భావుకులుగా, జాతీయభావ నకు మరియు ధర్మాన్నీ, నీతినీ, సంస్కృతినీ సాధించే ఉద్దేశంతో రచించారు. ఈ ప్రబంధాలలో జీవితానికి చెందిన ఉదాత్తమైన ఆలోచన, ధార్మిక సాంఘిక రంగాలలో విశాలమైన, సజీవమైన దృష్టి, తత్త్వసంబంధమైన స్ఫురణము అంతర్వాహినిగా ప్రవహి స్తున్నది. అంతేకాక గొప్ప మేధాశక్తితో, సజీవమైన ప్రతిపాద నతో పరిపూర్ణమైన ప్రాచీన భారతీయ సంస్కృతి అందులో గర్భి తమై వున్నది. మహాభారతం పంచమవేదమని కీర్తింపబడింది.

ఈ మహారచనలను గురించి అవి కేవలం మహాకావ్యాలు మాత్రమే కావనీ, ధార్మిక, నైతిక, సాంఘిక, రాజకీయ, తత్త్వ ప్రబోధకాలైన ధర్మశాస్త్రాలనీ భావించబడ్డాయి. ప్రజల జీవితాలపై, మనస్సులపై అవి చూపిన ప్రభావం వలన అది భారతీయుల బైబిలుగా వర్ణిం చబడు నంతటి గొప్పదనం కలిగి వున్నది. నిజానికి అది సరి అయిన సామ్యం కాదు. ఎందుకంటే భారతీయుల బైబిలులో వేదాలు ఉపనిషత్తులు, పురాణాలు, తంత్రాలు, మరియు ధర్మశాస్త్రాలు ఇమిడి పోతాయి. ఇక ప్రాంతీయభాషలలోని సువిశాలమైన ధార్మిక సాహిత్యం ఒక ప్రక్క ఉండనే వున్నది.

సమున్నతమైన తాత్త్విక నైతికాదర్శాన్ని, సాంస్కృతికా భ్యాసాన్ని ప్రచారం కావించడమే ఆ పురాణ రచనల కర్త వ్యము. గొప్ప ప్రబంధరూపంలో ఒక కథా ప్రాతిపదికమీద స్మృతిచిహ్నాలుగా, ప్రాతినిధ్యం వహించే రూపాలుగా రూపొందిన విశిష్ట వ్యక్తుల చుట్టూ భారతీయ ధార్మిక సంస్కృతినీ, సాంఘిక, నైతిక రాజకీయస్థితులనూ వ్యక్తం కావించే శ్రేష్టమైన భావననూ, యథార్థ జీవితాన్నీ, లేదా సృజనాత్మకమైన ఊహనూ ప్రామాణి కంగా అందులో చిత్రించడం జరిగింది. ఈ విషయాలన్నింటినీ ఒకచోట చేర్చి కళాపిపాసతో హృదయావర్జకమైన ప్రభావంతో పద్యకావ్యరూపంలో నిబంధించడమయింది. సగం పౌరాణికం, సగం చారిత్రకంగా కొనసాగిన ఈ రచన ప్రజల ధార్మిక జీవ నంలో ఒక భాగంగా, గాఢమైన సజీవ సత్యంగా వృద్ధిపొందింది.

ఆ రీతిగా నిర్మింపబడిన మహాభారతం మరియు రామా యణం మూలగ్రంథం (సంస్కృతం) లో గానీ, లేదా ప్రాంతీయ భాషానువాదాలలో గానీ కథకులు, గాయకులు, పౌరాణికుల ద్వారా ప్రజల్లో వ్యాపింప జేయబడ్డాయి. ప్రజల వికాసములో, సంస్కృతిలో అవి ఒక ముఖ్యాంశమయ్యాయి. వారి ఆలోచననూ, శీలాన్నీ, ధార్మిక మనస్తత్త్వాన్నీ రూపొందజేశాయి. విద్యావిహీ నులకు గూడా చాలినంత తత్త్వజ్ఞానాన్నీ, నీతినీ, సాంఘిక – రాజకీయ భావాలనూ, కథలనూ, రసాభినివేశమునూ, కవితలనూ అందించాయి.

సాంస్కృతికంగా అభివృద్ధి పొందిన వారికై వేదాలలో, ఉప నిషత్తులలో సూత్రప్రాయమైన తాత్త్వికాంశాలుగా, ధర్మశాస్త్రాలుగా, అర్థశాస్త్రాలుగా రూపొందిన విషయాలే ఇక్కడ సజీవ పాత్రలతో సృజనాత్మక రీతిలో పొందుపరచడం జరిగింది. అందలి పాత్రలు పరిచితమైన కథలు, పౌరాణిక గాథలలో ఎదురై విస్పష్టమైన జీవి తానికి ప్రాతినిధ్యం వహించాయి. ఈ విధంగా ఆత్మకూ, ఊహకూ, వివేకానికీ రుచించే కవితల ద్వారా అందరూ అందలి తత్త్వాన్ని అవగాహన చేసికొనగల స్థితి ఏర్పడింది.

అనువాదం: శిరోమణి సముద్రాల లక్ష్మణయ్య

(*CWSA* Vol. 20, pp. 344-47/ *SABCL* Vol. 14, pp. 284-86)

మహాభారతం

సమస్తజాతి మనోదర్పణం:

మహాభారతం కేవలం భరతుని చరిత్రయో లేక, జాతీయ సంప్రదాయంగా మారిన పూర్వసంఘటనకు సంబంధించిన ఒక ఇతిహాసమో కాదు. విస్తృత పరిధిలో భారతాత్మకు, భారతదేశపు మతాత్మక నైతికమనస్సుకు, సామాజిక, రాజకీయ ఆదర్శాలకు, సంస్కృతికి, జీవనవిధానానికి సంబంధించిన మహాకావ్యం అది. భారతదేశంలో ఉన్నదంతా మహాభారతంలో వుందన్న జనవాక్యం సత్యదూరం కాదు. మహాభారతం కేవలం ఒక వ్యక్తి కల్పనగాని, అభివ్యక్తిగాని కాదు. అది ఒక జాతి మనోదర్పణం, భరతఖండము వ్రాసుకొన్న స్వీయ గాథ.

రచనా శిల్పం:

ఈ కావ్యమంతా ఒక మహత్తరమైన దేవాలయం లాంటిది. విస్తృతమైన, సంక్లిష్టమైన ఈ కావ్యభావన అందులోని విశిష్ట చెక్కడాలు, శిల్పసంపద, శాసనాలతో నిండిన ఒక్కొక్క గది నుండి నెమ్మదిగా బహిర్గతమౌతుంది. దైవిక, దైవీమానవ పరిమా

ణాల్లో చెక్కిన సామూహిక చిత్రాలు, స్వాతిశయంతో మగ్గుతూ, మానవాతీత స్థాయికి సముద్ధరింపబడినా, మానవ రాగద్వేషా లకు, భావనలకు దగ్గరగా ఉన్న మానవాళి, ఆదర్శాభిముఖంగా పురోగమిస్తున్న వాస్తవికతా రాగం, ఈ ప్రపంచం వెనుక దాగి ఉన్న శక్తుల ఉపస్థితి, ప్రస్ఫుట ప్రభావాలకు లోనౌతున్న ఈ ప్రాపంచిక జీవన విస్తృత చిత్రీకరణ, ఈ కావ్యకథ విశాలసోపా నాలపై అవిష్కృతమైన ఒక సుదీర్ఘ, సముచిత, స్థిరభావన పరం పరతో కలబోసిన సమగ్రతను ఇందులో దర్శించవచ్చు. ఇతిహాస కావ్యసంప్రదాయానుసారంగానే, ఈ కావ్యానికి ఆకర్షణగా స్థూల, సూక్ష్మగమనాలతో కథాచిత్రణ సాగుతుంది. పరిమాణబాహుళ్యం, కొట్టవచ్చినట్లు, ప్రభావశీలంగా కనబడే కథా విస్తరణ, కథాశైలి, గమనాల్లో పౌరాణికత, సౌలభ్యం, సామర్థ్యం కనిపిస్తాయి.

జగజ్జీవనంలో ప్రతిఫలించిన వైదిక భావన :

ఇతివృత్తంలో ఎంతో ఆసక్తి గొలిపేదీ, కావ్యకథా వర్ణ నలో కళ్లకు కట్టినట్లు కనిపింపచేసేదీ అయినా మహాభారతమంటే అంతే కాదు. అంతకంటె మిన్నగా భారతీయ జీవన సంస్కృతు ల్లోని ప్రధాన భావాలను, ఆదర్శాలను సంపూర్ణంగా ప్రతిబింబించే మహత్తర గాథ, ఇతిహాసం అది. భారతీయధర్మ భావన ప్రధా నంగా దీన్ని నడిపిస్తుంది. సత్యం, వెలుగు, ఏకత్వం అనే దైవీ తత్త్వాలకూ, చీకటి, విభజన, చెడు శక్తులకూ మధ్య జరిగే సంఘర్షణను గురించిన వైదికభావనను ఆధ్యాత్మిక, ఆంతరంగిక, మతాత్మక స్థితుల నుండి బౌద్ధిక, నైతిక, ప్రాణిక (vital) స్థాయి ల్లోకి అవతరింప జేస్తుంది. కథాచిత్రణలో వైయక్తిక, రాజకీయ ఘర్షణల ద్వయరూపాన్ని అది సంతరించుకొంటుంది. వైయక్తిక స్థాయిలో అది భారతీయ ధర్మానికి సంబంధించిన మహోన్నత నైతిక, ఆదర్శ రూపాలకూ, ఆసురిక అహంకారం, ఆత్మసంకల్పం, ధర్మభ్రష్టతల ప్రతిరూపాలకూ మధ్య ఘర్షణగా కనిపిస్తుంది. ఈ వైయక్తిక ఘర్షణ రాజకీయ స్థాయిలో రాజకీయ ఘర్షణగా పరిణ మిస్తుంది. ఇదొక అంతర్జాతీయ కురుక్షేత్రం. దీని అంతిమ ఫలితం

పోరాడుతున్న జాతులను ఏకం చేస్తూ, న్యాయ, ధర్మ, పరిపాలన లేదా ధర్మరాజ్య సంస్థాపన; రాజుల, ఉన్నతవర్గాల రాజ్యదాహం, అహంకారాల స్థానే న్యాయౌదార్య సామ్రాజ్యపు ఔన్నత్యం, శాంతి, సుస్థిరతల ప్రతిష్ఠాపన. దేవాసురుల మధ్య అనాదిగా సాగుతున్న ఘర్షణ ఇది. కాకపోతే దీన్ని మానవజీవన రూపంలో ప్రతిబింబించింది మహాభారతం.

కవి కావ్యశిల్ప కౌశలం:

ఈ ద్వయరూపావిష్కరణలోనూ, వైయక్తిక, జాతీయజీవన గమనాన్ని మొదట నేపథ్యంగా, తర్వాత రాజ్యాలు, జాతులు, సైన్యాల గమనంగా మన ముందుకు తెచ్చి చిత్రీకరించడంలోనూ ఒక అద్భుత కావ్యశిల్ప నిర్మాణదక్షత కనిపిస్తుంది – ఆసాంతం ఒక బృహత్ కావ్యశిల్పం, విహంగవీక్షణం. అనంత లోకాలను సమగ్ర దృక్పథంతో స్పృశించడంలో అదే ప్రతిభ, వాటిని సూక్ష్మము, నిర్దుష్టము, ప్రభావవంతమైన ప్రధాన వివరాల బాహుళ్యంతో నింపడంలోనూ అదే ధోరణి కనిపిస్తుంది. ఇతిహాస సంప్రదాయానుగుణంగా ప్రధాన ఇతివృత్తంలోకి ఎన్నో విశేష ఉపాఖ్యానాలు, కథలు, కల్పితగాథలు, సంఘటనల అల్లిక కనిపిస్తుంది. ఉపనిషత్తుల, తత్త్వవేత్తల భావాలను మధ్య మధ్యలో స్పృశిస్తూ, భగవద్గీతలోవలె నూతన వ్యాఖ్యానాలను సమకూరుస్తూ సాగుతుంది; మతగాథలు, పురాణగాథలు, భావాలు, బోధనలు ఇందులో భాగాలే. ఇందులో జాతి నైతిక ఆదర్శాలు కథలు, సంఘటనల రూపంలోను, పాత్రల రూపంలోను మలచబడ్డాయి. అదే విధంగా రాజకీయ, సామాజిక సంస్థలను, ఆదర్శాలను అత్యంత నిర్దుష్టంగా, వివరంగా ఉదహరించడం జరిగింది. ప్రజాజీవనానికి సంబంధించిన సౌందర్యపరమైన, తదితరమైన సూచనలూ కనిపిస్తాయి. ఇవన్నీ అసాధారణ ప్రతిభతో, సాన్నిహిత్యంతో ఇతిహాస ఇతివృత్తంలో చోటుచేసుకున్నాయి. ఈ విధంగా మలచిన సంక్లిష్ట, బృహత్ ప్రణాలికలో, ఎందరో అసాధారణ ప్రతిభాసంపన్నులైన కవుల సంయుక్త రచనల్లో కొన్ని అవకతవకలు (దోషాలు)

దొర్లడం సహజమే. అయితే అవి కావ్య సమగ్రభావనకు దోహదం చేసేవేకాని, భంగపరచేవి కావు. భారతగాథంతా ఒక ప్రజావని ఆత్మ, ఆలోచన, జీవన సమగ్రతకు విశిష్టమైన, సంపూర్ణమైన కావ్యాభివ్యక్తి.

అనువాదం: ఆచార్య యం. రాజగోపాలాచార్య

(*SABCL* Vol. 14, pp. 286-88)

రామాయణమొక రసాత్మక సృష్టి

రామాయణ మహాభారతాలు సారాంశతః ఒకటే. కాని కథానిర్మాణంలోని సారళ్యం, సుకుమార ఆదర్శ భావన అప్పుడే విచ్చిన ఇంకా మంచు కరిగిపోని తామరమొగ్గ నిత్య నూత్నత్వం, అందులో ప్రతిబింబించిన సప్తరశ్మి ధాళధళ్యం – రామాయణం. కావ్యమంతా ఒకే హస్తం నుండి జాల్వారిన దివ్య గంగావాహిని, అసంకీర్ణ సృష్టి, కథానిర్మాణంలో ఏక సూత్రత. కథలో తత్త్వ విచారణ భారం లేదు. అంతా కవితాసౌందర్యమే. కళామయ పురుషుడున్నట్లు – నిర్మాత లేడు. ఆసాంతమొకే ఖండం. దాని నుండి మలుపులు తిరగడం లేదు. అంతా అఖండవాహిని. ఐనా కావ్యం నిండా ఆకాశమంత దర్శన ప్రకాశం. ప్రత్యంగుళమూ ప్రతి సూక్ష్మాంశ చిత్రణలో శిల్పి ఉలి చెక్కుడు – పోహళింపు ఆశ్చర్యజనకంగా వుంటాయి. నిర్మాణంలో, భావనలో ఒక మహోత్సాహ విహాయసంలో సంతోష విహంగ చక్రవర్తి విశాల వక్షాలపై ఎగిరిపోతున్నట్లు. మహాభారత మిలా కాదు. నిర్మాణశక్తిలో, చెక్కడపు పనిలో, ఒక మహావాస్తుశిల్ప మనోజ్ఞమైన బృహద్దేవాలయం. రామాయణంలోని ఉదాత్తత, ఋజుత్వం, వర్ణసంపద సుసూక్ష్మాంశ చిత్రణలో భారతీయ చిత్రలేఖనం అక్షరబద్ధమైనట్లు తోస్తుంది.

వస్తువు:

ఇతిహాస కవి ఒక ఇతిహాస వస్తువును ప్రాచీనగాథ పూర్వ రాజర్షుల వంశకథలతో రంగరించి పౌరాణిక జానపదాంశాల సమ్మేళనంతో అపూర్వ నిర్మాణం చేసాడు. మహాభారతంలో లాగానే ఇక్కడ వస్తువు భౌమజీవనంలోని దివ్య-రాక్షస శక్తుల క్రీడ. మానవజీవితంలోని ఈ రెంటినీ ఉన్నతీకరించి ఆదర్శ భావాలతో పాత్రలను సజీవ ప్రతిమలుగా మలిచి అతిమానుష వాతావరణంలో చిత్రించాడు. ఒక ప్రక్క ఆదర్శ మానవసృష్టి, దివ్యసౌందర్యంతో వెలిగిపోతూ, నైతిక మర్యాదాబద్ధమైనట్లుగా, ధర్మేతిహాసంగా ఒక నాగరికతా ప్రపంచం ఆవిర్భవించినట్లుంటూ అంతా రసస్నిగ్ధంగా, సమతా మాధుర్యోపేతంగా కన్పిస్తే మరొక ప్రక్క, అతి మానుషాహంకారంతో క్రూరంగా, నిరంకుశంగా, కన్పించే రాక్షస ప్రపంచం. మానవమనస్సులోని ఈ వెలుగునీడల క్రీడాప్రదర్శన, రాక్షస అధర్మ ప్రపంచం పైన దివ్యమానవ విజయాన్ని స్థాపించటం – ఫలితంగా వచ్చిన మహాకావ్యం రామాయణం. ఈ ఏకభావ సాధనకై సంకీర్ణత లుప్తమైపోయినది. ప్రతి పాత్ర ఒక భావ శిల్పమూర్తి, ఆర్ద్రతా స్పందనం. మానవమూర్తికి బద్ధమైనట్లు చిత్రించటం, ఆ రేఖను దాటిపోకుండా మలచటం – ఎంత అపూర్వసృష్టి!

రామాయణ వైశిష్ట్యం:

మహాకవి మానవజీవిత ప్రేరకశక్తులు మన చాటున వున్నాయనీ, వాటి శక్తియుక్తులను, ఇతిహాస సన్నివేశ నిర్మాణం ద్వారా ప్రదర్శిస్తాడు. రాజధాని మహానగరం, సముద్రం, కొండలు, జంతుజీవనవిధానం, సర్వాన్నీ మహాకాశమంత నేపథ్యంలో పెట్టి వర్ణించి మనలను అబ్బురపరుస్తాడు – సర్వ విశ్వమూ కవికి వస్తువైనట్లు. దేవాసురశక్తుల వెలుగునీడలను పాత్రల ద్వారా ప్రదర్శించటం, అతని భావనాకాశంలో చిత్రిత దృశ్యాలకు వ్యక్తీకృతులైన ఆకృతులు. భారతీయ నైతికజీవితం విధానసూత్రం

రసప్లావితంగా సమ్మిళితమై సమతా సంగీతాలాపనం చేయటం ఇతరత్ర కన్పించదు.

రామాయణం భారతీయుల సుకుమార స్పందనలకు నిలయం. మానవాదర్శాలకు గని. శక్తిధైర్యాలతో పాటు వినయ శీలసంపదలకు కాణాచి. ఒక ప్రక్క వీని సమరస చిత్రణ ద్వారా ఆత్మత్యాగాది భావన రసస్నిగ్ధంగా ప్రదర్శించటం, మరొక ప్రక్క సాధారణ జీవితసన్నివేశాల్లోని దివ్యత్వం కౌటుంబిక మధుర భావాలు, రాజ్య, ధర్మ నిర్వహణలోని రాజు బాధ్యతలు, విధులు, క్రిందివారి సేవాభావం – ఈ నైతికజీవితసూత్రాలు ముగ్ధమధు రంగా సాక్షాత్కరిస్తాయి. ఇవన్నీ ఆదర్శ ప్రకాశంతో దివ్యంగా మెరుస్తూ కన్పిస్తాయి.

భారతీయ సంస్కృతికి పునాది:

వాల్మీకి మహర్షి భారతీయ సంస్కృతీ చిత్రణలో అస మాన్య కవితాశక్తి కలవాడు. ఆ సంస్కృతీప్రకాశంలో భారతీయుల జీవనాన్ని పరిశుభ్ర స్నానం చేయిస్తాడు. సీతారాములు కావ్య నాయికానాయకులే కాదు. మన కాదర్శ దాంపత్యధర్మ ప్రబోధం చేసే దేవాలయంలోని దేవతలు. ఆ చిత్రణలో ఆదర్శంతో పాటుగా వాస్తవికతా వుంటుంది. ఇది లేకపోతే అవి కృత్రిమ అజీవ పాత్ర లుగానే మిగిలిపోయేవి. ఇందుకే నేటికీ మనకు వారు రామాయణ పాత్రలుగా కాక మనకు జీవితంలో ఆదర్శబోధకులైన ఆరాధ్య దైవాలుగా, గురువులుగా, మన రక్తములోని జీవకణాలుగా పరిణ మించారు. హనుమంతుడు కానీ, లక్ష్మణభరతశత్రుఘ్నులు గానీ సజీవ నీతిబోధక గురుమూర్తులు. జాతీయ జీవనస్రవంతిని ఋజు వుగా ప్రవహింప చేస్తున్న మనీషులు. వజ్రంకంటె కఠినమైన ధర్మా చరణకు, పుష్పంకంటె సుకుమారమైన స్నేహాదిభావాలకు వారు ప్రతిబింబాలుగా స్థిరపడి పోయినారు. ఈ జాతీయతా భాగీరథిని అవతరింపజేసిన మహర్షి వాల్మీకి.

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

(*CWSA* Vol. 20, pp. 349-51/*SABCL* Vol. 14, pp. 289-90)

రామాయణ మహాభారతాల్లోని కవితాశిల్పము

ప్రసన్న కవితాస్రవంతి

రామాయణ మహాభారత మహాకావ్యాల్లో వాల్మీకి, వ్యాసులుపయోగించిన కవితాశిల్పం వాటి ఇతివృత్త గాంభీర్యానికి ఏ మాత్రం తీసిపోదు. వారి శైలీ, ఛందోరీతులు ఆ ఉదాత్త కథలకు తగిన స్థాయిలో వున్నాయి. ఏమాత్రం అలంకారాల ఆడంబరత లేని వారి ప్రసన్న కవితాధార సుభగమూ సరళమూ. సూటిగా హృదయపు లోతుల నుండి పొంగివచ్చే వారి కవిత శబ్దశక్తికీ భావనాసౌందర్యానికీ ప్రతీక. ఈ మహాకావ్యాల్లో వారి కవిత కొన్ని చోట్ల ప్రచండ వేగంతో పరవళ్లు త్రొక్కుతుంది, కొన్ని చోట్ల మందగమనంతో మెల్లిగా నడుస్తుంది. అన్ని సందర్భాల లోనూ లయాత్మకమై మంద్ర మధురంగా సాగుతుంది. వ్యాస వాల్మీకుల ప్రవృత్తి భేదమే వారి కవితారీతుల్లో కూడా ప్రతిబింబిస్తుంది. వారిలో ఎవరి ప్రత్యేకత వారిది. మహాభారతం సందర్భశుద్ధి కలిగిన భావతీవ్రత, పదవిన్యాసవైఖరీ, నైష్ఠికమైన పురుషత్వ శక్తీ కలిగి అనాచ్ఛాదితమై స్పష్టతతో, దూసుకుని పోతూ, కవియొక్క మేధానైశిత్యానికీ, జవసత్త్వాలకూ ప్రతీకగా నిలుస్తుంది. చిత్తకాగ్రత చేత, తపస్సుచేత సిద్ధించిన శబ్దశక్తివలన అల్పాక్షరాలలో అనల్పార్థ వైభవాన్ని సృజించి పాఠకులను ఆశ్చ ర్యచకితుల్ని చేస్తాడు వ్యాసుడు. మహాభారతంలో కొన్ని ఘట్టాలూ, శ్లోకాలు వ్యాసఘట్టాలుగా పేర్కొనబడ్డాయి. (ఈ ఘట్టాలు దార్శనిక ప్రజ్ఞ కలిగిన వారికి తప్ప లొంగవు) ఇవి కొన్ని వున్నా వ్యాసుని శైలి బలుపులేని బలిష్టతకీ దృఢత్వానికీ ఆలవాలమై, అలుపూ సొలుపూ ఎరుగని పరుగు పందెగాని ఉత్సాహశక్తిని తలపింప జేస్తుంది. లక్షశ్లోకి అయిన మహాభారతంలో అన్ని ఘట్టాలూ ఒకే స్థాయిలో లేకపోయినా దిగజారుడు ధోరణి మచ్చుకైనా కన్పించదు. ఇది మహాభారతంయొక్క మహాత్తరమైన గుణాల్లో ఒకటి.

దివ్యావేశభరితమైన మేధస్సు

వాల్మీకి రామాయణంలో శబ్దాల కూర్పు అత్యద్భుతమై అనితర మాధురీ మహిమలో నిరుపమాన మంత్రశక్తితో విలసిల్లుతూ వుంటుంది. చేసిన ప్రతి వర్ణనా, దర్శింప జేసిన ప్రతి అంశమూ, చిత్రించిన ప్రతి భావమూ, చాలనం చేసిన మానసికోద్రేకమూ వాల్మీకి ఆత్మీయతా ముద్రతో స్పందిస్తూ వుంటుంది. వాటి వెనుక ఆ మహర్షియొక్క అతి సున్నితమైన ఆదర్శభావనా, దానిని పెంచి పోషించే ప్రాణంలాంటి నైతికశక్తి వున్నాయి. ఈ రెండు మహాకావ్యాలూ, వేదోపనిషత్తులను రచించిన దార్శనిక జ్ఞానము మనోమయకోశము వలన తెరమరుగైనప్పుడు దివ్యావేశం పొందిన ఉత్తమ మేధస్సుచేత ఉదాత్త కవితాత్మ ప్రచోదనంచేత సృజింప బడ్డాయి.

*

గెథే, షేక్స్పియర్, హోమర్ – వ్యాసుడు, వాల్మీకి

గెథేకు షేక్స్పియర్ కంటే లోతైన దార్శనిక నైశిత్యం వుంది. ఆయన మేధాశక్తి అపారమైనది. షేక్స్పియర్ కలలో కూడా ఎన్నడూ వూహించలేని లోతైన జీవిత సమస్యలను గెథే పరిష్కరించాడు. అయినా నిస్సందేహంగా షేక్స్పియర్ గెథేకంటే గొప్ప కవి. ఆయన షేక్స్పియర్‌కి సముడని అంగీకరించడానికి నేను సిద్ధంగా లేను. గెథే ఉన్నతమైన కవితాదృష్టి కలవాడైనా షేక్స్పియర్‌లోని కవితాశక్తినీ, మాటల కూర్పులోని మహిమనూ, అభివ్యక్తిలోని అనంత అర్థస్ఫూర్తినీ గంభీరశైలీ విన్యాసాన్నీ, సున్నితమైన లయాత్మకతనూ అందుకొనటం అసాధ్యం. షేక్స్పియర్ ఒక మహాకవి – అంతే ఆయన గురించి ఇంకేమీ చెప్పలేము. గెథే ఒక ఉదాత్త మానవుడు, మహామనీషి. ఉత్తమ శ్రేణి మేధావి. ఆయన తన సంకల్పం వలన కవిత్వం వ్రాయగలిగాడు. తన ఎన్నికవలన కవి కాగలిగాడు. ఏ విషయాన్ని ఎన్నుకున్నా దానిని ఆయన అదే స్థాయి నైపుణ్యంతో నిర్వహించ గలిగేవాడు. భాషయొక్క అంతస్సత్త్వాన్నీ, నాడినీ గ్రహించి కవిత్వం వ్రాశాడు.

ఆయన మేధాశక్తి నుండి పుట్టిన కవిత్వం దానిలోని ఒక భాగమే అయింది గానీ, ఆయన ఆత్మనుండి ప్రభవించిన జీవలక్షణాన్ని వ్యక్తంచేసే అభివ్యక్తి కాలేదు. అందువలన ఆయన కవిత్వంలో నిరుపమాన భావావేశం – అనివార్య సంభావ్యతా లోపించాయి. కొందరు కవుల్లో ఆ లక్షణాలు అనుక్షణం భాసించగా గెథేలో మటుకు మెరపుల్లాగా అప్పడప్పుడూ తళుక్కుమంటాయి.

హోమర్, షేక్స్పియర్ల కంటే గొప్ప కవి ప్రపంచంలో లేడని నేనన్నప్పుడు వారి అనన్య కవితాశక్తినీ, సృజనలోని సౌందర్యాన్నీ గురించి మాత్రమే ఆలోచిస్తున్నాను గానీ, వారి సృజనయొక్క విస్తృతిని గురించి నేను మాట్లాడటం లేదు. ఎందు కంటే వీరికంటే బృహత్తరమైన సృజనాత్మక విస్తృతి కలిగిన కవులున్నారు గనుక. ఈ దృష్టితో పరిశీలిస్తే వ్యాసుని మహా భారతం హోమర్ ఇలియడ్కంటె గొప్ప సృష్టి. వాల్మీకి రామా యణం హోమర్ ఒడిస్సీకంటె గొప్ప సృష్టి. హోమర్ రెండు కావ్యాలు కలిపినా, వాటికంటే మహాభారతమే పెద్దది. వ్యాస వాల్మీకుల సృష్టి, షేక్స్పియర్ సృజించిన ప్రపంచానికంటే విశా లమైనది: వారి గ్రంథాలలో వారు ఆవిష్కరించిన లోకాలు, భువ నభాండాలూ, షేక్స్పియర్ చిత్రించిన ప్రపంచానికంటే ఎంతో విశాలమైనవి, బృహత్తరమైనవి. రామాయణ మహాభారత మహా కావ్యాలు యావత్ బ్రహ్మాండ సృష్టిప్రణాలిక మీద నిర్మించబ డ్డాయి: సర్వజీవసృష్టీ వాటిల్లో వివరించబడింది – వాటిల్లో లేనిది ఎక్కడా లేదు. గ్రీకు కవి హోమర్కూ, ఎలిజబెతన్ ఇంగ్లాండుకు చెందిన షేక్స్పియర్కూ ఈ లోకాలోకనం సాధ్యం కాదు. అయినా వీరిద్దరూ వారి వారి భాషాకవిత్వ రీతుల్లో, వారి అభివ్యక్తిలో, దాని ద్వారా వ్యక్తం చేసే సౌందర్యభావనలో సిద్ధహస్తులు. వ్యాస వాల్మీకులు, హోమర్ షేక్స్పియర్లకంటె ఈ విషయంలో ఏమాత్రం తక్కువ కాకపోయినా, అధికులు మాత్రం కారు. వ్యాసుడి కావ్యం ఒకే కవి రచన కాదు, జాతి సామూహిక చేత నలో రూపుదాల్చిన కావ్యమే కదా అంటే హోమర్ కావ్యం కూడా అలాంటిదే అని సమాధానం.

సౌందర్యారాధన అనే భావప్రాతిపదిక మీద ఆధారపడి ఏ సాహిత్యంయొక్క గొప్పతనమూ వుండదు. అది సృజించిన జాతి యొక్క చైతన్యస్థాయిని బట్టి ఈ గొప్పతనం నిర్ణయింపబడుతుంది. ఇతివృత్త గౌరవాన్ని బట్టి కూడా గొప్పదనం నిర్ణయింపబడు తుంది. హోమర్ మానవసృష్టిలోని బాహ్యసౌందర్యాన్ని, దాని మీద ఆధారపడి ఏర్పడిన కార్యకలాపాల్నీ గురించి వర్ణించాడు. ఆయన వర్ణనల్లో అత్యద్భుత సౌందర్యదృష్టి వున్నది. అయితే ఆయన అక్కడే ఆగిపోయాడు. షేక్స్‌పియర్ ఇంకొంచెం ముందుకు వెళ్ళి, ఇంకో స్థాయి పైకి పోయి, మానవుడి అంతరంగాన్ని ప్రేరే పించి ప్రభావితం చేసే జీవశక్తులను దాని పర్యవసానంగా ఏర్పడే మానవుని జీవితపు విలువలనూ ఆవిష్కరించాడు. వీటిని హోమర్ చిత్రింపలేకపోయాడు. వ్యాసవాల్మీకులు ధర్మము, ఉదాత్త ఆద ర్శాలు మానవుని జీవితాన్ని, జీవితగమనాన్ని ఎలా నడిపిస్తాయో చిత్రించిన తీరు, హోమర్ షేక్స్‌పియర్లకు ఊహక్కూడా అందని విషయం. ఆదర్శాలకూ, భావదేవతలకూ (Idea forces) అతీతంగా వర్తించే అంతరంగపు లోతుల్లోని శక్తులకూ వెనుకనుండి, సర్వ జీవరాసులనూ నడిపించే పరమాత్మ దివ్యచైతన్యమూ, ప్రజ్ఞలూ – ఇవన్నీ కూడ వారి రచనలకు ఇతివృత్తాలైతే ఆ సృజన వీరి పూర్వ రచనలకంటె మానవాళిని గాఢంగా ప్రభావితం చేస్తుంది.

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

(*CWSA* Vol. 20, pp. 351-52/SABCL Vol. 14, pp. 290-91; *SABCL* Vol. 9, pp. 522-23; p. 334)

దైవాసుర ప్రతిరూపములు

మన పురాణాలు దేవదానవ యుద్ధాలకు పెట్టింది పేరు. రామాయణ మహాభారతములు ఈ కోవకు చెందినవే. ఎంతో పెద్ద ఎత్తున రచించిన బృహత్కథలు. ధర్మాధర్మాలకు జరిగిన సంఘర్షణలు. మానవజీవితాన్ని వెనుకనుండి శాసించే రహస్యశక్తులను గురించి మనకు ఏమీ తెలియదు గాని మన పూర్వీకులకు బాగా తెలుసు. ఆ శక్తులయొక్క మానవప్రతినిధుల మధ్య జరిగే నిరంతర సంఘర్షణయే ఈ ప్రాపంచిక జీవిత వైచిత్రి. దీనినంతా చక్కగా ఎంతో చాకచక్యంగా ఆవిష్కరించి చూపించారు మన ఆదికవులు. — *సంపాదకుడు*

సత్వరజోగుణ సంపన్నులు

సృష్టిలోని జీవులను కొంతవరకు రెండు వర్గాలుగా విభజించవచ్చును. జ్ఞానార్థులై, ఆత్మనియతి, దాతృత్వము, పరిపూర్ణత్వములతో శోభిల్లు సత్వగుణశీలుర వర్గమొకటి కాగా, అహంకార దర్పము, దేహేంద్రియ చాపల్యములతో పరితపించే రాజసికులు రెండవవర్గము వారు. స్వాభిమానధనులైన ఈ రజోగుణసంపన్నులు, సృష్టిలో ప్రతి నిత్యము తమ ఆలోచనలను, అభిప్రాయాలను జనజీవనంపై రుద్దుటకు ప్రయత్నిస్తారు. అయితే ఈ ప్రక్రియ వీరిలో పెల్లుబుకుతున్న అహంకారప్రవృత్తి, ఆధిక్యత, లౌకికానందముల ప్రకటనకే పరిమితము. మానవసేవ, మాధవసేవలకు ఈ రాజసికులు ఆమడ దూరము. ఈ ఉభయవర్గులు, సృష్టిలోని దైవాసుర ప్రవృత్తులకు సూచకమని గ్రహించవచ్చును. బహు పురాతనమైన ఈ దైవాసుర సంపత్తుల విశ్లేషణ, ఋగ్వేదంలో దేవదాస్య సంఘర్షణగా చిత్రింపబడినట్లు తెలుస్తున్నది; అనగా ఆద్యంతరహితులై, జ్ఞానకాంతులతో విరాజిల్లే దేవతామూర్తులకు, భేదభావంతో కొట్టుమిట్టాడే అజ్ఞానాంధకార రూపాల మధ్య నిత్యము జరుగు సంఘర్షణయే గాని మరొకటి కాదు.

దైవాసురుల సంఘర్షణ

ఈ ఉభయ తత్వాలు జీవుని అంతరంగమే వేదికగా చేసుకొని వానిని అత్యంత ప్రభావితం చేస్తున్నవి. ఈ తత్వవిచారము జొరాస్టరు మహాశయుని బోధలలోను, తరువాత వచ్చిన వాఙ్మయంలోనూ, మనము చూడవచ్చును. శ్రీమద్రామాయణం సచ్చరిత్రుల కథయని మనము గ్రహించవచ్చును. ఈ కథలోని ముఖ్య పాత్రధారులలో ఒకరు ఉన్నత సంస్కారము, సత్సంప్రదాయము, సనాతనధర్మములకు ప్రతీకయై మానవరూపంలో సంచరిస్తున్న దేవతాస్వరూపం కాగా, మరొకరు పశుబలంతో విర్రవీగే అహంకార ప్రవృత్తితో విజృంభించే రాక్షసస్వరూపంగా మనము చదువుకున్నాము. ఇక మహాభారత తత్వమున్నూ, జీవులలో దైవాసుర సంపత్తుల మధ్య నిత్య సంఘర్షణగా రూపుదిద్దుకొన్నట్లు మనకు తెలుస్తున్నది. ఈ పురాణగాథలో దైవసంపద ధర్మస్వరూపంగా భాసించే దైవాంశ సంభూతులు కాగా, స్వాభిమానధనులై కండబలము, పశుబలముల ప్రాబల్యమే పరమావధిగా తలచే అసురసంపదయని గ్రహించవచ్చును. మన ప్రాచీనులు సర్వవిషయములందు నిక్షిప్తమైయున్న అంతర్గత సత్యమునకై అన్వేషించి, సృష్టిలోని జీవులంతా దేవ, పాశవిక, మహాబల, భూతాదిశక్త్యంశల ప్రతిరూపాలైన దేవాసుర రాక్షస పైశాచికములుగా గుర్తించారు.

*

(బరోడాలో వున్నప్పుడు రాసినది)

మానవులలో దేవ దానవ ప్రతిరూపములు

వాల్మీకి మహర్షి జనబాహుళ్యానికి ఈ దైవాసుర ఉభయతత్వాలను శ్రీమద్రామాయణంలో అమోఘంగా చిత్రించారు. చారిత్రక పురుషులైన అక్బరుగాని, నెపోలియన్‌గాని రామరావణులతో సామ్యం ప్రకటించుకోవచ్చునేమోగాని సాధారణ ప్రజలకు అట్టి సంబంధము ఊహాతీతము. ఈ లోపాన్ని గుర్తించిన వ్యాసమహర్షి మానవరూపంలో వైరుధ్యంగల దైవ, దానవ ఉభయతత్వాలకు రూపకల్పన చేసి సామాన్యజనుల

నిత్యజీవితం ప్రతిబింబించారు. ఈ దైవాసుర సంపత్తుల విశ్లేషణ భారతీయ తత్వవిచారణలో ఒకానొక ప్రత్యేకతను సంతరించుకొన్నది. ఛాందోగ్యోపనిషత్తులోని ఇంద్ర, విరోచనుల గాథ ఇందుకొక చక్కని ఉదాహరణ. వీరుభయులు భగవత్తత్వ రహస్యం తమకు బోధింపమని దేవగురువైన బృహస్పతిని అర్థించగా, వారుభయులను తమ గృహములకు తిరిగి వెళ్ళి అద్దంలో తమ ప్రతిబింబాలను చూచుకొమ్మని బృహస్పతి ఆదేశించాడు. విరోచనుడు అద్దంలో తన ప్రతిబింబం చూచుకొని, తానే భగవత్స్వరూపమని మురిసిపోయి, ఆ భ్రమకు స్వీయారాధన తోడు కాగా, సృష్టిపై విజృంభించి అల్లకల్లోలం సృష్టించాడు. అయితే ఇంద్రుడు ఈ భ్రమకు లోనుగాక, బృహస్పతి బోధలో ఏదో తిరకాసున్నట్లు గ్రహించి, బృహస్పతిని తిరిగి ఆశ్రయించి, అసలైన సిసలైన భగవత్తత్వ రహస్యం గ్రహించినట్లు మనము చదువుకున్నాము.

బ్రహ్మజ్ఞానం

సర్వమూ భగవన్మయమేనని 'ఏకమేవా అద్వితీయం' గావటంచేత, తానుగూడ భగవత్స్వరూపమేనని ఇంద్రుడు గ్రహించి, తాను భగవత్స్వరూపమైతే, తన శత్రువున్నూ ఆ భగవత్స్వరూపమేనని తెలిసికొని, భగవత్తత్వంలో అనిత్యమైన భేదభావాది శత్రుత్వ భావనకు తావే లేదన్న పరమరహస్యం దర్శించాడు.

స్వధర్మ పరధర్మములు

భేదభావాత్మకమైన అసుర స్వరూపము సృష్టిలో తన ఆధిపత్యము, పెత్తనము కొనసాగించుటకు నిత్యము ఉవ్విళ్లూరుతుంది. ఈ అసురస్వభావం తన ఆశల పల్లకీలో ఉత్సాహంగా ఊరేగుతూనే కామాది, అరిషడ్వర్గముల తాకిడికి తట్టుకొనలేక – అస్సిలస్ (Aeschylus) మహాశయుడు ఊహించినట్లు న్యాయధర్మసూత్రాలను ప్రతిఘటింపలేక – ఒక్క ఉదుటన చతికిలబడతాడు. అయితే దైవతత్వ స్వరూపము, స్వస్వరూప జ్ఞానకాంతులతో ప్రకాశిస్తూ సృష్టిలో సర్వభూతహితముకై పాటుపడగలదు. ఇంద్రుడున్నూ కామ్యకర్మ, నిష్కామకర్మల అంతరమే పరిశీలిం

చాడని, స్వధర్మ, పరధర్మాది ప్రక్రియలను గాదని గ్రహించటం అవసరం. పరధర్మాభిలాషి స్వధర్మాపేక్షతోనే తన కర్తవ్యం నిర్వ హిస్తాడన్నది జగమెరిగిన సత్యము. ఈ జాడ్యము పాశ్చాత్య దేశాలలోని శ్రోత్రీయులకు, శిష్టులుగా వ్యవహరించబడుతున్న వారికిన్నీ అంటుకున్నది. అయితే సమ్యగ్భారతీయుని దృష్టిలో స్వార్థము, విశ్వశ్రేయస్సుతో ఐక్యమై, తరతమ భేదం పూర్తిగా అంతరించింది. స్వధర్మమునకు పరధర్మమునకు వ్యత్యాసము నశించటం గమనార్హం.

ఉభయధర్మముల రక్షణ

పుత్రధర్మాన్ని అనుసరించి రామచంద్రుని త్యాగనిరతి ప్రస్ఫుటం కాగా, రాజ్యమును త్యజించి నిస్సంకోచంగా అరణ్యమునకు పయనమై పోయాడు. అయితే ఈ శ్రీరామచంద్రుడే సీతాపహరణానంతరం ఈ విపత్కారుని బారి నుండి సీతాదేవిని రక్షించటమే భర్తృ ధర్మంగా తలచి, ఈ పాపకర్మలకు కారకుడైన రావణుని సంహరించటం క్షాత్రధర్మమని భావించాడు. ఈ ఉభయ ధర్మరక్షణలోను తన వంతు పాత్రను సమంగా పోషించిన ఘనత రామచంద్రునికి దక్కింది. స్వజన సంబంధమున్నప్పటికీ, ఋజుమార్గమెన్నటికీ రామచంద్రుడు వీడకపోవటం మనము గమనించాలి.

ఇక పాండవులున్నూ తమ పరువుప్రతిష్ఠలకు సంబంధించిన విషయముగా తలచి, మారుమాటాడక పరదేశవాసమునకై తరలి వెళ్లినట్లు మనము చదువుకున్నాము. అయితే కష్టకాలము అంతమొందగానే, సంధికై ప్రయత్నించినప్పటికీ, వారెన్నటికీ దుర్యోధనునకు దాసోహమనలేదు. అధర్మపాలన నుండి రాజ్యమును రక్షించటమే క్షాత్రధర్మంగా భావించారు. అయితే దుర్యోధనుని అధర్మపాలన బాధితులు ఈ పాండవులే కావటం విచిత్రం. ఒక చెంపదెబ్బకు మరో చెంపను అప్పగించమని బోధించే క్రైస్తవ, బౌద్ధమత బోధలు హాస్యాస్పదాలు. ఆచరణయోగ్యం కావు.

ఆచరణీయం కాని అహింసా వాదన

పాశ్చాత్యదేశాలలో క్రైస్తవమత బోధకులకు, భౌతికసుఖ మార్గులకు నడుస్తున నిత్యసంఘర్షణ, ప్రాపంచిక సుఖములవైపు మొగ్గు చూపుతున్నట్లు మనము గమనిస్తున్నాము. ఆచరణ యోగ్యమునకు నోచుకొనని ఈ బోధలు నోటిమాటగానే నిలిచిపోవటం మనము ఎరుగుదుము. ఈ చిత్ర పరిస్థితులలో కర్తవ్యం పరిశీలించుకొంటే స్వార్థరహిత నిష్కామ కర్మయే సర్వజనులు ఆచరించదగ్గ ధర్మసూత్రమని గ్రహించవచ్చును. ఒక చెంపదెబ్బకు మరో చెంప అప్పచెబితే అది నిస్సహాయత, నిస్సత్తువలకు సూచకము. చేవలేని వారికి మాత్రము తగును. వారికి మరో మార్గము లేదు. ఇతరులకు మాత్రం ఆత్మహత్యా సదృశం.

అనువాదం: శ్రీ శరణ్

(*CWSA* Vol. 19, pp. 469-70/ *SABCL* Vol. 13, pp. 454-55; Vol. 3, pp. 176-78)

జాతిజీవనంపై ప్రభావము

ప్రాచీన భారతమంతా వేదోపనిషద్భూత మనిన్నీ, జాతి అంతా మహాత్ముల దివ్యదర్శనజన్యమనిన్నీ గ్రహించనగును. అందలి అపురూప వాఙ్మాధుర్యముతో కూడుకొన్న ఈశ్వర సాక్షాత్కారము, సృష్టిలోని జీవనస్రవంతి, సౌందర్య ఆనందాదులు, సత్య అమృతత్వ దర్శనము, ఆత్మసాక్షాత్కారము, సృష్టిలోను, జీవునిలోను తచ్ఛక్తుల ఆవిర్భావము, జీవుని ఆత్మజ్ఞానప్రవృత్తి జాతి రక్తనాళాలలో స్రవించి అనేక విధములుగా అత్యంత ప్రభావితం చేస్తూ జనజీవనంలో కలిసిపోయినవి. జీవుని నిరంతర ఆధ్యాత్మిక ఔత్సుకతకు మూలసూత్రమై సాంస్కృతికపరంగా ఒక ప్రత్యేక మధురిమను సంతరించుకొన్నవి. రామాయణమహాభారతములు – వాటి యందు మనకు సాక్షాత్కరించే బహుసుందర

రూపాలు, మహాపురుషులు, సృష్టిలోని జీవన సౌందర్యమును సదాచార, ఆధ్యాత్మిక లక్ష్యాలను, ఆదర్శములను, జీవునియొక్క అవకాశాలను, అపాయాలను ఎలుగెత్తి చాటు ఇతర భిన్న, విభిన్న పాత్రలు, పాత్రధారులు, అందలి దేవదానవ తత్త్వాలు భారత జాతి జీవనవిధానాన్ని రూపొందించుటలో మత, సామాజిక వ్యవస్థల వలెనే ఒక ప్రముఖపాత్ర వహించాయి.

*

ఈ ఇతిహాసాలను ఏవో కట్టుకథలుగాను, జానపద గాథలుగాను పరిగణించటం అవివేకమే కాగలదు. వీటిలో నిత్యజీవితాన్ని బహు సుందరంగాను, అత్యంత ఆత్మీయంగా కళ్లకు కట్టినట్లుగా చిత్రించినట్లు గ్రహించవచ్చును. అలాగే అవి ఉత్తమ తత్త్వచింతనకు, సదాచార సహిత సౌందర్యోపాసనకు, సాంఘిక రాజకీయపరమైన ఆదర్శములకు, ఉన్నత సంస్కృతికి రూపకల్పన చేసినవి. నవ నవోన్మేషమై, అమేయమై, బహుముఖమైన శిల్పంతో కూడుకొని గ్రీకు భాషేతిహాసముల తత్త్వవిశ్లేషణను తలదన్ని, లాటిన్ ఇతిహాస సౌందర్యమున కతీతమై, బహు పటిష్టమై, జీవకళతో ఉట్టిపడుతూ నవ్యత తొణికిసలాడు భారతీయ ఇతిహాసములన్నీ జాతీయపరంగా, సాంస్కృతికపరంగా, ఒకానొక విశాలదృష్టితో రూపొందింపబడినవి. తరతమ భేదం లేకుండా సర్వజనులు వాటిని అందుకోవటమే వీటి లక్ష్యం. తరతరాలుగా ఈ ఇతిహాస వాఙ్మయం జనజీవనంలో వారి గతికి మార్గదర్శకమై ప్రముఖ పాత్ర వహించటమే భారతీయ సంస్కృతియొక్క ఔన్నత్యానికి, విశిష్టతకు తార్కాణమని గ్రహించటం అవసరం.

*

భారతజాతి దృష్టిలో సీతారాములు, అర్జున యుధిష్ఠరులు, భీష్మ దుర్యోధనులు, కర్ణుడు మొ॥ వారంతా జీవకళతో ఉట్టిపడుతున్న రూపాలని మరువరాదు. భారతీయ చిత్రకళలోవలె, ఇక్కడ గూడా బాహ్యాలక్షణాలకు తావు లేదు. వీటి అవసరం కేవలం రూపచిత్రీకరణకు మాత్రమే. ఈ బాహ్యరూపాన్ని అధిగమించి, ఆ రూప అంతరంగిక స్థితిని చక్కగా, నిర్దుష్టంగా చిత్రించటం అవసరము.

ఈ దృష్టితో పరికిస్తే సీతారాముల పాత్రలు నిర్జీవ ప్రతిమల వంటివి కావని తెలుస్తుంది. ఈ ఉభయ పాత్రల ఆదర్శ గుణం, ఆదర్శ జీవితప్రభలతో ఈ రూపాలు ప్రకాశిస్తూ, జీవుడు ఏనాటికైనా, ఉచ్ఛస్థితిని, ఉత్తమగతిని పొందగలడన్న వాస్తవాన్ని వెల్లడిస్తున్నాయి.

అనువాదం: శ్రీ శరణ్

(*SABCL* Vol. 9, p. 245; CWSA Vol. 20, p. 353/ SABCL Vol. 14, p. 293; CWSA Vol. 20, p. 353/ SABCL Vol. 14, pp. 292-93)

శ్రీరాముని అవతార తత్త్వము – I

అవతారత ప్రశ్న వస్తే, రాముడు ఒక అవతరామేనని నేనంగీకరిస్తాను; ఏలన అతడు పరిణామక్రమంలో[1] ఒక స్థానాన్ని ఆక్రమిస్తాడు. నా దృష్టిలో సరిగ్గా కూడ ఆక్రమిస్తాడు. అంతేగాక నేను

[1] మహావిష్ణువు ధరించిన దశావతారాలలో మొదటిది చేప. నీటిలో జీవశక్తి తొలి ఆవిర్భావానికి సంకేతం. అనంతర అవతారం కూర్మం. ఈ కొత్త జీవరూపం భూమి మీదకు కూడ వ్యాప్తి చెందడానికి అది సూచన. మూడవ అవతారం వరాహం. కొత్తగా శక్తి విడుదలకు సంకేతం. అటు పిమ్మట నరసింహావతారం వచ్చింది. మృగాన్నుండి మానవదశకు జీవశక్తి మార్పునకు ఆ అవతారం ప్రతీక. అనంతర అవతారం వామనుడు. ఈ అవతారం ప్రాచీన మానవదశకు చిహ్నం. మానవజాతి ఇంకా శైశవదశలోనే వుందని ఆయన శరీరపరిణామం సూచిస్తోంది. అటుపిమ్మట వచ్చింది పరశురామావతారం. ఆయన పూర్తిగా వృద్ధిచెందిన మానవరూపం మాత్రమే కాదు. బాహ్యాసంఘటనలను తన ప్రయోజనం కోసం తీర్చిదిద్దుకోగల సమర్థుడు కూడా. ఆ సామర్థ్యానికి, ప్రావీణ్యానికి సంకేతమే పరశువు (గొడ్డలి). అనంతర అవతారం శ్రీరాముడు. పరశురాముడు వుండగా రాముని అవతరారం వుంది. పరశురాముడు తన శక్తుల్ని శ్రీరామునికి ధారాదత్తం చేయడం ఇక్కడ విశేషం. భౌతిక, ప్రాణికశక్తులకన్నా నైతికశక్తి ఉత్కృష్టమైనదని ఈ సంఘటన ఋజువు చేస్తున్నది. ఎనిమదవ అవతారం శ్రీకృష్ణ భగవానుడు. ఆధ్యాత్మిక వివేక ప్రాభవానికి ఆయన ప్రతీక. ఇంతవరకు పరిణామ క్రమానికి అవతారాలు తోడ్పడుతూ వచ్చాయి. శ్రీకృష్ణుని అనంతరం బుద్ధుడు వచ్చాడు. పరిణామంతో ఎటువంటి సంబంధం లేకుండా దాని నుండి ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్న ఆత్మలకు (అది ఎరుకతో కూడిన అభిమతం) విముక్తి (నిర్వాణ) మార్గాన్ని ఆ అవతారం చూపించింది. చివరికి కల్కి యుగం రానున్నది. భవిష్యత్తును స్పష్టంగా ఆవిష్కరించే పురాణకథ ఇది ఒక్కటే. ప్రపంచ పురాణకథలలో మరెక్కడా ఇటువంటిది లేదు. మానవచైతన్యకుహరంలో యింకా మిగిలివున్న పాశవికశక్తుల అవశేషాలను కల్కి నశింపజేసి, విజ్ఞానమయ దేవమానవజాతి ఆవిర్భావానికి మార్గం సుగమం చేస్తాడు.

(మనోజ్‌దాస్ రచనల నుండి)

రామాయణం చదివినపుడు, నేను గుర్తించగల ఒక గొప్ప స్ఫూర్తి నాకు కలుగుతుంది; రామాయణం పైకి ఓ కట్టుకథగా కన్పించినా, అది పార్థివ పరిణామమందు సంభవించిన ఒక మహత్తర నిర్ణాయక సంక్రమణాత్మక ఘటనయొక్క ఒక దృష్టాంతర కథ అని ఆ స్ఫూర్తి నాకు చెపుతుంది; అంతేకాక ఈ స్ఫూర్తి ప్రధానపాత్ర యొక్క వ్యక్తిత్వానికి, క్రియకు విశాల విశ్వ ప్రకారాన్ని తెలిపే ఒక ఆంతర్యాన్ని కట్టబెడుతుంది – ఆ క్రియలే మరొకని చేత మరొక ఘటనా సందర్భమందు చేయబడి ఉంటే, వాటికి ఆ ఆంతర్యం (significance) ఉండదు. అవతారం అసాధారణకృత్యాలు చేయవలసిన విధి లేదు, కాని తాను చేసే కృత్యాలకు లేక కర్మలకు లేక తన అవతారతకు – వీటిలో ఒకదానికి గాని, అన్నింటికిగాని – ఒక అర్థాన్ని, ఒక సుసమర్థ శక్తిని ఇవ్వవలసిన విధి అతనికి ఉంది; కాగా ఈ అర్థమూ, ఈ శక్తీ పృథివి మరియు దాని జాతుల చరిత్రలో చేయబడవలసిన ఒక ఆవశ్యక కార్యంలో అంతర్భాగంగా ఉండాలి.

అయినా ఎవరైనా రాముని నేను చూచినట్లు చూడకపోతే, రాముని తన స్థానం నుంచి త్రోసివేయ దలంచితే, నా కభ్యంతరము లేదు, రాముని పట్ల నాకు ప్రత్యేక పక్షపాతమేమీ లేదు; కాని అలా త్రోసివేసినపుడు, ఆయన స్థానాన్ని నింపగల ఒక యోగ్యుని త్రోసివేసినవారు చూపాలి. వాల్మీకి రాముడు లేక మరొక రాముడు లేక రాముడు కాని మరొకడు ఆ స్థానంలో ఉండాలి.

*

అవతార పురుషుడు విధిగా ఆధ్యాత్మిక ప్రవక్త కానవసరం లేదు. పరిణామమందు ఆధ్యాత్మిక దశను స్థాపించడం రాముని పని కానే కాదు; కావున ఆయన దానితో సంబంధం పెట్టుకోలేదు. రావణవినాశం గావించి, రామరాజ్యం స్థాపించడమే ఆయన కార్యం – వేరు మాటల్లో, భవిష్యత్తు నిమిత్తం సాత్త్వికి నాగరిక మానవునికి అనురూపమైన వ్యవస్థయొక్క సంభవతకు ఆయన పునాది వేయాలి – సాత్త్విక మానవుడంటే, తన జీవితాన్ని హేతుబుద్ధి

చేత, సూక్ష్మభావములచేత, నైతికతచేత నడుపుకొనేవాడు. లేక కనీసం సత్యం, విధేయత, సహకారం, సామరస్యం, కుటుంబగత మరియు సార్వజనీన వ్యవస్థను కోరే భావం వంటి ఆదర్శాలచేత తన జీవితాన్ని పాలించుకునేవాడు. ఇక ఈ రామరాజ్యాన్ని ఆయన ఏ పరిస్థితుల్లో స్థాపించాలి? ఏది ఇంకా అరాజకశక్తుల చేతన ఆక్రాంతమై ఉందో, అనగా దేని నింకా పశు-మనస్సు శాసించుతుందో, దేని నింకా, తన స్వీయతృప్తినే తన జీవన నియమం గావించుకునే ప్రాణిక అహంకారం పీడించుతుందో – వేరు మాటల్లో దేని నింకా వానరుడు, రాక్షసుడు శాసించుతు న్నారో, అట్టి ప్రపంచమందు రాముడు రామరాజ్యం స్థాపించాలి. ఇదే రామునికీ, రాముని జీవితకార్యానికీ అర్థం; ఇక ఈ అర్థాన్ని ఆయన సాధించితే అవతారం, లేకపోతే కాదు – అని నిర్ణయిం చాలి.

జ్ఞానశూన్యమైన భయంకర పశువే వాలి. అతనితో ధర్మ నిబద్ధ క్షత్రియునివలె సుఖాంతముగా వ్యవహరించవలసిన పని రామునికి లేదు. అతడిని చంపివేసి, పశు ప్రపంచాన్ని అదుపులో నికి తేవడమే రాముని పని. పరిపూర్ణ మానవుడుగా తప్పక వ్యవ హరించవలసిన పని ఆయనకు లేదు. సాత్త్విక మానవునికి ఎక్కువగా ప్రాతినిధ్యం వహించడమే ఆయన పని – అనగా ఆయన నమ్మదగిన భర్తగాను, ప్రేమికుడిగాను ఉండాలి; అను రక్త, విధేయ పుత్రుడుగా వుండాలి; కోమల, పరిపూర్ణ సోదరుడు, తండ్రి, మిత్రుడుగా వుండాలి. ఆయన సర్వవిధ మానవులకు మిత్రుడు – కులంలేని గుహునికి మిత్రుడు, పశుజాతి నాయకు లైన సుగ్రీవ, హనుమంతులకు మిత్రుడు, రాబందు జటాయువు లకు మిత్రుడు, చివరికి రాక్షస విభీషణునికి సైతం మిత్రుడు. పైగా ఈ గుణాలన్నీ ఆకర్షక, భాసుర రూపంలో, విశేషించి సహజ, అనివార్య రూపంలో లేవు. రామునిలోని ఈ గుణాలకు ఒక సామరస్య పూర్ణ సంపూర్ణత వుంది. రామునిలో ఈ గుణాలన్నీ వున్నప్పటికీ, ముఖ్యంగా ఆయన చేసిన కార్యమిది; వేటిమీద సామాజిక భావం, దాని స్థిరత ఆధారపడతాయో, ఆ సత్య గౌర

వాలకు, సామాజిక స్పృహరూప ధర్మానికి, వ్యవస్థాభావానికి రూపమిచ్చి వాటిని స్థాపించాడు. తన తండ్రిపట్ల తనకుగల ప్రేమకు, విధేయతకు కంటె కూడ ఎక్కువగా సత్యగౌరవాలకు, రాజుచేత, రాజసభచేత యువరాజుగా ఎన్నుకోబడిన రాముడు తన అధికారాలను త్యాగం చేశాడు. తన జీవితంలో పద్నాలుగు ఉత్తమ సంవత్సరాలను త్యాగం చేశాడు, చేసి అరణ్యాలలో నివసించాడు. తర్వాత ఆయన తన సామజిక స్పృహకు, సామాజిక వ్యవస్థను గురించిన తన భావానికి తన స్వీయసౌఖ్యాన్ని తన గృహస్థ జీవితాన్ని, సీత సౌఖ్యాన్ని ఆహుతి చేశాడు – ఈ సామాజిక స్పృహ, ఈ సామాజిక వ్యవస్థా భావమే ప్రాచీన భారతీయులు, గ్రీకులు, రోమనుల దృష్టిలో గొప్పదైన ఒక పరమ పౌరధర్మం; ఏలన ఆ ప్రాచీనకాలమందు వ్యక్తియొక్క పృథగ్భూత అభివృద్ధి, సంతృప్తిగాక, వ్యవస్థాబద్ధమైన సమాజ నిర్వహణమే అపరిహార్య ఆవశ్యకత.

ఈ విషయమందు రాముడు సర్వ ప్రాచీన జాతుల నైతిక భావంతోను ఏకీభవిస్తాడు. ఆధునిక మానవుని అర్వాచీన విచిత్ర వైయక్తిక భావుక నైతికతనుండి భేదిస్తాడు. ఆధునిక మానవుడు అంత కఠోరముకాని ఈ నైతికతతో కాలం గడుపుకోగలడు. ఏలన ప్రాచీనులు ప్రపంచానికి సామాజిక వ్యవస్థాతత్త్వాన్ని భద్రపరచడానికి వ్యక్తిని బలిపెట్టారు. చివరకు, రావణుని సార్వభౌమతను, రాక్షసుల ఉపద్రవాన్ని నాశనం గావించి, సాత్త్విక మానవుని ఆదర్శానికి ప్రపంచమందు భద్రత కల్పించడం శ్రీరాముని కర్తవ్యం. దీని నంతటినీ ఆయన తన వ్యక్తిత్వమందలి ఒక దివ్యస్ఫూర్తితో నిర్వర్తించాడు. తన క్రియయందలి ఒక దివ్య స్ఫూర్తితో సాధించాడు. అందుచేతనే ఆయన ఆకృతి భారతీయ సంస్కృతి మనోఫలకమందు ముద్రితమై రెండువేల సంవత్సరాలకు పైగా విరాజిల్లింది. అలాగే ఆయన ఆదర్శం సమస్తదేశాలందు హేతుబుద్ధిపైన, ఆదర్శ స్థాపక మనస్సుపైన ఆధిపత్యం వహించింది. అంతేకాక మానవుని ప్రాణమయతత్వం, సదా తిరుగుబాటు చేస్తూ

వున్నా, ఒక అధికతర ఆదర్శం ఉదయించేవరకు రాముని ఆదర్శం అలా కొనసాగుతూనే వుంటుంది, అదే సంభవం.

రామునియందు ఇవి అన్నీ వున్నప్పటికీ, ఆయన అవతారం కాదని నీవంటున్నావు? సరే – కాని ఎలా చూచినా, ఆయన కొద్దిమంది మహత్తమ విభూతులలో ఒకరు. నీవు ఆయననిపుడు గద్దె దించవచ్చు – ఏలన మానవుడిక ఏమాత్రం సాత్త్విక ఆదర్శంతో తృప్తిజెందడు. కాని ఆయన కార్యం, ఆయనకు గల అర్థం పృథ్వియందలి పరిణామశీలజాతియొక్క గతంపైన ముద్రితమై నిలిచి వున్నాయి. ఆయన లేకపోతే ఏర్పడే ఖాళీని (gap) గురించి నేను ప్రస్తావించినపుడు అది ప్రవక్తలు, మేధావుల పరంపరలో ఏర్పడే ఖాళీ అని నా అర్థం కాదు, కింతు అది అవతారపరంపరలో ఏర్పడే ఖాళీ. ఎలా కృష్ణుడు అధిమానస అతిమానవ అవతారమో, అలాగే సాత్త్విక మానవ అవతారమైన ఒకడు గతంలో వుండాలి గనుక వున్నాడు. అయితే రాముడు తప్ప ఆ స్థానం అధిష్ఠించగలవాడు మరొకడు నాకు కన్పించడం లేదు. ఆధ్యాత్మిక గురువులు, ప్రవక్తలు (అలాగే మేధావులు, వైజ్ఞానికులు, కళాకారులు, కవులు మున్నగువారు) – వీరు అత్యధికం విభూతులు, అవతారా లేమాత్రం కారు. ఒకవేళ అయితే, అపుడు మతస్థాపకులంతా అవతారాలే గావాలి – క్రీస్తు, చైతన్యుడు, లేక రామకృష్ణుని వలె మార్మనుల మూలపురుషుడు జోసెఫ్ స్మిత్ (ఆయన పేరు అదే అనుకుంటాను) సెయింట్ ఫ్రాన్సిస్, కాల్విన్, లయోలా, అలాగే పెద్ద సంఖ్యలో ఇతరులు వీరందరూ అవతారాలే గావాలి. ఈ సారికి రాముని గురించి ఇంత మాత్రమే చెప్పదలంచాను, చెప్పాను. కాని ఇది సైతం ఒక సూచన మాత్రమే, అవతారతత్వంయొక్క సామాన్య తత్త్వం గురించి నేను వ్రాయదలంచింది ఈ మాత్రమే కాదు.

ఇక నేను రాముని గురించి వ్రాసింది ఆయనయొక్క సంపూర్ణ సమున్నత సమర్థన కూడ కాదు. అందు నిమిత్తం రామాయణ కథకు అర్థమేమిటో ముందు వ్రాయాలి. వాల్మీకి తన ప్రధాన పాత్రలను ఎలా ప్రదర్శించాడో గమనించాలి. (ఈ

పాత్రల్లో ఎవరూ కూడ కాపీ పుస్తకంలోని ఆదర్శ దృష్టాంతాలు కారు. వీరు మానవప్రకృతికి సహజమైన గుణాలు, దోషాలు గూడ గల గొప్ప స్త్రీపురుషులు; అందరూ, ఉత్తమ మానవులు సైతం అలాంటివారే). అంతేకాక, దేనిని మనం రాముడంటు న్నామో, ఆ అగ్రస్థిత, ఉపకరణాత్మక వ్యక్తిత్వం వెనుక వున్న భగవత్తత్త్వం రాముని జీవితమందలి ప్రతి పనిని ఎలా రూపొం దించిందో, ఈ ప్రతి పని అవతారం చేయవలసిన కార్యంలో ఒక ఆవశ్యక అడుగు ఎలా అయిందో, నేను ముందు చూపించాలి.

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి); కె. యజ్ఞన్న

(*SABCL* Vol. 22, pp. 414-17)

శ్రీరాముని అవతార తత్త్వము – II

రాముడిని పూర్తిగా సమర్థించే ఉద్దేశం నాకు లేదు – రాముడిని సాధారణ మానవులలో ఒక గొప్పవ్యక్తిగా లెక్కకట్టి ఆయన్ని అవమానించడానికి వాలికి సంబంధించిన సంఘటనలని వుప యోగిస్తున్నారు కాబట్టే వాలి విషయం ప్రస్తావించాను. అంతే కానీ అవతార పురుషుల ప్రసక్తి వస్తే మాత్రం రాముడిని ఈ ఆధునిక యుగధర్మాల ప్రకారం పూర్తి నీతిమంతుడని సమర్థిం చను. నెపోలియన్‌ని కానీ, సీజర్‌ని కానీ వారి విమర్శకులనించి రక్షించి విభూతులుగా ఎలా చెప్పానో, రాముడి విషయమూ అంతే. విభూతి, అవతారం అనే పదాల అర్థం, పరిధి వేరు. సాధా రణ మానవస్థాయికి వర్తించే – నీతి, అవినీతి, సంపూర్ణత్వం, అసంపూర్ణత్వం మనుషులకి మార్గదర్శకంగా వుండటం, కొత్త ప్రవర్తన, కొత్త ఆధ్యాత్మిక బోధలు – ఇవన్నీ రాముడిలాంటి వారు చెయ్యవచ్చు, చెయ్యకపోవచ్చు. కానీ వీరి వ్యక్తిత్వంలో ఇవి ముఖ్యభాగాలు కావు.

అంతేకాదు, మీరు రాముని వ్యక్తిత్వంలోని మానవుడిని ఎత్తి చూపడం కూడా సబబు కాదు. రాముడనే నాయకుడి పాత్ర ప్రాముఖ్యతనీ, అతడి పనులన్నిటినీ వాల్మీకి వర్ణించిన సందర్భంలోనే చూడాలి గాని, ఈ ఆధునికతరం వానిగా చూడకూడదు. వాల్మీకి వర్ణించిన సందర్భంలోంచి బయటికి లాగి, ఈ నాటి నైతిక విలువల భూతద్దంలోంచి చూస్తే, ఆ పాత్ర ప్రాముఖ్యతే వుండదు. అలా చూస్తే, రాముడు యుద్ధంలో రాణించినట్టే, కృష్ణుడు రాజకీయాల్లో రాణించినా, ఒక జిత్తులమారి స్త్రీలోలుడుగానే కనిపిస్తాడు. అలాగే, గ్రీకు పురాణాలలోనూ, మహాకావ్యాలలోనూ వున్న ఎకిల్లిస్‌నీ, ఒడిసీయస్‌నీ వారి వారి దేశకాల పరిస్థితుల నుంచి బయటికి లాగేసి చూస్తే, ఒకరు పూర్తి అహంకారిగా, అనాగరికంగా, ఇంకొకరు క్రూరమైన జిత్తుల కుసంస్కారిగా వుంటారు. మహాభారత, రామాయాణాల్లోనూ, ఇలియడ్ మహాకావ్యంలోనూ వున్న నాయకుల వ్యక్తిత్వాలగురించీ, చేతల గురించీ తెలుసుకోవడానికి ఆయా రచనలనాటి విధానాలు, వాతావరణం, కాలమాన పరిస్థితుల పూర్తి అవగాహన నాకు (ఎవరికైనా) అవసరమనుకుంటాను.

మరొక విషయమేమిటంటే, నాకిప్పుడు వాదించే సమయం లేకపోయినా, మీరు రాముని గురించి చేసిన చెదురు మదురు విమర్శలతో కూడా నేను ఏకీభవించను. వాలి వధ గురించి, సీతాదేవిని అరణ్యానికి పంపడం గురించి వాలి రాముడిని విమర్శించినా, రాముడి బంధువుల అభిప్రాయాలేమయినా, నేను సనాతనధర్మ దృష్ట్యా రాముడిని సమర్థిస్తాను. పైగా, నైతిక విలువలేమీ శాశ్వతం కావు, తరతరానికీ మారతాయి కనుక వాటి ఆధారంగా నేను రాముడిని విమర్శించను.

*

రాముడిని గురించి నీ విమర్శలు ఆశ్చర్యకరంగా వున్నాయి. వాల్మీకి రాముడిని పిరికివాడిగా నిందించే అవకాశం లేదు. క్షత్రియ లక్షణాలతో మహాయోధగా పొగడబడే రాముడిని భారతదేశంలోని క్షత్రియవంశాలు తమ దేవుడిగా కొలుస్తాయి. ప్రతి అడుగునా

వాల్మీకి శ్రీరాముడిని వీరుడిగా, యోధగానే చిత్రించాడు. వాలి లాంటి (infrahuman) పశుసమానుడిని యుద్ధంలో యుక్తి (ruse)తో, మోసంతో గెలిచినంత మాత్రాన అతని వ్యక్తిత్వానికది భంగం కాదు. పైగా, పెద్దపెద్ద యోధులూ, వేటగాళ్లూ కూడా పశుసమానుల (infrahuman) పట్ల ఇలాగే ప్రవర్తిస్తూ వచ్చారు. వాల్మీకి రాముడిని బెంగాలీ వాళ్ల దృష్టిలో ఇలా కించపరిచింది బహుశా మధుసూదన్ అయివుండవచ్చు. మధుసూదన్ వర్ణించిన రాముడు ఒక కీలుబొమ్మ. ఇతను వాల్మీకి రామాయణ మహా కావ్య నాయకుడు కానే కాడు – అవతారమా కాదా అన్నది వేరే విషయం. ఇంక సాంప్రదాయబద్ధ నైతికవిలువల విషయమైతే – అన్ని నీతులూ సాంప్రదాయబద్ధాలే. మనిషి మనసుకీ, బుద్ధికీ సాంప్రదాయాలనే ఆధారం లేకపోతే ప్రాణికప్రకృతిలోని (vital nature) అనంతమైన విధ్వంసక శక్తుల ధాటికి మనిషి తట్టుకోలేడు. సంఘానికి మార్పులు సూచించే బెర్ట్రెండ్ రస్సెల్ లయినా, బెర్నార్డ్‌షాలయినా వాళ్లకి నచ్చని పాత సంప్రదాయాలని తీసేసి, ఆ స్థానంలో ఇంకో కొత్త సంప్రదాయాన్ని ప్రవేశపెడతారంతే. మనోతీతస్థాయి కెదిగితేనే సాంప్రదాయాల సంకెళ్లనించి దాటిపోగలం. శ్రీకృష్ణుడు సాధారణ మనుషుల జ్ఞాన, అవగాహనాపరిధి దాటిన overmental స్థాయివాడు కాబట్టే సాంప్రదాయాల సంకెళ్లకి అతీతంగా వున్నాడు. రాముడు అటువంటి వాడు కాదు. సాత్వికబుద్ధి, నైతికవిలువలకి సంబంధించినంత వరకు, రాముడు దేశకాల ధర్మాలనే అనుసరించాడు.

*

రాముని గూర్చి మీకు పూర్తి వివరాలతో సమాధానం ఇచ్చేందుకు సమయం లేదు. కానీ, మీ ఆశ్చర్యానికి కారణం, మీరు అతడిని విమర్శించడానికి కారణం, (శ్రీ సీలే, బంకిములు ప్రవేశపెట్టిన) ఈనాటి కొలమానాలైన నైతిక, ఆధ్యాత్మిక విలువలతో రాముడిని కొలవడం. నేను మాత్రం రాముడిని దీనికి పూర్తిగా భిన్నకోణం నించే చూస్తాను, సమర్థిస్తాను. ప్రాచీన అవతారాలలో (గతంలోని అవతారాలలో) కేవలం బుద్ధుడే పరిపూర్ణుడిగా,

ఆధ్యాత్మిక ప్రవక్తల స్థాయిలో నిలుస్తాడు. భగవద్గీత బోధించిన శ్రీకృష్ణుడికి కూడా, ఆ బోధించే కొద్దిసేపూ వున్న (Supramental consciousness) దివ్యజాగృతి అది పూర్తికాగానే పోయింది. వీళ్లందరూ విశ్వమానవ ప్రతినిధులు. క్రమపరిణామం లోని కొన్ని దశలలో మానవజాతికి ఈ భూమి మీద అవసర మైన దైవిక (intervention) సహాయానికి, చేయూతకి వీరు ఉప యోగపడ్డారనే నా అభిప్రాయాన్ని మార్చుకోను.

*

రాముడికి కామము, ప్రేమ ఎందుకు వుండకూడదు? ప్రాచీన భారతదేశం భార్యాభర్తల మధ్య వాటిని ఆమోదించింది. విరహం లోని రాముడి ప్రవర్తన, వాల్మీకి, కాళిదాసుల్లాంటి మహాకవుల చిత్రీకరణ అయివుండ వచ్చును. ఒక ప్రేమికుడు వియోగం చెంది నప్పుడు ఎలా ప్రవర్తిస్తాడని వారు వూహించారో, అలా వర్ణిం చారు. వాస్తవంలో రాముడలా చేశాడా లేదా అన్నది వేరే విషయం.

*

రాముడి దుఃఖం గురించి ఇంతకు ముందే నా ఉత్తరంలో రాశాను. నార్స్ దేశాలలో భావాలని తీవ్రంగా అణచుకోవడం సుగుణంగా పరిగణించారుగానీ, దక్షిణాన భావాలని వ్యక్తం చేయడమే సుగుణం. నార్స్ జాతిస్వభావాల కొలమానాలతో రాముడిని కొలవవద్దు. ప్రేమికులుగా పర్షియా, భారతదేశాల కావ్యనాయకు లైన ఎకిల్లిస్, యులీసిస్ లాంటి వాళ్ల శోకాలు, విరహావస్థల వర్ణ నలు చూస్తే, మీకే తెలుస్తుంది.

*

శ్రీరాముని కన్న శ్రీకష్ణుని పట్ల నీకు ఆకర్షణ, ఇష్టం కలగడానికి అసలు కారణం మతపరమైనది కాదు. అది మానసికమైనది. ఉత్తరభారతావనిలోని వ్యక్తులలో మానసిక, నైతిక, సామాజిక వ్యక్తిత్వం కనిపిస్తుంది. అటువంటి వ్యక్తులకు తగిన అవతారం శ్రీరాముడు. అందువల్ల ఉత్తరభారతంలోని వారు రాముడంటే ఎక్కువ అభిమానం చూపుతారు. బెంగాలీలు మాత్రం ఉద్వేగ పూరితులు, అంతఃస్ఫూర్తి కలవారు. శ్రీరాముని తత్వం వారికి రస

హీనంగా కనిపిస్తుంది. అందువల్ల శ్రీకృష్ణుడంటే విపరీతమైన ఇష్టం ప్రదర్శిస్తారు. నీ అభిమతంలోని అసలు రహస్యం యిదేనని నా అనుమానం. ఈ అభిమానాలు, ప్రాధాన్యతలు ఏవైనా, శ్రీరాముడు దైవమే అని, మానవమానసపరిధుల్ని ఆమోదించి, వాటిని మహిమోపేతం చేశాడని చెప్పవచ్చును. అయితే శ్రీకృష్ణుడు మానస పరిధుల్ని విచ్ఛిన్నం చేసి, ఉన్నతభూమికల నుండి భిన్నమైన పరిధుల్ని సృష్టించిన అవతారం. ఆయన అధిమనస్సు (Overmind) నుండి నేరుగా వచ్చిన అవతారం. ఆయన మానవ మనస్సు, ప్రాణికం, హృదయాలపై అధిమానస శక్తుల్ని ప్రయోగించి వాటిని మార్చి, విముక్తం చేసి, దివ్యీకరణం చేయడానికి ప్రయత్నించాడు. వారిరువురిలో తేడాను గుర్తించే విధానం అదొకటి.

అనువాదం: బి. వరలక్ష్మి, కె. యజ్ఞన్న

(*SABCL* Vol. 22, pp. 413-15, 418; Vol. 9, p. 438)

శ్రీకృష్ణుడు చారిత్రక పురుషుడా?

రాముడు, కృష్ణుడు నిజంగా మనకు మల్లె జీవించిన మనుషులా ఏమిటి? కవులు సృష్టించిన పాత్రలే కదా అని అందరి అభిప్రాయము. కాని శ్రీఅరవిందులు దాని కొప్పుకోరు. క్రీస్తు జన్మ ఎంత ప్రత్యక్ష సత్యమో, శ్రీకృష్ణుని జీవితం కూడ అంత ప్రత్యక్షమైనదేనట. మరియు శ్రీకృష్ణుని చేతన అనేదొకటి వున్నది. దానిని నువ్వు ఆధ్యాత్మికసాధన ద్వారా స్పృశించగలవు, ఆ అనుభూతిని పొందగలవు. మరి శ్రీకృష్ణుడే లేకపోతే అతని చేతన ఎక్కడి నుంచి వస్తుందిట?

– సంపాదకుడు

శ్రీకృష్ణుడు చారిత్రకపురుషుడా, కాదా అనే చర్చ అనవసరమనిపించినా, దానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యం లేకపోయినా, ఆ చర్చకు మంచి విలువ వున్నది. శ్రీకృష్ణుడు ఒక పౌరాణిక వ్యక్తిగానీ,

కవి ఊహాగానముగానీ కాదు అనేందుకు నాకెటువంటి అను మానమూ లేదు. శ్రీకృష్ణుడు మానవరూపంలో భూమిపై జీవించి భారతీయ పూర్వవైభవంలో పాలుపంచుకొన్నాడనేది నా దృఢ విశ్వాసం. ఈ సందర్భంలో మనం రెండు వాస్తవాలను స్పష్టంగా గమనించగలం. వాటిలో మొదటిది శ్రీకృష్ణుడు ఒక ప్రముఖ ఆధ్యాత్మిక వ్యక్తి. అతని ఆధ్యాత్మిక ప్రకాశం గురించి ఒక ఉప నిషత్తులో ప్రస్తావించబడింది. ఇక రెండవది అతనిని జీవితాంతం వరకు దివ్యమానవునిగా సాంప్రదాయం పరిగణించి, మరణానం తరం దైవంగా పూజించింది. ఇదీ మహాభారతంలోనూ, పురాణా లలోనూ వున్న కృష్ణ కథ ద్వారా మనకు తెలిసేది. భారతీయ ఆధ్యాత్మిక చింతనలోని ఒక ముఖ్యభాగమైన భాగవతోద్యమం ఒక కట్టుకథపైన గాని, కవితావేశం మీదగాని ఆధారపడిలేదు. నిజమే, మహాభారతము కవి కల్పనేగాని, చరిత్ర కాదు. అయితే అది మన పూర్వీకుల స్మృతిపథంలో నిలిచియున్న ఒక గొప్ప చారిత్రక సంఘటనపై ఆధారపడిన కావ్యం. ఆ సంఘటనతో సంబంధమున్న ధృతరాష్ట్రుడు, పరీక్షిత్తు భూమి మీద జీవించిన వారే. వారిలో నాయకుడుగా, యోధుడుగా, రాజకీయ చతురుడుగా శ్రీకృష్ణుని పాత్ర యథార్థమైనది. అది సాంప్రదాయం గుర్తించిన చారిత్రక సత్యమేగాని కేవలమొక కల్పన, కవితాసృష్టి కాదు. శ్రీకృష్ణుడు చారిత్రక పురుషుడా కాదా అనే చర్చలో ఇది హేతు బద్ధమైనదని మనం అంగీకరించక తప్పదు. శ్రీకృష్ణుని చారిత్ర కత కంటె ముఖ్యమైన అంశం మరొకటి వున్నదని నా అభి ప్రాయం. శ్రీకృష్ణుడు ఏసుక్రీస్తువలెనే ఒక చారిత్రక పురుషుడని నేను అంగీకరించడమే గాక అతనిని ఒక అవతారముగా పరిగణి స్తాను.

*

కృష్ణచైతన్యం యథార్థం. కృష్ణుడే లేకపోతే కృష్ణచైతన్యం ఎలా వుండగలదు? అవాస్తవిక కేవల తాత్త్విక చింతనను వదిలేస్తే, చిత్తుగల సద్రూపం లేనిదే చైతన్యం అసంభవం. వ్యక్తి వుంటేనే వ్యక్తిత్వానికి విలువ, వాస్తవికత వుంటాయి. వ్యక్తే తన వ్యక్తి

త్వాన్ని ప్రకటించుకోగలడుగాని వ్యక్తిత్వం వ్యక్తిని సృష్టించ లేదు. కృష్ణుడు ఒక సద్రూపి, ఒక వ్యక్తి, ఒక దివ్యమానవుడు. అతనిని మనం కలుసుకొనగలం, అతని మాట వినగలం, అతనితో మాట్లాడగలం, అతని వునికిని అనుభవించగలం.

*

చారిత్రకంగా శ్రీకృష్ణుడు వున్న మాట నిజం. ఛాందోగ్యోపనిషత్తులో అతని పేరు మనకు మొదటిసారి కనిపిస్తుంది. అయితే ఆ ఉపనిషత్తు ద్వారా మనం ఆధ్యాత్మిక సాంప్రదాయంలో అతడు ఒక బ్రహ్మజ్ఞానిగా ప్రసిద్ధుడని మాత్రమే తెలుసుకోగలం. అతని వ్యక్తిత్వము, జీవిత సంఘటనలు అందరికి బాగా పరిచయం కాబట్టి అతనిని దేవకీ సుతుడైన కృష్ణునిగా పేర్కొంటే సరిపోయేది. అదే ఉపనిషత్తులో విచిత్రవీర్యుని కుమారుడైన ధృతరాష్ట్రుని పేరు కనిపిస్తుంది. భారతీయ సాంప్రదాయం ధృతరాష్ట్రుని, కృష్ణుని పేర్లను కలిపే ప్రస్తావిస్తుంది. మహాభారత కథలో వారిద్దరు ప్రముఖ వ్యక్తులు. దీనిని బట్టి మహాభారతం చారిత్రక పురుషులతో కూడిన ఇతిహాసమనీ, కురుక్షేత్ర సంగ్రామం వాస్తవంగా జరిగింది కాబట్టే అది మన జాతిస్మృతి పైన చెరగని ముద్ర వేసిందని మనం నిర్ణయించవచ్చు.

కృష్ణార్జునులు క్రైస్తవమతం ఆవిర్భవించటానికి ఎన్నో శతాబ్దాల పూర్వమే భారతదేశంలో దేవతలుగా పూజింపబడినారని మనకు తెలుస్తున్నది. కాబట్టి వారిద్దరును ఒక ధార్మికమైన తత్త్వ చింతనలో భాగస్వాములనీ, ఆ వివరాలనే భగవద్గీత సేకరించిందనీ అంగీకరించాల్సి వుంటుంది. భగవద్గీతలో జ్ఞాన, కర్మ, భక్తి యోగముల సమన్వయం కనిపిస్తుంది. మానవశరీర ధారియైన శ్రీకృష్ణుడే ఈ శాఖను స్థాపించాడని గాని, లేక దానిని పునరుద్ధరించాడని గాని లేక దానికి ఒక ప్రథమాచార్యుడని గాని మనం ఒప్పుకొనవలసి వుంటుంది.

భగవద్గీత చివరకు ఏ రూపాన్ని సంతరించుకొన్నప్పటికీ అది భారతీయ తత్త్వశాస్త్రంలో శ్రీకృష్ణుని బోధలనే సంకలనం చేసింది. ఆ తాత్త్విక బోధకు చారిత్రక పురుషులైన కృష్ణార్జును

లతోనూ, కురుక్షేత్ర సంగ్రామంతోను వున్న సంబంధాన్ని నాటకీయ కల్పనగా కొట్టి పారెయ్యకూడదు. మహాభారత కృష్ణుడు చారిత్రక పురుషుడుగానే కాక, అవతారమూర్తిగా కూడా దర్శనమిస్తాడు. అంటే ప్రాచీన భారతీయుల కథ ప్రస్తుత కావ్యరూపాన్ని సంతరించుకోవడానికి లేక ఇతిహాసంగా స్థిరపడటానికి ముందే – అనగా సుమారు క్రీ.పూ 5 నుండి 1 వ శతాబ్దపు మధ్యకాలానికి పూర్వమే – కృష్ణపూజ, ఆయన అవతార ప్రసక్తి దృఢమైంది. ఆ కావ్యంలోనే అవతారమూర్తియైన శ్రీకృష్ణుని బాల్య బృందావన జీవితం సూచనప్రాయంగా తెలియజేయబడింది. పురాణాలు బృందావన నివాసియైన శ్రీకృష్ణుని లీలలను విపులంగా వర్ణించుటవలన వాటికి మహత్తరమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యమేర్పడటమే గాక అవి భారతీయ ధార్మికభావాలను అత్యధికంగా ప్రభావితం చేసినవి. హరివంశం కూడా శ్రీకృష్ణుని జీవితకథలను ప్రస్తావించింది. అవే బహుశా పురాణాలకు ఆధారమై వుండవచ్చును.

*

ప్రపంచ చరిత్రలో నాలుగు మహత్తర సంఘటనలు కనిపిస్తాయి. అవి ట్రాయినగర దిగ్బంధము, ఏసుక్రీస్తు జీవితము, అతడు శిలువ వేయబడుట, శ్రీకృష్ణుని బృందావన నివాసము, కురుక్షేత్ర యుద్ధ భూమి మీద కృష్ణార్జున సంవాదము. వీటిలో ట్రాయి దిగ్బంధం గ్రీకు సంస్కృతిని సృష్టించింది. శ్రీకృష్ణుని బృందావన జీవితము భక్తి సాంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. (ఎందుకనంటే అంతకు పూర్వము ధ్యానము, బాహ్యపూజ మాత్రమే వుండేవి). శిలువ వేయబడిన క్రీస్తువలన యూరపులో మానవతా భావనకు పునాది ఏర్పడింది. కురుక్షేత్ర కృష్ణార్జున సంవాదము మానవాళికి ముక్తి ప్రసాదించగలదు. అయితే విచిత్ర మేమిటంటే చారిత్రకంగా ఈ నాలుగు సంఘటనలు జరుగనే జరుగలేదుట!

అనువాదం: డా॥ కోట వేంకటేశ్వరరావు

(*SABCL* Vol. 22, pp. 425-26; Vol. 13, pp. 12-13; Vol. 17, p. 83)

అనుబంధం:

మతము – కురూపము, స్వరూపము

మతము జీవితములో ఉన్నతస్థాన మాక్రమించి, దాని ధర్మదీప్తులై వుండవలయుననుట ఒక విధముగా నిజమే. కాని మతము, దాని ఆంతరంగిక స్వభావములో, దాని సహజధర్మములో, భగవదన్వేషణమై, ఆధ్యాత్మికోపాసనమై, అంతఃస్థిత శాశ్వత విశ్వరూప దైవతాభిముఖముగ ఆత్మాంతర్జీవిత వికాసము కావలసి యున్నది. అట్లు కాక, మతము విశ్వాసముతో, అర్చనతో, 'చర్చి' తో, కర్మకాండతో తాదాత్మ్యమును వహించి ప్రగతి భంగకరశక్తి అయినప్పుడు జీవిత వివిధ చర్యలపై దానికిగల అధికారమును మానవతత్త్వము తిరస్కరింపవలసిన ఆవశ్యకత కలుగవచ్చునన్న మాట కూడ సత్యమే. సత్యమతము, మతవాదము అన్నవి మతమునకు గల రెండు రూపములు. మానవునిలోని బుద్ధినీతిరసవాస్తవతత్త్వముల కతీతమై వానిని పారమార్థికకోన్నత ధర్మదీప్తులచే రూపొందించి, నియమించి, ఆత్మజీవితము నన్వేషించు ఆధ్యాత్మిక మతమే సత్యమతము. ఇట్లు కాక నిమ్నావయువ సంకుచితధార్మికౌన్నత్యములో స్థిరపడునదియో, బుద్ధినిశ్చితవాదములకు, కర్మకాండకు, విహిత కర్కశనీతిపద్ధతికి, మతరాజకీయవ్యవస్థకు, మతసాంఘిక వ్యవస్థకు అత్యంత ప్రాముఖ్యమునిచ్చునదియే మతవాదమగును. ఇట్లనుటచే ఇవి అన్నియు ఉపేక్షార్హములనిగాని, అనావశ్యములనిగాని, అయోగ్యములనిగాని, ఆధ్యాత్మికమతము కర్మకాండవిధి రూపముల సహాయమును గర్హింపవలెననిగాని అర్థము చేసికొనరాదు.

*

భారతీయ మనస్తత్వం ప్రధానంగా ఎల్లప్పుడూ తలపోసేది, ఆలోచించేది మతాన్ని గురించే. కొందరు మనకు మతం అతిగా ఎక్కువై భారతదేశాన్ని నాశనం చేసిందని చెప్పారు. ఎందుచేతనంటే మన జీవనసర్వమూ మతమే అయిందని, లేదా మనసర్వమూ మత

జీవితం అయింది. మనం జీవితంలో ఓడిపోయాం. అధోగతి పాల య్యాం. దీనికి కొంచెం భిన్నమైన మరో సందర్భంలో కవి (రవీం ద్రుడు) వాడిన భాషను ఉపయోగించుకొంటూ, మనం యీ విధంగా పతనమై భ్రష్టమై అధోగతి పాలవడం ఏమీ కాదనీ, ప్రస్తుతం భారతదేశం పతనమై నేల కరచుకొని పడివున్న దుమ్ము ధూళి మహాపవిత్రమైందని నేను సమాధానంగా చెప్పను. ఈ పతనం, ఈ భ్రష్టత, ఈ అధోగతి వల్ల ఏమీ లేకపోవచ్చు. అలాగే పడివుండిపోవచ్చు గాక, అలా దుమ్ము ధూళిలో శాశ్వతంగా పడి పోయి వుండిపోవడం అనేది మానవునికిగాని, ఒక జాతికిగాని భద్రమైంది కాదు, శ్రేయస్కరం కాదు, గౌరవప్రదం కాదు. కాని ఈ పతనావస్థకు అపాదించిన కారణం నిజమైంది కాదు, సమం జసం కాదు, యథార్థం కాదు. భారతీయుల్లో అత్యధిక భాగం వాస్తవంగా వారి జీవితాల్ని సంపూర్ణంగా మతంతో నింపివేసు కొని, మతమే జీవనంగా జీవించివున్నట్లయితే మనం ప్రస్తుతం పడివున్నచోట యిలా పడివుండకపోదుము. అలా ఎందుకు జరి గిందంటే మన దేశీయుల్లో చాలమంది వారి ప్రజాజీవనశైలిలో, నిత్యజీవితాల్లో, అత్యంత మతరహితంగా, ధర్మవిరుద్ధంగా అనాచా రులై (అప్రాచ్యులై) నియమనిష్టలూ, భక్తి లేక, అవినీతి మురిగి గుంటలో దొర్లుతూ, స్వార్థదురహంకారాలతో, సొంతలాభం, స్వ సుఖం మాత్రమే వాంఛిస్తూ, పూర్తి భౌతికవాదులై – జీవిస్తూండ డంవల్ల, ఆ కారణంగా, పతనమై అధోగతి పాలయ్యారు. (సనా తన ధర్మ నిష్ఠాగరిష్ఠులై మహోగ్ర తపస్సంపన్నులైన మహర్షు లున్న వేదకాలంలో విదేశీయులు భారతదేశం వైపు కన్నెత్తి చూడ లేకపోయారన్న శ్రీఅరవిందాశ్రమ మాతృవచనం యిక్కడ సంద ర్భోచితం – అను) ఇలా జరిగివుండవచ్చు. ఒక ప్రక్క ఏదో సమ యంలో మనం దారితప్పి అమితంగా అతిగా మతస్థులైపోయి మతమే సర్వమూ అన్న 'మూర్ఖత్వం' లో మతోన్మాదంలో అన్న ట్లుగా కేవలం బ్రహ్మాచార ఆడంబరాలతో, అతిగా శాస్త్రం, ఆచారం, నియమం, నీతి, మడీ, మైలా అని మెట్ట వేదాంతం వల్లిస్తూ, జందెం పోగూ – జపమాల, కమండలం – కాషాయం, కొంగజపం –

దొంగసన్యాసం – ఇలా వృథా రోజూవారి కార్యక్రమాలతో, భక్తి భావశూన్యమైన కేవలం యాంత్రికమైన బాహ్య పూజాడంబర ప్రదర్శనలలో వుండిపోయాం; మరోప్రక్క ఈ ప్రపంచం అంతా మిథ్య, మాయ అని యథార్థమైన ఈ జగత్తును బ్రహ్మసత్యం, జగత్తూ సత్యమే నిరసిస్తూ, తిరస్కరిస్తూ, త్యజిస్తూ సన్యాస సంప్రదాయం అత్యుత్తములైన మహామేధావుల్ని, అత్యున్నత ఆలోచనాపరుల్ని ఆకర్షించి తప్పుదారి పట్టించింది. ఆ కారణంగా సమాజం ఆ మహనీయుల్ని కోల్పోయింది. లోకాస్సమస్తా స్సుఖినోభవంతు అని సర్వత్రా శాంతి కలుగుగాక అని విశ్వశ్రేయస్సుకై సర్వమానవాళి సంక్షేమానికి స్వర్ణోజ్వల భవితవ్యాన్ని సంభావించి సంకల్పించి తీవ్ర తపస్సాధన చేసి యుగకర్తలై సర్వకాలాలకూ చెందుతూ అనాది నుండి సనాతన ధర్మపరాయణులై సర్వప్రపంచానికి ఆధారభూతులై, ఆదర్శమూర్తులై సర్వ ప్రపంచానికి ప్రాణ జీవన దాతలై – ఈ భూమికి మహాత్ములే ఆధారం – మేరునగధీరులై నిల్చిన వేదర్షులవలెగాక ఈ మేధావులు పెడతోవపట్టి అడవులపాలై గుహల్లో కృశించి సమాజానికి దూరమైపోయారు. కాని ఈ విషయంలో మూలకారణం ఏమంటే సామాన్యజనుల్లో విస్తృతంగా ఆధ్యాత్మిక ప్రేరణ, ఆకాంక్ష క్రమంగా క్షీణించిపోయాయి. మేధోవ్యాసంగం, బుద్ధితో వ్యవహరించటం, స్వేచ్ఛగా ఆలోచించగలగటం బాగా తగ్గిపోయింది. గొప్ప గొప్ప ఆదర్శాలన్నీ క్షయించిపోయి, మట్టి గలిశాయి; జీవనమహోద్వేగం జీవించాలనే ఉత్సాహం నష్టమైపోయింది.

అనువాదం: వెంపటి కృష్ణమూర్తి ('మానవ ఆవర్తము' నుండి)
కె.ఎస్. భాస్కరరావు ('భారతదేశ పునరుజ్జీవనం' నుండి)

(SABCL Vol. 15, pp. 166-67; Vol. 14, pp. 432-33)

సమాచార పత్రం

శ్రీమాత ఫ్రాన్స్ నుంచి వచ్చి శ్రీఅరవిందులను మొట్టమొదటిసారి 29 మార్చి 1914 నాడు కలుసుకొనిరి. మర్నాడు తన దినచర్య పుస్తకంలో ఈ విధంగా రాసుకొనిరి.

"It matters little that there are thousands of beings plunged in the densest ignorance. He whom we saw yesterday is on earth; his presence is enough to prove that a day will come when darkness shall be transformed into light, and Thy reign shall be indeed established upon earth."

"మేము నిన్న చూసిన ఆయన భూమ్మీదనే ఉన్నారు. ఇక ఎన్ని వేలమంది అజ్ఞానాంధకారంలో మునిగివున్నా పరవాలేదు. ఈ ప్రపంచాన్ని ఆవహించివున్న అంధకారం పోయి జ్యోతిర్మయ మవుతుందనేందుకు, ఈ భూమ్మీద నీ పరిపాలన సాధ్యమవు తుందనేందుకు ఇక ఎట్టి సంశయము లేదు."

ఆలిండియా యూత్ కాంప్, సొసైటీ బీచాఫీసులో 3-11 జనవరి 2004 తేదీలలో జరుపబడినది. రాయచూరులో (కర్ణాటక) శ్రీమాతారవిందులను గూర్చి స్కూలు పిల్లలకు ఒక వ్యాసరచన పోటి పెట్టి 'Ideal Child' అనే పుస్తకం 600 కాపీలు పంచిపె ట్టిరి. బెంగుళూరు (కర్ణాటక) లో 'Value Education' అనే అంశ ముపై ఉపాధ్యాయులకు ఒక శిక్షణ శిబిరము, మధుర (తమిళనాడు) లో 'శ్రీఅరవిందుల యోగము – శ్రీఅరవింద సొసైటీ' అనే విష యముపై ఒక సదస్సు జరిగినవి. జామ్‌నగరం (గుజరాతు) లో శ్రీఅరవింద భవన్‌కి శంఖుస్థాపన చేసిరి. ఇందోరు (మధ్యప్రదేశ్) లో 'ఆరోగ్యము – ఆధ్యాత్మికము, పువ్వులు, కాయలు, పళ్లు, మూలికలు, మొక్కలు' మొ॥ వాటి ఆధ్యాత్మిక తత్త్వము, ప్రయో జనాల గురించిన కార్యక్రమములు జరిపిరి. గుజరాతులో 32 వ శ్రీఅరవింద రాష్ట్రమహాసభలు జరుపుకొనిరి. శ్రీఅరవింద సొసైటీ నూతన కేంద్రములు నాడియాడ్, పోర్టుబ్లెయిర్, వార్ధా, బలియా లలో ప్రారంభించబడినవి.



ఏకాగ్రత

అఖిల

అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2004

ఏకాగ్రత

ఏకాగ్రత ఎందుకు?

కొన్ని వివరణలు

ఆచరణ మార్గములు

ఏకాగ్రత కేంద్రములు

అనుబంధం

ఏకాగ్రతతో కార్యసాధన

పరిపరివిధాల పరిగెత్తే మనస్సుతో నువ్వేమీ చేయలేవు. రచయితలకు కళాకారులకు ఈ విషయం బాగా తెలుసు. నువ్వు నీ దృష్టిని ఒకే పని మీద కేంద్రీకరించినట్లయితే అది ఎంత కష్టమయినప్పటికీ నీ నిరంతర వత్తిడికి లొంగి తీరుతుంది.

– *సంపాదకుడు*

జీవితంలో నువ్వేం చేయదలచుకున్నా సరే నీ దృష్టిని ఏకాగ్రపరచటం తప్పనిసరి. పరి పరివిధాల పరిగెత్తే నీ ఆలోచనలన్నిటిని శాసించాలి. నీ చైతన్యాన్నంతా పోగుచేసి ఒకే విషయం మీద నిలిపిన యెడల ఎంతటి గడ్డు సమస్య అయినా లొంగి తీరుతుంది – అది లౌకికరంగంలో అయినా సరే ఆధ్యాత్మిక క్షేత్రంలో అయినా సరే – అయితే ఒక్కటే షరతు. నీ నియమాన్ని తప్పకుండా పాటించాలి. అంటే నువ్వు ఎల్లప్పుడు నీ దృష్టిని ఒకే విషయం మీద కేంద్రీకరించాలని కాదు. ఇప్పుడు ఒకటి కావచ్చు, తరువాత మరొకటి కావచ్చు. నీ దృష్టిని ఒకే విషయం మీద కేంద్రీకరించటం (focussing) నేర్చుకోవాలి అర్థమయిందా?

నిత్యజీవితంలో కూడ అంతే – చదువు, ఆటలు, వ్యాయామం, మానసికాభివృద్ధి – ఏది సాధించాలన్నా ఇది తప్పనిసరి. మనస్సునంతా ఒకే విషయంపై ఎవ్వరైతే కేంద్రీకరించగలరో వారే కార్యములను సాధించగలరు.

ఆధ్యాత్మిక సాధనలో చిత్తైకాగ్రత ఇంకా ముఖ్యం. ఏకాగ్రతతో ఎంత కఠినమైన, దుర్లభమైన ఆధ్యాత్మిక అవరోధాన్నైనా ఛేదించి విజయాన్ని సాధించవచ్చు. చైత్యపురుషుణ్ణి ఆవిష్కరించటం, అంతరంగిక దైవంతో ఐక్యమవటం ఊర్ధ్వలోకాలలోకి ప్రవేశించటం మొ॥ విజయాలన్నీ కూడ నిష్ఠతో, చెదిరిపోని ధ్యానముతో సాధించవచ్చు – అదెలా చేయాలో నేర్చుకోవాలి అంతే.

ఆధ్యాత్మిక క్షేత్రంలో అయినా సరే, మానవ క్షేత్రంలో అయినా సరే, తదేక ధ్యానంతో కృషి చేస్తే అది లొంగితీరుతుంది. ఇది నాకు చేతకాదు బాబూ అనొద్దు. బీజరూపంలో ఈ విద్య అందరిలోను వుంటుంది. కృషి చేసి దానిని పెంచుకోవాలి అంతే.

మూలం: శ్రీమాత
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 9, pp. 360-61)

అల్పకాలంలో అధిక ఫలితాలు

ఒక గంట పట్టే పనిని పావుగంటలోనే చేయటం సాధ్యమేనా? సాధ్యమే నంటారు శ్రీమాత. ఒక క్లిష్టమైన సమస్య, కష్టమైన లెక్క, దుర్భేద్యమైన చిక్కుముడి – అన్నిటిని చిత్తైకాగ్రతవలన పరిష్కరించవచ్చును. నీ మనస్సును చెల్లాచెదరు చేసే ఆలోచనల నుండి మళ్లించి, ఒకే పని లేక కార్యం మీద కేంద్రీకరించి ధారణచేసినప్పుడు నీ మనస్సు వెనుకనుండి ఒక గొప్ప శక్తి వచ్చి నీ సమస్యను పరిష్కరిస్తుంది. – సంపాదకుడు

ప్రశ్న: ఏదైనా ఒక పని చేసేటప్పుడు దాన్ని బాగా చేయాలనుకుంటే ఎక్కువ సమయం కావాలి. మనకు ఎక్కువ సమయం లేదు కదా, ఎప్పుడూ తొందరే. అలా తొందరలో ఉండి కూడా బాగా చేయగల మార్గమేమిటి?

ఇది అందరికి కావల్సిన విషయం కాబట్టి వివరంగా చెపుతా విను. ఎవ్వరైనా తొందరలో ఉన్నప్పుడు, చేయవలసిన దాన్ని పూర్తి చేయలేరు. నిజానికి దానికి కావలసినది ఏకాగ్రత. ఏకాగ్రత పెంచుకుంటే నీ వనుకున్న దానికంటే సగం సమయంలోనే చక్కగా చేయగల్గుతావు. ఉదాహరణకు స్నానం చేసి తయారవాలనుకో. తొందర లేకపోతే సాధారణంగా అరగంట సేపు పడుతుంది. తొందరగా చేయాలనుకున్నప్పుడు సరిగ్గా రుద్దుకోవటమన్నా

మానేస్తావు. లేకపోతే ముస్తాబు కొంత మానేస్తావు. అలా కాకుండా నీ దృష్టినంతా ఆ పనిలోనే లగ్నం చేసి ఇంకో విషయాన్ని మనసులోకి రానివ్వకుండా ఇటూ అటూ అనవసరమైన (But there is another way – to concentrate one's attention and one's energy, think only of what one is doing and not of anything else, not to make a movement too much, to make the exact movement in the most exact way....) పోకడలు పోకుండా ఎంతవరకూ అవసరమో అదే చేస్తుంటే అదివరకు అరగంట పట్టే దానిని పావుగంటలోనే పూర్తి చేయగలవని ఖచ్చితంగా చెప్పగలను. ఇంకా దాన్ని లోగడ చేసినదానికన్నా కూడా బాగా చేస్తావు. ఏదీ వదిలిపెట్టవు, మర్చిపోవు. అంతా ఏకాగ్రత ప్రబలంగా చేసుకోటాన్నిబట్టి వుంటుంది.

సమయం చాల్లేదనీ అందువల్ల సరిగా చేయలేదనీ చెప్పే వాళ్లందరికీ ఇదే నా సమాధానం. చదువు గానీయండి, ఆటలు, పాటలు, మరే పనైనా కానీయండి. ఏకాగ్రత ఉంటే చక్కగా చేయగలుగుతావు. అది ఏమాత్రం అలసట కల్గించదు. మొదట్లో ఇది కొంచెం కష్టంగా అనిపించవచ్చు. ఆ విధంగా ఏకాగ్రత అలవాటైతే ఏమాత్రం కష్టముండదు. అంతేకాక ఆ తర్వాత ఏకాగ్రత లేకపోవటంవల్ల అలసట కలుగుతున్నట్లూ, మనసు ఇటూ అటూ చెదురుతూండటంవల్ల అనేక విషయాలు నిన్ను ముంచెత్తి, చేసే పని మీద ఏకాగ్రత లేక ఉక్కిరిబిక్కిరి అయినట్లూ తెలుసుకుంటావు. ఏకాగ్రదృష్టివల్ల పనులన్నీ ఎంతో చక్కగా, శీఘ్రంగా పూర్తి కావటమే కాక, అది నీ పురోగతికి కూడా ఎంతో దోహదం చేస్తుంది. అంతే తప్ప అనాపేక్షితంగా పనులు చేయటం మంచిదనుకొని ఉపేక్షాభావం మాత్రం పెంచుకోకూడదు. ఈ రెంటికీ తేడా చాలా ఉంది. (And in this way you can make use of work as a means of growth; otherwise you have this vague idea that work must be done "disinterestedly", but there is a great danger there, for one is very quick to confuse disinterestedness with indifference)

ఒక విద్యార్థి ప్రశ్న: గణితంలో లెక్కలు ఒక్కొక్కప్పుడు వెంటనే పరిష్కారమౌతాయి. మరొకప్పుడు చస్తే కావు. ఎందుకని?

నిజమే. అది నీ ఏకాగ్రత మీద ఆధారపడి వుంటుంది. పరిశీలించిన మీదట ఈ విషయం నీకు బాగా బోధపడుతుంది. దానిక్కారణం నీ బుర్ర నిర్మలంగా లేకుండా ఏదో తెర కమ్మి నట్లు, స్వప్నావస్థలో ఉన్నట్లు ఉండటమే. దాన్ని తుడిచేసుకుందామనుకున్నా నీకు సాధ్యం కాదు. సమాధానం కోసం ప్రయత్నిస్తే నువ్వు దూదిపింజల్లో నుండి వెడుతున్నట్లు గంటల తరబడి అయోమయంలో వుండిపోతావు.

ఏకాగ్రత అంటే ఆ మబ్బుతెరను తొలగించుకోవడమే. నీ మేధస్సుకు సంబంధించిన అంశాలన్నిటినీ కూడ తీసుకొని ఒకే స్థానంలో నిలిపి వుంచాలి. ఇక సమాధానం కోసం ఆలోచించకుండా దృష్టినంతా ఆ సమస్య మీదనే నిమగ్నం చేసి వుంచు. మనస్సునంతా ఆమూలాగ్రం ఆ సమస్య మీదనే చొప్పించి దాన్లో ప్రతిపాదితాంశాన్ని వెలికి తీసే ప్రయత్నం చేయాలి. ఈ విధంగా నీ మనస్సునీ, దాని శక్తినీ కూడదీసి లెక్కలోని సమస్య మీదే నిమగ్నం చేయాలి. అది ఎంత తీవ్రంగా వుండాలంటే గోడలోకి రంధ్రం చేయాలంటే బరమా పెట్టి ఒకే స్థానంలో తిప్పినట్లుగా నిమగ్నం చేస్తే, గోడలో అకస్మాత్తుగా రంధ్రం పడినట్లు సమాధానం నీ కైవశ మవుతుంది. దానికిదొక్కటే మార్గం. ఇది వదిలిపెట్టి ఇటూ అటూ ప్రయత్నిస్తే మాత్రం ఎంతసేపు తడువులాడినా సమస్య మాత్రం తెగదు. నీ మనస్సు కుండే శక్తినంతా కూడదీసుకొని ఆ గణితసమస్య పైనే కేంద్రీకరిస్తే దాని చాటునున్న జవాబు వెలికి వస్తుంది. అప్పుడు అమాంతంగా దాన్ని కైవశం చేసుకోవాలి. (You will never find anything or else you will need hours. You must get your mental forces to a point with strength enough to pierce through the words and strike upon the thing that is behind. There is a thing to be found; swoop down upon it)

నీ మనస్సు మాంద్యంగా, మబ్బుగా వున్నప్పుడే గణితం కష్టంగా ఉన్నట్లుంటుంది. అంతా అస్పష్టంగా నీకు కావలిసింది అందకుండా జారిపోతున్నట్లుంటుంది. అటువంటి సమయాల్లో నిన్ను నీవు పరిశీలించుకుంటే నువ్వెంత దట్టమైన పొగమంచు వంటి వాతావరణంలో వున్నావో తెలుస్తుంది. ఏదీ స్పష్టంగా లేక ఒకటి ఇటూ, మరొకటి అటూ లాగుతున్నట్లు గంద్రగోళంగా ఉంటుంది.

పాఠశాలల్లో చేరి చదువుకోవటంవల్ల నీకు లభించేది అస్పష్టంగా వున్న మనస్సును కూడదీసుకుని మనోబలాన్ని దృఢపరుచుకోగల శక్తే. అక్కడ చదివే దాన్ని ఆచరణలో వుంచగలిగే సుదీర్ఘ అధ్యయనం కొనసాగిస్తే తప్ప చదివిన దాంట్లో సగం పాలు కాలగమనంలో కలిసిపోతుంది. అయినప్పటికీ ఆ చదువు వల్ల నీ ఆలోచనాశక్తి స్థిరపడి, సుస్పష్టమౌతుంది. నీ మేధాశక్తి సువ్యవస్థిత మవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకట రామశాస్త్రి

(*CWM* Vol. 4, pp. 137-38; Vol. 5, pp. 126-27)

కొన్ని వివరణలు:

యోగములో ఏకాగ్రత

మనకు మన మనస్సును గురించే తెలుసు. ఇంతకంటె మహత్తరశక్తి ఒకటి మన శరీరంలోని కేంద్రాలలో లేక చక్రాలలో దాగి వుంటుందని యోగశాస్త్రం చెపుతోంది. ఆ శక్తిని సాధన ద్వారా విడిపించినప్పుడు మన జ్ఞానం మిన్ను ముడుతుంది. ఊర్ధ్వలోకాలు నీ వశమవుతాయి. కుండలినిని జాగృతం చేసే ప్రక్రియ ఈ కోవకు చెందినదే. అయితే మన మీ ప్రక్రియను ఇంకా విస్తృతమైన అర్థంలో వాడుతాము.

– సంపాదకుడు

ఏకాగ్రత అనగా చైతన్యము నంతటిని సమీకరించి ఒక బిందువుపై కేంద్రీకరించుట. ఒకే విషయముపై (భగవంతుడే అనుకోండి) నిలుపుట. అలాంటి అవసరం లేనప్పుడు కూడ అనియమితంగా వుండకూడదు; ఒక పట్టుతో, అప్రమత్తంగానే వుండాలి.

*

సాధారణంగా చైతన్యము అంతటా విస్తరించి ఉంటుంది. వెదజల్లబడినట్లుగా ఇటు అటు వ్యాపిస్తూ, ఇప్పటికి ఈ విషయం, మరుక్షణానికి మరో విషయం అన్నట్లుగా, బహు విషయాల వెంట పరుగిడుతూ ఉంటుంది. ఓర్పుతో కూడిన పని నేదైనా నిర్వర్తించవలసి వచ్చినప్పుడు మొదట చేయునది, నీ విస్తరించిన చైతన్యాన్నంతటిని వెనుకకు రాబట్టుకొని కేంద్రీకరించుట. అలాంటప్పుడు, నిశితంగా గమనించినట్లయితే, ఒకే స్థానంపై, ఒకే వ్యాపకంపై, ఒకే విషయము లేక ఒకే వస్తువుపై కేంద్రీకృతమై వున్నట్లుగా గోచరిస్తుంది – ఒక పద్యాన్ని రచిస్తున్నప్పుడు లేక ఒక వృక్షశాస్త్రజ్ఞుడు ఒక పుష్పాన్ని పరిశీలిస్తున్నప్పుడు మాదిరి. సాధారణంగా అట్టి కేంద్రీకృత విషయముయొక్క స్థానము, ఆలోచనాపరమైన యెడల ఎక్కడో మస్తిష్కములోను, భావనాపరమైన యెడల హృదయములోను ఉంటుంది. దీనియొక్క విస్తృతమైన మరియు తీవ్రతరమైన స్థితియే యోగపరిభాషలో ఏకాగ్రత అనబడుతుంది. అట్టి ఏకాగ్రత, త్రాటక ప్రక్రియలో ప్రకాశవంతమైన బిందువుపై కేంద్రీకరించు విధంగా, ఒక వస్తువుపై కావచ్చు – అలాంటప్పుడు, దృష్టిని కేంద్రీకరించి ఆ వస్తువునే చూడాలి తప్ప ఇతరత్రా ఆలోచన ఏదీ ఉండరాదు.

ఏకాగ్రత ఒక భావము పైననో, ఒక మాట పైననో ఒక నామము పైననో, భగవదాలోచన పైననో, 'ఓం' అను పదము పైననో, కృష్ణ నామము పైననో, లేక భావపదముల సమ్మేళనము లేక భావనామముల సమ్మేళనము పై కూడ కావచ్చు. ఇంకనూ, యోగసాధనలో ఒక ప్రత్యేక స్థానములో కూడ కేంద్రీకరించవచ్చు. భ్రుకిటిపై కేంద్రీకరించుట అనే విశిష్ట నిబంధన ఉన్నది – అంతర్మానసంయొక్క, నిగూఢ జ్ఞానంయొక్క, సంకల్ప

శక్తియొక్క కేంద్రము అక్కడ ఉంటుంది. నీవు చేయవలసినది, ఆ స్థానంలో స్థిరంగా ఉండి, దేనినైతే కేంద్రీకరించుటకు ఎంపిక చేసుకున్నావో, దాని పైననే నీ ఆలోచనను దృఢంగా నిలపాలి, లేదా అచ్చటి నుండే దానియొక్క రూపాన్ని దర్శించుటకై ప్రయత్నించాలి. దీనిలో నీవు సఫలీకృతుడువైనట్లయితే, అప్పుడు కొంత కాలం తరువాత, నీ చైతన్యమంతా కూడ ఆ స్థానంలో కేంద్రీకృతమైనట్టి భావన నీలో కలుగుతుంది – అది తాత్కాలికమే. ఆ విధంగా కొంతకాలం లేక తరచు ఆచరించినట్లయితే, అది అప్రయత్నంగానే జరిగిపోతుంది.

ఇది స్పష్టమైన దనుకుంటాను. ఈ యోగంలో నీవు అదే విధంగా చేయాలి. భ్రూమధ్యంలోని ఒక ప్రత్యేక స్థానంలో అవసరం లేదుగాని, శిరస్సులోని ఏ భాగంలోనైనా లేక శరీరశాస్త్రజ్ఞులు నిర్ధారించిన వక్షస్థలం మధ్యనుండే హృదయకేంద్రములోనైనా కేంద్రీకరించవచ్చు. ఒక వస్తువుపై కేంద్రీకరించుటకు బదులు మస్తిష్కంలో ఒక ఆలోచనపై కేంద్రీకరించవచ్చు. పైనుండి శాంతిని అవరోహింప చేయుటకై చేయు పిలుపు పైననో, లేక ఒక అదృశ్య కవాటము తెరచుకొని చైతన్యమును పైకి ఆరోహింప చేయుటకై చేయు పిలుపు పైననో క్రేంద్రీకరించవచ్చు. హృదయ కేంద్రములో ఒక ఆకాంక్ష మీదనో, మూసివున్న తలుపులు తెరచుకోవాలనో, సజీవ దివ్యరూపము అచ్చట నివసించుటకుగానో లేక ఏ ఇతర వస్తువుపైననో, కేంద్రీకరించాలి. నామజపం కూడ అయ్యుండవచ్చు. కాని అలాంటప్పుడు ఆ నామముపై ఏకాగ్రత కూడ కలిగి యుండాలి. మరియు ఆ నామము హృదయకేంద్రంలో దానంతటదే వినబడాలి.

The Word repeats itself in rhythmic strains: – *Savitri*, p. 375

ఈ విధంగా ఒకే దానిపై కేంద్రీకృతమై ఉన్నప్పుడు, చైతన్యముయొక్క మిగతాభాగం ఏమవుతుందని ప్రశ్నించవచ్చు. ఎలాంటి ఏకాగ్రతలోనైనా సంభవించు లాగున, అది స్తంభించిపోవచ్చు. లేక అలా కాని పక్షంలో, ఆలోచనలు, ఇతర విషయాలు దానికి బాహ్యంగా సంచరించవచ్చు. కేంద్రీకృతమై యున్న

భాగము మాత్రము వాటిని పట్టించుకోదు. గమనించదు. ఈ విధంగా జరిగినప్పుడు, ఏకాగ్రత సక్రమంగా, సజావుగా కుదిరినట్లుగా భావించవచ్చు.

మొదట్లో అలవాటు లేనట్లయితే, ఏకాగ్రతను సుదీర్ఘంగా అవలంబించి అలసిపోకూడదు. కారణం అలసిన మనస్సులో ఏకాగ్రత దాని శక్తిని, విలువను కోల్పోతుంది గనుక. ఏకాగ్రతకు బదులు, ప్రశాంతంగా ఉండి ధ్యానం చేసుకోవచ్చు. క్రమక్రమంగా ఏకాగ్రత కుదిరినప్పుడే, దీర్ఘకాలం పాటించుటకు వీలు కలుగుతుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*SABCL* Vol. 23, pp. 723-25)

ఏకాగ్రత వలన రెండు ప్రయోజనాలు

కోరికల వలయాలలో కొట్టుమిట్టాడుతూన్న నీ మనస్సుకు కళ్ళెం ఎలా వేయాలో తెలియదు. ఈ తాత్కాలిక ప్రయోజనాల వెనుక దాగివున్న నిత్యసత్యం మీద నీ దృష్టిని కేంద్రీకరించాలి. మొండిగా నీ నిశ్చయాన్ని అన్ని పరిస్థితులలోను తప్పకుండా నిలబెట్టుకోవాలి. నీ మనస్సు తన చుట్టూ ఒక ఎత్తైన గోడను నిర్మించుకొని దాని వెనకాల దాక్కొని వుంటుంది. నీ సంకల్పబలంవల్ల, ఇచ్ఛాశక్తి వలన, తపోన్నతివలన దానిని ఛేదించాలి. వెలుగులోకి ప్రవేశించాలి. — *సంపాదకుడు*

ఈ మనస్సు ఎంత కుటిలమైనది, ఎంత పెడత్రోవ పట్టించేది? దీనికి తోడు పనీపాట లేకుండా మదిలో మెదిలే సొదలు! ఇవి చాలవన్నట్లు నిరంతరము తామర తంపరగా పుట్టుకువచ్చే బాహ్యేంద్రియ వ్యాపారాలు. వీటి దాడిని తట్టుకోట మెలా? ఏకాగ్రతవలన. దృశ్యమాన లోకానికి అంతర్గతంగా శాశ్వత నిత్య

చైతన్యం నిక్షిప్తం కాబడి వుంది. దీనిపై బుద్ధి స్థిరపడాలంటే ఏకాగ్రతతో కూడిన ధ్యానం, అపారమైన నిర్విరామ కృషి కావాలి. మనసుకి నిత్యసత్యచేతనకి మధ్య బుద్ధిగతమైన యవనిక అడ్డం ఉంది. ఏకాగ్రతవల్లనే ఆ తెర తొలగింపబడాలి (we have to fix the will and the thought on the eternal and real behind all, and this demands an immense effort, a one-pointed concentration. Secondly, it is necessary in order to break down the veil which is erected by our ordinary mentality between ourselves and the truth);

బాహ్యేంద్రియ విషయపరిజ్ఞానం పొందటానికి సాధారణ ప్రజ్ఞతో కూడిన ఏ కొద్దిపాటి శ్రద్ధ ఉన్నా చాలు. కాని దృశ్యమాన జగత్తుకు అంతర్గతంగా ఉన్న నిత్యసత్యచైతన్య సాధనకి మాత్రం సమగ్ర పరిపూర్ణ ఏకాగ్రత తప్పనిసరి. దీనికి దృఢ సంకల్పం తోడు కావాలి. సాధించిన దివ్యచేతనను పదిలపర్చుకొని మమేకమై తదనుగుణంగా దైనందిన జీవనం కొనసాగాలి. ఏకాగ్రత వల్లనే ఈ ప్రయోజనం సిద్ధిస్తుంది. తాదాత్మ్యత పరిపూర్ణ జ్ఞానసిద్ధికి దోహదపడుతుంది. నిశ్చల నీరవ నిరంతర పరిశుద్ధ చింతనా (ధ్యాన) ఫలంగా ఇది ప్రసాదింపబడుతుంది. భిన్నత్వం, వేర్పాటు, సాధారణ బుద్ధియొక్క అవిద్య లేక అజ్ఞానం. నీ లోలోపలి నిత్యసత్య అమృతత్వ చేతనని ఉద్దీపింప చేయగల్గడం దీనికసాధ్యమైన విషయం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*SABCL* Vol. 20, p. 494)

మానవప్రకృతిని మార్చటమెలా?

నీ మనస్సు, శరీరము నిన్నేడిపిస్తూనే వుంటాయి. వీటిని ఏం చేసినా పాపం లేదు! ఇవి అజ్ఞానముయొక్క సంతానం. కాని భయం నాస్తి. నీవు నిస్పృహ చెందవలసిన పని లేదు. ఎందు కంటె వీటికి అతీతమైన, ఇంతకంటె ఘనమైన మరో వస్తు వున్నది. అదే నీ నిజచైతన్యము. వెలుగు, జ్ఞానము, అమలిన మైన స్వచ్ఛత దాని లక్షణములు. నువ్వు దానిని నీలో ఆవిష్క రించుకొన్నప్పుడు దాని ప్రభావమువలన నీ పాతవాసనలు తగ్గి కొత్తలక్షణాలు క్రమాభివృద్ధి చెందుతాయి. నీకు కనువిప్పు కలుగుతుంది – జ్ఞానము, వికాసము కలుగుతాయి.

– సంపాదకుడు

ఎంతటి స్థితప్రజ్ఞునికైనా సహజాతమైన మానవనైజం ఓ పట్టాన మారదు. సమయం పడుతుంది. అరిషడ్వర్గాలకి లోబడిన సాధా రణ చైతన్యం రూపాంతరం చెందడం అంటే మాటలా? అలాట ప్పుడు బాహ్యాప్రకృతిలో నిక్షిప్తమై వున్న శుద్ధచైతన్య సాక్షాత్కారం ఎంత జటిలమో వేరే చెప్పాలా? సాధారణ భౌతికచైతన్య స్తరాల మరుగున వున్న చైత్యపురుషాంశగా శ్రీమాత మనలో వున్నది. అసురిక ప్రవృత్తులు తొలగి, సాధారణ చేతన తాలుకు అడ్డుతెర వైదొలగుతే చైత్యపురుష అంశ అనుభవైక వేద్యమౌతుంది. ఆ దివ్య చైత్యసంసర్గంలో సాధారణ భౌతికజీవనం దివ్యజీవనంగా వికసిస్తుంది. అప్పుడు సాధకుడు తన ఏకాగ్రతలో అంతరంగ దివ్యచైతన్యాన్ని మేల్కొలుప గలుగుతాడు. దివ్యానుభూతులు పొందగలుగుతాడు. పొందేకొలదీ దివ్యచైతన్య స్తరాలను అందుకో గలుగుతాడు. మేము కోరేది ఇదే. (There is within you a psychic being which is divine, directly a part of the Mother, pure of all these defects. It is covered and concealed by the ordinary consciousness and nature, but when it is unveiled and able to come forward and govern the being, then it changes the ordinary

consciousness, throws all these undivine things out and changes the outer nature altogether. That is why we want the sadhaks to concentrate, to open this concealed consciousness...) చిత్తాన్ని సుస్థిరం కావించుకోవాలి. విషయవాంఛల కతీతంగా వుండాలి. తద్వారా దివ్యచేతనానుభవసిద్ధి పొందాలి. నిమ్నచేతనల నిరాకరణ వలననే ఉన్నత చైతన్యస్తరాలు దగ్గరౌతాయి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*SABCL* Vol. 23, p. 906-07)

చిత్తశుద్ధి – ఏకాగ్రత

మనస్సుయొక్క ఎల్లలను ఛేదించి జ్ఞానము యొక్క పొలిమేరలను చేరటం ఒక ఎత్తు. దాంతో నీలోని అన్ని విభాగములను వెలిగించి ఉద్దీపింప జేసుకోవటం మరొక ఎత్తు. అంటే నీ దృష్టి, మనస్సు, జ్ఞానేంద్రియములన్నీ వాటి పాతరూపములు పోయి నూతనరూపములను పొందుతాయన్న మాట. ఇది సాధించాల్నంటే నిన్ను నీవు ప్రక్షాలించుకొని, ఆ జ్ఞానభాస్కరుని ముందర నిలబడాలి. అటుల చేయని యెడల నీ జ్ఞానార్జనము అతి సంకుచితమై విశాలప్రయోజనాలను సాధించలేదు. నీలోని ఇంద్రియవ్యాపారము లన్నియు యథాప్రకారం కొనసాగుతూ నిన్నేడిపిస్తూనే వుంటాయి.

– సంపాదకుడు

యోగమార్గంలో ప్రధాన రహస్య మేమంటే దృష్టిని లోనికి మళ్ళించటం. దానికి బాహ్యావస్తు దర్శనమే అలవాటు. కనుక అంతర్దృష్టి అంటే వస్తుగర్భంలోని అంతస్తత్త్వ దర్శనం. ఆ తత్త్వమే ఈ సమస్త వస్తుజాలాలను రూపాలుగా ధరించింది. సాధారణ దృష్టికి వస్తువు వస్తువే తప్ప మరేమీ కాదు. బాహ్యారూపాలను వదలి దాని తత్త్వమేదో దానిని చూచే చూపు యోగం. ఈ రూపా

లన్నీ అంతఃపురుష చైతన్య క్రియావిశేషాలు. దీనిలో మూడంచె లున్నాయి. అవి పరస్పరాశ్రితాలు. పవిత్రత (అంతఃకరణ శుద్ధి), ఏకాగ్రత, తాదాత్మ్యం.

చిత్తశుద్ధి ప్రయోజనం మనస్సును నిర్మలదర్పణంగా మల చుకోవటం. అప్పుడే దివ్యసత్య మందులో ప్రతిబింబిస్తుంది. పార దర్శకంగా వుంటే తప్ప దివ్యచేతనావిష్కృతి జరగదు. దివ్య ప్రభావ ప్రకాశాలు ప్రవహించవు. సూక్ష్మద్రవ్యమునే దివ్యచేతన తన కనుకూల రూపాలుగా మలుచుకోగలదు తప్ప మట్టిముద్ద లను కాదు.

*

ఈ చిత్తశుద్ధి ఏకాగ్రతకు దోహదం చేస్తుంది. నిజాని కీరెండూ ఒకటే. స్త్రీ-పుంభావాలు. ఒకటి సౌమ్యశక్తి. మరొకటి క్రియాశీల మైన ఉష్ణశక్తి. ఈ రెండూ ఒకే తత్త్వానికి రెండు ముఖాలన్న మాట. చిత్తశుద్ధి ఏకాగ్రతకు అనుకూల నేపథ్యం. ఆ నేపథ్యంలో ఏకాగ్రత పరిపూర్ణ క్రియావంతమౌతుంది. సర్వశక్తిమంతమౌతుంది. ఈ ఏకాగ్రతతో అంతఃశుద్ధి తన పని తాను చక్కబెట్టుకొంటుంది. అది లేకపోతే కేవల శాంతికి, శాశ్వత విశ్రాంతికి దారితీస్తుంది. దాని వైరుద్ధ్యాలూ పరస్పర సంబద్ధాలే. ఎందుకంటె అపవిత్రత, అపరిశుద్ధత ధర్మసాంకర్య – అజాగృతికీ, చేష్టాసంకీర్ణతకూ దారితీస్తుంది. దీనికి కారణమేమంటే ఆత్మశక్తిపై స్థైన ఏకాగ్రత సిద్ధించకపోవటం. మనస్వభావంలోనే బాహ్యాస్పర్శాకర్షణలకు లోబడటం, అవి మనస్సుపై పడి గందరగోళాన్ని సృష్టించటం, ఏదీ సక్రమంగా, సజావుగా, ఋజువుగా, ఉండకపోవటమే గందర గోళమంటే. అందువల్ల ఏకాగ్రత చెదరిపోతుంది. చిత్తాకర్షణలే సత్యాలుగా భ్రమించే స్థితి ఏర్పడుతుంది. అంతేకాని ఉత్తమ బుద్ధి నిర్ణయంకానీ – ఉత్కృష్ట జీవాత్మ నిర్ణయాలు కానీ కావు. అవి శ్రాంత, చలనశీలమైన, అధోమనస్సు కల్పించేది. దీని నిర్ణయాలు మర్కట స్వభావం కలవి. ఏదీ ఋజుక్రియ కాదు. ఆ స్థితిలో పవి త్రత, ఋజుక్రియ, పరిశుద్ధమైన కాంతిమంతమైన చైతన్యం సుదూ రాలు. బాహ్యప్రభావాలకు లోనైన పరిసరాల అవకాశాలు పర

స్ఫురం ఒక దానిలో ఒకటి చొచ్చుకొనిపోయి లుంగలుపడి, అల క్షోభ్యసమ్మఖాలై, చెల్లాచెదరైపోవటం తప్ప ఏమీ లేదు. కనుక ఈ చిత్తశుద్ధి లేకుండా పరిపూర్ణమైన ఏకాగ్రత సమానంగా ఋజు భావన ఇచ్చు, ఆలోచనలు కల్పించి ఆధ్యాత్మికానుభూతికి చాళ్ళు త్రవ్వలేదు. కనుక రెండూ సమానంగా ప్రవహించాలి. ఒకటి మరొక దాని విజయహేతువు కావాలి. అప్పుడే మనం శాశ్వత శాంతబిందువులోనికి ప్రవేశించగలం. బిందువు మనిషిలో అఖండ సర్వశక్తిమంత సర్వజ్ఞమైన మహాజ్యోతియొక్క ప్రతిమా ఖండాన్ని ప్రతిష్ఠిస్తుందో అది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

(*SABCL* Vol. 20, pp. 493, 494, 303)

ధ్యాన ఏకాగ్రతల అంతరాలు

కదలకుండా కూర్చుని ధ్యానం చేయటం తేలికే. కాని నడుస్తున్నప్పుడు కూడ ధ్యానం చేయవచ్చు. ఇంకా కొంత పరిపక్వ దశకు చేరినప్పుడు ఎప్పుడైనా, ఎక్కడైనా, పని చేస్తున్నప్పుడైనా మనస్సు చెదిరిపోకుండా వుంటుంది. చేతనాస్థాయిలో మార్పు వచ్చినప్పుడు ఇక నువ్వు ఏం చేసినా ఎలా వున్నా పరవాలేదు. నీ ఆత్మ ముందుకు వచ్చి ప్రకాశించటం ఇంకా గొప్ప సిద్ధి.

— సంపాదకుడు

సాధకుని చైతన్యసర్వస్వమున్నూ ఒకే ఒక స్థానము (హృదయ కమలము, శిరస్సు మొ॥) పైగాని, ఒకానొక రూపముపై గాని స్థితము కావటమే ఏకాగ్రతయని గ్రహించాలి. అయితే ధ్యానమనగా దైవ చింతన, తదస్ఫుర్శలను స్వాగతించటం, తన ప్రకృతి తీరును సాక్షియై పరిశీలిస్తూ, వివేచనతో తగు చర్యను గైకొనటం మొ॥

*

ధ్యానయోగంలో చైతన్య సర్వస్వాన్ని ఏకీకృతం చేయనవసరం లేదు. నిశ్చలమైన మనస్సుతో ఒకానొక విషయముపై చింతన చేయవచ్చు. లేదా సాక్షీభూతమై అవసరమైనప్పుడు తగు చర్య తీసుకొనవచ్చును.

*

మన యోగంలో ప్రశాంతస్థితి గాని ఒకానొక స్పందన (శ్రీమాత చింతన, స్మరణ, శ్రీమాతయందు లయించుట) ఏకాగ్రతగా తలచ వచ్చును. అయితే జ్ఞానసాధనయే ధ్యేయంగా, దృష్టిని లగ్నం చేయ టమే ధ్యానయోగమని గ్రహించాలి.

*

జ్ఞానప్రాప్తికి ధ్యానయోగమే సుగమమైన మార్గము. ఈ ప్రక్రియ మేధోభూతమేగాని హృత్సంబంధ మెన్నటికీ కాదు. హృదయ కమలమందు దృష్టి కేంద్రీకరించటం ధ్యానయోగము కానేకాదు. అనుక్షణము తన ఇష్టదైవముకై తపించటమే ఏకాగ్రతకు సూచన యని తెలుసుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

*

ధ్యానప్రక్రియ కేవలం మనోవృత్తి కావటంచేత, మనోమయ పురుషునికి మాత్రమే యోగ్యము. ధ్యాన మాచరిస్తూ కూడ ఏకా గ్రత సాధించవచ్చును. ఇదిన్నీ మానసికమే. అందువల్ల సాధకుడు పొందు నిశ్శబ్దస్థితి కూడా అదే తీరు. ఈ తీరులో శరీరము స్థాణు వైపోగా, ధ్యానప్రక్రియకు ఏమాత్రము ఆటంకము కలుగదు. సాధకుడు కొన్ని గంటలపాటు ధ్యాననిష్ఠలో నున్నప్పటికీ, తద నంతరం అతడు సగటు మనిషితో సమానమే. ఎందుకంటే ధ్యాన ప్రక్రియలో ఈతని చిత్తము మాత్రమే అచంచలమగును. శరీరం లోని అన్యభాగములు ధ్యానసమయమందు అదుపులో వున్నప్ప టికి అనంతరము యథాప్రకారంగా ప్రవర్తించును. (You may pass twenty hours of the day in meditation and for the remaining four hours you will be an altogether ordinary man because only the mind has been occupied – the rest of the being, the vital and the

physical, is kept under pressure so that it may not disturb. In meditation nothing is directly done for the other parts of the being.) అయితే సాధకులపై వీటి యొక్క ప్రచ్ఛన్న ప్రభావము త్రోసిపుచ్చలేము. నేను ధ్యానప్రక్రియ యందు ఆరితేరిన వారిని అనేకమందిని గమనించాను. ధ్యానస్థితినుండి జాగ్రదావస్థకు చేరుకున్న పిమ్మట వీరంతా సగటు మనుషులకు తీసిపోరు. వీరికి ధ్యానప్రక్రియలో ఏమాత్రం విఘాతం కల్గినా, ఆగ్రహావేశాలకు లోనుగావటం చూస్తున్నాము. మనస్సును, అదుపు చేసుకొన్నా, ఇతర వృత్తులని నియంత్రించ లేకపోవటం దురదృష్టం.

ఏకాగ్రత ఇంతకంటె క్రియాపరమైన ప్రక్రియగా గ్రహించుకోవాలి. ఈ ప్రక్రియ బహుముఖంగా – అనగా భౌతిక, శారీరక, చైత్యకంగా గానీ వీటన్నిటినీ మేళవించిన పూర్ణసాధనతో గానీ సాగిపోవచ్చును. ఏకాగ్రత సాధన, ధ్యానముకన్న బహు క్లిష్టము. చైతన్య సర్వస్వాన్ని ఏకీకరించటం సంపూర్ణంగా గాని, పాక్షికంగా గాని, ఖండఖండాలుగా గాని జరుగవచ్చును. అయితే వాటి ఫలితాలున్నూ, అందుకు అనుగుణంగా భిన్నభిన్నమే.

చిత్తైకాగ్రత సాధించగల్గితే ధ్యానయోగం కరతలామలకం. ఈ ఏకాగ్రతారహిత ధ్యానము సాధ్యమే. సాధకుడు తనయందలి భావతరంగ ప్రవాహాన్ని గమనించటమే ధ్యానయోగం. చిత్తైకాగ్రత ఎన్నటికీ కానేరదు.

మూలం: శ్రీమాత

అనువాదం: శ్రీ శరణ్

(*SABCL* Vol. 23, pp. 723, 534; *CWM* Vol. 4, pp. 7-8)

కొన్ని మార్గదర్శక సూత్రాలు

నువ్వు సుఖాసీనుడవై కదలకుండా కూర్చుని ధ్యానం చేసుకున్నప్పుడు ఆలోచనల వేధింపు తగ్గి మనస్సు కాస్త కుదుట పడుతుంది. కాని మనిషంటె మనస్సు ఒక్కటే కాదు కదా. నీలోని తదితర విభాగములన్నీ కూడ వాటి తృప్తి కోసం నిన్ను పిలుస్తూ వుంటాయి. అందుకని నీ దృష్టిని వాటి వైపు తరలించాలి. నీ ఆలోచనలను ఏ విధంగా ధ్యానం చేసి నియమించావో అలాగే వీటికి కూడ ఆధ్యాత్మిక చికిత్స జరపాలి.

— సంపాదకుడు

కదలికలు లేకుండ నిశ్చలంగా కూర్చునే స్థితి, ఏకాగ్రతతో కూడిన ధ్యానానికి సహజమైన స్థితి; కాని నడచుట, నిలుచుండుట, కదలికలతో కూడినవి. నిలకడ కలిగి, నిశ్చల ప్రశాంత చైతన్య స్థితిని వ్యక్తి పొందినప్పుడే, నడిచేటప్పుడు, మరింకేదైనా చేయుచున్నప్పుడు కూడ ఏకాగత్రను పాటించుట, గ్రహించుట సులభమవుతుంది. చైతన్యమంతయు ప్రధానంగా నిశ్చేష్టస్థితిలో నిలచి, దానంతట అది సమ్మైక్యమై యుండుట, ఏకాగ్రతకు అనువైన స్థితి. శరీరములో చలనరహితస్థితిని ప్రతిష్ఠించి కూర్చొనుట అందుకు విశిష్టమైన పద్ధతి. దీనిని పడుకున్నప్పుడు కూడ చేయవచ్చునుగాని, ఆ విధానం ఎంతో మందమైనది గనుక, అచేతన స్థితికి దారి తీస్తుంది. ఈ కారణం చేతనే యోగులు ఎప్పుడు ధ్యానం చేయాలంటే ఆసనంలోనే కూర్చుంటారు. కాని నడుస్తూ, నిలబడి, పడుకుని ధ్యానం చేయుట అలవాటు చేసుకోవచ్చును, కాని కూర్చుని ధ్యానం చేయుటయే ప్రథమ సహజస్థితి.

*

ప్రారంభంలో దీర్ఘకాలం వరకు ప్రయత్నపూర్వకంగానే ఏకాగ్రతను అభ్యసించుట అవసరమవుతుంది. కారణం, ప్రకృతి, చైతన్యము రెండు కూడ సిద్ధంగా వుండవు కనుక. అలాంటప్పుడు

కూడ ఏకాగ్రత ఎంత ఎక్కువ శాంతముగ, సహజముగ ఉంటే, అంత మంచిది. కాని ఎప్పుడైతే చైతన్యము, ప్రకృతి సిద్ధమవుతాయో, అప్పుడు ఏకాగ్రత స్వచ్ఛందంగా, అత్యంత సులభంగా, ఎట్టి ప్రయత్నము లేకుండా, ఎల్లవేళలా జరగాలి. అది సహజమైన, శాశ్వతమైన స్థితి అవుతుంది – ఎట్టి ప్రయత్నము లేకనే దివ్యసాన్నిధ్యంలో ఆత్మ సుస్థిరపడిన స్థితి అవుతుంది.

*

ఒకే సమయంలో ఏకాగ్రతలో వుండి, బాహ్య కార్యాచరణ గావించుట మొదట్లో వీలు కాదనుట వాస్తవము. కాని అది కూడ సాధ్యమే. అయితే, చైతన్యము రెండు భాగములుగ విభజన చెంది, ఆంతర్యంలో నున్న ఒక భాగము భగవత్ సాన్నిధ్యంలో నిలిచిపోయి, బాహ్యంలోనున్న మరో భాగం, బాహ్యకార్యాచరణ గావిస్తుంది – లేనట్లయితే సర్వమూ నిశ్చలమై, పూర్తిగా అచలమైపోతుంది. దివ్యశక్తి (మనస్సు కాదు) చేతిలో నువ్వు ఒక ఉపకరణమైపోయెదవు.

*

ఏకాగ్రతను గురించిన భయాన్ని తొలగించాలి. ఏ శూన్యతా భావము నిన్నావహించినట్లుగా భావించుచున్నావో, ఆ మహోత్కృష్ట నిశ్శబ్దతలోని మహోన్నత ప్రశాంతతలో నిన్ను నీవు తెలుసుకుంటావు. నిన్ను నీవు తెలుసుకోవలసినది శరీరంలో దాగియున్న స్వల్పమైన 'అహం' గా కాదు, విశ్వవ్యాప్తి చెందిన ఆధ్యాత్మిక జీవిగా. చైతన్యము కరగిపోదు – కరగిపోయేవి చైతన్యపు పొలిమేరలు. ఆ నిశ్శబ్దతలో ఆలోచనలు కొంతవరకు ఆగిపోవచ్చు. అనంతమైన స్వేచ్ఛ, విశాలతలు మినహా వేరేమియు ఉండకపోవచ్చు. కాని అట్టి నిశ్శబ్దతలోకి, అట్టి శూన్యవిశాలతలోకి పైనుండి అపారమైన శాంతి, వెలుగు, బ్రహ్మానందము, జ్ఞానము, భగవంతుని ఏకతయొక్క అనుభూతిని ప్రసాదించే ఉన్నత చైతన్యముల అవరోహణ జరుగుతుంది. ఇది పరివర్తనకు ప్రారంభం. ఇందులో భయపడవలసిన దేమియు లేదు.

*

చాలామంది చైతన్యమంటే మెదడనో లేక మనస్సు అనో అనుకుంటారు. కారణం, అది వివేకపరమైన ఆలోచనకు, మానసిక దృక్పథానికి కేంద్రము గనుక. కాని చైతన్యము అలాంటి భావనకుగాని, దృక్పథానికి కాని పరిమితం కాదు. అది శరీరమంతటనూ ఉంటుంది. మరియు దానికి ఎన్నో కేంద్రాలుంటాయి. ఉదా॥ అంతరంగ ధ్యానానికి కేంద్రం మెదడులో కాదు, హృదయంలో ఉంటుంది. ప్రాణిక కామనల (vital desires) జన్మస్థానం ఇంకా దిగువన వుంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసవతి, జానకి

(*SABCL* Vol. 23, pp. 727-29, 1075)

ధ్యానము, ఏకాగ్రత, చైతన్యము

చైతన్యము మనస్సుకంటె గొప్పస్థాయి. నువ్వు సాధన చేసి దాన్ని పట్టుకుంటే చాలు. నీ మనస్సులో నిమగ్నమై ఉన్నప్పుడు నీకు నీ మనస్సు తప్ప ఇంకేమి కనపడదు. కాని సాధన చేసి బైట పడ్డప్పుడు, నువ్వు నీ మనస్సును వేరే వస్తువును చూసినట్లుగా చూడవచ్చును. అటులనే నీ ప్రాణికము, నీ శరీరమూను – వీటన్నిటి నుండి వేరైనందువల్ల నువ్విక వాటికి బానిసవు కావు. అప్పుడిక నీ చేతనని నీ ఇష్టం వచ్చిన చోట – నీ ఎదలోనో, తలలోనో, తలకు పైభాగంలోనో ఎక్కడ పడితే అక్కడే నిలపవచ్చు.

– సంపాదకుడు

ప్రశ్న: మధుమయీ దృష్టిని హృదయం మీద కేంద్రీకరించాలని తమరు సెలవిచ్చారు. అనగా మనస్సుతోనే కదా?

మనస్సుతో కాదు బిడ్డా, చిచ్ఛక్తితో[1]! అది ఆలోచించటం కాదు – కేంద్రీకరించటం. *నీ ఆకాంక్షనంతా, నీ యిచ్ఛా శక్తినంతా*

---

[1] చేతన, చైతన్యము = Consciousness

హృదయం మీదనే ప్రయోగించాలి! అక్కడ focus చేయాలి. దీనికి ఆలోచనతో పని లేదు. మనస్సులో ఏ విధమైన కదలికా లేకుండానే నీ వ్యక్తిత్వాన్నంతా బిగించి వుంచవచ్చు. నిజానికి ఆలోచన లేనప్పుడే గట్టి పట్టు దొరుకుతుంది. ఈ ప్రక్రియను కనుక నేర్చుకున్నట్లయితే ఇక నీ మనస్సు నువ్వు చెప్పిన మాట వింటుంది. జీవితం మీద నీకు మంచి పట్టు లభిస్తుంది.

నీ చేతన నీకు చిక్కినప్పుడు, దానిని నీ శరీరంలో ఎక్కడ పడితే అక్కడే వుంచవచ్చును. అప్పుడు నువ్వు నీలోని భావాలను, సంవేదనలను (feelings), ప్రచోదనలను (impulses) విస్పష్టంగా గుర్తించగలుగుతావు. నీ చేతన అంటె ఏమిటో నీకు స్పష్టంగా తెలుస్తుంది. దానిని నీ ఇష్టమొచ్చిన చోట – నీ శరీరంలోగాని, ప్రాణికంలోగాని, చైత్యకేంద్రంలోగాని (ఇది అన్నిటికంటె లాభ దాయకం) పంపించవచ్చును. నీ మనస్సులోకి, మనస్సుకంటె పైకి, విశ్వములో సుదూర ప్రాంతాలకు పయనించవచ్చు.

ఇదంతా సాధించే ముందర నీ చేతన అంటే అసలేమిటో తెలుసుకోవాలి. దానిని ఎరిగి ఒక చోట ఎలా నిలపాలో నేర్చు కోవాలి.

నీ చేతనను నీ అవయువాలకంటె భిన్నమైన వస్తువుగా గ్రహించాలి. నిజానికి నీ సర్వాంగములు దాని ఉపకరణములు – దాని అభివ్యక్తికి సాధనములు. చేతన అనే వస్తువు మనస్సును, ప్రాణికాదులను ఉపయోగించుకుంటుంది. ఇంకా చెప్పాల్నంటే చేతనను శరీరంలో కూర్చోబెట్టినప్పుడే నీకు శరీర స్పృహ కలు గుతుంది. అటులనే నీ ప్రాణికము, నీ మనస్సు, నీ సమస్తమైన వృత్తుల మీద నీ చేతనను ప్రసరింప జేస్తావు. అప్పుడు "ఓహో ఈ మనస్సు నాది, ఈ శరీరం నాది అనే భావనలు కలుగుతాయి."

ప్రశ్న: మాములు మానసిక విజ్ఞానాన్ని దాటి ఈ నూతన చైత న్యాన్ని పొందాలంటె ప్రతిసారి అలా చేయలా?

అవును. ఎందుకంటె మొదట్లో నువ్వు సంపాదించుకున్న విద్య నిలవదు. అట్టి శాశ్వత చైతన్యం కలిగేంతవరకు నువ్వు

క్రిందికి దిగజారిపోతూనే వుంటావు. ఆ అనుభూతి మాయమైపో తుంది. అయితే ఒకసారి దీనిని సాధించి పట్టుకున్నావనుకో – రెండవసారి తేలికవుతుంది. ఈసారి మరీ అంత కష్టపడనవుస రము లేదు. నీ ప్రయత్నాన్ని తీవ్రతరం జేసి ఆ అంతరంగిక స్పర్శ కలిగినప్పుడు ఇక నీకెట్టి బెడదా వుండదు.

అప్పటి నుంచి నువ్వు నీ ఉపరితలంలో కాకుండా అంత శ్చేతనలో, ఊర్ధ్వచేతనలో స్థితమై, నిన్ను, నీ శరీరాన్ని ఈ పరిస రాలన్నిటిని చూస్తూ వుంటావు. ఏం చేయాలో నీకే తెలిసిపో తుంది.

ఇదీ, ఈ ప్రక్రియయొక్క మొదటి ప్రయోజనము. దీని తరు వాత అనేక ఫలితములు కలుగుతాయి.

ఆ స్థాయికి జేరుకోవాలంటే చాలా కృషి కావాలి. ఫలితం వెంటనే దక్కదు. అయితే నీ అంతర్ ద్వారాలు ఒకసారి తెరచు కున్నట్లయితే రెండోసారి తెరచుకోవటం ఖాయం. నువ్వు పట్టు దలతో ప్రయత్నించాలి అంతే.

తలుపు తెరచుకోనంత కాలం ఫలిత ముంటుందో వుండదో అని నీకు అనుమానం కలగవచ్చు. ఒకసారి తలుపు తెరుచు కుంటే, నీ ప్రయత్నం, నీ ఆకాంక్ష నిరవధికంగా కొనసాగు తున్నంత కాలం, ఇక అనుమానానికి తావెక్కడిది?

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 7, pp. 253-55; Vol. 4, p. 9)

ఏకాగ్రతను ఎలా సాధించాలి?

జ్ఞానము లేక తెలుసుకొనటమనేది అనేక స్థాయిలలో వుంటుంది. బాహ్యముగా గోచరించునది స్థూలజ్ఞానము. ఇది మన నిత్య కృత్యములకు సరిపోతుంది. కానీ లోతైన రచనలనుగాని, ఒక మహాగ్రంథమునుగాని అధ్యయించునప్పుడు వాటిలోని గూఢార్థమును గ్రహించాలి. మన బుద్ధినంతా దాని మీదనే కేంద్రీకరించాలి. అప్పుడు నువ్వు ఆ మాటలను ఛేదించి వాటికి మూలమైన భావమును గ్రహించగలుగుతావు. ఇంకా లోతుకి ప్రవేశించిన యెడల ఆ భావము వెనకాల తత్త్వమును దర్శించగలుగుతావు. అనగా ఈ భాషాప్రపంచాన్ని దాటి రెండంచెలు పైకి వెడతావన్న మాట. అదొక విశాలదృష్టి – మహత్తర దర్శనము. అక్కడి నుంచి ఒక వెలుగును, శక్తిని ఈ ప్రపంచం మీదికి ప్రసరింపజేసి దానిని ప్రభావితం చేయగలవు. స్థూల దృష్టికి బందీ అయి వుంటావో లేక లోతైన రహస్యాలను తెలుసుకుంటావో నువ్వే నిర్ణయించుకోవాలి. *– సంపాదకుడు*

శరీరంలోని కండరాలను వ్యాయామం ద్వారా ఎలా పెంచుకోవచ్చో అలాగే చిత్తైకాగ్రతను కూడ తగిన శిక్షణ ద్వారా అభివృద్ధి చేసుకోవచ్చు. ఇందుకు విభిన్న శిక్షణా పద్ధతుల్ని, ప్రక్రియల్ని అనుసరించవచ్చును. ఉదాహరణకు ఎంత అర్భకుడైనా శిక్షణ పొంది తారాస్థాయి నందుకోగలడు. అయితే కొవ్వొత్తి దీపంలాగ కొడిగట్టే సంకల్పం మాత్రం పనికిరాదు.

చిత్తైకాగ్రతను నిరంతరం ప్రయత్నం చేసి అలవరచుకోవాలి. దీనికి ఒక పద్ధతి, క్రమబద్ధమైన వ్యాయామం వుండాలి. గట్టి సంకల్పం వుంటే దీనిని సాధించవచ్చును.

కాని 'దీనివల్ల ఏమిటి ఉపయోగం'? అనే ప్రశ్న రాకూడదు. అటువంటి ప్రశ్న నీ సంకల్పాన్ని నీరు కారుస్తుంది. 'ఒక వ్యక్తి ఒకానొక లక్షణంతో పుడతాడు, దానిని ఎవరూ మార్చలేరు' అన్న భావన కేవలం మూర్ఖత్వం.

ప్రశ్న: ఏకాగ్రతకోసం (మనస్సును ఏకోన్ముఖం చేయడం), సంక ల్పశక్తిని అభివృద్ధి చేసుకోవడం ఎలా? ఏ పని చేయడానికైనా అది ఎంతో అవసరం కదా.

అందుకు క్రమబద్ధమైన, సహనంతో కూడిన, నిరుత్సాహం ఎక్కడా కానరాని, మొండివైఖరితో వ్యాయామం చేయడం ద్వారా సాధిం చవచ్చును.

*

ప్రతి రోజు నువ్వు ప్రశాంతంగా ఉండేందుకు, ఒక నిర్దుష్ట సమ యాన్ని నిర్ణయించుకోవాలి.

శ్రీఅరవిందుని గ్రంథాలలో ఏదైనా ఒకదానిని తీసుకోవాలి. అందులోని ఒకటో, రెండో వాక్యాలు చదవాలి. అటుపిమ్మట మనస్సును నిశ్శబ్దం చేసి, ఆ వాక్యాలలోని నిగూఢార్థాన్ని అవ గాహన చేసుకోడానికి మనస్సును ఏకాగ్రం చేయాలి. మానస నిశ్శబ్దాన్ని సాధించాడానికి, ప్రగాఢంగా ఏకాగ్రత సాధించడానికి ప్రయత్నించు. ఫలితాన్ని రాబట్టుకోవడానికి ప్రతి రోజూ ఆ విధంగా మళ్లీ ప్రారంభించాలి.

అయితే నిద్రకు మాత్రం ఉపక్రమించకూడదు.

ప్రశ్న: అమ్మా! శుక్రవారం నాటి క్లాసులలో, మీరు తరచు ఒక వాక్యం చదివి వినిపించేవారు. దానిపై ఏకాగ్రం చేసి, ధ్యానం చేయాలని మాకు చెప్పేవారు. కాని ఒక వాక్యంపై ధ్యానం చేయడం ఎలా? ఆ వాక్యంలోని భావంపై ధ్యానం చేయాలా? మేమేం చేయాలి?

ఆ వాక్యం ఒక మానస రూపకల్పన. ఆ రూపకల్పన ఆకృతి ధరించింది. ఆ రూపకల్పనకు అభివ్యక్త రూపమే ఆ వాక్యం. నువ్వు ఒక వాక్యంపై ధ్యానం చేయడానికి రెండు పద్ధతులు ఉన్నాయి. ఆ మాటలను గూర్చి ఆలోచించే సామాన్య, బాహ్య క్రియాశీలక పద్ధతి, వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయ త్నించడం, ఆ వాక్యం సరియైన అర్థం ఏమిటో బౌద్ధికంగా గ్రహిం చడం – ఇది క్రియాశీలక ధ్యానం. ఈ కొద్ది మాటలపై ధ్యానం

చెయ్యాలి. వాటిలోని ఆలోచనను హేతువుతో, విశ్లేషణతో, వివరణాత్మకంగా అవగాహన చేసుకోవడం అది.

మరో పద్ధతి వుంది. అది ప్రత్యక్షమైంది. ప్రగాఢమైంది. ఆ వాక్యంలోని మాటల సమాహారాన్ని, వాటిలోని ఆలోచనలను పరిగ్రహిస్తూ, నీ శక్తియుక్తు లన్నింటిని కూడదీసుకుని, నీ బలాన్ని ఉపయోగించి ఆ వాక్యంపై ఏకాగ్రచిత్తంతో ధ్యానం చేయాలి. ఉదాహరణకు కేవలం మాటల పొందికపై నీ శక్తుల్ని కేంద్రీకరింప చేయడానికి బదులుగా అందులోని భావం మీద నీ శక్తియుక్తులను కేంద్రీకరించాలి.

అప్పుడు ఆలోచనను చాలినంత ఏకాగ్రం చేసి, అది చంచలం కాకుండా ఆపగలిగితే, ఆ మాటలు వ్యక్తం చేసే ఆలోచన నుండి వాటి వెనుకగల భావం (idea) వైపు నువ్వు తిరుగుతావు. దానిని మరో మాటలలో, ఇతర రూపాలలో నువ్వు వ్యక్తం చేయవచ్చు. అనేక భిన్న ఆలోచనలను సంతరించుకునే శక్తి ఆ భావానికి ఉంటుంది. అది దాని లక్షణం. నువ్వు దీనిని సాధించగలిగితే, కేవలం మాటలను మాత్రమే అర్థం చేసుకోకుండా ఇంకా లోతులకు వెళ్లినట్లే. సహజంగా, నువ్వు కేంద్రీకరింప చేసి, దానిని ఎలా చేయాలో తెలుసుకుంటే ఆ భావన నుండి దాని వెనుకగల జ్యోతిర్మయశక్తి వైపు నువ్వు కదులుతావు. అప్పుడు నువ్వు సువిశాలమైన, ప్రగాఢమైన సామ్రాజ్యంలోకి ప్రవేశిస్తావు. కాని అందుకు కొంత శిక్షణ అవసరం. మరి ధ్యానమంటే అదే గదా.

నువ్వు బాగా లోతులలోకి వెళ్లగలిగితే, భావతత్వాన్ని, దానికి మూలమైన శక్తిని దర్శించగలుగుతావు. అది నీకు సిద్ధిని ఇవ్వగల శక్తిని ఇస్తుంది.

(...you pass quite naturally from the thought expressed by the words to the *idea* which is behind and which could be expressed in other words, other forms. The characteristic of the idea is the power to clothe itself in many different thoughts. And when you have achieved this, you have already gone much

deeper than by merely understanding the words. Naturally, if you continue to concentrate and know how to do it, you can pass from the idea to the luminous force that is behind. Then you enter a much vaster and deeper domain. If you are able to go deep enough, you find the Principle and the Force behind the idea, and that gives you the power of realisation. This is how those who take meditation as a means of spiritual development are able to unite with the Principle which is behind things and obtain the power to act on these things from above.) ఆధ్యాత్మిక వికాసం కోసం ధ్యానాన్ని సాధనగా చేసుకోగలిగినవారు భావాల వెనుకగల తత్త్వంతో సాయుజ్యం చెంది, పైనుండి వాటిపై కార్యో న్ముఖం కాగల శక్తిని సంపాదిస్తారు. అది చాలా కష్టసాధ్యమైన శిక్షణ, చాలాకాలం పట్టే వ్యాయామం. కాని అంత శ్రమపడ నవ సరం లేకుండా ఆలోచన నుండి తేలికగా భావం వైపు కదల వచ్చు. నీ మనస్సులో ఒక వెలుగు, అవగాహన కలిగిస్తుంది. ఆ భావాన్ని ఏ రూపంలోనైనా వ్యక్తం చేసే శక్తి అది నీకు ఇస్తుంది.

ఇది ఒక పెద్ద నిచ్చెన లాంటిది. పైన ఒక తత్త్వం (principle) వుంటుంది. అది ఒక్కటే కాదు, దానిని దాటి ఇంకా పైకి పోవచ్చు. ఈ తత్త్వాన్ని భావాల రూపంలో వ్యక్తం చేయవచ్చు. అనేక ఆలోచనలలో ఈ భావాలను వ్యక్తం చేయవచ్చును. ఈ ఆలోచనలు అనేక భాషలను ఉపయోగించుకోవచ్చు. అనేక పదాలు ఉపయోగించుకోవచ్చు.

నేను ఒక విషయాన్ని నీకు ఇచ్చానంటే, నువ్వు ఏకాగ్రత సాధించడంలో అది తోడ్పడడానికి మాత్రమే. కొంతమంది నీ ఎదురుగా ఒక పువ్వు, ఒక రాయి, లేదా మరో వస్తువునైనా ఉంచి, దాని ఎదురుగా కూర్చోని నీ మనస్సును దానిపై కేంద్రీకరిం చాలి అని చెబుతారు. నీ కళ్లు దానినే చూస్తూ చివరికి ఆ వస్తు వుగా మారిపోతావు. ఏకాగ్రతకు అదొక పద్ధతి. నువ్వు కదల

కుండా ఆ విధంగా చూడడంవల్ల, చివరికి నువ్వు చూసే వస్తువులోకి నువ్వు ప్రయాణిస్తావు.

Only gaze steadily at that. That gives you a look. It makes you squint.

ఇదంతా మనస్సును కేంద్రీకరించడం కోసమే. అంతే. ఒక్కొక్కసారి ఈ వాక్యాలలో కొన్ని అత్యంత ప్రగాఢమైన సత్యాన్ని వ్యక్తం చేస్తాయి. అటువంటి ఆనందమయ వాక్యాలు చాలా లోతైనవి. ఆ వాక్యాల వెనుకగల సత్యాన్ని తెలుసుకోడంలో అది నీకు సహాయపడుతుంది.

ఏదో ఒక దానిపై మనస్సును కేంద్రీకరించు. లేదా నిన్ను నువ్వు సాధ్యమైనంతగా సమీకరించుకో. ఏకాగ్రతలో పరిపూర్ణత్వం నువ్వు సాధించినప్పుడు, ఈ పరిపూర్ణత్వాన్ని దీర్ఘకాలం పాటు కాపాడుకోగలిగితే, నీలో ఒక తలుపు తెరుచుకుంటుంది. నీ సాధారణ చైతన్య సరిహద్దును దాటిపోతావు. నువ్వు ప్రగాఢమైన, ఉన్నతమైన జ్ఞానంలోకి అడుగుపెడతావు. లేదా నీలోకి నువ్వు ప్రవేశించు. కళ్లకు మిరుమిట్లుగొలిపే ఒక రోచిర్నివహాన్ని దర్శిస్తావు. ఒక అంతర్గత అద్భుతాన్ని, ఒక ఆనందాన్ని, సంపూర్ణ జ్ఞానాన్ని, మహానిశ్శబ్దాన్ని అనుభవిస్తావు. అయితే ఇందుకు సాధ్యమైన అనేక మార్గాలు ఉన్నాయి. కాని దర్శనం మాత్రం ఒక్కటే. పరిపూర్ణత్వపు అత్యున్నత శిఖరాగ్రంపై నీ ఏకాగ్రతకు చాలా కాలం నువ్వు నిలుపుకోగల శక్తిని బట్టి ఈ దర్శనం నీకు అనుభవైకవేద్యం అవుతుంది.

*

ఒక బిందువును తీసుకోవడం చాలా వీలుగా వుంటుంది. బిందువుపై మనస్సును కేంద్రీకరించవచ్చును. అది నిశ్చలంగా వుండాలి. ఎంత నిశ్చలంగా వుండాలంటే ఒక దశలో వ్యక్తి ఆ బిందువుగా మారాలి. ఎవరో ఆ బిందువుపై మనస్సును కేంద్రీకరించడం లేదు. ఆ వ్యక్తే ఆ బిందువు. నువ్వు కలవరపడకుండా తగిన బలంతో, ప్రశాంతితో, ఈ ఏకాగ్రతను కొనసాగిస్తే, నువ్వు ఒక ద్వారం వద్ద నిలబడతావు. ఆ ద్వారం తెరుచుకుంటుంది. నువ్వు

ఆవలి వైపునకు వెళతావు. అప్పుడు నీకు క్రాంతిదర్శనం కలుగుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

(CWM Vol. 4, p. 5; Vol. 12, p. 400, 207-08; Vol. 9, pp. 381-83; Vol. 4, pp. 8,9; Vol. 5, p. 400)

అపరోక్షానుభవ మార్గం

సర్వజ్ఞానమూ ప్రత్యక్షానుభవమే – అంటే తాదాత్మ్యం. ఏది తెలుసుకోదగ్గదో అది కావటమే, అదిగా పరిణమించటమే, దానిలో విలీనం కావటమే. అదీ, నీవూ ఒకటి కావటం పేరే అపరోక్షానుభూతి. నీవెంత ఆలోచించినా, తలపగలగొట్టుకున్నా, తర్కించినా అది తెలియదు.

కానీ అపరోక్షానుభవ విధానం తెలుసుకోవచ్చు, అభ్యసించాలి. దానికి ప్రధాన మార్గం 'అహంకార పంజరం' నుండి విముక్తికావటం. అహంకారబద్ధుడుగా వున్నంతవరకు 'ముక్తి' లేదు. వికాసం లేదు.

దీనికనేక మార్గాలు. ఒకటి మాత్రం చెబుతాను.

నేను పారిస్ నగరంలో వున్నప్పుడు చాలమందిని కలిసేదాన్ని. వారనేక జీవన మార్గస్థులు. కొందరు ఆధ్యాత్మికమార్గగాములైతే మరికొందరు యోగమార్గస్థులు. ఒక రోజున స్వీడన్ దేశీయురాలని గుర్తు – ఆమె నన్ను ఆహ్వానించింది. ఆమె కొక జ్ఞానవిధానం తెలుసు. ఆమె మాతో – మేము ముగ్గురమో నల్గురమో అనుకుంటా (ఆమెకు ఫ్రెంచి సరిగా రాదు. ఆమెకు ఇది తెలుసు, – "అది ఇలాగా వుంటుంది. నీవొక వస్తువునో లేదా నల్లబల్లపై ఒక గుర్తునో గ్రహిస్తే – గీస్తే ఏదైనా ఫర్వాలేదు. ఉదాహరణకు నా నల్లబల్లపై ఒక గుర్తుని గీస్తాను. మీరా గుర్తుపై మీ మనోదృష్టులను కేంద్రీకరించండి. మీకు మరో వస్తు జిజ్ఞాస

వుండరాదు. మీ దృష్టులు ఆ చిహ్నం/ గుర్తు నుండి చెదరరాదు. ఆ చిత్రం/ చిహ్నం మిమ్మల్ని ఇంద్రజాలంలో ప్రభావితం చేసి నట్లు భావించండి. చూడండి (ఆమె అక్కడక్కడే కూర్చుని) చూడండి, చూడండి, అంటున్నది. ఎంతకాలం పడుతుందో నాకు తెలియదు, చూడండి. మీరా బొమ్మై పోయేంతవరకు అప్పుడు మీరావలి ప్రక్కకు దాటిపోయి మరొక చైతన్యంలోకి ప్రవేశి స్తారు."

మాకు నవ్వొచ్చింది. అది తమాషాగా వుంది కనుక. కానీ అది మంచి అభ్యాసమే. ఆ చిహ్నం బదులొక భావమో, శబ్దమో కూడ కావొచ్చు. నీ కేదైనా సమస్య వుందనుకో. దానికి సమా ధానం తెలియదు. దానినే వస్తువుగా చేసుకో. దానిపై నీ దృష్టిని కేంద్రీకరించు. *నీవు కేవలం శబ్దాలపై మనస్సు నిలుపు. అదే నీ మనస్సు నిండా వుండాలి.* మరొకటి ప్రవేశించరాదు. కొంతసే పటికి నీకు ఏదో మార్గం గోచరిస్తుంది. అప్పుడు నీవు అవతలి వైపునకు ప్రవేశించావు. అంటే ఏమిటి? నీ చేతనలో ఏదో ద్వారం తెరుచుకొన్నదన్న మాట. నీకు సమాధానం లభించిందన్న మాట. నీ చిక్కుముడి విడిపోయినట్లే ఇక.

ప్రశ్న: పరమాత్మ ఈ విధానంలో లభిస్తుందా?

తప్పకుండా. ఒక విషయం నీకు తెలియటమంటే దానితో నీవు తాదాత్మ్యం చెందటమే. భగవంతుడూ ఇంతే. ఇదే మార్గం. అన్యం లేదు. కనక నీ ఇష్టవస్తువుపై మనస్సు నిలుపు నిశ్చ లంగా. ఆ వస్తువు పరవస్తువే అనుకో. దానిపైనే నీ మనస్సుం డాలి. ఇది నీకు చేతకాకపోతే శతోపాయాలైనా నిన్ను కాపాడ లేవు. చెల్లాచెదరు కావటం తప్ప, అటూ ఇటూ ఊగిసలాడటం తప్ప – ఏమీ లభించదు. ఈ మార్గం నీ కభ్యస్తమై నీ వెక్కడ వున్నా – ఏం చేస్తున్నా మనో లక్ష్యం చెదరదు. మార్గం తెలి యాలే తప్ప లక్ష్యం నిమిషంలో చేరవచ్చు. కనుక దీని విఘ్నం – ఏకాగ్రత సిద్ధించకపోవటమే. లక్ష్యశుద్ధి, పట్టుదల వుంటే ఒక నిముషమో – పదినిముషాలో చాలు. శాశ్వతకాల పర్యంతమూ ఇదే మార్గం. నీ ప్రతి ఆలోచనా పరమేశ్వరమయమైతే – ఇసుక

రేణువై – అదే కొండలాగ పేరుకొని పోతుంది. ఈ ఉదాహరణ కాదనుకో. ఎందుకంటె ఆధ్యాత్మిక ఫలితం 'రాశి' కాదు – నీవు లోపలకు పెరగటమే. నీకిది క్రమంగా తెలుస్తుంది. కనక ఇసక కొండలాగా కాక – ఆత్మవిస్మృతితో నీవందులోకి ప్రవేశించటం. 'సరే ప్రతిరోజూ నేను భగవంతుని 10 సార్లు చింతిస్తాను. మననం చేస్తాను' చేస్తూపో. క్రమక్రమంగా అదే కొండంత అవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

(CWM Vol. 5, 219-21; 224-26)

ఏకాగ్రత కేంద్రములు:

దృష్టిని ఎక్కడ కేంద్రీకరించాలి?

మన శరీరంలో వున్న కొన్ని కేంద్రముల ద్వారా మన మధికమైన శక్తిని పొందవచ్చు. ఎందుకంటే ఈ కేంద్రములు యోగ శక్తికి నిలయములు. అటుల చేయుటవలన ఒక్కొక్క కేంద్రము వికసించి మన శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. – సంపాదకుడు

శరీరంలోని మూడు కేంద్రములలోను మనకి ఏది వీలయితే దాని మీద దృష్టిని కేంద్రీకరించవచ్చు. మన ఆత్మని కప్పివున్న ముసుగును తొలగించుటకు హృత్కేంద్రము మీద దృష్టిని కేంద్రీకరించి దాన్ని తెరిపించాలి. ఇదెలా సాధ్య మనేదే ప్రశ్న. ఇక నీకదొక్కటే వ్యాపకమన్న మాట. ప్రేమతో, భక్తితో ఆకాంక్షించి దైవానికి లేక గురువుకి సమర్పించుకోవటంవలన ఆ ముసుగు తొలగిపోయి ఆ కేంద్ర మావిష్కార మౌతుంది. ఇక *నీ చైత్య పురుషుడే బయటకు వచ్చి నీ బాధ్యతనంతా వహిస్తాడు. అనగా నీ మనస్సును శరీరాన్ని వెలిగించి దైవోన్ముఖము చేస్తాడు.* కాని నీలోని పాత అలవాట్లన్ని దీని నెదిరించి నీ పని పట్టి

స్తాయి. అయితేనేమి నీ చైత్యపురుషుడు వీటన్నిటిని తుడిచిపెట్టే యగలడు; నిన్ను చైత్యసామ్రాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేయగలడు.

శిరస్సునకుపైన సంకేంద్రణం

దీనిని (పై పేరాలోని ఫలితాన్ని) ఈ యోగమందు చైత్యపరివర్తన మంటారు. శిరస్సునకు పైన (శిరస్సుపైన గాదు) సంకేంద్రణ ప్రభావం చేసే పని శాంతి, మౌనాలను క్రిందికి గొనిరావడం, శరీరభావంనుంచి, మనఃప్రాణ ములతో తాదాత్మ్యనుండి జీవుని విడిపించటం. అంతేగాక ఆ ప్రభావంచేత మానసిక ప్రాణిక, భౌతిక చేతనారూపమైన నిమ్న తర చేతన ఉచ్చతర చేతనను కలుసుకోడానికి పైకి వెళుతుంది. మరియు ఆధ్యాత్మిక ప్రకృతియొక్క ఉచ్చతర చేతనకు గల శక్తులు మనఃప్రాణదేహములలోనికి దిగుతాయి. దీనినే ఈ యోగ మందు ఆధ్యాత్మిక పరివర్తన మంటారు. సాధకుడు ఈ ప్రక్రియ తోనే ప్రారంభించితే, అపుడు పైనుంచి దిగేశక్తి నిమ్నతమ కేంద్రంతో సహా సర్వకేంద్రాలను తెరచిపెట్టాలి. మరియు చైత్య పురుషని, వెనుకనుంచి ముందుకు గొనిరావాలి. ఏలన, అది జరిగేవరకు నిమ్నతర చేతన పైనుంచి పనిచేసే దివ్యప్రక్రియతో కలిసిగాని, దానిని నిరాకరించిగాని ఎంతో కష్టాన్ని లేక సంఘ ర్షాన్ని కలిగించుతుంది. కాని చైత్యపురుషుడు సక్రియుడయితే, ఈ సంఘర్షం, ఈ కష్టాలు ఒక కనీస స్థాయికి తగ్గిపోతాయి.

భ్రూమధ్య కేంద్రం

కనుబొమల నడుమ చేసే ఏకా గ్రతా ప్రభావం వలన అక్కడి కేంద్రం తెరచుకుంటుంది. అంతర మనస్సు మరియు దృష్టి విము క్తమవుతాయి. అలాగే ఆంతర లేక యోగచేతన, దాని అనుభ వాలు, శక్తులు గూడ విముక్తమవుతాయి. ఈ కేంద్రం నుంచి కూడ సాధకుడు పైకి తెరచుకోవచ్చు. మరియు క్రింది కేంద్రము లపై గూడ పనిచేయవచ్చు. అయితే ఈ ప్రక్రియలో ఒక ప్రమాద ముంది. మానసిక, ఆధ్యాత్మిక రచనలలో బంధింపబడిన విము క్తమై సమగ్ర ఆధ్యాత్మిక అనుభవ, జ్ఞానాలలోనికి, పురుష ప్రకృ తుల సమగ్ర పరివర్తనలోనికి రాలేకపోవచ్చు.

ఒక్కొక్కప్పుడు హృదయంలోను, ఒక్కొక్కప్పుడు శిరస్సుపైన చేతనను ఏకాగ్రం చేయడంలో అపకారముండదు. కాని ఏ స్థానంలోనైనా ఏకాగ్రత అంటే ఒకానొక ప్రదేశంలో చేతనను నిలిపి ఉంచడం కాదు; నీ చేతనాస్థావరాన్ని ఒక చోట ఏర్పరచి, ఆ స్థావరం మీద కాక, అటునుంచి భగవంతుని మీద ఏకాగ్రపరచాలి. కండ్లు మూసిగాని, తెరచిగాని, ఏది నీకు మిక్కిలి అనుకూలమో, అలా ఏకాగ్రతను సాధించవచ్చు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి; చెలసాని నాగేశ్వరరావు
('యోగంపై లేఖలు' నుండి)

(*SABCL* Vol. 23, pp. 725, 746, 726)

హృదయమందు సంకేంద్రణం

ఉపరి చేతన కంటే ఇతరమైన ఈ సత్యచేతనకు రెండు ప్రధాన కేంద్రాలున్నాయి – ఒకటి హృదయంలో (భౌతిక హృదయం గాదు, రొమ్ము నడుమున ఉండే కేంద్రము) రెండవది శిరస్సులో, హృదయమందు చేసే సంకేంద్రణం లోనికి తెరచుకుంటుంది; ఇక ఈ అంతర్ముఖ ఉన్మీలనం ననుసరించి లోతులోనికి పోతే, సాధకుడు అంతరాత్మ లేక చైత్యపురుషుని ఎరుక నందుతాడు – ఈ అంతరాత్మే వ్యక్తియందలి దివ్యాంశం. కాగా ఈ అంతరాత్మ అనావృతమైనపుడు, ముందుకు వచ్చి, ప్రకృతిని శాసింప ప్రారంభించుతుంది. దానిని, దాని గతుల నన్నింటిని పరమసత్యం దిశగా, భగవంతుని దిశగా త్రిప్పి, పైనున్న దాని నంతను దానిలోనికి పిలువసాగుతుంది. పిమ్మట అంతరాత్మ దానిలోనికి భగవంతుని సన్నిధిని దింపుతుంది. జీవుని అంకితం గావించుతుంది. పైన వేచియున్న ఒక బృహత్తర శక్తి మరియు చేతనయొక్క అవతరణను మన ప్రకృతిలోనికి ఆహ్వానించుతుంది. సాధకుడు తనను

భగవంతుని నివేదించుకుని, అంతర్ముఖ, ఉన్మీలనానికి, హృదయంలో భగవంతుని సన్నిధికి ఆకాంక్షించుతూ, హృదయ కేంద్రమందు ఏకాగ్రం గావడమే ప్రథమ మార్గం. మరియు, అది చేయగలిగినపుడు, అదే సహజ శ్రీకారం; ఏలన ఒకసారి ప్రాప్తించినపుడు, దాని ఫలితం ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంతో ఎక్కువ సులభం, సురక్షితం గావించుతుంది – రెండవ మార్గంలో ఈ సౌలభ్యం, సురక్ష ఉండవు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి)

(*SABCL* Vol. 23, pp. 517-18)

శిరస్సునందు సంకేంద్రణం

ఇక ఈ రెండవ సంకేంద్రణం మానసిక కేంద్రమైన శిరస్సునందు సంకేంద్రణం. ఇది ఉత్తల మనస్సుయొక్క మౌనాన్ని సాధించగలిగితే, లోపల నున్న ఒక ఆంతర, విశాలతర, గభీరతర మనస్సుకు తెరచిపెడుతుంది. పోతే ఈ ఆంతర మనస్సునకు ఆధ్యాత్మిక సామర్థ్య ముంటుంది. అయితే సాధకుడు ఒకసారి ఇక్కడ సంకేంద్రితమయినపుడు, అతడి నీరవ మానసిక చేతనను, దానికి పైన ఏదేది ఉందో, దాని కంతకు ఊర్ధ్వముఖంగా తెరచి ఉంచాలి. కొంతకాలానికి సాధకుడు తన చేతన ఆరోహించుతోందనే అనుభవం పొందుతాడు. ఇంతవరకు తన ఈ నీరస మానసిక చేతనను శరీరంలో బంధించి ఉంచిన మూతను (lid) దాటి, పైకి వెళ్లి, అక్కడి ఒక కేంద్రమందు అది కుదురుకున్నదనే *సంవేదనను కూడ ఒకనాడతడు పొందుతాడు. అక్కడ అది ఆనందం లోనికి విముక్తమవుతుంది.* అపుడది వైశ్వ ఆత్మతోను దివ్యశాంతి, ప్రకాశశక్తి, జ్ఞాన, ఆనందములతోను సంపర్కములోనికి రా నారంభించి, క్రమంగా దాని అంతటిలోను ప్రవేశించి అదే అవుతుంది.

చివరికది ప్రకృతిలోనికి ఇవి అన్నీ దిగడాన్ని గూడ సంవేదించు తుంది. మనస్సులో నిశ్చలత రావాలనే ఆకాంక్షతో శిరస్సులో చేతనను కేంద్రీకరించడం, శిరస్సుపైన ఆత్మ భగవంతుల ఉప లబ్ధి నందడం; ఇదే రెండవ సంకేంద్రణ ప్రకారం. అయితే ఇక్కడ మన మీ విషయం గుర్తుంచుకోవడం ముఖ్యం. శిరస్సునందు చేతనా సంకేంద్రణం శిరస్సుపైన కేంద్రానికి ఆరోహించేందుకు ఒక సన్నాహం మాత్రమే. ఈ విషయం గుర్తుంచుకొనకపోతే, సాధకుడు తన మనస్సునందు, దాని అనుభవాలందు మాత్రమే బంధించబడవచ్చు. లేక ఉత్తమ పక్షాన ఆధ్యాత్మిక అతీత అవస్థ లోనికి ఆరోహించి, అక్కడ నివసించడానికి బదులు, పైనున్న సత్యంయొక్క ఒక ప్రతిబింబాన్ని మాత్రమే పొందవచ్చు. కొంత మందికి ఈ మానసిక సంకేంద్రణం సులభతరం, కొంతమంది ఒక దాని తర్వాత ఒకటిగా రెండూ చేయగలుగుతారు – కాని ఒక వేళ చేయగలిగితే, హృదయకేంద్రంలో ఆరంభించడమే ఎక్కువ వాంఛనీయం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి)

(*SABCL* Vol. 23, p. 518)

పూర్ణయోగము – చిత్తైకాగ్రత

రాజయోగంలో చిత్తైకాగ్రత

భారతదేశంలో జ్ఞానమార్గ సాధనోపాయంలో చిత్తైకాగ్రత ఒకా నొక ప్రత్యేకతను సంతరించుకొన్నది. చిత్తైకాగ్రత అనగా, మనస్సు నుండి సంకల్పాలను తొలగించటమే. ఆ పిమ్మట మనస్సును ఏకోన్ముఖం చేయగా, జ్ఞానోదయమై ఆ భిన్నత్వమే ఏకత్వ సత్య స్వరూపముగా సాక్షాత్కరిస్తుంది. అలా కాకపోతే, ఈ సంకల్పాలు భిన్నత్వమనే ఊబిలోకి దిగజార్చగలవు. కాబట్టి సంకల్పాల ఉప సంహారణమే సత్యస్వరూప దర్శనమునకు దోహదము చేస్తుం దని తెలుసుకోవచ్చును.

ఈ ప్రక్రియ, ఆదిలో మనశ్శుద్ధితో ఆరంభమై, పిమ్మట త్యాగనిరతి, నిష్క్రియలు తోడుకాగా, తుదకు అఖండము, అవిచ్ఛి న్నమైన సర్వాతీతమైన సమాధిస్థితియందు పర్యవసిస్తుంది. ఈ సాధన కొనసాగించినవారు తిరిగి సంసారచక్రంలో అడుగిడటం బహు అరుదు. మోక్షార్థియైన యోగి, సర్వకాలములలోను ఈ సమాధిస్థితికై పరితపిస్తాడు. ఎగువ వివరించిన సాధన తీరంతా మనకు రాజయోగంలో కానవస్తుంది. ఈ రాజయోగ మార్గంలో, తొట్టతొలుత సాధకుడు బాహ్యాంభ్యంతరశ్శుచియై, ఇంద్రియప్రేర కమైన నిమ్న మానసికవృత్తులను నిరోధించి, అచంచల స్థితికి చేరుకోవాలి. ఈ యోగసాధనలో సాధకుడు జ్ఞేయమును చక్కగా దర్శించి, ఆ జ్ఞానమును కఠోరసాధనతో స్థిరముగా నిల్పుకొని, తుదకు జ్ఞేయమునందు లయించిపోవాలి. రాజయోగంలో, ఈ అంతిమదశయైన జ్ఞాత, జ్ఞాన, జ్ఞేయముల ఐక్యమే సమాధిస్థితిగా సుప్రసిద్ధమైనది. (The Knowledge by which the Knower is the Known (*Savitri, p. 297)* ఈ విషయంలో గీతయొక్క దృష్టి బహు విశాలమైనదిగా తెలుస్తున్నది.

అయితే పూర్ణయోగం, పైన వివరించిన రాజయోగ సాధనకు భిన్నంగా బహు విశిష్టంగా కొన్ని యోగదశలలో క్లిష్టంగాను, మరికొన్ని దశలలో సులభతరంగాను రూపొందించబడింది. ఈ మార్పులు, చేర్పులు జీవాత్మ పరమోచ్చ బ్రాహ్మీస్థితి సాధనయందు అత్యంత అల్పంగాను దైవసంకేతప్రాప్తియందు అనల్పంగాను కల్పన చేయబడింది. సర్వస్వానికి మూలమైన, సర్వాతీతమైన పరమోచ్చ పరబ్రహ్మమే సాధన లక్ష్యం గావాలి. అనగా పరబ్రహ్మము అధిగమించే జీవుని సృష్టినుంచి త్యజించరాదని గ్రహించాలి. పరబ్రహ్మమే జీవాత్మయొక్క పరమోచ్చస్థితిగాను, ఒక ఆధ్యాత్మ అనుభూతిగాను గ్రహిస్తూ, జీవుని భిన్నభిన్న స్థితులందు, వాని జాగ్రత్చైతన్యమునందు తత్థ్సితి ప్రాప్తికై తగినట్లు రూపాంతరము చేయటం అవసరం. ఈశ్వర సాక్షాత్కారము, సత్యస్వరూప సందర్శనము, సృష్టియందు, సృష్టికి అతీతంగానూ ఆత్మసాక్షాత్కారమున సాధన కొనసాగిపోవాలిగాని, సృష్టినుండి, ఆత్మస్వరూపము భిన్నమని భావించటం సాధన లక్ష్యం కారాదు. అందువల్ల ఆ అనిర్వచనీయ స్వరూపాన్ని ఉపాసిస్తూ, సర్వవ్యాపిగా, సచ్చిదానంద స్వరూపునిగా, లీలామానుష విగ్రహంగా ఆరాధించటం ఔచిత్యం. ఆద్యంతమైన ఈ తత్వత్రయి సత్, చిత్, ఆనందస్వరూపము పరాస్వరూపమేనని సర్వదా గుర్తుంచుకోవాలి. ఆ స్వరూపముయొక్క సారూప్య, సాలోక్య, సాయుజ్యముకై తపించాలి. ఆ స్వరూపాన్ని నిర్గుణరూపంలో సచ్చిదానంద స్వరూపంగాను, సగుణరూపంలో జగల్లీలా కారణభూతుడుగాను ఆరాధిస్తూ, సత్య, జ్ఞాన, ప్రేమ ఇత్యాది రూపాలలోను ఉపాసించవచ్చును. ఇవన్ని గూడా ఆ దివ్యమంగళస్వరూపముయొక్క రూపావిశేషమే గదా. ఈ దివ్యరూపాలతో తాదాత్మ్యం చెందటానికి తీవ్రంగా శ్రమించాలి. ఈ సాధనావస్థ ముగిసిన పిమ్మట, అహంకారం పూర్తిగా త్యజించగా, ఆ దివ్యస్వరూపమే దిగివచ్చి మనతో ఐక్యము కాగలదు. ఈ నిరహంకార స్థితి బ్రాహ్మీస్థితికి

మాత్రమే కాదు. సృష్టిలో సర్వకాలములందును, దివ్యజీవన ఆవిర్భావానికి ఒక హేతువని గ్రహించటం అవసరం.

చిత్తైకాగ్రతయొక్క వైశిష్ట్యము

ఈ సద్గతి సమీక్షలో, చిత్తైకాగ్రత, సమాధి పదములు విశేషమైన, విశిష్టమైన అర్థముతో నిండియున్నవని గ్రహించాలి. చిత్తైకాగ్రత స్వాస్వత్మను ప్రతిబింబించే మహాతపస్సు. ఈ సర్వస్వము ఆత్మతో ఐక్యమై, సర్వము ఏకత్వంగా భాసిస్తుంది. ఆత్మయందు స్థితి పొందటమే ఆనందస్థితి. మహాతపస్సంటే ఇదే. మరోవిధంగా వివరించుకొంటే, చిచ్ఛక్తియందు స్థితమైన ఆత్మజ్ఞానము సర్వత్రా భాసించటమే చిత్తైకాగ్రతయొక్క పరాకాష్ఠ. ఈ మహాయోగమే యోగసిద్ధియని గ్రహించుకోవాలి. అనుక్షణము భేదభావనతో సతతమవుతున్న మనకు ఆత్మస్వరూపంతోగాని, ఒకానొక దివ్యస్వరూపంతోగాని అభేదము చెందటానికి ఒక సాధనము. భగవదైక్యము చెంది, తద్వారా జ్ఞానప్రాప్తి అనగా జ్ఞానయోగసిద్ధికి ఇంతకన్న మరొక మార్గం లేదు. లేనే లేదు.

సమాధి స్వరూపము

ఈ చిత్తైకాగ్రతకు మనస్సులో ఒకానొక స్పందన మూలమై, ఇందుకు సంకల్పాలు నామరూపాదులు తోడుకాగా, వాటియందు అంతర్గతంగా నిక్షిప్తమైన సత్యస్వరూపం వెల్లడి కాగలదు. స్పందన అవ్యక్తస్వరూపంగా తలిస్తే, వ్యక్తస్వరూపం ఈ స్పందనయందు జన్యమని గ్రహించవచ్చును. ఈ అవ్యక్తతత్త్వమైన స్పందనయందు మనస్సును నిల్పితే, ఈ తత్వచిహ్నమైన ఆత్మస్వరూపము, చిచ్ఛక్తి స్వరూపంగా భాసిస్తుంది. అందువల్ల ఈ అవ్యక్త తత్వస్పందనపై మనస్సును నిల్పగా, మన పరాచితి స్థితులను పొందుటకు మార్గము సుగమమవుతుంది. ఈ స్థితియే చిదాత్మయని, చిద్రూపమని, ఏకత్వమని, ఆనందస్వరూపమని అనేక పేర్లతో పిలువబడే సమాధిస్థితి. ఈ సమాధిస్థితి అంతరంగంనుండిగాని, జాగ్రదావస్థనుండిగాని, చైతన్య ఉపసంహారణంగా భావించటం తగదు. ఈ

రెంటికి బీజమై, బీజావస్థాతీతమై, సర్వావస్థాతీతమై యుండి, ఇంకా అఖండమై, అవిచ్ఛిన్నమై భాసించే ఏకత్వస్వరూపమే. మనము నామరూపాదులను గ్రహించే జాగ్రదావస్థలో నున్నా, మరెట్టి భిన్న స్థితిలో వున్నా, సర్వదా ఈ ఏకత్వమే భాసిస్తుంది. గీతా వాక్కు ననుసరించి, జీవాత్మ సమాధిస్థమై యున్నదని గ్రహించాలి. ఈ శిఖరాగ్రస్థితికి ఎవ్వరైనా ఏ కారణంగానైనా, చేరుకోకపోయినంత మాత్రమున, ఈ సమాధిస్థితియొక్క ఔన్నత్యానికి, విశిష్టతలకు లోటు రాదు. బహువిశాలమైన దీనిలో సర్వము ఇమిడిపోగలవు. ఏ విధమైన ఆటంకములు అడ్డురావు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీ శరణ్

(*SABCL* Vol. 20, pp. 304-307)

యోగసిద్ధికి మూడు ప్రక్రియలు

చిత్తైకాగ్రత ధ్యాన ప్రక్రియ

సాధకుడు ప్రప్రథమంగా మనశ్చాంచల్యమును అరికట్టి స్థిరచిత్తుడు కావాలి. బహోన్ముఖత్వం నుంచి ఏకోన్ముఖుడు కావటం అవసరం. నిత్యజీవితంలో బహుసాధారణమైన ఈ ప్రక్రియ అంతరంగంలో, ఆధారరహితంగా బహుదుర్లభం. అయితే జ్ఞానార్థికి ఈ అంతరార్చన తప్పనిసరి. ఇది మేధోభూతమైన ప్రక్రియలో తాను గ్రహించిన విషయాలను సమన్వయం చేయటం వంటిది కాదు. తర్కముతో విచారించి సిద్ధాంత స్థాపనకు ఇక్కడ తావే లేదు. కేవలం సంకల్పబలంతో సాధకుడు లక్ష్యముపై దృష్టి కేంద్రీకరించి సత్యస్వరూపమును గ్రహించటమే ఈ ప్రక్రియ యందున్న విశేషము. ఒకవేళ సాధకుడు దైవాన్ని భక్తితో ఉపాసింపదలిస్తే, ఇష్టదేవతను తదనుగుణంగా ఆరాధించాలి. తలచిన వెంటనే దేవతాస్వరూపాలు హృదయఫలకంపై వెలగాలి. అంతరంగంలో వాటిని దర్శించాలి. దైవచింతన, అనుభూతి ఒకదాని

వెంట మరొకటిగాని, ముందు వెనుక కూడ కావచ్చు. అనుభూతి అనంతరం జ్ఞానోదయము గావచ్చు. నియమాలకు ఇక్కడ ఆస్కారం లేదు. తదనంతరం తనయొక్క లక్ష్యసిద్ధిని కఠోర సాధనతో నిల్పుకోగా, నిత్యజీవితంలో ఆ దివ్యస్థితి తనయొక్క నైజమై పోగలదు.

ద్వితీయ ప్రక్రియ –స్పందనపై, చిత్తైకాగ్రత

ఈ ప్రక్రియను, చిత్తైకాగ్రతతో కూడుకొన్న ధ్యానప్రక్రియగా పేర్కొనవచ్చును. ఈ ప్రక్రియలో స్పందనయొక్క మూలముకై దృష్టి కేంద్రీకరించాలి. అందువల్ల స్పందనయందు నిక్షిప్తమైన సత్యస్వరూపమునే సాక్షాత్కరింప చేసుకోవటం సాధ్యపడుతుంది. ఇందుకు తోడ్పడని చింతనాదులపై దృష్టి అనవసరం. ఈ ప్రక్రియలో సాధకుడు ధ్యానయోగంనుండి సమాధిస్థితికి జారుకొంటాడు. సాధకుడు జాగ్రదావస్థకు తిరిగివచ్చిన అనంతరం శరీరమందలి అజ్ఞానము తొలగిపోయి, జ్ఞానకాంతులు ప్రకాశింపగా, ఆనందసముద్రంలో తేలిపోగలడు. ఉచ్చస్థితియైన సమాధిస్థితి యొక్క సత్ఫలితములు జాగ్రదావస్థలోనికి కూడ దిగివచ్చి తీరాలి. ఇదే పూర్ణయోగముయొక్క లక్ష్యము.

తృతీయ ప్రక్రియ – మనోనిశ్చలత

పై రెంటికి భిన్నమైన, ఈ ప్రక్రియ కేవలము మనస్సును నిశ్చలం గావించుటకే పరిమితమవుతుంది. ఈ మనోనిశ్చలమునకు పెక్కు మార్గము లున్నవి. పరిపరివిధాలుగా పరుగెత్తే మనస్సుకు సాక్షీభూతమైయుండుట యొక పద్ధతి. చంచలంగానున్న ఈ మనస్సు కొద్ది సేపటికి కుదుటపడి నిశ్చలస్థితికి క్రమంగా చేరుకొంటుంది. మనస్సులో ఉదయించే సంకల్పాలను తిరస్కరించటం రెండవ మార్గం. అనగా సంకల్పాలు కల్గిన వెంటనే వాటిని మనస్సు నుంచి తరిమివేయగా ప్రశాంతత ప్రాప్తిస్తుంది. క్రమేణా నిశ్శబ్దతతో కూడుకొన్న బ్రాహ్మీస్థితి సిద్ధింపగలదు. ఈ బ్రహ్మజ్ఞానము, బ్రహ్మానుభూతి సృష్టిలోని సర్వమును సాక్షాత్కరింప

చేయగలదు. సాధకుడిక నిరంతరంగా తనంత తానుగా శ్రమించ నవసరం లేదు. తనయందు ఆవిష్కారమైన దైవశక్తియే ప్రాకృత శరీరమును ఆవరించియున్న చీకట్లను పారద్రోలి వెన్నెలకాంతులతో నింపగలదు; మున్ముందు మానసిక, శారీరక, సర్వవాసనలను కూడ నిర్మూలించి బ్రాహ్మీస్థితి సూచకమైన దైవసంపదలను ప్రతిష్ఠించగలదు. ఈ ప్రక్రియ సాధకుల సంస్కారాన్నిబట్టి శీఘ్రగతిగాను, లేక మందగతిగాను సాగిపోతుంది. సాధకులు సంకల్ప ప్రేరణలకు అనుగుణంగా ఈ సాధన కొనసాగింపగా, సర్వావస్థలలోను తాదాత్మ్యస్థితి పొందగలరు. వేదకాలంనాటి సాధకుల రీతిలో నిత్యజీవనంలోను ఈశ్వరసాన్నిధ్యంలో పులకించిపోగలరు. అందువల్ల పూర్ణయోగము బహువిశిష్టమైనదని గ్రహించవచ్చును.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీ శరణ్

(*SABCL* Vol. 20, pp. 308-310)

అఖండ దర్శనము

పూర్ణయోగంలో సాధకుడు మొట్టమొదట్నుంచి తన సర్వస్వమును గాఢంగా దైవానికి సమర్పించుకోవాలి. మనలోని వివిధ భాగములను ఏమాత్రము మినహాయింపు లేకుండా ఆ నిఖిలనాథుని చెంతకు చేర్చాలి. మనకు కావలసినది ఈ సంపూర్ణ ఆత్మసమర్పణమే తప్ప వేరొండు కాదు. దీని అర్థమేమిటో మనం స్పష్టంగా తెలుసుకోవాలి. ఈ ప్రపంచాన్ని మనం చూసే విధానము, మన అజ్ఞానము – ఒకటేమిటి, ఈ తప్పులతడకనంతా, మన వ్యక్తిత్వమునంతా, ఈ 'నేను' అనే పదార్థమునంతా ఏ మాత్రము మొహమాటం లేకుండా 'పూర్ణాహుతి' కావించాలి.

దైవముయొక్క స్వస్వరూపమును (తనకు తాను ఎలా కనపడుతాడో), మన ద్వారా ఎలా కనపడుతాడో నిరంతరం మనకి దర్శనం అయినప్పుడు అది మానసిక సిద్ధి.

అటులనే హృదయముయొక్క ప్రేమానురాగములన్నియు దైవమునందు భక్తిగా పర్యవసించినప్పుడు – అనగా దైవమునకు తన యందును, సృష్టిలోగల సమస్తమైన దేవతల ద్వారా, విభూతుల ద్వారా, సర్వభూతముల ద్వారా అభివ్యక్తమైన ప్రేమను దర్శించినప్పుడు అది హృదయముయొక్క పరమసిద్ధి. చివరగా మన బుద్ధి నంతయు స్వప్రయోజనములకుగాని, ఇంద్రియప్రేరణములకుగాని వెచ్చించరాదు. దైవేచ్ఛయే, ఒక్క దైవేచ్ఛ మాత్రమే మన సమస్త కర్మలకు, వర్తనములకు ప్రేరణము కావలెను. దీని అర్థమేమిటి? ఇంద్రియములు చేయు ప్రేరణలకుగాని ఇతరత్ర గాలిలో మనకు తగిలే, దారేపోయే దానయ్యలకుగాని మనము ఏ మాత్రం స్పందించ కూడదు. మనము అఖండ విశ్వముతో ఐక్యమైతిమి. విశ్వములో దైవమాచరించు ప్రక్రియల నన్నింటిని చిరునవ్వుతో పరమానందభరితముగా స్వీకరించవలెను. ఇదే పూర్ణ యోగములోని ముఖ్యమైన మొదటి సిద్ధి.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 20, pp. 78-79)

కాలము – కార్యము

అనేక పనులున్నప్పుడు గొడవే – ఏ పని చేసేందుకు టైం చాలదు. కాని తక్కువ టైంలో ఎక్కువ పనులు చేసేందుకు ఓ ఉపాయమున్నది. అన్ని పనులు ఒకేసారి తలపెట్టి బుర్ర వేడి చేసుకోకూడదు. ఒక్కొక్కసారి ఒక్కొక్క పనినే తలపెట్టాలి. నీ మనస్సునంతా దాని మీదనే కేంద్రీకరించాలి. అప్పుడా పనిని తక్కువ కాలంలోనే చేయగలుగుతావు. నీ మనస్సును నిశ్చలము చేసుకొని ఆ పని మీదనే కేంద్రీకరించినప్పుడు, నీ చైతన్యాన్నంతా ఆ ఒక్క పని మీదనే నిలిపి, అందులకే వినియోగించినప్పుడు ఆ పని దబ్బున అయిపోతుంది. అరె 'అప్పుడే ఎలా అయిపోయింది' అనిపిస్తుంది. ఇదెలా సాధ్యమనే అనుమానం నీకు రావచ్చు. వెనుక నుంచి ఏదో శక్తి వచ్చి (ప్రచోదక శక్తి) నిన్ను నడిపిస్తుంది. ఒక గంటపట్టే పని పావుగంటలోనే అయిపోతుంది. ఇది ఎంత లాభమో చూసుకో – నీకు టైము కలిసివస్తుంది. ఈ విధంగా ఒక పని పూర్తిచేసుకొని హాయిగా కూర్చోవచ్చు. మళ్లీ ఇంకో పని చేసేందుకు తయారుగా వుండవచ్చు. అదే విధంగా దాని మీద కూడ నీ మనస్సును కేంద్రీకరించి కాలం కలసి వచ్చేటట్లు త్వరగా ముగించవచ్చు. ఇది అక్షరాలా సత్యం – చేసి చూస్తే నీకే తెలుస్తుంది.

శ్రీమాత

(*CWM* Vol. 7, pp. 127-28)

స్తరముల వివరణ

పాఠకుల కోరికపై ఫిబ్రవరి 2004 సంచిక 33-36 పుటలలో ఆంగ్ల ములో ప్రచురించిన అంశములకు తెలుగు అనువాదమును మీ ముందర ఉంచుతున్నాము. ఈ పేర్లను చూసి వీటిని మనస్సు యొక్క శ్రేణులని పొరపడతారేమో జాగ్రత్త – అదే సంచికలోని 11-12 పుటలు చూడండి. కొన్ని స్తరముల పేర్లలో మార్పులను కూడ గమనించండి.

అతిమనస్సు (Supermind) అనగా కేవలం సత్యస్వరూపమే. అయితే అధిమనస్సు (Overmind) యొక్క లక్షణం ఇందుకు భిన్నమై, సాధ కులయందు విభిన్న ప్రక్రియలకు దోహదము చేయగలదు. ఇచ్ఛా జ్ఞానశక్తులు, ప్రశాంతస్థితిలో ఐక్యము చెంది, ఏకత్వంగా అతిమనస్సు భాసింపగా, ఈ మూడున్నూ భిన్నంగాను, భిన్నప్రక్రియలతోను అధి మనస్సు భాసిస్తుంది. అయితే విచిత్రంగా మానవమాత్రులలో ఈ తత్వం కుంచించుకొనిపోయి అవిద్య జడత్వములుగా దిగజారిపో తుంది. సాధనలో అసంకల్పితంగా జ్ఞానసిద్ధి కలుగటంగాని, ఏ కార ణంగానైనా ప్రశాంతస్థితికి విఘాతం కలుగటంగాని మనము ఎరిగి నదేగదా.

ఊర్ధ్వమనస్సు (Higher Mind)

మనము మేధోపర నిత్యజీవితాన్ని అధిగమించి ఊర్ధ్వమనః స్థితిని చేరుకొనటానికి, సాధనలో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, ముందుకు సాగిపోవాలి. ఈ స్థితి, చీకటి వెలుగులు కలయిక అయిన సంధ్యాకాలము వంటి దెన్నటికీ కాదనిన్నీ, జ్ఞానకాంతులతో ప్రకాశి స్తున్న ప్రస్ఫుట అధ్యాత్మికస్థితి యనిన్నీ గ్రహించుకోవాలి. ఈ స్థితి అభేదజ్ఞానపూరకమైన స్థితియై, భిన్నవిభిన్న క్రియా, జ్ఞానరూపా దుల స్ఫురహతో కూడుకొని వున్నది. ఈ అపురూపస్థితికి అధి మనస్సే మూలము. అయితే సర్వమునకు అతిమానసమే మూలమని తెలిసినదే. కాని ఈ స్థితిలో చింతనతో కూడుకొన్న విచారణ

ప్రముఖపాత్ర వహిస్తున్నది. జ్ఞానదీప ప్రకాశభూతమైన ఈ స్థితి జ్ఞానతత్వస్వరూపమని గ్రహించటం అవసరం. 'సర్వోహం' స్ఫురణతో కూడుకొన్న ఏకత్వ సత్యస్వరూప స్వస్వరూపమే భిన్న భిన్న రూపాదుల స్ఫురణతో కూడా భాసించటమే ఈ స్థితియొక్క విశిష్టత యని తెలుసుకోవచ్చును.

ప్రదీప్త మనస్సు (Illumined Mind)

ఊర్ధ్వమనస్సుకంటె అతీతమైనది ప్రదీప్తమనస్సు. ఈ స్థితి బహుముఖ జ్ఞానతత్వముతో కూడుకొని, అధ్యాత్మిక ప్రభలతో వెలిగి పోతుంది. ఈ స్థితిలో ప్రస్ఫుటమైన అధ్యాత్మిక వైశిష్ట్యము, జ్ఞాన కాంతుల ప్రభలు క్రమేణా జ్ఞానవెల్లువలలో దేదీప్యమానంగా వెలిగి పోతాయి. ఆధ్యాత్మిక తత్వరహస్యముల చిత్ర విచిత్రఛాయలు చైతన్యస్వరూపములోకి చొచ్చుకొనిపోయి, దివ్యప్రశాంతతను చేకూర్చగా, ఆనందతరంగాలలో తేలియాడటం జరుగుతుంది.

స్వతః స్ఫురణ (Intuition)

ఈ ఊర్ధ్వ, ప్రదీప్త ఉభయ మనఃస్థితులయొక్క ఆధిక్యము, ఉత్కృష్టత ఈ స్థితిద్వయముయొక్క సంపూర్ణ సమ్మేళనము గ్రహించటానికి మరొక భూమిక అవసరము. ఈ మహోన్నత శిఖరాగ్రములందు స్ఫురత్పురుషుడు స్థితుడు. ఈ స్థితియే సర్వజ్ఞానమునకు మూలమై తదనంతరం చింతన, విచారణ, దర్శనాదులకు హేతువై సాధకునికి అందుబాటులోనికి వస్తుంది. ఈ స్వతః స్ఫురణము చైతన్యస్వరూపముయొక్క ఒకానొక అపురూప విశేషమై, జ్ఞానబిందువులను స్పృశిస్తుంది. అభేద్యమైన అంతరాంతరలోతులలో నుండి ఒక్క ఉదుటన దూసుకొని వచ్చిన అద్భుత విశేషము. ఒకానొక చైతన్యస్వరూపము, మరో చైతన్య విశేషమందు లయించి, అద్దానిని దర్శించి ఆ సత్యస్వరూప గ్రహణలో పులకించిపోతుంది. ఒకవేళ బాహ్యాచైతన్యము లయించకపోయినా, సత్యాన్వేషణలో తన అంతరాలను దర్శించినపుడు ఈ స్ఫురతా కాంతులు ఉద్దీప్తమవుతాయి. ఇంకా లోతుగా విశ్లేషించుకుంటే, ఒకానొక చైతన్యస్వరూపము సత్య

స్వరూపాన్ని సాక్షాత్కరించుకొనగా, రూపాదుల అధ్యాత్మిక తత్త్వ స్వరూపాన్ని దర్శించిన వేళయందుగాని, వాటియందు లయము చెంది నపుడు జ్ఞానజ్యోతులు దేదీప్యమానంగా వెలిగిపోతాయి. ఇదంతా ఒక మారు సమీక్షించుకొంటే, ఈ తత్త్వము కేవలము దర్శన సంబంధ మనిగాని, లేక భావతరంగ విషయమనిగాని తలంచటం తగదు. అంతరాంతరాల లోతులను స్పృశించగా దర్శనాదులు ప్రాప్తించటము సహజమే. గుప్తమైనప్పటికీ, ప్రచ్ఛన్నరూపంలో భాసిస్తూ స్ఫురణ శక్తి, తత్త్వరహస్యాన్ని, తాదాత్మ్యస్థితిని, సద్దర్శనాన్ని వెల్లడిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీ శరణ్

సమాచార పత్రం

21 ఫిబ్రవరి నాడు శ్రీమాత జన్మదిన మహోత్సవము, 29 ఫిబ్ర వరినాడు సువర్ణదినము, ఆశ్రమంలో జరుపబడినవి. పొద్దున 6 నుంచి 6-30 వరకు సమాధి దగ్గర ధ్యానము, శ్రీమాతారవిందుల మందిర దర్శనము, సాయంకాలము క్రీడాంగణములో విన్యా సము, చివరగా ధ్యానము ఇందలి ముఖ్యాంశములు. ఈ రెండు దినములలోను ఆశ్రమంలో కృతజ్ఞతాపూర్వకమైన వాతావరణము, ఆరాధనా భావము వెల్లివిరిసినవి – ఈ దర్శన సందేశములు 'సావిత్రి' లోని పంక్తులు.

21 ఫిబ్రవరి 2004

Her heart's inexhaustible sweetness lured their hearts,
A being they loved whose bounds exceeded theirs;
Her measure they could not reach but bore her touch,
Answering with the flower's answer to the sun
They gave themselves to her and asked no more.

29 ఫిబ్రవరి 2004

My soul and his indissolubly linked
In the one task for which our lives were born,
To raise the world to God in deathless Light,
To bring God down to the world on earth we came,
To change the earthly life to life divine.


ఈ రెండు దర్శనదినములు శ్రీఅరబిందో సొసైటీ కేంద్రములు, శాఖలన్నిటిలోను జరుపబడినవి. తిరుపతిలో శ్రీయుతులు బలరామరెడ్డిగారు, అప్పాస్వామిగారు, రఘుపతిగారు, హనుమంతుగారు తదితరులు అనేకమైన ఆసక్తికరమైన విషయములను, ముఖ్యంగా శ్రీమాత బంగారు ద్వారమును పగులగొట్టి అతిమానసశక్తిని భూమ్మీదికి ప్రవహింపచేయుటను గురించి ప్రసంగించారు. దేవతలు వచ్చి అసురులను సంహరించిన, ఒక సాధకునికి కలిగిన అద్భుతమైన అనుభూతిని కూడ వివరించారు. హనుమకొండలో ఈ రెండు దర్శనదినములు వైభవంగా జరుపుకొన్నారు. ముఖ్యంగా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నర్సంపేట కేంద్రము, శ్రీమాతారవింద ఇంటెగ్రల్ స్కూలు వారి వేడుకలలో శ్రీ సురేంద్రాచారిగారు ఈ దర్శనదినముల ప్రాముఖ్యతను గురించి చక్కగా వివరించారు.

పశ్చిమబెంగాల్, త్రిపుర: శ్రీగోపాల్ భట్టాచార్జీగారు ఈశాన్యప్రాంతములలో పర్యటించి కేంద్రములను ప్రతిష్ఠపరిచే మార్గములను గురించి సంప్రదించిరి. ఇందూరు (మధ్యప్రదేశ్) శాఖవారు స్త్రీలను గురించి ఒక శిబిరమును నిర్వహించిరి. ఇందులో 'స్త్రీలలో దివ్య శక్తి' అనే విషయంపై డా॥ సుమన్ కోచర్‌గారు ప్రసంగించిరి. పాండిచ్చేరీ నుండి డా॥ ఆలోక్ పాండేగారు 'కుండలినీ యోగము', కైవల్యా స్మార్టుగారు 'ప్రార్థనలు, ధ్యానములు' అనే విషయముల పై ప్రసంగించిరి. 'జీవితముయొక్క లక్ష్యములు, ధ్యేయములు', 'శ్రీఅరవిందుల పూర్ణయోగము' అనే విషయములపై కూడ ఉపన్యసించిరి.

చెన్నైలో శ్రీ ప్రదీప్ నరంగుగారు 'దైవముహూర్తము' అనే విషయముపై ప్రసంగించిరి. బెంగుళూరులో ఉచితముగా సంస్కృత తరగతులు నిర్వహించబడుతున్నవి. సంస్కృతం నేర్చు కోదలచిన వారు The Administrative Manager, Sri Aurobindo Complex Trust, Sri Aurobindo Marg, J.P. Nagar - I Phase, Bangalore - 560078 (Phone No. 26349882) తో సంప్రదించండి. చండీగర్‌లో ఒక ఉపాధ్యాయుల శిక్షణా శిబిరము నిర్వహించ బడినది. ఏప్రిల్‌లో ముఖ్యమైన దినములు: 4 ఏప్రిల్ శ్రీఅరవిం దులు పాండిచ్చేరికి వచ్చిన రోజు; 24 ఏప్రిల్ దర్శన దినము – శ్రీమాత పాండిచ్చేరికి వచ్చి స్థిరపడిన రోజు.

ప్రకటన

గోవిందుభాయి పటేలు గారు వ్రాసిన "My Piligrimage to the Spirit" అనే 176 పేజీలుగల ఆంగ్లపుస్తకము వడోదరా (గుజ రాతు) శాఖవారు ఉచితంగా పంచిపెడుతున్నారు. గోవింద్‌భాయి 1927 నుంచి 8 సం॥ లు ఆశ్రమంలో నివసించారు. శ్రీఅరవిందు లతో వారు జరిపిన ఉత్తర ప్రత్యుత్తరములు కూడ ఇందున్నవి. ఇది వలయువారు పాకింగ్, పోస్టింగ్ కొరకు 5 రూ పంపిస్తూ, Vadodara Branch, Sri Aurobindo Society, Sri Aurobindo Nivas, Dandia Bazar, Vadodara - 390001 కు రాయవలెను. శ్రీఅరబిందో సొసైటీ కేంద్రములు, శాఖలవారు కూడ ప్రతులకోసం రాసుకొన వచ్చును. కాపీలు వారి దగ్గర వున్నంత మేరకే ఇవ్వబడును కాబట్టి త్వరపడండి.



భగవంతుని కృపాకటాక్షములు

అఖిల

అఖిల భారత పత్రిక, మే 2004

భగవంతుని కృపాకటాక్షములు

భగవంతుని కృపాకటాక్షముల ప్రాప్తి

విశ్వాసము

చిత్తశుద్ధి

సమర్పణ

భగవత్ కృప

రక్షణ

అనుబంధం

ఉపోద్ఘాతము

నీ జీవితంలో కష్టాలు రావచ్చు. సాధనలో అవరోధాలుండవచ్చు. వీటన్నిటికి మందు ఒక్కటే – దైవానుగ్రహము లేక దైవకటాక్షము. దైవాన్ని నమ్ముకున్న వారికి, దివ్యచేతనతో సంపర్కమున్నవారికి ఓటమి లేదు. ఒక వేళ కష్టాలు వచ్చినా చివరకి అవి విజయానికి సోపానాలు మాత్రమే అని తెలుస్తుంది. ఈ విధంగా జరగాలంటే మనకి దైవములో అంకురితమైన విశ్వాసముండాలి. మరో విషయం: మనకు faith, sincerity, purity, trust, truth, Divine grace అనే మాటలకు స్థూలమైన అర్థమే తెలుసు. కాని యోగంలో వీటికి చాలా విశేషార్థమున్నది. సాధనలో వీటికి చాలా ప్రాముఖ్యత వున్నది కూడా. ఈ లక్షణములన్నీ ఎంత ముఖ్యమైనవో ఈ సంచికలో చూద్దాం. వాటిని ఆచరణలో పెట్టగలిగితే మరీ మంచిది.

– సంపాదకుడు

భగవదనుగ్రహమమోఘం

శ్రీమాత

దైవానుగ్రహం పై మీ విశ్వాసమెంత ప్రగాఢమైనదైననూ, అన్ని సందర్భాలలోనూ, అనుక్షణమూ, జీవనగమనంలోని ప్రతి కదలి కలోనూ, ప్రతి అంశంలోనూ దాని వ్యవహారశైలిని పసిగట్టడంలో మీ శక్తిసామర్థ్యము లెంత గణనీయము లైనవైననూ, దాని అద్భుత అపార ఆచరణాశీలతా శైలులతో భావైక్యం పొందటంలో మీరెప్పుడూ కృతకృత్యులు కాలేరు. అంతేకాదు, దాని ఆచరణా క్రమం, కార్యానుశీలత ఎంత నిర్దుష్టమో, పూర్ణమో, ఖచ్చితమో కూడ మీకవగతం గాదు, మీ మేధోతీరాల కందదు. ప్రాపంచిక స్థితిగతులను, విశ్వావృత వృత్తాంతానుమేయ ప్రామాణిక ప్రమేయ పరిమితులను దృష్టిలో ఉంచుకొని, దైవసాక్షాత్కార సాధనా ప్రక్రి యను అత్యంత సరళంగా, సజావుగా, సంక్లిష్టతారహితంగా సామ రస్యపూర్ణంగా, సాధ్యమైనంత పరిపుష్టంగా కొనసాగించడమైనది. పరిపూర్ణంగా పురోగమింపజేయటంలో, దైవానుగ్రహ పాత్రాప్రమే యము లెంతమేరకో, ప్రతి విషయంలోనూ అది ఎంతవరకు పని చేస్తుందో, ఎంతగా తోడు నిలిచి నడిపిస్తుందో, దాని ప్రమేయ పర్యవేక్షణా గాఢత ఎంతో నీ కెన్నటికీ అవగతం కాదు. సృష్టి సృజన గమన గమ్య పరిభ్రమణంలో, దైవానుగ్రహ సాంద్రతా గరిమ, దాని భాగస్వామ్య శాతం జీవుల లెక్క కందదు. అది వారు సాధన జేసి సాధించగలిగింది కాదు. *దైవానుగ్రహము దైవానుగ్రహమే. దైవము తనకు తానుగా మనకు ప్రసాదించే పవిత్రమైన, ప్రవిమలమైన నజరానా.* ఎట్టి పరిస్థితులలోను మన భావనా వలయంలో పుష్పించి, పరిమళించి మన కరతలామల కంగా నిలిచేది కాదు.

మీరు దైవానుగ్రహోపేతులైన మరుక్షణం నుంచీ కాలం మీ వశమవుతుంది. విశ్వాంతరంగ సాకల్యమంతా మీకు సువే ద్యమవుతుంది – మీ ముంజేతి కంకణమై యలరారుతూ. అప్పటి నుంచీ, దైవానుగ్రహ ముపక్రమించే శాశ్వత వ్యవహారాలనూ,



కార్యకలాపాలనూ, నిరంతరంగా, మొక్కవోని దీక్షతో దైవాను గ్రహం నెఱపే మధ్యవర్తిత్వాన్నీ కనులు మిరిమిట్లు గొలిపేలా సాక్షాత్కరింపజేయని ఓ క్షణముగాని, మహాకాశంలోని ఓ అంశం గాని ఉండనే ఉండదు. *అంతా దివ్యచైతన్య సమాగమమే. దైవ కరుణా వలయ విన్యాసమే, దైవానుగ్రహ లాస్యమే. దివ్యానంద తాండవ విలాసమే. నిరంజన తత్త్వ విస్తృత వికాసావిష్కారమే.*

ఒక్కసారి మీరా అనుభవపారవశ్యతలో మునిగితే అభే దతా భావం దైవానుగ్రహంతో మీలో కుదురుకుంటుంది. మీరు దాని కీడన్న భావం మృగ్యమై అది మీ స్మృతిపథంలో అనం తంగా మిగిలిపోతుంది. మీరెప్పుడూ భయావృతులు కారు – అభీతి స్రవంతులలో ఓలలాడుతుంటారు. తాపత్రయ దూరులై తపస్సంపన్నులవుతారు. ఖేదాలు, శత్రుభయాలు, పరాభవాలు, వెనుదిరగటాలు ఉండవు, వంతచింతల కృంగు పొంగు లుండవు. సమశీతోష్ణ సమీకరణం, సమభావావలోకనా పూర్ణోదయం. ఒక్క సారి ఎవడైతే దైవానుగ్రహంతో మమైక్యమవుతాడో, ఆ తాదా త్మ్యంలో అన్నింటా ఈశ్వరానుగ్రహాన్ని అవలోకిస్తాడో, అతడు ఆహ్లాదకరమైన, అనంత తేజోమయమైన, సచ్చిదానందకరమైన జీవనానుభూతికి అంకురార్పణ జేస్తాడు. ఆనందమయ సహజీవ నానికి నాంది ప్రస్తావన నెఱపుతాడు. శుభం భూయాత్.

అది కేవల మదే – అది మాత్రమే దైవశక్తితో, దైవసంక ల్పంతో, సుగమంగా, సువేద్యంగా, సుహృదయ స్ఫూర్తితో, విజ యవంతంగా, మనసు పెట్టి కలిసి కదిలే, మనోజ్ఞమైన సహ జీవనా సంభావ్యత, ఆహ్వానసీయమైన పనిముట్టు, భావనా సమ ర్పణకు శ్రేష్టమైన మార్గదర్శకత. భగవధారాధనా సౌశీల్యత; సద్భావనా పరిణత.

భావానువాదం: అన్నవరం ఆదిశేషయ్య

(*CWM* Vol. 8, p. 251)

శ్రీమాత రక్షా కవచం

శ్రీఅరవిందులు

జీవితంలో కష్టనష్టాలు వస్తూనే వుంటాయి. ఆపదలను కూడ ఎదుర్కోవలసి వస్తుంది. కాని దైవ సంరక్షితుడికి ఇవేమీ లెక్క లేవు. ఎందుకంటె తన ఇష్టదైవము అతనికి ఒక కవచము తొడిగి అతన్ని రక్షిస్తూనే వుంటుంది. ఈ కవచాన్ని ఎలా సంపాదించుకోవాలనేదే ప్రశ్న. ఈ పాఠం 'ది మదర్' అనే చిన్న పుస్తకం లోనిది. ఇది సాధకులకు మంత్రరాజము. దీనిని 'మాత్రోపనిషత్తు' అని కూడ అంటారు. — సంపాదకుడు

జీవయాత్రను సురక్షితంగా గడుపుటకు రెండే రెండు విషయములు అవసరము. ఒకటి దివ్యమాత అనుగ్రహము, రెండు సాధకుని అకుంఠితమైన విశ్వాసము. ఈ విశ్వాసము తిరుగులేనిదిగా వుండాలి. చిత్తశుద్ధితో పునీతమై సమర్పణాభావంతో పెంపెసలారుతూ వుండాలి. స్వార్థము లేశమైనా పనికిరాదు.

నీ జీవితము కేవలం దైవకార్య నిమిత్తమే, దైవమును ఆవిర్భవింప జేయుటకే అని గ్రహించుము. దివ్యచైతన్య నైర్మల్యము, శక్తి, తేజము, ప్రసారము, ప్రశాంతి, ప్రమోదము తప్ప అన్యమును వాంఛింపకుము. అయ్యది నీ మనః ప్రాణ దేహములను సర్వతోముఖముగా మార్చి, పరిపక్వము చేయవలెనని కోరుకొనుము. ఆధ్యాత్మిక, అతిమానసిక దివ్యసత్యమును గాక అన్యమును వాంఛింపకుము. ఇహమునను, నీ లోను, భక్తులలోను ఆ సత్యము అనుభూతమగుటకు వాంఛింపుము. దాని యుద్భవమునకును, సకల విరుద్ధశక్తుల నదె జయించుటకును వలయు స్థితిగతులను వాంఛింపుము.

నీ యాంతరిక సమర్పణము నిర్మలముగా సమగ్రముగా నుండవలెను. కోరికలు లేకుండ, అభ్యంతరములు లేకుండ, ఆత్మ సమర్పణము సంపూర్ణముగా చేసినచో, నీ సర్వస్వము జగన్మా

తకే వశమగును; అహంకారమునకుగాని అన్యశక్తికిగాని యేమియు మిగులదు.

నీ శ్రద్ధ, ఆంతరికత, సమర్పణము ఎంత పూర్ణతరమైనచో అనుగ్రహము, సంరక్షణము అంతగా నిన్నంటి యుండును. అపుడు నిన్ను స్పృశింపగలయదిగాని, నీవు భయమొందవలసినది కాని యుండదు. ఈషదనుగ్రహము కలిగినను సకల కష్ట నిరోధ విపత్తుల నుండి నిన్నది దరిజేర్చును. సంపూర్ణానుగ్రహము నిన్నలముకొన్నచో భద్రముగా నీవు మార్గమున జనవచ్చును. అది జగన్మాత మార్గమే. బిభీషికను, ప్రబల వైరమును – ఇహలోక అగోచర పరలోకములనుండి కాని – నీవు లక్ష్యము చేయ నక్కర లేదు. తదనుగ్రహ స్పర్శచే కష్టములు సుయోగములుగా మారును. వ్యర్థత విజయముగాను, సార్థకతగాను, దౌర్బల్యము అమోఘ సామర్థ్యముగాను పరిణమించును. ఈశ్వరానుజ్ఞయే శ్రీమాత యనుగ్రహము. నేడో రేపో దాని ఫలము నిశ్చితము; అది పూర్వ నిర్దిష్టము, అవశ్యంభావి, అనివార్యము.

మూలం: శ్రీఅరవిందులు
స్వేచ్ఛానువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి; శ్రీ
శివశంకరానంద ('జనని' నుండి)

(*SABCL* Vol. 25, pp. 9 -10)

నువ్వు దైవానికి అంకితమైపోయి దైవం కోసమే జీవిస్తున్నప్పుడు ఇక నీకు భయమెందుకు? నీ కెట్టి బాధ్యతా లేదు. నీ కెట్టి ఆపదా రాకుండా దైవమే నీకో గొడుగు పట్టి నిన్ను కాపాడుతూ వుంటాడు. అప్పుడు ఎవ్వరైనా నీ కపకారం తలపెట్టినా కూడ అది నీకు ఉపకారంగానే పరిణమిస్తుంది.

శ్రీమాతారవిందుల రచనల నుండి

విశ్వాసం అంటే ఏమిటి?

శ్రీమాత

చదువుకున్న వానికంటె చాకలివాడు మేలు అన్న సామెత అక్షరాలా నిజం. జన్మతః నీకు ఆత్మజ్ఞానం వుంటుంది నిజమే కాని చదువు, తెలివితేటలు దానిని అణచివేస్తాయి. మనకి పూర్తిగా కృత్రిమ జీవితం అలవాటయిపోయి దైవమందు విశ్వాసం నామ మాత్రంగానే వుంటుంది. మన మీ అజ్ఞానంలో నుంచి బయట పడాలి. దైవాన్ని నమ్ముకున్న వారికి ఎప్పటికీ ఓటమి వుండదు. విశ్వాసం గాఢమైనప్పుడు నీ జీవితంలో దైవమే ఆవిష్కారమై పరిస్థితులను కూడ మార్చివేయగలదు. — *సంపాదకుడు*

విశ్వాసం అనగా చైత్యపురుమని గుర్తించి ఆ యనుభూతిని పొందుటయే.

*

నీ విశ్వాసమును ఎప్పటికి కించపరచరాదు.

*

నీ విశ్వాసమును ఎన్నటికి సడలించరాదు.

*

దేవుడు తప్పకుండా ఉన్నాడనే గట్టి నమ్మకమే విశ్వాసము. ఇది నీ మనస్సులోనో, ఆత్మలోనో, ప్రాణికంలోనో వుంటే సరిపోదు. అది నఖశిఖ పర్యంతం నిన్ను పూర్తిగా ఆవహించాలి. విశ్వాసం ప్రగాఢమైనప్పుడు అనుభూతి (సాక్షాత్కారం, దర్శనం) కలుగుతుంది.

విశ్వాసమున్నప్పుడు నువ్వు ఎట్టి ప్రశ్నలు వేయవు. ఫలితాలు రావటం లేదని బాధపడవు. నిన్ను పూర్తిగా సమర్పించుకుంటావు – మైమరచి దైవాధీనమైపోతావు. నీ శరీరమంతా ఈ భావముతో వెలిగిపోతూ వుంటుంది. మరో భావానికి ఆస్కారమే లేదు. సర్వము ఈశ్వరుడే. సర్వమూ చేయగలిగిన సామర్థ్యము ఒక్క ఈశ్వరునికే వున్నది. నిజంగా చేస్తాడు కూడ. నిజానికి

సమస్తము ఆయనే. కాబట్టి ఈ విధమైన విశ్వాసమున్నప్పుడు నువ్వాయనకు పూర్తిగా వశమైపోవాలి – అంతే. నువ్వు దైవాన్ని విశ్వసించావు గనుక నిరంతరం ఆయన స్మృతిపథంలో మెలగాలి. ఎవరైతే తమ ఆంతర్యంలో తమకు తాము సమర్పించుకొంటారో వారికి అది అన్ని పరిస్థితులలోను తోడుగా, అండగా, నీడగా ఉంటుంది. ప్రతి క్షణం అది అతడి యోగక్షేమాలు చూస్తుంది. దానిని గురించిన ప్రాథమిక పరిజ్ఞానం ఏమీ లేకపోయినప్పటికీ అది నీలో చైతన్యరూపంగా నడిపిస్తుంది. అయితే అటువంటి అచంచల విశ్వాసం అవసరం. దానివలన శక్తి పెరుగుతుంది. ఏది జరిగినా తట్టుకొనగల ఆత్మవిశ్వాసం అదే!

*

దైవం పట్ల సంపూర్ణ విశ్వాసం లేకుండ నీలో విశ్వాసం ఏర్పడి నట్లయితే అది దైవం పట్ల, దైవవిభూతి పట్ల, దైవీశక్తి పట్ల, దైవీ పరమైన మంచితనం పట్ల నీలో దైవం ఉన్నదనే విశ్వాసాన్ని సడలింప చేస్తుంది. మనిషిలో దైవ విశ్వాసాన్ని శిథిలం చేసే మూడు కారణాలున్నాయి.

దైవం పట్ల అచంచల విశ్వాసం ఉన్నవారు, అంతటినీ దైవమే చేస్తున్నది, దైవమే అన్నిటినీ చేయగలదు, అందరిలో, అన్నిచోట్ల, అన్నిటినీ దైవమే నెరవేరస్తున్నది, సంఘటనలన్నీ దైవప్రేరకాలే, దైవం మాత్రమే ఈ కార్యకలాపాలు చేయగలదు అని నమ్ముతారు.

అయితే ఈ విశ్వాసాన్ని కొంతకాలం తర్వాత వేరొక దృష్టితో బేరీజు వేయడం ప్రారంభిస్తే, కొన్ని ఘోరసంఘటనలు జరగడం వల్ల దైవాన్ని శంకిస్తారు.

తర్వాత విశ్వాస లోపంతో వారిలా అంటుంటారు – "నాకు దైవం పట్ల విశ్వాసం ఉంది. అయితే ఈ ప్రపంచం నేను చూస్తు న్నట్లుగా ఉండడం సరే, కాని అప్పుడప్పుడు నేనెందుకు బాధ పడతానో తెలియదు. నేను చాలా విచారంగా ఉంటాను. నా యిరుగుపొరుగు వారికన్న ఎక్కువ విచారంగా వుంటాను. ఈ జీవితం చాలా దుర్భరంగా వుంది. కాని దైవం దైవమే కదా –

అంత మంచితనం, ఔదార్యం, సామరస్యం ఉన్నప్పటికి నా కెందుకింత దుఃఖము? అంటే భగవంతుడు శక్తిహీనుడైనా అయి వుండాలి లేదా చేతకాని వాడైన అయి యుండాలి. కాని పక్షంలో ఆయన నా కిలా కష్టపడడాన్ని ఎందుకు నిర్దేశిస్తాడు?'' ఈ భావం మనిషిలో విశ్వాసాన్ని శిథిలం చేస్తుంది.

ఇక మూడవ కారణం:

ఈ సమాజంలో కొందరు అతివినయశీలురు, అతిసౌజన్య శీలురు వారిలో వారిలా అనుకుంటారు – "ఖచ్చితంగా భగవానుడే నన్ను గెంటి వేసాడు. అతనికి నేనెందుకూ పనికిరాను. దైవలీలను నేను పూర్తిగా వదలివేయవలసినదే. ఎందుకనగా నన్ను తన విష యంలో అయోగ్యుడుగా భావించుచున్నాడు''

*

జీవన సంగ్రామంలో, బ్రతుకు యాత్రలో అన్ని రకాల పరీక్షలను, బలహీనతలను అధిగమించి ముందుకు సాగే శక్తిని దైవం పట్ల విశ్వాసం మనకు ప్రదానం చేస్తుందని స్పష్టంగా చెప్పడానికే జీవి తంలో అన్ని పరిస్థితులు అమర్చబడి ఉన్నాయని విశ్వసించాలి. ఇందువల్ల దైవ విభూతితో, దైవస్మృతితో స్పర్శ ఏర్పడుతుంది. ఈ దైవచైతన్యం శాంతిని ప్రసాదిస్తుంది, ఆనందాన్ని కలిగిస్తుంది. మంచి ఆరోగ్యాన్ని, భౌతిక సమతుల్యతను ప్రసాదిస్తుంది.

*

ప్రతి క్షణం ఆ అదృశ్య (కనిపించని) శక్తి, ఆ సంకల్పించని శక్తి, ఆ అజ్ఞాతశక్తి మన ముందు ఉంటూనే వుంటుంది. అంతా ఈ అంశంపై మన విశ్వాసపు స్వచ్ఛత, సాంద్రతను బట్టి సంఘట నలు, అనుభవాలు ఆధారపడి ఉంటాయి. (At every moment all the unforeseen, the unexpected, the unknown is before us ... and what happens to us depends mostly on the intensity and purity of our faith.)

*

దైవానుగ్రహం పట్ల అంతర్గతంగా విశ్వాసం ఉన్నవారు, దైవశక్తి మనల్ని చూస్తున్నదని నమ్మేవారు, ఏది జరిగినా దైవం వుందని

నమ్మేవారు ఈ ప్రాపంచిక ఆంతరిక కష్టాల నుంచి విముక్తు లవుతారు. అతనిని ఏదీ ఏమీ చేయ లేదు. ఏ కష్టం, ఏ వైప రీత్యం యీ విశ్వాసాన్ని సడలించలేదు. ఎందుకంటే అది అనంత శక్తివంతమైనది. స్ఫురణలో నిరంతరంగా ఉంటుంది. వ్యక్తియొక్క భౌతిక నిర్మాణంతో సంబంధం లేకుంటుంది. ఆశీస్సుపైన ఆధార పడి ఉంటుంది. అందుకే అది సత్యం వైపు మొగ్గుతుంది. ఇంక యితరమైనదేదీ దానిని సడలించ లేదు.

*

ఒక పసివానివలె పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉండడం ముఖ్యం. శిశువుకు నిర్మలమైన, అచంచలమైన విశ్వాసం ఉంటుంది కదా! తనకు ఫలానాది కావాలని శిశువు అనుకొంటే అది వచ్చి తీరు తుందని నమ్ముతుంది.

*

అచంచల విశ్వాసంతో ప్రశాంతంగా, నిర్మలంగా ఉండడం చాల ముఖ్యం. కృప పట్ల ఎవరైతే దైవమునందు సంపూర్ణమైన నమ్మ కమును కలిగి వుందురో వారికి అంతయు మంచిగా, సానుకూ లంగా జరిగిపోతుంది. నీకు శ్రీరామ రక్ష. దైవాన్ని అచంచలంగా నమ్మి దైవానుగ్రహాన్ని నమ్మేవారికి అన్ని రకాల 'శ్రేయాలు' జరుగుతాయి. (*The very best happens always* to those who have put their entire trust in the Divine and in the Divine alone.)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి, పురాణపండ రంగనాథ్

(*CWM* Vol. 14, pp. 82, 165; Vol. 3, p. 152; Vol. 6, pp. 122-23; Vol. 8, pp. 38-39; Vol. 10, p. 323; Vol. 14, p. 83; Vol. 5, p. 298; Vol. 6, p. 403, Vol. 14, p. 99)

నిర్మలమైన విశ్వాసం

శ్రీమాత

'అందరిలోను దేవుడు అధివసించి వుంటాడు' అని నువ్వు మనస్సులో అనుకున్నంత మాత్రాన సరిపోదు. ఈ విషయం నీ నరనరానికి పట్టిపోవాలి – ఏ కోశానా అపనమ్మక ముండ రాదు. అప్పుడు నీకు కష్టాలు వచ్చినా సరే సాధనలో ఎన్ని అవరోధాలు కలిగినా సరే, నీకేం ఫరవాలేదు. దేవుడు నీ తోటే వున్నాడని నువ్వు నమ్మినప్పుడు నిన్నెవరూ ఏమీ చేయలేరు.

– సంపాదకుడు

విశ్వాసం నిర్మలంగా ఉండాలి. పారదర్శకంగా వుండాలి. అయితే అహంకారముతో కూడిన విశ్వాసం అలా ఉండే అవకాశం లేదు. గర్వం, గొప్పతనం, భేషజం, అహంకారం, స్వార్థపరత్వం, వైయ క్తిక భావాల వలన విశ్వాసం కలుషితం అయి వుంటుంది. అల్ప మైన కోరికల తృప్తి కోసం, క్షుద్రవ్యాపారాల కోసం వారి మన స్సులు పొగకమ్మిన అగ్నిహోత్రంవలె స్వర్గసీమలకు ఉద్గమిం చవు. ఉద్గమించలేవు. – శ్రీఅరవిందులు

ప్రశ్న: అహంకారపూరితమైన విశ్వాసం అంటే యేమిటి?

ఆయన దీనిని చాల స్పష్టంగా వివరించారు. దురాశవలన అది కలుషితమై ఉంటుందని ఆయన స్పష్టంగా చెప్పారు. దీనిని మనం మరొక విధంగా అన్వయించుకొనవచ్చు. ఇది చాల నిజం, నిజంకన్న వాస్తవమైనది. ఇది లేని విశ్వాసం వీసమంతైనా ఉంటుందా? పవిత్రము, నిర్మలము అయిన విశ్వాసాన్ని ఏదీ నిరోధించలేదు. పైన చెప్పిన నిర్మల విశ్వాసం ఉన్నట్లయితే అది 'అచ్చమైన విశ్వాసం' అనబడుతుంది. ఈ నిఖార్సయిన విశ్వాసం ముందు ఏదీ అసాధ్యం కాదు; అసాధ్యంగా ఉండదు. ఇందువలన వ్యక్తి అనూహ్యంగా మారిపోతాడు. అతనిలో పూర్తిగా పరివర్తనం వస్తుంది. అతడు దేనినైనా సులభంగా చేయగలడు. అయితే

అందుకు 'నిర్మల విశ్వాసం' కావాలి తప్ప దానిలో సొంతలాభం, స్వకీయ ఆలోచనలు మిళితం కారాదు.

నిర్మల విశ్వాసం సర్వశక్తివంతమైనది. అనూహ్యామైనది. అయితే ఇంత దృఢమైన విశ్వాసానికి ఒక్కొక్కసారి ఉనికి ఉండ లేకపోవచ్చు. ఈ స్థితిని యిలా అనుకోవచ్చు.

మనందరికీ ఒక విశ్వాసం ఉండి వుంటుంది. మనలో దైవ మున్నదని విశ్వాసం అనుకొందాం. నాకు విశ్వాసం ఉంది. కాని నాకు దాని అనుభవం, అనుభూతి లేవు. ఎందుకని?

ఎందువల్లనంటే ఆ విశ్వాసం నిర్మలమైనది కాదు కనుక. అలా కాక ఆ విశ్వాసం నిర్మలం అయినదే అయితే ఆ అను భూతి కలుగుతుంది. ఇది ముమ్మాటికి నిజం. అందుకే సాక్షా త్కారం కాని అంశం కోసం ఆలోచన ప్రారంభం అవుతుంది. అది చిత్తశుద్ధికి తోడ్పడుతుంది. ఎందుకు సాక్షాత్కారించ లేదు? విశ్వాసంలో ఏం ఉంది? అని అంతర్మీమాంస ప్రారంభం అవు తుంది. దీనిని చిత్తశుద్ధితో అంతర్మథనం చేస్తే ఈ విశాల దృక్ప థంతో ముడిపడి ఉన్న చాలా అల్ప విషయాలు తెలియవస్తాయి. ఇవేమీ పెద్దవి కావు. చాలా చాలా చిన్నవి. వాటి ఆలోచనయే వాటి పట్ల తిరస్కార భావాన్ని కలిగిస్తుంది. ఈ అంతర్మథ నంలో ఎన్నో అల్పవిషయాల పునశ్చరణ అనివార్యంగా జరుగు తుంటుంది. వాటిని విరమించుకోవాలన్న ఆకాంక్ష అంకురిస్తుంది. ఈ మథన పర్యవసానంగా నీకు చక్కటి తృప్తి కలుగుతుంది. దీని పట్ల నువ్వు చూపే శ్రద్ధ, ఇచ్చు ప్రాధాన్యతను బట్టి నీకు ఆత్మతృప్తి కలుగుతూ వుంటుంది.

*

మనిషి ఆలోచనలో ఒక మూల సందేహం, చర్చ జరుగుతుం టాయి. అలాంటి సందిగ్ధం ఆ ఆలోచనలోనే ఉంది. అది అన్నిం టినీ నాశనం చేస్తుంది. 'అవసరమైనప్పుడు పనిచేయలేను' అనే దృఢమైన నిశ్చయాన్ని మనస్సులో కలిగిస్తుంది. పర్యవసానంగా అతి సాధారణ సమస్య ఎదుట అసహాయంగా నిలిచిపోతావు. ఆ సందర్భంలో ఉన్నతస్థాయిలో దైవాన్ని ఎంత తీవ్రంగా అర్థిస్తే

అంత చక్కటి పూరట, అండ లభిస్తాయి. కాని చాలమంది ఆ దశకు రారు సరి కదా యిలా అంటుంటారు.

అవునవును, నేను కూడ ఆశించాను, ప్రార్థించాను. అయితే భగవంతుడు దీనిని సాధ్యం చేయలేదు. ఆయన ఏమనుకున్నాడో! సాధ్యం కాదనుకొన్నాడేమో!

అంతే! అది అంతటితో ముగుస్తుంది, పని జరగదు. ఇది సర్వసాధారణంగా జరిగేదే. కాని ఎవ్వరూ విశ్వాసం గురించి ఎప్పుడూ ఆలోచించరు. తనలో 'విశ్వాసం' లేదని గ్రహించరు. వారికి విశ్వాసం లేదన్న మాట నిజం!

అనువాదం: పురాణపండ రంగనాథ్

(*CWM* Vol. 15, pp. 340-41; Vol. 5, pp. 367-68)

చిత్తశుద్ధి అంటే ఏమిటి?

శ్రీమాత

Sincerity అనే ఆంగ్లపదానికి 'చిత్తశుద్ధి' అని అర్థం చెప్పుకుంటున్నాం గాని దీని అసలు అర్థమేమిటో మనం తెలుసుకోవాలి. మనకి ఇంద్రియజ్ఞానం మాత్రమే తెలుసు. అతీంద్రియజ్ఞానాన్ని గురించి తెలియదు. కాని నిజమైన జ్ఞానం అతీంద్రియం. అది చర్మచక్షువులకు కనపడునది కాదు. దాని కోసం సాధన చేయాలి. దర్శనానుభూతిని పొందాలి. అప్పుడు దైవమే నిజమని తెలుసుకొని దైవం కోసమే బతకటం, దైవానికే విధేయమైపోవటం అప్రయత్నంగా, ఆటోమేటిక్‌గా జరిగిపోతూంటుంది.

– సంపాదకుడు

సంపూర్ణ చిత్తశుద్ధి (Sincerity) అంటే మన ఆలోచనలు, సంవేదనలు, ఉద్వేగాలు, చర్యలన్నీ పవిత్రమైన మన అస్తిత్వపు మహాసత్యాన్ని మాత్రమే అభివ్యక్తం చేయాలి.

మన ప్రతియొక్క కదలికను, సూక్ష్మాతిసూక్ష్మమైన వాటితో సహా లోగడే సిద్ధించిన సాక్షాత్కార, మహోన్నతమైన స్థాయికి సముద్ధరించడమే చిత్తశుద్ధి.

*

భగవత్ సంకల్పం చుట్టూ మన అస్తిత్వపు భాగాలను, కదలికలన్నింటినీ ఏకీకృతం, సమన్వయం అయ్యేటట్లు చిత్తశుద్ధి చేస్తుంది.

*

అజ్ఞానం, మూర్ఖత్వం వల్లనే చిత్తశుద్ధి క్షీణిస్తుంది. కాని భగవంతుని అనుగ్రహంతో పూర్ణ విశ్వాసం, ఓర్మితో గూడిన సంకల్పం వుంటే ఈ చిత్తశుద్ధి మళ్లి రాణిస్తుంది.

*

పరిపూర్ణ చిత్తశుద్ధికి మానసిక, ప్రాణిక, భౌతిక యిష్టాయిష్టాలు, అభిప్రాయాలు, ముందరే ఏర్పరుచుకున్న అభిప్రాయాలు గొప్ప శత్రువులు. ఈ అవరోధాలని అధిగమించాలి.

*

చిత్తశుద్ధి ఉన్న చోట, నీకు సమాధానం ఇవ్వడానికి సహాయం, మార్గదర్శకత్వం, కారుణ్యం, ఎప్పుడూ లభిస్తాయి. నువ్వు ఎక్కువ కాలం తప్పు అభిప్రాయంతో అపమార్గంలో ప్రయాణించే అవకాశమే ఉండదు.

సాధనలో పురోగతికి ఆకాంక్షతో, సత్యం కోసం ఆకాంక్షించాలన్న సంకల్పంతో నిజమైన స్వచ్ఛత కావాలని కోరడంలో (ఆధ్యాత్మిక జీవనంలోని స్వచ్ఛత) చిత్తశుద్ధి, సమస్త పురోగతికి కీలకమైన మార్గం. ఆ చిత్తశుద్ధితోనే నువ్వు తెలుసుకోగలవు – ఏదైనా చెయ్యగలవు.

*

తనకు తాను మోసం చేసుకొనే స్వభావం ఏదో ఒకటి అస్తిత్వంలో ఎక్కడో దాగి వుంటుంది. లేని పక్షంలో నిన్ను నడిపించే కాంతిరేఖ నీ కళ్లెదుటే వుంటుంది. కాని దాన్ని చూడ కూడదని నీ కళ్లు మూసుకుంటావు.

*

అన్నింటికన్నా చిత్తశుద్ధి సంపాదించడం అత్యంత కష్టభూయిష్ట మైనది. అత్యంత శక్తివంతమైనది.

నీకు పరిపూర్ణ చిత్తశుద్ధి ఉంటే, నీవు తప్పక విజయం సాధిస్తావు. అది పొందడం చాలా కష్టం. తాను భగవంతునికే చెందినవాడినని, భగవంతుని కోసమే జీవించాలని, భగవంతుడు ఏది సంకల్పిస్తే అదే సంకల్పిస్తూ, భగవత్ సంకల్పాన్ని మాత్రమే వ్యక్తం చేయాలని, భగవంతుడు తప్పించి మరో పోషించే శక్తి లేదని భావించడం – ఇవన్నీ సాధించేందుకు ఏకైక సంకల్పాన్ని ప్రోది చేసే విధంగా అస్తిత్వంలోని అన్ని లక్షణాలను, అన్ని కద లికలను (లోపలివైనా, బయటివైనా) సమన్వయం చేయడమే చిత్త శుద్ధి (to belong to the Divine, to live only for the Divine, to will only what the Divine wills, to express only the divine Will, to have no other source of energy than that of the Divine.)

ఇక నీ చిత్తశుద్ధిని తీవ్రతరం చేయడానికి కాని, సరిదిద్దు కోవడానికి కాని అనవసరమయ్యే రోజు ఒక్కటైనా వుండదు, ఒక్క గంట వుండదు, నిమిషం వుండదు. భగవంతుని వంచించాలన్న భావననే నువ్వు పూర్తిగా త్రోసిపుచ్చుతావు. మొదటి సూత్రం ఏమిటంటే తనను తాను మోసం చేసుకోకూడదు. భగవంతుని మోసం చేయలేనని ఏ వ్యక్తికైనా తెలుసు. అసురులలో అతి తెలి వైనవారు సైతం దైవాన్ని మోసం చేయలేరు. కాని అది గ్రహిం చిన వ్యక్తి సైతం దైవాన్ని తనకు తెలియకుండానే స్వయం చలి తంగా, తేలికగా తనను మోసం చేసుకోడానికి ప్రయత్నిస్తుం టాడు. అది ఏదో ఒక రోజు జీవితంలో జరుగుతుంది. తను చేసే పనులకు, చెప్పే మాటలకు, తనకు అనుకూలమైన వివరణలు వ్యక్తి ఎప్పుడూ ఇస్తూనే వుంటాడు. మొదట జరిగేది అదే. పోట్లా టల గూర్చి నేను మాట్లాడడం లేదు. 'అది అవతలి వాడి తప్పు' అని అంటుంటారు. దైనందిన జీవితంలో అత్యంత అల్ప విష యాల గూర్చి నేను మాట్లాడుతున్నాను.

ఒకసారి ఒక కుర్రవాడు ఒక తలుపును ఢీకొన్నాడు. అతను తలుపును ఒక్క తన్ను తన్నాడు. అలాంటిదే పెద్దవారూ

చేస్తారు. ఎప్పుడూ అవతలి వ్యక్తే తప్పు చేస్తాడు. శైశవదశ దాటినా, నీకు హేతువంటూ వుంటే, చాలా మూర్ఖంగా అంటావు – "అతనా పని చేయకపోతే, నేను అలా చేసి వుండేవాడ్ని కాను" కాని సరిగ్గా దీనికి వ్యతిరేకంగా ప్రవర్తించవలసి వుంది.

అదే చిత్తశుద్ధి. నువ్వు ఎవరితోనైనా వుంటే, నువ్వు చిత్తశుద్ధి కలిగివుంటే, సరియైన పని చేయని వానితో నువ్వు వున్నా సరే, నువ్వు సరియైన పని చేయగలిగి వుండాలి. మరో ఆలోచన లేకుండా మనస్సు అటువంటి ప్రతిక్రియను అనుసరించాలి. ఎవరికైన క్రోధం వచ్చినప్పుడు, గాయపరిచే మాటలకు బదులు, నువ్వు ఏమీ మాట్లాడకు, ప్రశాంతంగా, నిశ్శబ్దంగా వుండు. అప్పుడు నీకు ఆ కోపం అంటువ్యాధిలా సోకదు. ఇది తేలికగా జరిగే పనేనా అని నీలోకి నువ్వు ఒకసారి తొంగిచూసుకోవాలి. ఇది చాలా ప్రాథమికమైనది. నీకు చిత్తశుద్ధి ఉందో లేదో తెలుసుకునేందుకు ఇది ప్రారంభదశ మాత్రమే. ప్రతి అంటువ్యాధి సోకేవారిని గూర్చి, అనాగరికమైన హాస్యోక్తులు మాట్లాడేవారిని గూర్చి నేను మాట్లాడడం లేదు. ఇతరుల లాగే అదే మూర్ఖత్వాన్ని ప్రదర్శించేవారిని గూర్చి నేను మాట్లాడడం లేదు.

నీ సాధారణ ప్రవర్తనలో చిత్తశుద్ధిని కలిగి యుండాలని నువ్వు ప్రయత్నిస్తున్నప్పటికీ, తీక్షణమైన దృక్కులతో నీలోకి నువ్వు అవలోకిస్తే వందల కొద్ది (చిత్తశుద్ధి) లోపాలు నీలోనే కనిపిస్తాయి. అప్పుడు తెలుస్తుంది చిత్తశుద్ధి కలిగియుండడం ఎంత కష్టమో.

నీ అస్తిత్వంలోని అన్ని భాగాలలో, నీ శరీరంలోని కణాలలో సైతం చిత్తశుద్ధి వుంటే, నువ్వు దైవాన్నే కోరుకున్నట్లయితే, నీకు విజయం తథ్యం. చిత్తశుద్ధి అంటే అది.

ఒక ఆకాంక్షలో ఎన్ని ఆలోచనలు, సంవేదనలు, భావాలు, కదలికలు భగవంతుని వైపు మాత్రమే తిరుగుతున్నాయి! ఒక రోజులో ఎన్ని? ఎన్ని? మొత్తం రోజులో ఒక్కటైనా వుంటే దానిని అతిముఖ్యమైనది (సువర్ణాక్షరాలలో) గా రాసుకోవచ్చు.

నువ్వు చిత్తశుద్ధితో వుంటే, నీకు విజయం తథ్యం అని నేను అన్నప్పుడు, నా ఉద్దేశ్యం 'నిజమైన చిత్తశుద్ధి. అర్పణగా నిరంతరం ప్రజ్వరిల్లే నిజమైన జ్వాల.'

*

నీ సమగ్ర ఆకాంక్షను సంబంధించి, నిన్ను నీవు ఏనాడూ మోసం చేసుకోకుండా, ఎల్లప్పుడు మరింత, మరింత చిత్తశుద్ధిని పెంచు కొంటూ పోవాలి. అది ముఖ్యం. చిత్తశుద్ధి వుంటే, భగవంతుడు కారుణ్యంతో సహాయం చేయడానికి సన్నద్ధంగా వుంటాడు.

*

చిరంతన మహాచైతన్యం ముందు నటన, వంచన లాంటి సముద్రం కన్నా ఒక్క బిందువు చిత్తశుద్ధికి అధిక విలువ వుంది. చిత్త శుద్ధితో జీవించు. దైవత్వానికి చిత్తశుద్ధి మణిద్వారం. (Before the Eternal Consciousness a drop of sincerity has more value than an ocean of pretension and hypocrisy.)

అనువాదం: కె. యజ్ఞన్న

(*CWM* Vol. 12, p. 270; Vol. 14, pp. 67, 71; Vol. 3, pp. 192-93; Vol. 5, pp. 5-7; Vol. 14, pp. 73-74, 72)

నువ్వు దైవానికి మాత్రమే చెందుతావు. దీని అర్థ మేమిటి? ఒక్క నీ మనస్సులోనే కాకుండా నీలోని అన్ని విభాగములలోను ఆ విషయం రాణించాలి. ఆయన ఇచ్ఛ మినహా నీకు వేరొక ఇచ్ఛ వుండరాదు. ఆయన ఇచ్ఛను మాత్రమే నువ్వు పాలించాలి, అభి వ్యక్తీకరించాలి. ఆయన శక్తి మాత్రమే నిన్ను నడి పించాలి.

శ్రీమాత

పరిపూర్ణ చిత్తశుద్ధి

శ్రీమాత

మనం మొదటగా గుర్తించవలసింది – చిత్తశుద్ధి పురోగమనశీల మైనది. మనలోని అస్తిత్వం పురోగమిస్తూ, వృద్ధిచెందుతుంటే, సంభూతిలో విశ్వమంతా వికాసం చెందుతుంటే, చిత్తశుద్ధి కూడ తనకు తాను అంతు లేకుండా పరిపూర్ణత్వాన్ని సిద్ధింపచేసు కోవాలి. నిన్నటి చిత్తశుద్ధి మారిపోతుంది. ఒక స్థాయిలోనే ఆగి పోతే, అది రేపటికి చిత్తశుద్ధిరాహిత్యమవుతుంది.

చిత్తశుద్ధి పరిపూర్ణంగా మనలో పెరగాలంటే, ఎటువంటి ఇష్టతలు, అభిమానాలు, కోరికలు, ఆకర్షణలు, వికర్షణలు, సాను భూతి, అయిష్టత, బంధాలు, సంపర్కం, ఏహ్యాభావం ఉండగూడదు. సంపూర్ణమైన, అవిభాజ్యమైన దర్శనం ఉండి తీరాలి. ప్రతివస్తువు దాని స్థానంలో ఉండాలి. అందరిపట్ల, అన్ని వస్తువుల పట్ల ఒకే వైఖరి కలిగి వుండాలి. నిజమైన దర్శనంతో కూడిన వైఖరి అది. ఇటువంటి సాధన ఏ మనిషికైనా సిద్ధించడం కష్టమే. తనకు తాను దివ్యీకరించుకోవాలని నిర్ణయించుకోకపోతే, తనలోని ఈ వైరు ద్ధ్యాలనుండి స్వేచ్ఛ పొందడం అసంభవం. అయితే వాటిని తన లోనే ఉంచుకుంటే, అతనికి చిత్తశుద్ధి లేనట్లే. మానసిక, ప్రాణిక, భౌతిక జీవన కార్యకలాపాలన్నీ వాటంతటవే అపభ్రంశంగా మార తాయి. భౌతికం (శారీరకం) పైన నేను ప్రాధాన్యమిచ్చి మాట్లా డుతున్నాను. ఇంద్రియాలు చేసే పనులు కూడా వక్రమార్గాన ఉంటాయి.

ఇష్టతలు (అభిమానాలు) కనుక వుంటే నువ్వు దేనినీ సరిగ్గా చూడలేవు, వినలేవు, ఆస్వాదించ లేవు, అనుభూతి చెంద లేవు. కొన్ని వస్తువులు నీకు ఇష్టం కల్గించి, మరికొన్ని ఇష్టం కల్గించనివి వుంటే, కొన్ని విషయాల పట్ల ఆకర్షణ, మరికొన్ని విషయాల పట్ల వికర్షణ ఉన్నంత కాలం, వస్తువుల్ని వస్తువుల రూపంలో చూడ లేవు. వాటిని నీ ఇష్టత, అయిష్టతల ననుసరించి చూస్తావు. సంవేదనలు, ఆలోచనలు, ఉద్వేగాలు లాగానే, ఇంద్రి

యాలు పనికి రాకుండా పోవచ్చు. కాబట్టి నీవేమి చూడదల్చుకొన్నావో, నీవేమి అనుభూతి చెంద దల్చుకున్నావో, నీవేమి ఆలోచించ దల్చుకొన్నావో నీకు ఖచ్చితంగా తెలియాలంటే, సంపూర్ణమైన సంగ రాహిత్యం కావాలి. ఇది అంత తేలిక కాదు. అంత వరకు నీ దృక్పథం పూర్తిగా నిజం కాదు. అది చిత్తశుద్ధి కాదు.

సహజంగా ఇది పరాకాష్ఠ. చిత్తశుద్ధిలోని లోపాలు చాలా మందికి తెలుసు. అవి మూర్ఖత్వంతో కూడినవి. వాటిని గూర్చి చెప్పవలసిన అవసరం లేదు. ఉదాహరణకు చెప్పేది ఒకటి, ఆలోచించేది మరో విషయం. ఏదో ఒక పని చేస్తున్నట్లు నటించడం, మరో పని చేయడం, నీ అసలు కోరికను కాకుండా మరో కోరికను వ్యక్తం చేయడం. అసలు నిజం దాచి మరో విషయం చెప్పడం, కొన్ని ఫలితాలకోసం పనులు చేసే విధానం, ఏదో చెప్పడం, దానికి మరో ఫలితం కావాలని కోరుకోడం, ఇవన్నీ వైరుధ్యాలు – ఈ లోపాలన్నింటిని ఎవ్వరైనా ఇట్టే కనుక్కోగలరు.

మరికొందరున్నారు. వారిలోని లోపాలు (చిత్తశుద్ధి రాహిత్యం) చాలా సూక్ష్మంగా వుంటాయి. ఉదాహరణకు నీకు సానుభూతులు, అయిష్టతలు ఉంటాయి. నీ పట్ల సానుభూతి కల్గించే విషయాలపట్ల నీకు అనుకూలమైన అభిప్రాయం వుంటుంది. నీకు అయిష్టమైన వాటి పట్ల అననుకూలమైన అభిప్రాయం వుంటుంది. అయిష్టమైన వ్యక్తి పట్ల సైతం అననుకూల అభిప్రాయం వుంటుంది. అక్కడ కూడా చిత్తశుద్ధి శూన్యం. ఎందుకంటే నువ్వు 'నాకు చిత్తశుద్ధి లేదు' అని గుర్తించవు, చిత్తశుద్ధిరాహిత్యం నీకు సహకరిస్తుంది. ఈ లోపాలను అస్తిత్వం (సత్త) లోని భాగాలను బట్టి విభిన్నమైనవి ఉన్నాయి. ఈ లోపాలన్నిటికి మూల ఆవిర్భావ స్థానం కోరికలు, స్వార్థచింతన, అహంకారంయొక్క చలనం. అహంకారం నుండి వెలువడే అన్ని పరిమితులు, కోరికల నుండి జనించే క్షుద్ర అపభ్రంశాలు ఈ లోపాలకు కారణం.

చిత్తశుద్ధి కోసం ఎంత ప్రయత్నించినా, అహంకారం ఉన్నంతకాలం పరిపూర్ణమైన చిత్తశుద్ధి లేనట్లే. అహంకారాన్ని పూర్తిగా వర్జించి, భగవంతుని సంకల్పానికి పూర్తిగా అర్పించుకో

వాలి. భగవంతుని దయాదాక్షిణ్యాలపై ఏవో లెక్కలు వేసుకో కుండా, నిండు హృదయంతో సర్వసమర్పణ గావించుకోవాలి. అప్పుడే సంపూర్ణ చిత్తశుద్ధి లభిస్తుంది.

తనకు ఉన్న చిత్తశుద్ధికన్న మరింత ఎక్కువగా, సమగ్రంగా చిత్తశుద్ధిని సాధించరాదని, దీని అర్థం కాదు. "చిత్తశుద్ధి కోసం అహంకారం నశించేదాక నిరీక్షిస్తాను" అని భావించరాదు. ఎందు కంటే నియమాలను తలక్రిందులు చేసి, చిత్తశుద్ధితో ప్రయత్నిం చకపోతే అహం నశించదు. నిజమైన జ్ఞానసిద్ధికి చిత్తశుద్ధి పునాది. అదే లక్ష్యం కూడా. అది లేకపోతే నువ్వు అనేక తప్పులు చేస్తావు. నీకు, ఇతరులకు నీవు చేసిన హానిని రూపుమాపుకోవడానికి నువ్వు ఎప్పుడూ సతమతమవ వలసివస్తుంది.

చిత్తశుద్ధితో చేసిన ప్రతి పనికి పారితోషికం వుంటుంది. అసత్యాన్ని అణుమాత్రమైన తిరస్కరించినప్పుడు, మనస్సు, ఆత్మ పరిశుద్ధమైనదన్న భావన, ఉన్నతభూమికల వైపు అధిరో హించడం, విముక్తి లభించడం – ఈ అనుభూతి కలుగుతుంది.

చిత్తశుద్ధే మన రక్షణ కవచం, మనను ముందుకు నడి పించే మార్గదీపిక, చివరగా చైతన్యరూపాంతర శక్తి.

అనువాదం: కె. యజ్ఞన్న

(*CWM* Vol. 8, pp. 397-400)

దైవం ముందర నువ్వు నిజాయితీగా ప్రవర్తించాలి కాని, ఏమాత్రం నటన పనికిరాదు. నువ్వు నిర్మలంగా, పారదర్శకంగా వుంటే అదే దైవానికి ప్రవేశ ద్వారము అవుతుంది.

శ్రీమాత

సమర్పణ ఎందుకనే ప్రశ్న

శ్రీఅరవిందులు

దైవానికి సమర్పించుకోవడం అంటే ఆయనకంటే మనము వేరు అనే భ్రాంతి తొలగిపోవడమే. శరణాగతి అనగా అంతా దైవానికే చెందినదనే భావన.

*

భగవంతునిచే అనుభవింపబడట మనగా సమస్తం ఆయన కిచ్చు కోవడమే. దాంతో దైవసన్నిధి, శక్తి, వెలుగు, ఆనందము జీవిని పూర్తిగా ఆవహించి ఎవరైనా సంతుష్టి నందగలరు. (To be enjoyed by the Divine is to be entirely surrendered so that one feels the Divine Presence, Power, Light, Ananda possessing the whole being...) ఈ గురుతర పారవశ్యంతో దైవానికి వశులై ఆయనే మనను పూర్తిగా తనలో లీనం చేసుకోవాలేగాని భగవ తుణ్ణి వశం చేసుకోవడం అర్థంగా అనుకోకూడదు. ఈ ప్రసన్న స్థితి ఒకే సమయంలో పూర్తి సంతోషాన్ని, నిశ్చలతనూ లభింప జేసి నీ ప్రకృతిని కూడ మారుస్తుంది.

*

సాధన ద్వారా ఒక పరాత్పర సత్యచైతన్యం, అతీతమైన పవిత్ర జాగరూకత కలిగి చేసే పనులు సృష్టి, శక్తులూ మన అజ్ఞాన అసంపూర్ణతతో వ్యక్తమైనవి కావనీ, సర్వమూ ఆ దివ్యానందము, ప్రకాశము, సత్యము చేస్తున్నదనే భావన కలుగుతుంది. ఉన్నదే ఆ దివ్యం కాబట్టి అనిత్యమైన మానవ మేధస్సు, జీవితము, శరీరం పైనున్న చైతన్యశక్తిని శరణు కోరడం అవశ్యం. మామూలుగా మరణించే జీవి స్వప్రయత్నంగా మానసిక స్పృహ వీడి ఆ అతీ తాన్ని తెలుసుకోవడం కుదరదు. ఆ శక్తి పైనుండి వచ్చినదే. దాని క్రియాశీలతను మన మనస్సు గ్రహించదు. **(... it is too difficult for the mortal human being to pass by its own effort beyond mind to a supramental Consciousness in which the dynamism is no longer mental but of quite another power.)**

మామూలుగా వాడుకలో నున్న ఆంగ్ల పదం 'surrender' మన సాధనలోని సమర్పణభావాన్ని కొంతవరకే సూచిస్తుంది. పూర్తిగా తెలుపదు.

అనువాదం: టి.ఎస్. రామచంద్రరావు

(*SABCL* Vol. 23, pp. 598, 602-03; Vol. 22, pp. 41-42; Vol. 24, p. 1169)

సమర్పణ ఎలా చేయాలి?

శ్రీఅరవిందులు

తీవ్రమైన భావనతో, సంకల్పం ద్వారా దైవాన్ని తెలుసుకోవాలనే తపన మొదలిడితే పోను పోనూ సాధారణమైన వ్యక్తిగత భావాలు కోరికలూ, అనుబంధాలూ పనుల ద్వారా కలిగే ఒత్తిళ్ళూ అల వాట్లూ అన్నీ దైవానికే ఇచ్చివేయాలి. ఆ దయామయుడు తప్ప కుండా అంతటినీ స్వీకరించి మనల్ని వశం చేసుకుంటాడు. అల్ప మైన మన మనస్సు దాని భావనలూ, ఇష్టాయిష్టాలనూ ఎంచుకో వడాలూ ఆ దివ్యతేజస్సుకే వదలివేయాలి. ఆ అపారజ్ఞానం, ఉదా త్తమైన నిదానంతో నిత్యమూ శాంతంతో వెలిగే, ఆ సంకల్పస్థితికే, ఆనందానికే లొంగిపోతే ఆ మహాశక్తి అనుగ్రహంతో మనము అందుండే వచ్చామనే ఎరుక కలుగుతుంది. ఎప్పుడూ సాదా సీదాగా గుడ్డిగా నడచుకొని అల్పమై పతనమైపోయే మన మాన సిక క్షోభ వ్యాకులతా సమసిపోతాయి.

*

ఆకాంక్షా, శాంతీ కొంతవరకూ తోడ్పడినా గొప్పదైన సమర్ప ణను పూర్తిగా దైవానికి చేసుకోలేము. శరణాగతి యనగా మన సమస్తాన్నీ – స్వంతభావాలూ, కోర్కెలూ, అలవాట్లూ వాటి ప్రసక్తిని కూడా వదలివేయుట. అప్పుడు దైవమే తన జ్ఞానాన్ని, సంకల్పాన్నీ తన పనులనూ మనలోనికి దింపి ప్రసరించి వాటి స్థానంలో పని చేస్తుంది.

ఈ సాధన మామూలు మానసిక వైఖరి కాదు. సంపూర్ణంగా కృత కమైన ప్రాతిపదికగా తత్త్వాన్ని పూర్తిగా మార్చుకొని ఆదైవం కోసమే ఎన్నైనా సరే లోలోని అనుభవాలను గ్రహిస్తేగాని వెలుప లనున్న మన మానవరూపం మారదు. మన ప్రతి చిన్న స్పందనా, అలవాటూ, చేసే ప్రతి పని దైవాని కిచ్చుకోవడం ముఖ్యం. అప్పుడే మన బాహ్యావ్యక్తిత్వం మారి పూర్తిగా దైవాన్ని పొందగలం. హేతు వులూ, అర్థభావాలతో కార్యకారణ పాతభావాలూ నిర్మూలింప చేసుకొని అన్ని పనులూ దైవానికే సమర్పిస్తే ఆ జగన్మాత అను గ్రహంతో మన స్వభావమంతా పూర్తిగా మారిపోయి పరిణామ క్రియలో మార్పు చోటు చేసుకొంటుంది.

*

విధిగా ఈ సమర్పణ క్రియ ముందుకే సాగాలి. సాగితీరాలి, సాగు తుంది. సమర్పణ మొదట్లో సంపూర్ణంగా కుదరదు, కొంతకాలం పడుతుంది. మన సమర్పణ పూర్తి అయితేనే సాధన సమగ్రంగా వెల్లివిరుస్తుంది. అంతవరకూ వ్యక్తి ప్రయత్నం క్రమంగా జరిగి సమర్పణగా ఫలిస్తుంది. దివ్యశక్తి సాధకుని ఆవహించి లబ్ధి నిచ్చి మనలోనికి ప్రవేశిస్తేనే ప్రయత్నాలకు నిశ్చయమైన మద్దతు కలు గుతుంది. ఆ ఆద్యశక్తి వెనువెంటనే అంతా తన పనిగా మనలో చేయాలంటే పూర్తిగా ఆత్మార్థంగా మనం సమ్మతించాలి. ఇది చాలా ముఖ్యం.

*

ఏ మార్గమూ పూర్తిగా సుగమం కాదు. సమర్పణతోనే నిజమైన భావనలతో మాత్రమే దైవానికి అంకితమవుతే కష్టాల్ని అధిగ మించగలము.

ఈ పూర్ణమైన సమర్పణకు ఇప్పుడే ఏమి తొందర అనే భావంతో అవకాశం వదలవద్దు. ఇతరమైన కొన్ని విషయాలను ఆపండి. ఈ సమర్పణను మాత్రం ఎప్పుడూ ఆపవద్దు. అది ఇప్పుడే, ఎప్పటి కప్పుడు దైవానికి వశమైపోవడమే.

అనువాదం: టి.స్. రామచంద్రరావు

(*SABCL* Vol. 22, p. 193; Vol. 23, pp. 603, 593, 525, 595, 600)

దైవానుగ్రహం

శ్రీఅరవిందులు

పరమచ్చైతన్యం ప్రపంచమంతా వ్యాపించి వుంటుంది. దీనినే మనం భగవంతు డంటాము. అతడొక వ్యక్తి గాదు. కింతు మన వైయక్తిక ఆత్మ దేనియొక్క ఒక అంశమో అది – ఆమహాతత్త్వము. కాని ప్రతి సాధకుడు దానినావిధంగా చూడ నవసరం లేదు. దానిని సర్వుల ఏకమాత్ర నిర్వ్యక్తిక ఆత్మ మాత్రమే నని కూడ అనుకోవచ్చు. అయినప్పటికి ఉపనిషత్తు దీనిని గురించి, దీని ఉపలబ్ధిని గురించి ఇలా వచించుతోంది. "ఈ ఆత్మ మేధ చేత గాని, తపస్యచేతగాని, బహుపాండిత్యంచేత గాని పొందరానిది. కింతు ఎవనిని ఈ ఆత్మ వరించునో, అతనికి మాత్రమే అది తన శరీరాన్ని వెలువరించుతుంది." బాగుంది, దీనిని మాత్రమే మనం భగవదనుగ్రహ మంటున్నాము. అది మానసిక హేతువులకు కట్టుపడక, స్వయంగానే తన గతిని నిర్ణయించుకునే, పై నుంచి లేక లోనుంచి ప్రవర్తించే ఒక స్వతంత్ర క్రియ. దానిని మనం దివ్య అనుగ్రహం అని పిలువవచ్చు. ఉత్తలమందుండే తన మానసిక ఉపకరణానికి తనను అభివ్యక్తం గావించుకునే ముహూర్తమును, మార్గమును స్వయంగా ఎన్నుకునే లోని ఆత్మ అని పిలువవచ్చు. అలాగే ఆ క్రియను, స్వరూప సాక్షాత్కారములోనికి, స్వరూప జ్ఞానములోనికి ఆంతర సత్తు లేక ఆంతర ప్రకృతి యొక్క ప్రఫుల్లనం అని కూడ మనం పిలువవచ్చు. మనలోని ఒకానొక వస్తువు దానిని ఎలా సమీపించుతుందో, లేక అది మనకు ఎలా దర్శనమిస్తుందో, అలా మనస్సు దానిని బహుదా పిలుస్తుంది. కాని వాస్తవానికి, దానిని అనుగ్రహమని పిలిచినా, సంవరణ మని పిలిచినా, ప్రఫుల్లనమని పిలిచినా అది ఒకే వస్తువు, ప్రకృతియందు సత్తుయొక్క ఒకే ప్రక్రియ.

*

కర్మ – కరుణ – అనుగ్రహం

నేను దివ్య అనుగ్రహం గురించి చెప్పగోరుతున్నాను, చెప్పాలి – కారణం, మానవబుద్ధి పనిచేసే ప్రకారముల నుండి అంతగా భిన్నము కాని మార్గమున వ్యవహరించే దివ్యహేతువు వంటి ఒక వస్తువే దివ్య అనుగ్రహం అని నీవు తలపోస్తున్నట్లు న్నావు. కాని అది దివ్యహేతువు కాదు. అంతేకాదు, అది సార్వత్రిక దివ్యకరుణ (compassion) సైతం కాదు – తనను సమీపించిన అందరిపైన నిష్పక్షపాతముగా దయజూపుతూ, అన్ని ప్రార్థనలను అంగీకరించే కరుణ సైతం కాదు. అది ధార్మికుని చేరదీసి, పాపిని పరిహరించదు. ఆధ్యాత్మిక ద్రష్టలందరూ ధర్మానికి, అనుగ్రహానికి ఉన్న విభేదాన్ని చెప్పే ఉన్నారు. అయినా అది విచక్షణా రహితం గాదు – దాని విచక్షణ దాని కుంటుంది. కాగా ఆ విచక్షణ మనస్సుయొక్క లేక ఏ సామాన్య ఇతర శక్తియొక్క దృష్టికంటె ఇతరమైన దృష్టితో సన్నివేశాలలను, వ్యక్తులను, చూస్తుంది.

ముందు అనుకూలావస్థ

వ్యక్తియందు, తరచుగా మందమైన ముసుగుల వెనుక అనుగ్రహక్రియకు అనుకూలమైన ఒక అవస్థ సిద్ధం చేయబడుతుంది – మనస్సు గణించలేని సాధనముల ద్వారా ఇది జరుగుతుంది; ఇక అపుడు అనుగ్రహమే స్వయంగా పనిచేస్తుంది.

మూడు శక్తులున్నాయి – 1. విశ్వధర్మము, 2. దివ్య కరుణ – తాను చేరుకోగలినంత మందిని చేరుకుని, వారికి అవకాశమిస్తుంది. 3. తక్కిన రెండింటి కంటె ఎక్కువ అగణనీయంగాను, కాని ఎక్కువ అప్రతిహతంగాను కూడ పనిచేసే దివ్యానుగ్రహం – కాగా ఇక్కడ ఉదయించే ఏకమాత్ర పశ్న ఏమంటే, జీవిత వ్యతిక్రమాల వెనుక ఉన్న ఏదైనా ఒక వస్తువు భగవంతుని పిలుపుకు అనుస్పందించి, భగవదనుగ్రహ ప్రదీప్తికి సిద్ధమయ్యేవరకు కష్టముతోనే అయినా తనను తాను తెరచిపెట్టుకోగలదా? అట్టి

వస్తు వొకటి ఉంటే, అది, మానసిక లేక ప్రాణిక గతి కాజాలదు, అది ఆంతర నేత్రంతో చూడగలిగిన ఒకానొక ఆంతరగతి కావాలి. ఇక అది ముందుకు వచ్చి సక్రియమైనపుడు, కరుణ పనిచేయ గలదు. అప్పుడు సైతం అనుగ్రహంయొక్క సంపూర్ణక్రియ నిశ్చా యకమైన నిర్ణయానికి లేక మార్పునకు వేచి ఉండవలసి రావచ్చు. ఏలన, ఇంకను స్వీకరించడానికి సిద్ధంగా లేని, సత్తుయొక్క ఒక అంశం లేక తత్వం అనుగ్రహాక్రియకు అడ్డు రావచ్చు.

*

అనుగ్రహం ఒక వాస్తవం

తపశ్శక్తి, అనుగ్రహముల గురించి నేనేమి చెపుతున్నానో, దానిలో అగ్రాహ్యమేమీ లేదు. ఆధ్యాత్మిక సిద్ధి నిమిత్తం శక్తికి ఉండవలసిన విలువ ఉంది, కాని దానిని అదొక్కటే సాధించ గలదు, ఏ ఇతర సాధనం సాధించలేదు – అని చెప్పడం అతిశ యోక్తే అవుతుంది. అనుగ్రహం ఒక కల్పన కాదు, కింతు అది అధ్యాత్మిక అనుభవ వాస్తవం. పండితులు, ప్రబలులు ఏమీ తెలి యని పామరుల లాంటివారు అనుగ్రహం చేత శిఖర మందు కున్నారు. వారికి చదువు లేదు, వారి మనస్సుకు సామర్థ్యం లేదు, శిక్షణ లేదు, వారికి గట్టి పట్టుదల గాని, స్థైర్యము గాని లేదు. అయినా ఆకస్మికంగానో, శీఘ్రంగానో ఆధ్యాత్మిక సిద్ధిలోనికి ఎదిగిపోతారు. దీనికి కారణం, వారికి విశ్వాసముంది, లేక చిత్త శుద్ధి ఉంది. ఏవి ఆధ్యాత్మిక చరిత్రయొక్క మరియు మిక్కిలి సామాన్య ఆధ్యాత్మిక అనుభవంయొక్క వాస్తవాలో, అవి కేవలం పరికల్పనయొక్క విషయాలైనట్లు ఎందుకు వాటిని గురించి చర్చించి, వాదించి నిరాకరించాలో నా కర్థం కావడం లేదు.

బలం – చిత్తశుద్ధి – అనుగ్రహం

బలం ఆధ్యాత్మికమైనపుడు, ఆధ్యాత్మిక సిద్ధికి అది ఒక పటుతర సాధనమే. అంతకు మించిన సాధనం చిత్తశుద్ధి, కాగా అతిపటిష్ఠ సాధనం అనుగ్రహం. సంకల్పశుద్ధి ఉంటే, ఎంతకాలం తర్వాతనయినా సరే, కష్టాలు ముంచెత్తినా సరే, అతడు ముందుకు పోతాడని నేను లెక్కలేనన్ని సార్లు చెప్పి ఉన్నాను. అలాగే దివ్య అనుగ్రహం గురించి కూడ పదే పదే పలికి ఉన్నాను. నేనీ క్రింది గీతాసూక్తిని ఎన్నిసార్లు ఎత్తి చూపానో!

"అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి, మా శుచః"

నేను నిన్ను సమస్త పాపాశుభములనుండి ఉద్ధరించుతాను, శోకింపకుము.

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి)

(*SABCL* Vol. 23, pp. 608-11)

నువ్వు దైవానికి అంకితమైనప్పటికీ స్వార్థచింతన నిన్ను పట్టుకొని పీడిస్తూనే వుంటుంది. అది వున్నంత కాలం నీ మనస్సు నిన్ను మోసం చేస్తుంది; ప్రాణికము నిన్ను జుట్టు పట్టుకొని ఆడిస్తుంది; అఖరుకి నీ జ్ఞానేంద్రియాలు కూడ దోష పూరితాలవుతాయి. నువ్వు దేనిని ఉన్నదున్నట్టుగా చూడలేవు, వినలేవు, ఆస్వాదించలేవు.

శ్రీమాత

దైవానుగ్రహం ఎలా దొరకుతుంది?

శ్రీఅరవిందులు

మనస్సు అదుపుకు తపస్య

సాధకుడు శ్రమకు, తపస్యకు అలాగే మనః ప్రాణికాల నియంత్రణకు సిద్ధపడకపోతే పెద్ద ఆధ్యాత్మిక లాభాలను ఆశించలేడు – ఏలన మనః ప్రాణికాలు తమ ఆధిపత్యాన్ని పొడిగింపజూస్తాయి, తమ ఇష్టాయిష్టాలను విధించజూస్తాయి, అంతరాత్మ పరమాత్మలకు విధేయమైన ఉపకరణాలు, వివృతమైన (open) వాహినులు కావలసివచ్చే రోజును దూరంచేయ జూస్తాయి. అనుగ్రహం, ఒకొక్కసారి వేటిని పొందే మనకు అర్హత లేదో, కనీసం ఉన్నట్లు కన్పించదో, ఆ ఫలితాలను మనకీయవచ్చు. కాని అనుగ్రహాన్ని తన హక్కుగానో, ఫలంగానో ఆశించలేడు – ఏలన అది అపుడిక అనుగ్రహ మనిపించుకోదు. ఎలుగెత్తి ప్రార్థిస్తే చాలు, సమాధానం వచ్చితీరుతుంది అని అనుకోటం పొరపాటు.

*

రెండు పార్శ్వాలూ సత్యమే

ఈ ప్రశ్నకు ఖండితమైన సమాధానము నివ్వలేము; కారణం, ఆ ప్రశ్నకుగల రెండు పార్శ్వాలలోను సత్యముంది. భగవంతుని అనుగ్రహం లేనిదే, దేనినీ చేయలేము, కాని సంపూర్ణ అనుగ్రహం అభివ్యక్తమవడానికి సాధకుడు తనను తాను సిద్ధపరచుకోవాలి. ప్రతి పని భగవంతుని హస్తక్షేపం మీద ఆధారపడి ఉంటే, అపుడిక మానవుడొక తోలుబొమ్మ మాత్రమే, అతని సాధనకే అర్థం లేదు, ఒక కార్యం సిద్ధించడానికి ఎట్టి నియమాలు ఉండవు – కావున విశ్వమే ఉండదు. కింతు తన అభీష్టము ననుసరించి వస్తువులను ఆడించే ఒక్క భగవంతుడే ఉంటాడు. సందేహం లేదు. చివరి విశ్లేషణయందు సర్వం భగవంతుని వైశ్వక్రియయే అని వక్కాణించవచ్చు. కాని ఆ క్రియ వ్యక్తుల ద్వారాను, శక్తుల ద్వారాను మరియు ప్రకృతి నియమాలకు అధీనంగాను అడుగువేస్తుంది. కొన్నింటిలో భగవంతుని

హస్తక్షేపం ఉండవచ్చు, ఉన్నది కూడ, కాని ప్రతివిషయంలోను అది ఉండజాలదు. ఇక నీవు వ్రాసిన అనుభవానికి వస్తే, అది బహుశః ప్రాణిక భూమిక లోనిది, అట్టి ఆకస్మిక మరియు విస్పష్ట అనుభవాలు ప్రాణిక స్వభావ చిహ్నాలు – అయితే అవి స్థిరంగా ఉండవు. అవి స్థిరతకు సన్నాహాలు మాత్రమే. మనః ప్రాణ దేహా లకు ఏది ఆవల ఉందో, దానితో సంపర్క మంది, దానిలోనికి, జాగృతమైచినపుడు మాత్రమే సామాన్యంగా స్థిరమైన మహత్తర ఉపలబ్ధులు సిద్ధించుతాయి.

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి)

(*SABCL* Vol. 23, pp. 612, 611-12)

కర్మ – కృప

శ్రీమాత

కాలగతిలో జీవునికి విధి బలీయమన్న అభిప్రాయం బలపడు తుంది. భారదేశంలో దీనిని ప్రారబ్ధకర్మగా చెబుతున్నారు. ఏనా టికైనా ఈ ప్రారబ్ధ కర్మను అనుభవించాల్సిందే!

అందుకు ఎంతో ధైర్యసాహసాలు అవసరం. ఈ గుణాలు లోపించటం బహుదుర్భరం. అప్పుడప్పుడు నా దగ్గరకు కొందరు వచ్చి "నేను ఎక్కడికైనా పారిపోతాను, నాకు మరణమే శరణ్యం, నాకు మరణమే శరణ్యమ" ని రోదిస్తారు. నేను వారి కిచ్చే జవాబు "అలాగే. కానీ నువ్వు చంపుకోవలసింది నీ అహంకార జీవుడిని. అహంను అవశేషం కూడా లేకుండా నాశనం చేసుకో నాయనా, అహంను నశింపచేయగల ఆత్మస్థైర్యము, ధైర్యము అలవరచుకో."

ఇదంతా కర్మసంబంధ మవటం చేత నీ పాత్ర కూడా లేక పోలేదు. కర్మ నీ అహంకారముయొక్క ప్రతిరూపమేనని గ్రహించు. అహం కూడా తన వంతు పాత్ర నిర్వహించాలి. ప్రారబ్ధకర్మ

అనగా గతజన్మల కర్మఫలమేనని, 'అహం' అంతరించటంతో ప్రారబ్ధకర్మ కూడ అంతరిస్తుందన్న పరమ రహస్యం గ్రహించు.

ఈశ్వరానుగ్రహామృత వర్షము నిన్ను ముంచెత్తగా, నీ ప్రారబ్ధకర్మ తడిసి ముద్దయైనపుడు, నీకు జ్ఞానోదయమై, తత్కర్మ మూలమైన కారణాలు నీవు గ్రహించి, మరుక్షణమే, దాని నిర్మూలనకై శ్రీకారం చుట్టవచ్చును.

ఏనాడో ఒకనాడు ఆ ఘడియ రాక తప్పదు. బంధ విముక్తికై అవసరమైన ప్రక్రియ నీవు చేపట్టాలి. నిజం చెప్పాలంటే కొన్ని యుగయుగాల తరువాత, ఈ పుడమిపై, ఒకానొక సిద్ధ పురుషుడు, మనకు మార్గదర్శకత్వం వహించే భాగ్యం కలిగింది. ఒకప్పుడు ప్రారబ్ధకర్మ నశింపజేయతరం గాదని, ప్రాయశ్చిత్తాది ప్రక్రియలతోనే సాధ్యమన్న అభిప్రాయమున్న మాట వాస్తవము. కాని ఇప్పుడు అట్టి ప్రక్రియలతో నిమిత్తం లేకుండా, అతిమానస శక్తి (Supramental power) తో సాధ్యమని గ్రహించటం అవసరం.

*

నువ్వు తప్పులు చేస్తున్నంత కాలం, అనగా క్షణక్షణము తప్పులు దొర్లుతుండగా, సంస్కరణ సాధ్యం కాదు. దోషమేదైనా గావచ్చు – చిన్నదో పెద్దదో – కాని, దాని ప్రభావము జీవితాంతము ఉంటుంది. కాని నువ్వు కనుక మళ్లి మళ్లి ఆ తప్పులు చెయ్యకుండా ఉంటే ఈశ్వరానుగ్రహం ఈ ప్రారబ్ధకర్మను నిర్మూలించగలదు. ప్రతి నిత్యము, ఈ దోషప్రవృత్తితో కూడుకొన్న కర్మ చేస్తుండగా, ఎల్లకాలము ఈశ్వరానుగ్రహము వాటిని రూపుమాపగలదన్న అభిప్రాయము సరిగాదు. ఆ విధముగా జరిగితే గతమంతా పునీతము గావచ్చుగాని, మున్ముందు ఎట్టి ప్రభావము కాన్పింపదు. అయితే ఈ దోషపూరితగతం, నిత్యము క్షణక్షణమున్నా గతంలోనే ఉండిపోవాలి. నీ స్పందన తీరు మెరుగుపరచుకొని ఆ విపరీత స్పందన పునరావృతం కాకుండా జాగరూకుడవై ఉండటం అవసరం.

*

ప్రశ్న: కర్మ శృంఖలాలచే బంధింపబడ్డామని తమరు శలవిచ్చారు గదా. మరి ఈశ్వరానుగ్రహప్రాప్తి దాన్ని రద్దు చేస్తుందంటున్నారే...

అవును నిశ్శంసయంగా రద్దుచేస్తుంది. ఈశ్వరానుగ్రహ ప్రాప్తికి తీవ్రమైన ఆకాంక్ష (aspiration) గాని ప్రార్థనగాని దోహదము చేయగలవు అను భావంతో కొందరు సాధకులు ఆకాంక్ష పట్ల ఆకర్షితులు కాగా, ఇతరులు ప్రార్థనతో ఉపాసిస్తారని తెలుస్తున్నది. రెండున్నూ ఉత్తమమైనవే. వాటి వాటి ప్రత్యేకతలను గుర్తించి, తదనుగుణంగా సాధన మలచుకోవాలి.

పై రెండు మార్గములు సుందరమైనవే. ఈ రెంటిని గురించి మరో మారు ముచ్చటించుకొందాము. తపన అనగా నేమి? ప్రార్థన అనగా నేమి? ఈ రెండున్నూ సుందరమని ఉటంకించటానికి కారణమేమి? ఈ ప్రశ్నలు ఉదయిస్తాయి గదా. కొందరికి ప్రార్థన గిట్టదు. ఎందుకో తెలుసా? వారి హృదయలోతులలో అహంకారంతోపాటు గర్వం కూడ ఉంటుంది. కొందరికి ఆకాంక్షకు అవసరమైన జ్వాల లోపిస్తుంది. వారి వినయవిధేయతలు అంతంత మాత్రంగానే ఉంటాయి.

ఈ రెండున్నూ అవసరమే. అనహంకారమై, ప్రారబ్ధకర్మను నాశనం చేసుకోవాలన్న తీవ్ర ఆకాంక్ష సాధకునికి అత్యవసరము.

*

స్వామీ, నీ ఎదుట నిలిచి నా వల్ల ఎట్టి అపరాధము లేదని మనః పూర్వకంగా చెప్పగల ధైర్యమెవ్వరి కున్నది. ప్రతి క్షణం మా వల్ల శతాధిక అపరాధములు కలుగుతున్నవి. అయితే నీ కృపామృతధారలు వాటిని కడిగి వేయుచున్నవి.

నీ కృపావీక్షణాలు ప్రసరింపక పోయినట్లయితే, ఏనాడో ధర్మ నిర్ణేతపాశంలో నలిగిపోయే వాళ్లం గదా!

అనువాదం: శ్రీ శరణ్

(*CWM* Vol. 15, pp. 391-94; Vol. 9, p. 57; Vol. 5. pp. 91-93; Vol. 14, p. 87)


భగవంతుని పరిరక్షణ

శ్రీఅరవిందులు

నిరంతర భగవస్మరణతో దైవసంస్పర్శను పొందుతూ ఉంటే మనం క్షేమంగా ఉంటాము. మనం అనుసరించవలసిన మార్గాన్ని చూపిస్తూ మనని కనిబెట్టి ఉండే ఆ శక్తి మనకి ఆపదలూ, కష్టాలూ రాకుండా నివారిస్తుందని కాదు గానీ ఏది వచ్చినా తట్టుకొనేటట్లు చేసి సురక్షితంగా దరి చేరుస్తుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అవసరమైనప్పుడు మాత్రం ఆ శక్తి వాటిని నివారిస్తుంది కూడా. నేనూ శ్రీమాత కల్పించే రక్షణలో తలదాచుకోగల శక్తినీ, అలవాటునూ నువ్వు పెంపొందించుకోవాలి. దానికి గాను ఇతరులను విమర్శించడం, ఉపరిమనస్సుతో వారి మీద అభిప్రాయాలు ఏర్పరచుకోవడం మెదలైన అలవాట్లు మానుకోవాలి. అంటే మన ఊహను బట్టి ఎదుటి వారిపై అభిప్రాయాలు ఏర్పరచుకోగూడదు. *"శ్రీమాతకు, శ్రీఅరవిందులకు నాకంటే ఎక్కువ తెలుసు. వారికెంతో అనుభవజ్ఞాన మున్నది కదా! మామూలు మానవ మేధస్సుకంటే ఎంతో జ్ఞానంతో అన్నీ ఆలోచించి అందరి మేలు కోరి పనిచేస్తారు"* అనే విషయం నీవు ఎప్పుడూ గుర్తుచేసుకుంటూ, మనసులో నిలుపుకోవాలి. ఇది కనుక మనస్సులో నాటుకుపోతే ఎంత అయోమయస్థితి వచ్చినా కూడా అసురశక్తుల మాయామోహంలో పడకుండా తేలిగ్గా తప్పించుకో గలవు.

*


నామ జపంలోని శక్తి, పరిరక్షణ నీకు అనుభవమైనట్లుగానే విశ్వాసంతో, నమ్మికతో పిలిచిన వారందరికీ కూడా అనుభవమవుతుంది. హృదయపూర్వకంగా రక్షణ కోరినప్పుడెవ్వరినీ నిరాశ పరచదు. ఏం జరిగినా కూడా నీ నమ్మకాన్ని చెదరనీయొద్దు. నమ్మకాన్ని మించినది ఏదీ లేదు. గమ్యానికి చేర్చగల శక్తి మరి దేనికీ లేదు. విశ్వాసం తప్ప మరి ఏ పరిజ్ఞానమైనా, తపశ్శక్తి ఎంత ఉన్నప్పటికీ కడదాకా నిన్ను చేర్చలేవు.



జీవన శాస్త్రము

అఖిల

అఖిల భారత పత్రిక, జూన్ 2004



ॐ आनन्दमयि चैतन्यमयि सत्यमयि परमे

OM anandamayi chaitanyamayi
satyamayi parame

Sri Aurobindo

3/6/2004

జీవన శాస్త్రము

I

II

Let your highest aspiration organise your life.

blessings

విభాగము I:

జీవన శాస్త్రము

(The Science of Living)

నిన్ను నీవు తెలుసుకో, నిగ్రహించుకో

శ్రీమాత

భగవంతుడు ఈ సృష్టి ద్వారా తనను తాను అభివ్యక్తీకరించు కుంటాడు. ఇందులో మానవుని స్థానం చాలా కీలకమైనది. శరీర నిర్మాణములో చాలా వరకు జంతువే అయినప్పటికీ మనిషికి మనస్సు అనే గొప్ప ఆయుధమున్నది కదా! తగిన శిక్షణ ద్వారా ఈ మనస్సును మెరుగుపరచుకొని దానితో అన్ని విభాగములను ఆదర్శవంతంగ మెరుగుపరచి దైవాభివ్యక్తికి తగిన ఉపకరణములుగ తయారుచేయుటయే అతని ధ్యేయము.

– సంపాదకుడు

ఏ ఆశయమూ లేని జీవితము దుర్భరజీవితమే. మీరందరూ ఏదో ఒక ఆశయం పెట్టుకోవాలి. ఆ ఆశయాన్ని బట్టే జీవితం నడుస్తుం దని మరచిపోవద్దు.

నీ ఆశయం ఉన్నతంగా, విశాలంగా ఉండాలి; నిస్వార్థం గానూ, ఉదారంగానూ ఉండాలి; అప్పుడు నీ జీవితం నీకే కాకుండా ఇతరులకు కూడా అమూల్యమైన దవుతుంది.

నీ ఆశయం ఏదైనా గూడా ముందుగా నీలో పరిపూర్ణత (perfection) నెలకొల్పుకోకపోతే అది పరిపూర్ణంగా సిద్ధించదు.

నీలో పరిపూర్ణత తెచ్చుకోవాలంటే మొట్టమొదటగా నీవు చైతన్యవంతం కావాలి; అంటే నీలోని వివిధ భాగాలను, వాటి చర్యలను గమనించే చైతన్యంలో ఉండాలి. ఈ భాగాలన్నిటినీ దేనికది వేర్వేరుగా గమనించటం నేర్చుకుంటే నీ చర్యలకు మూల కారణాలైన అనేక ప్రేరణలు, ప్రతిచర్యలు, పరస్పర విరుద్ధ సంక ల్పాలు ఎక్కడ నుంచి ఆవిర్భవిస్తున్నాయో స్పష్టంగా తెలుసుకో గలవు. ఇది చాలా శ్రద్ధగా చేయవలసిన పరిశీలన కనుక అందుకు

చాలా సహనము, చిత్తశుద్ధి కావాలి. ఎందుకంటే తన ప్రతి ఆలోచనకి, స్పందనలకీ, చేతలకి, మాటలకి, అనుకూలంగా సమర్థించుకొనే స్వభావం మనిషిది. అందువల్ల అతి జాగ్రత్తగ వీటన్నిటినీ గమనించి యథాతథంగా మన మహోన్నత ఆదర్శం ముందు విచారణకు పెట్టాలి. దాని తీర్పును పాటించాలి. అప్పుడే పొరపాట్లకు ఆస్కారం లేని వివేచనాజ్ఞానం మన కబ్బుతుంది. మనం నిజంగా పురోగమించా లనుకున్నప్పుడు, మన జీవిత సత్యాన్ని బోధపరచుకునే సామర్థ్యం పొందా లనుకున్నప్పుడు అంటే మన జన్మకి కారణ మేమిటో, జీవితంలో నిర్వహించవలసిన పాత్ర ఏమిటో తెలుసుకోవాలనుకుంటే క్రమబద్ధంగా ఎప్పుడూ మనలో జీవితసత్యాన్ని వ్యతిరేకించి, ఎదిరించే శత్రువులను నిరోధించి వైదొలగించుకోవాలి. ఈ విధంగా కొద్దికొద్దిగా మనలోని భాగాలన్నిటినీ, ధాతువు లన్నిటినీ సమానం చేసి ఏకంగా చైతన్య స్థానం చుట్టూ వ్యవస్థీకృతం చేసుకోవచ్చు. ఈ విధమైన సమైక్యత జరిపించటానికి చాలాకాలం పడుతుంది. దీన్ని కడదాకా సాధించి కృతార్థులం కావాలంటే ఓర్పు, సహనాలనే ఆయుధాలను ధరించి అవసరమైతే ఆయుస్సును కూడా పొడిగించే దృఢ నిశ్చయంతో ఉండాలి.

ఈ విధంగా పవిత్రీకరణం, ఏకీకరణం చేయటానికి పాటు పడుతూనే అతిశ్రద్ధతో నీ బాహ్య, ఆంగిక విభాగాలను సంస్కరింప చేసుకోవాలి. ఉన్నత సత్యం దిగివచ్చినప్పుడు ఆ భావం వ్యక్తం కావటానికి అంటే దాని శక్తినీ, స్పష్టతను అట్లాగే ఉంచగల ఆలోచనాకృతిని ఇవ్వటానికి తగిన నమ్యత (suppleness), సంపన్నము అయిన మనస్సు నీకుండాలి. ఈ ఆలోచనను తిరిగి మాటల్లో పెట్టాలనుకున్నప్పుడు దాని అర్థాన్ని ఏ రకంగాను విరూపం చేయకుండా యథాతథంగా వ్యక్తం చేయగల వాక్పటిమ కూడా నీకుండాలి. అంతేకాదు. నీ ఫీలింగ్సు, నీ కర్మలు, నీ యిచ్ఛలు, ఒకటేమిటి ఆ సత్యమే సర్వాంగీణంగా వీటన్నిటి ద్వారా అభివ్యక్తమవాలి. నిన్ను నీవు పరిశుద్ధము, సమైక్యము గావించుకొనుటకై శ్రమించుచున్నప్పుడు నీ బాహ్యోపకరణమును

నిర్లక్ష్యము చేయరాదు – దానినికూడ బాగుచేసుకుంటూ మెరుగుపరచుకుంటూ పోవలసిందే!

చతుర్విధ క్రమశిక్షణ

చైత్యాత్మిక క్రమశిక్షణ

ఇది చతుర్విధ క్రమశిక్షణద్వారా మాత్రమే సాధ్యము. ఈ చతుర్విధ క్రమశిక్షణకు చెందిన అంశాలను సంక్షిప్తముగా వివరిస్తున్నాను. ఈ నాలుగు క్రమశిక్షణ పద్ధతులు పరస్పరభిన్నములు కావు. వీటిని ఏకకాలముననే అనుష్ఠించవచ్చును. ఇదియే ఉత్తమమైన పద్ధతి. ఈ ప్రక్రియను 'చైత్యాత్మిక' (psychic) క్రమశిక్షణతో ప్రారంభించవచ్చును. మనం మన కేంద్రస్థానాన్ని 'చైత్యకేంద్రం' గా వ్యవహరిస్తాము. ఇది మన నిజరూపము. మనలోని విభాగాల లోకెల్లా శ్రేష్టమయినది. సత్యాన్వేషణనే ఆధారంగా ఆధ్యాత్మికతను ముందుకు తీసుకెళ్తుంది. ఈ చైత్యపురుమడు (psychic being అంతరాత్మ) మనలోనే ఉన్నాడనే ఎఱుక కల్గియుండాలి. అంతే కాదు. మన యోగం ఆ చైత్యపురుమనిపై కేంద్రీకరించి, అది మన జీవితాన్ని నడిపించేటట్లుగా చేసుకోవాలి. ఆ చైత్యపురుమనితో మనము అనుసంధానము చేసుకొని అతనితో మమైక్యం చెందాలి.

ఇట్లు ఈ చైత్యపురుమని దర్శించి, దీనితో తాదాత్మ్యమున మెలగ నేర్చుకొనుటకు పెక్కు విధానములు వివిధ దేశకాలములలో నిర్దేశింపబడియున్నవి. కొన్ని మానసికానికి చెందినవి. కొన్ని మతపరమైనవి. మరికొన్ని కేవలం యాంత్రికమయినవి. వాస్తవానికి, ప్రతివారూ, ఎవరికి ఏ మార్గము నచ్చుతుందో ఆ మార్గాన్ని ఎన్నుకొని, మొక్కవోని ఆకాంక్షతో, దృఢమైన దీక్షతో దానిని సాధించవచ్చును. బాహ్యాంగా అధ్యయనము, అంతర్ముఖంగా ఏకాగ్రత, ధ్యానము, దివ్యప్రబోధము (revelation) అనుభూతి మున్నగు వాటి సహాయంతో గమ్యం చేరుకోవాలి. దీనిని సాధించుటకు ఇచ్ఛాశక్తి (will) ఆవశ్యకము. ఈ చైత్యపురుమని

కనుగొనుటయే మన ప్రాథమిక ప్రవృత్తిగా గ్రహించాలి. ఈ ఆణిముత్యాన్ని మనం ఎంత వ్యయప్రయాసల కోర్చియైనా సాధించి తీరాలి. నీవే పని చేసినా, నీ వృత్తి ఏదైనా చైత్యపురుషసత్యాన్ని తెలుసుకోవాలి. నీవు యే కార్యములో నున్నప్పటికీ, ఎలాంటి ఆలోచనలున్నప్పటికీ చైత్యపురుషునితో ఏకమై ఆ అనుభూతిని సదా పొందేటట్లుగా చేసుకోవాలి.

మానసిక క్రమశిక్షణ

ఈ చైత్యపురుషాన్వేషణ పూర్ణ సాఫల్య సిద్ధిని గాంచుటకు మానసిక వికాసాన్ని మరిచిపోకూడదు. దానిని ఉపేక్ష చేయుట ఎంత మాత్రము మంచిది కాదు. ఎందువలనంటే మనస్సనే ఉపకరణం ఎంత గొప్ప ప్రతిబంధకమో అంత గొప్ప సహాయకము గూడా కాగలదు. స్వాభావికంగా మానవుని మనస్సు ఎల్లప్పుడూ హ్రస్వ దృష్టితోనూ, సంకుచితంగాను, మొండి భావనలతోను ఉంటుంది. కావున దానిని విశాలదృక్పథంతోనూ, సరళీకృతం చేయుటకుగాను, విస్తారం చేయుటకుగాను నిరంతర కృషి ఎంతేని అవసరము. అందుకే ప్రతి విషయాన్ని అనేక కోణాలనుండి పరిశీలించుట కూడా అవసరమే. ఆలోచనలకు గొప్ప ఉన్నతిని, మృదుత్వమును చేకూర్చగల ఒకానొక అభ్యాసము ఈ సందర్భములో ప్రస్తావిస్తున్నాను. మొదట, విస్పష్టంగా ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించండి. ఆ తర్వాత తద్వ్యతిరేకమైన సిద్ధాంతాన్ని కూడా అంతే నేర్పుతో చేయండి. అటు పిదప దూరదృష్టితో బాగా విషయవిచారణ చేసి, విశ్లేషించి ఈ రెండు వ్యతిరేక సిద్ధాంతాలు ఒకే సమన్వయ సిద్ధాంతముగా (comprehensive) రూపొందేవరకు ప్రయత్నించాలి.

పైవిధంగా, అనేకవిధాలైన అభ్యాసపద్ధతులను అవలంబించవచ్చును. దీనివలన జరిగే లాభమేమంటే, కొన్ని పద్ధతులు వ్యక్తిశీలసంపదను పెంపొదిస్తాయి. మరికొన్ని పద్ధతులు మనోబలాన్ని పెంపొదిస్తయి. మనోభావసమన్వయ సాధనకు సైతము ఉపయోగపడతాయి. ఉదాహరణకు, ఏ వ్యక్తుల గురించిగాని, విషయముల గురించిగాని, మంచిచెడ్డలను నిర్ణయించు అధికారము నీవు

మనస్సున కీయరాదు. ఏలనంటే, మనస్సు జ్ఞానోపకరణము కాదు. మనస్సుకు జ్ఞానాన్ని తెలుసుకోగలిగే శక్తి లేదు. మన భావాల కన్నా, మనస్సుకంటే కూడా జ్ఞానం స్వచ్ఛమైన పై అంతస్తులో ఉంది. మనస్సు తనకు అతీతమైన స్థానమునుండి జ్ఞానమును గ్రహించి, అభివ్యక్తమొనర్పగలందులకై, దానిని నిశ్చలము, నిరతము, సావధానము గావించవలసియున్నది. దేనికైననూ రూపమిచ్చి, వ్యవస్థీకరించి, ఆచరణయందుంచుటలో అది ఒక పనిముట్టు. అందుకే కార్యనిర్వహణ వల్లనే దానికి పూర్తి విలువ, ఉపయోగం కలుగుతుంది.

ప్రాణిక క్రమశిక్షణ

చైత్యపురుష వికాసానికి చాలా ఉపయోగపడడంలో ఇంకో పద్ధతి ఉంది. ఒక కార్యము సాధించుటలోగాని, ఒక నిర్ణయాన్ని గైకొనుటలో గాని యేదైనా అభిప్రాయ భేదమొచ్చినపుడు, తన మాటే వేద వాక్కనే మొండివైఖరి ఎవరికి ఉండకూడదు. ఎదుటివాని స్థానంలో తానున్నట్లు భావించుకొని, వానితో తగవులాటకు, దెబ్బలాటకు దిగుటకు మారుగా ఉభయపక్షాల అభిప్రాయాలను కనుగొనుట అభిలషనీయము. సద్భావముతో ప్రవర్తించు వారికి అట్టి పరిష్కారము సదా సులభ గ్రాహ్యామేయగును.

ఈ సందర్భములో ప్రాణిక క్రమశిక్షణ గురించి ప్రస్తావించుట ఆవశ్యకము. మనలోని ప్రాణిక సత్త (vital being) వివిధ ప్రేరణలకు, కోరికలకు, ఉత్సాహానికి, దౌర్జన్యానికి, అమితశక్తికి, నిరాశతో కృంగిపోవడం, తీవ్రంగా ఉద్రేకపడటము, తిరుగుబాటు చేయడం మున్నగు మనోవికారాలకు మూలస్థానము. దేనినైననూ సరే, ఇది ఆచరణపూర్వకంగా నిర్మాణమొనర్చి సాధించగలదు. అట్లే దేనినైననూ భగ్నమొనర్చి వినాశమొందింపనూగలదు. కావుననే మానవునిలోని విభాగములన్నిటిలోనూ దీనిని తగు క్రమశిక్షణలో పెట్టుట మిక్కిలి కష్టమైన పని. ఎంతో ఓర్పు, నిర్దిష్టమైన కృషి, అంకురిత దీక్షతో కూడిన బహుకాలపు పరిపూర్ణ అంతఃశుద్ధి దీనికి ఆవశ్యకములు. అంతఃశుద్ధి లేనినాడు, సాధకుడు తాను వేయు తొలిఅడుగు మొదలుకొని తనను తాను వంచించు

కొన్నవాడే యగును. ఆ కారణముననే పురోగతికై అతడు చేయు ప్రయత్నమంతయూ కూడా వ్యర్థమై పోవును.

ప్రాణకోశసహకారము లేనిదే ఏ ఉపలబ్ధియు సాధ్యము కానేరదు. ఏ రూపాంతరీకరణము ఆచరణీయము కానోపదు. కష్టమంతయు ఈ సహకారమును నిరంతరముగా సంపాదించుకొనుటయందే కలదు. ప్రాణకోశమునకు మంచి కార్యదక్షత యున్నది. కాని అది తరచుగా తన సంతృప్తినే కాంక్షించుచుండును. పూర్తిగాగాని, ఎంతోకొంతగాని, తనకు సంతృప్తి ఒనగూడక పోయినచో అది చికాకుపడి తిరుగుబాటు చేయును. తత్ఫలితంగా దాని శక్తి చాలావరకు వ్యర్థమైపోయి, ఏహ్యాభావము, నిరుత్సాహము, తిరుగుబాటు ప్రవృత్తి, నిస్పృహ, అసంతృప్తి సంభవించును. ఇట్టి సమయములోనే మనస్సును చిక్కబట్టుకొని, కార్యాచరణమునకు దిగకుండుట నేర్చుకొన వలెను. ఏలనంటే, అట్టి సమయములలోనే, అత్యంత అవివేకపు పనులు చేయుచుండుటయు, క్రమబద్ధమైన కృషితో నెలల తరబడి సాధింపబడిన నిమిషములలో ధ్వంసమై పోవుటయు జరుగుచుండును.

తనయందలి చైత్యపురుషునితో సంబంధము నెలకొల్పుకొని, సాధించవలసిన లక్ష్యమును ఏమరక యుండు చైతన్యమును, ఆకాంక్షను తగినంతగా తమలో ప్రజ్వలింప చేసుకొనుచూయుండువారిని ఆ సమయములు ఏమంత బాధింపజాలవు. అచిర కాలముననే అవి తొలగిపోవుచుండును.

ఇట్టి చైత్య సహాయముతో వారు, అల్లరి పిల్లవానితో వ్యవహరించు రీతిగా, ఎంతో ఓపికతో పట్టుదలతో ప్రాణకోశమునకు సత్యమును చూపి నచ్చజెప్పుచూ, ముసుగు పడియుండిన సద్భావమును దానియందు మేల్కొలుపుటలో కృతకృత్యులు కాగలుగుదురు. ఓరిమితో చేయునట్టి ప్రయత్నముల ఫలితముగనే ప్రతి చిక్కూ అవలీలగా విడిపోయి, గమ్యమువైపుగా పురోగతికి మరొక అడుగు ముందు వేసినట్లుకూడ నగును.

ప్రాణిక క్రమశిక్షణకు సంబంధించిన ప్రయత్న సందర్భమున పురోగతి కడు విలంబముగనే సాగుచుండవచ్చు గాక.

పతనములు కడు తరచుగనే సంభవించుచుండవచ్చు గాక. కాని, ధీరత్వముతో కూడిన సంకల్పబల మున్నచో, సత్యచైతన్య ప్రభా పటలము ముందర కష్టములన్నియు పటాపంచలైపోయి ఒక నాటికి విజయసిద్ధి కలుగుట నిశ్చయము.

శారీరక క్రమశిక్షణ

ఇక, కడపటికి శారీరక క్రమశిక్షణ, సునిర్మలమైన హేతువాద దృష్టితో, మన శరీరమును బలిష్టము, మృదులము గావించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ భౌతికప్రపంచమునందు మన ద్వారా అభివ్యక్తము కాగోరుచున్న సత్యధర్మశక్తి విశేషమునకది తగిన ఉపకరణముగా రూపొందవలసియున్నది.

వాస్తవంగా, శరీరమునకు గల కర్తవ్యము అధిశాసించుట గాదు. విధేయతతో మెలగుట, స్వభావములో అది అణకువతోనూ, విశ్వాసముతోను మెలగు సేవకుని వంటిది. అయితే దురదృష్ట వశాత్తూ, తన యజమానులగు మనఃప్రాణకోశముల విషయమున వివేకముతో మెలగగల సామర్థ్యము దానికి తరచుగా మృగ్యము. గ్రుడ్డిగా అది వాటికి విధేయమగుచు, తన శ్రేయస్సుకే భంగ పాటు తెచ్చుకొనుచుండును. మనస్సు తన సంకుచిత సిద్ధాంత ములతోడను, యథేచ్ఛాకల్పితములగు కఠిన నియమములతోడను, అటులనే ప్రాణకోశము, తన ఉద్వేగములు, విశృంఖల నిరర్థక ప్రవృత్తులతోడను, శరీరమునకుగల స్వాభావిక స్థాయిని చెడ గొట్టి దానిని శక్తివిహీనము, రోగగ్రస్తము చేస్తూ ఉంటాయి. ఈ దాస్యం నుండి దానికి విముక్తి కలిగించడము అవసరము. ఇది చైత్యపురుషకేంద్రంతో నిత్య ఐక్యత ద్వారా తప్ప సాధ్యపడ నేరదు.

శరీరమొక అద్భుతమైన ఉపకరణము. పరిస్థితులకు అను గుణంగా సర్దుబాటు చేసుకొంటూ మౌనం వహించగల సామర్థ్యం దానికి ఎంతగానో కలదు. మనం సామాన్యంగా ఊహించేదాని కంటే ఇంకెన్నెన్ని పనులనో నిర్వహించగల యోగ్యతావిశేషం దాని కున్నది. అజ్ఞానంతో నిరంకుశంగా దానిపై పెత్తనం చలా యించే మనోప్రాణకోశములకు మారుగా, కేంద్రస్థానీయమగు

చైత్యపురుషునిచేత అది పరిపాలించబడడం జరిగితే, ఆశ్చర్యం కలిగించగల కార్యముల నెన్నింటినో అది నిర్వహించగలదు.

ఏలనంటే, అప్పుడది కర్మాచరణమునందు విశ్రాంతిగొనుట యెట్లో నేర్చినదై తాను ప్రయోజనకరముగా తెలిసి వ్యయపరచిన శక్తివిశేషములను విశ్వశక్తుల సంపర్కము ద్వారా మరల పూరించుకొనగలిగి యుండును గాన, అచంచలత, స్థిరత, బలము నిండారిన స్థాయి విశేషముతో అయ్యది ప్రతిక్షణమూ, తాను నిర్వహించవలసిన కార్యనిర్వహణశక్తి పూనిక వహించగల స్థితిలో నుండును. స్థాయి వీడని యిట్టి స్వస్థ జీవనమున, శరీరము ఒకానొక వినూత్న సామరస్యమును వెలార్చుకొని, ఊర్ధ్వభూమికల సామరస్యమును తనలో ప్రతిబింబింప జేసికొనుచు, సమ విభక్తాంగములలో ఆదర్శప్రాయమైన రూపసౌందర్యమును సంతరించుకొనును.

నానాటికి అభివృద్ధి గాంచుచుండెడి సామరస్యమిది. ఏలయన, జీవసత్త యథార్థమైనప్పుడునూ అచలముగా స్తంభించుకొని యుండునది గాదు. అయ్యది నిరంతరం వికాసము చెందుతు, అంతకంతకు పూర్ణతర ఫలసిద్ధిని సంతరించుకొనుచుండును. అభివృద్ధి పూర్వకమైన ఈ సామరస్యమును శరీరము అనువర్తింప నేర్చుకొలది నిరంతర రూపాంతరీకరణము ద్వారమున నయ్యది విచ్ఛిత్తిని వినాశమును పొందవలసిన ఆవశ్యకతనుండి విముక్తి గాంచుట సాధ్యమగును. మృత్యుధర్మ మనివార్యము కావలసిన అగత్యము తొలగును.

సత్యచతుష్టయము

ఈ సంసిద్ధి లక్ష్యమును మనము చేరుకోగలిగినప్పుడు దివ్యప్రేమ, దివ్యజ్ఞానము, దివ్యశక్తి, దివ్యసౌందర్యము అనెడి ముఖ్యరూపములు మనము అన్వేషించు సత్యమునకు గలవని తెలియనేర్తుము. ఈ సత్యచతుష్టయము మన జీవసత్త యందంతటనూ స్వచ్ఛందముగా అభివ్యక్తమగును. చైత్యపురుషస్థానము యథార్థమైన విశుద్ధప్రేమకు వాహకము కాగా, మనస్సు అమోఘ జ్ఞాన ప్రసారమునకు వాహకమగును. ప్రాణకోశము అజేయశక్తిని అభివ్యక్తము

చేయునదికాగా, శరీరము పరిపూర్ణ సౌందర్య సామరస్యములను అభివ్యక్త మొనర్చునదై విరాజిల్లును.

అనువాదకులు: అనామకుడు; కొంగర భాస్కరరావు, పి.యస్. శంకరరెడ్డి (ఫిబ్రవరి, మార్చి 1999 'అఖిల' నుండి)

(*CWM* Vol. 12, pp. 3-8)

నిన్ను నీవు తెలుసుకో

శ్రీమాత

మానవజీవితము చాలా చిత్రమైనది. సుఖదుఃఖాలకు ఆలవాలము. కోపతాపాలకు, ఆవేశాలకు, ఆవేదనలకు నెలవు. ఎందుకని ఇలా జరుగుతుంది? నువ్వు నీ నిజస్వరూపమును మనస్సుతో తెలుసుకోలేవు. లోలోపల హృదయాంతరంగంలో చైత్యపురుషుడుంటాడు. ఒక్కసారి దాని అనుభూతిని పొందావంటే నిన్ను గురించి నీకు పూర్తిగా తెలిసినట్టే. అప్పుడు నీకు కలిగే తృప్తి వేరు. అప్పుడు ఇంకేమి ప్రశ్నలుగాని, సందేహాలుగాని ఉండవు. ఒక వెలుగుబాట నీ ముందర ఆవిష్కారమౌతుంది. ప్రతివాడు ఈ ప్రయత్నాన్ని తప్పకుండ చేసి తన నిజస్వరూపాన్ని పొందాలి. — *సంపాదకుడు*

నీ జీవితాన్ని ఉన్నతోన్నతంగా, వైభవోపేతంగా చేయుటకు మొదట నిన్ను నీవు తెలుసుకోవలెను.

(The Science of Living)

దీని అర్థం ఏమిటో మనం స్పష్టంగా తెలుసుకోవాలి. నీ నిజస్వరూపము పై పై ఆలోచనలకు, కేవలం మానసిక చింతనకు దొరుకునది కాదు. నీ లోని వివిధ భాగములను గురించి, వాటి వాటి తీరుతెన్నులు, పనిచేయు విధానములను గురించి మనం తెలుసుకోవాలి. నీ జీవితం ఎంత గ్రుడ్డిగా గడిచిపోతూ ఉంటుందో

నీకు తెలియదు. నీకు తెలియకుండానే ఏవో పనులు చేస్తూ ఉంటావు. ఎందుకు చేస్తావో తెలియదు. నీ వెందుకు కొన్ని ఆలోచనలను చేస్తావో, ఎందుకు ఆవేశపడతావో తెలియదు. అటులనే నీవు చేసే అన్ని పనులు, వ్యవహారములు నీకు తెలియకుండానే చేస్తుంటావు. నీ అజ్ఞానమే నీ పాలిటి శత్రువు. నీవు కష్టపడి ఆత్మ జ్ఞానమును సంపాదించుకున్నావనుకో అంత మాత్రాన చాలదు. అది నీ జీవితంలో ప్రతిబింబించాలి. నీ జ్ఞానము సంపూర్ణమైనప్పుడే నిన్ను నీవు చక్కగా నియమించు (control) కోగలవు.

ప్రతిక్షణం మర్చిపోకుండా నీలో అటువంటి ఆకాంక్ష ఉవ్వెత్తుగా పొంగుతూ ఉండాలి.

ఈ ప్రక్రియను నువ్వెంత తొందరగా మొదలుపెడితే అంత మంచిది. మరో సంగతి – ఒకసారి ప్రయత్నం మొదలుపెట్టిన తరువాత సడలించకూడదు! తీవ్రమైన ప్రయత్నాన్ని సజీవంగా కొనసాగించవలసిందే. చిన్న వయస్సులో ఈ విధమైన ఆత్మపరిశోధన మొదలుపెట్టావనుకో. నిన్ను నీవు పరిశీలించుకుంటూ ఆత్మజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటూ నీ జీవితాన్ని పరమ ప్రమాణంగా తీర్చిదిద్దుకోగలవు. నీకు వయసు ముదిరి పెద్దవాడవైనా గూడ నిన్ను గురించి నీవు ఇంకా సంపూర్ణంగా తెలుసుకోవలసిందే. ముసలితనంలో కూడా ఈ ప్రయత్నం నిరంతరం కొనసాగవలసినదే. దీనినే నేను 'Science of Living' అంటాను.

నీ జీవితాన్ని బాగుచేసుకోవాలంటే మొదట నిన్ను గురించి నీవు తెలుసుకోవాలి. ఉదాహరణకు ఎవ్వరైన 'ఎందుకలా చేశావు' అని ప్రశ్నించారనుకో 'నాకు తెలియదు', అని జవాబిస్తావు. 'నువ్వు దేన్ని గురించి ఆలోచిస్తావు' అని అడిగితే 'నాకు తెలియదు', 'నీ వెందుకు అలసిపోయినావు' 'నాకు తెలియదు', 'నువ్వెందుకు సంతోషంగా ఉన్నావు' 'నాకు తెలియదు'. నువ్వొయాభై మందిని ఈ విధంగా ప్రశ్నించావనుకో – ఇదే వరస. అంతరంగికంగా జాగృతంకాని వాళ్లందరూ అలాగే అంటారు. (సాధన చేసి ఆత్మజ్ఞానం సిద్ధించుకున్నవారిని గురించి నేను మాట్లాడటం లేదు. వాళ్లయితే వాళ్ళేం చేస్తున్నారో వాళ్లకి తెలిసే ఉంటుంది).

కాని మామూలు మనుషులకు నిత్యజీవితం అంతా ఇంతే. నువ్వు ఎవరితోనో మాట్లాడుతావు – ఏవో మాటలు నీ నోట్లో దొర్లుతాయి. కాని తర్వాత నేనెందుకు అలా మాట్లాడాను చెప్పమా అని అనుకుంటావు. అలా జరిగేందుకు కారణమేమిటో నీకు తెలియదు. ఉన్నట్లుండి నీకు సంతోషమో విచారమో కల్గుతుంది. దీనిక్కూడా కారణం నీకు తెలియదు. 'అందుకనే అలా అయింది' అని నీవు కచ్చితంగా చెప్పలేవు. ఇదంత తేలిక కూడా కాదులే! అనుక్షణం నీవు జాగరూకుడవై ఉంటేగాని నీకీ జ్ఞానం అబ్బదు. కొంతమంది మనుషులుంటారు. రోజుకు 12 గం॥ నిద్రపోతారు. లేచాక 'నేను మేలుకొన్నాను' అని అంటారు. మరి కొంతమంది రోజుకు 20 గంటలు పడుకుండే ఘనులు కూడ ఉంటారు లెండి.

అలా కాకుండా నిరంతరం జాగరూకుడవై ఉండాల్నంటే నువ్వు నీ చేతనా కేంద్రములను దర్శించి ఉండాలి. ఈ స్పర్శను కోల్పోకూడదు. ప్రతి ఒక్క విషయాన్ని నువ్వు శ్రద్ధగా గమనించాలి. నీకు తెలియకుండా ఏదీ జరగకూడదు. నువ్వెప్పుడూ మోసపోకూడదు. నీ కిష్టంలేని మాటలు నీ లోంచి రాకూడదు. ఈ విధంగా జాగృతమై ఎంతమంది ఉంటారు? ఆత్మజ్ఞానం అంటే అలా జాగృతమై ఉండటమే. జీవితంలో పరిస్థితుల నుండి నువ్వు లాభం పొందాలనంటే, నువ్వు జాగరూకుడవై ఉండాలి. ఏం జరిగినా కూడా నువ్వు ఆశ్చర్యపోకూడదు. అనగా నువ్వు అదుపు తప్పి ప్రవర్తించకూడదు. నువ్వు అలా ఎందుకని మాట్లాడేవో, ఎందుకని చేశావో నీకు తెలిసివుండాలి. పూర్తిగా జాగృతమై వుండాలి. అంతే.

మరో ముఖ్యమైన విషయం. నువ్వు ఇతరుల నుండి పూర్తిగా వేరైన మనిషివి కావు. ఎందుకంటే జీవితంలో నిరంతరం కొన్ని శక్తుల పరస్పర మార్పిడి (exchange), చేతనల మార్పిడి, స్పందనల మార్పిడి అనేక రకాల వినిమయం జరుగుతూ ఉంటుంది.

నువ్వు ఎప్పుడైనా ఒక జనసమూహాన్ని చూశావా? ఒకళ్లు ముందరకి వెళ్ళారనుకో అందరూ ముందుకు వెళ్లుతారు. ఒకరు వెనక్కి వెడితే అందరు వెనక్కి వెడతారు. అంతరంగిక లోకాల్లో

కూడా అంతే. నీ చేతనలో కూడా అంతే. నీకు బయట నుంచి నీ వత్తిడు లొస్తూ ఉంటాయి. ప్రభావాలు కల్గుతూ ఉంటాయి. నువ్వు జాగరూకుడవై ఉంటే తప్ప నీలోకి ఏదో ప్రవేశిస్తున్నట్లు నీ కేమీ తెలియదు. నీకు తెలియకుండానే నీలోకి బయట నుంచి రకరకాల శక్తులు నీలోకి ప్రవేశిస్తూ ఉంటాయి. అవి నీలోకి ప్రవేశించి నిన్ను కలవరపెట్టినప్పుడుగాని నీకు తెలియదు. ఎన్ని మాట్లు నీ బుర్ర పాడైపోయి నీకు కోపం వస్తుంది? దానికి కారణం ఏమిటో తెలియదు. నువ్వు కొంతమందితో మాట్లాడి నపుడు బాగా మాట్లాడ గలుగుతావు. మిగతావాళ్లతో మాట్లాడ లేవు. ఎందుకని? నువ్వు చెడ్డవాళ్లని కలుసుకున్నావనుకో – అప్పుడు నువ్వు కూడ అకస్మాత్తుగా కోపం వచ్చి నర్సింహావ తారం ఎత్తుతావు. ఎందుకని అలా అవుతుందో, దానికి ఎవరు కారణమో, ఈ ప్రభంజనము ఎందుకు వస్తుందో, ఎక్కడ నుంచి వస్తుందో ఎవ్వరికి తెలియదు. జరిగే ప్రతి విషయం, పెద్దదాని నుంచి చిన్నవిషయం వరకు అంతే.

ఒక సమూహంలో నీ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని పొందాలని ఉంటే నిన్ను గురించి నీవు పూర్తిగా తెలుసుకోవాలి (one must be absolutely conscious of oneself) అంటే ఈ కలగాపులగం కాకుండా నీ అసలు స్వరూపం గురించి నేను చెప్పేది. ఈ జ్ఞానం లేనంతవరకు రకరకాల స్పందనలు, గాలులు (you are moved by all kinds of things) నిన్ను ఏడిపిస్తూనే ఉంటాయి. సామూహిక భావనలు, సామూహిక ప్రేరణలు నిన్ను కూడ ఆవహిస్తాయి.

ఏదో ఒక ఆలోచన నీ మనస్సులో మెరుస్తుంది. నువ్వు అది నీ స్వంతమే అనుకుంటావు. కాని అదేమీ కాదు. ఇదంతా కూడా సామూహికమే. కాని ఈ సామూహికం ఎప్పుడూ కూడా వ్యక్తికంటే బలహీనమైనదే. ఇద్దరు సమ మనస్కులు ఉన్నార నుకో, వారిద్దరు కలుస్తే ఒక గుంపుకంటే చాల బలమైనవారన్న మాట. కాని ఎప్పుడు అస్పష్టమైన, అచేతనమైన భావములే గాలిలో తేలుతూ ఉంటాయి. నీకు తెలియకుండానే నీవు దాంట్లో తల మునకలై పోతావు.

కాని ఇలా కాకూడదు కదా! నీకో చిన్న అభ్యాసం చెపుతా విను. "నేను ఆలోచించకుండా ఒక్క మాట కూడా మాట్లాడను" అని తీర్మానించుకో. వెంటనే అది భంగమైపోతుంది. దాన్ని ఆప లేవు. నీకు తెలియకుండానే నీవేదో ప్రేలుతావు. అలా కాకుండా ఉండాల్నంటే నీవు గట్టి ప్రయత్నం చేయాలి.

"నేను అబద్ధాలు చెప్పను" అని తీర్మానించుకొని వెంటనే అబద్ధాలు చెప్పేవాళ్లను చాలామంది గురించి నాకు తెలుసు. వాళ్ల తప్పు కాదు. వాళ్లు అబద్ధాలకోరుల మధ్య ఉండటం వల్ల సహవాసదోషం అంతే. అక్కడ అనృత వాతావరణమే రాణిస్తుంది.

ఈ పరిస్థితిలోంచి బయటపడాలనంటే చాలా నెమ్మదిగా క్రమక్రమంగా చాలా ఓర్పుతో నడుం బిగించి నిన్ను నీవు అధీనం చేసుకోవాలి.

(It is then that gradually, slowly with perseverence, first of all with great care and much attention, one becomes conscious, learns to know oneself and then to become master of oneself)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 4, pp. 33-37)

చైత్య పురుషుడే నీ నిజస్వరూపము. దానిని వెదికి పట్టుకొనుటయే నీ ప్రథమ కర్తవ్యము.

శ్రీమాత

అంతర్ జ్యోతి దర్శనము

శ్రీమాత

నీలో జరిగే సమస్తమైన కదలికలను, నీలోనే ఉన్న ఉన్నతా దర్శముల ఎదుట నిలబెట్టి, దాని వెలుగుకి, న్యాయానికి సమర్పించుకొనుము. అప్పుడే నీవు ఎట్టి తప్పుగాని, పొరపాటుగాని లేకుండా నీ ప్రవర్తనను నూటికి నూరుపాళ్లు సక్రమంగా తీర్చి దిద్దగలవు. — *జీవనశాస్త్రము*

మనిషికి తనను గురించి తనకు ఏమాత్రం తెలుసు? అసలు తెలియదనే చెప్పాలి. తనకు తెలియకుండానే తను రకరకాలుగా ప్రవర్తిస్తాడు. ఒకసారి ఇలా, మరొకసారి అలా, ఒకసారి అటు ప్రక్కకి మొగ్గుచూపడం వల్ల, నీలో గందరగోళం ఏర్పడుతుంది. నీ మనస్సు కూడ ఒక తోడుదొంగ. నీవేదయినా పొరపాటు చేసావనుకో – వెంటనే నీ మనస్సు దానిని సమర్థించుకొంటుంది. అటువంటప్పుడు నీ నిజస్వరూపమును గురించి నీవు తెలుసుకోడం కష్టమే. *చిత్తశుద్ధితో నిన్ను నీవు నిష్పక్షపాతంగా పరిశీలించుకుంటే గాని, నీ మనస్సు చేసే ఆగడాలను నీవు కనుక్కోలేవు.*

నిత్యజీవితంలో ఏవో పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. నీవు ఎవరితోనో ఘర్షణ చెందవచ్చు. వాదోపవాదాలు చేయవచ్చు. ఆ రోజల్లా ఆ విషయాలే నీ మనస్సులో మళ్ళీ మళ్ళీ తిరుగుతూంటాయి. ఇక నీవేమాత్రం పురోగమించ లేవు. అక్కడే ఆగిపోయి గిలాగిలా కొట్టుకుంటావు. అలా కాకుండా నీలోని వెలుగును దర్శించావనుకో, ఆ వెలుగు ఆ జ్ఞానము చాలా ఉన్నతమైనవి. అవి అమోఘము. వాటి ముందర కనుక నీలో జరిగే చేష్టలను, చర్యలను నిలబెట్టినప్పుడు మళ్ళీ ఎలాంటి పొరపాట్లు జరగకుండా వెలుగుబాటలో నీవు నడిచిపోతుంటావు. చకచక ముందుకు సాగిపోతావు.

మరో విషయం. నీవు తెరమీద సినిమా చూస్తావు కదా. అదే విధంగా నీకు వచ్చే ఆలోచనల్నీ, ఆవేశాలను బుద్ధులను అలాగే తెర మీద సినిమా చూచినట్లుగ చూడుము. నీ ముందున్న ప్రకాశవంతమైన తెలిపై చూడుము. కొన్ని విశేషములు బాగుగనే ఏ నీడయు పడకుండా కదలిపోవును. ఇతరములు కొన్ని కొద్దిగా నీడలను కల్పించును. కొన్ని వెగటుగా గన్పించు దట్టమైన నల్లని నీడను మాత్రమే కన్పింపజేయును. ఇదంతయు నీవు కడు చిత్త శుద్ధితో ఒక వినోదక్రీడలో పాల్గొనుచున్నట్లు చేయవలెను. నీ విట్లనుకొనవలెను. "నేను ఫలానా పరిస్థితులలో ఫలానా కార్య మును ఈ రీతిగా స్పృశించుచు, ఈ రీతిగా ఆలోచించుచు చేసి తిని. ఆత్మజ్ఞాన, ఆత్మస్వామ్య ఆదర్శమును, నా యెదుట నిడు కొని యున్నాను. ఈ పని ఆ యాదర్శమునకు అనుగుణమైనదా కాదా"! అని చూడవలయును. అనుగుణమైనదే అయితే, తెరపైన నీడలు కనిపించవు. తెలి యంతయు పారదర్శకమై వెలుతురు విరజిమ్మును. అట్టియెడ దానిని గురించి ఎట్టి బాధయు పడనవ సర ముండదు. అట్లుగాక, చీకటినీడలు పడినట్లయితే, "ఎందుకు ఈ నీడలు పడినవి, ఆత్మజ్ఞానమునకు, ఆత్మస్వాధీనతకు భంగము వాటిల్లినదా?" అని ప్రశ్నించుకొనుము. సామాన్యముగా దానికి కారణము అజ్ఞానమై యుండును. అప్పుడు అజ్ఞానమునకు సంబం ధించిన జాబితాలో దానిని చేర్చుము. ఇక మీదట నేను ఎరు కతో కార్యముల జేయుదునని తీర్మానించుకొనుము. అసహ్యా మైన నల్లటి అహంకారము ఇతర విషయాలను చూచినప్పుడు నీకు కనబడును. అది చర్యలను, లేదా ఆలోచనలను, చెడగొట్టు టకు వచ్చినదే. అప్పుడు ఈ అహంకారమును నీ జ్యోతి యెదుట నిలిపి, "నాచేత ఆ విధముగా పనిచేయించుటకు, ఆ విధముగా ఆలోచన చేయించుటకు, ఈ అహంకారమునకు హక్కు ఎందు వలన వచ్చినది" అని అడుగుము. ఏ వివరణనైనను ఆమోదించే ముందు, నీవు బాగుగ వెదకి చూడవలెను. అంతట నీలో ఒక మూల ఒక విషయమును కనుగొందువు. అది ఆలోచించి ఇట్లు చెప్పును: "లేదు, ఏమైనను నే నొప్పుకొందునుగాని, దానిని

మాత్రము ఒప్పుకొనను" అని. అది ఒక క్షుద్రమైన స్వాతిశయ ప్రవృత్తి యనియు, స్వార్థప్రేమ యనియు, ఎక్కడో దాగుకొన్న అహంభావమనియు, మరియు నింకేమేమో యనియు గ్రహింతువు. అప్పుడు నీ యాదర్శజ్యోతి వెలుగులో దానిని బాగుగా పరిశీలించి ఇట్లు ప్రశ్నించుకొనుము. "ఈ ప్రవృత్తి అన్వేషణకు, నా యాదర్శమునకు అనుగుణమైనదగునా, కాదా? ఈ చిరుచీకటి కోణమును నేను నా జ్యోతి సమక్షములో నిలిపి, అది అదృశ్యమైపోవు నంతవరకు దానిలోనికి కాంతిని ప్రవేశింప జేసెదను". ఇంతటిలో ఈ ప్రహసనము ముగియును. కాని, పూర్తి దినము యొక్క ప్రహసనము ఇంకను పూర్తి కావలసియే ఉన్నది. ఎందుకనగా, ఆ జ్యోతి సమక్షమునకు తేబడవలసినవి అనేకమున్నవి. అయితే, ఈ యాటను నీ విట్లే సాగించుచున్నట్లయితే, – ఇది నిజముగా ఆటే కనుక, నిజాయితీతో దీనిని సాగించుచున్నట్లయితే, – నేను నిశ్చయముగా చెప్పుచున్నాను. ఆరుమాసములలో నిన్ను నీవే గుర్తించుకొనజాలవు. "ఏమిటీ? నేనావిధముగా నుంటినా? అసంభవము" అని అనుకొందువు.

నీవు అయిదు సంవత్సరాల వయస్సు, ఇరువది, ఏబది లేక అరువది వయస్సు గలవాడవై యుండినను, ఈ విధముగా సర్వము, ఆంతరంగిక జ్యోతి యెదుట ఉంచి నీవు మార్పు జెందవచ్చును. నీ ఆదర్శమునకు సరిపడని అంశములు సాధారణముగా నీ నుండి పూర్తిగా బయటకి నెట్టివేయవలసినవి కావు (అటువంటివి చాల కొద్దిగా నుండును). అవి తమ తమ స్థానములు తప్పిన అంశములు మాత్రమే. నీ భావములను, యాలోచనలను, ప్రేరణలను, తదితరముల నన్నింటిని అంతర్జ్యోతియైన నీ ఆత్మకేంద్రము చుట్టును ఉండునట్లు ఏర్పాటు చేసికొనినట్లయితే, తారుమారుగ నున్నవన్నియు ప్రకాశవంతమైన మార్గమున మార్పుజెందగలవు.

అదే పద్ధతిని, జాతిసర్వము, లేక భూమి సకలము, అనుసరించినట్లయితే, మానవులను విచారగ్రస్తులను జేయునవి అన్నియు నిశ్చయముగా అదృశ్యమైపోవును. ఎందుకనగా, ప్రపంచపు దౌర్భాగ్యమంతయు చాలవరకు ఆయా విషమయులు వాని

వాని స్థానము లందుండకపోవుట చేతనే సంభవించుచున్నది. ప్రతిది దాని స్థానములో నుండునట్లు, ఎద్దియు, దుర్వినియోగము కాకుండునట్లు, జీవితమును ఏర్పాటు చేసికొన్నట్లయితే, ఈ దౌర్భాగ్యము ఇక ఉండదు. ఒక పురాతన ఋషి, "కీడనునది లేదు, సమతౌల్యము లేకపోవు టొక్కటే లోటు. చెడ్డ అనునది లేదు. ఉన్నస్థితి ఒక్కటే, ఆయా విషయములు వాని స్వస్థానము నందులేవు" అన్నాడు.

వివిధ దేశములలోగాని, భౌతికప్రపంచములోగాని, సర్వ విషయములు, క్రియలు, ఆలోచనలు, వ్యక్తుల భావములు, వాని వాని స్థానము నందున్నట్లయితే మానవుని బాధలందు అధిక భాగము అదృశ్యమైపోవును.

(An old sage has said:

"There is no evil. There is only a lack of balance.

"There is nothing bad. Only things are not in their place."

If everything were in its place, in nations, in the material world, in the actions and thoughts and feelings of individuals, the greater part of human suffering would disappear).

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి; పాలా వెంకటసుబ్బయ్య
(శ్రీమాత శతజయంతి ప్రచురణ 7 నుండి)

(*CWM* Vol. 4, pp. 38-40)

నీకు అద్భుతమైన ప్రేమ, జ్ఞానము, శక్తి, సౌంద ర్యము కావాలంటే నీ చైత్యపురుషుని ద్వారానే వాటిని తెలుసుకొనగలవు.

శ్రీమాత

క్షణికావేశం పనికి రాదు

శ్రీమాత

మనిషి ఎప్పుడూ మనస్సుయొక్క పై పొరలలో జీవిస్తూ ఉంటాడు. అందుకని ఆవేశాలకు, కోపతాపాలకు గురైపోతాడు. ఇతరులతో ఘర్షణ చెందుతాడు. పరిస్థితులకు క్షణికావేశంతో పరిస్పందిస్తాడు. అలా కాకుండా ఒక్కడుగు లోపలికి వేసి నిదానంగా ఆలోచించినట్లయితే ఎట్టి ప్రమాదము ఉండదు. నువ్వు అంతఃస్థితుడవై నిదానంగా ప్రవర్తించినట్లయితే ఎట్టి బెడదా ఉండదు. — సంపాదకుడు

నిజం చెప్పాలంటే మీ కెవరికి ఎలా జీవించాలో తెలియదు. మనస్సుయొక్క పైపొరలలో, ఆలోచనలలో మునిగిపోయి మీ పరమోపరి భాగంలో జీవిస్తూంటారు. బాహ్య పరిస్థితులకు నిస్సహాయంగ లొంగిపోయి ఒక కీలుబొమ్మవలె తయారవుతారు. నిజం చెప్పాలంటే మీరు మీ అంతరంగంలో జీవించే బదులు, పూర్తిగా మీలో నుంచి బయటి కొచ్చి నిలుచున్నట్లే (ఒట్టి సబ్బు నురగే అనమాట) ప్రవర్తిస్తారు. అటువంటప్పుడు ఏమవుతుంది? ఇద్దరు మనుషులు కలుసుకున్నప్పుడు ఏమవాలో అదే అవుతుంది. ఈ బాహ్యరూపాలు ఘర్షణ చెంది కోపోద్రిక్తులై వాదోపవాదాలకు దిగటం మామూలే. దీనికి ఒక్కటే మందు. *నీవు ఒక్కడుగు (వెనక్కు) లోపలికి వెయ్యాలి. అప్పుడిక ఈ విధమైన ప్రమాదం తప్పుతుంది. నీవు సురక్షితంగా ఉంటావు.*

బాహ్యప్రపంచంలోని పై పై ప్రభావాలకుగాని, ఒత్తిడులకుగాని నువ్వు దాసోహం అవకూడదు. ఏదైనా ఒక పనిని తొందరగా ప్రారంభించవలసినప్పుడు సైతం — ఒక్కసారి నిదానించు. ఒక్క అడుగు వెనక్కి వేసి — వెనుదిరిగి పరిశీలించు. నీకే ఆశ్చర్యం కలిగేలా ఆ పనిని మరింత వేగంగా, మరింత సమర్థవంతంగా చేసే విధానాన్ని కనుక్కోగలుగుతావు.

ఎవ్వరైనా మీపై కోపంతో ఉన్నా, ఆ తాపతరంగాల వల యంలో నువ్వు మాత్రం ఇరుక్కోకు. స్పందించకు. నిదానించి ఆత్మావలోకనం చేసుకో. అంతే! దాంతో అవతలి వారి, ఎంతటి ఆగ్రహమైనా ఆలంబనం దొరక్క, స్పందన కరవై చప్పున చల్లారి ఊరుకుంటుంది.

కాబట్టి సదా శాంతంగా ఉండు. దాన్ని భగ్నం చేసే ఆవే శాలన్నింటిని జయించు. వెనుదిరిగి విలోకించకుండా ఏ నిర్ణ యమూ తీసుకోకు. సింహావలోకనం చేయకుండా ఏ మాటా మాట్లాడకు. ఒక్క అడుగు వెనక్కి వేసి పరిశీలించకుండా ఏ పని లోనూ ఉరక్కు.

ఈ సాధారణ ప్రపంచానికి సంబంధించిందంతా అశా శ్వతం. వట్టి నీటిబుడగ వంటిది. కాబట్టి ఇటువంటి వాటి కోసం తలక్రిందులు కావలసిన అగత్యం ఏమాత్రమూ లేదు.

ఏదైతే స్థిరమైనదో, ఏదైతే శాశ్వతమైనదో, ఏదైతే నాశనం లేనిదో, ఏదైతే అనంతమో – అదే నిజంగా మనక్కావాలి. అదే సాధించతగినది. అనుభవించతగినదీ కూడా అదే!

అది మరేం కాదు – దివ్యకాంతి, దివ్యప్రేమ, ఇంతెం దుకు సాక్షాత్తు దివ్యజీవనమే. అంతేకాదు, అది పరమశాంతీ, పరిపూర్ణ ఆనందమూను. ఈ భూమి మీద ఉన్నతోన్నతంగా సంపూర్ణ సాక్షాత్కారంతో వెలుగొందే సాధికారం అంతా కూడా అదే.

ఈ ప్రాపంచిక విషయాల పట్ల అనుబంధాన్ని అనుభూతి చెందినప్పుడు ఏం జరిగినా నువ్వు ఒక్కసారి వెనక్కి అడుగువేసి నిదానించి పరిశీలించు. అంతే. అప్పుడు నువ్వు నిశ్చలంగా ఉండ గలవు. దివ్యశక్తిని వేడుకో. సందేశం కోసం ఎదురుచూడు. ఏం చేయాలో అప్పుడు నీకే అవగతం అవుతుంది. (What is lasting, eternal, immortal and infinite – that indeed is worth having, worth conquering, worth possessing. It is divine Light, Divine Love, Divine Life – it is also Supreme Peace, Perfect Joy and All-Mastery upon earth with the Complete Manifestation as the

crowning. **When, you get the sense of the relativity of things, then whatever happens you can step back and look; you can remain quiet and call on the Divine Force and wait for an answer. Then you will know exactly what to do.)**

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

(*CWM* Vol. 3, p. 360)

చైత్యజీవితము

శ్రీమాత

నీకు నీ మనస్సు, ఇంద్రియాలను గురించే తెలుసు. కానీ ఉపనిషత్తులలో చెప్పినట్లు, అంగుష్ఠ ప్రమాణమైన చైత్యపురుషుడే నీ నిజస్వరూపము. ఒకసారి దాని స్పర్శను గనుక పొందినట్లయితే నీవెంత తెలివితక్కువగా ప్రవర్తిస్తున్నావో నీకు తెలిసిపోతుంది. ఈ చైత్యస్ఫూర్తి నీలో పెరుగుతున్న కొద్దీ ప్రపంచములో అందరూ తలక్రిందులుగ నడుస్తున్నారేమిటి అని అనిపిస్తుంది. దీనినే మనము చైత్యము, చైత్యకేంద్రము, చైత్యజీవి మొ॥ పేర్లతో వ్యవహరిస్తున్నాము. ఇంత అద్భుతమైన విషయమును గురించి మనం తెలుసుకోవాలి కదా. — సంపాదకుడు

మనిషి మాములు జీవితం అంతా రకరకాల కోరికలమయం. ఆశల వలయం. దానిలో ఇరుక్కొని ఉన్నంతసేపు స్థిరమైన ప్రగతిని సాధించలేము. కాబట్టి ఈ వలయాన్ని ఛేదించుకుని ఈవల పడే మార్గాన్ని అన్వేషించుకోవలసిందే.

అతిసామాన్య జీవనంలో అందరికీ అనుభూతమయ్యే అతి సాధారణ కోరికనే ఉదాహరణగా తీసుకుందాం. పుట్టింది మొదలు మనిషికి తిండిగోడవే కదా! ఏం తిందాం! ఎప్పుడు తిందాం! కావలసినంతా ఉంటుందా! ఇదీ వరస, వీటిని గురించే నిరంతరం ఆలోచన.

అలా కాకుండా ఆహారం విషయంలో పూర్తిగా భిన్నంగా ప్రవర్తించాలంటే ఆహారాన్ని గురించిన కోరికల్ని అధిగమించాలి. దానికి సమచిత్తత ఉండాలి. సమానత్వ భావన పెంపొందాలి. ఆ స్థితి సిద్ధిస్తే ఆహారాన్ని గురించిన ఆరాటాలు ఏవీ ఉండవు. ఆహారం లభిస్తే తింటావు – ఒక వేళ లభించకపోయినా అదో సమస్యగా ఉండదు. దాన్ని గురించిన ఆలోచన అసలు ఉండనే ఉండదు.

అయితే ఒకటి – అసలు ఆహారమే అక్కర్లేదు అనే వ్యతి రేక ఆలోచనా కూడా కూడదు. ఆకలిని చంపుకోవడం కోసం కృత్రిమవిధానాలు అనుసరించడం, సన్యాసులవలె ఉపవాసాలు చేయడం వంటివి ఆహారం పట్ల కోరికల్ని మరింత ఉద్ధృతం చేస్తాయే తప్ప తగ్గించవు. ఆహారం మానేస్తే దానిపై కోరికతో కలలు కనడం ఎక్కువౌతుంది. కాబట్టి ఇవేవీ కావు. ఆహారాన్ని మానడం కాదు. దానిపట్ల ఉదాసీన దృక్పథాన్ని అలవరచుకో వాలి. అదే ముఖ్యం. ఆహారాన్ని గురించిన ఆలోచనే నీ మనసు నుంచి మాయం కావాలి. దానికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వ కూడదు.

ఇది కష్టం అని భావించనక్కర లేదు. నీ అంతరాంతరాల్లో నీ చైత్యపురుష (Psychic being) డున్నాడు. అతని స్పర్శని నువ్వు ఒక్కసారి పొందితే చాలు – ఈ విష.యాలన్నీ ఎంతటి అప్రధా నమైనవో అవగతం అవుతుంది. అంతేకాదు, అన్నిటినీ మించి దైవ మొక్కటే ప్రధాన విషయం అని కూడా తెలుసుకో గలుగు తావు. చైత్యంలో (Psychic) అధివాసం అంటే కోరిక లన్నింటికి అతీతంగా ఉండడం అన్న మాట. అప్పుడు విషయాల పట్ల మోహం ఉండదు. ఆవేదన ఉండదు. కోరికల తాపమే ఉండదు. ఏం జరిగినా అంతా మన మంచికే అనే భావన కలుగుతుంది.

ఇలా అన్నాను కదా అని – అంతా నీ మంచికే అని తప్పుగా అన్వయించుకుండేవు జాగ్రత్త. చింతలమయమైన ఈ చిత్తంతో నువ్వు ఉన్నంతవరకు ప్రతీది మంచికి కాజాలదు. నీ

మనస్సు సరియైన స్థితిలో లేనప్పుడు నువ్వు పూర్తిగా తప్పుడు మార్గంలో పడిపోతుంటావు.

ఎప్పుడైతే, నువ్వు నీ చైత్యకేంద్రాన్ని దర్శించి, దైవానికి సమర్పించుకుంటావో – అప్పుడు జరిగేవన్నీ అన్నివిధాలా మంచికే జరుగుతాయి. *ఏదో రూపంలో నీకు దైవానుగ్రహం తప్పక లభిస్తుంది.*

స్వచ్ఛమైన ఆత్మార్పణతో చేసే ప్రతీ పనికి సత్ఫలితం ఉంటుంది. అనన్యమైన ఆనందం, తృప్తి, భద్రత వంటివి లభిస్తాయి. అయితే ఈ శరణాగతి పూర్తిగా అంతరాత్మపరం అయ్యే వరకు – కొంతవరకు ఇబ్బందులు – చికాకులు తప్పవు. కాంతికి కాంతికి మధ్య అంతరాలలో క్రీనీడలు కదులుతూనే ఉంటాయి. అలా కాకుండా ఎటువంటి అవాంతరాలు లేని అఖండ కాంతి రేఖగా ప్రగతిని సమకూర్చేది చైత్యేంద్రియం (psychic) ఒక్కటే. దాని గమనం నిరంతర ఆరోహణమే. ఇతర గమనాలన్నీ ఖండితాలు, అవాంతర భూయిష్టాలూను. *నీలో చైత్యకేంద్రము ఉందని తెలుసుకుని, నువ్వు అందులో స్థిరపడేంతవరకు నీవు కనీసం ఓ వ్యక్తిగా (individual) కూడా ఉండలేవు. అంతా సంతగోలగా వుంటుంది.*

కాబట్టి నిజమైన ప్రగతి సాధించాలనుకుంటే నిరంతరం పరమాత్మతో సుస్థిరంగా ఉండే నీ ఆత్మను తెలుసుకోవాలి. అప్పుడు మాత్రమే రూపాంతరీకరణం సాధ్యం అవుతుంది. నీ లోని ఇతర భాగాలు అన్నీ అజ్ఞానభూయిష్టాలే కదా! ఉదా॥ నీ మనస్సే ఉన్నది. అది తన తెలివితేటలు, తన ప్రతీ ఆలోచనా కూడా గొప్పవేనని భ్రమపడుతూ ఉంటుంది. భగవంతునికి అనుకూలంగానే కాదు, వ్యతిరేకంగా కూడా పటిష్ఠమైన వాదనలు చేయగలదు. స్వచ్ఛమైన సత్యాన్ని గురించిన భావన దానికి ఉండదు. సాధారణంగా బలప్రదర్శనకే ప్రాణికం (vital) తన్మయత్వం చెందుతుంది. దానినే భగవంతునిగా భావిస్తుంది. ఒక్క చైత్యపురుషునికే పరమాత్మతో ప్రత్యక్ష సాన్నిహిత్యం ఉండడం వల్ల దానికి మాత్రమే ఆ విచక్షణా జ్ఞానం ఉంటుంది. ఏది భగ

వంతుడో, ఏది కాదో ఆ చైత్యపురుషునికి మాత్రమే కచ్చితంగా తెలుసు. దాంతో ఒక్క క్షణం అనుసంధానం చేయగలిగితే, దేవుని గురించిన భావాన్ని సంతరించుకోగలవు. దానిని ఏదీ కూడా చెదరగొట్ట లేదు.

నిజమైన ఆత్మను తెలుసుకోవడం ఎలా? దాన్ని కాంక్షించాలి; మిగతాది దేన్నీ వాంఛించనంత గాఢంగా దాన్ని వాంఛించాలి. ఇక్కడ ఉన్నవారిలో చాలామంది దానివలన ప్రభావితులు అయ్యే ఉంటారు. అయితే అది చాలదు. ఆ ప్రభావాన్ని మించి దాన్ని గుర్తించగలిగేటట్టు ఉండాలి. దానితో తాదాత్మ్యం చెందాలి. దివ్యత్వానికి అవసరమైన ప్రేరణలు అన్నీ దాని నుండే ఆవిర్భవిస్తాయి. అయితే దాని ఉనికి నీకు తెలీదు; అందుకని దానితో సహకరించవు దాని ప్రకాశంలో లీనం కాలేవు.

చైత్యపురుషణ్ణి గురించి నేను చెప్పుతున్నప్పుడు, నీలోని ఆవేశాన్ని గురించే ప్రస్తావిస్తున్నాను అనుకోకు సుమా! ఆవేశం అనేది ప్రాణికం పై స్థాయికి చెందినదే తప్ప అంతరాత్మకు సంబంధించింది కానే కాదు. ఆత్మ అనేది నీలో నిరంతరం దేదీప్యమానంగా వెలిగే జ్యోతి. అది దైవం వైపు ఊర్ధ్వముఖంగా ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. శత్రువ్యూహాల నన్నింటిని చిత్తుచేసే బలంతో అది సదా ప్రకాశిస్తూ ఉంటుంది.

దానితో తాదాత్మ్యం చెందగలిగితే – దివ్యసత్యాన్ని నువ్వు తెలుసుకో గలుగుతావు – అప్పుడు ఈ ప్రపంచం అంతా అజ్ఞానంతో తలక్రిందులుగా నడుస్తున్నట్లు తోస్తుంది!

వైయక్తికమైన నీ ఆత్మను నీలోనే ఉండే నిజమైన చైత్యాత్మతో సంధించడం నువ్వు నేర్చుకోవాలి. ప్రస్తుతం నీ వ్యక్తిత్వం మార్పుల సమాహారంతో కలగాపులగమై ఉంది. సకల కల్లోలాల మధ్య కొంత సుస్థిరతను, ఏకత్వాన్ని పరిరక్షిస్తోంది. నిత్యచైతన్యంతో మార్పు చెందుతూనే దాని సహజ లక్షణాన్ని, నిర్దుష్టతను కాపాడుకుంటూ ప్రవహించే నది వంటిది అది.

నీ మామూలు మనస్సు (వ్యక్తి) నీ వాస్తవ స్వరూపానికి ఛాయ వంటిది; వివిధ సందర్భాలలో వివిధ రూపాలను ధరి

స్తుంది – మానసికంగాను, ఆ తరువాత ప్రాణికంగాను, మిగతా సమయాల్లో శారీరకంగాను, రకరకాలుగా ఉంటుంది. ఆఖరికి చైత్యకేంద్రంతో అనుసంధానమై వాస్తవ ఆత్మగా అనుభూతి చెందుతుంది. అప్పుడు నువ్వు పరమాత్మతో ఏకమై సారూప్య మొందుతావు. అప్పుడు నిన్ను ఏదీ ఇబ్బంది పెట్టలేదు. ఏదీ కదిలించలేదు. ఆహారం కోసం ఆరాటపడే క్షుద్రమైన విషయాలకు అతీతంగా నువ్వు శాశ్వత ప్రగతిని క్రమపద్ధతిలో సాధిస్తావు.

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు.

(*CWM* Vol. 3, pp. 123-25)

సంపూర్ణ విశ్వాసం – లోపలి ద్వారం

శ్రీమాత

అమాయకమైన చిన్నపిల్లల్లో ఉండే నమ్మకం లాంటి నమ్మకం ఉండాలి. పిల్లలు వాళ్లు కోరుకున్నది తప్పక వస్తుంది అని నమ్ముతారే కాని, వస్తుందా? రాదా? అని చర్చించుకోరు. వాళ్ళకు కావాల్సింది తప్పక లభిస్తుంది అని సంపూర్ణంగా నమ్ముతారు. సరిగ్గా ఇలాంటి ప్రగాఢ విశ్వాస ముండటమే ముఖ్యము.

అందరు ఆకాంక్షిస్తారు. కాని కొంతమంది నమ్మకం అపనమ్మకం మధ్య ఊగిసలాడుతూ ఆకాంక్షిస్తారు. సంపూర్ణంగా నమ్మాలా? అసలు నమ్మకూడదా? విజయం తప్పక లభిస్తుంది అనే ఆశావాదిగా ఉండడమా? గబుక్కున ఏదో అయిపోతుంది పర్యవసానం ఏమౌతుందో అని నిరాశావాదిగా ఉండడమా? అని తమలో తాము వితర్కించుకుంటూ కోరుకుంటారు. ఇలాంటి డోలాయమాన మనః స్థితి ఉంటే మీకు ఏమీ లభించదు.

కాని మీరు ఏమనుకొంటారు?

"నాకు దక్కాలి అనుకొన్నది ఏదీ నాకు దక్కదు" అనుకొంటారు. ఎంచేత? అంటే మీకు నమ్మకం లేకపోవడం వల్లే.

అలా నమ్మకం లేకపోవడంతో మీ ఆకాంక్ష మీరే కూలగొట్టు కుంటారు.

పిల్లల్ని పెద్దలు తగలేయక ముందు, అంటే వాళ్ళని వాళ్ళ లాగే ఉండేలా స్వేచ్ఛగా వదిలేస్తే అంతా మంచే జరుగుతుంది అని సంపూర్ణంగా నమ్ముతారు.

ఒక చిన్న ఉదాహరణ చూడండి: చిన్నపిల్లలకి దెబ్బలు తగలడమో అలాంటి చిన్న ప్రమాదమో వచ్చింది అనుకోండి. వాళ్ళు దాన్ని పెద్దగా పట్టించుకోరు. అదే పోతుందిలే అని వది లేస్తారు. వాళ్ళకు ఉన్న ఆ బలమైన నమ్మకమే వాళ్ళ దెబ్బల్నీ వాటినీ మానిపోయేలా చేస్తుంది.

సరే, ఎవరైనా నాకు 'శక్తి' కావాలి అనుకొంటే దానికి దేవుడు సహాయపడాలి అనుకొంటే – ఎవరూ కదిలించలేని ప్రగాఢ విశ్వాసంతో (చాలా బలమైన నమ్మకంతో) కోరుకుంటే అది అయి తీరుతుంది. సరిగ్గా ఈ అచంచల విశ్వాసమే, సంపూర్ణ విశ్వాసమే లోపలి ద్వారాన్ని తెరుస్తుంది. కొంతమంది సదా ఇలాంటి నిండు నమ్మకంతోనే వాళ్లు కావాలి అనుకొన్నవాటిని పొందుతారు.

ఇంకొంతమంది ఆ 'శక్తి' అవతరించి నప్పుడు అక్కడ ఉండకుండా గైరు హాజరు అవుతారు. వాళ్లు పూర్తిగా మూసుకొని ఉన్నారన్న మాట. కాని, చిన్నపిల్లల్లాంటి అమాయకమైన నిండు నమ్మకం ఉన్న వాళ్ళు మాత్రం ఆ శక్తి అవతరించిన వేళకి సరిగ్గా అక్కడుండి దాన్ని దక్కించుకుంటారు!

ఇదంతా వింతగా అనిపిస్తోంది కదూ? బయటికి పెద్ద తేడా ఏమీ కనబడటం లేదు కదూ? ఇలాంటి రెండు రకాల జనా లకీ నమ్మకం, కోరిక, మంచి చేయాలి అనే తలంపు ఉండొచ్చు. కాని ఎవరికి లోలోపల ఈ సంపూర్ణమైన విరబూసే విశ్వాసం ఉందో వాళ్లు ఏమీ వితర్కించరు. వాళ్లకి అది ఉందా? లేదా? అని తమను తాము ప్రశ్నించుకోరు. దేవుడు అనుగ్రహిస్తాడా? లేదా? అని పట్టించుకోరు. వాళ్ళకి అసలు అలాంటి ప్రశ్నే రాదు అని మనం అంతా అనుకోవాల్సిందే. "నాకు కావల్సింది నాకు

వస్తుంది. నా ప్రార్థనకు జవాబు వస్తుంది. నేను కష్టాల్లో ఉండి సాయం కోరితే తప్పక సాయపడడమే కాక అన్నీ అదే చూసుకుంటుంది" అని సంపూర్ణంగా నమ్ముతారు. సరిగ్గా ఇలాంటి తనంత తానే పుట్టిన, అమాయకమైన, అచంచలమైన నమ్మకమే ఉంటే, ఆ నమ్మకమే మిగతావాటి అన్నింటి కంటె చాలా బాగా పని చేస్తుంది. దాని ఫలితాలు కూడా చాలా అమోఘంగా ఉంటాయి.

మనసులో ఇలాంటి సందేహాలు, వితర్కాలు ఉంచుకునే వారు అన్నీ చెడగొట్టుకుంటున్నారు. ఇలాంటి సందేహాలు, వితర్కాలు కష్టాల్లో ఉన్నప్పుడు మరీ మరీ వస్తాయి.

"అయ్యో! ఇది చాలా కష్టం. నేను అసలు ఏమీ చేయలేను. నా ఈ పరిస్థితి ఇలాగే పెరిగి పెరిగి పెద్దదై, ఘోరంగా ఇంకా ఘోరంగా అయిపోతే – ఇంకా కిందకు దిగజారిపోతే – బాబోయ్! ఇలాంటి పరిస్థితి నాకొద్దు" లాంటి ఆలోచనలు మరీ మరీ వస్తాయి. అట్టివారు ఏ శక్తిని పొందకుండా ఆ శక్తికీ తమకూ మధ్య అడ్డంగా ఓ గోడ కట్టుకు కూర్చోవడం వల్ల అన్న మాట. అంతరంగికంలోని చైత్యపురుమనికి (psychic being) చాలా అద్భుతమైన, ఏ అపనమ్మకం లేని, అవునా? కాదా? లాంటి ఏ వివాదమూ లేని సంపూర్ణ విశ్వాస ముంటుంది. అందుకని నిజంగా ఏ ప్రార్థనా నిరర్థకం కాదు. ఏ ఆకాంక్ష వృథా అయిపోదు.

అనువాదం: ఎం.సి. కనకయ్యా

(*CWM* Vol. 6, pp. 403-04)

ప్రతి క్షణము నీ ఎదుట ఎంతో అద్భుతమైన, విచిత్రమైన విషయాలు ఆవిష్కారమౌతూ వుంటాయి. నీకు విశ్వాసమున్న యెడల, నీ జీవితం కూడ అటులనే ఆవిష్కారమగును.

శ్రీమాత

విభాగము II:

ఉపకరణములను పటిష్ఠము గావించుట

శ్రీమాత

రెండు విషయములను మనం పరిశీలించాల్సి ఉంది – చైతన్యము, ఆ చైతన్యాన్ని ఆవిష్కరింపచేసే సాధనాలు. సాధనాలనగా ఆలోచనలను కలిగించే మనోమయజీవుడు, భావోద్రేకాలను రేకెత్తించే ఆవేశజీవి, క్రియాశక్తిని కలిగింపజేసే ప్రాణమయజీవుడు, కర్మను చేపట్టే అన్నమయజీవుడు.

ఒక మంచి కళాకారుడు ఎటువంటి సాధనాలతోనైనా తన ప్రతిభతో అందమైన వస్తువును చెయ్యగలుగుతాడు. అలా కాకుండా అతని కొక మంచిసాధనాన్ని ఇవ్వండి. దాన్నతడు మరింత అద్భుతంగా మలుస్తాడు. ఒక సంగీతకారుణ్ణి తీసుకుందాం. ఓ పాత పియానోతో, పలకని స్వరాలతో కూడా అతనొక సౌందర్యాన్ని ఆవిష్కరిస్తాడు. అదే అతనికొక మంచి స్వరబద్ధమైన పియానోను ఇవ్వండి. గంధర్వ గానాన్నే ఆవిష్కరిస్తాడు. రెంటిలోనూ ఉన్న చైతన్యం ఒక్కటే. కాని ఆవిష్కరణకు ఒక మంచి సాధనం అవసరం. అలాగే మానసిక, ప్రాణమయ, మనోమయ, భౌతిక సామర్థ్యం కల్గిన శరీరమూను.

*

చివరగా, ఏ క్రమశిక్షణైనా కఠోరంగా, చిత్తశుద్ధితో, స్వచ్ఛందంగా పాటిస్తే ఎంతో ప్రయోజనకరం. అది ఈ భూమిపై మన జీవన గమ్యాన్ని మరింత త్వరగా చేరడాని కుపకరిస్తుంది. నూతన జీవితాన్ని అందుకోవడానికి సన్నద్ధం చేస్తుంది. మనం క్రమశిక్షణకు కట్టుబడితే, నూతన జీవనాగమనాన్ని, అతిమానసిక సంపర్కాన్ని వేగిరపరచినట్టే.

అనువాదం: మాడభూషణం రాజగోపాలాచార్య

(*CWM* Vol. 4, p. 40; Vol. 10, p. 31)

విశాలమైన, మార్దవమైన, గంభీరమైన మనస్సు

శ్రీమాత

I

దురదృష్టవశాత్తు, ఎంత ఎక్కువ ఆలోచిస్తే, అంత గొప్పవాళ్ల మని చాలామంది భావిస్తారు. మనస్సు తనే గొప్ప అనుకుం టుంది. పురోగతిని ఎక్కువ కాంక్షించదు. తనకంతా తెలుసునను కుంటుంది. చాలామంది తమ ఆలోచనా విధానమే అత్యుత్తమ మైనదని భావిస్తారే కాని. అనేక విధాలుగా ఆలోచించవచ్చుని గుర్తించరు. వాళ్ల ఆలోచన ఎంత బలంగా, ఖచ్చితంగా ఉంటే, అంత గొప్పదని వాళ్లు విశ్వసిస్తారు. కాని అది తప్పు, శుద్ధ తప్పు. అందుకే మీ ఆలోచనలను విస్తరింప జేసేందుకు, ఎన్నో దృక్పథాలతో చూడటం నేర్చుకొనేందుకు నేను కొన్ని అభ్యా సాలు ('జీవనశాస్త్రం' అనే వ్యాసంలో) తెలిపాను.

II

సమున్నతమైన చైతన్యాన్ని చేరుకునే ముందు అన్నింటా తగి నంత నిష్పక్షపాత దృష్టి కల్గిన ఒక స్పష్టమైన, ఖచ్చితమైన, సహేతుకమైన తార్కిక శక్తిని తనలో తాను పెంపొందించుకొనే స్థితి వస్తుంది. ఆ స్థితిలో అన్ని క్షణిక స్పందనలూ, భావాలూ, కోర్కెలూ, అన్ని అవాంతరాలు ఈ తార్కికస్థితి సమక్షంలో ఉంచగల్గుతావు. అప్పుడు నువ్వు హేతుబద్ధమౌతావు. చాలామంది ఏదైనా కొంచెం ఇబ్బంది కలిగితే, పూర్తిగా నిర్హేతుకం ఔతారు. ఉదాహరణకి, జబ్బుపడినప్పుడు, "నేనెంత రోగగ్రస్తుడనయ్యాను! ఇదెంత ఘోరం? ఇదెప్పుడూ ఇలాగే ఉంటుందేమో!!" అంటూ కాలక్షేపం చేస్తారు. అప్పుడా రోగం ముదరక ఏమవుతుంది? అట్లాగే ఏదైనా ఆపద కల్గినపుడు, "ఇవన్నీ నాకే కల్గుతున్నాయే మిటి? ఇంతకు ముందు అంతా బాగుందనుకునే వాణ్ణే" అంటూ కన్నీరు మున్నీరుగా విలపిస్తాడు. నిజానికి ఏ విషయాన్నైనా

ప్రశాంతంగా, నింపాదిగా, హేతుబద్ధంగా, పరిశీలించగలిగే తార్కిక శక్తి మనిషిలోనే ఉంది. ఇక అతిమానవుడి (superman) సంగతి చెప్పాల్సిన పనే లేదు. ఈ తార్కికతే "చింతించకు. అందువల్ల లాభం లేదు. సంశయించకు. నీ వద్దకు వచ్చినదాన్ని స్వీకరించు" అని నీకు హితవు చెపుతుంది. తక్షణమే నీలో శాంతి నెలకొంటుంది. ఇది మంచి మానసిక శిక్షణ. విచక్షణను, దృష్టిని, నిరపేక్షతను పెంపొందిస్తుంది. నీ వ్యక్తిత్వంపై ఆరోగ్యకర ప్రభావాన్ని చూపుతుంది. నీరు కారిపోయే అపహాస్యస్థితికి లోను కాకుండా నిన్ను కాపాడుతుంది. తర్కశీలివలె నిన్ను ప్రవర్తింపజేస్తుంది.

III

మనసుకు అతికష్ట సాధ్యమైన విషయమొకటి ఉంది. కాని నా దృష్టిలో అది అత్యంత ముఖ్యమైనది. మనుమలనూ, వ్యవహారాలను నీ మనసుతో అంచనా వెయ్యకూడదు. "ఇది మంచి – అది చెడు. ఇది తప్పు – అది ఒప్పు. ఇందులో ఈ లోపం ఉంది. అందులో ఆ చెడు ఉంది" అంటూ పేర్కొనడం న్యాయం కాదు.

మేధోజీవులు వారెంత మేధావులైతే అంత తమకేమీ తెలియదని, మనస్సుతో ఏమీ తెలుసుకోలేమని నిశ్చయించుకొంటారు. మనం ఒక రకంగా ఆలోచించవచ్చు, ఒక ప్రత్యేక విధంగా పరిశీలించవచ్చు – మదింపు చేయవచ్చు. కాని ఏ విషయాన్నీ ఇదమిద్ధంగ నిశ్చయించలేము. ఆ నిశ్చయస్థితి భవిష్యత్తులోనూ రాదు. "ఇది బహుశా అట్లా ఉండొచ్చు" అనో లేదా "ఇది బహుశా ఇట్లా ఉండొచ్చు" అనో ఈ విధంగా అనిశ్చయంగా మాత్రమే చెప్పగలుగుతాం. ఎందుకంటే మనస్సు జ్ఞానసాధనం కాదు కనుక.

ఆలోచనలపైన శుద్ధభావలోకాలు (pure ideas) ఉంటాయి. ఈ భావాలను వ్యక్తీకరించడానికి ఆలోచనలు ఉపకరిస్తాయి. ఈ భావాల పైన జ్ఞానం (knowledge) విరాజిల్లుతుంది. ఇవన్నీ ఆలోచన పరిధి పైన ఉండేవే. కాబట్టి ఆలోచన నుండి శుద్ధభావానికి ఎలా ఎదగాలో తెల్సుకోవాలి. ఆ భావం జ్ఞానానికి ప్రతిరూపమే. సంపూర్ణ సారూప్యం ద్వారానే అట్టి జ్ఞానాన్ని పొందవచ్చు.

మనం మన బుడత మానవ మనో భౌతిక చైతన్య పరిమితిలో ఉన్నంతకాలం మనం తప్పుదోవ పట్టినట్లే. ఎందుకంటే ఇది అన్నిటినీ గమనిస్తూ, దురాధిపత్యంలో అన్నిటినీ కించపరుస్తూ, "అది మంచిది కాదు, అట్లా ఉండకూడదు" అంటూ శాసిస్తూం టుంది. మౌనంగా ఉంటూ, అన్నింటినీ మంచిగా దర్శిస్తూ, తనలో తానే క్రమంగా విషయసేకరణ చేస్తూ, ఏ తీర్పు నివ్వకుండా వాటిని భద్రపరుస్తూ ఉండటమే అత్యుత్తమం. ఆ విధంగా అన్ని టినీ నీలో ప్రోది చేసుకొని, నెమ్మదిగా, నిరాందోళనగా నీ చైతన్య పర్వత శిఖరాలకు సమర్పిస్తూ, జాగృత మౌనాన్ని పాటిస్తూ, ఎదురు చూడాలి. అప్పుడు బహుశా నెమ్మదిగా సుదూర తీరాల నుండి మహోన్నత శిఖరాల నుండి వస్తున్నదా అనిపించే కాంతి పుంజ మొకటి వచ్చి నిన్ను ఆవహిస్తుంది. అప్పుడు సత్యం గురించి నీకు కాస్త అవగాహనమైనట్టే!

మానసికాభివృద్ధికి పంచశీల

1. ఏకాగ్రతాశక్తిని, శ్రద్ధను పెంపొందించుకొనుట.
2. వివేచనం, విస్తరణ, సంక్లిష్టత, సంపన్నతల సామర్థ్యాన్ని పెంపొందించుకొనుట.
3. జీవన మార్గదర్శనం చేసే ఒక మౌలికభావం, ఉన్నతాదర్శం, సమున్నత సముజ్వల భావం చుట్టూ మన భావాలను వ్యవస్థీ కరించుకొనుట.
4. ఎప్పుడంటే అప్పుడు, ఏది కావాలనుకుంటే అది మాత్రమే ఆలోచించగలిగే సామర్థ్యం కోసం, అవాంఛిత ఆలోచనల తృణీ కరణ, ఆలోచనా సంయమనం పెంపొందించుకొనుట.
5. మానసిక మౌనాన్ని, సంపూర్ణ ప్రశాంతతను, ఆత్మ ఉన్నత పథాల నుండి వచ్చే ప్రేరణలను మరింత సంపూర్ణంగా అందు కొనే శక్తినీ పెంపొందించుకొనుట.

అనువాదం: మాడభూషణం రాజగోపాలాచార్య

(*CWM* Vol. 12, pp. 24-25)

ప్రాణిక సహకారము

(Collaboration of the Vital)

శ్రీమాత

"ప్రాణిక సహకారముతో ఎలాంటి సిద్ధిని సాధించటమైనా అసాధ్యం కాదు, ఎలాంటి రూపాంతరీకరణ కూడ సాధ్యపడ కుండా పోదు." *(The Science of Living)*

ఇది ఎంత అద్భుతమైన విషయమో చెప్పలేము. ప్రాణికానికి తన శక్తిని గురించి బాగా తెలుసునని నా నమ్మకం: అందుకే అది అంత ముఖ్యమైనది. ***ఎలాంటి కష్టాన్నైనా, అవలీలగా ఎదుర్కో గల శక్తి దానికి ఉంది.*** అది గనుక తోడ్పడితే అంతా అద్భుతమే కాని, ఆ సాయం దాని నుండి నిరంతరంగా లభించటం అంత సులభం కాదు. అది ఒక మంచి సేవకుడి లాంటిది, చాలా బాగా పని చేస్తుంది, కాని అలా పని చేయడంలో ఎప్పుడూ తన తృప్తినే కోరుకుంటుంది. ఆ పని నుండి ఏదో రాబట్టుకోవాలని, ఎన్ని సుఖసంతోషాలను దాని నుండి పొందవచ్చో, ఎన్ని ప్రయోజ నాలు కలిగే వీలుంటుందో, వాటన్నింటిని పొందాలని కోరుకుం టుంది. ఆ సంతృప్తి గనుక లభించక పోయినట్లయితే (ఎన్నో కారణా లుండవచ్చు) అది ఏడుస్తుంది. ఏమాత్రం కూడ ఆనంద పడదు. "అది న్యాయం కాదు, నేను పని చేశాను కాని నాకేమీ ఫలితం ముట్టలేదు" అని వాపోతుంది. చేష్టలుడిగి, మూగబోయి, అప్పుడప్పుడు "నేను బ్రతకను" అని కూడ అంటూ ఉంటుంది. అప్పుడు నువ్వు క్రమేణా శరీర జవసత్వాలను కోల్పోయి, అల సట చెంది, అటుపై ఏమీ చేయలేని స్థితికి దిగజారతావు. ఉన్న ట్లుండి, ఈ పరిస్థితి మరింత విషమిస్తుంది. కారణం, బుద్ధికి ప్రాణి కంతో చాల సాన్నిహిత్యం ఉంటుందని నీకు తెలియజేయాలి – తార్కిక బుద్ధితో కాదు, భౌతిక బుద్ధికే ప్రాణికంతో అత్యంత సన్నిహిత సంబంధం ఉంటుంది: అందుకని, ప్రాణికం యిలా అనడం ప్రారంభించగానే, "నాకు దానితో ఎలాంటి ప్రమేయం

లేదు, నన్ను చాలా కష్టపెట్టారు. నాకు దానితో ఏమాత్రం సంబంధం లేదు" అంటూ బుద్ధి సహజంగానే దానికి వత్తాసు పలుకుతుంది; అలాంటి ఆలోచనలను సమర్థిస్తుంది; దానికి సరి పడే కారణాలను వివరిస్తుంది. మళ్లీ అదే పాత కథ. "ఈ జీవితా నికి ఏమాత్రం విలువ లేదు, మనుషులు ఎంత చెడ్డవాళ్లు. పరి స్థితులన్నీ నాకు ప్రతికూలమే, అంతా వదలివేయడం మంచిది" ఇలా అనుకుంటూ పోతావు. ఇలా చాలా మార్లు జరుగుతుంది. కాని కొన్ని సమయాల్లో, ఎక్కడో రవ్వంత వివేకం కలిగి ఈ నాటకం ఇక చాలు," అని చెప్తుంది.

కాని ఈ స్థితి ఇలాగే కొనసాగినట్లైతే నువ్వు నిరాశ నిస్పృహాలలోకి జారిపోతావు. "నిజంగా ఈ జీవితం నాలాంటి వారికి పనికిరాదు. ఇంకెక్కడైనా సంతోషంగా ఉండవచ్చు. స్వర్గంలో నైతే అందరూ బాగుంటారు. ఎవరి కిష్టమైంది వారు చేయవచ్చు" మొదలైన స్వర్గలోకాలను గురించిన తలపులు కలు గుతాయి. అసలు ఈ ఇద్దరూ తోడుదొంగలే – బుద్ధి, ప్రాణికము – స్వర్గాన్ని కనిపెట్టినవి ఇవేనని నేననుకుంటాను! కారణం, ఎప్పుడైతే ఈ జీవితం, ఈ మనుగడ, మన ఇష్టానుసారంగా గడ వడం లేదో, దుఃఖించడం మొదలవుతుంది. "అబ్బా, ఇక చాలు. ఈ ప్రపంచం ఇంత దౌర్భాగ్యమైనదా, ఇంత మోసపూరితమా, నాకు చావాలనిపిస్తోంది" అని అనుకుంటావు. అప్పుడు లిప్త పాటులో ఈ పరిస్థితి మరింత విషమిస్తుంది; నిరుత్సాహం తిరు గుబాటుగాను, విచారం అసంతృప్తిగాను మారుతాయి. కొంత మంది ఉంటారు – కదిలిస్తే కందిరీగ లాంటి దుష్టస్వాభావం గల వారుంటారు (ఇది వారి తప్పు కాదు!). మంచి స్వభావంగల వారు కూడ ఉంటారు (ఇది కూడ వారి తప్పు కాదు!) కాని ఇదీ వరస. సరే, ఎవరైతే దుష్టస్వభావం కలిగి ఉంటారో, వారు తొందరగా కోపోద్రిక్తులవుతారు, తిరగబడతారు, అన్నింటిని విరిచిపడేయా లనుకుంటారు: "చూడండి, నేను కావాలనుకున్నది వారు చేయడం లేదు, వారు శిక్షింపబడాలి!" అని అనుకుంటారు. అటు తరువాత, అది ఇంకొంత తీవ్రతరం అవుతుంది. ఎందుకంటే

నీ మనస్సు కూడ దాంతో చేతులు కలిపి ప్రతీకార వాంఛలను రేకెత్తించడం మొదలిడుతుంది. నిరుత్సాహంవల్ల తెలివితక్కువ పని నేదో చేస్తావు. దుర్మార్గంవల్ల ఇంకేదో చేస్తావు. నిరుత్సాహంవల్ల చేసిన మూఢకార్యాలు వ్యక్తిగతంగా నీ వరకే పరిమితమైతే, దుర్మార్గం కారణంగా చేసిన మూఢ కార్యాలు, ఇతరులను బాధించేవిగా ఉంటాయి. కొన్ని సమయాల్లో ఈ రెండవ కోవకు చెందిన మూఢకార్యాలు అత్యంత తీవ్రమైనవిగా ఉంటాయి. అలాంటి ఆవేశాలు నిన్ను ఆవహించినప్పుడు, ఏ కొద్ది మంచి తనం నీలో ఉన్నా, చలించకుండా నిలవాలనే నిబంధనను విధించుకుని, ఈ విధంగా నిన్ను నీవు సమాధానపరచుకోవాలి. "నేను చలించను, ఈ తుఫాను వీగిపోయేంతవరకు ఆగుతాను." ఎందుకంటే, నెలల తరబడి చేసిన మంచి సాధన అంతా కొన్ని క్షణాల్లోనే ధ్వంసం కావడమో, లేక నాశనమైపోవడమో జరగవచ్చు.

కాని, ఇక్కడ నీకొక ఓదార్పును అందిస్తాను.

"ఎవరైతే వారిలోని ఆకాంక్షాజ్యోతిని మరియు సాధించవలసిన ఆదర్శపు చైతన్యాన్ని సజీవంగా ఉంచేందుకై చైత్యపురుష సత్తాతో సంపర్కం ఏర్పరచుకున్నారో, వారికి ఈ గండాలు దబ్బునే తీరిపోతాయి. ఈ చైతన్యం యొక్క సహాయంతో, వారి ప్రాణికంతో, ఒక అల్లరి పిల్లవాడితో వ్యవహరించు మాదిరిగ ఓర్పుతో, పట్టుదలతో వ్యవహరించి, దానికి సత్యాన్ని, వెలుగును చూపించి, నమ్మకాన్ని కలిగించుటకు ప్రయత్నించి, దానిలో తెరమరుగైన సౌహార్ధాన్ని మేల్కొలపాలి."

(జీవనశాస్త్రము)

ఎవరైతే నిజమైన చిత్తశుద్ధి, మంచితనము కలిగి ఉన్నారో, వారి విషయంలో ఇలాంటి సందర్భాలను అభివృద్ధికి మార్గాలుగా మార్చవచ్చు. ఈ తుఫాను లాంటి ప్రతి సందర్భాన్ని, ఒక నూతన పురోభివృద్ధిగాను, ఆ బాటలో గమ్యాన్ని చేరుటకై వేసే మరొక్క అడుగుగాను మార్చవచ్చు. అంతర్గతంగా, నీ ఆవేశం మూలకారణంలోకి – నీవు చేసిన తప్పు, నీవు గావించిన తప్పుడు ఆలోచన, నీవు అనుభవించిన తప్పు – ఆ బలహీనత, ఆ దౌర్జన్యం,

ఆ అహంకారం (ఎందుకంటే ప్రాణికం బుద్ధికన్నా కూడ ఎంతో ఎక్కువ అహంకారం కలిగి ఉంటుందని చెప్పటం మరచాను.) వీటన్నింటి ముఖంలోకి, ధైర్యంగా చూడగలిగి, న్యాయంగా, మనః పూర్వకంగా, జరిగినదంతా కూడ నీ తప్పిదం వల్లనేనని నీవు గ్రహించ గలిగితే, అప్పుడు ఎర్రగా కాల్చిన ఇనుపచువ్వతో అసలు రుగ్మతకు లోనైన చోటుపై సరిగ్గా వాత పెట్టినట్లుగా ఉంటుంది. బలహీనతను పవిత్రపరచి, దానిని క్రొత్త చైతన్యంగా మార్చ వచ్చు. ఈ తుఫాను పిమ్మట, నీవు ఇంకొద్దిగ ఎదిగినట్లు, నిజంగా అభివృద్ధిని సాధించినట్లు, నీకు అగుపిస్తుంది.

అనువాదం: అందుగులపాటి కైలాసవతి, జానకి

(*CWM* Vol. 4, pp. 50-52)

మనిషి తత్త్వములో పరివర్తన

శ్రీమాత

జీవితం వెలుగునీడల సయ్యాట. ప్రతి వ్యక్తిలోను పరస్పర విరుద్ధ భావాలు వుంటాయి. కొందరిలో యీ తేడా కొట్టొచ్చినట్టుంటుంది. మరి కొందరిలో సరి సమానంగా చోటు చేసుకుంటుంది. ఒక దయాళువు కూడ ఒక్కొక్కసారి పరమలోభిగా ప్రవర్తించడం కద్దు. అలాగే అత్యంత ధైర్యశాలి అనుకోకుండా శుద్ధ పిరికివాడుగా ప్రవర్తిస్తాడు. ఓ యోగ్యుడు దుర్మార్గుడైపోతాడు. జీవితం తనకి ప్రసాదించిన గుణగుణాలని నిలబెట్టుకుండేందుకు వ్యతిరేక శక్తు లతో పోరాటం నిరంతరం సాగిస్తూనే వుండాలి.

జీవితాంతం నేర్చుకుంటూ వుండాల్సిందే. ప్రయత్నపూర్వ కంగా, చైతన్యవంతంగా సాగించే సామర్థ్య శిక్షగా వ్యాయామ మిది. ఇందులో గెలుపు, ఓటమి లేక వెలుగునీడలు వుంటాయి. పరిస్థితులు, పరిసరాలు వ్యక్తిత్వాన్ని బలవంతపెడతాయి. అను కూల పరిస్థితుల ప్రోత్సాహం వున్నట్టే ప్రతికూల పరిస్థితులు

వెనక్కి లాగుతూ వుంటాయి. ఈ సంఘర్షణలో మనిషి పరిణతి చెంది తనదైన ఒక వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటాడు. స్వాభావిక అవలక్షణాలను తప్పించుకోలేని భౌతిక, ప్రాణిక జీవలక్షణాల కనుగుణంగా వ్యక్తిత్వం దృఢతరమౌతూ వుంటుంది. ఇచ్ఛాపూర్వకంగా, వివేకవంతమైన, సంశయానికి తావులేని క్రమశిక్షణ వల్ల స్వాభావిక అవలక్షణాలను అధిగమించాలి. చైతన్యవంతంగా యిచ్ఛాశక్తిని పెంచుకొనే వరకు సరియైన క్రమశిక్షణ పొందాలి. దీని నలవరచుకోవడం వలన వ్యక్తిత్వ రూపాంతరీకరణ సాధ్యపడుతుంది.

ఎప్పుడైతే ఒకసారి దృఢ నిర్ణయం తీసుకొంటావో యిక ఆ మార్గంలో తీవ్రంగా, స్థిరంగా పట్టువదలని విక్రమార్కుడిలా ముందుకు పోవడమే తప్ప చివరివరకు ఓటమి అన్నదే వుండదు. బలహీనమైన, వెనక్కి లాగే స్వభావం నుంచి బయటపడాలంటే ఒక ముఖ్యమైన విషయం తెలుసుకోవాలి. *నిరంతర వ్యాయామంవల్ల శరీరదారుఢ్యం యెలా పెరుగుతుందో అలాగే నిరంతర సాధనవల్ల యిచ్ఛాశక్తి, ఆత్మవిశ్వాసం అంతకంతకి దృఢతరమౌతాయి.* ఎంతటి స్వల్ప విషయంలోనైనా అది స్వల్ప విషయమే కదా అని నిర్లక్ష్యం చేయకూడదు. నీ పూర్తి శక్తిసామర్థ్యాలని వినియోగించి సాధించడానికి ఎప్పుడూ సంశయించవద్దు. ఆ మార్గంలోనే నీ శక్తిసామర్థ్యాలు క్రమవికాసం చెంది అత్యంత కష్టసాధ్యమయిన లక్ష్యాలు సాధించే శక్తి సంతరించబడుతుంది. నిరంతర సాధన చేతనే నీ లక్ష్యం సుసాధ్యమవుతుంది.

చివరిగా ఒక మాట. వ్యక్తి తన స్వభావాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్నప్పుడే దాని మీద ఆధిపత్యం సాధించగలడు. సరియైన, సుదృఢమైన ఆధిపత్యం, తన స్వభావం ఏ యే విషయాల్లో రూపాంతరీకరణ చెందాలో ఆయా విషయాల్లో రూపాంతరీకరణ సాధించి తీరుతుంది.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు, నడిమింటి విజయలక్ష్మి

(*CWM* Vol. 12, pp. 19-23)

భయం

శ్రీమాత

మనుషులకు ఏదైనా కొత్తదాన్ని చూస్తే భయం. ఈ భయం మనిషి రక్తంలోనే ఉన్నది. కాని యోగికి భయం పనికిరాదు. ఎందుకంటె అది అభివృద్ధి నిరోధకము. యోగదృష్టిలో భయానికి కారణం అజ్ఞానము. నువ్వు దేన్ని చూసీ అసహ్యించుకో కూడదు. ఏవగింపు పనికి రాదు. ఎవరు వచ్చినా సరే. దేన్ని చూసినా సరే. ఏం జరిగినా సరే ప్రశాంతచిత్తుడవై ఉండాలి. అప్పుడు క్రూరమృగాలు కూడా నిన్నేమీ చేయలేవు. భయమనేది అజ్ఞానానికి చిహ్నము. నీ చేతనని లోతుగా విశాలంగా చేసినప్పుడు నీకే భయమూ ఉండదు. అప్పుడు నీ చేతనాదీప్తిని వస్తువుల మీదికి సారించినప్పుడు వాటి యథార్థస్వరూపము నీకు అవగతమౌతుంది. — *సంపాదకుడు*

> *అజ్ఞానమే భయానికి మూలం*

భయం అనేది అచేతనలోనుండి ఆవిర్భవించిన ఒక వైపరీత్యం. అజ్ఞానం నుండి పెల్లుబికే ఒక వ్యధ. మనుమలకు పరిస్థితుల వెనుకనున్న నైజము తెలియదు కదా. ఏం జరుగుతుందో తెలియదు. వారి చర్యల పర్యవసానాలు తెలియవు. చాలా విషయాలు బోధపడవు. ఈ అజ్ఞానమే భయానికి మూల కారణం. ఒక వ్యక్తి తెలియని దానిని గూర్చి భయపడతాడు. ఒక పసిపిల్ల సంగతి చూద్దాం. ఒక తెలియని వ్యక్తిని ఆ పిల్ల వద్దకు తీసుకుని వస్తే అది ముందు భయపడుతుంది. (జాగృతమైన అంతశ్చేతనగల పిల్లల సంగతి నేను మాట్లాడటం లేదు. మామూలు శిశువు గూర్చి మాట్లాడుతున్నాను). కొంతమంది అరుదైన శిశువులు చాలా ధైర్యంగా ఉంటారు. ఎందుకంటే వారికి మరో చైతన్యం ఉంటుంది. రాబోయే ప్రమాదం విషయంలోని ఒకానొక భయాందోళన, సహజాతం కలగాపులగంగా ఉంటాయి. అందువలన ఏదో ప్రమాదం సంభవిస్తున్నదనే భావం కలిగిన

ప్పుడు ఆ ప్రమాదాన్ని ఎలా నివారించుకోవాలో మార్గం తెలియనప్పుడు, దానినుండి తనను తాను రక్షించుకొనే విధానం తెలియనప్పుడు, ఆ శిశువు భయపడుతుంది.

చేతనాభివృద్ధివలన భయనివారణ

మనకు అసలు విషయం తెలిస్తే, భయం అనేది ఉండనే ఉండదు. పరిపూర్ణంగా జాగృతమై, పూర్తిగా ఎరుకతో వుండి, తెలుసుకుంటే, భయం అనేది దరిదాపులలోకి రాదు. భయం వేసినప్పుడు, దాని మీద చైతన్యం, జ్ఞానం, శక్తి కాంతులను గనుక ప్రసరించగలిగినట్లయితే, దానిని పూర్తిగా నిర్మూలించవచ్చు.

ప్రశ్న: భయం కలిగినప్పుడు ఏం చేయాలి?

అది నీ స్వభావాన్నిబట్టి ఉంటుంది. భయాన్ని నివారించుకోడానికి అనేక మార్గాలున్నాయి.

నీకు చైత్యపురుషునితో కొంచెం సాన్నిహిత్యం ఉంటే, వెంటనే దానిని పిలిచి ఆ చైత్యదీప్తితో అంతా చక్కబరచుకోడమే అన్నిటిలోకీ ఉత్తమమైన మార్గం.

ఆ విధమైన చైత్యసంస్పర్శ లేనివారు కొంచెం వివేకవంతులైతే ఫర్వాలేదు. సహేతుకంగా పసిపిల్లలకు నచ్చచెప్పినట్లు వారికి వారే నచ్చచెప్పుకోవాలి. ఈ భయం చాలా చెడ్డదని, నిజంగా ప్రమాదం ఉన్నప్పటికీ దానిని భయంతో ఎదుర్కోవడం తెలివి తక్కువ అనీ నచ్చజెప్పుకోవాలి. ధైర్యం తెచ్చుకొని అపాయాన్ని ఎదుర్కొంటేనే దానిని తప్పించుకోవచ్చు. ఏమాత్రం భయపడినా నీ పనౌతుందిలే అని వివరంగా శరీరంలో భయానికి లోనైన భాగానికి నచ్చజెప్పి దాని భయం పోగొట్టాలి.

నీవు భక్తిప్రపత్తులు కలవాడవైతే చాలా సులువైన మార్గం ఒకటి ఉంది: "ప్రభూ, నీ సంకల్పం ప్రకారమే అంతా జరిపించు. నీవే నా మార్గదర్శకుడవు కాబట్టి, నా కేదీ భయం కలిగించ లేదు. నేను నీ వాడను. నా జీవితాన్ని నడిపించేది నీవే" అని చెప్పుకుంటే చాలు ఆ మంత్రం వెంటనే పనిచేస్తుంది. ఇది అన్నిటి లోకీ మేలైన పద్ధతి. నిజానికి, దైవానికి అంకితం చేసుకోడం

అన్నిటిలోకీ గొప్పది. ఈ సమర్పణభావం ఉంటే, భయం అంతా ఓ కల మాదిరి కరిగిపోతుంది. భయంతోపాటు దానిని నీపైకి పంపిన దుష్టశక్తి కూడా అదృశ్యమౌతుంది. అది వేగంగా పరుగెత్తి వెళ్ళడం నీవు చూసితీరాలి!

*

దేనికీ భయపడకూడదు. నీ కష్టాలు చాలావరకు భయం వల్లనే వస్తాయి. *తొంభైవంతులు రోగాలన్నీ అవచేతనలోని భయం వల్లనే వస్తాయి.* సాధారణ చైతన్యంలో ఉన్న శరీరానికి ఏ మాత్రం ఇబ్బంది కలిగినా ఏమౌతుందోననే ఆందోళన లోపల దాగి ఉంటుంది. అది ముందు ముందు ఏం జరుగుతుందో ఏమోనని భవిష్యత్తును గురించి ఆందోళన చెందవచ్చు. ఆ ఆందోళననే నిగ్రహించాలి. గాబరా పడటమంటే దైవానుగ్రహంపై విశ్వాసం తగినంత లేకపోవడమే. సమర్పణ సంపూర్ణంగా లేదనటానికిది నిదర్శనం.

దైవానుగ్రహంపై పరిపూర్ణ విశ్వాసం ఉంచుకోవాలనీ, మనలోనూ, మిగతావారిలోనూ కూడా భగవదనుగ్రహం ప్రసరిస్తూనే ఉంటుందనీ, అందరికీ అది మంచి చేస్తుందనే విశ్వాసాన్ని దేహానికి కలుగ చేయాలి. ఏ విధమైన సంకోచం, దాపరికం లేకుండా దైవానికి సర్వసమర్పణ చేసుకోవాలని నిర్ణయించుకునేటట్లు చేయాలి.

తనయొక్క యథార్థతత్వం భగవంతుడేననీ, ఆయన కార్యక్రమంలో అడ్డంకులు కల్పించకపోతే మనకేమీ హాని కలగదనే నమ్మకం దేహానికి కలుగ చేయాలి. మళ్లీ మళ్లీ భయపడకుండా ఉండేవరకూ ఇదే కొనసాగించాలి. అప్పుడిక వ్యాధి ఏదో విధంగా పైకి తేలినా దాని పట్టు సడలిపోయి రోగతీవ్రత కూడా తగ్గిపోయి చివరికి పూర్తిగా ఓడిపోతుంది.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వేంకటరామ శాస్త్రి
(అక్టోబరు 2001 'అఖిల' నుండి)

(*CWM* Vol. 6, p. 50; Vol. 5, pp. 118-19; Vol. 15, p. 151)

నిరుత్సాహము
(DEPRESSION)

శ్రీమాత

మానసిక నిస్పృహ రెండు కారణాలవలన సంభవిస్తుంది. ఒకటి ప్రాణికతృప్తి లోపించుట. రెండు శరీరంలో పెచ్చుమీరిన నరాల బలహీనత, శారీరక అలసటవలన నిస్పృహ సంభవిస్తే, దానిని సులభంగానే పోగొట్టుకోవచ్చు. విశ్రాంతి తీసుకుంటే పరిస్థితి చక్క బడుతుంది. పక్కమీద వాలి పరిస్థితి బాగుపడేవరకు నిద్రపోవడం మంచిది. ఒకవేళ నిద్ర రాకపోతే మంచం మీదనే పడుకొని శరీ రానికి అలసట తీరుస్తూ కలలు కన్నా ఫరవాలేదు. ప్రాణిక అసం తృప్తివలన కూడా మానసిక సంక్షోభం సంభవించ వచ్చని చెప్పు కున్నాం కదా! ఇక దాని విషయం. దానిని హేతువుతో బుజ్జ గించి నచ్చచెప్పాలి. నిస్పృహకు కారణమేమిటో కనుక్కొని దానిని బయటకు గెంటేయాలి. ముఖాముఖి నిలువరించి మనిషి దానికి తన అంతరంగిక ఆకాంక్షలకు సంబంధం ఉందా లేక అది కేవలం సాధారణ కోరికేనా అనేది నిగ్గు తేల్చుకోవాలి. సామాన్యంగా మనిషికి తాను మానసిక నిస్పృహకు లోనవుటకు, తన ఆంతరిక ఆకాంక్షలకు ఎలాంటి సంబంధము లేదని అర్థమౌ తుంది. అప్పుడతడు తన నిస్పృహను అధిగమించి సాధారణ కార్యక్రమాలను నిర్వర్తించుకొనగలడు. ఒకవేళ దీనివలన పరిస్థితి సరికాకపోతే మనిషి తన చైతన్యపు లోతులకు పోయి తనలోని ఆనందభోక్తయైన చైత్యపురుషుని (ఈశ్వరాంశము) స్పృశించాలి. ఎప్పుడైతే మనిషి నిస్పృహయొక్క చలనాన్ని ఆనందభోక్తయైన చైత్యపురుషునితో అనుసంధానం చేస్తాడో ఇక మానసికంగా నిస్పృహకు లోనవడం ఉండదు. అది గాలిలో మాయమైపోతుంది.

అనువాదం: డా॥ కోట వేంకటేశ్వరరావు

(సెప్టెంబరు 2002 'అఖిల' నుండి)

(*CWM* Vol. 6, pp. 32-33)

నిమ్న ప్రకృతికి చికిత్స

శ్రీమాత

మనిషి తన చర్యలపైన నియంత్రణ లేకపోవడంవల్ల చాలా నష్ట పోతాడు. ఇతరులతో వ్యవహరించేటప్పుడు కూడా నియంత్రణ లేకపోవడంవల్ల అనేక కష్టనష్టాలకు గురి అవుతుంటాడు.

తన బలహీనతలను అధిగమించి అభివృద్ధి చెందాల్నంటే ఒక క్రమశిక్షణను తనకు తాను విధించుకోవాలి. ఆ క్రమశిక్షణను క్రమం తప్పకుండా అనుసరించాలి. ఉదాహరణకు: ఎవ్వరైన ఏదైనా అన్నప్పుడు, లేదా ఏదైన అయిష్టమైన పనిచేసినప్పుడు వాదనకు అసలు దిగనే దిగరాదు. జవాబు ఇవ్వరాదు. ఎవ్వరైన నీ మాటను ఆమోదించని పక్షంలో అసలు చర్చించనే కూడదు. తను అనుకున్న విధంగా వ్యక్తులు కాని, పరిస్థితులు కానీ అనుకూలించకపోయినా కూడ, కోపతాపాలకు తావివ్వరాదు. (...never to argue, never to reply when someone says or does something disagreeable, never to discuss when one does not agree. It is well understood that one should never get into a temper when things or people are not the way one would like them to be.)

తనకు తాను నియంత్రించుకునే అలవాటు లేకపోతే, ఎంత కష్టమయినా సరే ఆ అలవాటు చేసుకు తీరాలి. తను పురోగతి సాధించాలంటే (ఆధ్యాత్మిక పథంలో) ఈ అలవాటు అనివార్యం. మార్గం ఎంతో దూరభారాలతో కూడినది. అందువల్లనే ఆ వ్యక్తికి సహనం అవసరం. తన పట్ల తనకు నిజాయితీ ఉండాలి. అది ఏ నాడూ విఫలం కాకూడదు.

ఇతరులతో శాంతియుత సహజీవనం సాగించాలంటే ఏ వ్యక్తికైన తనపై నియంత్రణ అనివార్యం. పరివర్తన (transformation) ఆకాంక్షించని వారు సైతం ఈ నియంత్రణను అలవర్చుకోవాలి.

*

నిమ్నప్రకృతి ప్రభావానికి ఎప్పుడూ లోనుకాకూడదు. వాటి సూచ నలను మాటలుగా, చర్యలుగా అసలే మార్చకూడదు. వాటి ఆజ్ఞ లను బాహ్యా, ఆంతరిక జీవనంలో శిరసావహించడానికి ఎప్పుడూ అనుమతించవద్దు. **(...you must never act under the impulse of these [lower] movements, never physically translate their suggestions into speech or action, never permit their orders to be carried out in any inner or outer gesture.)**

*

నీ పరివర్తనలో నీకు తీవ్రమైన సమస్య ఎదురైతే, ఉదాహరణకు నీవు సహనాన్ని కోల్పోవలసివస్తే – 'నాకు మళ్లీ కోపం రాకూ డదు' అని నువ్వు నిర్ణయించుకొంటావు. కాని అది చాల కష్టం. దానికి బదులుగా నువ్వు "ఈ కోపం ప్రపంచ మందెల్లడలా తాండవిస్తూనే వుంటుంది, నాకొక్కడికే గాదు, ప్రతి ఒక్కరికి కోపం వస్తుంది. అది ఎక్కడబడితే అక్కడే కనిపిస్తుంది. నా తలుపులు మూసేస్తే, అది నీలోకి ప్రవేశించలేదు" అని భావించి నట్లయితే, అది మరింత తేలిక. ఒకవేళ "అది నా జన్మలోనే ఉంది. నేను అలాగే పుట్టాను" అని మూర్ఖంగా అనుకున్నావో యిక కోపాన్ని నియంత్రించుకోడం అసంభవం. ఈ క్రోధానికి ప్రతిస్పందించేది ఏదో నీలో వుంది. అన్ని కదలికలు, స్పందనలు సర్వసాధారణంగా నీలోకి ప్రవేశిస్తాయి, మళ్లి నిష్క్రమిస్తాయి. అవి సంచారం చేస్తుంటాయి. కాని నీలోని ద్వారాలు తెరిచిన మేరకు అవి ఒక్కుమ్మడిగా నీపై దాడిచేసి లోనికి ప్రవేశిస్తాయి. ఈ శక్తు లతో నీకు కాస్త సామీప్య సంబంధం ఉన్నా నీకు తెలియకుం డానే నీకు కోపం వస్తుంది.

*

నువ్వు ఏదైనా ఒక వస్తువును కోరుకున్నావనుకో – ఇంక యింతే సంగతులు! ఆ వస్తువు నిన్ను మెస్మరైజ్ (mesmerize) చేసి ఏడిపిస్తుంది. నీ మనస్సును, నీ జీవితాన్ని తన వశం చేసు కుంటుంది. నీవు దానికి బానిసగా మారతావు.

*

నిమ్న ప్రకృతి చేష్టలను నియంత్రించడం ముఖ్యం. అది ఆత్మ సిద్ధికి తొలిసోపానం.

అనువాదం: కె. యజ్ఞన్న

(చంపక్‌లాల్ నుండి వచ్చిన ఒక కార్డు, CWM Vol. 14, p. 274; Vol. 4, p. 170; Vol. 6, p. 340; vol. 14, pp. 270, 272)

జీవన లక్ష్యం సుఖమేనా?

శ్రీమాత

పాశ్చాత్య దేశాలాలో బాగా ప్రాచుర్యం పొందిన భావాలు రెండున్నాయి. వాటిలో ఒకటి – జీవితానికి గల ప్రధాన లక్ష్యం సుఖం. రెండు – ఒక వ్యక్తి కొన్ని లక్షణాలతో పుడతాడు. వాటిని మార్చడం అసంభవం.

మొదటిది ఒక మహనీయ సత్యానికి వికృతరూపం. మొత్తం సృష్టి అంతా ఆనందంపై ఆధారపడి వుంది నిజమే. ఈ ఆనందమే గనుక లేకపోతే అసలు జీవితమే లేదు. కాని ఈ ఆనందం భగవంతుని గుణం. అది సాపేక్ష ప్రపంచానికి అతీతం. (It is unconditioned). జీవితంలో సుఖం కోసం జరిపే అన్వేషణగా దీనిని తలచరాదు. మామూలు జీవితంలోని సుఖం, పరిస్థితులపై ఆధారపడుతుంది. ఆనందంగా బ్రతికే తనకు వుంది అనే విశ్వాసం ఒక వ్యక్తి తన జీవితాన్ని తానే జీవించాలన్న సంకల్పానికి దారి తీస్తుంది. ఈ వైఖరిలో మితిమీరిన అహంభావం వుంది. అది అనేక సంఘర్షణలకు, బాధలకు, నిరాశకు, నిరుత్సాహానికి, చివరకు సర్వనాశనానికి దారితీస్తుంది.

ప్రస్తుత ప్రపంచంలో జీవితగమ్యం వ్యక్తిగత ఆనందం కాదు. సత్యచైతన్యం వైపు పురోగమించడం, అందుకు ఆత్మను మేలుకొల్పడం.

*

ఆనందం పొందడమే జీవితలక్ష్యమా? ఇది అసలు విషయాన్ని తలక్రిందులు చేయడమే. మానవ జీవనలక్ష్యం భగవంతుని కను గొనడం, భగవంతుని అభివ్యక్తం చేయడం. సహజంగా అది ఆనందానికి దారితీస్తుంది. ఈ ఆనందం భగవత్ సాక్షాత్కార సిద్ధికి పర్యవసానమే కాని లక్ష్యం కానే కాదు. పర్యవసానాన్ని జీవితలక్ష్యం అనుకొని పొరపాటు పడడమే మనవాళిని వేధించే చాలా వేదనలకు మూలకారణం.

అనువాదం: కె. యజ్ఞన్న

(*CWM* Vol. 12, pp. 18, 312)

అనంతశక్తి మన అందుబాటులోనే ఉన్నది

శ్రీమాత

మనది భౌతికప్రపంచం. దీంతో పాటు ఒక సూక్ష్మలోకం కూడా ఉన్నది. అక్కడ నిరంతరం శక్తి ప్రవహిస్తూనే ఉంటుంది. ఒక నది లోంచి కాలువ త్రవ్వుకుంటే నీళ్లు రావూ? అదే విధంగా నువ్వీ శక్తి వెల్లువలోంచి కావలసినంత శక్తిని పొందగలవు. ఇది కేవలం బలమే కాదు. రోగనివారణ, సృజనశీలత, ఏ ప్రయో జనమైనా దాంతో సాధించవచ్చు. అయితే తగిన శిక్షణ పొంది దానిని నేర్చుకోవాలి. మరి ఆలస్యమెందుకు?

—. సంపాదకుడు

అది విశ్వవ్యాప్తమైన ప్రాణికశక్తిని గ్రహించ గల సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. ఆహారం ద్వారా కూడా ఇటువంటి శక్తిని పొందవచ్చుగానీ అది అత్యల్పము – క్రిందినుండి వస్తుంది. కానీ మనకు కావలసినది అనంతమైన విశ్వశక్తులు. వాటిని ఎలా పొందాలో మనం నేర్చుకోవాలి; అంతేకాక సంపాదించిన వాటిని దుబారా చేయకుండా శరీరంలో ఒక రకమైన సమతుల స్థితిని నెలకొల్పుకోవాలి.

ఈ పుంజుకుంటున్న శక్తికీ, వెచ్చించవలసిన శక్తికీ మధ్య పొంతన ఉండాలి. అంతర్గతమైన సామరస్యమున్నప్పుడే అది సాధ్యమవుతుంది. కొంతమంది స్వతస్సిద్ధంగా సార్వత్రిక శక్తులను గ్రహించి వారిలో విలీనం చేసుకో గలుగుతారు. వారు దాన్ని వెచ్చిస్తూ మళ్ళీ పొందగలరు; పని చేయగలరు. మరి కొందరు నిద్రలోనో, కదలకుండా కూర్చొనో చక్కటి శక్తిని తీసుకోగలుగుతారు. కానీ వెంటనే వారి కార్యకలాపాల్లో దాన్ని ఖర్చు చేసేస్తారు. మళ్ళీ కావాలంటే శక్తిని కొత్తగా పుంజుకోవలసిందే. ఇదేమంత వాంఛనీయం కాదు.

కొందరికైతే అసలు శక్తిని గ్రహించటమే చేతకాదు. వారు శరీరకణాల్లోని శక్తి మీదనే ఆధారపడతారు. అది తగ్గిపోయినప్పుడు, దాన్ని భర్తీ చేసుకోవడం చేతకాక రుగ్మతకైనా లోనవుతారు లేక అలాగే క్షీణిస్తారు. ఇది ఎల్లకాలం కొనసాగదు. సగటు ఆయుర్దాయం పూర్తి కాగానే అంతవరకూ చేసినట్లు శ్రమపడలేరు. ఏ విధంగానూ పురోగతి పొందలేరు.

అలా కాకుండా విశ్వ ప్రాణికశక్తులను గ్రహించి కూడబెట్టుకోగలిగితే, ఆ శక్తి చాలా కాలం నిలిచి ఉంటుంది. తగిన జ్ఞానాన్ని పొంది, మెలకువలు తెలిసిన వారైతే అది వారి దగ్గర ఎంతోకాలం పనికి వస్తుంది. వారు ప్రవీణులైనారు అన్న మాటే.

విషయం ఇంకా బాగా తెలిసిన వారైతే ఎంత శక్తి ఖర్చు పెట్టుకున్నప్పటికీ రెండు మూడు నిమిషాల్లో దాన్ని భర్తీ చేసుకోగలరు.

శక్తి కోసం తమ పైనే ఆధారపడి జీవకణాల్లోని శక్తినంతా ఖర్చుచేసే వారు మాత్రం ఈ విధంగా భర్తీ చేసుకోలేరు. చైతన్యాన్ని ఎంత ఎక్కువ విస్తృతపరుచుకోటం నేర్చుకుంటే అంత సులభమవుతుంది. అది ఎలాగంటే సముద్రంపై ఓ పెద్ద అల ఎగిరిపడినప్పుడు ఆ నీరు ఏ విధంగా ఇసకలో పరచుకుంటుందో అలా చైతన్యం అంతటా జరగాలి. ఆ విధంగా మనలోని ప్రాణిక శక్తిని విశాలపరుచుకుంటే సార్వత్రిక శక్తులను తనలోకి తీసుకోగలము.

ఈ విధంగా చైతన్యాన్ని విస్తృతపరుచుకోగల సామర్థ్యం నీకు ఉంటే ఇంకా దాన్ని ఇలా వృద్ధిచేసుకోవచ్చు. ఏదైన విశాల ప్రదేశంలోకి వెళ్ళి భూమ్యాకాశాలు కలుస్తున్నట్లుగా ఉండే దిఙ్మండలం కేసి చూస్తుంటే, అంటే సముద్రం దగ్గర కానీ, విశాలమైన మైదాన ప్రదేశంలోకి గానీ కొండశిఖరానికి కానీ వెళ్ళి చూస్తున్నప్పుడు ఎంతో దూరంగా కనిపిస్తుంది కదా. అలా చూస్తూ ఉంటే దానితో ఏకమైపోయి అంత విస్తృతమైపోయిన భావం నీకు కలుగుతుంది. అలా విస్తృత భావం కలిగినకొద్దీ నీలో ప్రశాంతత వృద్ధి పొందుతుంది.

ఇంకా ఎన్నో మార్గాలున్నాయి కానీ ఇలా ప్రకృతితో సంసర్గం పెట్టుకోగలిగితే అదే చాలు. అది అప్రయత్నంగా సిద్ధిస్తుంది. నీ వేదైనా సుందరదృశ్యం చూసినప్పుడు కూడా నీకిలా జరగవచ్చు; ఒక ఆనందానుభూతి కలిగి లోన ఒక వికాసం చోటుచేసుకొని శక్తిని ఆహ్వానిస్తుంది; అదే విస్తృతమై నిలువెల్లా నిన్ను ఆక్రమిస్తుంది. ఈ విధంగా అనేక మార్గాలున్నాయి కానీ సాధారణంగా అందరూ వాటిని అనుసరించరు. ధ్యానం చేస్తూ ఉత్కృష్టమైన జీవితం కోసం ఆకాంక్షించినప్పుడు కూడా సహజంగానే పైనున్న శక్తులను అందుకుంటావు. అన్నిటికంటే ఇటువంటప్పుడే నీలో శక్తి బాగా భర్తీ అవుతుంది. ఈ విధంగా శక్తిని గ్రహించటానికి అనేక పద్ధతు లున్నాయి.

ప్రశ్న: అమ్మా! విశ్వవ్యాప్తమైన ప్రాణికశక్తులను గ్రహించడమెలా?

దానికి అనేక పద్ధతు లున్నాయి. ఆ శక్తులు మొదట ఉన్నాయనీ, వాటిని గ్రహించవచ్చుననీ తెలియాలి. తర్వాత వాటితో సంపర్కం పెట్టుకొనే ప్రయత్నం చేయాలి. నీ చుట్టూ తాండవిస్తున్నట్లూ, ఎల్లెడలా వర్తిస్తున్నట్లూ, అందరిలోనూ, అన్ని పరిస్థితుల్లోనూ ఉన్నట్లు అనుభూతిని పొందాలి. అది ఎలాగంటే నీవు పల్లెసీమల్లో తిరుగుతూన్నప్పుడు అక్కడి పరిసరాల్లో, చెట్టు చేమల్లో నర్తిస్తున్నట్లున్న ఒకానొక ఉత్సాహశక్తి, నీకు ఎంతో దగ్గరగా, ముచ్చట్లాడుతున్నట్లున్న ఆ భావావేశాన్ని గుర్తు చేసుకో. నీకా

శక్తి కావాలనుకున్నప్పుడల్లా ఆ అనుభూతిని నెమరువేసు కొని దాన్ని దగ్గర చేసుకోడానికి ప్రయత్నించు.

కొందరుంటారు. వీరు కొన్ని రకాల అంగవిన్యాసాల ద్వారా, కొన్ని పనుల ద్వారా ఆ శక్తులతో అనుబంధం పెట్టుకుంటారు. ఆ విధంగా నడుస్తూ నడుస్తూ కొన్ని కొన్ని అభినయాలు చేసే వారిని నాకు తెలుసు. ముఖ్యంగా చిన్నపిల్లలు అప్రయత్నంగా అలా చేసి శక్తిని పుంజుకుంటారు.

పల్లెసీమలకు వెళ్ళి అక్కడ చెట్ల కింద నడుస్తూ ప్రకృతిని ఆస్వాదిస్తూ, అనంతాకాశం కింద ప్రకృతి ఒడిలో పరవశిస్తూంటే, ఆ చిరుగాలి, సువాసనలను వెదజల్లే ఆ స్వచ్ఛమైన గాలిని పీలుస్తున్నప్పుడు ప్రతి వారికీ హృదయకవాటాలు బార్లగా తెరుచుకుంటాయి. అప్పుడా సార్వత్రిక శక్తులే నీకు నేస్తాలై నీకు దగ్గరై పోతాయి. ప్రాణశక్తులన్నీ ఇలాగే నీకు వశమౌతాయి.

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 7, pp. 71-73)

అయ్యో నాకెవరూ లేరే, నేనొంటరి మనిషి నయిపోయానే అని నువ్వెప్పుడూ అనుకోకూడదు. దైవము నిరంతరం నీకు సాయపడుతూనే వుంటాడు, దారి చూపిస్తూనే వుంటాడు. ఆయనెప్పటికీ నిన్ను వదలడు. నిన్ను ప్రేమించి, నీకు బలాన్నిచ్చి, నీ ప్రక్కనే నిలుచొని, నీకు సాయపడుతూ వుంటాడు. ఆయన్ని నమ్ము, అన్నీ ఆయనే చేసిపెడతాడు.

శ్రీమాత

అందమైన దృఢమైన సచేతనమైన శరీరము

శ్రీమాత

దృఢమైన శరీరము

నీకు దృఢమైన శరీరం, పటిష్ఠమైన నాడీ వ్యవస్థ చాలా అవసరము. స్థితప్రజ్ఞత్వమే నీ బాహ్యజీవితానికి ప్రాతిపదికగా ఉండాలి.

దైవానుగ్రహం వలన ఆ దివ్యశక్తి నీలోకి దిగివస్తే దాన్ని భరించటానికి నువ్వు చాలా దృఢంగాను, బలంగానూ ఉండాలి. లేని యెడల నీవా ప్రభావానికి తట్టుకోలేక అతలాకుతలమై పోతావు. భగవత్ సాక్షాత్కారం కలగలేదంటే దానిక్కారణం నీవా విధంగా సంసిద్ధుడివి కాలేదన్న మాట.

*

ప్రశ్న: బాహ్యజీవితంలో స్థిత ప్రజ్ఞత్వమంటే ఏమిటి?

మంచి ఆరోగ్యం, స్థిరత్వం కలిగిన దృఢమైన శరీరం ఉండడం. అంటే పిల్లగాలికి అల్లల్లాడే పసిపిల్లల్లే కాకుండా స్థిరచిత్తుడవై యుండాలి. చక్కగా భుజిస్తూ వేళ పట్టున నిద్రిస్తూ, ప్రశాంతంగా, నిశ్చలంగా, సమతాస్థితిలో ఉంటే నీ బాహ్యజీవితానికి పటిష్ఠమైన ఆలంబన మున్నట్లే. అలా ఉన్నప్పుడు అది అనేక శక్తులను అందుకొని జీర్ణించుకోగలదు.

మీలో దైవశక్తులంటే తెలిసి వాటిని గ్రహించిన వారెవ్వరైనా ఉంటే, అంటే దివ్యానందశక్తిని అందుకున్న వారున్నట్లైతే వారికి బాగా తెలుస్తుంది. మంచి ఆరోగ్యముంటే తప్ప వాటిని నిలుపుకోలేరని తెలుసుకుంటారు. అలా వచ్చినప్పుడు వాళ్ళు నవ్వుతూ, ఏడుస్తూ, కంగారుపడుతూ అందుకున్నదాన్ని దులిపేసుకోటానికి ప్రయత్నిస్తారు. దాన్ని భరించలేక ఉక్కిరిబిక్కిరైపోయి నవ్వుతూ, ఏడుస్తూ, అటూ ఇటూ పరిగెత్తి దాన్ని పారేసుకుంటారు.

అలా కాకుండా అందుకున్నదాన్ని చక్కగా జీర్ణించుకోవాలంటే చాలా ప్రశాంతంగా, సుస్థిరంగా ఉండాలి. మంచి దృఢమైన శరీరము, ఆరోగ్యము చాలా ముఖ్యం. అదే ఊతాన్నిస్తుంది.

మానసిక, ప్రాణిక వ్యవస్థలకంటే దైహిక వ్యవస్థను చక్కగా ఉంచుకోవడం సులభమే. అటువంటి దేహాన్ని బానిసగా ఉపయోగిస్తూ ఈ మానసిక, ప్రాణికములు రెండూ వాటి అవ్యవస్థల వల్ల దాన్ని (శరీరాన్ని) దుర్గతికి పాలుచేస్తాయి. అది (శరీరం) మొదట్లో కొంచెం ఎదురు తిరిగినా తర్వాత వాటికి తలొగ్గి అనారోగ్యం పాలౌతుంది. "ఇది ఒట్టి మొద్దు గాబట్టి మనకి అనుగుణంగా నడవటం లేదని" అవి సొద పెట్టడంవల్ల శరీరం వాటిని అనుసరించడం మొదలు పెడుతుంది. మనస్సు తెలిసీ తెలియక "ఇవి తినొద్దు, అవి తినొద్దు, అది మంచిది కాదు" అంటూ ఆజ్ఞాపించడం వల్ల దాన్నే అనుసరించి శరీరం పాడవుతుంది. ఇక ప్రాణికం జారీచేసే ఆజ్ఞలు సరే సరి. తన కఠిన శాసనాలతో మనస్సూ, మితిమీరిన చర్యలతో, భావావేశాలతో అదుపు తప్పిన ప్రాణికమూ శరీరపు సమతౌల్యాన్ని భంగపరచి, నిస్త్రాణ, నీరసాలకు, అస్వస్థతకూ గురిచేస్తాయి.

*

"వీటి పీడ నుంచి శరీరాన్ని విముక్తి చెయ్యాలి. అది మనలోని చైత్యాత్మతో నిరంతర సంయోగం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది."

(సైన్స్ ఆఫ్ లివింగ్)

సౌష్ఠవమైన సుందర శరీరము

ఇలా మంచి ఆరోగ్యవంతమైన సంతులిత జీవితం గడుపుతున్నప్పుడు శరీరంలో ఒక నూతనమైన సామరస్యం నెలకొంటుంది. ఉన్నత భూమికలలోని సామరస్యాన్ని ప్రతిబింబిస్తూ అది శరీరానికి పరిపూర్ణ అనురూపాన్ని ఆదర్శసౌందర్యరూపమైన ఆకృతినీ కలుగచేస్తుంది.

(సైన్స్ ఆఫ్ లివింగ్)

గూఢజ్ఞులకు (mystics) మతానుయాయులకు ఈ విషయం తెలియకపోవచ్చు. దైవం ఒక్కొక్క అంగంలోను ఒక్కొక్క విధంగా అభివ్యక్తమౌతాడు. ప్రాణిక, మానసికాలలో శక్తిగానూ, ప్రేమగానూ, దైహికంలో సౌందర్య సామరస్యాలుగానూ అభివ్యక్త

మవుతాడు. ఈ విధంగా బాహ్యాసౌందర్య వ్యక్తీకరణ మనేది ఆధ్యాత్మిక రంగానికి చెందినది.

*

భౌతిక ప్రపంచంలో దైవాన్ని వ్యక్తం చేసేది ఒక్క సౌందర్యమే. రూపం ప్రధానంగాగల భౌతిక ప్రపంచంలో మనమా సౌందర్యాన్ని కించపరచకూడదు. దైవాన్ని వ్యక్తీకరించేది, విపులీకరించేది, ప్రత్యక్షంగా నిరూపించేది అంతా కూడా సౌందర్యమే. ప్రకృతిలోని అంశాలన్నిటికీ పరిపూర్ణత్వాన్నిచ్చి దైవంతో అనుసంధానపరిచేది సౌందర్యము. అంతేకాక వాటిని సామరస్యం ద్వారా ఆదర్శభావాలతో ఉన్నత శిఖరాల వైపుగా ఉద్ధరిస్తుంది.

*

రూపధారణ పొందిన ఈ ప్రపంచంలో అందాన్ని పాడుచేయుట మనేది ఎంతో పెద్ద తప్పు. భావలోకంలో (world of ideas) సత్యాన్ని అతిక్రమించిన దానితో సమానం. పరమేశ్వరునికి ప్రకృతి చేస్తున్న ఆరాధన సౌందర్యము. ఆకృతి ధరించిన పరమేశ్వరుని భాష సౌందర్యం. దైవచింతన మనేది సౌందర్యాన్ని అర్థం చేసుకోడంలోనూ, వ్యక్తీకరించడంలోనూ తెలియబడుతుంది. అలా చైతన్యం బయటకు కనబడకపోతే అది అసంపూర్ణమే కదా!

చైతన్యవంతమైన శరీరము

మన శరీరాన్ని వివేకంతో మంచి వివేచనాత్మకంగా తయారు చేసుకుంటే దానితో బాటు ఆత్మాభివృద్ధికీ, దాని వికాసానికీ, ప్రగతికీ దోహదం చేసినట్లవుతుంది.

తెలిసి చేసినా, తెలియక చేసినా వ్యాయామం ద్వారా దేహకణాల్లో చైతన్యం పూరించడం జరుగుతుంది. ఎలాగంటే కండపుష్టి కోసమని కసరత్తు చేసేటప్పుడూ, అవయవ లాఘవం కోసమనీ, వాటిని లఘువుగాను, శక్తివంతంగానూ చేయటం కోసమనీ, వాటికంత వరకు లేని సునిశితత్వం కలుగచేయాలనీ వ్యాయామం చేసేటప్పుడు జీవకణాల్లోకి చైతన్యాన్ని ప్రవేశపెడతామన్న మాట. ఆ విధంగా శరీరం మొత్తం ఒకే స్థాయిని పొంది

మంచి పాత్రగా తయారవుతుంది. అంతేకాక తన చర్యలలో అంత కంతకు పురోగతి పొందుతూ, ఆ చర్యల ద్వారానే, తనూ పురోగతి సాధిస్తుంది. అందుకే శరీర వ్యాయామానికి అంత ప్రాముఖ్యత. అద్భుతమైన ఈ ఫలితాలనూ, శరీరం ఎంత పరిపూర్ణత సాధించగలదోననే విషయాన్ని చూసిన వారికి భౌతికదేహాన్ని ఆధారంగా చేసుకుని లోన ప్రవేశించిన చైత్యపురుషుడు పని చేయడానికి ఇవెంత ఉపయోగమో అర్థమవుతుంది. ఇంత చక్కగా కూర్చబడి, సామరస్యభరితమైన భౌతికకాయమనే ఈ బలోపేత సాధనం చైత్యపురుషునికి లభిస్తే ఆయన కార్యసాధనకు ఎంతగానో తోడ్పడగలదు.

కానీ వ్యాయమం చేసి దేహసౌష్టవం పెంపొందించుకునే వారందరూ ఇటువంటి ఉద్దేశంతోనే చేస్తారనుకోకూడదు. వ్యాయామంవల్ల ఇటువంటి ప్రయోజన ముంటుందని చాలా మందికి తెలియదు. అయినప్పటికీ వారికికూడా ఇటువంటి ప్రయోజనం కొంత కలుగుతుంది. ఒక పద్ధతిలో వివేచనాత్మకంగా దైహికశిక్షణ కొనసాగించే వారిని సున్నితంగా పరిశీలిస్తే ఇతరులకు భిన్నంగా వారి కదలికల్లో ఒక తేజస్సు, ఒక చైతన్యం, జీవకళ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

నిజానికి భౌతికదేహమనేది, భౌతికజీవితమనేది పరమాత్మ తాలూకు అనంత జీవిత ఛాయారూపం మాత్రమే. అయితే అది విరూపత చెంది ఉన్నది. కానీ భౌతిక శరీరం క్రమానుగతంగా అభివృద్ధి చెందగల సామర్థ్యం కలది. వ్యక్తిగతరూపం ద్వారా ఈ భౌతిక పదార్థం పురోగతి చెందుతూ చివరికి భౌతిక జీవితానికీ, ఆవిర్భవించనున్న అతిమానస జీవితానికీ మధ్య వారధి కాగల సామర్థ్యాన్ని పొందుతుంది.

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 3, p. 11; Vol. 5, p. 23; Vol. 4, pp. 53-57; Vol. 12, p. 234; Vol. 1, p. 349; Vol. 10, p. 30-32)

మన లక్ష్యం

శ్రీమాత

చేతనాభివృద్ధే జీవితంయొక్క ప్రధాన లక్ష్యం అయితే చాలా కష్టాలు తీరిపోయినట్లే.

ఫలప్రదమయిన, ఆనందకరమైన జీవితం గడపాలంటే దివ్యసాధన కావాలి. ఆ సాధనలో అడుగు ముందు వేయాలంటే గట్టి పట్టుదల, తీవ్రమైన తపన అత్యవసరం. అన్నిటినీ మించి అది సాధించగలమనే అనంతమైన విశ్వాసం వుండాలి. ప్రగతి అంటేనే యువశక్తి. నూరేళ్ళ వయస్సు పైబడినా యీ శక్తిశాలి నిత్యయువ్వనుడై వుంటాడు.

ఎప్పుడైతే వున్న స్థితితో సంతృప్తి పడి ఆకాంక్షని వదులుకుంటావో అప్పుడు జీవచ్ఛవానివై పోతావు. చైతన్యమే జీవితం. జీవితమే నిరంతర సాధన. ఆటుపోటుల్ని తట్టుకుంటూ, మిట్ట పల్లాల్ని అధిగమిస్తూ, ఆశ నిరాశల్ని లెక్కచెయ్యకుండా నిరంతరం భవిష్యత్తు వైపు పురోగమిస్తూనే వుండాలి. స్తబ్ధతను మించిన ప్రమాదకరమైన దేదీ లేదు.

వ్యర్థంగా గడిపిన కాలం వృద్ధాప్యాన్ని పెంచుతుంది.

నీకంటే మహోన్నతమైన దేవతాస్థాయి కోసం నిరంతరం ఆకాంక్షిస్తూ నీ జీవితాన్ని అర్పణ చేసినట్టయితే ముసలితనం నిన్ను బాధించదు. (Consecrate your life to the realisation of something higher and broader than yourself and you will never feel the weight of the passing years.)

పురోభివృద్ధిని నిరోధించే ప్రతి సంవత్సరం జడభరితము, వ్యర్థము. జీవితాన్ని తీర్చిదిద్దే కర్తవ్యంలో ఒక్క అడుగైనా ముందుకు పోనీయని స్థాణువు.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు, నడిమింటి విజయలక్ష్మి

(*Bulletin* Nov 1972, p. 43; *CWM* Vol. 15, pp. 82, 128)

ఆత్మాన్వేషణ



అఖిల

అఖిల భారత పత్రిక, జూలై 2004

ఆత్మాన్వేషణ

ప్రవేశిక

ఆత్మ అంటే ఏమిటి?

(ఒకే సత్యము యొక్క వివిధ రూపములు)

ఆత్మను కనిపెట్టే విధానము

శ్రీమాత ప్రవచనములు

నీ లోనే దాగియున్న చైత్యపురుషుణ్ణి గురించి నీకు తెలియకుండా ఎన్నాళ్ళుంటావు? ఒక క్షణమైనా వృథా చేయకుండా వెంటనే దానిని అన్వేషించడం మొదలుపెట్టు.

శ్రీమాత

ఉపోద్ఘాతము

మానవజీవితము ఎంతో దుర్భరమైనది. ఎంతమంది మేధావులు వచ్చినప్పటికి ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. ఎందుకని? మనిషి మనస్సులోనే ఏదో లోటు వున్నది. నిదానంగా కూర్చుని పరిశీలించినట్లయితే, ఈ కలవరములకు చలించకుండా వుండే వస్తువేదో లోలోపల వున్నట్లు తెలుస్తుంది. అది నీ ఆత్మ. ఆ ఆత్మ పలికే భాషను వినిపించుకున్నప్పుడే నీకు శాంతి దొరుకు తుంది. నీలో భగవంతుని అంశ – చైత్యపురుషుడు ఒకడున్నాడు. అతడు భగవంతుని రాయబారి. నువ్వు అతని సంపర్కము పొందా వంటే నీ కష్టములన్నీ తీరిపోయినట్లే. అతని చైతన్యము నీ శరీ రావయము లన్నిటిలోకి ప్రవేశించి వాటిని దివ్యకాంతులతో ప్రకాశింప జేస్తుంది. సరే బాగానే వుందండి. కాని ఈ ప్రక్రియను చేపట్టుటమెలా అని అడుగుతారేమో. ఈ సంచికను చదివి చూస్తే మీకే తెలుస్తుంది.

– సంపాదకుడు

ఆత్మ

శ్రీఅరవిందులు

అజ్ఞాన మహార్ణవం నుండి భగవద్ రోచిర్నివహాం వైపు
వ్యక్తి పరిణామ ప్రస్థానాన్ని బలపరిచేందుకు
ఒక దివ్య మహాశక్తిగా పరిణామ క్షేత్రంలోకి
అవరోహించిన ఆత్మ భగవంతునిలోని ఒక అంశ.

పరిణమిస్తున్న మనస్సు, ప్రాణికం, శరీరాలను
తన ఉపకరణాలుగా వాడుకుంటూ ఈ ఆత్మ
పరిణామ క్రమంలో
ఒక చైత్యపురుషుడ్ని లేదా ఆత్మ వ్యక్తిత్వాన్ని
రూపొందించుకుంటుంది.

ఈ చైత్యపురుష తత్వం ఒక జన్మనుండి మరో జన్మకు
వికాసం చెందుతూంటుంది.
ఆత్మ మాత్రమే అమరమైనది. మిగతావన్నీ నశించిపోతాయి.
ఈ చైత్యపురుషుడు ఒక జన్మ నుండి మరో జన్మకు
అనుభవ సారాన్ని తనలో ధరించి పరిణామాన్ని కొనసాగిస్తాడు.

అనువాదం: కె. యజ్ఞన్న

(*SABCL* Vol. 22, pp. 295-96)

నీలోని ఆత్మకు విధేయుడవై యుండుము. నీవు ఎలా జీవించవలెనో నీ ఆత్మకు మాత్రమే తెలుసు.

శ్రీమాత

కొన్ని పదముల వివరణ

శ్రీఅరవిందులు

ఆధ్యాత్మిక పదజాలాన్ని గురించి మనం స్పష్టంగా తెలుసుకోవాలి. మనిషిలోని శరీరేతర చైతన్యాన్ని ఆంగ్లేయులు 'సోల్' (soul) అంటారు. కాని ఈ నిర్వచనము ఒక్క 'ఆత్మ' నే కాకుండా కోరి కల, ఆవేశాల సంబంధమైన ప్రాణికాన్ని కూడా సూచిస్తుంది. అందుకనే మనిషిలోని శరీరేతరమైన దైవాంశమును స్పష్టంగా ఎత్తి చూపించేందుకై 'చైత్యము' (సైకిక్, Psychic) అనే పదాన్ని ఉప యోగించాల్సి వచ్చింది.

*

కాని మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞులు కూడా 'సైకిక్' అనే పదాన్ని 'అంత రంగ స్పందనలకు సంబంధించినది' అనే అర్థంలో వాడుతారు. కాని నాకు కావలసిన అర్థాన్ని సూచించేందుకై నేను గ్రీకు భాష లోని 'Psyche' (అంటే ఆత్మ) అనే మూలంలోంచి 'Psychic' అనే పదాన్ని తయారు చేశాను.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 22. p. 290; Vol. 26, pp. 110-111)

ఆత్మను కనిపెట్టడం అనగా దైవమును పొందు టయే. ఆత్మ ద్వారానే నీవు నీ నిజస్వరూపమును తెలుసుకొనెదవు.

శ్రీమాత

చైత్యమునకు చైత్యపురుషునకుగల తేడా
(Difference between the *Psychic* and the *Psychic Being*)

శ్రీఅరవిందులు

పరమాత్మ, విశ్వాత్మ, జీవాత్మ – ఈ భాష మనకు కాస్త పరిచితమే. కాని శ్రీఅరవిందుల యోగంలో 'చైత్యము' అనే కొత్త పదాన్ని ప్రవేశపెట్టారు. దీని అర్థమేమిటో, దీనికి చైత్యపురుషునికి గల భేదమేమిటో మనం స్పష్టంగా తెలుసుకోవాలి.

– సంపాదకుడు

ఈ భూమ్మీద శరీరమును ధరించి పరిణామము చెందుతున్న 'ఆత్మ' లేక దైవము యొక్క విస్ఫులింగమును చైత్యము అనియు, అనేక జన్మలెత్తి మనోప్రాణిక దైహికములనే ఉపకరణముల ద్వారా పెరిగి పరిణతి జెందుతున్న ఆత్మపదార్థమును చైత్యపురుషుడు (psychic being) అనియు శ్రీఅరవిందులు వివరించారు[1].

అంటే ఏమిటి? బంగారమే వుంటుంది. మనం దానితో రకరకాల నగలను తయారు చేసుకొనవచ్చు. ఇక్కడ మూల పదార్థం బంగారము. ఆభరణాలు దాని ఆకృతులు[2]. అదే విధంగా చైత్యము మూలపదార్థము. చైత్యపురుషుడు దాని రూపము. మన సాంప్రదాయంలో కూడ మూలపదార్థాన్ని 'అంతరాత్మ' అని, హృదయంలో అది దాల్చే రూపాన్ని 'చైత్య పురుషుడు' అని అంటాం కదా. అంటే హృత్పురుషుడే ఆకారము దాల్చిన ఆత్మ లేక చైత్యపురుషుడు. ఇంకా శ్రీఅరవిందులు ఈ 'చైత్యము' ను సూచించేందుకు దాదాపు ఒకే అర్థముగల అనేక పదములను వాడుతారు: ఆత్మసారము (Soul essence), ఆత్మ విస్ఫులింగము (Soul-spark), ఆత్మ ధాతువు (Soul element), ఆత్మ దినుసు (Psychic entity), ఆత్మ అస్తిత్వము (Psychic existence), ఆత్మ సారాంశము (Psychic essence), Psyche etc,. చైత్యపురుషుణ్ణి

---

[1] *SABCL* Vol. 22, p. 291
[2] *SABCL* Vol. 22, p. 286

సూచించేందుకు కూడ అనేక మాటల నుపయోగిస్తారు: ఆత్మ వ్యక్తిత్వము (soul Personality), ఆత్మరూపము (soul form), వైయక్తిక ఆత్మ (soul individuality), పరిణామము చెందుతున్న ఆత్మ (evolving soul), పరిణమించుచున్న వైయక్తిక రూపమును ధరించిన ఆత్మ (soul in its evolved individualised form), మన లోని నిజమానవుడు, చైత్యవ్యక్తిత్వము (psychic personality) మొదలైనవి. అనేక విధములుగా వర్ణించిన ఈ రెండు పదములకు గల భేదము ఇప్పుడు స్పష్టమైంది కదా:

ఈ 'చైత్యము', 'చైత్యపురుషుడు' లను గురించి ఇంకా అనేక వివరణలను 19-23 పుటలలో చూడండి.

మూలం: *AIM* సంపాదకుడు
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

'నేను' అంటే ఎవరు

శ్రీమాత

నీ బాహ్య శరీరమున్నది. దీనిని నడిపించే ఆత్మ ఉన్నది. ఈ బాహ్య మానవుడు కొన్ని బాహ్యశక్తుల చేతుల్లో కీలుబొమ్మ. ఆత్మస్పర్శ కలిగేంతవరకు ఈ బూటకం యిలా కొనసాగుతూనే ఉంటుంది. ఆత్మంటే ఏమిటో మనం తెలుసుకొన్నపుడుగాని మన నిజ జీవితం మొదలుగాదు. — సంపాదకుడు

సామాన్యుడు 'నేను' అనుచో వాడూహించునది వాని దేహమే – 'నేను', 'నీవు', 'వాడు' ఇవి వాని దేహము నుద్దేశించినవే. కాని, ఆత్మకు సకలము 'నేనే' యగును – సృష్టి సకలము 'నేనే', చూచునవి, చూడనివి, చూడగలవి సర్వమును 'నేనే'. 'నాకిది కావలెను, నాకది కావలయును, నాకిది వలదు' అను భావముల కర్థము లేదని ఎఱింగి తన పిచ్చిభావనలకు తానే విస్తుపోవును. సకలము తానే యగుచో, సర్వత్ర భేదభావము వదలినచో, శేషించి

నది 'నేను', ఆ పరమాత్మయే యగును. ఆ మహత్తర క్షణమున, జీవి జీవితో తారసపడువేళ: ఈ కోర్కెలన్నియు దేహమునకు చెందినవే యని తెలిసికొందువు. ఈ ఇంద్రియ కార్యము లోక ఇచ్ఛయొక్క ఘటన లనియు, ఆ ఇచ్ఛయే అజ్ఞానవశమున 'నేను' అనే భ్రమస్థితిననియు స్పష్టమగును.

జీవుడు, దేహము పూర్తిగా వేర్వేరని ఎంతో ధ్యానించి, మననము జేసి అధ్యయన మొనర్చిన తెలియగలదు. వెనుకనున్న ఇచ్ఛాశక్తియే ఈ చేయుటకు, చేయకుండుటకు మూలమని తెలిసి వానితో ఐక్యత నాపాదించుకొనవు. ఇది మాటలతో జరుగదు – బహుకాల కృషి, ఉన్నతమగు ఎరుక అవసరము. ఎన్ని జన్మ లెత్త వలెనో ఎవరు చెప్పగలరు?

అంతకెన్ని రెట్లు అధికమగు కాలమునకో కాని, సమగ్ర మగు ఎఱుకతో కూడిన స్వతంత్రశక్తిని – ఈ ఇచ్ఛాశక్తిని ప్రోత్స హించుదానిని, తెలియనేరవు. చేయించునది, చేయునది, చేసినది సకలము నా మహాశక్తి అదితియే. దాని తెఱం గెఱింగిన మనిషి తన ఇచ్ఛాశక్తిని తదనుగుణముగ సంస్కరించుకొని సకల కార్య ముల సఫలత గాంచగలడు. పరమాత్మయే వాని యోగక్షేమముల వహించును కదా.

ఇంద్రియ జయమున కదే ఏకైక మార్గము – పరమాత్మ నెఱుంగుటయే.

అది తెలిసిన వానికి పట్టుకొమ్మ లభించినట్లే. ఇంద్రియ నిగ్రహము గూర్చి భాషించుచో, "ఓహో! నిజముగా దానికే నిగ్రహ శక్తి కలదు" అందువు.

ఆత్మదర్శనము పొందనేర్చుట కిదియే రాచబాట.

అనువాదం: పోతాప్రగడ వెంకటేశ్వర్లు (శ్రీమాత శతజయంతి ప్రచురణ నం॥ 18 నుండి)

(*CWM* Vol. 9, pp. 310-11)

కామాత్మ – నిజాత్మ

శ్రీఅరవిందులు

మనలో కామాత్మ (disire-soul) అనే రాక్షసి ఒకటున్నది. 'నేనే నీ ఆత్మ' నని గొప్పగా చెప్పుకుంటుంది కూడా. కాని అది కేవలము మన కోరికలను తృప్తి చేసే ప్రాణమయ జీవుడు మాత్రమే. అసలైన ఆత్మ అనగా ఒక దివ్య విస్ఫులింగం. దానిని పట్టుకొని వెలికి తీసుకొని వచ్చినపుడు నీ జీవితం యొక్క స్వరూపమే మారిపోతుంది. – సంపాదకుడు

జీవితము, అంతరాత్మ రెండు వేర్వేరు విషయాలు. అంతరాత్మ దివ్యాత్మ యొక్క అగ్నికణమే (spark). అది వ్యక్తి స్వభావమునకు ఆధారభూతమై యున్నది. ఆ స్వభావమును ఆవిష్కరించు పనిముట్లే మనఃప్రాణ శరీరములు. సామాన్య ప్రజలలో ఈ అంతరాత్మ బాహ్యప్రకృతి కర్మలచే కప్పబడి యున్నది. వారు ప్రాణశక్తినే అంతరాత్మగా భ్రమించుచుందురు. ఏలన ప్రాణశక్తి శరీరమును చేతనా పరము చేసి, దాని కర్మలకు కారణ భూతమై యున్నది. కాని ప్రాణసత్త, మంచిచెడ్డలనే ద్వంద్వస్వభావముగల కోరికలతో, క్రియాశక్తులతో నిండియున్నది. ఇది కామాత్మ (desire -soul), యథార్థమైన ఆత్మ కాదు. మానవునిలో నిజమైన అంతరాత్మ (చైత్యపురుషుడు) ముందుకు వచ్చి, ప్రథమముగ తన ప్రభావమును, తరువాత క్రమముగ తన పరిపాలనను ప్రకృతి పనిముట్లగు, మనఃప్రాణ శరీరముల క్రియాకలాపలములపై మోపవలెను. అప్పుడు మానవుడు, ప్రాణశక్తి కోరికలపై విజయము సాధించి తనలో దివ్యప్రకృతి పెరుగునట్లు చేయగలడు.

*

మానవహృదయము పశువు నందువలె, ప్రాణసంబంధమైన భావములకు స్థానము కాని, పశుభావములకంటె అవి అనేక విధములుగా పెంపొందియుండును. అహంకార ప్రవృత్తి చేతనూ, అంధప్రాయములైన సహజాపేక్షలచేతనూ, విపరీతములైన ప్రాణస్పంద

నలచేతనూ దాని భావములు నియతము లగుచుండును. అధః పతితమైన ప్రాణశక్తికి సహజములగు కామక్రోధాదులిందు మల్లడి గొని యుండును. వాటికవి వశంవదమై వర్తించుచుండును. ప్రాణ తృష్ణలయూ, భావావేశములయూ ఈ కలయిక మానవునిలో నొక విపరీతమైన కామాత్మను కల్పించును.

అది యట్లుండ, మానవుని నిజమైన ఆత్మ యీ కామపూరిత హృదయములో లేదు. దీని వెనుక, కాన రాక దాగియున్న అసలు హృదయములో – తేజోమయ గుహాభ్యంతరములో నున్నది. పరాత్పరుని దివ్యతేజః ప్రసార రూపమై, మన యాత్మ అచట నెలకొని యున్నది. చాలామందికి అది యచట నున్నట్లు తెలియనే తెలియదు. ఏలయన, ఆత్మ లందరికినీ కలవు; కాని, దాని నెరిగిన వారు గాని, దాని సాక్షాత్త్రేరణానుభవము కలిగిన వారు గాని అరుదు. ఆ దివ్యజ్యోతి విస్ఫులింగమే మన ప్రకృతి యందలి అజ్ఞాన పదార్థ జాతమున కంతకునూ ఆధారముగా నున్నది. దాని నాశ్రయించుకొనియే మనలో నిజమైన మానవుడు, హృత్పురుషు డేర్పడుచున్నాడు. ఈ హృత్పురుషు డంతకంతకు వృద్ధిబొంది, హృదయమాతని దివ్యప్రేరణలతో స్పందించుచున్న కొలది, మానవుడు తన యాత్మను క్రమముగ నెరుంగుచూ, పశు స్వభావమును వీడి, అంతర్యామి యగు పరాత్పరుని వెలుగు నందుకొనుచూ, గంభీరమైన జీవసచేతనల జాడలను గ్రహించుచూ, దివ్యప్రేరణతో వర్తించ నారంభించును. ఈ హృత్పురుషు డిట్లు విముక్తుడై, తెర మరుగునుండి బయటికి వచ్చి, మానవుల దేహప్రాణ మనములపై తన యనుభూతులను వెల్లిగొల్పుచూ, పృథ్వియందు దివ్యత్వమును ప్రతిష్ఠించుట కెప్పుడు మొదలిడునో, అప్పుడు పూర్ణయోగమున నొక పెద్ద మెట్టెక్కితిమని చెప్పవచ్చును.

అనువాదం: మానాప్రగడ శ్రీరాములు ('చైత్యపురుషుడు' నుండి); కమలాకర వేంకటరావు ('యోగసమన్వయము' నుండి)

(*SABCL* Vol. 22, p. 313; Vol. 20, p. 140-41)

చైత్యపురుషుని విశిష్ట పాత్ర

శ్రీమాత

నీలో దివ్యచైతన్యమనే ఒక వస్తువున్నది. కాని అదెక్కడుం టుందో తెలియదు. నువ్వు దానిని వెతికి పట్టుకోవాలి. అది నిత్యమూ దైవాని కర్పితమయ్యే ఉంటుంది. దాన్ని నీ బాహ్య ప్రకృతిలోకి తెచ్చినప్పుడు యిక అంతా సంతోషమే. అంతా ఆనందమే. నీకు అది ఒక దర్శనమే కాదు, శరీర పరివర్తనమును కూడా చేయగలదు. — *సంపాదకుడు*

వ్యక్తిలో ఏ భాగమైతే సూటిగా దివ్యచైతన్యపు స్ఫూర్తితో ఉంటుందో అదే నీ చైత్యపురుషుడు (చైత్యసత్త). ప్రతికూల శక్తులు దాన్ని ఏమాత్రం స్పృశించ లేవు. అది ఒక సామరస్య లోకము. అక్కడ అంతా వెలుగులో నుంచి వెలుగులోకి, పురో గతి నుంచి పురోగతికీ జరుగుతూ ఉంటుంది. అది దివ్య చైత న్యానికి స్థానమేగాదు. *వ్యక్తిలో పరమాత్మ నివాసస్థానమూ అదే.* ఆ పరమాత్మ ఉనికివల్ల అక్కడ కాంతి, సత్వము, జ్ఞానము, సౌందర్య సామరస్యాలు నెలకొల్పబడి క్రమక్రమంగా వృద్ధిపొందు తాయి. దివ్యచైతన్యంలో అంతర్భాగమైన ఈ చైత్యసత్త ఆ ప్రభా వంతోనే స్థిరరూపాన్ని పొంది పనిచేయ ప్రారంభిస్తుంది. ప్రతి వారి అంతరాంతరాల్లో నిగూఢంగా నిక్షిప్తమై వుంటుంది. *నీలోని పరమాత్మతో అనుసంధానం కావాలనుకుంటే దాన్ని గాలించి పట్టుకోవాలి.* నీలోని దివ్యచైతన్యాన్నీ, నీ బాహ్యచైతన్యాన్నీ కలపగల్గిన సంధానకర్త అదే. నీ ఆంతరంగిక జీవన నిర్మాత కూడా అదే; బాహ్య జీవనంలో గూడా దైవసంకల్పం, దైవక్రమం అమలు జరిగేటట్లు చేస్తుంది. నీ బాహ్యచైతన్యంలో ఆ చైత్యసత్త పని తీరును గుర్తెరిగి, దానితో ఒకటి కాగలగితే, నువ్వు స్వచ్ఛ మైన అనంత చైతన్యాన్ని చేజిక్కించుకొని అందులోనే ఉండిపో గలవు. ఇక అప్పుడు సాధారణ మానవుని మాదిరి నిరంతరం అజ్ఞానంలో మునిగి పోకుండా నీలోని అనంత జ్ఞానజ్యోతి ప్రభా

వాన్ని పొంది, భక్తితత్పరుడవై సంపూర్ణసమర్పణ గావించుకొని దానికి బద్ధుడవై నడుచుకో గలవు.

నీలోని చైత్యసత్త దైవానికి అర్పితమైపోయింది కదా! దాని ప్రాబల్యమే లోపలనుంచి క్రమక్రమంగా బయటంతా వ్యాపించి నీ దైహిక చైతన్యం దాకా వచ్చి నీ ప్రకృతిలో పూర్తిగా పరివర్తన తీసుకొని రాగలదు. అదే నీలోని కాంతిమయభాగం. అక్కడ మసగ అనేదే ఉండదు. చాలామంది వారిలోని ఈ విభాగాన్ని గుర్తెరుగరు. కానీ యోగ సాధనవల్ల దాని చైతన్యాన్ని పొంద వచ్చు. తద్వారా నీలో పరివర్తన ప్రక్రియ శతాబ్దాల తరబడి నత్తనడక కాకుండా ఒకే జీవిత కాలంలోగానీ, ఇంకా తక్కువ కాలంలోగానీ జరిగేటట్లు చేయవచ్చు.

శరీరం చాలించిన తర్వాత కూడా నిలిచి ఉండేది చైత్య సత్త. అది నీ శాశ్వత ఆత్మ చైతన్యాన్ని ఒక జన్మనుంచి మరి యొక జన్మకు చేరవేస్తుంది.

నీలోని అసలు సిసలైన వ్యక్తియే నీ చైత్యపురుషుడు. నీ దైన ప్రత్యేక అభివ్యంజనమే నీ వ్యక్తిత్వమైనప్పుడు రూపుదాల్చిన ఒకానొక దైవచైతన్యపు ప్రత్యేక ఆకృతి విశేషమే నీ చైత్యపురు షుడు. నిజమే, కాని చైత్యపురుషుని దృష్టిలో వ్యక్తిచైతన్యానికీ, విశ్వచైతన్యానికీ ఏ విధమైన తేడాగానీ భేదంగానీ ఉండదు. ఆ విశ్వచైతన్యం నీలోని ఇతర భాగాలను మార్పు చెందేలా చేస్తున్న ప్పటికీ నీ చైతన్యం మాత్రం నీ వ్యక్తిత్వపు ప్రత్యేక లక్షణంతోనే ఉండి, ఏకకాలంలో అదే విశ్వ చైతన్యపు వ్యక్తీకరణమని కూడా తెలుసుకుంటుంది. అది ఎలాగంటే నీవే నీలోని ఒక భాగాన్ని నీ ముందు పెట్టుకున్నప్పుడు ఆ రెంటి మధ్య ఉండే పరస్పర వైఖరి ఏ విధంగా ఉంటుందో ఇదీ అంతే. ఈ విధమైన ద్వంద్వత్వమూ అవసరమే. దానివలన వస్తుగత సంబంధాన్ని నిర్ధారించి, అను భూతి పొందటానికి వీలవుతుంది. అయితే నీ చైత్యసత్తలో ఈ ద్వంద్వాల మధ్య తేడా ఒక ఆభాసగానే ఉంటుంది తప్ప మరేమీ కాదు. అది ఒక భ్రమ మాత్రమే.

*

చైత్యముతో (Psychic) ఐక్యమగుట మొదటి అడుగు మాత్రమే. ఎప్పుడైతే అలా ఐక్యమై ఉంటావో అపుడిక నీకే బెడదా వుండదు. ఆ చైత్యమే నిన్ను ఆవహించి నీ జీవితాన్ని నడిపిస్తుంది. నీ జీవితానికది అధ్యక్షత వహిస్తుంది. చైత్యము ముందుకు రావడమంటే (the Psychic coming in front) అదే. అదియే నీ జీవితాన్ని ఎలా నడిపించాలో నిశ్చయిస్తుంది. అదే నీ జీవితాన్ని నిర్వహిస్తుంది. నీ చైతన్యాన్ని, నీలోని వివిధ భాగాలను తీర్చిదిద్దుతుంది. ఇక నీకు సమస్యే లేదు. నీ సాధన చకచకా వేగంగా సాగిపోతుంది. రూపాంతరీకరణం కూడ జరుగుతుంది.

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 3, pp. 62-63; Vol. 6, p. 334)

బ్రహ్మము – నిరపేక్షము
(Absolute)

శ్రీఅరవిందులు

బ్రహ్మమనే మూలపదార్థం ఒకటి ఉన్నదండీ. సత్తు (being) సంభూతి (becoming) దాని పర్యవసానములు. ఇదంతా మనకి అలవాటు లేని నూతన పద జాలము. నిదానంగా కూర్చొని అవగాహన చేసుకోవలసిన విషయం. – సంపాదకుడు

నిరపేక్షం (absolute) అంటే మనల్ని మించిపోయిన ఓ మహనీయతత్వం. మనం నివసించే విశ్వం కన్నా మహత్తరమైనది. మనం భగవంతుడు అని పిలిచే విశ్వాతీత పురుషుని మహోన్నత సత్య స్వరూపం. అదే కనుక లేకపోతే ఈ దృశ్యమాన జగత్తు సర్వస్వం ఒక్క క్షణమైనా మన జాలదు. భారతీయ తాత్విక దర్శనం దానికి 'బ్రహ్మం' అని పేరు పెట్టింది; యూరోపియన్లు నిరపేక్షం (absolute) అన్నారు.

మనం సృష్టి (అస్తిత్వం) అని, శూన్యం, అసత్తు, అలోకం (non-existence) అని దేనిని పిలుస్తున్నామో, వాటిలో ఈ నిరపేక్షం అవర్ణనీయమై, అంతస్థితమై, అతీతమై, సారభూతమై, రహస్య నిక్షిప్తమై, వుంటుంది.

*

ఈ నిరపేక్షం రెండు విధాలుగా అభివ్యక్త మవుతుంది – అస్తిత్వము (Being) సంభూతము (Becoming). మూలతత్త్వమే అస్తిత్వము. దాని వ్యవహార రూపం సంభూతి, అస్తిత్వం నుండి కదలిన ఒక సక్రియాత్మక శక్తి; ఒక సృజనాత్మక శక్తి, ఒక ఆవిష్కరణ. అస్తిత్వపు అచంచల రూపరహిత సారం నుండి, మార్పు లేని తత్వం నుండి నిర్గమించినప్పటికీ, మార్పుచెందే రూపం, పరిణామం కలది అది (సంభూతి).

సంభూతి నుండి అస్తిత్వం వేరుగా లేదు, అందులోనే వుంది. దానితోనే చేయబడింది. దానిలోని అణువణువునా నిండి వుంది. దాని అనంత విస్తరణలో అనంత పరివ్యాప్తమై నిండి వుంది. అస్తిత్వాన్ని తెలుసుకున్నపుడే సంభూతి తనను గూర్చి తాను తెలుసుకుంటుంది.

సంభూతిలోని ఆత్మ సర్వోత్కృష్ట పరాత్పరుని, నిరపేక్ష పూర్ణత్వ మహస్సును తెలుసుకున్నప్పుడు ఆత్మజ్ఞానం, అమృతత్వం దానికి లభిస్తాయి; అనంతుడు, శాశ్వతుడు అయిన పరమాత్మ దివ్యప్రకృతిని పొందుతుంది.

అనువాదం: యజ్ఞన్న

కష్టాలను జయించేందుకు ఒక్కటే మార్గము – మాట్లాడకుండా ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఉండటమే.

శ్రీమాత

సావిత్రి[1] లోని వర్ణనలు

బ్రహ్మంబు పూర్ణంబు పరమేకంబు
తనదైన మౌనము శయనించియున్న
కబళించు కాలంబు నుండి కాపాడు
కదలని మెదలని నిద్రాణమైన
గాఢ సుప్తిని మునిగి చలనంబులేని
అవ్యక్తమును అనంతమైనట్టి
నిశ్శబ్దశక్తి నిర్నిద్రుండు లేపె.

బ్రహ్మంబు పూర్ణంబు పరమేకంబు
తన మౌనముతో ఆకసమందు చేరినది.
తన రూపమున ప్రజాతతుల కల్పించినది
తన శక్తినుండి సృష్టించినది కోటిశక్తులను
ఏకాంతమును వీడి బృహద్ధామంబు విడనాడి
హృద్దేశమున విడిదిసేయంగ వచ్చినది
ఆకాశము తానాయెను కాలముగా మారిపోయె.

బ్రహ్మంబు పూర్ణంబు సంగ రహితంబు
మనలోపలి గూఢాత్మగ మసల సాగినాడు విభుడు
మన వేషంబుల దాల్చెను నటియించెను అకగుణముల
మృణ్మయ దేహము తనదిగ హిరణ్మయుడు వసించునిచట
మనము కూడ దైవస్థితి కెదుగుట యాతని ముచ్చట
దివ్యమైన తన రూపము మనలోపల చిత్రించెను
దివ్యస్రష్ట మన భూమిక కొంగ్రొత్తగ సవరించెను

---

[1] ఇక్కడ బ్రహ్మముయొక్క మూడు స్థాయిలు – విశ్వాతీతము, వైశ్వాన్వయము, వైయక్తికము వర్ణింపబడినవి. తరువాత ఎనిమిది పేజీలలో వైశ్వాన్వయ, వైయక్తిక రూపాలను గురించి తద్వారా ఆత్మంటే యేమిటో తెలుసుకొనెదము. – సంపాదకుడు

మర్త్యులలో ముద్రించెను దైవత్వపు వ్యూహాంబుల
పరిమిత మానసముల మలచె అనంతత్త్వ వాహికలుగ.

అనువాదం: యజ్ఞన్న; ధారా రాధాకృష్ణ మూర్తి (మే 1999 'అఖిల' నుండి)

(*SABCL* Vol. 18, pp. 375-76, 477; Vol. 19, p. 659; Vol. 28, p. 67)

ఆత్మ – SELF (Spirit)

శ్రీఅరవిందులు

బ్రహ్మము, ఆత్మ, Self, Spirit అనే మాటలు మనకి తరచుగా తగులుతూనే ఉంటాయి. వీటి అర్థాలేమిటో, పరస్పర సంబంధ మేమిటో మనం స్పష్టంగా తెలుసుకుంటే బాగుంటుంది.

– సంపాదకుడు

బ్రహ్మపదార్థం ఇక్కడ విశ్వాంతరాళంలో, కాలంలో విస్తరించి వుంది. కాలాంతరాళాలలో అంతటా నిండి వుంది. ఆ బ్రహ్మ ముతో మనం సాయుజ్యం పొందుతాము. అదే మన నిజమైన ఆత్మగా, ప్రపంచంలోని ప్రతి జీవి, ప్రతి వస్తువులో నిగూఢంగా గుప్తమై వున్న నిజమైన ఆత్మగా మనం భావిస్తాము. పూర్ణత్వం లోనూ, విభజనలోనూ మనకు కనిపిస్తున్న నిజమైన ఆత్మ అదే. దానిని మనం 'ఆత్మ' (Atman) అని అంటాం. నిజమైన 'సత్' (Being) అని, నిజమైన 'పదార్థం' (Substance) అని దాని అర్థం.

*

జీవితంలోని కాలుష్యాలు, క్షుద్రకోరికలు, అహంకారం, అజ్ఞానం అంటకుండా ఆత్మ (Self or Spirit) వాటికి అతీతంగా భాసిస్తుం టుంది. ఆత్మ నిత్యశుద్ధంగా, వినిర్మలంగా ప్రజ్వరిల్లుతుంటుంది. ప్రతి వ్యక్తి, జీవునిలో నిండివున్న నిజమైన ఆత్మ, సత్ అదే. కాని అందరిలోనూ అతి విస్తృతంగా మెరిసే ఆత్మ, సత్ కూడా అదే.

విశ్వాంతర్గతమై ప్రదీపించే ఆత్మ (self) సైతం అదే. వ్యక్తికి, విశ్వానికి అతీతంగా దీనికి స్వీయ అస్తిత్వం, తనదైన ఉనికి (self-existence) వుంది. దానినే 'పరమాత్మ' అంటారు. అదే పర మోత్కృష్టమైన దైవత్వం, దివ్య పురుషోత్తముడు, పరమేశ్వరుడా యనే.

*

ఆత్మ అనగా ఈ విశ్వంలోని వ్యష్టిలోనూ, విశ్వంలోనూ, విశ్వా తీతంలోనూ కూడా ఏకకాలంలో అనుభూతమయ్యే వస్తువు.

వ్యక్తి మోక్షానికి, ఒక స్థావర విశ్వజనీనతను, ప్రకృతి – అతీత స్థితికి త్వరితగతిని, తిన్నగా చేరుకునే మార్గం, ఆత్మసాక్షా త్కారం, ఆత్మోపలబ్ధి. అదే సమయంలో విశ్వంలోని సర్వస్వాన్ని పోషిస్తూ, పరివ్యాప్తం చెందుతూ, ఆవరించే విధంగానూ, అణు వణువులోనూ నిక్షిప్తమై ఉండు ప్రకృతిలోని సంభూతులతో (becomings) యథేచ్ఛగా సాయుజ్యం చెందే విధంగానూ ఆత్మ సాక్షాత్కారం, ఆత్మసిద్ధిని పొందవచ్చును.

అనువాదం: యజ్ఞన్న

(*SABCL* Vol. 27, p. 342; Vol. 22, p. 299; Vol. 18, p. 347)

ప్రతి రోజు నిర్మలమైన మనస్సుతో ముందర ఏం జరగబోతుందో అనే భయం లేకుండా మొదలు పెట్టాలి. ఏదో జరగబోతోందని ముందరే ఎందుకు ఊహించుకోవాలి? అలా జరగనే జరగక పోవచ్చు.

శ్రీమాత

జీవాత్మ – వైయక్తికాత్మ (కేంద్రసత్త)

శ్రీఅరవిందులు

జీవాత్మ, పరమాత్మ, కేంద్రపురుషుడు, మానసిక, ప్రాణిక, భౌతిక పురుషులు, మనస్సు, దాని ఆలోచనలు, చైత్యపురుషుడు, పరిణామ ప్రక్రియ ద్వారా అది వికాసముచెందే రీతులు మొ॥ వాటిని గురించి మనం తెలుసుకుందాము. – సంపాదకుడు

జీవ అనే పదమును సంస్కృత మూలమైన బాషలలో రెండర్థములలో వాడుతారు. ఒకటి – 'ప్రాణముగల జీవులు'; రెండు – ఒక జన్మనుండి మరొక జన్మకు, ప్రాణికి ఆధారమై నిలిచి ఉండే వ్యక్త్యాత్మ. 'జీవాత్మ' అనగా ఈ రెండవ అర్థమే – ప్రాణమున్న జీవియొక్క ఆత్మ. అది 'బహురూప దివ్యతత్త్వము. ప్రత్యగాత్మగా సృష్టింపబడిన వ్యక్తియొక్క ఆత్మతత్త్వముగా అభివ్యక్తమయినది. జీవాత్మ తన మూలతత్త్వములో మారునదిగాని, వికాసము చెందునదిగాని కాదు. అది మౌలికముగా వ్యక్తిగత పరిణామమునకు పైన నిలిచియుండును. ఆ జీవాత్మకు ప్రతినిధియై పరిణమించునది చైత్యపురుషుడు. ఈ చైత్యపురుషుడు ప్రకృతికి సంబంధించిన మిగిలిన అంశములకు సహాయభూతమై నిలుచును.

*

కేంద్రసత్త (జీవాత్మ) జన్మపరంపరలపై అధ్యక్షత వహించును. అది జన్మించదు. అది వ్యక్తిసత్తలోనికి దిగిరాక, ఊర్ధ్వభాగమున (వ్యక్తి పైభాగమున) నిలిచి యుండును. అది, మనః ప్రాణ శరీరములను, వ్యక్తియొక్క వివిధ భాగములను ధరించి, అతని స్వభావములో ఏ భాగము (అనగా మనస్సు, దానియొక్క యోచనలు, సంకల్పములుగాని, లేదా చైత్యపురుషుడుగాని) ముందుకు వచ్చి శక్తివంతమైనదిగా యుండునో, ఆ భాగము ద్వారా అతని జీవితమును నియమించి నడిపించును. అది (కేంద్రసత్త) వ్యక్తిపై ఆధిపత్యము వహించని యెడల, వ్యక్తిచైతన్యము తీరుతెన్నులు లేక తికమకలో పడి, ప్రతిభాగము దేనికది ఆలోచనలలో, భావ

ములలో, క్రియలలో, ఒక దానితో నొకటి ఎట్టి సంబంధము లేకుండ వ్యవహరించును.

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి); మానాప్రగడ శ్రీరాములు ('వ్యక్తియందలి వివిధ భాగములు, భూమికలు' నుండి)

(*SABCL* Vol. 22, pp. 266, 269)

అంతరాత్మ – చైత్యము – చైత్యపురుషుడు

శ్రీఅరవిందులు

పైన దివ్యచైతన్య మున్నది. అది అవిభాజితమైన మూల పదార్థం. అది తనను తాను అభివ్యక్త పరచుకొనుటకై ఈ లోకంలోకి దిగింది. ఎలా దిగింది? విభక్తమై అనేక రూపాలు దాల్చింది. ఈ విభక్తమైన దివ్యచైతన్యము ఆత్మగా మనకు దర్శనమవుతుంది. ఈ ఆత్మ యింకా పరిణామము చెందని మూలపదార్థము; కార్యశీలి యైనప్పుడు పరిణామము చెంది అనుభవము ద్వారా చైత్య పురుషునిగా తయారవుతుంది. – సంపాదకుడు

జీవాత్మ, ఆత్మ-విస్ఫులింగము, చైత్యపురుషుడు – ఈ మూడు ఒకే వస్తువు లేక సత్యముయొక్క వేర్వేరు రూపములు. అంతరంగికానుభూతికి స్పష్టంగా తోచే ఈ మూడింటిని విడివిడిగానే చూడాలి గాని కలగా పులగం చేయకూడదు.

ఆంగ్లములో స్పిరిట్ (Spirit) అని పిలువబడే దానిని మనం జీవాత్మ అంటాము. అది భౌతిక శరీరానికి పైన ఉంటుంది. జనన మరణాలకు అతీతంగా వుండే వైయక్తిక ఆత్మ, వ్యక్తియొక్క శాశ్వత స్వరూపము. అభివ్యక్తిలోనికి దిగి భౌతిక జగత్తులో దాని పరిణామానికి ఆధారంగా ఉంటుంది. అది ఆదిలో భగవశ్చేతన యొక్క అవిచ్ఛిన్నమైన శక్తి; ఇంకా రూపం ధరించని సర్వ సంభ

వతలు ఇమిడి ఉంటయి. కాగా ఈ సంభవతలకు రూపమివ్వడం పరిణామ ప్రక్రియ చేయవలసిన పని. ఈ విస్ఫులింగం అతి నిమ్న జీవుల నుండి అత్యున్నత జీవుల వరకు సమస్త సజీవమూర్తులందు ఉంటుంది.

చైత్యపురుషుడు

అంతరాత్మచేత పరిణామమునందు రూపొందించబడినవాడే చైత్యపురుషుడు. ఈ చైత్యపురుషుడు మనః ప్రాణ దేహాలకు ఆధారముగా నుండి, వాటి అనుభవాలచేత పెరుగుతూ, జన్మనుంచి జన్మకు ప్రకృతి పరిణామాన్ని మోసుకునిపోతాడు. ముందు అతడు మనఃప్రాణ దేహములచేత ఆవృతమై ఉన్నప్పటికి పెరుగుతూ పెరుగుతూ ముందుకు వచ్చి, ఆ మనః ప్రాణ దేహాలనే శాసించే సామర్థ్యం సంతరించుకుంటాడు. సామాన్య మానవునియందు అతడు తన భావప్రకటన కోసం వాటిమీద ఆధారపడి ఉంటాడే కాని, వాటిని చేపట్టి యథేచ్ఛగా ఉపయోగించుకోలేడు. అపుడు అతని జీవనం పశుజీవనంగా, మానవజీవనంగా మాత్రమే ఉంటుందే కాని, దివ్యజీవనంగా ఉండదు. చైత్యపురుషుడు సాధనచేత ప్రభావశాలియై, తన ఉపకరణాలను స్వేచ్ఛగా ఉపయోగించుకో గలిగినపుడు, భగవదున్ముఖ ఆవేగం సంపూర్ణమవుతుంది. మనః ప్రాణ దేహముల పరివర్తనం – వాటి విమోచనం మాత్రమే కాదు – సంభవమవుతుంది.

*

అంతరాత్మ

అంతరాత్మ ఒక భగవదంశం. ఈ అంశం పరిణామశీలి, వ్యక్తియొక్క అంతర తమ ఆధారం. ఈ ఆధార రూపమున అది మనః ప్రాణ దేహాలను ధరించి ఉంటుంది. ఈ మూడూ ప్రకృతినుండి వచ్చిన దాని ఉపకరణాలు. వీటి ద్వారా అది ద్రవ్యమందలి నిశ్చేతనమునుండి, తన యథార్థ సత్తు అయిన దివ్యప్రకాశ, అమృతత్వాల దిశగా పెరుగ ప్రయత్నిస్తుంది. తన ఉపకరణాల పరిమితత్వాలు దాని మీద నిమ్న ప్రకృతియొక్క గతులను విధిస్తాయి. అందుచేత అంతరాత్మ ప్రకృతితో రాజీ పడక తప్పదు. ఈ రాజీ అంతరాత్మ

ఊర్ధ్వగతికి అడ్డు తగులుతున్నప్పటికి, ప్రకృతితో జరిగే ఈ ఆదాన ప్రదానం నుండే దానికి తన పురోగతి సాధనం లభిస్తుంది. కాని చైత్యపురుషుడు – అంశ రూప అంతరాత్మ తన పరిణామమునందు ధరించిన రూపం లేక వ్యక్తిత్వం. ఈ వ్యక్తిత్వం పరిణామం ద్వారా వికసిస్తూ అజ్ఞానానికావల ఉచ్ఛతర పరిణామానికి సర్వం సిద్ధమయ్యేవరకు ఒక జన్మనుండి మరో జన్మకు పయనిస్తూ ఉంటుంది.

*

తెర వెనక దాగి వుండును

మన చైత్య అంశము నేరుగా భగవంతుని నుండి వచ్చినట్టిది. మరియు అతని సంస్పర్శలో నుండును. కావున తన మూలరూపములో దివ్యభావములచే నిండియుండి చైత్య అంశమునకు కేంద్రమై వున్నను, మనస్సు, ప్రాణము, దేహములను త్రివిధ నిమ్న అభివ్యక్తులకు సహాయము నిచ్చుచుండును. ఈ దివ్యత్వము అన్ని ప్రాణులలోనూ వుండును. కానీ నిత్య జీవితంలో ముకుళితమై తెర వెనక దాగి వుంటుంది. ఒక వేళ వికసించినప్పటికి బైటికి రాదు. బాహ్యేంద్రియాలు అందుకు అంత సమర్థవంతం కావు. సాధ్యమైనంతవరకు అభివ్యక్తమవుతుంది. భగవన్ముఖమగు అనుభూతి ద్వారా అతని చేతనాస్థాయి వృద్ధి జెందును. మనలో ఉన్నత తరమైన క్రియలు జరుగు కొలది అతనికి బలము లభించును. చివరకు ఈ గభీరతరమగు, ఉచ్ఛతరమగు క్రియ లన్నియు ఏకస్థితమైన పిదప ఒక చైత్యవ్యక్తిత్వము వికసించును. సామాన్యముగా దానినే మనము చైత్యపురుషుడు అందుము.

*

సైకిక్ బీయింగ్‌ను (Psychic being) భారతీయ భాషలలో హృత్పురుషుడు లేక చైత్యపురుషుడు అని అంటాము. అయితే '*హృదయే గుహాయామ్*' అనగా హృదయాంతరాళాలాలో రహస్యంగా వుండే పురుషుడు అని అర్థం చేసుకోవాలే కాని ఆవేదనలు, ఆవేశాలు పొందే జీవి అని కాదు.

వృక్ష, పశు జాతులలో ఆత్మ

వృక్షంలో లేక పశువులో ఉండే చైత్యం నిష్క్రియం కాదు – కేవలం దాని అభివ్యక్తి సాధనాలు మానవుని సాధనాలకంటె తక్కువ వికసితం. మొక్కలో చైత్యమెంతో ఉంది. పశువులో చైత్యమెంతో ఉంది. మొక్కకు తన రూపమందు ప్రాణిక – భౌతిక (Vital-Physical) తత్త్వాలు మాత్రమే వికసించి ఉంటాయి. మొక్క రూపం వెనుకనున్న చేతనకు వికసిత లేక సంఘటిత మానసికత లేదు. అందుచేత అది తనను ప్రకటించు కోలేదు. కాగా పశువు ఒక అడుగు ముందు ఉంటుంది. దానికి ప్రాణిక మనస్సు ఉంటుంది. కావున దానికి కొంత స్వప్రకటన సాధ్యం. కాని దాని చేతన పరిమితం. దాని మనోవ్యాపారం పరిమితం. దాని అనుభవాలు పరిమితం. దానిలోని అంతరాత్మ సైతం తనకు ప్రతినిధిగా మానవునికి సంభవమైన దానికంటె తక్కువ వికసిత చేతనను, అనుభవాన్నే ముందుకు పంపుతుంది. అయినప్పటికి పశువులు తమకుగల అంతరాత్మతో మానవుని లోని చైత్యపురుమనికి వెంటనే అనుస్పందించగలవు.

ఆత్మ ప్రస్థానం

ఆత్మ అనేది పుట్టినప్పుడు పైనుంచి దిగివస్తుంది. మరణించినప్పుడు నిష్క్ర మిస్తుంది. ఆత్మకు మృత్యువనేది లేదు. అది అమరము. ఒక స్థాయిలోంచి మరో స్థాయిలోకి, భూలోకం నుంచి ఇతర లోకా లకి, మళ్లీ భూలోకానికి పయనిస్తూ వుంటుంది. ఈ విధంగా అనేక ఘట్టాల ద్వారా, పరిణామ ప్రక్రియ ద్వారా, అభివృద్ధి చెంది చెంది, చివరకు మానవస్థాయికి చేరుకుంటుంది. ఓ చైత్యా పురుమణ్ణి ఏర్పరచుకుంటుంది. *ప్రాపంచిక జీవితాన్ని అనుభవిం చుటకు తగిన సాధనములు కావాలి కదా. ఈ శరీరము, ప్రాణి కము, మానసిక చైతన్యములను అందుకే తయారు చేసుకుం టుంది.* అయితే ఆత్మాభివ్యక్తికి ఈ పరికరములు చాలక పోవ చ్చును. ఎందుకంటే చైత్యపురుమడు వెనకాల నుంచి పనిచేయాలి కదా. అయినప్పటికి ఎంతవరకు సాధ్యమయితే అంత వరకే తన దైవత్వాన్ని ప్రకటించుకుంటుంది. అయితే ఎల్లకాలము ఇలాగే

వుండదు. సమయం వచ్చినప్పుడు తెర వెనుక నుంచి ముందుకు వచ్చి శరీరాదులను శాసించి, తన దివ్య చరితార్థతను పొందుతుంది.

*

చైత్య పురుషావిష్కరణ

చైత్యపురుషునికి, నీ ఆత్మకు దైవంతో ప్రత్యక్షంగా సంపర్క మంటుంది. ఈ సంబంధము మనోప్రాణిక దైహికములకు తెలియదు. నువ్వు యోగం చెయ్యవచ్చు. మనస్సుకు సాక్షాత్కారము కావచ్చు. దివ్యశక్తి నీలోకి దిగిరావచ్చు. నీవు అద్భుతమైన ప్రాణికానుభూతులతో పరవశించిపోవచ్చు. ఆశ్చర్యకరమైన శారీరక సిద్ధులను పొందవచ్చు. కాని ఏం లాభం? నీ ఆత్మ ఆవిష్కరించనంతవరకు, చైత్యత్వము (psychic nature) కిందకు వచ్చి నిన్ను ఆవహించనంతవరకు ఏమీ సాధించనట్లే లెక్క. మన యోగంలో మనిషి ద్వారములను తెరచి, చైత్యపురుషుని తనలోకి ఆహ్వానించి, ప్రకృతిని పరవశింపజేసి, అతిమానసజ్యోతిని పొంది, బ్రహ్మానందమును పొందునది చైత్యపురుషుడే.

*

చైత్యముయొక్క కర్తవ్యము – ప్రతి స్తరములోను పనిచేసే సత్యమును జాగృత పరచి దైవమును ఆవిష్కరింపజేయుట.

అనువాదం: చెలసాని నాగేశ్వర రావు ('యోగంపై లేఖలు' నుండి); కొప్పునూరు భాగ్యలక్ష్మి ('అర్క' నుండి); డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 22, pp. 282-83, 341, 288, 289, 294, 438-39; Vol. 24, p. 1095; Vol. 22, p. 297)

ఆత్మ నెందుకు కనిపెట్టాలి?

శ్రీమాత

ఈ ప్రపంచంలో జ్ఞానము రెండు విధములుగా ఉంటుంది. ఒకటి పుస్తకజ్ఞానము, జీవితంలో అనుభవం ద్వారా పొందిన జ్ఞానము. రెండు నిజమైన జ్ఞానము, మనకు కావలసినది, మన జీవితానికి అధ్యక్షత వహించి దానిని నడిపించవలసిన శక్తి.

– సంపాదకుడు

బాహ్యాసత్తను దానంతట దాన్ని వదిలేయటానికి వీల్లేదు. అది ప్రకృతి చేతిలో కీలుబొమ్మై ఆడుతుంది. లోపలున్న సర్వోత్కృష్ట చైతన్యాన్ని నమ్ముకుంటే అదే మనని నడిపించగలదు. ప్రకృతి కలిగించే అవకతవలకు, సంఘర్షణలకు ముగింపు చెప్పటానికే అంతర్గత చైతన్యాన్ని దర్శించుకొని దానితో ఏకత్వం పొందాలనడము. అందుకే దానికంత విశేష ప్రాముఖ్యము.

*

ఆత్మచైతన్యాన్ని పొందితే తప్ప మనిషికి జ్ఞానము రాదు. అందుకని మొట్టమొదట ఆత్మాన్వేషణ గావించుకొని ఆత్మతో ఏకమై, దాని ఆధిపత్యంలో జీవితం గడపటానికే ప్రతివారూ సాధన చేయాలి.

నీకు తెలుసుననుకున్నది సమస్తమూ, నీవు నేర్చుకున్నది యావత్తూ, నీవుగా పరిశోధన చేసి, తర్కించి, బేరీజు వేసినది ఎంతున్నప్పటికీ అదంతా సాపేక్ష జ్ఞానమే కదా. దాన్ని ఆధారంగా చేసుకొని నీ జీవితాన్ని ఆదర్శవంతంగా, సుస్థిరంగా తీర్చిదిద్దుకోలేవు.

మనస్సుతో గ్రహించినదంతా కూడా కేవలం సాపేక్షమే గాని, సత్యం మాత్రం కాదు. తర్కం ద్వారా ఒక విషయాన్ని నిరూపించవచ్చుగానీ, అంతమాత్రాన అది సత్యం కాదు. అది ఒక అభిప్రాయమే, అదైనా దురభిప్రాయం మాత్రమే. బాహ్యారూపం ఆధారంగా వచ్చే పరిజ్ఞానం ఎప్పటికీ సత్యం కానేరదు.

దీనికి ఒకే ఒక పరిష్కారం. నీలో వెలుగులను అన్వేషించాలి. ఆత్మజ్యోతిని దర్శించుకోవాలి. అది నీ కోసం వేచి వుంటుంది.

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకట్రామ శాస్త్రి

(*CWM* Vol. 14, p. 357; Vol. 10, pp. 23-24)

ఆత్మను కనిపెట్టే విధానము

శ్రీమాత

ఆత్మను శోధించి కనిపెట్టాల్సిన మాట నిజమే – అది ఎలా చేయాలనేదే ప్రశ్న. నువ్వు దానిని కాంక్షించాలి. నిత్యము దానినే స్మరిస్తూ మననము చేసుకుంటూ వుంటే అది నీ హృదయాంతరాలలోంచి బయటికి రాక ఏమవుతుంది?

– సంపాదకుడు

మొదటి షరతు: దైవం కోసం తహతహలాడాలి. దీనినే ఆకాంక్ష అంటారు.

రెండవ షరతు: ఎప్పటికప్పుడు నిప్పు మీద నివురును తొలగించినట్లు నీ ఆకాంక్షను తాజాగా, సజీవంగా ఉంచాలి.

అంటే నిరంతరం నీవా ప్రయత్నంలోనే ఉండాలి. ఏమరుపాటు పనికిరాదు. నీ దృష్టంతా దైవం మీదనే నిలపాలి. దైవేచ్ఛను సమగ్రంగా పాటించాలి. దైవకార్యమును నెరవేర్చుటకే పూర్తిగా అంకితమైపోవాలి. నీ మనస్సులో ఏమరుపాటు అసలు పనికిరాదు.

నీ దృష్టినంతా హృదయంలోకి సారించాలి. అందులోకి ప్రవేశించు. లోపలికి చొరబడు. ఎంత లోతుకి వెళ్లగలిస్తే అంత లోతుకు చొరబడు. పరిపరివిధాల పరిగెత్తే నీ ఆలోచన లన్నిటినీ మూట కట్టుకొని నీ అఖాతాలలోకి దుముకు.

నీ హృదయాంతరాళములలో ఒక అగ్ని జ్వలిస్తూంటుంది తెలుసా? అది నీలోని దైవము – నీ నిజస్వరూపమదే. నువ్వు దానిని వినిపించుకోవాలి. దాని ఆదేశములను పాటించాలి.

*

నీ ఆత్మను కనిపెట్టేందుకు నువ్వీ విధంగా చెయ్యాలి. (ఉపరితల చేష్టలు, వ్యాపారముల నుండి వెనుదిరిగి లోపలికి వెళ్లాలని చేతులతో సూచన). అంటే నీ పైపై ఆలోచనలు ఎందుకూ పనికి రావు. *లోలోతులకి, ఇంకా లోతైన అగాధములోకి ప్రవేశించాలి.* అప్పుడక్కడ ఒక విధమైన వెచ్చని ప్రశాంతమైన గొప్ప తత్త్వముంటుంది. అది మధురము, అచంచలము, పూర్ణము – నీ ఆత్మే.

మొండి పట్టుదలతో, పట్టు వదలని విక్రమార్కుడిలా కదలకుండా అలాగే ఉన్నావనుకో. అప్పుడు నీ అగాధాలలోకి వెళ్లి రత్నమాణిక్యాలను దర్శించినట్లు, ఓ అద్భుతమైన అనుభూతి కలుగుతుంది. ఆ నిశ్చలమైన తటాకోపరి తలములో ప్రతిబింబించినది ఆ నిత్యుడే. అప్పుడు నువ్వు కాలాన్ని దాటి కాలరహితమైన స్థితికి చేరుకుంటావు.

*

అయితే ఈ అన్వేషణ కోసం నువ్వెంతో పరిశుద్ధమైన ఆకాంక్షతో నిరంతరంగా ఆత్మార్పణ చేసుకుంటూ పోవాలి. సుదీర్ఘమైన సాధన తరువాతే నువ్వా స్థితికి చేరుకోగలవు.

*

చైత్యపురుషుణ్ణి కనిపెట్టడం అంత తేలిక కాదు. అసలు చైత్యపురుషుడనే వాడొకడున్నాడని నీకు గట్టి నమ్మకం ఉండాలి. నువ్వు వానిని ఒక్కసారైనా చూసి ఉండాలి. నీ జీవితాన్ని దానిచే మాత్రమే నడిపించాలి; అది నిర్దేశించిన మార్గములోనే నడవాలి. నిరంతరం నువ్వు దానిని సంప్రదిస్తూ దానినే మార్గదర్శిగా ఎంచుకోవాలి[1].

*

---

[1] చైత్యపురుషుడు తనంతట తానుగా, నిన్ను వత్తిడి చేయడు. నువ్వే అతనిని ఒక్క క్షణం ఏమరుపాటు లేకుండా ఆహ్వానిస్తూ ఉండాలి.

చైత్యపురుషుడు నీలోని దైవాంశమన్న మాట నిజమే కాని నీకు నీకా విషయం తెలియదు గదా. అసలు నీలో ఆ చైత్యపదార్థ మున్న మాటే తెలియదు! కొంచెమైనా దాంతో సంబంధ మేర్ప రచుకొని నీలో దానిని పెంచుకోవాలంటే నీ దృష్టిని ఆ చైత్యము వైపే మళ్లించాలి. *దానిని తెలుసుకోవాలనే ఆకాంక్ష, దానిని గుర్తిం చాలనే తహతహ తప్పనిసరి. అది కూడ చాలదు. దానినే నీ ప్రాణంగా చూడాలి.*

అప్పుడు నీకు కొన్ని సూచనలు రావచ్చు. వాటిని నువ్వు గుర్తించి తప్పకుండా అనుసరించాలి. చైత్యపురుషుడు నీలో పెర గటమనేది చాలా గొప్ప విషయము. అలా జరగాలంటే నువ్వు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నిరంతరం తీవ్రమైన ఆకాంక్ష నీలో జ్వలిస్తూ వుండాలి. *లోపల చాలా ప్రశాంతంగా వుండాలి. ఆ ప్రశాంతతను ఎట్టి పరిస్థితులలోను పోగొట్టుకోకూడదు.*

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(CWM Vol. 3, p. 1; Vol. 9, p. 310; Vol. 4, p. 244; Vol. 15, p. 323; Vol. 16, p. 224)

భావచిత్రాల సహాయము

శ్రీమాత

ఆత్మశోధన చేయాలి గాని ఈ శోధనను ఎలా చేయాలో తెలియదే. నువ్వొక సింహద్వారము ముందర కూర్చున్నావనుకో. దానిని తెరవాలనే ఆకాంక్షతో ధ్యానం చేసినపుడు ఆ ధ్యానము ఎంతో అర్థవంతమవుతుంది; అదే పనిగా కొనసాగించినపుడు, ఆ ద్వారబంధము పటాపంచలై నువ్వు అవతలవైపు వెలుగులోకి వెళ్లగలుగుతావు. — *సంపాదకుడు*

ప్రశ్న: చైత్యపురుషుని బహిరాగమన మనగా నేమి?

చైత్యపురుషుడు ఒక ఇనప్పెట్టెలో బంధించబడి వున్నట్లుగా నీకు తోస్తుంది. ముఖ్యంగా సాధన చేస్తున్నప్పుడు మొదట్లో చైత్య పురుషుడు నిర్బంధింపబడి వున్నట్లు, అందుకని బయటకు వచ్చి నీకు తెలిసేందుకు వీలులేనట్లు అనిపిస్తుంది. అంతేకాదు ఒక పెట్టెలో బిడాయించ బడినట్లో లేక నాలుగు గోడల మధ్య నిర్బం ధింపబడినట్లో, ఆ తాళాన్ని లేక తలుపును బద్దలు కొడితేగాని లోపలికి ప్రవేశించ లేవనిపిస్తుంది. నువ్వా తలుపును బద్దలుకొట్టి తెరచినట్లయితే, లోపల వున్న చైత్యపురుషుడు బయటకు వచ్చి, నీ బాహ్యాజీవితంలోకి కూడ ప్రవేశిస్తాడు. ఇలాంటి ఊహాచిత్రా లతో మనం చైత్యపురుషుణ్ణి ఆవిష్కరింపజేసుకోవాలి. ప్రతి వాళ్లు ఒకే విధంగా ఊహించుకోవలసిన పనిలేదు. వారి వారి స్వభా వాన్నిబట్టి ఎవరికి నచ్చిన రీతిలో వారు వూహించుకోవచ్చు.

సాధారణంగా సాధకులకు ఈ విధమైన దృశ్యాలు కన పడటం, అనుభూతులు కలగటం మామూలే. ఉదాహరణకు నువ్వు నీ అంతరాంతరాల్లోకి ప్రవేశించి అగాధాలలోకి దిగి అక్కడ నీ చైత్యజీవుణ్ణి చూసినప్పుడు నువ్వొక లోతైన బావిలోకి దిగినట్లుగా వుంటుంది.

నీకేదో అనిపిస్తుంది. అప్పుడు నీకొక వెలుగు కనపడి దర్శనానుభూతి కలిగిందనుకో. నీకలా అనిపించటం, దాని వలన అలాంటి అనుభూతి కలగటం, ఈ రెండింటికి ఒక సంబంధ మేర్పడి మళ్లీ మళ్లీ పునరావృతమౌతూ వుంటుంది. నీ దర్శనా నుభూతి కూడా ప్రగాఢమౌతూ వుంటుంది.

నీ అంతర్జీవిని కనిపెట్టి నీలోని వివిధ భాగములను అన్వే షిస్తున్నప్పుడు చాలా లోతుగా వెళ్లి ఒక పెద్ద హాలులోకో, గది లోకో ప్రవేశిస్తున్నట్లనిపిస్తుంది. ఆ రంగును, ఆ వాతావరణాన్ని బట్టి నీ శరీరంలోని ఏ భాగాన్ని దర్శిస్తున్నావో నీకు తెలిసిపో తుంది. ఇంకా ఒక గదిలోంచి, మరొక గదిలోకి వెళ్లటం, తలు పులు తెరచి లోతైన సొరంగములలోకి ప్రవేశించిన అనుభూతులు కలుగుతుంటాయి. ఈ అంతరంగిక దర్శనాలన్నీ తరుచుగా రాత్రిళ్లు

కలుగుతూంటాయి. అప్పుడు ఆ అనుభూతి ఇంకా ప్రగాఢమై, కలలో నీకు చాలా పరిచితమైన ఒక ఇంటిలోకి వెళ్ళినట్లే వుంటుంది. ఆ దృశ్యములో, నీ ఆంతరంగిక పరిస్థితి తమాషాగా ప్రతిబింబితమవుతుంది. తికమకగా, కలగాపులగమైనట్లు, విరిగి పోయిన వస్తువులన్నీ చిందర వందరగా పడివున్నట్లు అనిపిస్తుంది. మరికొన్ని సమయాలలో అంతా సక్రమముగా వుండి, ఎక్కడ ఉండవలసిన వస్తువులు అక్కడే వుండి, చక్కగా అలంకరించిన గృహమువలె వుంటుంది. తమాషా ఏమిటంటే నీకెప్పుడూ అదే యిల్లు కనబడుతుంది. అది నీ అంతరంగాన్ని ప్రతిబింబిస్తుంది. అంటే నీలోని లోటుబాట్లు ఆ విధంగా నీకు తెలియవస్తాయి.

కాని మేధావుల విషయంలో అలా కాదు. ఎందుకంటే వాళ్ళు ప్రతిదానినీ వారి తార్కికబుద్ధితో ఆలోచిస్తారు. మనస్సులో ఏవేవో ఆలోచించుకొని చాల గొప్పగా పురోగమిస్తున్నా మను కుంటారు. కాని అదంతా ఒట్టి కల్ల.

అంతా మనసుకు అర్థమయ్యే రీతిలో జరగాలంటే కొన్ని వేల సంవత్సరాలు పడుతుంది. కాని ప్రాణిక, భౌతికాలలో ప్రగ తిని సాధించటం తేలిక. ఈ విధమైన భావచిత్రాలను ఊహించు కోవడంవల్ల అది ఇంకా సులభమవుతుంది. నీవనుకున్న వెంటనే కాకపోవచ్చు. ఎందుకంటే అది నీ స్వభావం మీద ఆధారపడి వుంటుంది. అయితే భావచిత్రాల నూహించుకోవటంవలన కొంత సౌలభ్యం అవుతుంది.

అదే విధంగా, ధ్యానం చేసేటప్పుడు 'నీవొక ఇనుప తలుపు ముందర కూర్చొని అది తెరుచుకోవాలి, నీవు అవతలి వైపుకు వెళ్ళాలి' అనే భావమును మనసులో నిలుపుకొని ధ్యానించావనుకో – అపుడు ఏమౌతుంది? నీ బుద్ధి అంతయు, మనస్సు అంతయు, ఆకాంక్ష అంతయు ఆ ఒక్క విషయము మీదనే కేంద్రీకరించిన ప్పుడు నీవా తలుపును బలంగా తోసి తోసి బద్దలుకొట్టినట్లు అవుతుంది. అప్పుడు ఆ తలుపు పటాపంచలైపోయి నీవవతలి వైపుకు వెళ్ళిపోతావు. ఆ అనుభూతి ఎంత గాఢంగా వుంటుందో చెప్పలేను. నువ్వు పూర్తిగా వెలుగులో నిమజ్జనమైనట్లే లెక్క. నీ

చేతనాస్థాయి పూర్తిగ మారిపోయి, నీవు పరవశించిపోతావు. ఇంకా చెప్పాలంటే నీవు ఇంకో మనిషివి అయినట్లుగా వుంటుంది. నీ చైత్యపురుమని ఆవరణలోకి ప్రవేశించేందుకు ఇది చాల చక్కటి మార్గము.

*

సంకేతము		*శ్రీమాత చెప్పిన లక్షణము*
లేడి	...	సాధుత్వము, చురుకుదనము
గుఱ్ఱము	...	మనిషిని అదుపుచేయుట (కళ్ళెము వేయుట)
మేకపిల్ల	...	విశుద్ధత (purity)
అడవిపంది	...	కోరికలు

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 7, pp. 270-72; Vol. 15, pp. 41-42)

సాధన విధానము

శ్రీమాత

సాధన వేరు, నిత్యజీవితం వేరు. సాధనలో ఒక్కొక్కప్పుడు ఒక మెరుపు మెరిసినట్లుగా అవుతుంది. అంతే, ఆ ఒక్క క్షణంలోనే నీకు చాలా గాఢానుభూతి కలిగి కడుపు నిండిపోతుంది. నీ మీద చెరగని ముద్ర పడుతుంది. దానినే స్మరించుకుంటూ నీ సాధనా మార్గంలో నడిచి పోగలవు. — సంపాదకుడు

సాధన చేసేందుకు చాలా ఓర్పు కావాలి. ఎందుకంటే ఒక్కొక్కప్పుడు ఫలితం కనబడినట్లే వుండి మళ్లి మాయమై పోతుంది. చాలా విసుగు పుడుతుంది. అయితే నేమి! ఉన్నట్లుండి ఒక్క మెరుపు మెరుస్తుంది. అలా ఎప్పుడు జరుగుతుందో, ఎందుకు జరుగుతుందో తెలియదు. ఒక్కొక్కళ్లకు ఒక్కొక్క విధమైన అనుభూతి కలుగుతుంది. ఒక్క క్షణమైనా ఆ అనుభూతి నీ ప్రాణంతోటి

సమానము. నీ మనసులో అదే తారాడుతూ వుంటుంది. నువ్వు ఆ అనుభూతినే మళ్ళీ మళ్ళీ నెమరు వేసుకుంటూ, ఆకాంక్షిస్తూ ధ్యానమంతా దాని మీదనే నిలుపుతావు. ఆ విధంగా నీకు మార్గం ఆవిష్కారమవుతుంది. ఎవరికైతే వారి అంతర్జీవిని, నిజ స్వరూపాన్ని దర్శించాలని విధివ్రాత ఉన్నదో అట్టి వారికి వారి జీవితంలో ఒకానొక క్షణంలో మెరుపు మెరిసినట్లుగా మెరిసి వారికి ఆ అనుభూతి కలుగుతుంది. అంతే, వారికి ఇక ఎటువంటి బెడద లేదు. ఎదురుగుండా మార్గం ఆవిష్కారమౌతుంది. ఆ మార్గానికి తలుపు కూడ కనబడుతుంది. ఇక నీవు నిష్ఠగా సాధన చేసి ఎలాగైనా సరే, ఆ తలుపును తెరుచుకొని ఆ దారిలో నడవాలి.

ఎంతోమంది ఆచార్యులు ఎన్నో పద్ధతులను సూచించి ఉండవచ్చు. బోధించి ఉండవచ్చు. బహుశః నీవు వాటిని పుస్తకాలలో చూసి ఉండవచ్చు కూడ. అయితే నీ అంతట నీకు కలిగిన అనుభూతే వీటన్నిటికంటె ఎక్కువ విలువైనది. అంతేగదా మరి! నీ ఆత్మ వికసించినపుడే నీ వెవరవో నీకు తెలుస్తుంది. నీ చైత్యపురుషుణ్ణి ఒక్క క్షణమైనా దర్శించినప్పుడే నీ కడుపు నిండిపోతుంది. ఈ విధంగా నీవు అవలంబించవలసిన మార్గం ఆవిష్కారమవుతుంది. అనుకోకుండా ఏ క్షణంలోనైనా నీకా మహానుభూతి కలుగవచ్చు. రాత్రి కలలో కావచ్చు. అకస్మాత్తుగ నీవెక్కడికో వెళ్ళిపోతావు. నీవేదో వింటావు. ఒక అందమైన దృశ్యాన్ని చూస్తావు. కంటికి ఇంపైన, వినసొంపైన సంగీతాన్ని వింటావు. లేకపోతే నీవు చదివిన ప్రవచనాలు నిన్ను గాఢంగా ప్రభావితం చేస్తాయి. లేదా నీ తపన శిఖర స్థాయిని అందుకుంటుంది. ఏదో విధంగా నీకొక అనుభూతి కలగనూ కలుగుతుంది. అప్పుడే నీ మార్గం కూడ ఆవిష్కారమవుతుంది.

నువ్వు నిన్ను ఎంతో జాగ్రత్తగా పరిశీలించుకుంటూ వుండాలి. నీకు బాగా నచ్చిన విషయము ఏదైనా కనిపించినపుడు – అదొక సాహసకృత్యమే కావచ్చు. దాతృత్వము, త్యాగము, వీరత్వము ఏదైనా ఒక ఘనమైన మనిషినిగాని, ఘనకార్యాన్నిగాని,

అద్భుతమైన విషయాన్నిగాని చూసినప్పుడు నీలో ఉత్సాహం పొంగిపొరలి కృతజ్ఞతా భావము కట్టలు తెంచుకొని పొర్లిపోయి నపుడు *నీలో నుంచి నీ ఆత్మ మనస్సును ఛేదించుకొని బయ టకు వచ్చేస్తుంది.* అప్పుడా నూతన చైతన్యము, ఆ జ్యోతి, ఆ ఆనందము వర్ణనాతీతములు. నువ్వు అప్పుడు దానిని పట్టుకొని మళ్లీ నీ పయనాన్ని కొనసాగిస్తావన్న మాట.

కాబట్టి మొదట నీ చైతన్యంలో మార్పు అవసరమని నీ కనిపించాలి. 'ఇదే నా మార్గము, ఇదే నా గమ్యము' అని ఎప్పు డైతే నువ్వు గట్టిగా నమ్ముతావో అప్పుడిక నీకు మార్గము కన డుతుంది. దొరికినప్పుడు ఎట్టి సంశయము లేకుండ దాని మీద నడవాలి. అంతే.

నేను చెప్పేది జాగ్రత్తగా విను. నిన్ను నీవు నిరంతరం పరిశీలించుకుంటూ వుండాలి. గాలికి బ్రతికినట్లుగా అగమ్య గోచ రంగా వుండకూడదు. ఏమరుపాటు పనికిరాదు.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 8, pp. 403-05)

చైత్యపురుష స్పర్శకు రెండు ద్వారములు

శ్రీమాత

మన చదువు, తెలివితేటలు మనను మన ఆత్మనుండి దూరం చేస్తాయి. పల్లెటూరి వాళ్లు, జానపదుల విషయంలో అలా కాదు. వారి దృష్టి, ఆలోచనలు ఎప్పుడూ రుజువుగానే వుంటాయి. వారు ప్రకృతి బిడ్డలు, కల్ల కపటం ఎరుగనివారు. నువ్వు కూడ ప్రయ త్నించి అలా ఉండేందుకు ఎందుకు ప్రయత్నించకూడదు? ప్రాతః కాలమున లేచి ఉషస్సును చూసి ఆనందించు. ఆకాశం, చెట్లు చేమల అందాన్ని ఆస్వాదించు. దైవానికి కృతజ్ఞతామయ మైపో.

— సంపాదకుడు

మనకు తెలిసినది మనస్సు మాత్రమే. అంతరంగంలోని చైత్యశక్తిని గురించి తెలియదు. అయితే ఈ రెండింటికి మధ్యన చైత్యోన్ముఖ మైనది, మనస్సుకంటె గొప్పది అయిన మరో వస్తువున్నది.

అది అందరిలోను ఒకే రీతిగా వుండదు. మనుమలు వేర్వేరు స్వభావములు కలిగి వుంటారు కదా. దానిని బట్టి, వారి ప్రకృతి లోని ఒకానొక లక్షణము ద్వారా వారు చైత్యమును స్పృశించి దాని ప్రభావమును పొందగలుగుతారు. అది మనుమల మీద ఆధారపడి వుంటుంది – అనగా వారి వారి అభిరుచులు, తీరు తెన్నులనుబట్టి వుంటుంది.

కొన్ని దృశ్యాలను చూడగానే నీలో ఉత్సాహం పొంగి పొరలి గొప్ప విషయాల వైపు నీ కవాటములు తెరచుకొనును. అనగా కొన్ని విషయాలపట్ల నీకు అపరిమితమైన ఉత్సాహముం టుంది. అటువంటి ఉత్సాహము కలగటం చాల ముఖ్యమైన విష యము.

ఈ సందర్భంలో రెండు విషయాలు గమనార్హములు. మొద టిది – మూసుకొని పోయివున్న నీ ఆత్మ జాగృతమై ఉత్సాహంతో గంతులు వేస్తుంది. ఉదా: ఒక కళాకారు డుంటాడు. కళలంటె అతనికి ప్రాణం. శాస్త్రజ్ఞుడు ప్రయోగాలు చేసినప్పుడు మైమరచి పోతాడు. ఆ క్షణంలో ఆ ఉత్సాహంవలన అతనిలోని ద్వారాలు తెరచుకొంటాయి. ఆసాంతం అతని ప్రకృతి పులకితమైపోతుంది.

మరి కొంతమందిలో అణకువ, కృతజ్ఞతా భావము పొంగి పొరలుతూ వుంటాయి. వారికేమాత్రము మేలు జరిగినా కృతజ్ఞతా మయమై పోతారు. అట్టి వారు చిన్న చిన్న విషయాలపట్ల గూడా ఎంతో సంతోషము, ఆర్ద్రత, కృతజ్ఞతలతో – 'ఆహా జీవితం ఎంత గొప్పది, నేనెంత అదృష్టవంతుణ్ణి, భగవత్ కృప ఎంత అమోఘ మైనది, దేవుడెంత గొప్పవాడు' అనే భావాలతో పొంగిపొరలి పోతూ వుంటారు.

నాకు కొంతమంది అతి సాధారణమైన, అమాయకంగా వుండే వెర్రిబాగులవాళ్లు, పెద్దగా చదువులేని వాళ్లు – కాని కృత

జ్ఞతతో, నిరంతరం సమర్పణా పూరితమై వున్నవాళ్లని గురించి తెలుసు.

తమాషా ఏమిటంటే చైత్యపురుష సంపర్కము ఎప్పుడూ అట్టి వారికే కలుగుతూ వుంటుంది. దాని ప్రభావమువలన వారు ఎప్పుడూ బరువు బాధ్యతలున్నట్లుగ కనపడరు. తేలికగా ఉంటారు. ఎప్పుడూ బెదిరిపోరు. భగవంతుడే వాళ్ల నెత్తుకుని, వారి జీవయాత్ర కొనసాగిస్తున్నాడా అనిపిస్తుంది.

కాబట్టి ఉత్సాహము, కృతజ్ఞత – ఈ రెండు నిన్ను నీ చైత్యపురుషుని దగ్గరికి తీసుకొనిపోయే రెండు మంత్రాలు. నీ లోని ఆర్ద్రత, ఉత్సాహము నీ దుఃఖాలన్నిటికి కారణమైన అహం కారమును బహిష్కరించ గలవు. ఆ తరవాత నీలో విశాల భావము, ఉదారత, కృతజ్ఞతా భావమూ ఉండాలి. నీ చైత్యపురు షునితో సంపర్కము చెందుటకు ఈ రెండూ చాల ముఖ్యమైన లక్షణములు.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, లక్ష్మీప్రసాదమ్మ

(*CWM* Vol. 7, pp. 422-24)

బాహ్యమానవుడు ప్రకృతి చేతిలో ఒక కీలుబొమ్మ. కాని నీ లోని అంతర్జీవి నీ జీవితాన్ని సన్మార్గంలో నడిపించగలడు.

శ్రీమాత

ఆత్మ పలుకులను వినుట – ఆత్మ దర్శనమును పొందుట

శ్రీమాత

ఆత్మకనేక విషయాలు తెలుసు. అయితే ఆ ఆత్మను ఎలా తెలుసుకోవాలనేదే ప్రశ్న. నీ ఆత్మ నీలోనే మాట్లాడుతూ ఉంటుంది గనుక, నువ్వు నీ మనస్సుయొక్క నోరు కట్టేసి నిదానంగా చెవి యొగ్గి విను. అదిగో, అదే నీ ఆత్మ పలికే భాష.

– సంపాదకుడు

నీ ఆత్మకు అనేక విషయాలు తెలుసు. కాని నీకు తెలియవు. తెలుసుకోవాలంటే నువ్వు దాని కోసం అంతఃసాధన చేయాలి. ఆత్మ పలికే భాష వినాలంటే నువ్వు చాల జాగ్రత్తగా చెవులొగ్గి వినాలి. ఎందుకంటె నీ మనస్సు కాకిగోల చేస్తూ వుంటుంది కదా. నీ ప్రాణికము కోరికలతో నీ ప్రాణం తీస్తూంటుంది. ఇంత గందరగోళం మధ్య నీ ఆత్మ పలుకులు వినపడే ప్రశ్నే లేదు. *నువ్వు ఎంతో నెమ్మదిగా, ప్రశాంతంగా ఉన్నప్పుడుగాని అది వినపడదు.* నీ ఆత్మ అతిమెల్లగా మాట్లాడుతుంది కనుక, నువ్వెంత ప్రయత్నించినా నీకు నీ మనోప్రాణికాలు కూసే పిచ్చికూతలే వినపడతాయి. వాటినే నీ ఆత్మ పలుకులని పొరపడతావు కూడ. ఆ తరువాత గాని నువ్వా పొరపాటుని గ్రహించలేవు. ఎందుకంటె ఆత్మ 'నా మాటే వినాలి' అని నీ మీద పెత్తనం చెలాయించదు, నిన్ను బలవంత పెట్టదు.

నీ జీవితంలో ప్రతి క్షణము ఏదో ఒక సమస్య వస్తూనే వుంటుంది. నువ్వు సందిగ్ధంలో పడిపోతావు. అప్పుడేమవుతుంది? నీ మనోప్రాణికాలు ముందుకు వచ్చి వాటి వాదనలను నీమీద గుప్పించి వాటి అభిప్రాయమే న్యాయమని నిన్ను నమ్మిస్తాయి. నువ్వు ఎంతో మెలకువతో వుండి క్రమశిక్షణ కలిగి నిన్ను నీవు అదుపు చేసుకుంటే తప్ప, అవి చెప్పేదే నిజమని చెప్పి నిన్ను వాటి

వైపే తిప్పుకుంటాయి. ఎంత గోలచేస్తాయంటే 'అలా చేయవద్దు' అని నీ ఆత్మ ఎంత మొత్తుకున్నప్పటికి నువ్వు వినిపించుకోవు.

ఈ విధంగా 'అలా చేయవద్దు' అని ఎంత చెప్పినా నువ్వు వినిపించుకోకుండా, నీకు బుద్ధి పుట్టినట్లే నువ్వు చేస్తావు. కాని అసలు నైజమేమిటో తెలుసుకోవాలని, అదే విధంగా నడచుకోవాలని ఎప్పుడైతే నువ్వు తీర్మానించుకుంటావో అప్పుడే నువ్వు ఆత్మ పలికే భాషను, అంతకంతకు సరిగ్గా వినిపించుకో గలుగుతావు. అప్పుడు నీకు కాస్త విచక్షణాశక్తి అబ్బినట్లే! నీ కెంత కష్టమైనా సరే, బాధ కలిగినా సరే, ఆత్మకు విధేయమై పోవటం నువ్వు నేర్చుకుంటావు. ఒకసారి అలా జరిగినట్లయితే ఆ తరువాత రెండవసారి నీకది చాల తేలికై పోతుంది. ఆత్మవాణి ఏదో, అనాత్మవాణి ఏదో సులభంగా గుర్తించగలుగుతావు. నీలో ఈ విచక్షణాశక్తి పెరిగినప్పుడు నువ్వు గమ్యాన్ని చేరుకో గలుగుతావు కూడ.

కాని నువ్వు ఏమాత్రం తొందరపడ కూడదు. విసుగు పనికిరాదు. ఒకసారి సరిగ్గా చేస్తే పదిమాట్లు తప్పు చేయవచ్చు. అయినా ఏమాత్రం నిస్పృహ చెందకూడదు. దైవానుగ్రహము నిన్ను వదలకుండా కాపాడుతూనే ఉన్నప్పుడు ఇక నీకు బెడద ఎందుకు?

చివరగా నేను చెప్పేది ఇది. దేనిని గురించైనా సరే, అసలు నైజము తెలుసుకోవాలంటే మొదట నువ్వు నీ ఆత్మతో ఐక్యమవ్వాలి. ఆ తరువాత కూడ ఆ ఐక్యతను అలాగే నిలబెట్టుకోవాలి.

నువ్వు నీ దృష్టిని లక్ష్యం మీద ఎంత తీవ్రంగా కేంద్రీకరిస్తే అంత త్వరగా నీ గమ్యాన్ని చేరుకోగలవు.

*

నువ్వు నీ సంవేదనలను (feelings) నీ చైత్య (psychic) సంబంధితాలని పొరపడేవు జాగ్రత్త. ఈ రెండూ రెండు పూర్తిగా భిన్నమైన విషయాలు. ఈ ఆవేదనలు, ఆవేశాలు కల్గినప్పుడు అందరు వారి ఆత్మకి దగ్గరౌతున్నారని అనుకుంటారు. కాని వాటికి, ఈ

ఆత్మకు ఏమాత్రం సంబంధము లేదు. అవన్నీ వట్టి ప్రాణికావేదనలు మాత్రమే. ప్రాణికంలోని అతి సూక్ష్మవిషయాలే కావచ్చు – కాని ప్రాణికాలే. వాటి ద్వారా నువ్వు నీ చైత్యాన్ని (psychic) అందుకోలేవు. గాఢమైన ఆకాంక్ష, ఆత్మ సంయనము ద్వారానే దాని నార్జించగలవు.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 10, pp. 24-26; Vol. 7, p. 253)

ఆత్మ దర్శనానికనేక మార్గములు

శ్రీమాత

"నీలోని ఆత్మను దర్శించి దానితో ఏకమయ్యేందుకు అనేక మార్గములను ప్రవచించి యున్నారు. బుద్ధితో చేయవలసినవి కొన్ని, మతలాంఛనాలు కొన్ని, మరికొన్ని కేవలం యాంత్రికాలు. నిజం చెప్పాలంటే ప్రతి వాళ్లు వాళ్లకి నచ్చిన మార్గాన్నెంచుకోవాలి. నీలో తీవ్రమైన ఆర్ద్రత, నిశ్చయమైన ఆకాంక్ష, గట్టి పట్టుదల, క్రియాశీలమైన బుద్ధి ఉన్నట్లైతే నీ ముందర ఏదో విధంగా మార్గము తప్పకుండా ఆవిష్కారమవుతుంది. పుస్తకాలు చదవడం ద్వారానే కావచ్చు, లేదా ధ్యానములోనో, అంతరంగిక శ్రవణానుభూతుల ద్వారానో నీ లక్ష్యాన్ని చేరుకొనేందుకు అవసరమయిన సూచనలు ఏదో విధంగా నీకు వచ్చి తీరుతాయి."

– *శ్రీమాత (The Science of Living)*

యాంత్రిక, మతపరమైన, భౌతికవిధానాల మధ్య తేడా ఏమిటో తెలుసుకోవాలని ఉందా. మతాలు చెప్పే విధానాలు కేవలం మత దర్శనాలు. నిజమైన ఆత్మను గురించి చెప్పే మతాలు చాలా తక్కువ. వాళ్ల దేవుళ్లని చూపించే మార్గాలనే అవి చాటుతాయి.

ఇక భౌతిక మార్గాల సంగతి – నీలో అనేక చేతనా స్తరము లుంటాయి కదా. జీవితం నుంచి వెనుదిరిగి ఆంతరంగికంగా ధ్యానము చేసి, బాహ్యాజీవితాన్ని త్యజించి, అంతరంగిక శోధన జరిపే మార్గాలు – నీ ఆలోచనలోను, సంవేదనలోను మాత్రమే వీటి ప్రభావ ముంటుంది. ఫలితం కూడా అంతంత మాత్రమే.

యాంత్రికమైన పద్ధతులంటే శ్వాసను నియమించుట – ప్రాణాయమము, జపము మొ॥. వీటి వలన వైయక్తికంగా కొంత ఫలితం కల్గవచ్చుగాని విశ్వస్థాయిలో పెద్దగా ఏమీ జరగదు.

మేధా విధానములు (psychological methods) ఎక్కువ కష్టమే కాని వాటి ఫలితము కూడా విశాలమైనదే. నీ మనస్సులో ఎప్పుడూ సత్యమునే ప్రకటించుకుంటూ దానినే అభివ్యక్త పర చాలి. ఏ పనీ చేయకుండా చేతులు కట్టుకుని కూర్చున్నపుడు కళ్లు మూసుకుని నీలో నువ్వే 'ఆహా, ఓహో' అని అనుకుంటావు, పొంగిపోతావు. ఒకసారి బయటకు వచ్చి జీవితంలో అడుగు పెట్టావో నీ బండారం బయట పడిపోయింది.

అందుకనే మనం ఈ ఆశ్రమాన్ని ఒక సుందరమైన వనము లోనో, నిర్జన ప్రదేశంలోనో కాకుండా ఇక్కడే, ఈ ప్రపంచం మధ్యలోనే ఏర్పరచాము. జీవితంలోని వడిదుడుకులన్నీ కూడా మన యోగసాధన పరిధిలోవే. కష్టాలను వదులు కోవడమనేది మన డిక్షనరీలోనే లేదు.

సమస్యల నుండి పారిపోవడం వలన అవి తీరిపోవు కదా. అలా చేస్తే నీ శత్రువుకు నువ్వు లోకువై పోతావు. అతను తప్ప కుండా నిన్ను ఓడించేయ గలడు.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 15, pp. 324-25)

ప్రశ్నోత్తరములు

శ్రీమాత

నీకు నీ చైత్యపురుషుడు కావాలి. నిజమే. నీవు కష్టపడి సాధన చేస్తావు. లోపలేవో కొన్ని కాంతులు కనపడతాయి. వాటిని చూసి నీ ఆత్మ అనుకొని పొరబడతావు. కాని అవి ఆత్మ సంస్పర్శను పొందిన మనో్ప్రాణికాదులు మాత్రమే. నీ చైత్య సంస్పర్శను పొందుట కష్టమే. కాని ఒకసారి పొందినప్పుడు అపరిమితమైన ఆనందాన్ని పొందుతావు. దానిని గుర్తు చేసుకుంటూంటే మళ్లీ ఆ స్పర్శను తేలికగా పొందగలవు. — *సంపాదకుడు*

ప్రశ్న: మధుమయీ! ఉపరితలంలో ఆత్మ ఉంటుందా?

నీ మనస్సులోను, ప్రాణికంలోను క్షుద్రమైన భాగాలే కాకుండా కొన్ని గొప్ప అంశములు కూడా ఉన్నాయి. నీలో ఆత్మ పొంగి పైకి వచ్చినపుడు మొదట ఈ ఉన్నతమైన విభాగ ములకు దాని స్పర్శ సోకి అవి ప్రకాశించడం మొదలు పెడతాయి. వాటినే చూసి, ఆత్మనుకొని, నీవు పొంగిపోతావు. కాని అది నీ నిజమైన ఆత్మ కాదు. ఆత్మ ప్రభావితమైన కొన్ని భాగములు మాత్రమే. కాని ఆ మాత్రానికే పొంగిపోయి పరవశమైపోయి ఏదో గొప్ప సిద్ధిని పొందినట్లనిపిస్తుంది. కొన్నాళ్ల తరువాత అది మాసి పోతుంది. అది అసలు ఆత్మ కాదు కదా! అందుకనే అది మాసి పోతుంది.

*

ప్రశ్న: చైత్యము-చైత్యవ్యక్తి (psychic) ఒకసారి ముందర కొచ్చినపుడు మళ్లీ తెరమరుగై పోవునా?

నిజమే, దీర్ఘసాధనా ఫలితంగా మనిషి పరిపక్వమై తయా రుగా ఉన్నప్పుడు అకస్మాత్తుగా చైత్యాత్మ నిన్నావహించడం, నీ శరీరమంతా పులకరించిపోవడం జరుగుతూంటుంది. కాని అది వెంటనే మాసిపోతుంది. నువ్వు మళ్లి కుయ్యో మొర్రో అంటూ విలపించడం మొదలు పెడతావు. కాని ఏమి పర్వాలేదు. ఒకసారి

చైత్యస్పర్శ కలిగితే, ఇక నీ భౌతికకోశమంతా పవిత్రమైపోయి నట్లే. అంతా వెలుగే. అంతా సంతోషమే. ఇక నీవు తేలికగా ఆకాంక్షించగలుగుతావు. విశ్వప్రయత్నం చేయనవసరం లేదు. రెండవ సారి స్పర్శ కూడా నీకు తేలికగా దొరుకుతుంది. మళ్లీ నువ్వు కూర్చొని ధ్యానం చేయడం, ఆకాంక్షించడం, ఆత్మావిష్కారం కావడం ఒకటేమిటి, నువ్వు రాచబాట మీదే ఠీవిగా నడుస్తూ, దివ్యకాంతులీనే మార్గంలోనే చాలా హాయిగా నీ జీవితం, సాధన గడిచిపోతుంటాయి.

ఇప్పుడు అర్థమయిందా! ఒక్కసారి నీ లోతులను స్పర్శించి నపుడు నీకు మంచి సహాయం లభిస్తుందని. ఆ స్పర్శ నిన్నెన్నటికీ వీడదు.

*

ఒక్కటే మార్గం – నీ చైత్యపురుషుడు ఆవిష్కార మవ్వాలంతే. ఎలాగో తెలుసా! చిన్నపిల్ల వాడుంటాడే, అమాయకంగా (శ్రీమాత గొంతుకను తగ్గించి చాలా మెల్లిగా మాట్లాడుతారు) ఆకాంక్షించు. ప్రార్థించు. అడుగు. ఏమాత్రం భిన్నస్వరాలు లేకుండా మనస్సును *పక్కన బెట్టి, తెలివితేటలను వెనక్కు నెట్టి, నిర్మలమైన మనస్సుతో దైవాన్ని పలకరించు. ఆయనతో మాట్లాడు.*

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 7, pp. 263-64; Vol. 6, p. 33; Vol. 7, p. 41)

నీ ఆత్మను కనిపెట్టేందుకు ఒక్కటే మార్గము. బాహ్య మనస్సు నుండి నీ దృష్టిని మరలించి నీలోని అగాధములలోకి సారించుటయే.

శ్రీమాత

సాధకులకు శ్రీమాత హితవు

శ్రీమాత

చైత్యపురుషుడు చైత్యపురుషుడు అనటమేగాని దానిని ఎలా పట్టుకోవాలో తెలియదు. అది పర్వతారోహణము వంటిది. అంతటి పట్టుదల, ధైర్యసాహసములు వుంటేగాని దొరకదు. కీకారణ్యంలో ఎలాగైతే అడుగు అడుగున చెట్లు, పొదలు కొట్టి బాట నేర్పరచుకోవాలో అలాగే కష్టపడాలి. కాని గమ్యము చేరినప్పుడు శ్రమకు తగ్గ ఫలితమే దక్కింది అనే తృప్తి కలుగు తుంది. అదొక అద్భుతమైన అనుభూతి.

— సంపాదకుడు

నీకు చైత్యపురుషుడు కావాలంటే దానికోసం నడుం బిగించాలి. నిరంతర ప్రయత్నం చేసినప్పుడు నీ ఎదట ఒక మార్గము ఆవి ష్కారమౌతుంది. అది మనస్సు కందనిది, ఎంతో అద్భుతమైన విషయము.

ఒక విషయాన్ని నువ్వు చాల స్పష్టంగా గుర్తించాలి. నీ జీవితమంతా మనస్సుయొక్క శాసనంతో గడచిపోతూ వుంటుంది. కాని నీ కిప్పుడు కావలసినది మనస్సు కతీతము, శరీరానికి అతీ తము, ఈ జన్మ కతీతము – ఒకటేమిటి నువ్వు పుట్టిన కుటుం బము, వాతావరణము మొత్తం దేశకాల పరిస్థితులకు అతీతమైన దినుసును అన్వేషించి పట్టుకోవాలి. అది నీ అగాధాలలో వుంటుంది. నిస్సీమితము, ఆకాశంకంటె విశాలమైనది, అఖండ కాలజ్ఞానము దాని లక్షణమలు.

నేను ముందరే చెప్పాను కదా ఈ మార్గమెంత కష్టమైనదో, దీర్ఘమైనదో – మార్గములో ఎన్నెన్నో అడ్డంకులు, అవరోధాలు. నిర్జనమైన కికారణ్యంలో వెళ్లటం ఎంత కష్టమో ఇది కూడ అంత కష్టమేనని. ఇంతవరకు మనుమలకు తెలియని కొత్త భూభాగాలు లేక ఖండాలను కనిపెట్టటం లాంటిదనుకోండి. నీ చైత్యపురుమణ్ణి

కనిపెట్టేందుకు కూడ అంతటి సహనము, పట్టుదల అవసరం. కొన్ని చిట్కాలు చెప్తా వినండి.

1. ఆధ్యాత్మిక విషయములను గురించి మనస్సుకు తెలియనే తెలియదు. అనేక మంది ఈ విషయాన్ని గురించి రాసారు గాని, ఆచరణలో పెట్టినవారు చాల తక్కువమంది. నువ్వీ మార్గంలో ముందుకు వెళ్లాలంటే *మనస్సును, అది చెప్పే బూటకపు మాటలను, దాని అభిప్రాయాలను ఏమాత్రం నమ్మకూడదు.*

2. భోగభాగ్యాల కోసం గాని, సుఖసంతోషాల కోసం గాని ఆశించటంగాని పనికిరాదు. ఆత్మకోసం తహతహలాడే ఒక జ్వాలవలె వుండాలి. నీకు జరిగే ప్రతి సంఘటన నీ మంచి కోసమే, నీ ప్రగతి కోసమే అన్న విషయాన్ని గుర్తించి, వెంటనే ఆ ప్రగతిని సాధించాలి. (Be only a burning fire for progress, take whatever comes to you as an aid to your progress and immediately make whatever progress is required)

3. ప్రతి పని సంతోషంగా చేయాలి. కాని సుఖం కోసమే చేయకూడదు.

4. *ఎప్పుడూ నెమ్మదిగా ప్రశాంతంగానే వుండాలి.* ఆవేశంతో గంతులు వేయకూడదు. అన్ని పరిస్థితులలోను ప్రశాంతంగా వుండాలి. ప్రగతి ఎటుల సాధించాలో మెలకువతో కనిపెట్టి, జాగుచేయక వెంటనే ఆ ప్రగతిని సాధించాలి.

5. బాహ్య సంఘటనల మంచి చెడులను మనసుతో బేరీజు వేయరాదు. వాటి ద్వారా ప్రకటితమయ్యే సత్యము నీ చర్మచక్షువుల కర్థంకాని విషయము.

6. ఎవరినీ తప్పు పట్టకూడదు. ఎవరిని గురించి ఫిర్యాదు చేయవద్దు.

7. ఈ మహాప్రస్థానంలో ఇది చిన్నది, అది పెద్దది అనే దృష్టి పనికిరాదు. నువ్వు మేరు పర్వతాన్ని ఎక్కదలుచు కున్నావు. *నువ్వే పని చేసినా కూడా, ఎంత చిన్నదైనా కూడ, అది ఆ పర్వతారోహణానికి ఒక సోపానమే అనే విషయము మరచిపోకూడదు.*

8. నీ నిద్రాహారములను కూడ అదే ఆకాంక్షతో, ఆ వుద్దే శంతోనే అనుభవించాలి.

9. నువ్వొక పని చేస్తున్నప్పుడు అది నీ సాధనను దృఢ పరచేటట్లు వుండాలి.

10. నువ్వు మాట్లాడేడప్పుడు కూడ అంతే. నీ మాటలను వృథాపరచకూడదు. నీ ప్రగతికి సహాయపడే మాటలనే మాట్లా డాలి. హానికరమైన కూతలు కూయకూడదు.

11. పైన ఏకరువు పెట్టిన వాటిని బట్టి ఓ విషయం స్పష్ట మవుతోంది కదా. నీ జీవితానికి పరమ లక్ష్యమొకటి వున్నది. నువ్వెక్కడ, ఎప్పుడు ఏ పని చేస్తున్నా ఆ లక్ష్యము సూర్యునివలె నీ మీద ప్రకాశిస్తున్నది అనే విషయము మరచిపోకూడదు.

ఇంతటి నిష్ఠతో చేసిన మహాయజ్ఞము వృథా కాదు. నీ లోపల ఒక ద్వారము తెరచుకొని దేదీప్యమైన వెలుగులోకి ప్రవే శిస్తావు. నువ్వు చిరంజీవివని, ఎప్పుడూ బ్రతికే వున్నావని, నువ్వు దాల్చిన జన్మలన్నీ కేవలం నువ్వు ధరించి, విసర్జించిన వస్త్ర ములే అని తెలుసుకుంటావు. ప్రకృతి శృంఖలాలు నిన్ను ఇక బంధించజాలవు. నువ్వు తలెత్తుకొని ధైర్యంగా నడవగలవు.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 12, pp. 32-35)

నీకు ఆత్మ కావాలంటే నడుం బిగించి ఆ ప్రయ త్నాన్ని వెంటనే మొదలు పెట్టాలి.

శ్రీమాత

ఆత్మ శోధన – దాని ఆవశ్యకత

శ్రీఅరవిందులు

నువ్వు నీ అహంకార శృంఖలాల నుండి విముక్తమై, నీ నిజ స్వరూపమును కనిపెట్టటం నీ ప్రథమ కర్తవ్యము. ఒకసారి దీన్ని సాధించావో మిగిలినదంతా తప్పనిసరిగా జరిగే పర్యవసానమే. అందుకనే నువ్వు ఆధ్యాత్మిక పిలుపును వినిపించుకోవాలి. మేధో పరమైన నైతిక, సామాజిక వ్యవహారాలన్నీ అజ్ఞానానికి జెందినవే కదా! ఆధ్యాత్మికం ముందర ఇవన్నీ తృణప్రాయములే. మొదట నీ ఆత్మను కనిపెట్టాలి. అనగా నీ ఆలోచనలకు, ఆవేశాలకు, కామ నలకు మూలమైన కామాత్మను కాదు. మనకు కావలసినది దైవాంశమైన నిజాత్మ. అప్పుడు నీలో ఒక పరివర్తనం వస్తుంది. నీ మీద ఆత్మ ఆధిపత్యం వచ్చినప్పుడు ఇక నీకెట్టి బెడద వుండదు. ఇక నీ మనస్సు, శరీరము, జీవితము అదివరకు మాదిరిగా ఉండవు. ఆత్మయొక్క ఉపకరణములుగా వాటి పాత్రను నిర్వహిస్తాయి. అప్పుడు మనలో దీపించే భానుడు మనకు ప్రత్యక్షంగా కనబడతాడు. ఈ జీవితంలోని నిజమైన సత్యసౌందర్య ఆనందములు ఆయనకు తెలుసు. మన బుద్ధిని, హృదయమును శాసించి ఆధ్యాత్మికంగా మనను పరిపూర్ణ జీవితాన్ని అనుభవింపచేస్తాడు. ఈ మనసు, హృదయము, జీవితము, ప్రాణికముల మాలిన్యాలను కడిగివేసి మన నిత్యకృత్యమైన ఈ అజ్ఞానమయ జీవితాన్ని గూడ తన వెలుగుతో ప్రకాశింపజేస్తాడు. అహంకారం బదులు చైత్యపురుషుణ్ణి అనగా నీ ఆత్మను ఆవిష్కరింపజేయుటయే దైవ సాక్షాత్కారానికి మొదటి సోపానము.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 18, pp. 630-31)

చైత్యపురుషావిష్కరణ – పునాదులు

శ్రీఅరవిందులు

చైత్యపురుషుని సాక్షాత్కరింప జేసుకొని, ఆ శక్తిని మేల్కొలిపి, దానిని అనుభవైక వేద్యం గావించుకోటానికి, ఆచరణాత్మక కార్యరంగంలో ముఖాముఖిగ ముందు నిలపటం అనేది ప్రముఖంగా ప్రతి ఒక్కరూ తమ వైయక్తికానుబంధాలను ఎంత మేరకు గాఢతమం చేసుకొనగలుగుతారోనన్న అంశంపై ఆధారపడి వుంటుంది[1]. భగవంతునిపై గల అపార ప్రేమ, పారవశ్యత, విశ్వాసావృత పరిపూర్ణ శరణాగతి, స్వార్థత్యాగం, నేను అన్న విపరీత ప్రవృత్తి, నీ భేదభావానికి ఆజ్యం పోసి పెంచి పోషించే మానసిక, ప్రాణిక, భౌతిక అహంకారాల పరిత్యాగం – దైహిక మమతానురాగాలపై వైరాగ్యం – అన్న అంశాలపై గల పట్టు, ఆత్మసాక్షాత్కార విజయానికి మేలిమెట్టు.

*

దేవుని లేదా గురువుపై గల నిండైన, నికార్సైన భక్తి, మానసిక ప్రాణిక భక్తులకంటే పూర్తిగా విలక్షణమైనది.

ఎవరైనా తన మనసులో ఓ వ్యక్తి లేదా గురువుయొక్క మేధోశక్తిపైన, అతని విశిష్ట బుద్ధి కుశాగ్రతల పైన అపారమైన అభిమానం, పూజ్యభావం, గుణాగుణ వివేచన కలిగి యుండ వచ్చు. అయితే అది కేవలం మానసికం మాత్రమే. ఆ భావనాలహరి మనని సుదూర తీరాలకు చేరవేయలేదు. అయినా దానిని ఆహ్వానించి, స్వీకరించటంవల్ల ఎట్టి హానీ కలుగదు. ఎందుకంటె

---

[1] దైవానికి మానవునికిగల వైయక్తిక సంబంధమీ విధంగా ఉంటుంది. "అన్ని పరిస్థితుల లోను దైవాన్ని పిలిచి మన జీవితంలోని ప్రత్యంశములోను ఆయనను కూడ పాలుపంచుకొన నిచ్చినట్లయితే అప్పుడు మన జీవితమంతా ఆనందమయమై పోతుంది – ఎందుకంటే అంతటిని ఆయన ఆనందంతో ఆచ్ఛాదింప చేస్తాడు."

('హుతా తెల్లగులాబీలు' అనే పుస్తకంలోని 16-4-1968 సందేశము)

అది తనంతట తానుగా అంతర్యామిని ఆసాంతం వేద్యం గావించజాలదు. మానసిక పరిచయాన్ని మాత్రమే స్థిరపరచ గలదు.

ప్రాణికభక్తి ఇంకా ఇంకా ఆశిస్తుంది. కోరికల వలయాన్ని విస్తరింప జేసుకొని తన షరతులను తాను విధిస్తుంది. అది దైవానికి తనను తాను సమర్పించుకొంటూ – తనవైన కొన్ని షరతులతో "ఓ దైవమా! నీవు సర్వోత్తముడవు, సర్వశ్రేష్టుడవు. నేను నిన్ను ఆరాధిస్తాను. నీవిప్పుడు నా ఈ కోర్కెలను తీర్చుము లేదా ఆకాంక్షను నెరవేర్చుము, నా మనోభీష్టాల నన్నింటినీ ఫలప్రదం చేయుము. నన్నో అదృష్ట జాతకునిగా రూపొందించి, విజయ శిఖరాల నధిరోహింప జేయుము. ఓ గొప్ప యోగీశ్వరునిగా మలచి, నా తపస్సును పండించి ఓ యోగీశ్వరేశ్వరా! నా హృదయాన్ని నీ రాజధానిగా తీర్చిదిద్దుకో. అలా అలా నీకు సన్నిహితుణ్ణి గావించుకో" అని పదే పదే పరమాత్మకు విన్నవించుకొంటుంది – విన్నపాలు వినవలెనంటూ.

తనవైన షరతులను తాను విధిస్తూ, ఆధ్యాత్మిక వికాసం లేని మనసు కూడ తనను తాను నిత్య సత్యానికి, యథార్థతత్త్వానికి సమర్పించుకొంటుంది. యథార్థ తత్త్వానికి 'తన వివేక వివేచనాయుత అభిప్రాయాలను తన విశ్వాసాలను మన్నించమని' నివేదిస్తుంది. అంతేకాక, నిత్యసత్యాన్ని తన మనోరూప భంగిమలలో కుదురుకొమ్మని గాఢంగా కోరుతుంది.

ప్రాణికశక్తి కూడ నిత్యసత్యాన్ని తన శక్తి కదలికలతో తాదాత్మ్యం చెందమని ఒత్తిడి చేస్తుంది. ప్రాణికశక్తి, ఉన్నతశక్తిని తన దిశకు మళ్లించుకోటానికి మఱీ మఱీ లాగుతుంది. అంతేకాదు అది గురువుగారి ప్రాణికశక్తిని గూడ తన వైపుకు గుంజుకోటానికి గుంజాటన పడుతుంది.

తమ శరణాగతిలో మానసిక మఱియు ప్రాణికశక్తులు రెండింటికి కూడ, ప్రత్యక్షంగా నోరు విప్పలేని తమవైన ప్రత్యేకతలు, అభ్యంతరాలు తమకుంటవి.

చైత్యభక్తి తన అపేక్షితాలను అభివ్యక్తీకరించదు. దాని కెట్టి వినాయింపులూ లేవు. తనకున్న దానితో తాను సంతృప్తి జెందు

తుంది. చైత్యపురుమనికి, ఋజు రీతిలో నిత్యసత్యాన్నెలా ఔదల దాల్చవలెనన్నది సువేద్యం. అది భగవంతునికి లేదా గురువునకు తనను తాను యథార్థంగా సమర్పించుకొనగలదు. అంచేత అది తనను తాను యథార్థంగా సమర్పించగలదు. అంతే కాదు అది సత్య సమన్వితంగా పొందనూ గలదు.

*

నీ కత్యంత ప్రామాణికము, ప్రముఖము అయినవి ఏమిటంటే నీ హృదయాంతర్గత చైత్యాగ్నిని ఉజ్జ్వలాయ మానంగా పురోగమింప జేస్తూ, చైత్యపురుమనిలో సాధనా మార్గదర్శిగా ముందుకురుకా లన్న ఆకాంక్షను ద్విగుణీకృతం గావించటం.

*

కోరికలను సమూలంగా పరిత్యజించి, ఇక పైన దాని ఆధిపత్యం ఆలోచనల భావనలు లేదా ఆచరణలపై ఇసుమంతైనా లేదని రూఢిపరచుకొని, స్థిరమనస్కులై, దృఢసంకల్పాన్ని విశ్వాసనీ యంగా పరిపూర్ణ శరణాగతి వైపు మరలిస్తే కొంతకాలం తరు వాత చైత్యశక్తి తనకు తానుగ తననావిష్కరించుకొంటుంది.

*

సాధన కుపక్రమించిన తదుపరి కూడ చాలమంది మనుష్యులలో చైత్యపురుమని ఆవిష్కారం మెల్ల మెల్లగ సాగుతుంది. చైత్యశక్తి నిరాటంకంగా, స్వేచ్ఛగా సంచరించే ముందు మానసిక, ప్రాణిక, ప్రాంగణాలలో జరగవలసిన మార్పులు, చేర్పులు, సర్దుబాట్లు ఎన్నో ఎన్నెన్నో. చైత్యశక్తి ఎంతోకాలంగా ప్రేళ్లానుకొని ఉన్న తన మేలి ముసుగును తొలగించుకొని ప్రకృతి నియంత్రణకు సన్నద్ధమై కార్యోన్ముఖం కావటానికి కావలసిన ప్రక్రియలన్నీ సజావుగా పూర్తయ్యే వరకూ ఎవ్వరైనా వేచియుండవలసినదే.

*

అంతేకాక యోగసాధనలో మనసు ప్రభావ ప్రాముఖ్యాలు అధి కమై అంతరాత్మను వెనుకకు ద్రోసిన సందర్భంలోనూ, లేదా భక్తి లేదా ఇతర సాధనా ప్రక్రియలతో ప్రాణిక ప్రమేయం మితిమీరి ననూ, పైన చెప్పిన మందకొడితనం కొనసాగుతుంది. చైత్యపురుష

పరిపూర్ణావిర్భావావిష్కారాలకు, విశుద్ధత, నిరాడంబర విధేయత, విశ్వసనీయత, అహంకార రహితంగా, నిష్కల్మషంగా తనను తాను, ఎట్టి నటనా, ముందు షరతులూ, మినహాయింపులూ దట్టించకుండా సమర్పించుకోగల సామర్థ్యం, ఆవశ్యక నిబంధనలు.

*

బాహ్యప్రకృతి విశుద్ధమయ్యే ప్రతిసందర్భంలోనూ, అంతర్యామికి తనను తాను ప్రస్ఫుటంగా ప్రకటించుకొనే వీలు, అవకాశం విస్తృతమవుతవి.

*

నిరంతరాకాంక్షాగ్నిని ఉజ్వలంగా ప్రజ్వలింప జేయాలన్నది యథార్థం. అయితే ఇది చైత్యాగ్ని. దీని జ్వలన పురోగమనం అంతరంగంలో చైత్యశక్తి పురోగమనంతో జతకట్టి సాగుతుంది. చైత్యపురోభివృద్ధికి ప్రశాంతత ఆవశ్యకం. అందుకే మేము మీలో చైత్య పురోగమనానికి కృషి చేస్తున్నాము. ప్రశాంతత దినదినాభివృద్ధికి ప్రయత్నిస్తున్నాము. అందుకే అమ్మ చేపట్టిన కార్యాచరణ పురోభివృద్ధిని ఓపికతో విడివడని విశ్వాసంతో వేచి చూడమని మిమ్మల్ని కోరుతున్నాము. నిర్విరామంగా శ్రీమాతను ధ్యానించటం, అంతరంగాగ్నిపై నిశ్చల దృష్టిని నిరంతరంగా ఉంచటం అన్నవి సాధనలో తగినంత పురోగమనం సాగించటమే అవుతుంది. ఈ ప్రణాళికను మీకు సాధనాక్రమంలో తారసపడే అనుభవానుభూతుల ఆధారంగా రూపొందించుకోవాలి. అచంచల విశ్వాసంతో సాగు. సంకల్పం సిద్ధిస్తుంది. ఏవేవి జరగాలో అవన్నీ జరుగుతవి.

యద్భావం తద్భవతి.

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

(*SABCL* Vol. 22, pp. 341-42; Vol. 24, pp. 1103-04, 1095, 1099, 1098, 1099, 1102, 1121)

చైత్యపురుషావిష్కరణ – క్రమశిక్షణ

శ్రీఅరవిందులు

మానసికమైన కోరిక సజీవమైన ఆధ్యాత్మికానుభూతిగా మార్పు జెందుటకు అనుసరించవలసిన పద్ధతిని గూర్చి నీవు అడిగావు. ప్రాథమికంగా చేయవలసిన దేమిటంటే నీ చైతన్యమును అంత రంగమునకు మళ్లించి అక్కడ కేంద్రీకరించుట. సాధారణమైన మానవ మనస్సు బాహ్యక్రియల ద్వారా తనలోగల నిజాత్మను కనబడకుండా కప్పివేస్తుంది. కాని ఈ బాహ్య చైతన్యమునకు వెనుకగా దాగియున్న చైతన్యములో మనం మన నిజాత్మను మరియు ఉన్నతమైన లోతైన నిజప్రకృతిని ఎరుగవచ్చును. మరియు అట్టి ఆత్మ సాక్షాత్కారమును, స్వేచ్ఛను పొంది మన ప్రకృతిని పరిణమింప చేసికొన గల్గుదుము. ఉపరితల మన స్సును ప్రశాంత పరచి అంతరంగ చైతన్యములో నివసించడం, 'ఏకాగ్రత' లక్ష్యం – ఈ అంతర, నిజ చైతన్యానికి సంబంధించి (ఉపరితల చైతన్యం కాదు) రెండు ముఖ్య కేంద్రములు గలవు. ఒకటి హృదయములో (భౌతికమైన గుండె కాదు) మరియొకటి శిరస్సులో. హృదయమందు ఏకాగ్రతా సాధన ద్వారా అంతరం గము తెరచుకుంటుంది. ఈ అంతరంగ మార్గమును అనుసరిం చుట ద్వారా హృదయములో లోతుగా వెళ్లి వ్యక్తి అచ్చటగల 'ఆత్మ' ను తెలుసుకుంటాడు. తనలోగల దైవాంశను, చైత్యపురు షణ్ణి కనుగొంటాడు. అపుడు వ్యక్తమైన ఈ ఆత్మ ముందుకు రావటం ప్రారంభిస్తుంది. వ్యక్తి స్వభావాన్ని పాలించుటకై అన్ని కదలికలను దైవాభిముఖంగా, సత్యదిశలో తీసుకొనిరావడానికై ఉన్నతమునందున్న అన్ని శక్తులను క్రిందికి పిలుస్తుంది. ఇది వ్యక్తిలో దివ్యచైతన్యమును తీసుకొనివస్తుంది. పరమాత్మునికి తనను తాను సంపూర్ణంగా సమర్పించుకుంటుంది. మనపైన వేచి యున్న ఉన్నతశక్తులను, చైతన్యమును మనలోకి ఆహ్వానిస్తుంది. వ్యక్తి తనను ఆ భగవంతునికి సమర్పించుకొనుచు అంతరంగ

పథము తెరచుటకై చేయు ఆకాంక్ష మరియు హృదయ కేంద్ర మందు భగవానుని ఉపస్థితికి చేయు 'ఏకాగ్రత' ప్రథమమార్గము, సహజ ప్రారంభము. ఈ విధంగా చేయుట ద్వారా లభించిన ఫలితాలు ఆధ్యాత్మిక పథమును మరింత సులభంగా మరియు సురక్షితంగా చేస్తవి. మిగిలిన పద్ధతులకంటె ఈ మార్గం సులభమైనది మరియు సురక్షితమైనది.

మరియొక మార్గం శిరస్సునందు మానసిక కేంద్రమందు ఏకాగ్రత. ఈ విధమైన ఏకాగ్రత బాహ్యామనస్సులో ప్రశాంతతను, నిశ్శబ్దతను తీసుకొని రాగలిగినట్లైతే, అది లోని, ఉన్నతమైన, లోతైన మనస్సును తెరుస్తుంది. అట్టి మనస్సు ఆధ్యాత్మిక అనుభవాలను మరియు ఆధ్యాత్మిక జ్ఞానమును ఇంకను ఎక్కువగా గ్రహించగల్గు స్థితిలో వుంటుంది. కాని ఒక్కసారి ఈ కేంద్రములో ఏకాగ్రత ప్రారంభిస్తే, వ్యక్తి తన నిశ్శబ్ద మానసిక చైతన్యమును సాధారణ మనస్సునకు పైనున్న ఉన్నత మానసిక భూమికలకు తెరచి యుంచాలి. అలా కొంత కాలముంచిన తదుపరి వ్యక్తి తన చైతన్యమును పైకి లేస్తున్నట్లుగా గమనిస్తాడు. మరియు చివరగా తన మానసిక చైతన్యమును ఈ శరీరమునకు బంధించి యుంచిన బిరడాకు అవతలగా ఎగసిపోతూ శిరస్సుకు ఉపరిభాగమున ఒక కేంద్రమును కనుగొంటాడు. ఆ కేంద్రము ద్వారా అతని మానసిక చైతన్యము విశ్వ చైతన్యములోకి విడుదల చేయబడుతుంది. అచ్చట అది విశ్వాత్మతో, దైవశాంతి, కాంతి, శక్తి, జ్ఞానము, ఆనందముల సంపర్కములోకి వస్తుంది. దానిలో ప్రవేశించి అదిగా మారుటకై మరియు ఆ శక్తులను తన ప్రకృతిలోకి ఆవాహన చేసికొనుట ద్వారా వాటి అనుభవాన్ని పొందుతుంది. మనస్సులో ప్రశాంతతకై, మనస్సుకు ఉన్నతముగా నున్న ఆత్మ మరియు దైవసాక్షాత్కారములకై చేయు ఆకాంక్ష మనస్సులో చేయబడు 'ఏకాగ్రత'. ఈ విధమైన ఏకాగ్రత రెండవ రకమైనది. మానసిక చైతన్యములో 'ఏకాగ్రత' అవలంబించువారు మనస్సు యొక్క ఉపరితలములో యున్న కేంద్రమునకు తమ చైతన్యమును ఉద్గమింపచేయుట ఒక ప్రారంభము మాత్రమే అను విషయము

గుర్తుంచుకోవడం ముఖ్యం. లేకపోయినట్లైతే వ్యక్తి ఆధ్యాత్మిక పరిణామాలలో ఉద్గమించి, అందు నివసించుటకు మారుగా తన మనస్సులోని మానసిక అనుభూతులకు బందీ అవుతాడు. చైత న్యముయొక్క పరావర్తనమును మాత్రమే పొందుతాడు. కొందరికి మానసిక ఏకాగ్రత సులభం – మరి కొందరికి హృదయేకాగ్రత సులభం. కొందరు ఒకటి తర్వాత ఒకటిగా రెండింటినీ చేయ గలరు. కాని ప్రారంభములో హృదయకేంద్రము నుంచి మొదలు పెట్టడమే మంచిది.

ఈ పథములో మార్పు చెందింపబడవలసిన మరియొక భాగం – మనలోని ప్రకృతి – మానసికము, ప్రాణికము మరియు భౌతికము. ఇచ్చట నియమేమంటే మనలోగల ప్రకృతి భాగమంతా అంతరంగ సాక్షాత్కారమునకు తన సంపూర్ణ సహకారము నందించుట. ఆ విధంగా బాహ్యాంతరముల భేదము లేకుండా ఏక త్రాటిపై యోగం సాగాలి. ఈ స్థాయిలో అనేక పద్ధతులు లేదా మార్గాలు ఉన్నాయి. అందులో ఒకటి – మన అన్ని క్రియలను ఆ భగవానునికి సమర్పించుట, అంతరంగములోని పథ నిర్దేశ కుని పిలచుట. ఈ విధంగా తన పకృతి భాగములను ఉన్నత శక్తులచే నడిపించుట. ఒక వేళ అంతరములో ఆత్మసాక్షాత్కారము (soul-opening) జరిగినట్లైతే, చైత్యపురుమడు ముందుకు వచ్చిన ట్లైతే, మనిషిలో చైత్యవివేకము కల్గుతుంది. చివరగా ప్రశాంతంగా సహనంతో అన్ని లోపములను తొలగించి సరియగు మానసిక ప్రాణిక కదలికలు తెస్తూ భౌతిక చైతన్యమును కూడా మార్పు చెందింప చేయు స్థితి ఏర్పడుతుంది.

మరియొక విధానము ఏమంటే మానసిక, ప్రాణిక, భౌతిక పురుమలని కదలికల నుండి విడివడి, వెనుకగా నిలబడి, ఈ అన్ని క్రియలు లేదా చర్యలు, పూర్వం చేసిన పనులు ప్రభావం వలన ఏర్పడు వ్యక్తియొక్క సాధారణ ప్రకృతి చేయు అభ్యాసన రూప ములుగా భావించాలి. కాని మనలోని నిజపురుమలలోని భాగా లుగా భావించకూడదు. వ్యక్తి ఈ విధానములో ఏ మేరకైతే విజ యాన్ని పొందుతాడో ఆ మేరకు బంధ రహితుడౌతాడు. *మరియు*

మనస్సు – దాని క్రియలు, ప్రాణము – దాని క్రియలు, శరీరము – దాని క్రియలు తనలోని ఆత్మ తత్వానికి సంబంధించినవి కావని గ్రహిస్తాడు. ఆ విధంగా తనలోని అంతర పురుషుడు – అంతరమనస్సు – అంతరప్రాణికము – అంతరభౌతికము – నిశ్శబ్దముగా ప్రశాంతముగా, హద్దులు లేనివిగా బంధరహితంగా వుండి ఎగువనున్న సత్యాత్మ పరావర్తనంగాగాని లేదా దాని ప్రతినిధిగా గాని గ్రహిస్తాడు. తదుపరి ఈ అంతరంగ నిశ్శబ్ద పురుషుడి నుండి తిరస్కరింప బడవలసినదంతా తిరస్కరించబడుతుంది. మరియు ఉంచబడి మార్పు చెందింప బడవలసిన అంశము లన్నియు ఒప్పుకొనబడుతవి – పరిపూర్ణత్వమునకై అంతర్గత సంకల్పము లేదా వ్యక్తిలో నున్న ప్రకృతి మార్పు చెందుటకు ప్రతి అడుగులో అవసరమగు చర్య నిమిత్తము ఆ భగవంతుని ఆవాహన చేయడం జరుగుతుంది. అది మనలోని మానసిక, ప్రాణిక మరియు భౌతికములను అంతరంగములోని చైత్యపురుషుని దిశగా దాని మార్గదర్శనమునకై వికసింప జేస్తుంది. చాలా మటుకు ఈ రెండు పద్ధతులు ప్రారంభమై కలిసి పనిచేస్తూ చివరికి ఒకటిగా రూపాంతరం చెందుతవి. కాని ప్రతి ఒక్కరూ తమకు సులభమైనది మరియు సహజమైనది అయిన మార్గములో ప్రారంభించి కొనసాగించ వచ్చును.

*

చైత్యపురుషుడు ఛాతి మధ్యభాగములోని హృదయ కేంద్రములో వెనుకగా లోతున ఉంటాడు. (అన్ని కేంద్రములు శరీర మధ్య భాగములో ఉండును). ఎప్పుడైతే ప్రాణికమునుండి చైత్యమువైపు వెళుతుంటామో అప్పుడు చైత్యపురుష కేంద్రము చేరేంతవరకు లోలోతులకు వెళ్లునట్లనిపిస్తుంది. హృదయకేంద్రముయొక్క ఉపరితల భాగము ఉద్రేకముల స్థానము. అచ్చట నుండి వ్యక్తి చేతన స్థానమును కనుగొనుటకు లోలోతులకు వెడతాడు.

*

1. నీ చైతన్యమందు సంభవించే ప్రతి సంఘటన, నీవు చేసే ప్రతి పనిని, క్రియను ఆ భగవానునికి సంపూర్ణంగా సమర్పించుకో.

2. నీ యందు పొరపాట్లుగాని, బలహీనతలుగాని వుంటే అవి మార్పు చెందింపబడుటకై లేదా తొలగింపబడుటకై వాటిని ఆ భగవానుని సన్నిధిలో నుంచుము.

3. నేను తెలిపిన విధంగా భగవానుని సాక్షాత్కారము లభించేంతవరకు నిరంతరం నీ హృదయమందు ఏకాగ్రతతో యుండుము.

అనువాదం: జి. జనార్దన రావు

(*SABCL* Vol. 23, pp. 517-19; Vol. 24, p. 1115; Vol. 23, p. 607)

ఆత్మ ఆవిష్కారానికి అవరోధాలు – వాటిని జయించే మార్గాలు

శ్రీఅరవిందులు

సగటు మానవుడు తన జీవితావసరాలను తీర్చుకుంటూ జీవయాత్రను గడుపుతూంటాడు. ఈ ప్రవాహంలో పడి కొట్టుకొని పోవటం అతనికి అలవాటే. ఎప్పుడైతే అతను ఆత్మవైపు తిరుగుతాడో అప్పుడు ఆ ప్రవాహ వేగమంతా అతనికి ఎదురుదెబ్బ కొడుతూ వుంటుంది. ఎంత ప్రయత్నించినా పాత సంస్కారాలన్నీ అతని ఆత్మాన్వేషణని సవాలు చేస్తూనే వుంటాయి. ఈ సవాలుని ఎదుర్కొని విజయం సాధించుటయే అతని పరమావధి.

– సంపాదకుడు

మనిషి జీవితంతో విసిగి వేసారిపోయి చివరికి తన ఆత్మ వైపు మళ్లుతాడు. దైవాన్ని అన్వేషిస్తాడు. కాని అతని పాత సంస్కా

రాలు, ప్రాణిక శృంఖలాలు కాళ్లని పెనవేసుకొని కదలనివ్వవు. అప్పుడేం చెయ్యాలో తోచదు. ఆత్మకు ప్రాణికానికి, కామితాలకు దైవానికి మధ్యన ఘర్షణ జరుగుతుంది. నీ భౌతిక చైతన్యానికి ఈ విషయం అర్థంకాక గిలగిలా కొట్టుకుంటుంది.

ఇదిలా ఉండాగా, విశ్వప్రకృతి, మానవుణ్ణి అజ్ఞానంలోంచి జ్యోతిర్మయుమవడానికి ఒప్పుకోదు (ఇష్టపడదు). మనం మన పాత అభిప్రాయాలు, భావాలు, కోరికలు వదిలేసిన తర్వాత కూడా అవి మన మీద దాడి చేయవచ్చు. మానవుడు తన ప్రకృతిని పూర్తిగా దైవానికి సమర్పణ చేసేవఱకూ, ఇటువంటివి జరుగుతూనే ఉంటయి. బాధ, అస్వస్థత మొదలైన ఎదురు శక్తుల రూపంలో మన మీదకి దాడి చేస్తూనే ఉంటాయి.

కానీ వీటిని ఎదుర్కొనడానికి, రెండు మార్గాలున్నాయి. మొదటగా ఆత్మశాంతి, సమత, దృఢనిర్ణయం, భావం, చైతన్యం, భౌతికచైతన్యం (physical Consciousness) అన్నీ మరింత దృఢంగా దివ్యోన్ముఖమవడం, కోరికలకు, దుఃఖానికి, బాధకు, తమస్సుకు, నిస్పృహాలకు చలించకపోవడం వల్ల ఈ ఎదుర్కోవడం సాధ్యమవుతుంది. సుగమమవుతుంది. ఇదంతా అంతరాత్మ మేల్కొన్నప్పుడు, అంతఃభౌతికం, అంతఃచైతన్యం, అంతర్మనస్సు, అంతఃచైత్య ప్రవృత్తి దైవేచ్ఛతో కలిసిపోయినపుడు, అధో ప్రవృత్తిని ఎదుర్కోవడం సాధ్యమవుతుంది. సులభమవుతుంది.

అయితే వ్యక్తిలో రెండు విభాగాలున్నయి. ఒకటి అంతర్గత నిశ్చలత, బలం, సమత, ప్రశాంతత, దివ్యచైతన్య శక్తులతో కూడి యున్నది. అయితే అధోప్రవృత్తివలన వచ్చిన ఇబ్బందులు, అవరోధాలు అన్నీ ఉపరితలంలో ఉన్న అలలు లాగానే ఉంటయి. పైగా (ఆత్మ) అంతఃపీడనంవల్ల అవి మునిగిపోయి, బాహ్యప్రకృతి కూడా, నిశ్చలంగా, ఏకోన్ముఖమై (దైవం వైపు) ఏ దాడులు, ముట్టడి చేయకుండా ఉండ గలుగుతుంది.

అయితే మరొక మార్గం చైత్యమార్గం. చైత్యప్రకృతి, తన సొంతమైన ప్రవృత్తితో, ఏకోన్ముఖమై భక్తితో దైవాన్ని ప్రేమించడం, ఆత్మసమర్పణ, మనస్సు మీద, ఈ ప్రభావాలన్నీ చూపి

స్తుంది. చైత్య, భౌతిక చైతన్యాల మీద వాటి గమనాన్ని భగవ న్మ్ముఖంగా మరలించి, పటిష్ఠం చేస్తుంది. చైత్యప్రకృతి బలమైన దైన మానవుడు అదే తనకు యజమానిగా అయి, బాధానివారణ గావించి, లేదా బాధలకు దూరంగా ఉంచి, ఇవేవీ ఆత్మనికానీ, మరే ఇతర చైతన్యభాగాలను కానీ, ఏమీ అంటకుండా, ఆనంద మయ, కాంతిమయ మధురానుభూతులు, సాధన ఫలితాల్ని ఇప్పి స్తుంది. బాహ్యా తాకిడులు వ్యతిరేక సందర్భాలు, శక్తిగమనముతో, బాహ్యాప్రవృత్తి, స్వీయసంబంధాలను పరిణామం చెందిస్తుంది. ఆ బలీయమైన చైత్యప్రవృత్తి, ఆ శక్తి ఇవన్నీ జయించి, ముందరకు దూసుకుపోతూ, అధో ప్రవృత్తియొక్క నిరోధాలను తొలగించివే స్తుంది. కానీ మానవునిలో అవి ఎన్నాళ్లు ఉన్నా ఆ సాధనను మాత్రం అడ్డుకోలేవు. పైగా అవే ఆత్మవికాసానికి, పురోభివృద్ధికి సహాయపడతాయి.

*

దేవుడెక్కడికి పోలేదు. ఇక్కడే ఉన్నాడు. కాని తన షరతులు, శాసనాలు, ప్రకృతి పరిస్థితులు, ఏవీ అశ్రద్ధ చేయడు. దైవం తన పరిస్థితులలోనే తన కర్తవ్యం అంతా కొనసాగిస్తాడు. తన కర్తవ్యం, మానవునిలోను దరిమిలా, విశ్వంలోనూ, సాధకుని లోనూ, దైవాన్ని తెలుసుకోవాలనుకునే ఆకాంక్షితుడిలోనూ, దైవాన్ని ప్రేమించే వాడిలోనూ, తానే చేస్తాడు. అయితే, తాప సిలో కూడా ఈ కష్టాలు కొనసాగుతూనే ఉంటయి. ఎందుకంటే మానవ స్వభావం పరిమితం గనుక, పూర్తి విముక్తి, పూర్తి పరిపక్వత, లేక దైవాన్ని తాను సొంతం చేసుకోవడంగానీ, లేదా దైవం తనని సొంతం చేసుకోవడంగానీ, ఒక అద్భుతం వల్లనో, కొన్ని అద్భుతాల ద్వారా జరగదు. ఈ అద్భుతము, పూర్తి పిలుపు, పూర్తి ఆత్మసమర్పణ తన స్వభావాన్ని విశాలంగా, భగవంతుని కోసం, తెరిచి ఉంచడంవల్ల మాత్రమే సాధ్యం అవుతుంది.

అనువాదం: డా॥ ఆర్. విమలాదేవి

(*SABCL* Vol. 24, p. 1616-617, 1619)

పరిణామ క్రమంలో రాబోవు ఘట్టము

శ్రీఅరవిందులు


మొదట రెండు పరివర్తనములు జరగాలి. మొదటిది చైత్యీకరణము (psychicisation) — దీనినే చైత్యరూపాంతరీకరణము అని కూడ అనవచ్చు. అంటే ఏమిటి? మనిషికి ఇప్పుడున్న దానిని మానవ చైతన్యమన వచ్చును. రాబోవు ఆధ్యాత్మిక చైతన్యానికి ఈ మానవ చైతన్యానికి మధ్యవర్తి ఈ చైత్యరూపాంతరీకరణము.

*

మానవుడనగా ఈ మానసిక, ప్రాణికములే గదా! ఆత్మనుగాని, చైతన్యమునుగాని అవి గుర్తించలేవు. జంతువుల జీవితం వేరు. జంతువుల మనస్సు పూర్తిగ వాటి శరీరంతోటి, జీవితంతోటి ముడిపడి వుంటుంది. కాని మనిషి అటుల గాదు. అతను మనస్సుతో ఆలోచించ గలడు. ఇది జంతువులకు చేతగాని పని. మనిషిలోని ఆత్మ కూడ ఇదే వరస. మొదట్లో అతని ఆత్మ పూర్తిగ అతని మనస్సులోను, జీవితంలోను నిమగ్నమై వుంటుంది. పరమ నైశ్చల్యము ఒక్క మనస్సులోనే కాకుండా, నఖశిఖ పర్యంతము నెలకొనినప్పుడు, అప్పుడుగాని అతనిలోని ఆధ్యాత్మిక తత్త్వము అనగా ఆత్మను గురించి అతనికి తెలియరాదు. ఈ విధంగా మనిషిలోని ఆధ్యాత్మిక విభాగము శరీరము నుండి విముక్తమైనపుడు ఆధ్యాత్మిక పరిణామము సాధ్యమవుతుంది. చైత్యపదార్థము యొక్క (a pressure of the psychic entity on the mind, life and body) వత్తిడి వలన మన మనస్సు, జీవితము, శరీరము, వాటి ఉన్నత రూపములను అనగా ఆధ్యా త్మిక మనస్సు, ఆధ్యాత్మిక జీవితములుగా మారి రూపాంతరీకరణం సాధ్యమవుతుంది.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 24, p. 1094; Vol. 19, pp. 853-55)



సమాచార పత్రం

శ్రీమాత అమరవాణి:

ప్రతి యొక్కరు వారి చైత్యపురుషుని సంపర్కమును పొందాలి. అది ఏమంత అసాధ్యం కాదు. నీకు దివ్యశక్తుల సంపర్కమును కలిగించుటయే చైత్యపురుషుని కర్తవ్యము.

(*CWM* Vol. 4, p. 245)

శ్రీమాతారవిందుల రచనల నుంచి 'ఆత్మాన్వేషణము' ను గురించి తయారుచేసిన ఈ సంకలనము మీ నిజస్వరూపమును అన్వేషించి పట్టుకొనుటకు సహాయకారి కాగలదు. నళినీకాంత గుప గారు ఉపనిషత్తులలోని ఒక కథ చెప్పారు. నారదుడు ఒకప్పుడు ఒక ఋషి దగ్గరకు వెళ్లి తనకు దీక్షను ఇమ్మని అడిగాడట. ఆ ఋషి నారదుణ్ణి చూసి "నీవు చిన్నప్పుడు ఏమేమి విద్యలు నేర్చుకున్నావో చెప్పు" అని అడిగాడు. అప్పుడాయన తాను నేర్చుకొన్న విద్యల నన్నిటినీ – శాస్త్రములు, కళలు, ధనుర్విద్య మొ॥ వన్నీ ఏకరువు పెట్టాడు. అప్పుడాయన "నాయనా! నీకు బ్రహ్మను గురించి తెలుసా?" అని అడిగాడు. నాకు తెలియదని ఆయన జవాబిచ్చాడు. అసలు తెలుసుకోవలసినది అదే నాయనా, అది తెలిస్తే, సమస్తమూ తెలిసినట్లే."

ఈ సంకలనము ఆంగ్లములో లఘుదీపిక రూపంలో కూడ రు॥ 15/- కు దొరుకుతుంది.

శ్రీఅరవింద సొసైటీ బీచ్ ఆఫీసులో 31-3-04 నుంచి 5-4-04 వరకు డా॥ ఎమ్.వి. నడ్కర్ణిగారు 'An Orientation-cum-study course - An "Introduction to Sri Aurobindo studies" ను నిర్వహించిరి. 20th to 29 May లో ఒక Education Camp-cum workshop 2004 ను నడిపించిరి.

ఆగస్టులో ఇక్కడ జరగబోయే కార్యక్రమములు:

ఆగస్టు 12-14 శ్రీఅరవింద సొసైటీ వార్షిక సమావేశములు.

17-22 ఆగస్టు: శ్రీఅరవిందుల వెలుగులో 13 ప్రధానోపనిషత్తుల అధ్యయనము. దీనిని ప్రొ॥ ఆర్.ఎల్. కశ్యప్‌గారు నిర్వహించెదరు.

15 ఆగస్టు: శ్రీఅరవిందుల 132 వ జన్మదినోత్సవము ఆశ్రమంలోను, దేశవిదేశాలలోని అనేక కేంద్రములు, శాఖలలోను జరుపుకొనెదరు.


*

చిరునామా మార్పు: శ్రీఅరవిందో సొసైటీ సభ్యులు, 'అఖిల' చందాదారులు, చిరునామా మార్పులను ఒక నెల ముందరే మెంబర్‌షిప్ విభాగమునకు తెలియజేయవలెను. పత్రిక అందనివారు కూడ మెంబర్‌షిప్ సెక్షన్‌కు అదే నెల ఆఖరి వారము లోపల తెలియజేయగలరు.

ఆధ్యాత్మిక వాతావరణము

నీ మనస్సును ఆలోచనలు లేకుండా కుదుటపరచి, ప్రాణికమును కోరికల వ్యామోహాల కతీతంగా శాంతపరచి, నీ చుట్టుపక్కల మనుషుల మాటలకు, చేష్టలకు స్పందించక, బాహ్యా పరిస్థితుల వేధింపులకు చలించకుండా ఉన్నప్పుడు, నువ్వు నీ చుట్టూ ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక వాతావరణ మేర్పడుతుంది. అది నిన్ను పరివేష్టించి కాపాడుతూ వుంటుంది. ఎంతటి దుర్భరమైన పరిస్థితులైనా ఇక నిన్నేమీ చెయ్యలేవు.

శ్రీమాత



శ్రీఅరవిందుల జీవితము, బోధన

అఖిల భారత పత్రిక, ఆగస్టు 2004

శ్రీఅరవిందుల జీవన సందేశము

విభాగము I

విభాగము II

Editor: R.L.N.Sastry
Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society,
No. 1, Rangapillai Street, Pondicherry - 605001.
Printed by Amiyo Ranjan Ganguli at Sri Aurobindo Ashram Press,
38 Goubert Avenue, Pondicherry - 605001.

Single copy: Rs. 15 Annual Subscription: Rs. 100 (in India)

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY, PONDICHERRY

శ్రీఅరవిందులు: ఒక రేఖాచిత్రము

(పూర్ణయోగి కావడానికి ముందు
వారి పూర్వజీవితం లోని ముఖ్యాంశాలు)

శ్రీఅరవిందులు

(దిలీప్ కుమార్ రాయ్ రాసిన 'Among the Great' అనే పుస్తకంలో చేర్చడం కోసం శ్రీఅరవిందులు తన జీవితాన్ని గురించి తనే క్లుప్తంగా రాసి పెట్టారు. అందుకని దానిని వారి రచనగా పేర్కొనవచ్చునా అని దిలీప్ కుమార్ రాయ్ అడుగగా వారిచ్చిన సమాధానం.)

వద్దు వద్దు. అలా చేస్తే నీ పుస్తకం ద్వారా నా గొప్పలు నేనే చెప్పుకున్నట్లు అవుతుంది. ఇలాంటి విషయాలను నేనెప్పుడూ పట్టించుకోలేదు. ఎందుకంటె అవి అంత ముఖ్యమైనవని నేనను కోను. చివరికి అత్యంత బాహ్యమైన విషయాలను మాత్రమే క్లుప్తంగా పొందుపరచాను. ఎటువంటి అంతరంగిక విషయాలు గాని, వ్యక్తిగతమైన విషయాలు గాని అందులో లేవు. నన్ను గురించి రకరకాల కథలు, పుకార్లు ప్రచారంలో వున్నాయి. వాటి నిజానిజాలు స్పష్టంగా తేల్చి చెప్పేందుకే నేను దీన్ని రాస్తున్నాను. నీ కిష్టమైతే శ్రీఅరవిందుల బాహ్యజీవితం లోని ముఖ్యాంశాలను సాధికారమైన మూలం నుంచి సేకరించినట్లుగా చెప్పుకొనవచ్చు. వివరాలను వదిలేసి అతిముఖ్యమైన విషయాలను మాత్రమే నేను ప్రస్తావించాను. నా గురించి, నా జీవన ఔన్నత్యం, నిజ స్వరూపాన్ని గురించి నేను ఎటువంటి విశ్లేషణ చేయలేదు. నా దృష్టిలో ఒక మనిషి విలువ అతని విద్వత్తు మీదగాని, పేరుప్రతిష్ఠల మీద గాని, పదవి మీద గాని ఆధారపడి వుండదు; అతని అంతరంగిక స్థాయి మీద, పొందిన సిద్ధి మీద ఆధారపడి వుంటుంది; వీటిని గురించి నేనేం చెప్పలేదు.

*

శ్రీఅరవిందులు 1872 ఆగస్టు 15 వ తేదీన కలకత్తాలో జన్మించారు. ఏడు సంవత్సరాల వయస్సులోనే తన ఇద్దరు సోదరులతో కలిసి విద్యాభ్యాసం కోసం ఇంగ్లండు వెళ్ళారు. అప్పట్నుంచి 14 సంవత్సరాలు అక్కడే ఉండిపోయారు. మొదట్లో ఒక ఇంగ్లీషు కుటుంబంతో కలిసి మాంచెస్టరులో నివసిస్తూ ఉండేవారు. ఆ తర్వాత లండనులో సెయింట్ పాల్ స్కూల్లో చేరి, 1884 వరకు అక్కడే చదువుకున్నారు. 1890 లో సీనియర్ క్లాసికల్ స్కాలర్‌షిప్పుతో కేంబ్రిడ్జ్‌లోని కింగ్స్ కాలేజీలో చేరి రెండు సంవత్సరాలు చదివారు. 1890 లో ఇండియన్ సివిల్ సర్వీసు నిర్వహించే బహిరంగ పోటీలో ఉత్తీర్ణులయ్యారు. అయితే రెండు సంవత్సరాల తర్వాత నిర్వహించే గుర్రపుస్వారీ పరీక్షకు హాజరు కాకపోవటం వల్ల ఆ అర్హతను కోల్పోయారు. అదే సమయంలో బరోడా మహారాజు గైక్వాడు లండనులో ఉండగా శ్రీఅరవిందులు వారిని కలుసుకొని వారి కొలువులో (బరోడా సర్వీసులో) చేరారు. ఆ విధంగా శ్రీఅరవిందులు 1893 జనవరి నెలలో ఇంగ్లండు వదలి భారతదేశానికి తిరిగి వచ్చారు.

1893 లో బరోడా వెళ్ళగానే సంస్థానపు రెవిన్యూ సర్వీసులో కొన్నాళ్లు పనిచేశాక మహారాజావారి కచ్చేరిలో కార్యదర్శిగా కొంతకాలం, ఆ తర్వాత కాలేజీలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా కొన్నాళ్ళు పని చేసి, చివరకు బరోడా కాలేజీ వైస్-ప్రిన్స్‌పాల్‌గా అయి మొత్తం పదమూడు సంవత్సరాలు అక్కడ గడిపారు. ఈ కాలంలో ఆయన తన స్వదేశీ సంస్కారాన్ని, సాహిత్యాన్ని బాగా అభివృద్ధి చేసుకున్నారు. అదే సమయంలో భావి కార్యకలాపాలకుగాను తనను సమాయత్తపరచుకున్నారని చెప్పవచ్చు. పాండిచ్చేరి వెళ్ళాక ప్రచురించిన కవితలన్నీ ఈ కాలంంలో రాసినవే. ఇంగ్లండులో ఉండగా ఆయన విద్యాభ్యాసమంతా[1] వారి తండ్రిగారి

---

[1] శ్రీఅరవిందులు ఇంగ్లండులో అభ్యసించిన విద్యవల్ల ఆయనకు పురాతన, మధ్య యుగపు, ఆధునిక యూరోపు సంస్కృతులతో పరిచయం ఏర్పడింది. అక్కడ ఉండగానే గ్రీకు, లాటిన్ భాషలలో అద్వితీయ పాండిత్యం సంపాదించారు. ఫ్రెంచి భాష చిన్నప్పుడు మాంచెస్టర్‌లో ఉండగానే నేర్చుకున్నారు. స్వయంగా జర్మన్, ఇటాలియన్ భాషలు నేర్చుకొని

ఆజ్ఞ ప్రకారం భారతీయసంస్కృతి ఏమాత్రం సోకకుండా పూర్తిగా పాశ్చాత్యవిద్యకే అంకితమైపోయింది. ఈ లోపాన్ని భర్తీ చేసుకోవటంకోసం బరోడాలో సంస్కృతంతో పాటు అనేక ఆధునిక భారతీయ భాషలను నేర్చుకొని భారతీయ నాగరికతా సారాన్ని గ్రహించి, దాని ప్రాచీన, ఆధునిక రూపాలను అవగాహన చేసుకోగలిగారు. ఇక్కడ పనిచేసిన చివరి కాలంలో ఎక్కువ భాగం సెలవులో ఉంటూ, ఉద్యోగ ధర్మంవల్ల బాహాటంగా రాజకీయ చర్యలలో పాల్గొనకూడదు కాబట్టి అజ్ఞాత రాజకీయాలతో గడుపుతూ ఉండేవారు. ఇంతలో 1905 లో బెంగాల్ విభజనకు వ్యతిరేకోద్యమం మొదలయ్యేసరికి ఆయన బరోడా కొలువు వదలిపెట్టి బహిరంగంగా రాజకీయాలలో ప్రవేశించారు. 1906 లో బరోడా వదలిపెట్టారు. కలకత్తాలో అప్పుడే కొత్తగా ఏర్పడ్డ జాతీయ కళాశాలలో ప్రిన్స్‌పాల్‌గా చేరారు.

శ్రీఅరవిందుల రాజకీయ కార్యకలాపాలు ఎనిమిది సంవత్సరాలపాటు అంటే 1902 నుంచీ 1910 దాకా కొనసాగాయి. పూర్వార్ధమంతా తెరచాటుగానే ఉండి, మిగతా కార్యకర్తలతో కలిసి స్వదేశీ (Indian Sinn Fein) ఉద్యమ ప్రారంభదశలకు స్ఫూర్తి నిచ్చారు. అంతవరకు జాతీయ కాంగ్రెస్ సిద్ధాంతంగా ఉన్న మితవాద విధానంలోకన్నా ఎక్కువ చొరవతో సూటిగా రాజకీయచర్యలలో ప్రజలు పాల్గొనేటట్లు, బెంగాల్ ఉద్యమం అవకాశం ఇచ్చేంతవరకు శ్రీఅరవిందులు కృషి చేశారు. ఈ ఉద్దేశ్యంతోనే శ్రీఅరవిందులు బెంగాల్‌కి వచ్చి ఈ క్రొత్త పార్టీలో చేరారు. క్రొత్త పార్టీలో ఉన్నవారు కొద్దిమందే; కాని వారందరు కాంగ్రెసు పార్టీలో ప్రగతిపథంలో ఉన్నవారే. అందరూ క్రొత్తగా చేరినవారే కావటంవల్ల వారి ప్రభావం ఇంకా స్థిరపడలేదు. ఈ పార్టీ రాజకీయసిద్ధాంతం అప్పటికింకా ఇదమిత్థంగాలేని సహాయ నిరాకరణ మాత్రమే. కార్యాచరణలో అది ప్రతి సంవత్సరం జరిగే

గోయితే, డాంటేల కవిత్వం, ఆయా భాషలలో చదివే నేర్పు సంపాదించారు. (కేంబ్రిడ్జ్‌లో ట్రైపోస్ పరీక్ష ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులై, ఇండియన్ సివిల్ పరీక్షలో గ్రీకు, లాటిన్‌లలో అధికతరమైన మార్కులు సంపాదించారు).

కాంగ్రెసు సమావేశంలో రహస్యం అనే ముసుగులో మితవాదులతో తెరవెనుక తర్జనభర్జనలకే పరిమితమైంది. ఆ సమయంలో శ్రీఅరవిందులు ముందుకు వచ్చి బెంగాల్‌లోని ప్రముఖుల నందర్నీ బహిరంగంగా ఒక నిర్దిష్టమైన, బలమైన ప్రణాళికతో ఒక భారతీయ పార్టీగా ఏర్పడటానికి ఒప్పించారు. దానికి మహారాష్ట్ర నాయకుడైన తిలక్ మహాశయుని కర్తను చేశారు. వారి ప్రథమ కర్తవ్యం అప్పటిదాకా అధికారం చెలాయిస్తూ రాజకీయాలలో ఉద్దండులైన మితవాదనాయకులను ఎదుర్కొని, వారి నుంచి కాంగ్రెసును, జాతిని కూడా చేజిక్కించుకోవాలి అనేది. మితవాదులకు, జాతీయవాదులకు (అప్పట్లో అతివాదులనేవారు) మధ్య జరిగే చారిత్రాత్మక సంఘర్షణకు ఇది నాంది. ఆ తర్వాత రెండేళ్ళకే భారతదేశపు రాజకీయాల రూపురేఖలు మారిపోయాయి.

రాజకీయ సంస్కరణల ద్వారా ఏదో ఒకనాటికి, అంటే ఒకటి రెండు శతాబ్దాలు పట్టినప్పటికీ స్వయంపరిపాలన సాధిస్తే చాలనేది మితవాదుల లక్ష్యంగా ఉంది. ఇప్పుడు క్రొత్తగా రూపు దిద్దుకున్న జాతీయపార్టీ పూర్తి స్వరాజ్యమే తమ లక్ష్యంగా ప్రకటించింది. 'సిన్‌ఫైన్' అనే ఐరిష్ విమోచనా పథకంవంటి పద్ధతులతో ఈ పార్టీ కార్యసాధనకు ఉపక్రమించింది. దీని మూలసూత్రం స్వయం సహకారం. ఒకపక్క దేశంలోని శక్తులన్నిటినీ సంఘటితం చేస్తూ, రెండోవైపు ప్రభుత్వానికి సహాయం పూర్తిగా నిరాకరించడం, విదేశీ వస్తు బహిష్కారం, స్వదేశీపరిశ్రమలకు చేయూత నివ్వడం, బ్రిటిష్ న్యాయస్థానాలను బహిష్కరించి పంచాయితీ న్యాయస్థానాలకు పునాదులు వేయడం, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను, కళాశాలలను బహిష్కరించి, జాతీయ పాఠశాలలను ఏర్పాటు చేసుకోవడం, యువజన సంఘాలకు పౌరరక్షణాధికారాల నప్పగించడం, అవసరమైన సందర్భాలలో నిరాకరణమే ప్రథమ కర్తవ్యంగా స్వీకరించడం వారి ప్రణాళికలోని ప్రధానాంశాలు. శ్రీఅరవిందులు కాంగ్రెసును వశం చేసుకోవచ్చుని, తద్వారా, రూపొందించిన జాతీయ కార్యాచరణను నిర్వహించే కేంద్రంగా దాన్ని చేయాలని ఆశించారు. రాజ్యంలో సమాంతరంగా

మరో రాజ్యాన్ని ఏర్పాటుచేసుకొని, దాని ద్వారా గెలుపొందే దాకా స్వాతంత్ర్యపోరాటం జరపాలని ఆశించారు. తాను సంపాదకత్వం వహిస్తున్న 'వందేమాతరం' అనే క్రొత్త దినపత్రికను, దానికి కావలసిన వనరులను చేకూర్చుకొని నడపమని చెప్పి పార్టీని ఒప్పించారు. 1907 లో ప్రారంభించి, 1908 లో వారు జైలుకి వెళ్ళేదాకా, అంటే వారు జైలుకి వెళ్ళటంవల్ల అర్ధాంతరంగా నిలిచి పోయేదాకా ఈ 'వందేమాతరం' పత్రికను వారే నడిపించారు. దేశం నలుమూలలకు చేరేటట్లు చేశారు. కొద్దికాలమైనప్పటికీ అది దేశంలో రాజకీయనీతినే మార్చివేసి, కొన్ని మౌలిక సిద్ధాంతాలను ప్రవేశ పెట్టింది. ఆ సిద్ధాంతాలు దేశంలో గట్టిగా నాటుకున్నాయి. ఈ విధంగా ప్రారంభమైన స్వాతంత్ర్యపోరాటం చాల ప్రచండంగాను, ఫలప్రదంగానూ ఉండి, భవిష్యత్తుకి చాలా ఉపయోగపడేదైనప్పటికీ అది ఎక్కువకాలం కొనసాగలేదు. ఇంత సాహసవంతమైన ప్రణాళికను చేపట్టటానికి జాతి సంసిద్ధంగా లేదు.

1907 లో శ్రీఅరవిందులను రాజకీయ నేరస్తుడిగా విచారణ జరిపి వదలి పెట్టారు. ఆ తరువాత చాలామంది నాయకులు చెరసాలలో నుండటం, తెరమరుగవటం జరిగింది. అంతవరకు వ్యవస్థాపకుడుగా, రచయితగానున్న శ్రీఅరవిందులు బెంగాల్‌లో పార్టీ ముఖ్యుడిగా బాధ్యతలు స్వీకరించి, ఒక వక్తగా వేదిక నెక్కవలసి వచ్చింది. 1907 లో సూరత్ జాతీయ కాంగ్రెసుకు అధ్యక్షత వహించారు. అక్కడ కాంగ్రెసులోని రెండువర్గాల మధ్య తలెత్తిన ఘర్షణలవల్ల పార్టీ ముక్కలు ముక్కలుగా చీలిపోయింది. 1908 మే నెలలో శ్రీఅరవిందుల సోదరుడైన బరీంద్ర నడిపిస్తున్న విప్లవ సంఘ చర్యలలో వీరు కూడా పాత్ర వహిస్తున్నారనే అనుమానం మీద, ఆలీపూరు కుట్ర కేసు సందర్భంగా వీరిని అరెస్టు చేశారు. అయితే దానికి ఏ రకమైన సాక్ష్యాధారాలు లేకపోవడంవల్ల వీరిని విడుదల చేశారు.

విచారణలో ఉన్న ఖైదీగా ఒక సంవత్సరంపాటు ఆలీపూర్ జైలు నిర్బంధం తర్వాత, మే 1909 లో వీరు విడుదలై వచ్చి, పార్టీ వ్యవస్థ ఛిన్నాభిన్నం కావటం, దాని నాయకుల జైలుశిక్ష వల్లనూ,

దేశబహిష్కరణ వల్లనూ, తమంతట తాము విధించుకున్న అజ్ఞాత వాసంవల్లను చెదిరిపోవటం గమనించారు. పార్టీ అనేది పేరుకు ఉన్నప్పటికీ అది మూగపోయి శల్యమై, జటిలమైన చర్యలు చేపట్టే శక్తిని కోల్పోయింది. వీరొక్కరే భారతదేశంలో మిగిలి వున్న జాతీయనాయకుడై, ఉద్యమాన్ని పునరుద్ధరించటానికి ఒక సంవత్సరంపాటు ఒంటరిగా కష్టపడ్డారు. తాను చేస్తున్న కృషికి సహకారంగా ఉండటానికై ఆ సమయంలో 'కర్మయోగిన్' అనే ఆంగ్ల వారపత్రిక, 'ధర్మ' అనే బెంగాల్ వారపత్రిక ప్రచురణ ప్రారంభించారు. కాని చివరకు తమ విధానాలను, కార్యక్రమాలను అమలుజరపడానికి తగినంత శిక్షణ జాతికి లేనట్లు వీరు గుర్తించవలసి వచ్చింది. అయితే కావలసిన శిక్షణను తక్కువ స్థాయి స్వయంప్రతిపత్తి ఉద్యమం (హోమ్‌రూల్ మూవ్‌మెంటు) ద్వారాగానీ, దక్షిణాఫ్రికాలో మహాత్మా గాంధీ చేపట్టినటువంటి నిశ్చేష్టిత ప్రతిరోధముతో ఆందోళన జరపడం ద్వారాగానీ, ఇవ్వ వచ్చునని శ్రీఅరవిందులు అనుకున్నారు. కాని ఇటువంటి ఉద్యమాలకి తగిన సమయం రాలేదని, దానికి విహితుడైన నాయకుడు తాను కాదని వారు గ్రహించారు. అంతే కాకుండా ఆలీపూర్ జైలు నిర్బంధంలో పన్నెండు నెలల కాలం పూర్తిగా యోగ సాధనలో గడపటంవల్ల, ఇక ఆంతరంగిక ఆధ్యాత్మిక జీవితమే వారి పరమావధి అయింది. అందువల్ల కొంత కాలం పాటైనా పూర్తిగా రాజకీయాలనుండి విరమించాలనుకున్నారు.

1910 ఫిబ్రవరిలో వారు రహస్యంగా చంద్రనాగూరులో ఏకాంత స్థలానికి వెళ్ళిపోయారు. అదే సంవత్సరం ఏప్రిల్ నెల ప్రారంభంలో ఫ్రెంచి భారతదేశంలోని పాండిచ్చేరికి ఓడలో వెళ్ళారు. 'కర్మయోగి' లో ఆయన సంతకంతో కూడిన రచన కారణంగా, అదే సమయంలో మూడవనేరం ఆయనపై మోపారు. ఆయనను పరోక్షంలో విచారణ జరిపి, ఆ పత్రిక ముద్రించిన వానిపై నేరము మోపి శిక్ష విధించారు. కానీ కలకత్తా హైకోర్టుకు అప్పీలు చేసుకోవడం ద్వారా ఆ శిక్ష రద్దయింది. మూడవసారి కూడ ఆయన మీద చేసిన నేరారోపణ వీగిపోయింది. మంచి

అనుకూల వాతావరణం ఏర్పడగానే రాజకీయాలలోకి తిరిగి రావాలనే ఉద్దేశంతోనే శ్రీఅరవిందులు బెంగాల్ విడిచిపెట్టి వెళ్ళారు. కానీ కొద్దికాలానికే తాను తలపెట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమం యొక్క బృహత్స్వరూపం ఆయనకు గోచరించి, దానికోసమై తన యావచ్ఛక్తినీ కేంద్రీకరించవలసిన అగత్యం స్పష్టమైంది. పర్యవసానంగా రాజకీయాలతోగల సంబంధాన్ని పూర్తిగా తెగతెంపులు చేసుకున్నారు. జాతీయకాంగ్రెసు అధ్యక్షపదవిని అంగీకరించకుండా పదే పదే త్రోసిపుచ్చారు. ఆ తర్వాత అంటే 1910 నుంచి పాండిచ్చేరిలో గడిపిన సమయమంతా[1] ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, సాధనకు అంకితం చేశారు.

నాలుగు సంవత్సరాల మౌనయోగం తర్వాత 1914 లో 'ఆర్య' అనే తత్త్వవిచారణ మాసపత్రిక ప్రచురించడం ప్రారంభించారు. ఆయన ముఖ్యరచనలైన దివ్యజీవనం, యోగసమన్వయం[2], గీతా వ్యాసాలు, ఈశోపనిషత్తు, మొదలైనవన్నీ ధారావాహికగా 'ఆర్య' లోనే ప్రచురింపబడ్డాయి. యోగసాధనలో ఆయనకు సంభవించిన ఆంతరంగిక జ్ఞానాన్ని ఈ రచనల్లో పొందుపరిచారు. మిగతా రచనలు భారతీయ నాగరికత సంస్కృతుల సారాంశం, భావం ప్రధానంగా ఉండే భారతీయ సంస్కృతికి ఆధారాలు (ది ఫౌండేషన్స్ ఆఫ్ ఇండియన్ కల్చర్), వేదాలలోని గూఢార్థం (ది సీక్రెట్ ఆఫ్ ది వేదా – వేద నిగూఢ రహస్యం), మానవ సమాజప్రగతి (ది హ్యూమన్ సైకిల్ – మానవ చక్రం), పద్యకవిత స్వరూపం – దాని పరిణామం (ది ఫ్యూచర్ పొయిట్రీ – భావి పద్యకవిత), మానవ జాతి ఐక్యతను సాధించే అవకాశం (ది ఐడియల్ ఆఫ్ హ్యూమన్ యూనిటీ – మానవ ఐక్యతాదర్శం). ఇంకా ఆయన ఇంగ్లండులోను, బరోడాలోను రాసిన పద్యాలు, రాజకీయ జీవితం గడిపేటప్పుడు రాసిన కొద్దిపాటి పద్యరచనలు కూడా అప్పుడే ప్రచురించడం మొదలు పెట్టారు.

---

[1] 1930 లో రాసిన విషయము. 1937 లో ప్రచురించబడినది.

[2] ఈ రెండు రచనలు, అనేక యితర రచనలు కూడ తరవాత పుస్తకరూపంలో వెలువడినవి.

ఆరున్నర సంవత్సరాల అవిరామ ప్రచురణ తర్వాత 1921 లో 'ఆర్య' పత్రిక నిలిచిపోయింది.

శ్రీఅరవిందుల పాండిచ్చేరి నివాసం మొదట్లో నలుగురైదు గురు శిష్యులతో 1905[1] లో ప్రారంభమైంది. ఆ తర్వాత క్రమ క్రమంగా ఆయన ఆధ్యాత్మిక మార్గం అనుసరించేందుకని చాలా మంది ఆయన చెంతకు రావటంతో ఒక సంస్థ ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడింది. ఉన్నతమైన జీవితం గడపాలనే లక్ష్యంతో, తమ సర్వస్వాన్ని వదలి పెట్టి వచ్చినవారి సదుపాయాలు చూడ టానికి, సామూహికంగా మార్గదర్శకత్వం వహించడానికి ఒక సాధకుల సంస్థ అవసరమైంది. ఈ విధంగా శ్రీఅరవిందాశ్రమా నికి పునాది ఏర్పడింది. అందువల్ల శ్రీఅరవిందాశ్రమ స్థాపన జరిగింది అనేదానికన్నా శ్రీఅరవిందుల చుట్టూ ఆశ్రమం ఏర్పడి క్రమక్రమంగా వృద్ధిపొందింది అనటమే సమంజసము.

శ్రీఅరవిందులు తమ యోగసాధన 1904 లో ప్రారంభిం చారు. భారతదేశంలో దైవసాక్షాత్కారానికి, ఆత్మసిద్ధికి అంతవరకు అవలంబిస్తున్న మార్గాలద్వారా పొందిన ఆధ్యాత్మికానుభవంలోని ముఖ్యాంశాలను ఆయన యోగసాధనలోకి గ్రహించి, ఆ తర్వాత ఇంకా సంపూర్ణానుభవంకోసం అన్వేషణ ప్రారంభించి, మానవ జీవితానికి ఇటు-అటుగా ఉన్న ఆత్మపదార్థములనే వాటిని మేళ వించుతూ, సంఘటితం చేస్తూ ముందుకు సాగారు. యోగమార్గా లన్నిటి పరమాశయం మోక్షసాధనద్వారా పరమాత్మను చేరుకో వడం, ఆ తర్వాత జీవితాన్నుంచి వైదొలగడం. అలా కాకుండా ముందుగానే పరమాత్మస్థాయికి చేరుకొని అక్కడ ఆర్జించిన కాంతినీ, శక్తిని, ఆనందాన్ని జీవితంలో ప్రవేశపెట్టి, దాన్ని పరి వర్తన చేయాలనేది శ్రీఅరవిందుల యోగము. ఈ దృష్టితో చూస్తే పదార్థమయ జగత్తులో ప్రస్తుత మానవుని ఉనికి అచేతనం మీద ఏర్పడిన అజ్ఞానమయ జీవితంగా పేర్కొనవచ్చు. అయి నప్పటికీ ఈ అంధకారంలోనూ, అజ్ఞానంలోను కూడా భగవం

[1] శ్రీఅరవిందులు యోగాన్ని 1904 లో మొదలు పెట్టినట్లు కొన్నిచోట్ల, 1905 లో అని మరికొన్ని చోట్ల చెప్పారు.

తుని ఉనికి, సంభావ్యత అంతర్గర్భితంగా ఉన్నాయి. ఈ సృష్టి పొరపాటున జరిగింది కాదు. పరమ పదం చేరుకొనే ఆత్మ దీనిని మాయ, శూన్యం అని తోసిపుచ్చ నక్కరలేదు. ఆత్మ పరిణామ క్రమానికి ఇదొక రంగము. ఇక్కడ పదార్థమయ జడత్వంలో నుంచి క్రమానుగతంగా దివ్యచైతన్యం వస్తువులలో ప్రత్యక్షమవాలి. పరిణామక్రమంలో ఇంతవరకు చేరుకున్న అత్యున్నత స్థానాన్ని మనస్సు అన్నారు. అయితే చేరుకోదలచిన అత్యున్నత స్థితి అది కాదు. దానికన్నా ఉన్నతమైనది అతిమనస్సు (సూపర్ మైండు). అదే శాశ్వత సత్యచైతన్యం (ఎటర్నల్ ట్రూత్ కాన్షస్‌నెస్). అది తనను తాను తెలుసుకొని స్వయంనిర్ణయం చేసుకునే దివ్యజ్ఞానం యొక్క వెలుగు, శక్తి అని చెప్పవచ్చు. సత్యాన్వేషణ చేస్తున్న అజ్ఞానమే మనస్సు. కాని ఇది తన శక్తులను, రూపాలను సామరస్యపూర్వకంగా ప్రత్యక్షపరుస్తున్న స్వయంస్థిత విజ్ఞానము. అతిమానసము దిగివచ్చినప్పుడు అందరూ కలలు కనే పరిపూర్ణత సిద్ధిస్తుంది. అదే అత్యున్నత మానవత్వము. మహోన్నతమైన దివ్యచైతన్యానికి ఉన్మీలురై ఉంటే ఈ తేజస్సు, ఆనందం అందుకోగలరు. తమ ఆత్మస్వరూపాన్ని తెలుసుకొని భగవంతునితో నిత్య సంయోగాన్ని పొందుతూ అతిమానసశక్తిని అవరోహింపచేసుకొని మనస్సును, జీవితాన్ని, శరీరాన్నికూడా పరివర్తన చేయగలరు. దీన్ని సాధించి, సిద్ధింపచేసుకోవడమే శ్రీఅరవిందుల యోగము యొక్క ప్రగతిశీల ఆదర్శము.

అనువాదకులు: యజ్ఞన్న; ఎ. ప్రభావతి, ఎ. వెంకట్రామ శాస్త్రి

(శ్రీఅరవిందులు: Archives and Research April 1985, pp. 72, 66-71)

శ్రీఅరవిందుల ఆధ్యాత్మిక జీవితం

(శ్రీఅరవిందుల లేఖల నుండి సంకలనం)

శ్రీఅరవిందులు 1904 వ సంవత్సరం నుండి యోగసాధన ప్రారంభించారు. వారికి అంతకుముందు కూడా స్వతఃసిద్ధంగా వాటంతటవే అనుకోనంత ఆకస్మికంగా అనేక అనుభూతులు కలిగాయి. 1892 వ సంవత్సరం లండనులో ఉపనిషత్తులు చదువుతుండగా మానసికానుభవంలో 'ఆత్మ' ను, నిజమైన అంతరాత్మను దర్శించారు. ఆ తర్వాత సంవత్సరం (ఇంగ్లాండులో చాలాకాలం గడిపి) తొలిసారిగా భారతభూమిపై కాలుమోపినప్పుడు విస్తృతమైన నిశ్చలత వారిని ఆవహించింది. ఈ నిశ్చలత ఆయనను ఆవరించి చాలా నెలలు అలాగే ఉంది. 1893 లో వారు ఒక బండిలో ప్రయాణిస్తూ అపాయానికి లోనైనప్పుడు తమలో నుండి దివ్యత్వం పైకి లేస్తున్నట్లు దర్శించారు. 1903 లో కాశ్మీరులో తక్తు-ఇ-సులేమాన్ అనే పర్వత శ్రేణిపై నడుస్తుండగా 'నిరామయమైన అనంతత్వము' అనుభవమైంది. ఇంకా ఒకటి, రెండు సంవత్సరాలు గడిచిన తర్వాత నర్మదా నదీతీరాన ఒక దేవాలయంలో కాళికా దేవి సజీవ స్వరూపం దర్శించారు.

1904 లో అతిశ్రద్ధగా ప్రాణాయామంతో యోగసాధన ప్రారంభించారు. ఈ సమయంలోనే వారు బ్రహ్మానందయోగిని కలుసుకున్నారు. శ్రీఅరవిందులకు వారు చాలా నచ్చినప్పటికీ 1908 వరకు వారికి ఎవరూ, సహాయకులుగానీ, గురువులు గానీ లేరు. 1908 లో మహారాష్ట్రయోగి విష్ణుభాస్కర లేలే శ్రీఅరవిందులకు సంపూర్ణంగా మనస్సును నిశ్శబ్దపరచడం, చైతన్యాన్ని స్తంభింపజేయడం ఎలాగో చూపించారు. దాన్ని శ్రీఅరవిందులు మూడు రోజులలో సాధించేసారు. మామూలుగా అయితే జీవితాంతం పడుతుంది. దీని ఫలితంగా వరుసగా అనేక ఆధ్యాత్మిక సిద్ధులు కలిగి యోగమార్గంలో అధికంగా తెలుసుకోవడానికి వీలు దొరికింది. లేలే మహాశయుడు చివరగా శ్రీఅరవిందులను సంపూర్ణంగా భగవంతుని అధీనంలో ఉండి ఆయన నడిపించి

నట్లు మాత్రమే నడుస్తూండమని చెప్పారు. అప్పట్నుంచి అదే శ్రీఅరవిందుల సాధనకు ప్రధాన సూత్రంగానూ, ఆధారంగానూ అయింది. ఒకటి రెండు నెలలలో వారిద్దరూ విడిపోయారు. అప్పటి నుండి శ్రీమాత భారతదేశం వచ్చేవరకూ వారు ఎవరి వద్దనుంచి ఏవిధమైన ఆధ్యాత్మిక సహకారాన్ని పొందలేదు.

1908, 1909 లలో శ్రీఅరవిందులు విచారణలోని ఖైదీగా ఆలీపూర్ జైలులో ఉన్నపుడు సర్వాంతర్యామియైన ఆ భగవంతుని నిరంతరం దర్శిస్తూండేవారు. "నన్ను మనుష్యులనుంచి దూరం చేస్తున్న జైలుగోడలను పరికిస్తే ఆ ఎత్తైన గోడలు నన్ను బంధించి ఉంచుతున్నట్లు ఏమాత్రం లేదు. ఆహా! నన్ను చుట్టి ఉన్నది సాక్షాత్తు ఆ వాసుదేవుడే. నా జైలుగది కెదురుగా ఉన్న వృక్షశాఖల క్రిందకు వెళ్లాను. అయితే అది వృక్షము కాదు, వాసుదేవుడే అని నాకు తెలుసు. అక్కడ శ్రీకృష్ణుడే నిలబడి నాకు నీడ నిస్తున్నాడు. నా జైలు కటకటాల వైపు, దాని తలుపుగా ఉన్న ఇనుపచట్రం వైపు చూచాను. మళ్లీ నా వాసుదేవుణ్ణే చూచాను. నన్ను కాపలా కాస్తున్న సెంట్రీ కూడా నారాయణుడే. నాకు పరుచుకోవడాని కిచ్చిన ముతక కంబళీమీద పడుకున్నపుడు నా చుట్టూ పెనవేసుకున్న శ్రీకృష్ణుని హస్తాలనే గమనించాను – నా స్నేహితుని, నా ప్రియతముని హస్తాలు. జైలులో బందీలుగా ఉన్న దొంగలు, హంతకులు, దోపిడీ దారులు, మొదలైన వారి వైపు చూస్తే నాకు వాసుదేవుడే కనిపించాడు. ఈ మసక బారిన ఆత్మల్లో, దుర్వినియోగమైన శరీరాల్లో ఉన్నది నారాయణుడే".

శ్రీఅరవిందులు జైలులో ఉన్న కాలంలో ఎక్కువభాగం గీత, ఉపనిషత్తులు చదవడంలోనూ, ధ్యానంలోను, యోగసాధనలోను గడిపేవారు. కోర్టులో ఉన్న సమయంలో కూడా న్యాయవిచారణ కొంచెం వినిపించుకున్నా సాక్ష్యం అసలు పట్టించుకోకుండా ధ్యానంలోనే నిమగ్నులైనారు. ఈ కాలంలోనే జీవితంపై ఆయన అభిప్రాయం పూర్తిగా మారిపోయింది. వారు మొదట్లో యోగాభ్యాసం మొదలు పెట్టింది తమ రాజకీయ కార్యక్రమాలకు ఆధ్యా

త్మిక బలము, శక్తి పొందాలని, భగవంతుని మార్గదర్శకత్వం సంపాదించాలని. కానీ ఇప్పుడు వారి అంతర్గత ఆధ్యాత్మిక జీవితం, అనుభవం అంతులేకుండా వృద్ధిపొంది సర్వత్రా వ్యాపించి చివరకు వారిని పూర్తిగా ఆవహించేసింది. వారి చర్యలు దాని పర్యవసాన ఫలితాలుగా, దానిలో భాగంగా అయినాయి. దేశసేవ, దేశ విమోచనమే కాకుండా అవధులులేని పరిధితో పూర్వం క్షణ కాలమే దర్శన మిచ్చిన ఆదర్శం ఇప్పుడు స్థిరపడింది. అది సకల ప్రపంచానికీ, మావనజాతి భవిష్యత్తుకు సంబంధించినది.

శ్రీఅరవిందుల యోగానికి, వారి ఆధ్యాత్మిక తత్త్వానికి మూలాధారం వారికి కలిగిన నాలుగు మహాసిద్ధులు. అందులో రెండింటిని వారు 1910 లో పాండిచ్చేరి రాకముందే పూర్తిగా సాధించారు. మొదటిది నిశ్శబ్ద నీరవ కాలాతీత పరబ్రహ్మ దర్శ నము. అది 1908 లో లేలే మహాశయునితో కలిసి ధ్యానం చేస్తుండగా సిద్ధించినది. ఈ సిద్ధితోబాటు ప్రపంచమంతా అసత్య మనే భావం కూడా వారి నావరించింది. అయితే అది 1908, 1909 లలో ఆలీపూర్ జైలులో రెండవ సిద్ధి కలిగినప్పుడు అదృ శ్యమైంది. కారాగారంలో వారికి విశ్వచైతన్యం సిద్ధించింది. సర్వాం తర్యామియైన సర్వేశ్వరుని దర్శనం కలిగింది. ఆ తర్వాత రెండు సిద్ధులూ కూడా చరాచర స్వరూపుడైన పరబ్రహ్మగా పరమ సత్యాన్ని దర్శించడం, అతిమనస్సుకు చేరగలిగే ఉన్నతభూమి కల చైతన్యాన్ని పొందడం – కొంతవరకూ వారు ధ్యానసమ యంలో జైలులో ఉండగానే సాధించారు.

1912 లో మూడవ సిద్ధి అనుభవమైంది. అది పరబ్రహ్మతో సాదృశ్యసిద్ధి (పరమ సత్యము). ఉన్నత చైతన్య సీమలలోకి అధి రోహిస్తూ ఉండడం, అక్కడ నుండి ఆ సీమలలోని శక్తిని భౌతిక చైతన్యంలోకి తీసుకొని రావడం జరుగుతూనే ఉంది. 1926 నవంబరు 24 వ తేదీన ఈ ప్రయత్నం ఫలించి అధిమానసిక దైవత్వం భౌతిక జగత్తులోకి దిగివచ్చింది. అధిమనస్సు – మనో మయలోకానికి అతిమానస క్షేత్రానికి మధ్య నుండే అత్యున్నత మైన లోకము. ఈ అవరోహణము అతిమానసము దిగిరావటా

నికి కావలసిన సన్నాహము. అది జరిగినప్పుడు అందరూ కలలు కనే పరిపూర్ణమానవత సిద్ధించవచ్చు. శ్రీఅరవిందులు 1926 నుంచి ఆ అతిమానసాన్ని అవరోహింప జేయటానికి ఆధ్యాత్మికంగా పనిచేయటం ప్రారంభించారు. దానిని శీఘ్రతరం చేయడానికి చివరకు 1950 లో దేహత్యాగం చేశారు.

శ్రీఅరవిందుల మూడు వెర్రులు

(శ్రీఅరవిందులు తన భార్యకు రాసిన లేఖ)

(ఇది శ్రీఅరవిందులు 30 ఆగస్టు, 1905 నాడు మృణాళినీ దేవికి రాసిన లేఖ. ఆలీపూరు బాంబు కేసు విచారణ సందర్భంగా, గ్రే స్ట్రీట్ భవనము తనిఖీలో దొరకి, పోలీసుల వశమై, తర్వాత కోర్టులో దాఖలైన లేఖలలో ఒకటి. ఈ విధంగా అలాంటి ఆంత రంగిక పత్రాలు అకస్మాత్తుగా వెలుగులోకి వచ్చాయి. శ్రీఅరవిం దులు ఏవైతే గుట్టుగా ఉంచాలనుకున్నారో అవి రట్టైనవి. ఈ లేఖల ఆంగ్లమూలములు బెంగాలీ నుండి అనువదించబడ్డాయి.)

1905 ఆగస్టు, 30

ప్రియాతి ప్రియమైన మృణాళినీ,

నీ ఆగస్టు 24 ఉత్తరం అందింది. మీ తల్లిదండ్రులకు మరో విపత్తు సంభవించిందని తెలుసుకుని విచారించాను. వారి కుమారులలో ఎవరు ఈ లోకాన్ని విడిచి వెళ్ళారో నువ్వు వ్రాయ లేదు. విధి విరుచుకు పడినప్పుడు చేయగలిగేది ఏముంటుంది?

సుఖం కోరుకుంటే కష్టం ఎదురయ్యే ప్రపంచం ఇది. ఆనందాన్ని దుఃఖం సదా ఆవహించుకునే ఉంటుంది. కేవలం సంతానం విషయంలోనే కాదు. లౌకికమైన కోర్కెలన్నింటికి ఇది వర్తిస్తుంది. కష్టసుఖాలన్నిటిని దృఢచిత్తంతో భగవంతుని చర ణాలకు సమర్పించుకోవడం ఒకటే దీనికి విరుగుడు.

సరే, నేను నీతో లోగడ చెప్పిన విషయాన్ని ఇప్పుడు ప్రస్తా విస్తున్నాను. అత్యంత అసాధారణ లక్షణం గల ఓ వ్యక్తితో నీ జీవితం ముడిపడి ఉందన్న విషయాన్ని ఈ పాటికి అవగాహన చేసుకునే ఉంటావని భావిస్తున్నాను. నా కర్తవ్యము, జీవితాశ యము, ఈ దేశం లోని నేటి ప్రజల వాటి కంటె భిన్నము. ఏ రకంగా చూసినా ప్రతీ విషయంలోనూ సామాన్య ప్రజలకు భిన్న మైన వాడిని నేను.

మామూలు ధోరణికి అతీతంగా ఉండే అసాధారణ దృక్ప థాన్ని, అసాధారణ ధ్యేయాన్ని, అలౌకిక ఆకాంక్షను గురించి లోకులు ఏమనుకుంటారో నీకు తెలిసే ఉంటుంది. వారి దృష్టిలో అది ఒక పిచ్చి. అటువంటి పిచ్చివాడు తన కార్యంలో విజయం సాధిస్తే అప్పుడు ఆయన్ని ఇక పిచ్చివాడు అనరు. మహా మేధావి అంటారు. అయితే అటువంటి పిచ్చివారిలో ఎంతమంది తమ ధ్యేయసాధనలో విజయం సాధిస్తారు? వెయ్యిమందిలో ఏ ఐదారుగురో ఉంటారు. వారిలో విజయం సాధించేవారు ఏ ఒక్కరో ఉండవచ్చు.

విజయం సంగతి అలా ఉంచు, అసలు నేను ఇంకా నా కర్మక్షేత్రం లోకి పూర్తిగా ప్రవేశించనే లేదు. నన్ను నువ్వు పిచ్చి వాడిగానే జమకట్టు. పిచ్చివాడి చేతిలో పడటం అనేది ఏ మహిళ కైనా దురదృష్టకరమైన విషయం. మహిళల ఆశయాలు, ఆకాంక్షలు అన్నీ ఈ లోకపు కష్టసుఖాలకు సంబంధించినవే అయి ఉంటాయి. అటువంటప్పుడు పిచ్చివాడు తన భార్యను అయోమయంలో పడే యడం తప్ప ఏ మాత్రం సుఖపెట్ట లేడు.

హిందూమత స్థాపకులకు ఈ విషయం బాగా తెలుసు. వారు అసాధారణ వ్యక్తిత్వాలను, అసాధారణ ధ్యేయాలను అలౌ కిక ఆకాంక్షలను అభిమానిస్తారు. వెర్రో, వేదాంతమో ఏదయి తేనేం వారు అటువంటి వ్యక్తిని గౌరవిస్తారు. అయితే మొత్తం మీద ఇది గృహిణికి ఓ ఇబ్బందిగా తయారైంది. దీన్ని పరిష్కా రించడం ఎలా? మహర్షులు దీనికి పరిష్కార మార్గం చూపారు.

"భర్త పరమగురువు అనేది గృహిణికి ఏకైక మంత్రం అని తెలుసుకోండి" అని వారు మహిళలకు ఉపదేశిస్తారు. "ధర్మ పత్ని తన భర్తకు సహధర్మచారిణి. తన భర్త స్వీకరించిన ధర్మం ఏదైనప్పటికి దానికి సహకరించాలి. ప్రోత్సాహం అందిం చాలి. భర్తను దైవంగా భావించాలి. ఆయన సంతోషంలోనే తనూ సంతోషం పొందాలి. ఆయన కష్టాలు తన కష్టాలు కావాలి. కర్మ లను ఎంచుకోవడం పురుషుని వంతు. దానికి సహాయ సహకా రాన్ని అందివ్వడం మహిళల వంతు".

ఇప్పుడు అసలు విషయమేమిటంటే –

నువ్వు హిందూసాంప్రదాయాన్ని ఎంచుకుంటావా? లేక నూతన సంస్కృతి, ఆదర్శాలను అనుసరిస్తావా? ఈ పిచ్చివాడితో నీ వివాహం గత జన్మలో చేసుకున్న పాపాల ఫలితమే. కాబట్టి విధివ్రాతతో రాజీపడటమే మంచిది.

లోకులు అనుకున్నట్లుగా నువ్వు కూడా నీ భర్తను పిచ్చి వాడని తీసిపారేస్తావా? పిచ్చివాడు తన పిచ్చిమార్గాలనే అనుస రించవలసి వస్తుంది. వాటి నుండి ఆయన్ని మరల్చలేకపోతున్నా వంటే, నీ ప్రయత్నం కంటె ఆయన నైజం బలమైనదన్న మాట. అటువంటప్పుడు నువ్వు ఏమీ చేయలేక ఓ మూల కూర్చుని విలపిస్తావా? లేక ఓ అంధచక్రవర్తి సతీమణి తన కళ్ళకు గంతలు కట్టుకుని తను కూడా అంధురాలిగా మసిలినట్లు నువ్వు కూడా నీ భర్తను అనుసరిస్తూ పిచ్చివాడి పిచ్చిభార్య కావడానికి యత్ని స్తావా? నువ్వు బ్రహ్మో విద్యాలయంలో చదువుకున్న దానివి. హిందూ కుటుంబంనుండి వచ్చిన మహిళవు. పూర్వుల హిందూ రక్తం నీ నరనరాల్లో ప్రవహిస్తోంది. దీన్ని బట్టి నువ్వు రెండో మార్గాన్నే ఎంచుకుంటావు. అందులో నాకు ఎటువంటి అను మానం లేదు.

నాకు మూడు వెర్రిలు ఉన్నాయి.

మొదటిది: ఈ సామర్థ్యము, మేధస్సు, ఉన్నతవిద్య, జ్ఞానం, సంపదా – ఇవన్నీ భగవంతునివని, వాటిని ఆయన నాకు ప్రసా దించాడని ప్రగాఢంగా విశ్వసిస్తాను. కుటుంబ పోషణకు అవసర

మైనంత మేరకు, లేదా కచ్చితంగా తప్పనిసరి అయినప్పుడు మాత్రమే వాటిని నా సొంతానికి వినియోగించుకునే హక్కు నాకుంది. మిగిలిన వాటిని భగవంతునికి తిరిగి ఇచ్చేసెయ్యాలి. వినోదానికో, ఆడంబరానికో ఆ మొత్తాన్ని నా కోసం వినియోగించుకుంటే నేను దొంగనే అవుతాను. "ఆ పరమాత్ముడు ప్రసాదించిన సంపదను తిరిగి ఆ పరమాత్మునికే ఇవ్వకపోతే, వారు దొంగలకిందే లెక్క" అని హిందూశాస్త్రాలు చాటుతున్నాయి.

ఇంతవరకు నేను రెండు అణాలు[1] భగవంతునికి ఇచ్చి మిగిలిన 14 అణాలు నా స్వంత సౌఖ్యానికి వాడుకున్నాను. నా సంపాదన ఇలా ఖర్చు అయింది. ఇప్పటికే నీ జీవితంలో సగం భాగం ప్రాపంచిక సుఖాలలో పడి వృథా అయిపోయింది. కడుపు నింపుకోవడం, తన వారి కడుపు నింపడం, వారి అవసరాలు తీర్చడం వంటి వాటిని పశువు సైతం నెరవేరుస్తుంది.

ఇంతవరకు నేను ఓ పశువులాగ, ఓ దొంగలాగ ప్రవర్తించానని నేను తెలుసుకున్నాను. దానికి నేను ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నాను. ప్రాపంచిక సుఖాల పట్ల వైముఖ్యం కలిగింది. ఇవేవీ ఇక వద్దు. ఈ పాపాల్ని ఇక పూర్తిగా త్యజించాను.

ఇంతకీ భగవంతునికి తిరిగి ఇవ్వడం అంటే ఏమిటి?

మంచి కార్యాలకు వినియోగించడం అన్నమాట.

ఉషకో, సరోజినికో సొమ్ము ఇవ్వడం నాకు విచార హేతువు కానేరదు. ఇతరులకు సహకరిచడం ఓ పవిత్రమైన విధి. శరణు కోరిన వారికి రక్షణ ఇవ్వడం అంటే మరింత పవిత్ర విద్యుక్త ధర్మం. అలా అని స్వంత అన్నదమ్ములకో, అక్కచెల్లెళ్లకో మాత్రమే ఇస్తే సరిపోదు.

ఈ చీకటి యుగంలో దేశం మొత్తం అంతా నా శరణు వేడుతోంది. ఈ దేశంలో 30 కోట్లమంది సోదర సోదరీమణులు ఉన్నారు నాకు. వారిలో చాలామంది ఆకలితో అలమటిస్తూ మరణిస్తున్నారు. ఎక్కువ మంది దుఃఖంతోను, కష్టాలతోను సతమత

---

[1] ఆ రోజుల్లో 16 అణాలు ఒక రూపాయి

మోతూ జీవితాలను ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు. వారిని కూడా ఆదుకోవాలి.

నువ్వు ఏమంటావు?

నా దగ్గరికి వచ్చి ఈ విధమైన నా ఆదర్శంలో పాలు పంచుకుంటావా? తిండి, బట్టల విషయంలో మనం అతిసామాన్యంగా మసులుకుందాం. వాస్తవంగా అవసరమైన వాటికే వెచ్చిస్తూ మిగిలిన దానిని భగవంతునికి అర్పిద్దాం. ఇలా చేయాలనే నేను నిర్ణయించుకున్నాను. నువ్వు దీనికి అంగీకరించి, త్యాగం చేయడానికి సంసిద్ధత చూపినప్పుడు మాత్రమే నా ధ్యేయం సఫలం కాగలదు.

"నేను ఏమీ అభివృద్ధి సాధించ లేకపోయాను" అని నువ్వు అంటూండే దానివి. అభివృద్ధికి ఇప్పుడు నేను ఓ మార్గం చూపించాను. ఈ మార్గాన్ని అనుసరిస్తావా నువ్వు?

ఇక నా రెండో పిచ్చి: ఈ మధ్యే అది నన్ను పట్టుకుంది. ఏదో విధంగా నేను భగవంతుణ్ణి ప్రత్యక్షంగా చూడాలి. ఈ రోజుల్లో మతం అంటే -- సమయం సందర్భం లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు భగవన్నామం స్మరిస్తూ ఉండడం, బహిరంగ ప్రార్థనలు చేయడం, తన ధార్మికత్వాన్ని డంబంగా చాటి చెప్పుకోవడం. ఇవేవీ నాకు వద్దు. భగవంతుడు నిజంగా ఉన్నట్లయితే, ఆయనను తెలుసుకోవడానికి ఏదో మార్గం ఉండే ఉంటుంది. ఆ మార్గం ఎంత కష్టమైనదైనా సరే, దానిని అనుసరించాలనే నేను నిశ్చయించుకున్నాను.

ఆ మార్గం కోసం వెతుక్కోనక్కర్లేదు. అది ప్రతీవారి శరీరంలోను, ప్రతీవారి మనస్సులోను నిక్షిప్తమై ఉందని హిందూ మతం పరిగణిస్తోంది. ఆ మార్గాన్ని అనుసరించడానికి కొన్ని నియమాలు కూడా నిర్దేశింపబడినవి. నేను వాటిని అనుసరించడం ప్రారంభించాను. హిందూమతం చెప్పింది బూటకం కాదని నెల రోజుల్లోనే తెలుసుకో గలిగాను. దాని ఫలితాలను నాలో అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడు నిన్ను కూడా ఆ మార్గంలోకి తీసుకురావాలని వాంఛిస్తున్నాను. దీనికి ఆవసరమైన విజ్ఞానం

నీకు లేకపోవడం వల్ల నాతోపాటు నువ్వు ఒక్క అడుగు కూడా వేయలేకపోవచ్చు గాని, నన్ను అనుసరించడానికి మాత్రం నీకు ఏ ఆటంకం ఉండబోదు. ఈ మార్గంలో అందరూ పరిపూర్ణతను సాధించగలరు. అయితే ఈ మార్గంలోకి రావడం అన్నది వారి మనోభీష్టంపై ఆధారపడి ఉంటుంది. బలవంతంగా మాత్రం నిన్ను ఎవరూ ఈ మార్గంలోకి లాగ లేరు. ఈ మార్గాన్ని నువ్వు అంగీకరిస్తే దీన్ని గురించి మరింతగా తెలియజేయగలను.

ఇక నా మూడో పిచ్చి గురించి: ఇతరులు, వారి దేశాన్ని ఓ జడపదార్థంగా మాత్రమే చూడగలరు. పచ్చిక బయళ్ళు, పొలాలు, అడవులు, పర్వతాలు, నదులు – వీటినే చూడగలరు. నేను మాత్రం నా దేశాన్నే ఒక మాతృమూర్తిగా దర్శిస్తాను. తల్లిగా కీర్తిస్తాను. అమ్మగా ఆరాధిస్తాను. తన తల్లి గుండె మీద ఒక రాక్షసుడు కూర్చుని రక్తాన్ని పీల్చడం ప్రారంభిస్తే – తనయుడు ఏం చేస్తాడు?

హాయిగా కూర్చుని ఆహారం ఆరగిస్తాడా?

భార్యాబిడ్డలతో వినోదిస్తాడా?

లేదా తన తల్లికి విముక్తి కలిగించడానికి పౌరుషంతో విజృంభిస్తాడా?

పతనం చెందిన ఈ జాతిని విముక్తి కలిగించే శక్తి నాకు ఉందని తెలుసు. అది ఆయుధశక్తి కాదు. కత్తులతోను, తుపాకులతోను యుద్ధం చేయడానికి సన్నద్ధం కావడం లేదు. అది మరొక రకమైన విద్య. క్షాత్రతేజంతో సరి కాదు. బ్రాహ్మణశక్తి కూడా ఉంది. జ్ఞానం వల్ల ఆవిర్భవించిన శక్తి అది – ఇదంతా నాలో నూతనంగా ఆవిర్భవించిన భావన కాదు. ఈనాటిది కాదు. దాంతో నేను జన్మించాను. అది నా అణువు అణువునా నిక్షిప్తమై ఉంది. మహోత్కృష్టమైన ఈ కర్తవ్యాన్ని పూర్తి చేయడానికే దేవుడు నన్ను ఈ భూమ్మీదకు పంపినాడు. 14 ఏళ్ళకే ఆ బీజం నాలో అంకురించింది. 18 ఏళ్ళు వచ్చేసరికి దృఢంగా వేళ్ళూని అచంచలమైన నిర్ణయంగా బలం పుంజుకుంది.

మా 'ఆంటీ' చెప్పిన మాటలు నమ్మి – కొంతమంది దుష్టులు అమాయకుడైన నీ భర్తను ఈ అపమార్గంలోకి లాగారన్న అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నావు. అయితే అమాయకుడైన నీ భర్త వందలాది ప్రజలను, మంచో, చెడో, ఆ మార్గంలోకి లాగాడు. ఇంకా వేలాదిమందిని తీసుకురాగలడు. ఈ కార్యం నా జీవితకాలంలో నెరవేరుతుందని నేను అనుకోను. కాని అది నిశ్చయంగా జరిగి తీరుతుంది.

నువ్వు ఏం చేయదలచుకున్నావని ఈ సందర్భంగా నిన్ను అడుగుతాను. భార్య అంటే తన భర్తకి బలాన్ని ఇచ్చే శక్తి. ఉషాదేవి మాటలను విని తెల్లదొరలనే అనుకరిస్తావా? నిర్లక్ష్య భావంతో నీ భర్త బలాన్ని క్షీణింప జేస్తావా? లేక సహానుభూతి, సహకారాలతో సహధర్మచరిణిగా దాన్ని ద్విగుణీకృతం చేస్తావా?

"నావంటి సామాన్య గృహిణి అటువంటి గొప్ప విషయాలలో ఏం చేయగలదు? నాకు మనోనిబ్బరం లేదు. తెలివితేటలు లేవు. అటువంటి విషయాలను గురించి ఆలోచించడం అంటేనే భయం నాకు" అని అంటావు. దానికి ఓ సులువైన మార్గం ఉంది. భగవంతుణ్ణి శరణు వేడుకో. భగవదనుభూతి మార్గంలో ప్రవేశించు. నీ లోపాలన్నిటిని ఆయన వెంటనే పరిహారిస్తాడు. భగవంతుని శరణుజొచ్చిన వారిని భయం క్రమేపీ వీడిపోతుంది. నా మీద పూర్తి విశ్వాసం ఉంచ గలిగితే, ఎవరెవరో చెప్పిన మాటలు కాక నా ఒక్కని మాటే వినగలిగితే, నా స్వీయ బలాన్ని నీకు ఇవ్వగలను. అలా ఇవ్వడం వల్ల నా బలం పెరుగుతుందే తప్ప ఏమాత్రం క్షీణించదు. భార్యయే భర్తయొక్క 'శక్తి' – ఆయన బలము అని అంటాము. అంటే భార్యలలో తన ప్రతిభను చూసి, తన ఉన్నత ఆశయాల ప్రతిధ్వనిని విన్నప్పుడు భర్త బలం రెట్టింపు అవుతుంది అనమాట.

"నేను అందమైన దుస్తులు ధరిస్తాను. ఇష్టమైన మృష్టాన్న భోజనం చేస్తాను. నవ్వుతూ, త్రుళ్ళుతూ సౌఖ్యాలతో తేలిపోతాను" అనుకుంటూ ఎప్పటికీ ఇలాగే ఉండిపోతావా? కాని ఈ వైఖరి అభ్యుదయం కానే కాదు.

ప్రస్తుతం మన దేశంలో మహిళల జీవితం సంకుచితమై పోయింది. ప్రయోజన శూన్యంగా మారింది. కాబట్టి వాటి నన్నిటినీ వదిలేసెయ్యి. నన్ను అనుసరించు. భగవత్కార్యం నిర్వహించడానికి మనం ఈ లోకానికి వచ్చాం. దానిని ప్రారంభిద్దాం.

నీలో ఓ లోపం ఉంది. నువ్వు మరీ అమాయకురాలివి. ఎవరు ఏమి చెప్పినా నమ్మేస్తావు. దాంతో నీకు మనశ్శాంతి ఎప్పుడూ కరువు అవుతూనే ఉంటుంది. నీ తెలివితేటలు ఏ మాత్రం పెరగవు. ఏ పనిమీదా ఏకాగ్రత ఉండదు. దీన్ని సరిదిద్దుకోవాలి. ఒక్కరి మాటలు మాత్రమే వినాలి. జ్ఞానాన్ని సంతరించుకోవాలి. ఒకే ధ్యేయం ఉండాలి. స్థిరమైన నిర్ణయంతో నీ పనిని సఫలం చేసుకోవాలి. ఇతరులు వేసే నీలాపనిందలను, చేసే హేళనలను పట్టించుకోకుండా నీ కర్తవ్యానికి అంకితమైపోవాలి.

నీలో మరో లోపం కూడా ఉంది. అది పూర్తిగా నీ నిజ లక్షణం కాదు. వర్తమానకాల ప్రభావం. ప్రస్తుతం బెంగాలీలు సీరియస్ విషయాలను సీరియస్‌గా తీసుకోలేక పోతున్నారు. మతం, ధార్మికత్వం, ఉదాత్త ఆశయాలు, ఉన్నత ధ్యేయాలు, మాతృదేశ విమోచనం – ఇవన్నీ చాలా ముఖ్యమైనవీ, గంభీరమైనవీను. అయితే ఉదాత్తమైన ఈ విషయాలు అన్నీ కొరగానివిగా మారిపోయాయి. ప్రతీ దానిని ప్రజలు తేలికగా నవ్వులాటగా తీసుకోవాలనుకుంటున్నారు. నీ బ్రహ్మోపాఠశాల లోని లోపం నీకు అబ్బింది. బారీకి కూడా అబ్బింది.

ఈ జాడ్యం వల్ల మనందరం కొంత మేరకు కళంకితులం అయిపోతున్నాం. దేవఘర్ ప్రజలలో ఇదీ మరీ ఆశ్చర్యకరమైన స్థాయిలో పెరిగిపోతోంది. ఈ వైఖరిని దృఢమైన చిత్తంతో తొలగించుకోవాలి. దీన్ని నువ్వు సులువుగా చేయగలవు. ఈ చింతన కనుక నువ్వు అలవాటు చేసుకోగలిగితే నీ అసలు స్వరూపం నీలో వికసిస్తుంది. ఇతరులకు మంచి చేస్తూ, స్వార్థత్యాగం చేసే సహజసిద్ధమైన లక్షణం నీలో వస్తుంది. నీకు లేనిదల్లా ఒకటే. అది మనోబలం. భగవదారాధన ద్వారా అది నీకు సిద్ధిస్తుంది.

నీకు చెప్పదలచుకున్న నా ఆంతర్యం ఇదే! దీనిని ఎవరికీ చెప్పకు. ఈ విషయాలను గురించి నీలో నీవు శాంతంగా నెమరువేసుకో. దీన్ని గురించి బాగా ఆలోచించవలసిందే తప్ప భయపడవలసింది ఏదీ లేదు. ప్రార్థనా రూపంలో నీ మనోభీష్టాన్ని నివేదించుకుంటూ, రోజూ ఓ అరగంటో గంటో దైవధ్యానం ప్రారంభించు. దీని కంటే మరేమీ అవసరం లేదు. మనస్సు క్రమేపీ సమాయత్తం అవుతుంది.

భగవంతుణ్ణి ఇలా ప్రార్థించు.

"నా భర్త జీవనమార్గానికి గాని, ఆయన ఆశయాలకు గాని, భగవంతుణ్ణి తెలుసుకునే ఆయన ధ్యేయానికి గాని నేను అవరోధం కాకుండా ఉండాలి. నేను ఆయనకు సదా సహకారిగా, పరికరంగా ఉండాలి" మరి ఇలా చేయగలవా?

ఇట్లు
నీ

మూలం: ఎ.బి. పురాణిగారి 'శ్రీఅరవిందుల జీవితం' 1995 ed., pp. 79-84)

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు (ఏప్రిల్ 2001 'అఖిల' నుండి)

శ్రీఅరవిందుల ఐదు ఆశయములు

(ఆగస్టు 15, 1947 సందేశము[1])

చైత్యాత్మిక క్రమశిక్షణ

15 ఆగస్టు స్వతంత్ర భారతానికి పుట్టిన రోజు. ఈనాటితో పాత యుగము అంతమయింది – మన ఒక్కరికే కాదు, ఆసియాకి, ప్రపంచానికంతటికి కూడ. ఒక కొత్తయుగము ఆరంభమయింది. ఎందుకంటే మానవజాతి పురోగమనానికి – రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో – కీలకమైన పాత్ర వహించగలిగిన ఒక నూతన శక్తి ఆవిర్భవించినది. నా పుట్టినరోజు – కేవలము నా అనుచరులు మాత్రమే ప్రతి ఏడు జరుపుకుంటున్న దినము – ఇంతటి విశేష ప్రాముఖ్యతను సంతరించుకొనుట నాకు ఎంతో తృప్తికరమైన విషయము.

భగవంతుని ఆమోదముద్ర

స్థూలదృష్టికి ఇది అదృష్టవశాత్తూ లేదా కాకతాళీయంగా జరిగిన విషయమే అనిపించినప్పటికి అందులో అంతకు మించిన సూక్ష్మ మొకటున్నది. అది నా జీవితాన్ని మొదట్నుంచి నడిపించుచున్న దైవీశక్తియొక్క అభయహస్తమూ, భగవంతుడు నా కార్యము మీద వేసిన ఆమోదముద్రా అని నా మార్మిక దృష్టికి గోచరమవుతున్నది. వాస్తవమునకు, ఇంచుమించు నేనాశించిన ప్రపంచ ఉద్యమములన్నియు నా జీవితకాలములో సిద్ధించుటను చూడవలయునని ఆశించిన ఆ రోజులలో ఇవి, అసాధ్యమైన కలలుగా కనుపించిననూ, ఈ దినమున అవి, ఫలసిద్ధికి సమీపమందున్నట్లు, లేదా ఫలించుట ప్రారంభమైనట్లు, నెరవేరు మార్గము నందున్నట్లు గుర్తించగలుగుతున్నాను.

ఈ శుభ ముహూర్తమునకు నన్ను ఒక సందేశ మిమ్మని మీరు కోరియుంటిరి. కాని, నేను ఆ సందేశమిచ్చే పరిస్థితిలో లేను. నా బాల్యము, యౌవనకాలమునందు నేనూహించిన లక్ష్య

---

[1] భారతదేశ స్వాతంత్ర దినమునకై ఆలిండియో రేడియో తిరుచినాపల్లి వారు అడుగగా ఇచ్చిన ఈ సందేశము ఆగస్టు 14, 1947 నాడు రేడియోలో ప్రసారము చేయబడినది.

ములు, నా ముందుంచుకొనిన ఆదర్శములు ఇప్పుడు ఫలప్రద మగుటను చూచుచున్నందున, వాటిని గురించిన వ్యక్తిగత ప్రకటనను మాత్రమే చేయగలుగుదును. అవి భావి భారత కార్య భాగము లైనందున, భారతదేశ స్వాతంత్ర్యమునకు సంబంధించి నవని, అందు తప్పనిసరిగా ప్రథమ స్థానము నాక్రమించుకొన గలవని నా నమ్మకము. భారతదేశము మేల్కొనుచున్నదని మొదటి నుండి గట్టిగా చెప్పుచునే ఉన్నాను. అది, తన లౌకిక ప్రయోజన ములను, విస్తృతిని, ఔన్నత్యమును, శక్తిసంపదలను మాత్రమే నెరవేర్చుకొనుటకు గాక – (వాటిని కూడ భారతదేశము విస్మరించరాదు) – నిశ్చయముగ ఇతరులవలె అన్యదేశములపై ఏలుబడిని సంపాదించుకొనుటకు గాక, భగవానుని కొరకు, ప్రపంచ

మానవజాతికి మార్గదర్శి

మునకు సహకరించుట కొరకు, సమస్త మానవజాతికీ మార్గ దర్శిగా, సహాయకారిగా కూడ భారతదేశము జీవించి, వికసించ వలెను.

ఆ లక్ష్యముల, ఆదర్శముల యొక్క సహజ క్రమమిది: భారతదేశపు స్వాతంత్ర్యము, ఐక్యతను గడించగల విప్లవ మొకటి; ఆసియా ఖండము పునర్జీవించి స్వేచ్ఛగలిగి – గతమున మానవ నాగరికతాభివృద్ధికి తాను నిర్వహించిన అమోఘమైన పాత్రను తిరిగి నిర్వహింపగలగ వలయును. నూతనము, మహత్తరము, ప్రకాశమానము, ఔదార్యము నగు జీవనమునకు మానవజాతి ఎదగవలయును. అది బాహ్యమున పూర్ణముగ సిద్ధించుటకు, భౌతికముగ ప్రత్యేక ఉనికిగల ప్రజలు – వారి జాతీయ జీవితమును నిలుపుకొనుచు, కాపాడుకొనుచు, అందరు కలిసి సాధించగల అంతర్జాతీయ సమైక్యతపై ఆధారపడి యుండును. మానవ జాతి కంతటికీ ఆధ్యాత్మిక జీవనమునకు వలయు శిక్షణా విధానములను, ఆధ్యాత్మిక జ్ఞానమును భారతదేశము కానుకగ నొసంగవలయును. కడపటిది, ఉన్నతతర భూమికకు చేతనను ఉద్ధరించుట ద్వారా, మానవుడుద్బుద్ధుడై వ్యష్టిగ, సమిష్టిగ పూర్ణత్వమును గురించి కలలు గనుటకు ప్రారంభించినది మొదలు, వానిని

కలవరపెట్టి, విసిగించిన జీవిత సమస్య లనేకములు పరిష్కరింప బడు నూతన పరిణామ పథము.

భారతదేశము స్వతంత్రదేశమైనదేగాని, ఐక్యతను బడయ లేదు. (అఖండ భారతదేశము కాలేదు) – చీలిపోయి, ఖండము లైన స్వతంత్రమే అది. పూర్వము వలె, బ్రిటిషువారి విజయము నకు కారణమైన విభిన్న సంస్థానములుగ విడిపోయి, మరల అయోమయ స్థితిలో పడిపోవునా యనునట్లు గోచరించెను గాని, అదృష్టవశాత్తూ, అట్టి ప్రమాదపరిస్థితి నుండి తప్పించుకొనగల అవకాశమిపుడు ధృవపడినది. శాసన నిర్మాణ సభవారు తెలివి తేటలతో అవలంబించిన కఠిన పద్ధతి వలన ఛిద్రము, చీలికలు లేకుండా నిమ్నజాతుల సమస్యా పరిష్కారములు సుసాధ్యమైన ట్లినది. కాని హిందు, ముస్లిముల మతబేధము నేడు దేశవిభ జనగా స్థిరపడేటట్లుగ గోచరించుచున్నది. కాంగ్రెసు నాయకులు, దేశనేతలు ఈ నిర్ణయము శాశ్వతమైనదిగ, తాత్కాలిక పరిష్కార మునకు మించినదిగ అంగీకరించరని ఆశించుదము. ఈ విభజన శాశ్వతమైనదే అయిన యడల భారతదేశము తీవ్రముగ దుర్బల మైపోవచ్చును. వికలమైపోవచ్చును. అంతఃకలహములకు సదా అవకాశముండును. నూతన దురాక్రమణకు, విదేశీయుల ఆధిపత్య మునకుకూడ అవకాశము లేకపోలేదు.

దేశవిభజన అంతమైపోవాలి

దేశవిభజన అంతరించవలసి నదే – ప్రస్తుత తీవ్ర పరిస్థితి సమసిపోవుట వలన గాని, శాంతి, అన్యోన్యతల ఆవశ్యకతను క్రమక్రమముగ గుర్తించుట వలన గాని, అందరకు సంబంధించిన నిరంతర కార్యాచరణలను చేపట్టుట వలన గాని, మరేదో ఒక మార్గమున ఐకమత్యము ఏర్పడుట వలన గాని – ఈ విభజన అంతరించి పోగలదని ఆశించుదము. ఐక్యత ఏ రూపమునందైై నను రావచ్చును – దాని సరియైన రూపము ఒక (మతపరమైన) మూల సిద్ధాంతముగ ప్రాధాన్యత గలదిగ గాక, వ్యావహారిక (సర్వమత సమ్మత) మైనదిగ ఉండవచ్చును. ఏ విధముననైనా ఈ విభజన అంతరించి పోవలసినదే – తప్పక అంతరించి పోవును.

ఏకము (అఖండము) కాని యడల భారతదేశ భవిష్యత్తు తీవ్ర ముగ క్షీణించును. విఫలము కూడ కావచ్చును. కాని అటుల కారాదు.

భారతదేశపు పాత్ర

ఆసియా మేల్కొనినది. అందలి బహు భాగములు విముక్తములైనవి. లేదా ఈ క్షణమున విముక్తములు కానున్నవి. ఇంకనూ దాస్యమందున్న ఇతర భాగములు స్వాతంత్ర్యమునకై తీవ్రముగ పోరాడుచున్నవి. ఏ స్వల్పమో మిగిలియున్నచో అది నేడో రేపో పూర్తియగును. ఈ విషయమున భారతదేశము తన పాత్రను నిర్వహించవలసి యున్నది. ఆ కార్యము శక్తిసామర్థ్యములతో ప్రారంభమైనది. తద్వారా అది తనకుగల సామర్థ్యమును అంతర్జాతీయ సభయందు తన స్థానమును పొందగలుగును.

తుదకు విజయము తథ్యము

మానవజాతి ఐక్యమగుటకు మొదలిడినది. అది అసంపూర్ణమైనా — నిర్మాణాత్మక ప్రారంభము మాత్రమే — అయిననూ, భయంకరమైన దుస్థితులతో పోరాడవలసి యున్నది. ఈ పోరాటము భయంకరమైనదే. చరిత్రానుభవమును మార్గదర్శకముగ అంగీకరించినట్లయితే, విజయము సాధించువరకు ఆ తీవ్రత తప్పని సరిగ ఉద్ధృతము కాగలదు. ఇందున కూడ భారతదేశము ముఖ్యమైన పాత్రను నిర్వహించుటకు మొదలిడినది. విస్తృత రాజనీతిజ్ఞ తను వృద్ధిపరచుకొనినట్లయితే — తాత్కాలిక పరిస్థితులకు, తక్షణ అవకాశములకు గాక — భవిష్యత్తును దృష్టి యందుంచుకొని ముందడుగు వేసిన; ఆమె ప్రత్యక్షతయే, తామసము — భయాన్వితమైన అభివృద్ధికి; సాహసము — చురుకుదనమూగల అభివృద్ధికి మధ్యగల తారతమ్యమును తెలియజేయును. ఇందునా ప్రళయాంతక మొకటి జోక్యము కలిగించుకొని ఆటంకములు కలిగించవచ్చును. లేదా చేసిన దానినంతనూ నాశనము చేయనూ వచ్చు. అయినను తుదకు విజయము తథ్యము. ఏమైనప్పటికినీ, అనివార్యమైన ఆమె కదలికను, ఆమె సాధించినదానిని బట్టి,

ఐక్యత ప్రకృతి ధర్మమునందు అవసరమైనదని ముందుగనే నిర్భయముగ చెప్పవచ్చును.

అంతర్జాతీయ స్ఫూర్తి

ఇతర దేశములకు కూడ దాని ఆవశ్యకత విదితమైనది. ఆ ఐకమత్యమే లేనట్లయితే ముమ్మందు చిన్న చిన్న దేశ ప్రజల స్వతంత్రమెన్నటికిని సురక్షితము కాజాలదు. పెద్దవి, శక్తివంతములైన దేశములు కూడ సురక్షితముగ మనజాలవనుట నిశ్చయము. అటులనే భారత దేశము ఖండములుగ యున్నచో ఆమె రక్షణయందు ఆమెకే నమ్మకముండదు. అందువలననే సర్వమానవ శ్రేయస్సు దృష్ట్యా, ఐకమత్యము ఏర్పడవలయును. మానవ దుర్బలత్వము, బుద్ధిహీనమైన స్వార్థతలు మాత్రమే దానిని ఆటంకపరచును. తమ కెదురు దైవ ప్రయత్నములు కూడ నిష్ప్రయోజనములని అందురు. ప్రకృతి అవసరమునకు దైవసంకల్పమునకు వ్యతిరేకముగ అధిక కాలమివి నిలువజాలవు. జాతీయత స్వతః సిద్ధించును. అంతర్జాతీయ రూపములు, స్థాపనల అభివృద్ధి జెందవలయును. ఇరుదేశముల లేదా సంఘపౌరత్వము వంటివి కూడ పెంపొందవచ్చును. ఈ విధముగ సంప్రదాయములు స్వతః చేరువ కావచ్చును. జాతీయ భావదృక్పథములు తమ తీవ్రతను విడనాడి పూర్ణమైన స్వీయ దృష్టితో సమగ్రముగ సమన్వయించు కొనవచ్చును. మానవజాతి 'ఏకత్వము' నూతనశక్తితో ప్రకాశించును.

భారతీయ ఆధ్యాత్మిక ఎగుమతి

ప్రపంచమునకు భారతీయ ఆధ్యాత్మిక ప్రదానమప్పుడే ప్రారంభమైనది. భారతీయ ఆధ్యాత్మికత ఐరోపా, అమెరికాలలో నిరంతరం అధికాధిక పరిమాణమున వ్యాపించుచున్నది. ఈ ఉద్యమము కాలానుగుణమైన విపత్తులు సంభవించిననూ అందరు అధికమైన ఆశతో ఆశ్రయము లభించునని కూడ – ఆమె ప్రబోధములకు మాత్రమేకాక, ఆమె ఆత్మకొరకు, ఆధ్యాత్మిక సాధన కొరకు దృష్టిని భారతదేశముపై నిలిపి యున్నారు.

ఇక మిగిలినదంతా నా వ్యక్తిగత నమ్మకము, భావము, నా ఆదర్శములే. భారతదేశములోను, పాశ్చాత్యదేశములలోను దూరదృష్టిగల మేధావులు వీటిని గురించి ఆలోచించుటకు మొదలిడిరి. ఇతర మార్గములకన్న ఈ మార్గమునందున్న కష్టములు భయంకరములైనవి. అయినా యీ కష్టములు అధిగమించబడు కొరకే వచ్చును. పరమేశ్వరుని సంకల్పమున్న, వాటిని అధిగమించగలము. ఇచ్చట కూడ ఆత్మోన్నతి, అంతఃశ్చేతనల ద్వారా ఈ పరిణామము జరగవలసి యున్నది – ఇది విశ్వావకాశమే అయినా దీని ప్రారంభము, కేంద్రోద్యమము భారతమాతదే కావలెను.

భారత స్వాతంత్ర్యదినమైన ఈ దినమున నా భావమిది. ఇది ఎంతవరకు సంభవము – ఏ విధంగా ఎంత త్వరగా నెరవేరుననునది. నూతన స్వతంత్ర భారతదేశముపై ఆధారపడి యున్నది.

(ఆగస్టు, సెప్టెంబరు 2000 'అఖిల' నుండి)

(*SABCL* Vol. 26, pp. 404-06)

శ్రీఅరవిందుల సాధన – దాని లక్ష్యములు

శ్రీఅరవిందులు

నా సాధన నా కోసం కాదు – పృథ్వీచేతనకు వెలుగుబాటను చూపుట కొరకే చేయబడింది. నా సాధన ద్వారా నేను సాధ్యమని చూపిన అంతర్వికాసము, రూపాంతరీకరణము, నూతనశక్తి ఆవిష్కరణము మొదలైనవి అందరికీ ముఖ్యమైనవే. అనివార్యంగా జరగవలసిన దివ్యచేతనావతరణానికి మార్గం సుగమం చేయడానికే నా సాధన ఉద్దేశింపబడినది.

*

అతిమానసమును నా కొరకే పొందాలనే అభిలాష నాకు లేదు; నాకోసమని నేనేమి చేయలేదు. ఎందుకంటే మోక్షమును కాని లేదా

అతిమానసమును కాని పొందవలసిన అవసరం నాకు లేదు. నేను అతిమానస అవతరణకు ప్రయత్నిస్తున్నానంటే, అది పృథ్వీ చేతన కొరకే. నేను అతిమానసమును పొందుట పృథ్వీచేతన యొక్క అతిమానసీకరణం కొరకై ద్వారములను తెరచుటకే సుమా!

*

కొన్ని నూతన ధర్మములను (principles) పైనుంచి తీసుకొని వచ్చి ఈ భూగోళ చైతన్యంలో ప్రవేశపెట్టుటకై నేను ప్రయత్నించుచుంటిని. సత్యము, జ్యోతి, సామరస్యము, ప్రశాంతములను నేను ఊర్ధ్వలోకములలో దర్శించితిని. వాటి ప్రజ్ఞపాటవములను గ్రహించితిని. నా చేతన మీదికి అవి ప్రసారమగుచున్నట్లు గుర్తించితిని. కాని అది చాలదు. అంతమాత్రం సరిపోదు. మానవుడు ఈ అంధకార జీవితాన్ని ఎన్నాళ్లు భరించాలి? అందుకనే ఆ ఊర్ధ్వశక్తులకు నాలోని అణువణువును అర్పించుకొని ఆ మూల చైతన్యముచే గ్రహింపబడుటకై శ్రమించుచుంటిని. ఆ పరమ సత్యము ప్రపంచములోకి దిగివచ్చి దివ్యచైతన్యమును ఆవిర్భవింప చేయుటయే భూలోక పరిణామముయొక్క చరమ దశ.

శ్రీమాతకు జపానులో ఉన్నప్పుడు రాసిననాటి ఉత్తరాలలోని కొన్ని అంశములు

Heaven we have possessed, but not the earth; but the fullness of the Yoga is to make, in the formula of the Veda, “Heaven and earth equal and one”.

*

ప్రతికూల పరిస్థితులపై పూర్తిగా విజయము సాధించేంతవరకు గాని లేక ఆ పరిస్థితుల చేతిలో ఓడిపోయేంతవరకు, నన్ను భగవంతుడు నిర్దేశించిన మేరకు, ఆధ్యాత్మికం, భౌతికం మధ్య పోరాటం సాగించేంతవరకు నేను ఈ ప్రపంచంతో సదా సంబంధం కలిగి వుంటాను.

వైఫల్యాలు, కష్టాలు, పైకి కనిపించే అసంభవాలకు సంబంధించి నేను వాటికి అలవాటు పడిపోయాను. ఎంతగా వాటికి అలవాటు పడ్డానంటే, ఏవో కొన్ని క్షణాలలో తప్ప ఎల్లప్పుడూ అవి తమంతట తాము ఎదురవుతుంటే వాటిని పట్టించుకోవడం మానివేశాను.

విశ్వవ్యాప్తంగా సర్వనాశనం అవుతున్న ఇటువంటి కాలంలో ఎటువంటి నిరుత్సాహం లేకుండా ఉండడానికి ప్రశాంత హృదయం కావాలి. సుస్థిరమైన సంకల్పం కావాలి. సంపూర్ణ స్వార్థపరిత్యాగం కావాలి. సృష్టికి అతీతంగా మెరిసే దైవత్వం వైపు దృష్టిని సారించి నిరంతరం ఏకాగ్రతతో కేంద్రీకరించాలి.

అటు ఆధ్యాత్మికం, ఇటు భౌతికం రెండు పక్షాల మధ్యన నువ్వా నేనా అని యుద్ధమే జరుగుతోంది. (యూరప్‌లో) కందకాల యుద్ధం (trench warfare) లాగ. భౌతిక ప్రపంచం ఎంత ప్రతిఘటిస్తున్నప్పటికి, ఆధ్యాత్మిక శక్తి తను పట్టిన పట్టు వీడకుండా తన సామ్రాజ్యంలో ప్రతి అంగుళం తనదేనంటూ, ప్రతికూల దాడులు చేస్తూనే వుంటుంది.... ఆధ్యాత్మిక శక్తి, ఆనందము లేకపోతే ఈ పోరాటాన్ని తట్టుకోటం చాలా కష్టం. కాని జ్ఞాననేత్రానికి దూరదృష్టి ఉంది. ఇదంతా సుదీర్ఘమైన పోరాటంలోని ఓ ఘట్టమే అని దానికి తెలుసు.

అనువాదం: యజ్ఞన్న

(*SABCL* Vol. 26, pp. 144-45, 143; Vol. 26, pp. 424-25)

అయితే ఒకానొక నూతనజాతి ఆవిర్భావం అసంబద్ధమని ఎందుకు భావించాలి? ఇంతకు పూర్వము కాలగతిలో ఈ సృష్టిపై చరించిన ఆచార్యులు, మహాపురుషుల చర్యలను అధిగమించటమే మహాపాప మైతే తదనంతరం ఈ పుడమిపై అడుగిడిన మహాపురుషులంద రికీ ఈ మహాపాపం చుట్టుకుంటుంది గదా. ఈ కోవకే చెందిన గౌతమబుద్ధుడు, శంకరులు, చైతన్య మహాప్రభు బోటివారంతా ఆ నేరాన్ని చేశారన్న మాటే. అలా కానట్లయితే వీరి నూతన తత్వ సిద్ధాంతాలు, మతస్థాపనలు మొ॥ ఏమి ఒరగబెట్టినట్లు? నూతన విషయాల ఊసెత్తకుండా, గతంలో పూర్వుల తత్వబోధనలనే మళ్లి వల్లె వేయటం వల్ల ఈ మహాపురుషులు సాధించగలిగేదేమిటని ప్రశ్నిస్తున్నాను.

అయితే ఆ విషయాలనే, మరో కొత్త కోణం నుంచో సరి యైన దృక్పథముతోగాని వీరు చెబుతున్నారని నీవు వాదించ వచ్చును. అలా అయితే గతంలో ఎవ్వరూ ఈ విషయాలను సరిగ్గా, చక్కగా గ్రహించలేదని, వివరించలేదని అర్థం చేసుకోవాలి, అవునా! ఇదంతా అవాస్తవం సుమా! నూతన ఆచార్యపరంపరకు చెందిన శంకర, రామానుజ, మధ్వాదులున్నూ ఈ ఘోర అకృత్యానికి పాల్పడి చర్విత చరణంగా ఈనాడున్నూ విసుగు విరామం లేకుండా పునరావృత్తి చేస్తున్నారని నీవు ఆక్షేపించవచ్చును. అయితే ఈ పునరావృత్తి విచిత్ర మేమంటే ఒకరి బోధ మరొకరు అవాస్తవమని నిరసించటమేనని తెలుసుకో. గతమంతా శిరో ధార్యమే! కాదని ఎవరన్నారు? కానీ, నాయనా! భాగవత్తత్వం బహువిశాలమై, ఆద్యంతరహితమైనది. సత్యస్వరూపదర్శన మొక సుదీర్ఘ ప్రక్రియ అని గ్రహించు. బహుముఖమైన ఈ సత్యాన్వే షణ కొంగ్రొత్త నూతన విషయ దర్శనమునకో లేక నూతన మార్గమునకో దారి చూపవచ్చును. నాయనా! తత్వమంతా ఒక బంగారు పేటికలో నిక్షిప్తం చేసి, ఒకానొక మహాపురుషుడు ఆ పేటిక తాళం పగులగొట్టి అందలి తత్వాన్ని బహిర్గతం చేయగా,

తదనంతరం అవతరించిన మహాపురుషులంతా, ఆ తత్వాన్నే మొక్కుబడిగా బోధిస్తూ, పూర్వోక్తమంతా అవాస్తవం కాదని, నిరూపించటమే పరమార్థమని భావించట మెన్నటికీ తగదు.

అనువాదం: శ్రీశరణ్

(*SABCL* Vol. 26, p. 135)

శ్రీఅరవిందులను గురించి శ్రీమాత

అవతార పరంపరలో ప్రతి అవతారము రాబోవు వైభవాన్ని సూచించే వైతాళికుడు.

అయితే మానవులు పూర్వపు అవతారాలనే కొలుస్తూ వర్త మాన మహాపురుషులను తోసి పుచ్చుతారు.

శ్రీఅరవిందులు కూడా భావికాలంలో సిద్ధించబోయే మహా సత్యాన్ని తెలియచెప్పడానికే అవతరించారు. వారు చెప్పేదానికి కూడా పూర్వపు అవతారాలకు లభించిన వ్యతిరేకతే నేడు లభి స్తోంది.

అయితే వారు ఈ నాడు ఆవిష్కరించిన మహాసత్యం భవి ష్యత్తులో ప్రతిష్ఠితమై వారి కార్యం కొనసాగుతుంది.

*

ప్రపంచచరిత్రలో శ్రీఅరవిందులు ప్రతిపాదించినది కేవలం ఒక బోధనా కాదు, ఒక దర్శనమూ (revelation) కాదు. అది పరమే శ్వరుడు స్వయంక నిర్వహిస్తున్న ఓ మహాకార్యము.

ఆ కార్యాన్ని నెరవేర్చాలన్నదే నా ప్రయత్నము.

*

ప్రపంచచరిత్ర మొదలైన నాటి నుంచీ భూమి మీద సంభవిస్తున్న మహత్తర పరివర్తనలన్నిటిలోను శ్రీఅరవిందులు ఏదో రూపాన, ఏదో ఒక పేరుతో వాటికి కర్తృత్వం వహిస్తూనే ఉన్నారు.

*

ప్రశ్న: శ్రీఅరవిందుల పుట్టుక విశ్వచరిత్రలో శాశ్వతమని చెప్పారు కదా! శాశ్వతమంటే ఏమని అర్థం చేసుకోవాలి.

ఈ వాక్యాన్ని నాలుగు భూమికల్లో నాలుగు చైతన్యదశలుగా అర్థం చేసుకోవచ్చు.

1. భౌతిక ప్రపంచంలో ఆయన జన్మ పరిణామం అనంత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది.

2. ప్రపంచ చరిత్రలో ఆయన జన్మ చిరస్మరణీయమైపోతుంది.

3. చైత్యపరంగా ఆయన ప్రతి యుగంలోనూ జన్మిస్తూనే ఉంటారు.

4. ఆధ్యాత్మికంగా చెప్పాలంటే అది పరమేశ్వరుడు ప్రభవించడమే.

*

శ్రీఅరవిందుల శతవార్షిక సందర్భంలో వారికి మనం ఈయగల్గిన ఉత్తమ శ్రద్ధాంజలి ఏమిటంటే పురోగమించాలనే తహతహ ఏర్పరచుకోవడం. మన యావజ్జీవనాన్ని ప్రభువైన ఆ పరమాత్మ ప్రభావానికి లోబడి నడుచుకోవడము చేయాలి.

*

ప్రశ్న: శ్రీఅరవిందులు రచనలు చదివినపుడు, వారి ప్రవచనాలను విన్నప్పుడు ఆశ్చర్యచకితుణ్ణవుతాను. ఈ శాశ్వత సత్యం, ఆయన మాటల తీరులోని ఇంపైన సొంపు, ప్రజల దృష్టికి రాకుండా ఎలా కనుమరుగైనాయి? అది నిజంగా విచిత్రంగానే ఉంటుంది. ఒక అవతారంగా గాకపోయినా కనీసం ఒక మహా సృష్టికర్తగా గానీ, ఒక మంచి కళాకారునిగా గానీ, మహాకవిగా గానీ గుర్తింపు రాలేదు కదా!

శ్రీఅరవిందులను ఎవరు అర్థం చేసుకోగలరు? ఆయన విశ్వమంత విశాలహృదయుడు. ఆయన ఉపదేశాలకు అవధుల్లేవు.

ఆయనను సమీపించాలంటే ఆయనను హృదయపూర్వకంగా ప్రేమించడం ఒక్కటే మార్గం. ఆయన కార్యంలో పాలు పంచుకోడానికి సంపూర్ణంగా ఆత్మార్పణ చేసుకోవాలి. ఆ విధంగా

ప్రతి వారూ వారి వారి సామర్థ్యాన్ననుసరించి శక్తివంచన లేకుండా ఎంత వరకూ చేయగలరో అంత వరకూ పనిచేస్తే శ్రీఅరవిందులు సూచించినట్లు ప్రపంచ పరివర్తనా కార్యం పరిపూర్తి కాగలదు.

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ వెంకట్రామ శాస్త్రి

(*CWM* Vol. 13, pp. 22, 23, 10, 20; Vol. 12, pp. 398-99)

శ్రీఅరవిందుల బోధన

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ

నా సత్యం అజ్ఞానాన్ని, అసత్యాన్ని త్యజించి జ్ఞానం వైపు గమించేది. తమస్సును వదిలి కాంతి వైపు పయనించేది. అహంకారాన్ని వదిలి పరమాత్మ వైపు, అసంపూర్ణతలను తృణీకరించి సంపూర్ణత్వం వైపు పయనించేది. నా సత్యం భక్తి లేదా చైత్యపురోగతికి సంబంధించిందే కాదు. జ్ఞానానికి, స్వచ్ఛతకు, దైవశక్తికి ప్రశాంతతకూ సంబంధించింది. అట్లాగే వీటన్నిటినీ వాటి వాటి మానసిక, ఉద్రేకపర, ప్రాణిక రూపాలనుండి అతిమానసిక వాస్తవం వైపు ఉద్ధరించేది.

*

మానవుని మహాప్రస్థానం

మానవజీవిత మంతా దివ్య జీవనం వైపు పయనించే ఓ తీర్థయాత్ర, ఓ పర్వతారోహణము, ఓ మహాయజ్ఞం, ఆమోద యోగ్యమైన త్యాగం. కేవలం అదే మానవునికి ఈ ప్రపంచంలో ఉన్న అసలు సిసలైన పని. అతని అస్తిత్వానికి సార్థకత. ఇది లేకుంటే మానవుడు ఈ భౌతిక ప్రపంచపు విశాల వీధుల్లో ఎట్లాగో స్థానాన్ని పొందిన బురద జలాల్లోని క్షణభంగురమైన కీటకాల మధ్య పాకే మరో కీటకం మాత్రమే.

దృశ్యమాన ప్రపంచం యొక్క యథార్థ స్వరూపము

శ్రీఅరవిందుల బోధనలు మన ప్రాచీన ఋషులు చెప్పిన జ్ఞానదీపికలతోనే ప్రారంభమవుతాయి. ఈ విశ్వంలో కనిపించే ప్రతి రూపానికి వెనుక పరమాత్మతత్వం, చైతన్యం ఉంటాయి. అన్నిటిలో ఉండేది ఆత్మ ఒక్కటే. అది ఆద్యంతములు లేనిది. జీవుల్ని ఆ పరమాత్మలోనే ఐక్యమై ఉన్నప్పటికీ ఒక వేర్పాటు చైతన్యం వల్ల విడిపోతున్నాయి. వారి మనః ప్రాణ శరీరాలలో ఉండే సత్యమైన ఆత్మను తెలుసుకోలేని అజ్ఞానం అది. ఒకానొక మానసిక ప్రక్రియ ద్వారా ఈ వేర్పాటు చైతన్యపు తెర తొలగించి మనలోను, అందరిలోను ఉన్న నిజమైన ఆత్మను, దైవత్వాన్ని తొలగించి మనలోను, అందరిలోను ఉన్న నిజమైన ఆత్మను, దైవత్వాన్ని తెలుసుకోవటం సాధ్యమే.

చేతనా పరిణామము

ఆ ఏకైక పరమాత్మ, ఆ చైతన్యం భౌతికపదార్థంలో చిక్కుకొని ఉన్నదని శ్రీఅరవిందులు అంటారు. ఆ చిక్కులోంచి విమోచనం కావడమే పరిణామలీల. జడంగా కనిపిస్తున్న దానిలో నుంచి చైతన్యం పైకి ఉబుకుతుంది. ఇలా వచ్చిన చైతన్యం ఊర్ధ్వ ముఖంగా పెరగాలని, విస్తరించాలని ఇంకా ఇంకా పరిపూర్ణం కావాలని, స్వయంసిద్ధంగా ప్రేరణ పొందుతుంది. ఈ విధంగా విడుదల పొందిన చైతన్యం ఎక్కే మొదటి మెట్టు జీవం. రెండోది మనస్సు. కాని పరిణామక్రమం మనస్సుతో ఆగిపోదు. ఇంకా స్వేచ్ఛగా ఎదిగి గొప్ప ఆధ్యాత్మిక, అతిమానసిక చైతన్యంలోకి పెరగాలని ఎదురు చూస్తుంది. పరిణామక్రమంలో తర్వాతి మెట్టు అతిమానసము. అంటే పరమాత్మయొక్క శక్తినిలయంగా ఉండే చైతన్యమయ జీవి. అప్పుడు మాత్రమే పదార్థంలో అంతర్లీనమైన దైవత్వం పూర్తి విముక్తి పొందుతుంది. ప్రాణికోటిలో పరిపూర్ణత అభివ్యక్తమవుతుంది.

అతిమానసము దిగివచ్చుట

పూర్వం వృక్షకోటిలోనూ, జీవరాశిలోనూ ఉద్దేశపూర్వ

కమైన సంకల్పం లేకుండానే పరిణామ క్రమంలోని మొదటి మెట్లను పకృతే దాటింది. ఇప్పుడు చేతానాత్మక సంకల్పమే పరి కరంగా చేసి ప్రకృతి మానవునిలో పరిణతి పొందగలుగుతోంది. కానీ, ఇది కేవలం మానవుని మానసిక సంకల్పం వల్ల జరిగేది కాదు. ఎందువల్లనంటే మనస్సు కొంతవరకే పోతుంది. ఆ తర్వాత వలయాల్లో తిరుగుతూంటుంది. ఒక పరివర్తనం జర గాలి. మనస్సు ఇంకా ఉన్నత తత్త్వంగా మారేటట్లు చైతన్యాన్ని మళ్లించాలి. పూర్వపు తత్వసాధన, యోగాభ్యాసాలలో ఈ పద్ధ తిని గమనించవచ్చు. ఆ రోజుల్లో ప్రపంచానికి దూరంగా వెళ్లి పరమాత్మలో లీనమవటానికి సాధన చేసేవారు. శ్రీఅరవిందులు చెప్పేదేమంటే, ఆ ఉన్నత తత్త్వాన్ని ఇహలోకంలో అవతరింప చేయటం సాధ్యమే; ఆ ఆధ్యాత్మిక పరతత్వాన్ని ఈ ప్రపంచం నుంచి విముక్తం చేయటమే కాదు. దానిని ఈ లోకంలోనే నిలిపి, మనస్సుయొక్క అజ్ఞానాన్ని పరిమితజ్ఞానాన్ని తొలగించి అతి మానస చైతన్యాన్ని ప్రవేశపెడుతుంది. అంతర్గతమైన పరమాత్మకు స్థిరైన పరికర మవుతుంది. దాని ద్వారా మానవుడు తన శక్తి సామర్థ్యాలనూ, అంతరంగాన్ని కూడా తెలుసుకొని ఇప్పటిదాకా ఉంటూ ఉన్న జంతుమానవత నుంచి దివ్యమైన జాతిగా పరి ణామం చెందగలడు. ఇంకా తెర మరుగునే ఉన్న అతిమానస తత్వం పైనుంచి అవతరించి మానవుని మార్చి, పరివర్తన చేయ టానికి వీలుగా తనలోని సకల భాగాలను తెరచి ఉంచడానికి యోగసాధనలోని మానసికక్రమశిక్షణను ఉపయోగించుకోవచ్చు.

*

మానవుడు మహా మానవునిగా పరిణమించుట

ఈ విశ్వంలో మానవుని మొట్టమొదట పని తన అస్తిత్వాన్ని తాను ధృవపర చుకోవడం. అంతే కాదు. పరిణమిస్తూ చివరికి తనను తాను అధి గమించడం. అతను తన పాక్షిక సత్తను సంపూర్ణ సత్తగా, పాక్షిక చైతన్యాన్ని సమగ్ర చైతన్యంగా విస్తరింప చేయాలి. తన పరి సరాలపై పట్టు సాధిస్తూనే ప్రపంచంతో ఐక్యతను, సామరస్యాన్ని

సాధించాలి. తన వ్యక్తిత్వాన్ని సిద్ధింపజేసుకుంటూనే దాన్నొక జగదాత్మగా (Cosmic self), ఒక విశ్వజనీన, ఆధ్యాత్మిక అస్తిత్వ ప్రమోదంగా విస్తరింప జేయాలి. తన మానసిక స్థితిలో ఉన్న అస్పష్టతను, అజ్ఞానాన్ని, అక్రమాన్నంతా సరిదిద్ది, శుద్ధిపరచి, రూపాంతరీకరణ చెందించటం, సంకల్పము, భావన, కర్మ, శీలము, విజ్ఞానాల నిరవధిక, బహుళ సామరస్య, ప్రకాశాలను చివరగా చేరుకోవటం – ఇవే అతని ప్రకృతి అసలు ప్రయోజనం. ఈ ఆదర్శాన్నే అతని మేధస్సుపై సృష్టి ఆరోపించింది. అతని మానసిక, ప్రాణతత్వంపై ఒక అవసరంగా మలచింది. ఒక విశాలమైన సత్తగా, చైతన్యంగా ఎదిగినప్పుడే దీన్ని సాధించ గలుగుతాం. అసలైన దృగ్గోచర పకృతుల్లో పాక్షికంగా, *తాను ఉన్న స్థితి నుండి రహస్య జీవాత్మలలో ఉన్న సంపూర్ణస్థితికి చేరుకునే ఆత్మ విస్తరణ, ఆత్మ సాక్షాత్కారము, ఆత్మ పరిణామము పొందటం, తద్వారా ఆ స్థితిని ప్రత్యక్ష అస్తిత్వంలోనూ, పొందడం – ఇదే సృష్టి సంకల్పం.*

ఈ ఆవేశమే విశ్వాంతరాళంలోని ఈ భూమిపై అతని జీవనానికి సార్థకత. సంకుచిత మానసిక నిర్బంధంలో, పాంచభౌతిక, శారీరక సంకెళ్లకు లోనైన అశాశ్వత ప్రాణిగా, బాహిరంగా గోచరమయ్యే మనిషి, అంతరమైన నిజమైన మనీషిగా, తనపై, తన పరిసరాలపై తన సత్తలోని విశ్వాత్మపై యజమానిగా మారాలి. ఇంకా వివరంగా, ఆదిభౌతిక భాషలో చెప్పాలంటే ప్రాకృతికమైన మనిషి దివ్యమానవుడిగా పరిణతి చెందాలి. తాత్కాలిక జీవులు తాము శాశ్వతత్వానికి వారసులమని తెలుసుకోవాలి.

అంటే మనం చేరుకోవాల్సిన జ్ఞానం మేధోపరమైన సత్యం కాదు; తన గురించి ఆ సర్వభూతముల గురించి సరియైన నమ్మకం, సరియైన అభిప్రాయాలు, సరియైన సమాచారం కల్గి ఉండటం కాదు. ఎందుకంటే అది జ్ఞానం పట్ల మనస్సు ఉపరితలంలో కల్గిన భావన మాత్రమే. భగవంతుని గురించి, మన గురించి, ప్రపంచం గురించి మానసిక అవగాహన పొందటం మేధస్సుకు సరిపోతుందేమోగాని ఆత్మజిజ్ఞాసకి చాలదు. అది

అనంతత్వానికి జాగృతమైన బిడ్డలుగా మనను మార్చ లేదు. మన నిత్యజీవితాన్ని, పనులను మన మేధోపరమైన సత్య, సక్రమ భావనల కనుగుణంగా మలచటం – నైతిక, ప్రాణిక సంతృప్తిని పొందటం – మన జీవన పరమధ్యేయం కాదు. అసలైన సత్తగా, జీవసత్తగా, అనంతమైన, విశ్వజనీనమైన అస్తిత్వం, చైతన్యం, ఆనందం, సచ్చిదానందం యొక్క సత్త్వంగా ఎదగడమే మన లక్ష్యం కావాలి.

అనువాదం/తెలుగు మూలం: ఆచార్య మాడభూషణం
రాజగోపాలాచార్య; 'శ్రీఅరవిందులు – ఒక దీపిక'

(*SABCL* Vol. 23, p. 1049; Vol. 18,pp. 42-43; Vol. 26, pp. 95-96; Vol. 19, pp. 684-85)

సాధనా విధానము

శ్రీఅరవిందులు

మానవుడు ఎక్కువగా ఉపరిగత మనస్సు, ప్రాణ, శరీరాలలోనే జీవిస్తాడు. కానీ అతనిలో అంతర్లీనంగా అంతులేని అవకాశాలు కలిగిన జీవి ఉన్నాడు. అతడు దాని జ్ఞానాన్ని పొందాలి. ఇప్పుడు అతను పొందుతున్నది దాని అత్యల్ప ప్రభావము మాత్రమే. అయి నప్పటికి అదే అతనిని ఇంకా ఎక్కువగా సౌందర్యము, సామ రస్యము, సామర్థ్యము, జ్ఞానముల కోసం నిరంతర ప్రయత్నం చేసేటట్లు ముందుకు తోస్తున్నది. అందువల్ల యోగమార్గంలో మొదట చేయవలసింది ఈ అంతర్గత శ్రేణులన్నిటినీ తెరచిపెట్టి అక్కడే ఉంటూ, బయటదాకా చూచుకుంటూ అంతర్గతమైన వెలుగు, శక్తులతో, బాహ్యజీవితాన్ని నడపాలి. అలా చేయటంలో తన లోపలి నిజమైన ఆత్మను తెలుసుకోగలుగుతాడు. అది ఈ మానసిక, ప్రాణిక, భౌతిక ధాతువులతో కూడిన బాహ్యమైన మిశ్రమం కాకుండా వాటికి మూలమైన యథార్థ వస్తువు –

అఖండ దివ్యజ్యోతిలోని కణము. ఆ ఆత్మలోనే ఉండటం నేర్చు కొని, పవిత్రత పొంది, దాని ఒరవడిలో తన మిగిలిన ప్రకృతి నంతటిని దివ్యసత్యం వైపు మళ్ళించాలి. ఆ తర్వాత ఊర్ధ్వ ద్వారం వివృతమైతే పరమాత్మతత్వం అతని లోనికి అవతరి స్తుంది. అయితే అది పూర్ణమైన అతిమానసిక తేజస్సుగానీ, దాని శక్తి గాని దిగివచ్చినట్లు కాదు. ఎందువల్లనంటే సాధారణ మానవ మనస్సుకూ, అతిమానస సత్యచైతన్యానికీ మధ్య అనేక చైతన్య శ్రేణు లున్నాయి. ఈ చైతన్యశ్రేణులను తెరచి వాటి శక్తిని మనః ప్రాణ శరీరాలలోకి తీసుకొని రావాలి. ఆ తర్వాతే సత్యచైతన్యం యొక్క శక్తి సంపూర్ణంగా ప్రకృతిలో పనిచేయగలదు. ఈ విధ మైన ఆత్మశిక్షణ, సాధనా ప్రక్రియ చాలా క్లిష్టమైనది. చాలా కాలం పడుతుంది. కాని అది లేశమాత్రం లభించినా ఎంతో సాధించి నట్లే. అది అంతిమ విముక్తిని, పరిపూర్ణతను బాగా సాధ్యమయే టట్లు చేస్తుంది.

సంపూర్ణ పరివర్తన

పూర్వపు పద్ధతులు చాలా వరకు ఈ మార్గానికి ఉపయోగపడతాయి. మనస్సును చాలా విశాలత్వంలోకి, పరమాత్మ తత్త్వంలోకి, అనంతంలోకి వివృతం చేయడం, విశ్వచైతన్యంలోకి తీసుకొని వెళ్ళడం, ఆశలను, ఆవేగాలను అదుపులో పెట్టడం అవసరమే. బాహ్యంగా సన్యాసం ముఖ్యం కాదు. కానీ ఆశనూ, అనుబం ధాల్నీ జయించాలి. దేహంపైనా, దేహావసరాల పైనా పేరాశలు, సహజావసరాల పైనా అదుపు తప్పనిసరిగా వుండాలి. పురాతన సాంప్రదాయాలలోని కొన్ని మూలసూత్రాలు ఈ యోగంలో ఉంటాయి. కంటితో చూసిన దానికీ, వాస్తవానికి తేడాను మన స్సుతో గమనించే జ్ఞానమార్గం; భక్తి, ప్రేమ, సమర్పణలకు హృద యంతో స్పందించే భక్తిమార్గం; స్వలాభం కోసం పనిచేసే ఉద్దేశం దగ్గరనుంచి సంకల్పాన్ని దూరం చేసి సత్యం వైపు మరల్చి అహంకన్నా మిన్నయైన వాస్తవానికి సేవ చేసే కర్మ మార్గము. ఈ విధంగా జీవి పూర్తి తర్ఫీదు పొందడం వల్ల దివ్య

తేజస్సు, దివ్యశక్తి ప్రకృతిలో పనిచేసే అవకాశము ఏర్పడి అవి వచ్చినప్పుడు తెలుసుకొని స్పందించి పరివర్తన చెందగలదు.

మన లక్ష్యము భౌమిక చైతన్యాన్ని దాటి దివ్యచైతన్యాన్ని పొందటంతో సరి కాదు. ఈ ప్రపంచాన్ని మార్చగల శక్తి ఒక్క అతిమానసానికే వున్నది. కాబట్టి మనము ఆ అతిమానసశక్తిని ఈ మనోజీవిత శరీరముల అజ్ఞానం లోనికి కూడ ప్రవేశపెట్టి వాటిని పరివర్తింప చేయాలి. భౌతికకోశంలో దైవాన్ని ఆవిర్భవింపజేసి అందులో కూడ దివ్యజీవనాన్ని ప్రతిష్ఠింప జేయాలి.

మన యోగసాధనకు ఇన్ని గంటలు ధ్యానం చేయాలి, ఫలానా మంత్రాలు వల్లించాలి లాంటి నిబంధనలు ఏమీ లేవు. అన్నిటి కంటె ముఖ్యమైనది ఆకాంక్ష (aspiration) – అంటే ఏమిటి? దృష్టిని లోనికి అనగా అంతరంగంలోనికి, లేక ఊర్ధ్వంగా అంటే పైకి సారించి అక్కడ నిలపాలి. అక్కడ వున్న దివ్యశక్తి, దివ్యచైతన్యములను నీ లోకి గ్రహించాలి. ఇది ఎలా అంటారేమో, మీ అంతరంగ కవాటములను తెరవాలి. అప్పుడా దివ్యశక్తి మీ ఎదలోని దైవమును తట్టి లేపి, బాహ్యమానవునిలో కూడ క్రియాశీలము చేస్తుంది. దీనిని ఎదిరించే చేష్టలకు ఏ మాత్రము అవకాశం ఇవ్వకుండా వాటిని తిరస్కరించాలి. స్థిరమైన ఆకాంక్ష, గట్టి విశ్వాసము, పరిపూర్ణ సమర్పణల వలన ఈ విధమైన self-opening వస్తుంది.

తెలుగు మూలం/అనువాదం: 'శ్రీఅరవిందులు – ఒక దీపిక';
డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 26, pp. 96-97; Vol. 23, p. 505)

శ్రీఅరవిందుల పిలుపు

శ్రీఅరవిందులు మహోన్నత శిఖరాల నధిరోహించి, అక్కడ ఆసీనులై, మన మీద దివ్యకాంతులను వెదజల్లి, మనలను అజ్ఞానం నుండి జాగృతము చేస్తున్నారు. ఇందలి భాష సరళమైనప్పటికి భావములు గంభీరములు. ఆయన ఆంగ్లమూలమును శాయశక్తులా అనువదించుటకు ప్రయత్నించితిమి. ఇదే వ్యాసము ఫిబ్రవరి 2004 లో వున్నది. దాని లోని ఆంగ్లలేశములను కూడ ఇప్పుడు తెలుగులో చూడవచ్చు. — సంపాదకుడు

నువ్వు శరీరమును ఎందుకు ధరించినట్లు? జన్మ ఎత్తి ఈ భూమ్మీదికి వచ్చిన కారణమేమి? దివ్యమానవునిగా రూపొంది, దైవావిర్భావమునకు సమర్ధవంతమైన పాత్ర అగుటయే. అందుకని శుచిర్భూతుడవై నిన్ను నీవు తయారు చేసుకోవాలి. మార్గములో కలిగే ఆనందమును అనుభవించు. ఒక వేళ పతన మైనప్పటికి అది మార్గములోని ఒక ఘట్టము మాత్రమే అని ఎరుగుము. కాని ఇదే నీ లక్ష్యము, ఇది మాత్రమే నీ కర్తవ్యము అని గ్రహించు. మార్గములో నీకు కలిగే ఆనందము, నీకు వచ్చే శక్తి కేవలం నీ లక్ష్యసాధనకు మాత్రమే. నీ అవతారోద్దేశ్యము (దేహధారణ), కర్తవ్యము ఇదియే అని గ్రహించు. ఎక్కడో ఎత్తుగా కూర్చుని నిన్ను *పిలుస్తున్న దైవం కూడా నీ తోటే వుండి నీ సాధన చేస్తున్నాడు.* నీ అత్యున్నత శిఖరాలను ఎక్కగలిగేందుకే నీకీ శక్తి ఇవ్వబడింది కాబట్టి నువ్వు సంతోషంగా పయనించ గలుగుతావు.

నీ కర్తవ్యమంటూ యేదైనా వుంటే అది యిదే. నీ లక్ష్యం యేమిటని ప్రశ్నించావనుకో. దానికి జవాబు యిదే. నువ్వు ఆనందాన్ని కోరుకున్నట్లయితే యింతకు మించిన ఆనందం మరొకటి లేదు. నువ్వు ఆనందమని భ్రమిస్తున్న స్వప్నం, సుషుప్తి, ఆత్మవిస్మృతి యివన్నీ పరిమితమైనవి. విచ్ఛిన్నమయిపోయేవి. కాని యిది పరిపూర్ణానందం. నీ అసలు రూపం. నీ నిజస్వరూప మేమిటో తెలుసా? దైవమే. మిగిలినదంతా విచ్ఛిన్నకరమైనది, వికృతమై

నది. ఈ సత్యాన్నే నీ కళ్ల ముందర ఉంచుకొని ప్రతి విషయం లోను, ప్రతి క్షణము దానికి విధేయమైపోవలసిందే.

మేలిముసుగులో వున్న మోమును, ఆ ముసుగు తొలగించి చూడకుండా ఆ ముసుగునే ముఖమని భ్రమపడేవు జాగ్రత్త. కాని నీ లక్ష్యం మాత్రం నువ్వు మారడం. స్వీయ పరివర్తన మానవ స్వభావంలోనే వుంది. ఆత్మపరివర్తనే అతడి నిజమైన స్వభావం. అదే నిజమైన ఆధ్యాత్మిక లక్ష్యమైన ఆత్మోత్థానం.

ఆత్మ అంటే యేమిటి? దానిని అధిగమించడం యేమిటి? ఆత్మపరివర్తనం అంటే యేమిటి? ఇక్కడే నువ్వు పొరబడి తప్పు చేయకూడదు. నిన్ను నీవు తెలుసుకోవడంలో తప్పు జరిగిందంటే మాత్రం, అది నిన్ను సకల కష్టాలలోను ముంచెత్తి సమస్త సందే హాలకు కారణమవుతుంది.

నువ్వు అధిగమించవలసినది యేదంటే, బాహ్యంగా నీకు కనిపిస్తున్న నీవెరిగిన వ్యక్తి – పదార్థానికి, ప్రాణానికి బానిసయి నవాడు. ఆ రెండూ కాకపోతే మనసుకి బానిసయిన మానవజీవిగా వుంటున్నవాడు. అది అతిగాఢమైన, ఘోరమైన పరాధీనత. మన స్సుకీ బానిస కావడం అంటే మనక రూపాన్ని చూసి దానికి దాస్యం చేయడమే.

పరిణామం చెందవలసిన నీ ఆత్మ – పదార్థం, ప్రాణం, మనస్సు అనే తెరల మరుగున నీలోనే వున్నది, అదే ఆధ్యాత్మిక శక్తులు కలిగిన దివ్యమానవుడు. పురుషోత్తముడు. బుద్ధిజీవిస్థాయి నధిగమించి, దివ్యమానవుడు కావడం కోసమే భౌతికజీవితం మీద ఆధిపత్యం సాధించాలి. ప్రస్తుతం యే ప్రకృతి చేతిలో కీలు బొమ్మగా వున్నావో, ఆ ప్రకృతిని జయించిన రాజువు కావాలి. ఏ ప్రకృతి శక్తయితే నిన్ను పాదాల క్రింద తొక్కిపట్టిందో దానిని యెత్తిపడేయాలి. బానిసగా కాక స్వేచ్ఛగాను, భిన్నత్వంగా కాక ఏకత్వంగాను, మృత్యువుకి లొంగిపోయే అశాశ్వతంగా కాక అమృ తత్వంగాను, అంధకారంలోకాక పరిపూర్ణ దివ్యదీప్తిగాను, దుఃఖం, బాధల దోబూచులాటలో కాక సంపూర్ణ దివ్యానందంగాను, దుర్బ లత్వంతో పతనం చెందడం కాక, అమితశక్తివంతుడిగా ఔన్నత్యం

సాధించాలి. పరిమిత స్థాయి నధిగమించి అనంత జీవనం సాధించాలి. పరమాత్మగా అతడిలో ఐక్యం కావడమంటే అదే. నువ్వు నీ నిజస్వరూపమును పొంది దాని ననుభవించుటనగా ఇదే.

నువ్వు స్వేచ్ఛగా అనగా నీ మనస్సులోను, శరీరంలోను, జీవితంలో కూడ స్వేచ్ఛగా వుండాలి. ఎందుకంటె స్వేచ్ఛయే ఇప్పుడు ఇక్కడ పాదుకొని ఉన్నది.

దైవం తోటి, సర్వభూతములతోడి ఐక్యమై వుండు. నీ అహంకారంలో కాదు, నీ లోనే జీవించు. ఎందుకంటె the spirit is unity. నీవు అమరుడవు. మృత్యువును నమ్మవద్దు. ఎందుకంటె నీ శరీరం మృతి చెందుతుంది కాని నువ్వు కాదు. అమృతత్వమే నేటి సత్యము.

జీవుడిలో అమృతత్వమే అనంతత్వము, జాగృతి, పరమానందం. పరమాత్మ అనంతుడు. పరిమిత జీవితాలు అనంతత్వం నుండి ఉద్భవించినదే.

సకల సృష్టిలో నీ వున్నావు. అందుచేత దానిలో యేదైనా నువ్వు కాగలవు. వాటిలో నువ్వు లేనట్లయితే, నీకు అస్తిత్వమే లేదు. నీలో యేదైతే వుందో అదే నీ జీవాత్మలో అభివ్యక్తమవుతుంది. *బాహ్యంగా కనిపిస్తున్న నీ యీ రూపం నీ నిజరూపం కాదు. బాహ్యరూపానికి బానిసగా నువ్వెందు కుండాలి?*

ఇంకా యెదుగు. నిన్ను నీవు అధిగమించు. పరివర్తన సాధించు. నువ్వు మనిషివి. మనిషి సంపూర్ణస్వభావం మన ప్రస్తుత తత్వం కంటె ఉన్నతంగా పరివర్తనం చెందడం. మొదట వ్యక్తి పశుప్రాయుడు. పశుప్రాయుడైనవాడు తరువాత స్థాయికి పరివర్తన చెందాడు. ఆలోచనాపరుడు, వస్తునిర్మాత, సౌందర్యాన్వేషకుడు అయ్యాడు. ఈ ఆలోచనాపరుడి స్థాయినించి జ్ఞాన సాధకుడు కావాలి. వస్తునిర్మాత స్థాయి నుంచి సృష్టికర్తగా తన సృష్టికి తాను అధిపతి కావాలి. సౌందర్యాన్వేషణ స్థాయి నుంచి ఆ సౌందర్యంలో ఆనందాన్ని అనుభవించేవాడిగా, భౌతికతనుండి శాశ్వతత్వం సాధించాలి. ప్రాణికం నుండి జీవాత్మ అమృతత్వానికి, ఆ తర్వాత అనంతత్వ శక్తిని సాధించాలి. మానసికమైన

సాక్షికజ్ఞానం నుంచి పరిపూర్ణదీప్తి వెనుకగల దివ్యదర్శనాన్ని సాధించాలి.

ఈ లక్షణములను పొందినప్పుడు నువ్వు అతిమానవుడవు (Superman) అన్న మాట. నువ్వు మనసును దాటి అతిమనస్సును సంపాదించుకున్నావు. దానిని దివ్యమానసము లేక దివ్యజ్ఞానము లేక అతిమనస్సు (Supermind) ఏ పేరు పెట్టినా కూడ అది దెవేచ్ఛ యొక్క శక్తి, దివ్యచైతన్యపు వెలుగు. దేవుడు అతిమాన సము ద్వారానే తనను తాను ఈ లోకాలలో సృష్టించుకున్నాడు. అతిమానసం తోనే లోకాలలో నివసిస్తూ వాటిని నిర్వహిస్తాడు.

మనస్సును దాటి అతిమనస్సు నందుకోవాలి. అప్పుడే అతి మానవుడు అవతరిస్తాడు.

అతిమానవత, అనగా దివ్యజీవనమును అనుభవించుటయే. దేవతగా అవుటయే. ఏలన దేవతలు ఆ పరాత్పరుని శక్తులే. నువ్వు కూడ అటువంటి దేవతవై మానవాళిలో జీవించుము.

దీని అర్థాన్ని మనం స్పష్టంగా తెలుసుకోవాలి – దైవములో నివసించుట మనగా ఆయన చైతన్యము, ఆనందము, ఇచ్ఛాజ్ఞాన ములు నిన్ను వశపరచుకొని నీతోను, నీ ద్వారా వాటి విన్యాస ములను జరుపుకొనుటయే.

శిఖరాగ్రము మీద నీకు నూతన రూపం వస్తుంది. అప్పుడు నువ్వు నీలో వున్న దైవాన్ని కనిపెట్టగలవు. సర్వ భూతము లందు దైవాన్ని దర్శించగలవు. దైవములో జీవించుము. ఆయన వెలుగులో ప్రకాశించుము. ఆయన శక్తితో ప్రవర్తించుము. ఆయన ఆనందములో ఓలలాడుము. ఆ జ్వాల, ఆ భానుడు, ఆ మహార్ణవ ములను ధరించుము. ఆ ఆనందము, ఆ వైభవము, సౌందర్యము లను అనుభవించుము. కించిన్మాత్రమైనా నువ్వు ఈ సిద్ధులను బడసినప్పుడు అతిమానవుని బాటలో నువ్వు మొదటి అడుగులు వేసినట్లే.

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి, బి.యస్. రాఘవ,
డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 17, pp. 74-75; CWSA Vol. 12, pp. 150-52)

సమాచార పత్రము

శ్రీఅరవింద సొసైటీ సభ్యులు మొదట ఒక విషయాన్ని గురించి తెలుసుకోవాలి. శ్రీఅరవిందులు అసలు ఈ భూమ్మీద ఎందుకు అవతరించారు, వారి జన్మ సత్య మేమిటి?

ఆ విషయాన్ని గురించి శ్రీఅరవిందులే 15 ఆగస్టు 1923 నాడు ప్రస్తావించారు. ఎ.బి. పురాణీగారు దానిని నమోదు చేసారు.

"నా జన్మదినాన్ని ఇంతవరకు మనం ప్రాణికోద్వేగంతో (vital manner) జరుపుకున్నాము. అది మూలసత్యానికి బీజరూపమే అయినప్పటికి దాని అభివ్యక్తి ప్రాణికంగా వుంది. ఇక నుంచి ఆ రోజును ఆ మూలసత్యానికి అనుగుణంగా జరుపుకోవాలి".

"మన జీవితంలోకి అతిమానస సత్యము దిగిరానున్నదని మీ కందరికీ తెలుసుననుకుంటాను. ఈ దినము ఆ సత్యమునకు ప్రతీక. కాని అందులకు మార్గములో చాలా విఘ్నములున్నవి. పైనుంచి దిగివస్తున్న ఆ మహాశక్తిని వశపరచుకొని తన ప్రయోజనములను సాధించుటకై మనస్సు దాని భావములతో ఎదురుచూస్తుంటుంది. ప్రాణికము అనగా ప్రాణశక్తి. ఆ మహా శక్తిని పట్టుకొని తన కుటిల ప్రయోజనములకు దిగజార్చా లని చూస్తుంది. ఒక విషయము మటుకు మీరు మరచిపో కూడదు. *ఇప్పుడు దిగివస్తున్నది మానసికశక్తి కాదు. అతి మానస సత్యము. దాని కార్యము నిర్విఘ్నంగా కొనసాగా లంటే ఈ సామాన్య ఉపకరణములన్నీ అతిమానసీకర ణము కావాలి.* కాని ప్రకృతి శక్తులు ఆ మహాశక్తిని తమ నిత్యకృత్యములకే ఉపయోగించుకొని సంతృప్తి చెందుటకు ఆరాటపడుతూ వుంటాయి. మానవుడు భోగలాలసత్వమును, స్వార్థప్రయోజనములను ఆశించినప్పుడు, అతనిలోనూ, అతని ద్వారానూ, అనుభవించునది నిజానికి ఈ విశ్వశక్తులే.



ప్రారబ్ధమా, ఐచ్ఛికమా?

అఖిల భారత పత్రిక, సెప్టెంబరు 2004

ప్రారబ్ధమా, ఐచ్ఛికమా?

శ్రీమాతారవిందుల ప్రవచనములు

విధి అంటే ఏమిటి?

తలరాతను రాసే దెవరు?

విధిపాశమునుండి విముక్తి

ఉపోద్ఘాతము

ఫేట్ అంటే తెలియని వాళ్లు ఎవరూ వుండరు. దీన్ని తెలుగులో విధి, తలరాత, ఖర్మ, ఘటన, ప్రారబ్ధము అని అంటారు; వీటికి మధ్య ఛాయాభేదాలు వున్నప్పటికి ఈ సంచికలో వీటిని పర్యాయపదాలుగానే వాడుతున్నాము. (నెపోలియన్ చక్రవర్తి నెపోలియన్స్ బుక్ ఆఫ్ ఫేట్ – అదృష్ట దీపిక అనే పుస్తకాన్ని సంప్రదిస్తూ వుండేవాడట.) మనిషికి స్వేచ్ఛ వున్నదా, అతను తన ఇష్టం వచ్చినట్లు జీవించగలడా లేక అతనిది ఒక ఇనుప చట్రంలో బిగించిన యాంత్రిక జీవితమేనా అనేది, ఒక ముఖ్యమైన సమస్య. దీనికి తోడు కొంతమంది కర్మసిద్ధాంతమనే ఒక గుదిబండను మన మెడకు తగిలించారు. పూర్వజన్మలో చేసిన పాపాలకు ఈ జీవితంలో ఫలితాలను అనుభవించి తీరాలిట! ఇదే నిజమైతే ఇక మనిషికి మోక్ష మెక్కడ? ఇది నిజమేనా? శ్రీఅరవిందులు ఈ జటిల ప్రశ్నలకు సమాధాన మిచ్చారు. మనిషిని పూర్వజన్మలు కట్టి పడేస్తాయనటం సరి కాదు. శ్రీఅరవిందులు కర్మసిద్ధాంతంయొక్క లోతుపాతులను విశ్లేషించి దాని అసలు స్వరూపాన్ని వెల్లడి చేశారు. మనిషి కర్మలకు, ఏ మాత్రం బందీ కాడు. తనంతటు తాను పూనుకొని ఏం చేయలేడనటం కూడా తప్పే. అతనికి స్వేచ్ఛ వున్నది. అంతే కాదు, ఈ జన్మలో చేసే కర్మల వలన భవిష్యజీవనానికి బంగారు బాటని నిర్మించుకునే అవకాశం కూడ వున్నది.

– సంపాదకుడు

నేటి జీవితం నాటి జన్మల ఫలితమా?

An episode in an unremembered tale,
Its beginning lost, its motive and plot concealed,
A once living story has prepared and made
Our present fate, child of past energies.

*

O man, the events that meet thee on thy road,
Though they smite thy body and soul with joy and grief,
Are not thy fate, – they touch thee awhile and pass;
Even death can cut not short thy spirit's walk:
Thy goal, the road thou choosest are thy fate.

Sri Aurobindo (*Savitri*)

*

'విధి' కి భారతీయ వివరణ 'కర్మ' – మన చర్యల వలన మనమే మన విధిని నిర్ణయిస్తాము. మనచే సృజింపబడిన 'విధి' మనను బంధిస్తుంది. మనము నాటిన చెట్టు ఫలమునే మనం అనుభవిస్తాము. ఆ విధంగా మనము చేసిన పనుల ఫలితాలనే ఈ జన్మలోగాని, మరుజన్మలోగాని మనం అనుభవించాల్సిం వుంటుంది. పూర్వ చర్యలద్వారా యేర్పడిన 'విధి' ని యీ జన్మలో అనుభవిస్తూనే, రానున్న జన్మ 'విధి' ని నేడు సృజిస్తాము. ఈ వివరణ మన జీవితానికి, చర్యలకు న్యాయమైన అర్థాన్ని ఇస్తుంది. ఐరోపావాసులు భావించినట్లు ప్రస్తుత జీవితము పూర్తిగా పూర్వ జన్మ చర్యల ఫలితముగా ఏర్పడి, అనుభవించాల్సిన ప్రారబ్ధం కాదు. అంతేకాదు, మన స్వేచ్ఛా సంకల్పములు మరియు చర్యలు మన పూర్వ 'కర్మ' ను రద్దు చేయగల్గును లేదా మార్పు చేయ గల్గును. కాని 'ఉత్కటకర్మల' వంటివి కొన్ని మాత్రము మారవు. ఇచ్చట కూడా 'ఆధ్యాత్మిక చైతన్యము' ను పొందిన జీవి తన

‘ఉత్కటకర్మ’ ను రద్దు చేయగలడు. ఎందుకంటే అట్టి జీవి తన సంకల్పమును దైవసంకల్పము, విశ్వసంకల్పము, విశ్వాతీత సంకల్పముతో అనుసంధించుట వలన సంకల్పము తానే అంత క్రితము కొన్ని నియమములకు లోబడి ఏర్పరచిన ‘విధి’ ని రద్దుపరచి నూతన ‘విధి’ ని సృజిస్తుంది. అపుడు పూర్వపు సంకుచిత నియమాలన్ని అదృశ్యమౌతాయి. అచ్చట అమితమగు స్వేచ్ఛ మరియు విశాలత్వం ఉంటాయి.

*

‘విధి’ కేవలం మన బాహ్యసత్తకు మాత్రమే వర్తిస్తుంది. మన బాహ్యసత్త అజ్ఞానములో జీవించి యున్నంత కాలము అది మన బాహ్యసత్తపై పని చేస్తూనే ఉంటుంది. వ్యక్తి ప్రస్తుత పరిస్థితులు, పూర్వ చర్యల ద్వారా అతను కూడ బెట్టిన శక్తులు, స్వభావాలు ఒక దానిపై మరియొకటి పనిచేయుట ద్వారా వర్తమాన చర్యలను నియమిస్తూ, భవిష్యత్ ఫలితాలను నిర్ణయించే స్థితులనే ‘విధి’ అంటాము. కాని వ్యక్తి ‘ఆధ్యాత్మిక జీవితము’ లోకి ప్రవేశించగానే పూర్వ నిర్ణయ ‘విధి’ వెనుకకు తగ్గటం ప్రారంభిస్తుంది. ‘విధి’ అనే శక్తే కాకుండా భగవానుని కృప, ఉన్నత దైవశక్తి సహాయములు అనే నూతనాంశములు పనిచేయుట ద్వారా, అవి సాధకుణ్ణి, ప్రస్తుత అతని సామర్థ్యమునకు అతీతముగా ఉన్నతస్థాయికి తీసుకు వెళ్తాయి. అప్పుడు సాధకుని ఆధ్యాత్మిక గమ్యం దైవం యొక్క ఎంపిక. అది భవిష్యత్తుని సుస్థిరం చేస్తుంది.

*

అంతరాత్మ కర్మచేతిలో ఒక కీలుబొమ్మ అనీ, తన గతకర్మల యొక్క బానిస అనీ అనుకొనజాలము; సత్మ మింతకంటె తక్కువ కఠోరము, ఎక్కువ నమనీయము గావలెను, గత కర్మఫలితముల ఒక భాగము ఈ జన్మలో రూపము దాల్చియున్నచో, అది ఆంతర పురుషుని అనుమతితోనే జరిగి యుండవలెను; కారణము, తన పార్థివ అనుభవముయొక్క ఈ నూతన నిర్మాణముపై అది అధ్యక్షత వహించును మఱియు నతడు ఒక బహిర్ముఖ నిర్బంధ పక్రి

యకు మాత్రమే గాక, ఒక రహస్య సంకల్పమునకు, మార్గదర్శన మునకు గూడ తన అంగీకారము తెలుపును. కాని ఆ రహస్య సంకల్పము యాంత్రికము కాదు. కింతు అది ఆధ్యాత్మికము; ఇక ఆ రహస్య మార్గదర్శనము ఒక పరమ ప్రజ్ఞనుండి వచ్చును మఱియు ఈ ప్రజ్ఞ యాంత్రిక ప్రక్రియలను తాను ఉపయోగించు కొనునే గాని, వాని అధీన విషయము కాదు. స్వీయాభివ్యక్తి, అను భవములను ఉద్దేశించియే అంతరాత్మ శరీరములోనికి జన్మించు చున్నది. ఇట్టి స్వాభివ్యక్తికి, ఈ జీవనానుభవమునకు ఏదేది ఆవశ్యకమో, అటులే భవిష్యత్తును సృజించుకొనుటకు ఏదేది ఒక సాధనమో, అది అంతరాత్మచే రూపొందించబడును (formulated) – ఈ ఆవశ్యక సామగ్రి గతజన్మల స్వయంప్రవృత్త ఫలి తముగా రావచ్చును, లేక గత కర్మఫలముల ఒక స్వతంత్ర ఎంపికగాను, ఒక జీవనసాతత్యముగాను సమకూడవచ్చును, లేక నూతన పరిణామముగా లభించవచ్చును. ఏలన పునర్జన్మ అనగా నియమమును యంత్రవత్తుగా నిర్వహించుట గాదు, కింతు దేని చేత ప్రకృతి చివరకు అజ్ఞానమునుండి వెలువడి, వృద్ధి గాంచ గల్గునో, వైశ్వ అనుభవము ద్వారా అట్టి ప్రకృతివికాస సాధ నయే. కనుక ఈ వికాసమునకు రెండు తత్త్వము లుండవలెను – 1. ఉపకరణ రూపమున కర్మ, 2. మనః ప్రాణ శరీరముల ద్వారా పనిచేయుచు, ఆ కర్మ నుపయోగించుకొను లోపలి రహస్య చేతనా, సంకల్పములు. విధి, అది కేవలము యాంత్రికమైనను, లేక మనచేత సృజించబడిన, మనము స్వయముగా నిర్మించుకొ నిన ఒక బంధనమైనను, జీవనముయొక్క ఒక అంశము మాత్రమే; కాగా సత్తు, చేతన, దాని సంకల్పము ఇంకను ఎక్కువ ముఖ్య మగు అంశములు. భవితవ్యము (destiny) సరళము కాదు, అది జటిలము. ఏలన, మన భౌతిక సత్తను బంధించు భవితవ్యము ఒక అధికతర నియమము అడ్డుపడనంత వఱకు లేక అడ్డుపడని మేరకు మాత్రమే దానిని బంధించును. క్రియ మన భౌతిక భాగ మునకు జెందును, అది మన సత్తుయొక్క భౌతిక పరిణామము; కాని మన ఉత్తల భౌతికము వెనుక ఒక విముక్తతర ప్రాణశక్తి

గలదు, ఒక విముక్తతర మనః శక్తి గలదు, కాగా ఈ శక్తి తన ఇతర ఊర్జముతో మఱియొక భవితవ్యమును సృజించి, దానితో ప్రాథమిక ప్రణాళికను మార్చగలదు; పోతే అంతరాత్మ, ఆత్మ ఆవిర్భవించినపుడు, అనగా మనము సచేతనముగా ఆధ్యాత్మిక జీవులమైనపుడు, ఆ మార్పు మన భౌతిక విధి (fate) యొక్క రేఖాచిత్రమును తుడిచివేయగలదు, లేక ఆదర్శరూపమును నిర్మించగలదు. కావున కర్మ – లేక కనీసము యాంత్రిక కర్మనియమము – పరిస్థితుల ఏకైక నిర్ధారక మనియు, పునర్జన్మ, మన భావి పరిణామముల సంపూర్ణ యంత్రాంగ మనియు అంగీకరించజాలము.

మూలం: శ్రీఅరవిందులు

*

ప్రశ్న: తీవ్రమైన ఆకాంక్ష మనిషికి పుట్టుకతో ఉంటుందా?

ఉండదు. వ్యక్తియొక్క ఇతర సామర్థ్యాలవలె ఆకాంక్షను కూడా పెంపొందించుకోవచ్చు. కొద్ది ఆకాంక్షతో జన్మించి, దానిని వృద్ధిపరచుకొన వచ్చు. అలాగే స్వతహాగా గట్టి పట్టుదల లేనప్పటికి, దానిని పెంచుకొని బలపరచుకో వచ్చును. ఇవి దైవప్రసాదితముగా పైనుంచి రాలిపడాలనీ; భగవంతుడు నీకు ఆకాంక్షను ప్రసాదించలేదు గనుక అది నీకు లేదనుకోవడం తప్పు. సరిగ్గా దీనిని గూర్చే శ్రీఅరవిందులు తన లేఖలో నొక్కి వక్కాణించారు. ఆయన దానిని నువ్వు ఎంచుకోవాలని, నిరంతరం ఆ అవకాశము నీకు ఇవ్వబడిందని అన్నారు. దానిని ఎంచుకొవలసినది నువ్వే. ఒక వేళ దానిని నువ్వు ఎంచుకోలేదనుకో, నువ్వే పురోగమించలేవు. ఆ నిర్ణయము నీదే. నీ తరఫున నిర్ణయాలు తీసుకునే వేరే శక్తి ఏదీ లేదు. విధి, అదృష్టం అనేవి ఇందులో లేవు. నీకు ఆ స్వేచ్ఛ ఉంది. ఆ దివ్యతేజస్సును అందుకొంటావా లేదా! దివ్యపరిచారకుడవవుతావా లేదా అనే విషయంలో నీకు పూర్తి స్వేచ్ఛ కలదు. అలాగే ఆకాంక్షించాలా వద్దా అనే నిర్ణయాధికారం నీకు వదలిపెట్టబడినది. *'పూర్ణసమర్పణతో సర్వ కార్యములు నెరవేరును'* అనేది నిజమే. కాని అను దినము,

అనుక్షణమూ పూర్ణసమర్పణ చేయ తలపెట్ట వలసినది నీవే. లేకపోతే నువ్వు చేయలేవు. దానంతటది పైనుండి దిగిరాదు. అది నువ్వు కోరుకోవాలి. అది జరిగినప్పుడు అంతా సవ్యంగా సాగిపోతుంది. జ్ఞానమైనా అంతే. దైవంతో సాయుజ్యం పొంది నప్పుడు మరింత సజావుగా జరుగుతుంది. అప్పటివరకు సంక ల్పించవలసినది, నిర్ణయించుకోవలసినది నీవే. "ఆహా నేను చేయ వలసినది ఏమీ లేదు, నా పనంతా ఆ భగవంతుడే చేస్తాడు" అని తలపోసి సోమరిగా నిద్రలోకి జారిపోకు. అది సరి కాదు. పని అలా దాని కది జరిగిపోదు. ఎందుకంటే నీ బలహీన సంక ల్పానికి ఏ చిన్న అడ్డము వచ్చినా ఆగిపోతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: గుండా జనార్ధన రావు; చెలసాని నాగేశ్వరరావు; గోదావరి

(*SABCL* Vol. 28, p. 12; Vol. 29, p. 458; Vol. 22, 468, 475; Vol. 19, pp. 808-09; *CWM* Vol. 4, pp. 343-44)

అజ్ఞానాంధకార క్షేత్రాలలో సత్యము దాల్చిన రూపము

అజ్ఞానాంధకార క్షేత్రాలలో సత్యము దాల్చిన రూపమే విధి.
ఓ రాజా, నీ విధి ప్రకృతికి ఆత్మకు మధ్య అనుక్షణం జరిగే సయ్యాట,

భగవంతుని పర్యవేక్షణలో జరిగే విధి విలాసము.
ఈ సయ్యాటలో సంభవించే ఘటనయే విధి.
మనిషి దీనిని ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు.
భగవంతుడు తన శాసనమును అమలు చేసినప్పటికి
నీ తిరస్కృతిని కూడ నీ ఖాతాలో జమ చేస్తాడు
ఏలన అంతటితో జీవితం అంతం కాదు
ఆత్మకు దుఃఖమూ, మృత్యువూ లేవు.

ఈ ఓటమిలో నుంచి కూడా ఆత్మ బలాన్ని పుంజుకుంటుంది
పతనమైనా సరే, అధోగతి పాలైనా సరే
మళ్లీ రెక్కలు తొడిగి ఆకాశవీధులలో ఎగురుతుంది
కుప్పకూలినప్పటికి ఘనవిజయాన్నే సాధిస్తుంది.

శ్రీఅరవిందులు (సావిత్రి)

ఎవరైనా జరగబోవు ఘటనలను ముందరే చెప్పగలిగితే అటు వంటి శక్తి ఒకటి వుండితీరాలి – అనగా ప్రతి విషయమూ పై లోకాలలో ఎక్కడో పూర్వమే నిర్ణయమై వుంటుందన్న మాట. అటువంటి దివ్యజ్ఞత, దివ్యశక్తి వుండి తీరాలనిపిస్తుంది. అయి నప్పటికి ఆ ఘటనలన్నీ ఆధ్యాత్మిక, మానసిక, ప్రాణిక, భౌతిక శక్తుల ద్వారానే ఆవిష్కరించబడాలి కదా. ఇక్కడ మనమొక విషయాన్ని గమనించాలి. ఈ లోకాలలో ఏదీ ఖచ్చితంగా నిర్ణ యించబడి వుండదు. మానవుని పట్టుదల, ప్రయత్నం అటువంటి శక్తుల్లో ఒకటి. నెపోలియన్ మహాశయుణ్ణి 'విధి' లో నమ్మ కమున్న నీవు మరెందుకు వ్యూహాములు వేస్తావు? యుద్ధములు చేస్తావు? అని అడిగితే "మరి విధి వుంది కాబట్టే, నేను దానికి రూపకల్పన చేస్తాను" అన్నాడట. లేదా అతని వ్యూహాము, సమ రము రెండూ కూడా విధిలోని భాగమే అయి, విధియొక్క ఫలి తాలకు దోహదమివ్వడానికి కావచ్చు. 'నేను దుష్ఫలితాలు చూడ గలిగినప్పటికీ, సత్యం యొక్క నిబంధలలో భాగంగా (ఎదురు ఫలితాలు, దుష్ఫలితాలు) జయించి, సత్ఫలితాలకే, దోహదమవ డానికి, విజయానికి పని చేయవలసిందే, అని చేసేవాడుట. ఎందు కంటే, శక్తులను సజీవంగా ఉంచి, బలం చేకూర్చడానికి, సత్యం యొక్క సూత్రంగా నేను సేవ చేసి, ఎదురు ఫలితాన్ని జయించి, సత్ఫలితాలను తెచ్చుకోవడానికి, విధి నిరోధాన్ని సానుకూలంగా చేయడానికి, పని చేయవలసిందే అని నా నమ్మకం. మానవులు ఒక పనిని చేపట్టినప్పుడు ఓడిపోవడం తథ్యం అని తెలిసినా కూడా పట్టుదలతో కొనసాగుతారు. ఆధ్యాత్మికంగా చూస్తే వారి పట్టుదల సరియైనదే కూడా. అదీ కాకుండా, బాహ్యావిజయం

కోసం, మనం జీవించడం లేదు. కాగా, జీవనధ్యేయం ఆత్మ పురోభివృద్ధి కానీ, తాత్కాలిక లౌకిక లాభమో, లేక భూతకాల విజయం కాదు. ఆత్మ భౌతికప్రాప్తి లేక విధికి వ్యతిరేకంగా కూడా పెరగగలదు.

*

ప్రతిదీ ముందే నిర్ణయించబడింది అని కూడా నేను చెప్పలేదు. శక్తుల ప్రభావమా అంటే అదీ కాదు. నేనేం చెప్పానంటే మనకు కనిపించే ప్రతీ సంఘటనల వెనకాల కనిపించని అదృశ్య శక్తులు, మనుష్యులకు కనిపించకుండా ఉన్నాయి. అయితే యోగంవల్ల (అంతర్ముఖుడై, విశ్వాత్మతోనూ, శక్తితోనూ, శక్తులతోనూ సంబంధము నెలకొల్పుకో గలిగితే ఈ అదృశ్యశక్తులను గ్రహించవచ్చు.) అవసరమైతే ఘటనలను మార్చి సత్ఫలితాలను కలగజేసుకోవచ్చు. ఇదంతా ముందరే నిర్ణయించబడటానికి పెద్దగా సంబంధం లేకపోవచ్చు కూడా. ఇలా కాకుండా, శ్రద్ధగా ఏం జరుగుతుందో, పరిశీలిస్తూ అవసరాన్ని బట్టి ఇక్కడా, అక్కడా చేయూత నివ్వవచ్చు.

మూలం: శ్రీఅరవిందులు

*

ఈ ప్రపంచంలో జరిగేదంతా స్వయంగా దైవమే చేస్తున్నాడనటం సత్యానికి దూరమే అవుతుంది. నిజం చెప్పాలంటే అది దైవేచ్ఛ కానే కాదు. ఇక్కడ ఆ దైవేచ్ఛ నిమ్నశక్తుల ద్వారా ఆవిష్కారమౌతుంది. మాధ్యమం వలన అది వికారం చెందుతుంది. అలా కాని యెడల, దైవమే తిన్నగా పని చేసిన యెడల ఈ ప్రపంచంలో ఇన్ని దుర్ఘటనలు ఎందుకు సంభవించాలి? ఒక వేళ ఆయనే అలా చేయదలచుకుంటే, చేయనూ చేస్తాడు – ఆయన స్వేచ్ఛకి అడ్డేమిటి? తనను తాను దిగువస్థాయికి దిగివచ్చి అక్కడ ఆవిష్కారం కావాలనుకుంటే అలా కూడ కాగలడు. తను సమర్థుడు, సర్వశక్తిమంతుడు – తెర మరుగున వుండి ఏదైనా చేయదలచుకుంటే అలా కూడ చేయగలడు.

ఈ ప్రపంచాన్ని సృష్టించింది దైవమే. దాని గతి నిర్ణయించేది కూడ దైవమే. అయితే కేవలం ఇంద్రియజ్ఞానంతో మానవ మనస్సు దాని నెలా అర్థం చేసుకోగలదు? సృష్టిలో మొదట దైవము మరుగున పడటం వలన అజ్ఞానం పుట్టింది. ఆ అజ్ఞానంలో నుంచి మేలుకొని దైవాన్ని కనుక్కొండే ప్రక్రియనే మనమీ ప్రపంచంలో చూస్తూ వుంటాము. సత్యాసత్యాల మధ్య పోరాటమే ఈ సృష్టిలోని వైచిత్రి ఈ ప్రపంచ చరిత్ర.

దైవాసురుల మధ్య సంగ్రామము మనకు తెలియనిది కాదు. ఇది వెలుగు చీకట్ల మధ్య పోరాటము. పురోగమన శక్తులకు తిరోగమన శక్తులకు మధ్య జరిగే నిరంతర సంఘర్షణ. *ఈ ప్రపంచంలో ప్రతి క్షణము, ప్రతి మనిషి జీవితంలోను, ప్రతి సందర్భంలోను, సన్నివేశంలోను కూడ జరిగేదిదే.*

దైవేచ్ఛ అసురశక్తుల స్పర్శను పొందగానే వికారము చెందుతుంది. *నువ్వు దైవముతో సహకరించాలంటే నీ చేతనను ఉన్నత స్థాయిలో నిలుపుకోవాలి.* దీని అర్థమేమిటి? ఏం జరిగినా అది దేవేచ్ఛేలే యని చేతులు కట్టుకోని కూర్చోకూడదు. నీ చేతనా శిఖరం మీద కూర్చొని దివ్యశక్తులకు నువ్వొక చక్కటి మాధ్యమం కావాలి. అంతేగాని, నీ స్వంత ఆలోచనలతో సతమతం కాకూడదు. దానిని సాధన అంటావో, యోగమంటావో – నిరంతరం అప్రమత్తంగా వుండి దైవానికి నువ్వు ఒక చక్కని పనిముట్టు కావాలి.

మూలం: శ్రీమాత

డా॥ ఆర్. విమలాదేవి, డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 29, p. 458; Vol. 22, pp. 469, 470; *CWM* Vol. 3, pp. 170-71)

ద్వయరూపాల్లో లిఖితం మన విధి

మన దృష్టిలో మంచైనా, చెడైనా
మంచి కోసమే ఉద్యమించేది రహస్య దివ్యసంకల్పం
ద్వయరూపాల్లో లిఖితం మన విధి.
ప్రకృతి వైరుధ్యాల ద్వారానే సుగమం భగవత్సాన్నిధ్యం
తమస్సు నుంచి జ్యోతి వైపు గమిస్తాం మనం.
మరణం అమరత్వానికి మార్గం.
కుయ్యో మొర్రో అంటూ విధివంచితులు ఎంత విలపించినా
అంతిమ విజయం మంచికే తథ్యం

మూలం: శ్రీఅరవిందులు (సావిత్రి)

*

నీ స్వరం నా హృదయ నిశ్శబ్దంలో నినదించే తీయని గీతం
నా మస్తిష్కంలో సరిపోని పలుకులుగా మారినా
అది నీతోనే నిండి ఉన్నది ప్రభూ.
ధరిత్రి నుద్దేశించి ఇట్లా అంటున్నాయా పలుకులు –
"దుఃఖిత మతియైన ఓ పేద ధరిత్రీ!
నేను నీలో ఉన్నానని మరిచిపోకు. ఆశ వీడకు.
నీ ప్రతి ప్రయత్నమూ, ప్రతి దుఃఖమూ, ప్రతి సంతోషమూ,
ప్రతి బాధా, నీ హృదయపు ప్రతి పిలుపూ, నీ ఆత్మ ప్రతి ఆకాంక్షా,
నీ ఋతువుల ప్రతి నవోన్మేషమూ,
నీకు సుఖ మనిపించేదీ, దుఃఖ మనిపించేదీ
అందంగా కనిపించేదీ, వికృతంగా కనిపించేదీ –
సమస్తమూ నిన్ను నా చెంతకే – అంతులేని శాంతినీ, నీడలేని కాంతిని,
సంపూర్ణ సామరస్యాన్ని, నిశ్చితిని, విశ్రాంతిని,
అనంత మంగళ శాసనాన్ని అయిన నా చెంతకే తప్పనిసరిగా చేరుస్తాయి.

ఆలకించుమో ధరిత్రీ! ఈ ఉత్కృష్ట స్వరాన్నీ
ఆలకించు! సరికొత్త ధైర్యం పుంజుకో.

శ్రీమాత

*

మానవజీవితం తీపి చేదుల మిశ్రమం. ఈ ప్రపంచం నీకు చేసే మర్యాదను గురించి నువ్వు విలపించ నవసరం లేదు. ఎందు కంటే యోగంలో నువ్వొక స్థాయికి చేరుకున్నప్పుడు నీ దృష్టే మారిపోతుంది. అప్పుడు అన్ని పరిస్థితులు నీ కనుకూలంగానే కనబడుతాయి. అన్నిటిని నువ్వు చిరునవ్వుతో స్వాగతమి స్తావు. ఈ విచిత్రమేమిటో నువ్వు తెలుసుకొని తీరవలసిందే.

– సంపాదకుడు

జీవితంలో ఎప్పుడు నీకు చుక్కెదురవుతుందనుకోకు. మనుమలు, పరిస్థితులు, అన్నీ సన్నివేశాలు నీ పక్షము అవునా కాదా అనేది కేవలం నీ దృష్టిని బట్టి, నువ్వు వాటిని అభిమానించే తీరును బట్టి వుంటుంది. మంచితనం కాని, చెడ్డతనం కాని, మనుమలను, సన్నివేశాలను బట్టి వుండవు; నీ దృక్పథాన్ని (attitude) బట్టి వుంటాయి. అది దైవానుగ్రహమని అనగా దైవము నీ కిచ్చిన వరమని నువ్వు అనుకున్నట్లయితే అది నిజంగానే అలా అవు తుంది! అప్పుడు నీ చేతనాస్థాయీ పెరుగుతుంది, నీకు జ్ఞానమూ అబ్బుతుంది. నువ్వు బలవంతుడ వవుతావు. కాని నువ్వు ఎంతో దురదృష్టవంతుడవని, దేవుడు నీకు అన్యాయం చేస్తున్నాడని, అదొక శాపమని అనుకున్నట్లయితే నిజంగానే దిగజారిపోతావు. అది నీకు దుఃఖకారణమే అవుతుంది. అయితే ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. *ఒకే సన్నివేశము, ఒకే సందర్భము నీ దృష్టిని బట్టి నిన్ను ఉద్ధరింప జేస్తుంది, లేదా దిగజారుస్తుంది!*

అందుకనే నువ్వీ విషయాన్ని గురించి అనుభవరీత్యా తెలు సుకోమని నేను చెపుతున్నా. అనగా బాహ్యపరిస్థితుల వలన నువ్వే మాత్రము అలజడి చెందకూడదు. నువ్వు దర్జాగా నీకు నువ్వు యజమానివి, పరిస్థితులకు యజమానివి అయి వుండాలి.

ఇది కేవలం నీ దృక్పథం (attitude) మీద మాత్రమే ఆధారపడి వుంటుందనే విషయం మరచిపోకూడదు. అయితే ఇది కేవలం నీ మేధలో జరిగే విషయం కాదు. నీ మనస్సులో మొదలైనప్పటికి తరువాత నీ శరీరంలో జరిగే ప్రక్రియ.

ఆ స్థాయికి చేరుకోవాలంటే నువ్వు ఎంతో నిష్ఠగా సాధన చేయాలి, ఎంతోకాలం పరిశ్రమించాలి. నీ మీద నీకు ఆధిపత్యం రావాలి. నీ శరీరంలోకి కూడ చేతనను ప్రవేశపెట్టాలి. అంటే నీలోని భౌతికపదార్థం కూడ చేతనా దీప్తి చెందాలి. ఇక నీకు ఎట్టి భయము వుండదు. నిన్నెవరు ఏమీ చేయలేరు. భూకంపాలు వచ్చినా, పెనుతుఫానులు వచ్చినా అవి నిన్నంటవు. నిజంగా ఇలా జరుగుతుందని నేనాశిస్తున్నాను. ఎందుకు జరగదు? జరిగి తీరుతుంది. అప్పుడు నువ్వు ఒక అడుగు ముందుకు వేసినట్లే!

ఇది ఒట్టి నమ్మకం అనుకుంటున్నావేమో – కాదు నా అనుభవంతో చెబుతున్నా.

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: ఎమ్. రాజగోపాలాచార్య,

డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 29, pp. 424-25; *CWM* Vol. 1, p. 14; Vol. 6, pp. 123-24)

నర్తనశాల

మనిషికి స్వేచ్ఛ వున్నదా లేక పూర్వమే శాసించబడిన బాటలో ఒక మరమనిషి వలె పయనిస్తూ వుంటాడా? అంతా పూర్వమే నిర్ణయింపబడి వుంటుందని చెప్పేందుకు తత్వశాస్త్రజ్ఞులు determinism అనే పదాన్ని వాడుతారు. ఉదా: సూర్యచంద్రులు ఒక ధర్మాన్ని పాటిస్తూ తమ తమ కక్ష్యలలో చరిస్తూ వుంటారు. కాని మనిషికి కొంత స్వేచ్ఛ వున్నది కదా! మనమీ సమస్యకు పరిష్కారం కనిపెట్టాలి. – *సంపాదకుడు*

నిజానికి స్వేచ్ఛా, డిటర్మినజమూ ఒకే తత్త్వము యొక్క రెండు ముఖములు. నిజానికి ఈ సృష్టి ఆత్మచోదితము – తనేం చేయవలెనో తనే నిర్ణయించుకుంటుంది. మనిషికి కూడ అదే వర్తిస్తుంది. ఎందుకంటే మనిషి కూడ ఈ సృష్టిలోని భాగమే. అయితే కేవలం మనస్సుయొక్క పైపొరలలో నివసించే మనిషికి తెర వెనక జరిగే తతంగాన్ని గురించి ఏం తెలియదు. దీనికో కారణమున్నది. జడపదార్థము ప్రకృతి శాసనానికి లోబడి వుంటుంది. మానవ మానసము ఈ ప్రకృతిలోని భాగమే కనుక, అది కూడ మొదట ఆ ధర్మాన్నే పాటిస్తున్నట్లనిపిస్తుంది. కాని ఆ ధర్మాన్ని అధిగమించగలదు కూడ.

ప్రాణజీవుల ఆవిర్భావంతో ఒక నూతన చైతన్యము, దాంతోపాటు కొంత స్వేచ్ఛ ఏర్పడినవి. వాటికి కొంత స్వయం నిర్ధారక శక్తి వున్నది. అందుకని అవి భౌతిక వస్తువులంత కఠిన శాసనానికి కట్టుబడి వుండవు. మనస్సు రావడంతో ఈ స్వేచ్ఛ ఇంకా పెరిగింది. అయితే మనిషి తనకు స్వేచ్ఛ వున్నదని పొంగిపోకూడదు. కాని ఏం లాభం. ఇది వట్టి భ్రమయే. ప్రకృతిని దాటి పురుషచైతన్యం లోకి వెళ్ళినప్పుడు గాని నిజమైన స్వేచ్ఛ అంటే ఏమిటో తెలియదు. ప్రకృతి కతీతమైన దైవేచ్ఛతో తాదాత్మ్యము చెందినప్పుడే ఆ స్వేచ్ఛయొక్క పూర్ణస్వరూపము తెలుస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
స్వేచ్ఛానువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

(*SABCL* Vol. 22, pp. 474-75)

దురదృష్టమా – అదీ మన మంచికే

ముందే విధిలిఖితమైన వారి సత్వపు లోతుల్లో, తన విధిని నియం త్రించుకుంటూనే పరమాత్మతో సారూప్యం కోసం కాంక్షించే సత్వంలో, జీవన పరిస్థితులపై నియంత్రణశక్తిని కలిగి, బహిస్సం కల్పం ఎదురుతిరిగి పరిస్థితులను స్వచ్ఛ దృష్టి కలిగిన అంతశ్చే తనగా మారకుండా అడ్డుపడినా, దాన్ని సాధిస్తూ వ్యవస్థీకృత మౌతుంది. ఇదంతా మనను ఖచ్చితంగా నిర్దేశిత గమ్యం వైపు చేర్చడానికి స్వచ్ఛదృష్టితో అద్భుతంగా వ్యవస్థీకృతమైందని ఎంతో కాలం తర్వాత గతజీవితాన్ని పునః స్సమీక్షించుకొంటే గాని మనకు తెలియదు.

మనం ఆకస్మిక ఘటనలుగా, దురదృష్టాలుగా, విషాదా లుగా, విధి ప్రహారాలుగా, ప్రతికూల శక్తుల దాడులుగా భావించే వన్నీ ఏమాత్రం మినహాయింపు లేకుండా అద్భుత సూక్ష్మదృష్టితో మనం ఎటు పోవాల్సి ఉందో అదే అతి దగ్గరి దారిలో తీసుకు వెళ్ళేందుకు ప్రశంసనీయంగా అమలౌతున్న ప్రణాళిక మాత్రమే.

అయితే ఇది పూర్తిగా నిర్దిష్టమేమీ కాదు. ఎందుకంటే మన చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రాధాన్యతకనుబంధంగా వ్యక్తి ప్రాధ న్యతను బట్టి ఆధారపడి ఉంటుంది. అందుకే విధి లిఖితమైన ప్రతిసత్వం గురించి – అని ముందే నేనన్నాను.

మూలం: శ్రీమాత

అనువాదం: మాడభూషణం రాజగోపాలాచార్య

(*CWM* Vol. 6, p. 386)

నిజమైన భవితవ్యం భగవత్ చైతన్యం చేరడమే

శ్రీమాత

నీ గమ్యము, నీ మార్గము నువ్వు ఎంచుకొన్నవే

My fate is what my spirit's strength can make,
My fate is what my spirit's strength can bear...

Sri Aurobindo (*Savitri*)

మనసే నీ జీవితాన్ని శాసిస్తోందనుకోవటం పొరపాటు – అది నీ చైత్యపురుషుడండి. కాని ఈ సంగతి నీకు తెలియదులే. ఎందుకంటే అది మనసుకి తెలిసే వ్యవహారం కాదు. నిజానికి నీ జీవితాన్ని నడిపించేది అదే. నువ్వు మెదలకుండా, కిక్కురు మనకుండా నీలో నువ్వు వాదోపవాదాలు చేసుకోకుండా, నోరు మూసుకొని వున్నట్లయితే నీకు దాని స్ఫూర్తి కలుగుతుంది. కాని చాలామందికి దాని సంగతి అసలు తెలియనే తెలియదు. నీవేదో ఒకటి చెయ్యాలనుకుంటావు; కాని నీకు తెలియకుండానే పరిస్థితులు తారుమారు కావటం, అది మరో మలుపు తిరిగి మరో ఫలితం లభించడం జరుగుతూంటుంది. ఇంక నువ్వు కోపం తెచ్చుకొని చిందులు తొక్కుతావు. ఎవరో నీకు హాని తలపెట్టారని, దేవుడు నీకు అన్యాయం చేసేడని మండిపడతావు. నిజానికి నీ మంచి కోసమే, నీ ఆత్మాభ్యుదయం కోసమే అలా జరిగిందన మాట.

నువ్వనుకున్న ఉద్యోగం నీకు రాదు. నీ కలలు ఫలించవు. నువ్వు నిర్ఘాంతపోతావు. ఎటు చూసినా నీకు శనే ఎదురవుతుంది. ఇదంతా ఎందుకు జరుగుతుంది? ఈ అకస్మాత్సంఘటనల వలన నువ్వు జాగృతమౌతావు. నీ అంతరంగంలో ఒక ద్వారం తెరుచుకుంటుంది. నీ అగాధంలోని అద్భుతాల్లోకి దారి చూపిస్తుంది. కొన్నాళ్ళ తరువాత వెనక్కు తిరిగి చూసి, నువ్వీ విధంగా అనుకుంటావు: "అప్పుడు నేను తొందరపడి అందరిని

తిట్టాను గాని నాకు నిజంగా మంచే జరిగింది. నా చైత్యపురుషుడే నా చేత అలా చేయించాడు. దీనికి కారణం దైవానుగ్రహమే గదా!"

స్వేచ్ఛానువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 29, p. 435; *CWM* Vol. 5, pp. 394-95)

నీ బాధలను గురించి ఆ జగన్నాటక సూత్రధారికి ముందే తెలుసు

Aswapati, random seem the ways
Along whose banks your footsteps stray or run
In casual hours or moments of the gods,
Yet your least stumblings are foreseen above.
Infallibly the curves of life are drawn
Following the stream of Time through the unknown:
They are led by a clue the calm immortals keep.

Sri Aurobindo (Savitri)

ప్రశ్న: మనిషి జీవితంలో "ఇప్పటి వరకు జరిగినదంతా, అలా జరగవలసి ఉన్నది కాబట్టే జరిగింది" అని అనుకుంటాడు. అది ఎంతవరకు నిజం?

అది నిజమే. అలా జరగవలసి ఉంది గనుకే జరిగింది. లేకపోతే జరిగేదే కాదు. మనం చేసిన తప్పులు, వచ్చిన కష్టాలు, అన్నీ కూడా మన జీవితంలో అవసరం, వాటి ఉపయోగం ఉంది కాబట్టే అలా జరిగింది.

కానీ, నిజానికి వీటి న్యాయాన్యాయాలను గురించి నీకేం తెలుసు? అది మనస్సుతో వివరించేది కాదు. చేయకూడదు కూడా. ఎందుకంటే జరిగిందంతా అవసరమయ్యే జరిగింది. మనల్ని మనస్సు ఊహించలేని స్థితికి లేదా ఊహాతీతస్థితికి, తీసుకువెళ్ళడానికి, నడిపించడానికి అయితే ఇదంతా వివరించవలసిన అవ

సరం ఉందా? విశ్వమంతా ప్రతి క్షణం వివరిస్తూనే ఉంది. ఒక పరిస్థితి ఏర్పడింది అంటే, విశ్వమంతా ఎలా ఉండాలో అలాగే ఉంది కనుక. అలాగని మనం గుడ్డిగా, విశ్వాశాసనంతో ఒప్పుకుని ఉండాలని కూడా లేదు. గతాన్ని ఒప్పుకుని ఆ అనుభవాన్ని ఉపయోగించుకుని, అజ్ఞానంతో వర్తమాన భవిష్యత్తులను మలచుకోవచ్చు.

ప్రశ్న: 'ఈ పని ఇప్పుడు జరగాలి' అని దైవమే నిర్ణయిస్తాడా?

అంతా, ఏ అంతస్థులోంచి మనిషి చూస్తాడో దాన్ని బట్టి ఉంటుంది. దైవస్థాయిలో అన్ని యోచనలూ చేసి, నిర్ణయించే ఉన్నాయి. ఆ రకమైన చూడడం, ఉన్నత శిఖరాల్లోకి వెళుతుంది. అదే అతిమానసం దైవంయొక్క దృశ్యం. కానీ మనమే ఈ జ్ఞానంలో లేనపుడు, ఈ విషయాలు మాట్లాడినా ఉపయోగం ఉండదు. ఆ జ్ఞానంలోకి (వెళ్ళగలిగిన వాళ్ళకే) వెళ్లినపుడే అది వర్తిస్తుంది. అంతేగాని ప్రస్తుతం చూసినట్లు విషయాల్ని చూస్తే ఇది మాట్లాడడం ఉపయోగం లేదు. లేదా అప్రస్తుతం. అధోచైతన్యస్థితిలో ఇదేదీ అనుభూతి పొందలేదు లేక ముందరే నిర్ణయించబడనూ లేదు. అంతా తయారీలో ఉంది. ఇక్కడ నిశ్చయమైన విషయాలు కాకుండా సాధ్యాల లీల మాత్రమే ఉంది. ఈ అసాధ్యాల పెనుగులాటలోనే మనిషి జరగబోయేది గ్రహించగలడు. ఈ అవస్థలో, మనం ఏరుకుని, ప్రత్యేకంగా ఉంచుకోవచ్చు. ఒక సాధ్యాన్ని విడిచిపెట్టి మరొకదాన్ని ఒప్పుకోనూవచ్చు. ఒక పంథా అనుసరించవచ్చు. ఇంకొదానిలో నుండి, నిర్ణయమైపోయిన దాన్ని ఉన్నత అవస్థలో చూడవచ్చు. దైవచైతన్యానికి లేక దైవజ్ఞానంలో, ఇవన్నీ ముందరే తెలుస్తాయి.[1]

---

[1] తర్వాత శ్రీమాత అలా అన్నారు:
ముందరే నిర్ణయించబడింది అన్న పదము, వాస్తవతకు సరిపడకపోవచ్చు. ముందరే ఉంది అన్న పదం సరిపోవచ్చు. చైతన్యవికాసం ఒక వాస్తవం. అది కనిపించడమే కాదు. ఎందుకంటే, అనంతంలో (ఆద్యంతము లేని) అనుభూతి అయ్యే ఉంది కనుక – కానీ ఆమె జగన్నాటకం (లీల) లో, భౌతిక స్థాయిలో తనకు తెలిసే ఉన్నవన్నీ, తెలియనట్లు పని జరిపిస్తుంది. ఒక నూతన వస్త్రాన్ని నేసినట్లు నటించి, నడిపిస్తుంది. మర్చిపోయినట్లు, ఏమీ తెలి

ప్రశ్న: అయితే మరి, మానవుడికి స్వేచ్ఛ, స్వతంత్రము లేదా? సర్వం పూర్తిగా దైవం నిర్ణయించినదేనా? తన స్వతంత్రత తన విధీ అన్నీ ఉన్నత రహస్యాలే?

స్వతంత్రత విధి, విమోచన, నిర్ణయం – ఇవి వివిధ అంత స్థుల, చైతన్యంలోని నగ్నసత్యాలు. అజ్ఞానం రెండింటినీ ఒకే అంతస్తులో పెట్టేలాగా మనస్సు చేత చేయిస్తుంది. పైగా ఒక దాన్ని ఇంకొకటి కప్పివేస్తుంది. చైతన్యం ఒక పోత పోసిన విగ్రహం లాంటిది కాదు. అది బహుముఖ విశ్రుంఖలత. అది ఒక చదునైన మైదానం లాంటిది కాదు. ఉన్నత శిఖరాగ్రంలో అది దైవం. అధోస్థితిలో అది పదార్థం. ఈ రెండింటికీ మధ్య ఎన్నో అంతస్థులున్నాయి. పదార్థమనే అంతస్థులో సాధారణ చైతన్యస్థితికీ (ordinary consciousness) కాలికీ, చేతికీ ఉన్నంత తేడా ఉంది. ప్రకృతి యంత్రాంగానికి ఒక బానిస. కర్మ అనే సంకెళ్లు లేక గొలుసులతో బంధింపబడి గొలుసులో జరిగేవన్నీ ఇది వఱకు జరిగినవే. వాటి ప్రత్యామ్నాయాలే. మనమేదో స్వతంత్రంగా కదులుతున్నాము అని అనుకుంటున్నాము. కానీ, నిజానికి నీవు చేస్తున్నవి, ఇతరులు చేసినవీ పునః కర్మలే. ప్రకృతి యొక్క ప్రతి

యనట్లు, ఆమె భవిష్యజ్ఞానంలో, – ఉన్నతజ్ఞానంలో తెలిసినవన్నీ మర్చిపోయినట్లున్న స్థితిలో, మానవుడికి తన స్వతంత్రతారంభం మొదలుపెడతాడు, తన జీవితంలోకి తెచ్చుకుంటాడు. మనలోని ఈ విషయాలన్నీ ఆమె పనిముట్లు, సాధనాలు. ఈ యంత్రాంగంలో ఎక్కడో దృశ్యంలో తాను ముందే చూచి ఉన్నవి, యోజన, ప్రణాళికలో వేసినవే. ఇక్కడ అనుభూతి లోకి వస్తాయి. ఇది మనకు బాగా అర్థం కావాలంటే ఒక ఉదాహరణ చెప్పుకోవచ్చు. ఒక నాటకీయుడి జీవితం ఉదాహరణగా తీసుకుంటే తనకు తాను వేయవలసిన (నటించవలసిన) మొత్తం నాటకం గురించి అన్నీ అంతా క్షుణ్ణంగా తెలుసు. కానీ తను పాత్ర నటిస్తున్నపుడు మాత్రం రంగస్థల వేదిక మీద తనకు ఏమీ తెలియనట్లు, తను మొదటిసారిగా ఇది నటిస్తున్నట్లు, చూస్తున్నట్లు వ్యవహరిస్తాడు. మొట్టమొదటిసారిగా (ఒక ప్రయత్నం చేయని దారంతో, కొత్తగా నేస్తున్నట్లు ఆమె ప్రయత్నం చేస్తుంది. తనకు తెలిసిన విదితమైన ఈ అభిజ్ఞానాన్ని, చైతన్యాన్ని మరచిపోయినట్లు నటించినదే, మానవుడికి, స్వేచ్ఛనీ, స్వతంత్రాన్ని ఇచ్చినట్లు, తానుగా పయత్నం. చేయగలిగినట్లు అనిపించనిస్తుంది. ఇదే మానవుడు తనలోని చాలా గొప్ప సాధనాలనీ, పద్ధతులనీ అనిపించి ఈ సాధనా యంత్రాంగం ద్వారా హావ భావాలను, ప్రణాళిక రూపంలో, ఎక్కడో చూచినవి, ఇక్కడ అనుభూతి పొందుతాడు) తను ఏమి ఎఱుగనట్లు, ఇదంతా ఒక కొత్త ప్రపంచమన్నట్లు, ఈ జరుగుతున్నదంతా, కొత్తగా తన కళ్ళ ముందు సంభవిస్తున్నట్లు, అనుభవిస్తున్నట్లు నటిస్తాడు. ఇదే జగన్నాటకం.

ధ్వనులే. విశ్వయంత్రంలో నలిగిపోతున్న భ్రమణమే నీది. ఇది నీ నిస్సహాయత.

అయితే అలా చేయనక్కఱ లేకుండా, నీకు నచ్చిన చోటు లోకి, నీవు వెళ్ళవచ్చు. యంత్రంలో నలిగిపోకుండా ఒక పిడి పట్టుకుని తప్పించుకోలేని పరిస్థితుల్ని కూడా తప్పించుకోవచ్చు. ఇది తప్పించుకుని అలా పైకి వెళ్ళినపుడు, ఈ చిక్కు లోంచి బయిటికి వచ్చినపుడు పైకి నిలబడిగలిగినపుడే నీవు విముక్తుడవు. అన్ని తప్పనిసరి పరిస్థితుల లోంచి, స్వేచ్ఛగా, చురుకుగా కర్మని మలచుకొని, సంకెళ్ళనుంచి విడివడి, జరగబోయే పరిస్థితులను కూడా మార్చుకోవచ్చు. మార్చవచ్చు. ఇలా ఒక్కసారి ఈ శక్తుల లీలలను నీవు చూచాక, నీ చైతన్యాన్ని, జ్ఞానాన్ని పెంచుకుని, ఈ శక్తుల పుట్టుక, లేదా ఎక్కడ పుడుతున్నయ్యో తెలుసుకుని అందులో నీ ఉనికి ఎక్కడో తెలుసుకుని, క్రియాశీలమైన శక్తులతో నీవు తాదాత్మ్యం చెందగలిగితే 'జరిగే ఉంది' అన్న దాన్నించి, నీవు జరుగబోయే దానితో కదలగలవు. నీ గమనం, యాంత్రికంగా కాదు, చెందదు, అందదు.

ఇదే స్పష్టంగా యోగం యొక్క ముఖ్యోద్ధేశం. అంటే కర్మ చక్రాన్నించి బయటికి వచ్చి, దైవగమనంలో విలీనమవడం. యోగం మూలంగా ప్రకృతియొక్క యాంత్రికచర్యల్లో ఒక అజ్ఞాన బానిసగా లేక నిస్సహాయ సాధనంగానూ కాక మరొక అంతస్థులోకి పెరిగి, ఒక చైతన్య, జ్ఞాన భాగస్వామిగా చురుకైన మనిషిగాను, ఊర్ధ్వవిధిలోంచి పని చేస్తుంటావు. ఇటువంటి కదలిక, ద్వంద పథంలో నడుస్తుంది. ఒకటి ఆరోహణ అంటే భౌతిక చైతన్యం లోంచి, ఉన్నత అంతస్థుల్లోకి ఎదగాలి. అయితే, ఇదే ఆరోహణం ఊర్ధ్వా (శక్తుల్ని) న్ని అవరోహణం చేస్తుంది. నీవు భూమి మీద నుంచి ఎదిగినపుడు, పైనుంచి భూమి మీదకు ఏవో కొన్ని శక్తులు దింపగలవు. (ఇదే అవరోహణం) అంటే, పాతప్రకృతి స్వభావాన్ని మార్చే జ్యోతినిగాని, శక్తినిగాని మనం దింపగలం. ఇంతగా తారతమ్యంగా ఉన్న శక్తులు, సంబంధం లేనట్లుగా ఉన్నవి ఒకదానికొకటి వ్యతిరేకంగా ఉన్నవి. ఊర్ధ్వ, అధో, బాహ్యం,

అంతరం పోయి, చైతన్యాలు కలిసిపోయి, ఒకే సత్యం అయి, సమన్వయమవుతుంది. అన్నిటికీ ఒక ప్రత్యేకమైన పద్ధతులు (laws) ఉన్నాయి. ఒకదాని న్యాయం (పద్ధతి) ఇంకోదానికి ఒప్పదు. అద్భుతమేమంటే, మరొక చైతన్యం లోంచి కట్టలు తెంచుకుని వచ్చిన శక్తులే. సాధారణంగా ఇది చైత్యపురుషుడి లోంచి జరుగుతుంది. ఒక మెఱుపు తీగ మబ్బుల్ని చీల్చుకొని వచ్చినట్లు, సాధారణ చైతన్యం లోనికి, ఇతర శక్తులు, ఇతర నడవడులు, క్రమములు పోసినట్లు వస్తాయి. దీనినే మనం అద్భుతం అంటాము.

ఎందుకంటే, అకస్మాత్తుగా వచ్చిన ఈ మార్పులు, సహజమైన న్యాయసూత్రాలకి విరుద్ధం. మనం దీన్ని ఎందుకు చూడలేమంటే ఈ 'అద్భుతం' అన్నది మరొక చైతన్య అంతస్థులో ఉంటుంది కనుక. ఇటువంటి అవాంతరాలు పదార్థ ప్రపంచానికి క్రొత్తేం కాదు. ఇవి ఎప్పుడూ జరిగే అద్భుతాలే. మనం సరిగా కళ్ళు పెట్టుకుని చూస్తే, ఈ అద్భుతాలను కోకొల్లలుగా చూడవచ్చు. ప్రత్యేకంగా, ఊర్ధ్వశక్తులను భూమి మీదకు (కిందకు) దించడానికి ప్రయత్నం చేసే వాళ్ళల్లో ఇది చాలా మామూలు. ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్. విమలాదేవి

(*SABCL* Vol. 29, p. 456; CWM Vol. 3, pp. 27-31)

మానవులందరికీ భవిష్యత్తులో గొప్ప ఆధ్యాత్మిక అవకాశం వుంది. కృతనిశ్చయం బట్టి అది అనతి కాలంగాని, ఎక్కువ కాలం గాని పట్టవచ్చు — ఆ మనిషి నిష్ఠని బట్టి వుంటుంది.

శ్రీమాత

సృష్టి సోపానములు – స్వేచ్ఛ

ఈ భూమి, సూర్యచంద్రాదులు– సృష్టి అంటే ఇంతేనా లేక యితర లోకాలు కూడా ఉంటాయా? తప్పకుండా ఉంటాయి. అవి భౌతికంలో ఉండవు. వాటి రూపు రేఖలు వేరు, వాటి ధర్మం వేరు. ఈ దృశ్యమాన జగత్తంతా కాలీనము అనగా కాలంలో జరుగుతున్నది. సృష్టికి పూర్వము కూడ ఈ లోకాలన్నీ ఎక్కడో వుంటాయి. అనగా అదివరకు పుట్టి నశించి పోయినవి, ఇంకా పుట్టని లోకాలు– ఇవన్నీ కూడ ఎక్కడో వుండే వుంటాయన్న మాట. మనమే అక్కడకు వెళ్లి అనంత చైతన్యసీమలలో యథేచ్ఛగా విహరించినప్పుడు మన దృష్టి విశాలమౌతుంది. కాలాన్ని కూడా దాటిపోగలము.

– సంపాదకుడు

For only the unborn spirit's timeless power
Can lift the yoke imposed by birth inTime.
Only the Self that builds this figure of self
Can rase the fixed interminable line
That joins these changing names, these numberless lives,
These new oblivious personalities
And keeps still lurking in our conscious acts
The trail of old forgotten thoughts and deeds,
Disown the legacy of our buried selves,
The burdensome heirship to our vanished forms
Accepted blindly by the body and soul...
The fixity of the cosmic sequences
Fastened with hidden inevitable links
She must disrupt,dislodge by her soul's force
Her past, a block on the Immortal's road,
Make a rased ground and shape anew her fate.

Sri Aurobindo (*Savitri*)

అయిన ప్రతియొక్కటి నిక్కచ్చిగా నిర్ణయింపబడినదే. సకలమును అనాదియే. ఊహానిర్మితములు కానివి – పుట్టుక లేనివి. మూర్తిమత్త్వమనే పుట్టుక యందుము. ఉప్పు నీటిలో కరిగిపోవును. అయినా ఉప్పుకే క్షితియును లేదు. రూపమే క్షయించినది: మఱల దానిని ధరింపదగును. మూర్తిమంతమగు విశ్వము మూర్తిని బాసినను దానికి క్షితి ఎక్కడ! దాని శాశ్వతత్వమునకు లోటు లేదు. కాని –

ప్రపంచము లసంఖ్యాకములు, పరస్పరసంబంధము లేనట్లుగ తోచును. కొత్తవి కనుగొనబడి నవ్యసృష్టి యను భ్రమను కల్గజేయును. కాని అవి ఎల్లపుడున్నవే. వాని ప్రకృతులు భిన్నమయి, మనదానికి విపరీతముగ నుండుట వలన మన కవి లేనట్లే కాగల అవకాశమున్నదని మన మేధకు అవగాహనయుట వింత కాదు. పరమాత్మ ప్రయాణము శాశ్వతము. ఈ భిన్నప్రపంచములు వాస్తవికముగ ఒక పరమద్రవ్యముయొక్క భిన్నరూపములే యనియు ఉన్నది కేవలమును, అద్వితీయమును ననెడి ఎఱుక కల్గినవేళ మనిషి తన్ను తానెఱుగ గలడు. మనిషి, (జీవుడు) నీ సాఫల్యతకు చేర్చుటయే పరమాత్మ ఏకైక ధ్యేయము.

ప్రపంచమే ఆనందము. అది కేవలము, భిన్నప్రపంచములు దాని ఆభాస మాత్రమే. దర్పణమున తోచు ప్రతిబింబములే ఇవి. నేతి నేతి న్యాయమున ఒక్కొక్కటియు నిరాకరింపబడుచు చివరకు శేషించునది ఆనందమనియు, ఆ ఆనందమే నీవనియు, గ్రహింపగలవు. సింధువున చేరిన బిందువు సింధువగునుగా!

ఈ వివరణమే ఇతర వివరణకును తీసిపోదు. బహుశః సామాన్యులకు తేలికగా అర్థమగునది – వేదాన్తులు కానివారికి. నాకిది పరమ సమ్మతము.

మాతాజీ! సకలమును ఆదిలోనే నిర్ణీతమైన దంటిరి, అయినచో పురుషప్రయత్నమునకు చోటేది?

ఒక్క క్షణము క్రితమే చెప్పియుంటిని. పరమ నావికుడు ప్రతి నిమిషమున, తాను పయనించు దిక్కును ఎన్నుకొనుననియు, ఎన్నిక స్వేచ్ఛ పూర్వనిబంధనల కధీనము కాదనియు, పర

మాత్మ ఏమి చేసెనో తెలిసినవారెవరు? ఏమి చేయనుండెనో జోస్యము చెప్పగలవారెవరు? అతడు నిరంకుశుడు. కాని సకలము అనాదియే, శాశ్వతమే, అవికారమే. ఈ సత్యము కనుగొను విధము మాత్ర మపూర్వము. ఈ కనుగొనుటలోనే స్వేచ్ఛాస్వాతంత్ర్యము లున్నవి.

నీవు షికారుకు బయలుదేరితివి. అంతలో అనుకొనిన మార్గమున గాక అన్యమార్గమున పోవలెనని తోచినది. నీ మార్గమే మారినది. కాని నీ ధ్యేయమట్లే యున్నది. ఆ ప్రకారముననే, నీవు క్రొత్తగా చూచునవి పూర్వమునుండి అట నుండియున్నవే –

నీ ఎరుక పరమాత్ముని ఎరుకలో లీనమమగునప్పుడే ఈ పూర్ణస్వేచ్ఛాభావము నీలో జనించును. అది జరుగనంతకాలము నీ వొక బలిష్ఠశక్తిచే నడిపింపబడుచుంటినను భావముండును.

శ్రీఅరవిందులు చెప్పినట్లు, పరమాత్మతో ఐక్యతయే నిజమగు స్వేచ్ఛ. అనగా, పూర్తిగా శరణు జొచ్చుటయే స్వేచ్ఛ, సర్వసంగపరిత్యాగమే స్వేచ్ఛ.

*

ఒక సంఘటన జరిగిందనుకో – కాని ఇది ఇంతకు పూర్వమైనా జరిగి ఉండవచ్చు. తరవాతైనా జరుగవచ్చు. అనగా సూక్ష్మరూపంలో ఇదెక్కడో వున్నదన్న మాట. అనేక చేతనా స్తరములు పైనుంచి కిందవరకు వ్యాపించి వుంటాయి. ఒక్కొక్క స్తరముది ఒక్కొక్క ధర్మము. పై లోకాలు కింద లోకాలలో జరిగే ఘటనలను మార్చగలవు. యథాతథంగా లేక ప్రకృతి కనుగుణంగా ఏదో జరుగుతుంది. దాన్ని మార్చాలి. నువ్వు కనుక ఉన్నతసీమలను దర్శించ గలిగినట్లయితే అక్కణ్ణుంచి మరొక శక్తిని తీసుకొనివచ్చి దానిని మార్చగలవు. నువ్వు దానికోసం ఆకాంక్షించాలి. అదే నీ ప్రాణం కావాలన్న మాట. తదేక ధ్యానంతో వుండి ఆత్మసమర్పణ గావించుకున్నప్పుడు పైనుంచి మరొక శక్తి దిగిరావటం తథ్యం. ఇంతకు పూర్వము నీకెంతో జటిలంగా వున్న సమస్యలు తీరిపోతాయి. అనేక సంవత్సరాలుగా నువ్వు సాధన

చేసినప్పటికి ఫలితం లేకపోవచ్చు. కాని పై లోకపు ప్రమేయము వలన నువ్వు ఆశించిన సిద్ధి లభిస్తుంది.

నీకు కష్టమైన పరిస్థితులు లేక ప్రమాదాలు ఎదురైనప్పుడు 'అయ్యో ఏం దారి' అని మథన పడటం వలన ఏం ప్రయోజనం వుండదు. నువ్వు చేతనా సోపానములను అధిరోహించాలి. Transcendent లోకాలను అందుకోని ఎట్టి చింతనా లేకుండా నిన్ను నీవు సమర్పించుకోవాలి. అంతే, ఇక బాధ్యత నీది కాదు. అంతా ఆయన కప్పచెప్పేసావు. అంతా ఆయనే చూసుకుంటాడు. అవసరముంటే పరిస్థితులను కూడ మారుస్తాడు. అప్పుడు ఆశ్చర్యం, ఆశ్చర్యం – అంతా దానంతటదే బాగుపడిపోతుంది. ముంచుకొొచ్చిన ప్రమాదం తప్పిపోతుంది. దీన్ని చూసినవాళ్లు 'మిర కిల్' జరిగిందనుకుంటారు. అసలు రహస్యం వాళ్లకు తెలియదు.

The sole secret is to know how to climb up right to the top.

*

ప్రశ్న: సర్వమూ పూర్వమే నిర్ణయింపబడి వున్నప్పుడు, మానవ ప్రయత్నము, ఆకాంక్షల పాత్ర ఏమిటి?

ప్రతి కక్ష్య (భౌతిక, ప్రాణిక, మానసిక) లోనూ సర్వమూ పూర్వమే నిర్ణయింపబడినా ఊర్ధ్వశక్తుల ప్రవేశంతో వివిధ సంఘటనలను, వాటి గతిలో మార్పు రాగలదు. ఈ పని ఆకాంక్ష నెరవేరుస్తుంది.

మానవ ప్రయత్నమూ – అన్ని శక్తుల సమ్యక్ దృష్టితో పూర్వమే నిర్ణయింపబడిన వాటిలోది.

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: పోతాప్రగడ వెంకటేశ్వరులు (శ్రీమాత శతజయంతి ప్రచురణ సం॥ 18 నుండి); డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

విధిపాశము నుండి విముక్తి:

విధికంటే అంతరాత్మే గొప్పది

'తానొకటి తలచిన దైవమొకటి తలచును అని అనుకోటం మనకేం కొత్త కాదు – సర్వసాధారణమే. ఎందుకని మనం 'తను' అని ఎవరిని అంటున్నామో స్పష్టంగా తెలుసుకోవాలి. అది మనస్సు కాదు. ఆత్మయే. నీ నిజమైన తాను' నీలోని చైత్య పురుషుడే. నీ నిజమైన 'నేను' నీలోని దైవాంశము. దైవము తలచినదే ఆయన కూడ చేస్తాడు. కనుక ఇక నీకెట్టి బెడద వుండదు. అంతా శాంతియే, అచంచలమైన పరమ స్థైరమే.

– సంపాదకుడు

మనం ఏ మార్గాన్ని అనుసరించినా ఫలితం ఒకటే. మనలోనున్న దైవాంశ చుట్టూ ఏకీకృతం కావడం ముఖ్యం. అప్పుడే మానవుడు నిజమైన వ్యక్తిగా, తనకు, తన విధికి, తానే అధిపతి కాగలుగుతాడు. అలా కాకపోతే, నదిలో బెండుముక్కలాగా, అటూ ఇటూ ఊపే శక్తులకు ఆటవస్తువు అవుతాడు. అతనికి ఇష్టంలేని చోటికి వెడతాడు. చేయడానికి ఇష్టంలేని పనులు చేస్తాడు. చివరకు గోతిలో పడిపోయి, లేవడానికి కూడా బలం లేని పరిస్థితి వస్తుంది. నీవు అంతా చైతన్యవంతంగా ఏర్పాటు చేసుకొని, దైవాంశ చుట్టూ ఏకత్వాన్ని పొంది, దానిచే పాలితుడవై, దానినే అనుసరిస్తుంటే, నీ అదృష్టం నీకు హస్తగతమౌతుంది. ఆ ప్రయత్నంలో కష్టపడినా ఫలితం దక్కుతుంది. ఏది ఎట్లాగయినా సరే, బానిసగా ఉండడం కన్నా యజమానిగా ఉండడమే కోరదగినది. నీకు యిష్టమున్నా లేకపోయినా నీ చేత ఆ విధంగా బలాత్కారంగా పనులు చేయిస్తే, నీకు చాల చికాకు ఏర్పడుతుంది. నీవు దేనివల్ల, ఆ విధంగా యిష్టంలేని పనులు చేస్తున్నావో నీకు తెలియదు. నీచేత అలా చేయిస్తున్న శక్తిని నీవు చూడవు. అది నీకు చాల కోపం తెప్పిస్తుంది.

*

చైత్యపురుషుడు పుట్టి పెరగటం ఒక ఎత్తు. పెరిగిన తరువాత తన కార్యమును చేయుటం రెండవ ఎత్తు. తల్లి గర్భంలో జీవ కణముతో మొదలై మనిషి ఎలా పెరిగి పెద్దవాడవుతాడో అలాగే దైవాగ్ని విస్ఫులింగ మొకటి మానవునిలో పుట్టి, అభివృద్ధి చెంది, చైత్యపురుషునిగా తయారవుతుంది. చాలామందిలో ఈ చైత్య పురుషుడు శైశవస్థాయిలోనే వుండిపోతాడు. ఆయన పెరిగేందుకు అనేక జన్మలు పడుతుంది.

చైత్యపురుషుడు ఎప్పుడైతే పూర్తిగా పరిపక్వమౌతాడో అప్పుడిక తను సృష్టిలో పాల్గొనాలో వద్దో తనే ఎంచుకుంటాడు. ఒక మనిషిలో జన్మించినప్పుడు ఆ మనిషిని ఇక పాత సంస్కా రాలుగాని ఏ విధమైన పరిస్థితులుగాని బంధించవు. ఆయన ఒక మహాపురుషుడన్న మాట. ఒక నిర్దిష్టమైన కార్యమును నిర్వహిం చుటకై ఈ భూమ్మీదకు వస్తాడు; ఆయన ఒక పరిపక్వమైన జీవి – పునర్జన్మ దాల్చవలసిన అవసరం లేదన్నమాట. అంత వరకూ పునర్జన్మ అవసరం – ఎందువల్లనంటే పునర్జన్మ ద్వారానే కదా వృద్ధిపొందడము, చైత్యపురుషుడు భౌతిక శరీరంతో, భౌతిక జీవనం ద్వారా క్రమవికాసం పొంది పూర్ణచైతన్య జీవిగా వృద్ధి పొందుతాడు. ఒకసారి పూర్తిగా ఏర్పడిన తర్వాత, జన్మ ఎత్త డమో మానడమో తనే నిశ్చయించుకోగల స్వేచ్ఛను పొందు తాడు. ఈ విధంగా ఒక రకమైన పురోగతి నిలిచిపోతుంది.

పూర్తిగా అభివృద్ధి పొందిన చైత్యపురుషుడు దైవకార్య నిమిత్తం ఉపకరణంగా పనిచేయ దలచుకుంటే, చైత్యలోకంలోని పరమానందంలో విశ్రమించే బదులు, దైవకార్య నిర్వహణలో సహాయపడడానికి పనిచేయాలనుకుంటే, మళ్ళీ ఇంకొక పురోగ మనం ప్రారంభించాలి. పనికి కావలసిన శక్తిసామర్థ్యాలలోను, వ్యవస్థీకరణంలోను దివ్యసంకల్పం వ్యక్తీకరించడంలోను పురో గమించాలి. ఆ విధంగా అతడు మారే సమయం ఒకటి వస్తుంది. ఈ ప్రపంచంలోనే నిలిచి, భగవత్సేవ చేద్దామనుకున్నంత వరకూ అతడు పురోగమిస్తాడు. అట్లా కాకుండా, చైత్యలోకంలోకి విర మించుకొని, దైవకార్యం కొనసాగించడానికి నిరాకరించినా, లేక

త్యజించినా, పురోగమనం లేని స్తబ్ధస్థితిలో నిలిచిపోతాడు. ఎందువల్లనంటే నేను చెప్పినట్లు ఈ భౌతిక ప్రపంచంలో మాత్రమే పురోగతికి ఆస్కారముంది. ఇంకెక్కడా ఉండదు. చైత్యలోకం పరమానందకర ఆరామప్రదేశం మాత్రమే. అక్కడ ఏ విధమైన చలనం లేకుండా ఎట్లా వున్నవారు అట్లానే నిలిచిపోతారు.

*

ప్రశ్న: మరి చైత్యపురుష పరిజ్ఞానము లేనివారి సంగతేమిటి?

కోరుకున్నా కోరుకోకపోయినా వాళ్లు కూడ పురోగమించి తీరాల్సిందే.

*

మనిషి జీవితంపై నక్షత్రాల ప్రభావం ఏం వుండదు. దేవుడంటే నమ్మకం లేనివాళ్లే తమ జీవితాలను తారలు శాసిస్తాయి అని నమ్మి అనవసరంగా కష్టాలను కొనితెచ్చుకుంటారు.

నాకు ఐరోపాలోను, భారతదేశంలోను అనేకమంది జ్యోతిష్కులను గురించి తెలుసు. భవిష్యత్తుని గురించి ఎవ్వరూ కచ్చితంగా చెప్పలేరు. దీనికి మూడు కారణాలు వున్నాయి. ఒకటి: జ్యోతిష్కులు జాతకచక్రాలను పరిశీలించినప్పుడు భవిష్యత్తును చెప్పలేరు. రెండు: జాతకచక్రాన్ని కరెక్టుగా వెయ్యాలంటే అతనొక గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు అయి వుండాలి. ఎంత గొప్పవాడికైనా సరే సరిగ్గా గుణించి చక్రాన్ని తయారుచేయటం కష్టమే. మూడవ కారణం జన్మకాలంలో రాశులు ఫలానా గృహంలో వున్నాయని చెప్పటం కూడ ఉచితం కాదు. ఎందుకంటే తారలు ఆ సమయంలోని భౌతిక పరిస్థితులను సూచిస్తాయే తప్ప మనిషి భవిష్యత్తుని కాదు. అవి మూలసత్యాలు కావు. *నక్షత్రాలనూ, మనుషులనూ, సమస్త లోకాలనూ శాసించే మరో పరమ సత్యమొకటి వున్నది.* మానవాత్మ ఆ పరమాత్మలోని భాగము. ఒకవేళ ఆ మనిషి యోగాన్ని ఆచరిస్తున్నట్లయితే ఇక అతనికి నక్షత్రాలను నమ్ముకునే పని లేదు.

*

జీవితం మీద నక్షత్రాల ప్రభావముంటుందని అందరూ నమ్ము తారు. ఆకాశంలో నక్షత్రాల స్థానాలను బట్టి జ్యోతిష్కులు నీ జాతకాన్ని ముఖ్యంగా భవిష్యత్తుని గురించి చెప్పుతారు.

ఈ గడ్డపై మనిషి ఆవిర్భించిన తొలిదశలో మానవులు సూర్యచంద్రాదులను ఆరాధిస్తూ వుండేవారు. నక్షత్రాలు జీవి తాన్ని శాసించగలవని నమ్మేవాళ్ళు. కాని ఇందులోని నిజానిజా లేమిటో మనం తెలుసుకోవాలి. అనంత చైతన్యము చీలిపోగా జగత్తులోని చరాచర వస్తువులన్నీ ఆవిర్భవించాయి. కాని వీట న్నిటికి మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది. పరస్పర ప్రభా వముంటుంది. వ్యక్తికి విశ్వానికి కూడా అదే సంబంధం వున్నది. అంటే ఈ సృష్టిలో ఎవ్వరూ చుట్టూ గిరి గీసుకొని, మడి కట్టు కుని కూర్చుండేందుకు వీలు లేదు. పరిసరాలతో పరస్పర సంబం ధాలను నెరుపుతూనే వుంటారు. నక్షత్రాలు ఈ సంబంధాన్నే ప్రతి బింబిస్తాయి. అంతమాత్రాన అవి మానవజీవితానికి సంకేతాలు అని చెప్పేందుకు వీలు లేదు.

అనుభవరీత్యా జాతకాలు నూటికి నూరుపాళ్లు వాస్తవము కాదని తెలుస్తోంది. అయితే యోగము చేసి ఆధ్యాత్మిక వికాసం పొందే వాళ్ళకి ఈ జాతకాలు అసలే వర్తించవు. ఈ జాతకాలు వ్యక్తికి విశ్వానికి వుండే భౌతిక సంబంధాన్ని మాత్రమే సూచి స్తాయి. పైనుంచి ఉన్నత చైతన్య సంపర్కము కలిగినప్పుడు ఈ భౌతిక సంబంధము మారిపోతుంది.

వ్యక్తికి విశ్వానికిగల సంబంధాన్ని అర్థం చేసుకునే ప్రయ త్నాన్ని మిడిమిడి జ్ఞానమన వచ్చును. మన మొక సంగతి తెలు సుకోవాలి. ఒక విషయాన్ని గురించి తెలుసుకునేందుకు మనము భాషని ఉపయోగిస్తాము. అయితే అది అసంపూర్ణంగా వుంటుందే తప్ప వాస్తవాన్ని పూర్తిగా వివరించ లేదు; ముఖ్యంగా మనుషులు ఒకరి నొకరు అర్థం చేసుకునేందుకు పనికొస్తుందేగాని అసలు సత్యాన్ని దర్శించలేదు.

మనం స్వయంగా ఒక వస్తువును ఆత్మతో దర్శించి పొందిన జ్ఞానము ప్రత్యక్ష జ్ఞానము. అప్పుడు భాషయొక్క అవ

సరం లేకుండానే నీకు ఆ వస్తువును గురించిన పూర్తి జ్ఞానం లభిస్తుంది. నీకు 'నేను' అని ఎంత ప్రత్యక్షంగా తెలుస్తుందో అది కూడ అంత ప్రత్యక్షంగా తెలుస్తుంది. నీ చేతనతో నువ్వు ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లి అక్కడ చతికిలపడతావన్న మాట. అప్పుడు మనస్సుతో ఆలోచించకుండానే నీకు ఆ వస్తు పరిజ్ఞానము కలుగుతుందన్న మాట. ఉదా॥ చెట్టు, కొండ. నువ్వు విశ్వసత్యాన్ని కూడ ఇటుల దర్శించినట్లయితే నీకు విశ్వానికిగల సంబంధము తేటతెల్లమౌతుంది.

*

జ్యోతిష్కులు చెప్పినవన్నీ నువ్వెందుకు నమ్ముతావు? అలా నమ్మే వంటే నువ్వు దుఃఖాన్ని కొనితెచ్చుకున్నట్లే.

మనిషి తనను గురించి తాను ఏమనుకుంటాడో అదే అవుతాడు అని శ్రీఅరవిందులు అన్నారు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి (శ్రీమాత శతజయంతి ప్రచురణ సం॥ 9 నుండి); డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 5, pp. 139, 205-06; Vol. 15, pp. 37-38; vol. 9, pp. 284-85; Vol. 15, p. 38)

మానుష శక్తికి, విధికి మధ్య వారధి

A magic leverage suddenly is caught
That moves the veiled Ineffable's timeless will:
A prayer, a master act, a king idea
Can link man's strength to a transcendent Force.
Then miracle is made the common rule,
One mighty deed can change the course of things;
A lonely thought becomes omnipotent.

Sri Aurobindo (*Savitri*)

ఏదైనా ముందుగానే నిర్ధారింపబడితే, దానిని ఎలా మార్చగలం?

దీనికి నేను ఒక చిన్న ఉదాహరణ ఇస్తాను. అది ఏ చైతన్యస్తరంలో నైనా జరగవచ్చును.

ఒక రాయి పైనుండి పడుతుంది. రాయి తన విధిని నెరవేరుస్తుంది. అది నేలపై పడుతుంది. కాని నీకు దాన్ని ఆపాలనిపిస్తుంది. చెయ్యి జాపుతావు. అది కిందపడకుండా, నీ చేతులో పడుతుంది మరి రాయి గతిని నువ్వు మార్చలేదా? అలాగే ఒక చెట్టు ఆకు రాలుతుంది. దానిని నీవు నీ చేతులతో పట్టుకొని దాని గతిని మార్చడం లేదా?

కాని నువ్వు మనస్సుకు పైని చేతనాస్థాయిల నందుకోగలవనుకో. ఆకాంక్ష ద్వారా, ప్రార్థన ద్వారా నీలోని ఉన్నత చైతన్యాన్ని నువ్వు తీసికొని రాగల్గితే, లౌకిక జీవనం భవితవ్యం లోకి ఆ చైతన్యం దిగివస్తే, అంతా మారుతుంది. జరిగే సంఘటన నీకు అర్థం కాకపోవడం వల్ల అది అంతా యాదృచ్ఛికం, అద్భుతం అని భావిస్తున్నావు.

భవితవ్యాన్ని ఒక చైతన్యం మార్చినప్పుడు, ఏదో నవ్యత్వం అందులోకి చేరుతుంది. ఉన్నత చైతన్యం అవరోహణ సమస్త లోకాల్లోను జరుగుతుంటుంది. అది అర్థం కాకపోవడం వల్ల, సామాన్య జనం దృష్టిలో అది ఒక అద్భుతంగా కనిపిస్తుంది.

సరిగ్గా ఈ కార్యాన్నే నిర్వహించి, అతిమానసశక్తిని చేతనతో భౌతికప్రపంచానికి తీసుకుని రావాలని మేము అభిలషిస్తున్నాం. మొదట అది ప్రత్యక్షంగా పని చేయదు. అది రహస్యంగానే పనిచేస్తుంది. భౌతిక ప్రపంచంలో కంటికి కనిపించని రీతిలో అది గుప్తమై వుంటుంది. ఎవరూ అనుకోని విధంగా అది సృష్టిని మార్చివేస్తుంది.

*

భవితవ్యాన్ని ముందుగా ఎవరు చూడగలరు? చాలామంది ప్రయత్నం చేశారు. అనేక శాస్త్రాలు ఉద్భవించాయి. అనేక తాంత్రిక దర్శనాలు వచ్చాయి. అవన్నీ మూఢనమ్మకాలని, అభూతకల్పనలని చాలామంది కొట్టి పారేశారు. అవన్నీ కాలగర్భంలో కలిసి

పోతున్నాయి. భవితవ్యాన్ని ఎవరైన ఎందుకు దర్శించలేరు. సృష్టిలో ప్రతిదీ ముందుగానే నిర్ణీతమై వుంది. అటువంటి నిర్ణీత విధి విధానాన్ని ఎవరూ కూడ నిశ్చయంగా తెలుసుకోలేరు.

దీనికి పరిష్కారం యోగప్రక్రియలోనే వుంది. యోగశక్తి ద్వారా భవితవ్యాన్ని చూడడమే కాదు. దానికి మెరుగులు దిద్ద వచ్చును. సంపూర్ణంగా మార్చివేయవచ్చు.

జీవులు ముఖ్యంగా మానవులు అనేక అమూర్తరూపాల సమ్మేళనం. వారిలో వారికి సంఘర్షణ వుండవచ్చును. ఒక్కొక్క సారి సౌమనస్యం వుంటుంది. ఈ రూపాలకు ఒక ప్రపంచం వేరే వుంది. అక్కడ ఆ రూపాలకు తనదైన భవితవ్యం వుంటుంది. ఆ భవితవ్యం నిర్ధారింపబడుతుంది. ఈ నిర్ధారిత సూత్రాల సమ్మేళ నమే ఒక వ్యక్తి భవితవ్యంగా మారుతుంది.

భౌతికమైన భవితవ్యం ఆ వ్యక్తి పుట్టిన భౌతిక స్థితిగతుల నుండి రూపొందుతుంది. భౌతిక సంఘటనలు గూర్చి తెలుసుకో గలం. కాని మనిషిలో 'ప్రాణికం' ఉంటుంది. దాని భవితవ్యం విభిన్నంగా వుంటుంది. ఉదాహరణకు చక్కని ఆరోగ్యస్థితిగల వ్యక్తి మంచి ఆరోగ్యవంతునిగా జీవించాలి. కాని వానిలో చెడు అలవాట్లు, దుర్గుణాలు, మితిమీరిన ధోరణి – ఇవన్నీ అతని ఆరోగ్య సామరస్యాన్ని కల్లోలితం చేస్తాయి. ఇది 'ప్రాణికం' వల్ల ఇటువంటి దుర్దశ సంభవిస్తుంది. ఇదే కాదు. ఈ సమస్య ఇంకా జటిలమైనది. మానసిక, చైత్యపురుష భవితవ్యాలు కూడా వున్నాయి.

మానవునిలోని వివిధ చైతన్య స్థాయిలు, వాటికి సంబం ధించిన అంతర్లోకాలు గూర్చి తెలుసుకున్నప్పుడే వివిధ భవిత వ్యాలను గ్రహించే శక్తి వస్తుంది. ఉన్నతమైన భవితవ్యాలు విశ్వం లోని సత్యానికి చేరువగ వుంటాయి. వారు కనుక జోక్యం చేసు కోవడానికి అనుమతిస్తే వారి చర్యలు మానవాళికి మహోప కారం చేస్తాయి.

ఒక వ్యక్తి తన అత్యున్నత చైతన్యస్థాయిలో వుంటూ ఇతరులను ప్రభావితం చేసి, శాసించే అత్యున్నత భవితవ్యం కలిగియుండడం ఒక జీవనకళా విధానం.

నువ్వెప్పుడూ నీ చైతన్య శిఖరాగ్రం మీద నిలబడు. నీకెప్పుడూ శుభమే జరుగుతుంది. కాని ఆ స్థాయికి చేరడం అంత తేలిక కాదు. ఈ ఆదర్శం సిద్ధింప చేసుకోలేకపోతే ఒక వ్యక్తికి ప్రమాదం, సంక్లిష్ట స్థితి ఎదురైనప్పుడు ఒక ఆకాంక్ష, ఒక ప్రార్థన, భగవత్ సంకల్పానికి పూర్ణసమర్పణ వల్ల అత్యున్నత భవితవ్యాన్ని ఆవాహన చేయగలడు. అతని ఆవాహన చిత్తశుద్ధితో కూడినదైతే, మామూలు జీవితంలోకి ఈ ఉన్నత భవితవ్యం జోక్యం చేసుకోగలదు. అతని వ్యక్తిగత జీవితంలోని సంఘటనలను ఆ భవితవ్యం మార్చివేస్తుంది. మామూలు మానవుల బాహ్యాచేతనకు ఈ సంఘటనలే అద్భుతంగా, మహిమలుగా, భగవంతుని ప్రత్యక్ష జోక్యంగా కనిపిస్తాయి.

అత్యున్నత మానసస్థాయిలో వున్నప్పటికీ ఈ సృష్టి ముందుగా నిర్ధారితమైన ఒక కఠోర భవితవ్యంగా మాత్రమే కనిపిస్తుంది.

మానస చైతన్య వలయం నుండి పూర్తిగా బయటపడినప్పుడు ఒక ఆధ్యాత్మిక, దివ్య, ఉన్నత వీక్షణంగా నీ దృష్టి మారినప్పుడు, నువ్వు పరిపూర్ణ స్వేచ్ఛ పొందుతావు. అక్కడ అంతా సంభవమే.

మూలం: శ్రీమాత

అనువాదం: యజ్ఞన్న

(*SABCL* Vol. 28, p. 20; *CWM* Vol. 15, pp. 312-13; Vol. 12, pp. 77-79; Vol. 9, p. 175)

విధిని అధిగమించ గలిగేది ప్రశంత చిత్తమే

ఎప్పుడు ఏం జరిగినా అంతా మన మంచికేనా? జరుగవలసిందేదో జరిగి తీరుతుంది తప్ప వేరేమీ కాదు. విధి వ్రాత వల్లనే అలా జరిగింది. ఇలా అని జరిగిపోయాక చెప్పటమే కానీ ముందుగా ఎవరూ ఏమీ చెప్పలేరు. జరిగింది మంచికేనా అనేది ఎవరికి వారు నిర్ణయించుకోవలసిందే. అది వ్యక్తికి జరిగినా, ఒక దేశానికి జరిగినా కూడా అది వారి వారి వైఖరిని బట్టే ఉంటుంది. ఏదైనా జరుగబోయే ముందు నీవు ఉదాత్తమైన వైఖరిని అవలంబిస్తే, అంటే నీకు చేతనైనంత అత్యున్నత చేతనాస్థాయిని చేరగలిగినప్పుడు జరిగేది నీకు చాలా మంచే చేస్తుంది. నీ చైతన్యస్థాయి హీన స్థితిలో ఉన్నప్పుడు నీ కంత మంచి జరగదనే విషయం వేరే చెప్పక్కర్లేదు. ఎందువల్లనంటే నీవు సర్వశ్రేష్ఠ చైతన్యస్థితిలో లేవు కదా! అది ఎంత సత్వర ప్రభావాన్ని ఏర్పరుస్తుందో నిరూపించవచ్చు. సరైన వైఖరితో ఉంటే ఏం జరిగినప్పటికీ అది నీకు అనుకూలంగానే మారుతుంది. అంతే కాకుండా అది ఆ పరిస్థితినే మార్చివేయగలదు. ఉదాహరణకు నిన్ను చంపాలని ఎవరైనా నీ దగ్గరకు వచ్చినప్పుడు నీవు మాములు చైతన్యంలో ఉండి భయంతో వణికిపోతే అతను వచ్చిన పని పూర్తి చేయగలడు. అట్లాకాక నీవు వెంటనే స్పృహ తెచ్చుకొని నీ చైతన్యాన్ని పుంజుకొని భయం ఉన్నప్పటికీ భగవంతుని వేడుకుంటే అతని వేటు గురి తప్పిపోతుంది. లేదంటే నీకు స్వల్పంగా గాయమవుతుంది. ఇంకా నీవు సరైన వైఖరిలో పూర్తి చైతన్యవంతుడవై, నీ చుట్టూ దివ్యమైన వాతావరణాన్ని కల్పించుకొని ఉన్నట్లైతే ఆ వచ్చిన వాడు నీ చిటికిన వేలైనా స్పృశించలేడు.

పరివర్తనా కార్యానికి కీలకం ఈ సత్యం లోనే ఉంది. సర్వ కాల సర్వావస్థల్లోనూ భగవంతుని విడిచిపెట్టకుండా దివ్యత్వాన్ని మన మధ్యకు తెచ్చుకోగలిగితే అంతా సర్వోత్కృష్టంగానే జరుగుతుంది. అంతటితో ఈ లోకమంతా మారిపోదు గానీ దానికి చేతనైనంత వేగంగా పురోగతి చెందుతుంది. అంతా యోగమార్గంలో

నీవు నడిచే ఋజుమార్గం మీదే ఆధారపడి ఉంటుందని మరచి పోవద్దు. నీవు గమ్యం మర్చిపోయి నిస్సహాయుడవై కనబడిన దార్లన్నిటిలోకీ అడుగుపెడుతూ తిరుగాడుతూ ఉంటే మాత్రం ఏదీ జరగదు.

మీలో ప్రతి ఒక్కరూ గట్టి ప్రయత్నం చేసారంటే ఎంతో సహకారంగా ఉండి ఫలితాలు చాల త్వరితంగా కనిపిస్తాయి. స్థిరైన వైఖరి ఉంటే దాని ప్రభావం ఎంత శక్తివంతంగా ఉంటుందో తెలిపే ఉదాహరణలు ఎన్నైనా చెప్పవచ్చు. ఒకే ఒక వ్యక్తి తన సద్వైఖరి వల్ల జరగబోయే ఉపద్రవాన్నుంచి అనేకమందిని కాపా డడం నాకు తెలుసు. అట్లా సద్భావం మాత్రం సరిపోతుందనుకొని శరీరాన్ని దాని పాటికి దాని ప్రతీకారాలకి, స్పందనలకి వదిలే యకూడదు. అట్లా నీవు అందలంలో ఉండి అంతా 'ఈశ్వరేచ్ఛ' అని వదిలేస్తే ఎవరో ఒకరొచ్చి నీ గొంతు నులిమేస్తారు. నీ శరీరం దివ్యత్వం పొందలేదు కాబట్టి అది భయంతో కంపిస్తూనే ఉంటుంది. అందువల్ల శరీరంలోనే యథార్థమైన చైతన్యం నిల బెట్టుకోవాలి. అది పూర్తిగా దివ్యప్రశాంతతతో నిండిపోతే భయ మనేదే ఉండదు. అట్లా చేసుకోగలిగినప్పుడు ఏ అపాయమూ రాదు. మననుమ్యల వల్లా, జంతువుల వల్లా భయం లేకపోవడమే కాక పంచభూతాలు కూడా నిన్ను ఏమీ చేయలేవు. దీనికొక ఉదాహరణ చెపుతాను. ఆ పెనుతుఫాను వచ్చిన రాత్రి నీకు గుర్తుండవచ్చు. హోరుమని గాలి వీస్తూ వర్షం కురుస్తుంటే కిటికీ తలుపులు వేద్దామని నేను శ్రీఅరవిందుల గదిలోని వెళ్ళాను. తలుపు తెరిచి చూసేసరికి శ్రీఅరవిందులు ప్రశాంతంగా టేబుల్ ముందు కూర్చొని రాసుకుంటున్నారు. ఆ గదిలో అలుముకున్న దట్టమైన ప్రశాంతత చూస్తే బయట తుఫాను భీభత్సం చేస్తు న్నట్లు తెలియనే తెలియదు. కిటికీలన్నీ తీసే ఉన్నా ఒక్క వాన జల్లు కూడ లోపల పడలేదు!

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 3, pp. 154-55)

ప్రారబ్ధము – ఐచ్ఛికము

ప్రారబ్ధము (fate) ఐచ్ఛిక (free-will) ము లందు విశ్వాసము, నిత్య జీవితమును ఎంత వరకు ప్రభావితం చేయగలదన్న విషయం సందేహాస్పదమే. అయితే ఇదంతా కేవలం వారి వారి స్వభావానికి, అంతర్యానికిన్నీ పరిమితమైనప్పటికీ ఎల్లప్పుడూ కీలకపాత్ర వహిస్తుందన్న విషయం మరువరాదు. ప్రారబ్ధమందు తన మౌఢ్యమే తన నిర్వేదస్థితికి హేతువని విలపిస్తున్న ఈ జీవుడు – ప్రారబ్ధం లేకపోతే, తన దుస్థితికి మరొక కారణం చూపుటకు వెనుకాడడు. తన మనఃస్థితికి ఒక అనువైన యవనికను అందంగా అలంకరించి మభ్యపెట్టగలడు. విచిత్రమేమంటే ఈ చర్య వాని యొక్క నిస్సత్తువ, నిర్వేదస్థితులను, జ్యోతిర్మయం గావించినా, లేదా వాని యందు ఒకానొక ఔన్నత్యస్థితిని ఆవిష్కరించినా ఆశ్చర్యము కలుగదు. ఇతడే ఏదైనా వస్తువును కోరుకొన్నా, మరేదైనా ప్రక్రియ ఆచరించాలని ఆశించినా ఆ లక్ష్యసాధనకై తన శక్తియుక్తులన్నీ ధారపోయటం మనము గమనిస్తున్నాము. ఈ తీరు ప్రారబ్ధమును నిరసించే ఐచ్ఛిక మార్గులకు కూడా తీసికట్టు. ఇటువంటి పరిస్థితులలో మన ప్రవర్తన కేవలం మన ప్రకృతి, స్వభావజన్యమే గాని మరొకటి కాదని తెలుసుకోవచ్చు. వీరికి 'ధీ' అనగా బుద్ధి లోపించగా కేవలం 'మతి' అనగా మనస్సుకు స్వాధీనమైన స్వభావమే వీరి తీరుకు దర్పణం పట్టగలదు.

అయితే ఈ ప్రారబ్ధ విషయంలో ఒక విశేషం లేకపోలేదు. ఒక మహామనీషియైన వ్యక్తి తన ప్రారబ్ధమంతా భగవన్మయం గావించుకొని, ఒకానొక మహాశక్తి స్వరూపంగా పరిణతి చెంది, ఈ సర్వజగత్తుకు ఒక నవీన మార్గం ఆవిష్కరించగలడు. ఎక్కడో కొండలలోనో, కోనలలోనో దాగియున్న ఒక మహాశక్తి యొక్క అంశ ఈ భౌతికసృష్టిలో ప్రవేశించినదా! యన్న భ్రమ కలిగించగలడు. లేదా ప్రకృతిమాత ఒడిలో నుండి బయల్వెడలి శీఘ్రగతితో శక్తిసంపన్నమై, నిర్దేశించిన కాలవ్యవధిలో ఈ సృష్టిలో సంచరిస్తూ, నిర్దిష్ట కక్ష్యలో సుదూరాలలో నున్న జ్యోతిస్వరూపము చుట్టూ

పరిభ్రమించే గ్రహమును తలపించగలడు. ఆతని నిత్యజీవన విధానము ఇతని యందు నిక్షిప్తమైన నూతనోత్తేజము ప్రారబ్ధత్వం విశదీకరిస్తున్నది. ఇక సృష్టిలో ఈతని తీరు సృష్టిలో పూర్వము మరుత్తుల వలె పాతవ్యవస్థను ప్రక్షాళనము గావించి పరివర్తనమునకు హేతువే కాగలదు. లేదా దుర్భేద్యమైన కొండలను పిండి చేసి జనసమూహాలకు నూతన మార్గాలను ఆవిష్కరింప చేయగలదు. ఇంద్ర, భగీరథుల వలె ఈతనిదే ముందంజ. సందడి అంతా అతని వెంటనే. గతి, మతి, నిర్దేశించేదిన్నీ అతడే. ఆతనిని ఆదిలో ఒకడు అనుసరిస్తే, మధ్యలో మరొకడు, అంతలో వేరొకడు అనుసరిస్తారు. గతమంతా ఒక మారు నెమరు వేసుకొంటే కర్మశ్రేష్టులందరూ ప్రారబ్ధమునందు గాని, ఈశ్వరేచ్ఛ యందుగాని విశ్వసించినట్లు తెలుసుకొనవచ్చును. సీజరు, మొహమ్మద్ ప్రవక్త నెపోలియన్ చక్రవర్తి మొ॥ వారిని మించిన శక్తిసంపన్నులను మనము ఊహింపగలమా? అనగా అతిబల మహాసంపన్నులే ప్రారబ్ధ దైవబల విశ్వాస విషయంలో సామాన్యుల కంటె బహు మిన్న యని తెలుస్తున్నది.

ప్రారబ్ధ విషయమై నెపోలియన్ చక్రవర్తి వివరణ సత్యాస్ఫూర్తితో కూడుకొన్నది. సమగ్రంగా ఆలోచించి ఉచిత నిర్ణయము తీసుకొను నెపోలియన్ ప్రారబ్ధ విషయమై తరచు ప్రస్తావించటంపై ప్రశ్నింపగా ఆ చక్రవర్తి ఈ విధంగా స్పందించారు. "నేను ఆలోచించి నిర్ణయాలు తీసుకోవటం కూడ ప్రారబ్ధంలోని అంశమే" ఇది ముమ్మాటికీ సత్యము. ఈ సృష్టిలో ఒకానొక సంకల్పబలం నిక్షిప్తమై, నా కర్మఫలమును నిర్ణయిస్తున్నది. అలాగే నా యందు గూడ ఈ సంకల్పబలం నా ఇష్టానిష్టములందు నిక్షిప్తమై నా పాత్రను నిర్ణయిస్తుంది. నా పాత్రనే నా సంకల్పమని, నా ఇచ్ఛయని వ్యవహరిస్తున్నాము. అయితే నేను, నాది, కేవలం పై తొడుగు మాత్రమే. సర్వత్రా ఉన్నది సత్తు (sat) చిత్ (chit) నా అంతరాంతరాలలో వాటి పని అవి చేసుకొంటవి.

నేను ఆచరించిన కర్మఫలము భగవంతునికి, ఈ జగత్తుకు చెందుతుంది. నాకు ఏ మాత్రము దక్కదు. అయితే కర్మ

ప్రక్రియ మా ఉభయులకు అనగా నా యందు ప్రతిష్ఠించుకొన్న భగవంతునికే చెందుతుంది. కర్తృత్వమేమో భగవంతునిది. భోక్తను మాత్రమే నేను. సర్వాంతర్యామి నా అంతరంగంలో తిష్ఠ వేసు కొని వ్యవహరిస్తున్నాడు. అవిచ్ఛిన్నము, అఖండమైన ఈ సర్వాం తర్యామి తన నుండి తాను కొంత విభేదించి నా నామరూపా దులు పొందినట్లుగా భావించవచ్చు. ఈ తలపు ఒక మహాసము ద్రము తీరాన్ని తన తరంగాలతో ఎక్కడో తాకినట్లు గోచరిస్తుంది. ఈ విశాల సృష్టిలో మేముభయులు అనగా సర్వాంతర్యామి, నేను దాగుడుమూతలనే క్రీడావిశేషంలో క్రీడిస్తున్నాము. (ఉన్నదంతా సర్వాంతర్యామి. ఈ 'నేను' కూడా అందులో అంతర్భాగమే. వ్యవ హారంలో నేను తప్పనిసరి. జాగ్రదావస్థలో 'నేను' ఉన్నాను. ధ్యానావస్థలో నేను లేను. ఇవే దాగుడుమూతలు.)

అయితే సర్వాంతర్యామితో నా సంబంధాలు చిత్రవిచిత్రంగా ఉంటాయి. తరచు ఈ సంకల్పమంతా మనస్సు అధీనమైపోతుంది. మనస్సుకు అజ్ఞానావస్థ, ఇంద్రియలోలత్వముతో దోస్తీ. ఇక ఈ 'అహం' స్వీయ ఆరాధనకే ప్రాముఖ్యం ఇస్తుంది. కాబట్టి ఇప్పటి వరకు తేలిందేమిటంటే ఈ 'అహం' ఏ కిరాతకునికి తీసిపోదు. ఒక కిరాతకుడు తనకు అడ్డం వచ్చినవారిని నిర్దాక్షిణ్యంగా అణ గదొక్కినట్లు అహం కూడా తన ఆధిక్యతను ప్రదర్శిస్తుంది. 'అహం' యొక్క ఈ లక్షణం సృష్టిలోని వైపరీత్యాలకు దోహదము చేస్తుందని గ్రహించవచ్చును. స్వగురువు (సర్వాంతరామియై తన యందున్న భగవంతుడు) యొక్క ఆదేశాలకు విపరీతార్థ వ్యాఖ్య చేయటం కద్దు. వినయవిధేయతలకు బహుదూరం. అందువల్ల స్వయంకృషితో పట్టుదలతోను ముందుకు సాగిపోవాలి. మరో మాట. నేను స్వతహాగా గాని మరే కారణంగా నైనాగానీ నారా యణ సేవ యందు నిమగ్నము కావచ్చును. ఇదే నా యొక్క అసలైన, సిసలైన సంకల్పమని తెలుపుతున్నాను. ఈ సత్సంకల్పం తన పాత్ర చక్కగా నిర్వహించి స్వగురువు చెంతకు చేరుతుంది. ఇక ఈ 'అహం' కు ముక్తస్థితి ప్రాప్తించినట్టే. మన యందున్న

పైశాచిక, రాక్షస గుణసముదాయము నుండి విముక్తులం గావటం ఒక శుభపరిణామమని గ్రహించటం అవసరం.

ఈ అహంకారం తనను వెన్నంటే దివ్యత్వ ఊసు తగులకుండా నిర్మించుకొన్న గూడును ఛేదించుకొని బయటకు రాగలిగితే, నేను అంతకన్న కోరుకొనే దేమున్నది? ఇక పోరు సమసినట్లే. ఈశ్వరేచ్ఛయే స్వసంకల్పం కాగా ప్రారబ్ధ ప్రాబల్యమునకు తావు లేదు. రామబంటువలె సేవాచిత్తుడు అయినప్పుడు ఇక మనిషి నిత్యముక్తుడే. బంధనము లేదు, బంధకుడు లేడు. ఈ స్థితి స్వర్గతుల్యం. వాక్కుకు అతీతం. ఆనంద సముద్రతరంగాలలో తేలిపోవటం కన్న నేను కోరుకొనగల దేమున్నది? ప్రారబ్ధం, స్వసంకల్పం దైవసంకల్పము ఐక్యమైపోవాలని నేను ఆశిస్తున్నాను.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: శ్రీశరణ్

*

ఉన్నత చైతన్యంలో ఉన్నత సత్యాలు అనుభవాలుగా రూపొంది మనం వాటిలో జీవించే అవకాశం యేర్పడుతుంది. క్రిందిస్థాయిలో వుండి యీ సత్యాలను చూడటం అంటే వాటిని తప్పుగా చూడటం, అపార్థం చేసుకోవటం, బహుశా దుర్వినియోగం చేయటం అవుతుంది. మంచీ చెడు అనే విచక్షణ కేవలం ఆచరణకు సంబంధించిన వాస్తవము, ధర్మము అని, మృగత్వం నుండి దివ్యత్వానికి మారే క్రమంలో ఒక దశ అయిన అహంకార మానవజీవితంలో అది చెల్లుతుంది. కాని మంచిచెడుల నధిగమించిన ద్వంద్వాతీతస్థితిలో, దైవసమానుల మయిన ఉన్నతస్థాయి వొకటున్నది. ఉన్నది ఒక వున్నత సత్యం. ఈ సత్యాన్ని అపరిపక్వ మనస్సు కలవారికి బోధించడం చాలా ప్రమాదం. నిమ్నస్థాయి చైతన్యంలో ఇది పనిచెయ్యదు. వీరు ఈ సత్యాన్ని తమ అసుర ప్రవృత్తుల యథేచ్ఛా ప్రవర్తనకు సాకుగా వుపయోగించుకుంటూ, మంచిచెడుల మధ్య విచక్షణ లేనే లేదని విశృంఖలత్వంతో, ఆత్మవినాశనపు వూబిలో పీకల లోతు వరకు కూరుకుపోతారని శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో.

ఏతేత్వదభ్య సూయంతో నాను తిష్ఠంతి మే మతం।
సర్వజ్ఞాన విమూఢాన్స్తాన్ – విద్ధి నష్టాన చేతసః॥

అంటాడు. అంటే "ఎవరు యీ నా మతాన్ని నిందిస్తూ అనుష్ఠించరో, ఆ అవివేకులు సర్వజ్ఞాన విమూఢులైన భ్రష్టులని తెలుసుకోవాలి" అని. అదే విధంగా ప్రకృతి నియమాన్ని కూడా గీత వొక వున్నత సత్యంగా చెప్పింది. నిమ్నస్థాయిలో వున్న వారు దీనిని తప్పుగా అర్థం చేసుకుని, దుర్వినియోగపరచి మానవుడు ప్రకృతి చేతిలో కీలుబొమ్మ అనీ అతని స్వభావం చేయించినట్టు తప్ప, మరొక విధంగా చేయలేడని వాదిస్తారు. అది వొక విధంగా నిజమే అయినప్పటికీ దానికి మీరు చెప్తున్న అర్థం నిజం కాదు. అంటే తాను చేసే పనులకు తనదేమీ బాధ్యత లేదని, తానేమి చేసినా శిక్షాభయం వుండకూడదని అనుకోవడం తప్పు. కారణం దానికి సంకల్పం, కోరిక వున్నాయి. వీటిని బట్టి కర్మ చేసినంత కాలం, అది దాని స్వభావమే అయినా కర్మ పర్యవసానాలను అనుభవించక తప్పదు. ఇచ్ఛ, కోరికలను బట్టి మనిషి అహంకారం, అది చేసే కర్మ వలన ఒక వలలో చిక్కుకున్నది. ప్రస్తుతం యిది అక్రమంగా, అన్యాయంగా, భయంకరంగా చిక్కుపడినట్లు కనిపించవచ్చు. అది కేవలం పరిమిత జ్ఞానం వల్ల వచ్చిన భావన మాత్రమే. ఎందుచేతనంటే ఆ వల స్వయంగా తానే తయారుచేసుకుని తగిలించుకున్నది. దానిలో యింకొకరి ప్రమేయం లేదు.

"అందరూ ప్రకృతిని బట్టి ప్రవర్తించక తప్పనప్పుడు నిర్బంధంవల్ల లాభమేమిటి?" దీనిని యథాతథంగా తీసుకుంటే అంతరాత్మ మీద ప్రకృతి సర్వాధిపత్యం వహిస్తున్నట్లు, భగవానుడు చెప్పినట్లు కనిపిస్తుంది. జ్ఞాని సైతం ప్రకృతికి లోబడే చరించాలి. అందుచేత మన స్వభావాన్ననుసరించి కర్మనే చేయవలసి వుంటుంది అన్నట్లుగానే గోచరిస్తుంది. కాని యథార్థంగా గీత చెప్పేదేమంటే

శ్రేయాన్ సర్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః॥

చక్కగా అనుష్ఠించిన పరధర్మం కంటే గుణం లేని స్వధర్మమే శ్రేయస్కరమయినది. స్వధర్మంలో మరణమైనా శుభప్రదమే, కాని పరధర్మం మాత్రం భయావహమైనది. ఈ స్వధర్మ, పరధర్మాల వుద్దేశమేమిటో తెలుసుకోవాలంటే ప్రకృతి పురుషుల గుణాలను గురించి విస్తారంగా చెప్పిన చివరి అధ్యాయాల దాకా వేచి చూడాలి. అయితే మనం ప్రకృతి శాసిస్తున్నది కాబట్టి యే పవృత్తినైనా అంటే దుష్టప్రవృత్తినైనా మనం అవలంబించాలి అన్నది మాత్రం కానే కాదు. అలా ఆచార్యుడు చెప్పలేదు. ఈ రెంటి మధ్య చెప్పిన మరొక శ్లోకంలో విధిస్తున్న ఆజ్ఞను చూస్తే యీ సంగతి స్పష్టమవుతుంది.

ఇంద్రియస్యేంద్రియస్యార్థే – రాగద్వేషౌ వ్యవస్థితౌ।
తయోర్న వశమాగచ్ఛే – త్తౌ హ్యాస్య పరిపంథినౌ॥

"ప్రతి ఇంద్రియానికి విషయం అయిన ప్రతి దానిలో రాగద్వేషాలు యేర్పడి వున్నాయి. వాటికి లోబడకు. ఎందుచేతనంటే అవి రెండూ శత్రువులు. అవి అంతరాత్మను ముట్టడించి తప్పుదోవ పట్టిస్తాయి" అంటాడు. ఆ వెంటనే అర్జునుడు వేసిన ప్రశ్న, ఆచార్యుడిచ్చిన సమాధానం పరిశీలిస్తే విషయం మరింత తేటతెల్లమవుతుంది.

అథః కేన ప్రయుక్తోయం – పాపంచరతి పూరుషః।
అనిచ్ఛిన్నపి వార్ణేయ – బలాదిన నియోజితః॥

"మనిషి స్వభావా న్ననుసరించటం తప్పు కానట్టయితే, తన యిష్టానికి వ్యతిరేకంగా కూడా మనుష్యుని పాపాచరణకు ఎవరు పురికొల్పుతున్నారు?" అన్న అర్జునుని ప్రశ్నకు సమాధనంగా ఆచార్యుడు కామక్రోధాలే యీ ప్రేరణకు కారణమని, అవి రజోగుణం నుంచి పుట్టినవనీ, కామమే ప్రథమ శత్రువని వివరించాడు. ముక్తికి పాపాచరణ అవరోధం కనుక దానిని మానుకోవటమే ప్రథమ కర్తవ్యమని చెప్పబడింది. ఆత్మ విజయం, ఆత్మనిగ్రహంతో (సంయమం) మనస్సు, ఇంద్రియాలు, సర్వనిమ్న అస్తిత్వం వీటి మీద నియంత్రణ అవసరం.

నిగ్రహం – సంయమనం

ప్రకృతిలో వుండే విషయాలను ప్రధానమైనవి, అప్రధానమైనవి అని రెండుగా విచక్షణ చేయడం ద్వారా ప్రధానమైన దేమంటే సహజంగా వచ్చే అనివార్య కర్మ. వీనిని అణగద్రొక్కడం, పైకి రానీయకపోవడం, నిర్బంధించడంవల్ల ప్రయోజనం లేదు. ప్రకృతి లోని కదలికలు, సంచారాలు, గందరగోళాలు, వికృత చేష్టలు తప్పకుండా నియంత్రించాలి. అలాగే నిగ్రహ, సంయమాల మధ్య విచక్షణ గుర్తించాలి. నిర్బంధంగా అణిచివేయడం నిగ్రహం, సంయిన ప్రక్రియతో, సరైన మార్గదర్శకత్వంతో నియంత్రించటం సంయమనం. మొదటి పద్ధతిలో ఇచ్ఛ ప్రకృతిని తీవ్రహింసకు గురి చేస్తుంది. దానివల్ల 'అస్తిత్వ సహజశక్తులు' అణగారిపోతాయి. (ఆత్మానం అవసాదయేత్) రెండవది (నిమ్న) ఆత్మను ఆత్మ (ఉన్నత) నియంత్రించడం. దీనివల్ల సహజశక్తులకు వాటి సరి అయిన కర్మను, గరిష్ఠ సామర్థ్యాన్ని చక్కగా సమకూర్చడం (యోగం కర్మసు కౌశలం) సంయ స్వభావాన్ని గూర్చి గీత ఆరవ అధ్యాయం ప్రారంభంలో స్పష్టంగా చెప్పబడింది. ఆత్మ (ఉన్నత) చే ఆత్మ (నిమ్న) వుద్ధరించబడాలి. విశృంఖలత్వంచేత గాని, అణచివేతవల్ల గాని ఆత్మను అధోగతి పాలు చెయ్యకూడదు. ఆత్మకు ఆత్మే (ఉన్నత) మిత్రుడు. ఆత్మకు ఆత్మే (నిమ్న) శత్రువు. ఎవని ఆత్మ (ఉన్నత) అని ఆత్మ (నిమ్న) ను జయించటం జరిగిందో అతడికి అతడి ఆత్మ (ఉన్నత) మిత్రుడు. ఆత్మ (ఉన్నత) ను పొందని వానికి ఆత్మ (నిమ్న) శత్రువు వలె అపకారి అవుతుంది. ఆత్మ (నిమ్న) ను జయించి పరిపూర్ణ ఆత్మ విజయ ప్రశాంతిని పొందినప్పుడు మానవునిలో పరమాత్మ సుస్థిరమై సమతౌల్యత సాధించబడుతుంది. సరిగ్గా చెప్పాలంటే నిమ్నాత్మను, ఉన్నతాత్మతోను, సహజాత్మను ఆధ్యాత్మికాత్మతో జయించి స్వాధీనపరుచుకోవటమే మానవుని పరిపూర్ణతను విముక్తికి మార్గం.

ప్రకృతి నియమన పరిమితులు

ప్రకృతి నియమన పరిమితికి, దాని పరిధికి ఖచ్చితమైన పరిమితి ఉంది. అది హద్దులు లేనిది కాదు. ప్రకృతి అంచె

లంచెలుగా యేర్పడిన శ్రేణి. అపాదమస్తకం దానిలో వర్తిస్తున్న గుణాలను జాగ్రత్తగా పరిశీలిస్తే అధీనతనించి ఆధిపత్యం దాకా ఆ శ్రేణి వ్యాపించి వున్నదనిపిస్తుంది. ఉన్నది ఒక నియమనమే కాదు, ఒక ఆధిపత్యమే కాదు. అట్టడుగున వున్న భూతాలతో రాజ్యమేలుతున్నది తమస్సు. ఈ జీవులు యింకా ఆత్మ చైతన్య జ్యోతిని దర్శించలేదు. అది ప్రకృతి ప్రవాహంలో కొట్టుకుపోతు న్నది. మరి పదార్థంలో వున్న అణువులో యిచ్ఛ వున్నది కదా! పదార్థం, తమస్సుకు యెందుకు లోబడి వుండాలి? అంటే, అణు వులో వున్నది స్వతంత్రమైన యిచ్ఛ కాదు. అది యాంత్రికమైన యిచ్ఛ. అణువు దాని స్వాధీనంలో వున్నది. కాని అణువు స్వాధీనంలో అది లేదు. పదార్థంలో కూడా తెలివి, యిచ్ఛలతో కూడిన బుద్ధి వున్నది. అయితే సాంఖ్యులు చెప్పినట్టు అది వాస్త వంగా జడం. యాంత్రిక అచేతనా సూత్రం, చేతనాత్మక అంత రాత్మ ప్రకాశం యిందులో యింకా పైకి వుబికి రాలేదు. అణు వుకు తన బుద్ధి గురించి తెలియదు. జడత్వంలో అజ్ఞానపు లక్ష ణమయిన తమస్సు పిడికిటిలో అది చిక్కి వున్నది. తమస్సులో రజస్సు వుంది. సత్త్వంలో కూడా దాగి వున్నది. ఇక్కడ ఆధి పత్యం అన్న దానికి స్థానమే లేదు. బ్రహ్మాండమైన శక్తితో యీ స్థితిరూపం వర్తించేటట్లు ప్రకృతి నిర్బంధిస్తున్నది కాని, కేవలం వొక యాంత్రిక ఉపకరణంగానే తప్ప మరింకేమీ కాదు. (యంత్రా రూఢాని మయయా). పదార్థం మీద తమోగుణానికి సంపూర్ణ ప్రాబల్యం వుంది. వృక్షంలో జీవశక్తి, మనలో సుఖదుఃఖాలుగా గుర్తించబడుతున్నా నాడీ ప్రతిచర్యలను పొందగల సామర్థ్యంతో రజోగుణం ధరాతలంపై ఆవిర్భవించింది. కాని సత్వగుణం అంత ర్లీనంగా వుండిపోయింది. చేతనాత్మక బుద్ధి వికాసాన్ని మేల్కొ ల్పటం కోసం, అది యింకా బయట పడలేదు. ఇప్పటికీ యాంత్రిక అవచేతన లేక అర్థచేతనలోనే వున్నది. రజోగుణం అంతకంటె బలవత్తరమైన తమోగుణం రెండూ సత్త్వాన్ని కారాగారంలో బందీలా బంధించి వుంచాయి.

జంతువులో తమోగుణ ప్రాబల్యం యెక్కువగా వున్నప్పటికీ తమస్సుకి వ్యతిరేకంగా రజస్సు ప్రాబల్యం వహించడం జరుగుతుంది. రజోగుణ ప్రభావంతో అభివృద్ధి చెందిన జీవశక్తి, కోరిక వుద్రేకం, భావతీవ్రత, సంతోషం, బాధతో పాటు సత్త్వగుణం కూడా అందులో యిమిడి వుంటుంది. కాని అది యింకా నిమ్నకర్మ మీద ఆధారపడి రజస్తమోగుణాలకు, చైతన్యబుద్ధికి చెందిన ప్రథమ వికాసాన్ని అహానికి చెందిన యాంత్రిక బుద్ధిని, జ్ఞాపకాలని, అంతఃప్రేరణ, అంతర్బుద్ధులకు చెందిన అద్భుతాలను, ఆలోచనను సమకూర్చుతుంది. కాని సంపూర్ణ వికాస చైతన్య స్వభావాన్ని పెంపొందించలేదు. అందుచేతనే జంతువుకు తాను చేసే పనులకు బాధ్యత వహించడం తెలియదు. అణువు యాంత్రిక పోకడలను, నిప్పు కాల్చడాన్ని తుఫాను విధ్వంసం చేయడాన్ని యెలా నిందించలేమో అలాగే పులి మేకని చంపి తినడాన్ని కూడా నిందించలేము. పులికి మన ప్రశ్నకు జవాబు చెప్పే శక్తి వుంటే మనిషిలాగే అది కూడా తనకు స్వతంత్రమైన యిచ్ఛ వున్నదంటుంది. నేను చంపుతాను, నేను మ్రింగుతాను అంటుంది. కాని ఆ చంపింది పులి కాదని, పులిలో వున్న ప్రకృతి అనీ, పులిలో వున్న ప్రకృతే మింగిందని మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఒక వేళ అది చంపడం, కబళించడం చెయ్యలేదంటే కడుపు నిండటం వల్లనో, భయం వల్లనో, బద్ధకం వల్లనో అవుతుంది. ప్రకృతిలో మరొక ధర్మమైన తామసగుణం వల్ల యీ విధంగా చేస్తుంది. అంటే జంతువుని చంపడం అనేది ప్రకృతి ధర్మాల్లో వొకదాని వల్ల అయితే, చంపకపోవడం అనేది మరొక ధర్మం వల్ల అవుతున్నది. చంపడం, చంపకపోవడం అనే రెండు క్రియలూ ప్రకృతి వల్లనే సంభవిస్తున్నాయి. దానిలో వుండే అంతరాత్మ యేదైనా ప్రకృతి కర్మకు అనుమతి యిస్తుంది. కర్మ చెయ్యడంలో యెంత వుదాసీనంగా వున్నదో, కర్మ చేయకపోవడంలో కూడా అంతే నిష్క్రియాపరత్వంలోను అంతే వుదాసీనంగా వున్నది. అణువులాగే జంతువు కూడా తన ప్రకృతి యంత్రాంగాన్ని బట్టి నడుస్తుంది. కాని మరొకలా నడవలేదు. అందుచేతనే

'సదృశం చేష్టతే స్వస్యాః' తన ప్రకృతి కనుగుణంగానే నడుస్తుంది అంటాడు గీతాచార్యుడు. యంత్రాని కమర్చిన శీలలాగ ప్రవర్తిస్తుందంటాడు. (యంత్రారూఢో మాయయా)

సరే, మనిషిలో కనీసం మరొక గుణం వున్నది. అంతరాత్మ, స్వేచ్ఛాసంకల్పం, కర్తవ్యస్పృహ, ప్రకృతికి భిన్నంగా, మాయకి భిన్నంగా చేసే నిజమైన కర్త వున్నాడు. మనిషిలో విచక్షణతో కూడిన మేధస్సు నిండిన చైతన్యవంతమైన యిచ్ఛ వున్నది. దానిలో సాక్షీభూతుడైన పురుమని కాంతి నిండి వుంది. అతడు ఆ కాంతి ద్వారా పరిశీలిస్తాడు, అర్థం చేసుకుంటాడు. అంగీకరించడం, లేక తిరస్కరించడం, యివ్వడం, యివ్వకపోవడం, అన్నీ తానే చేస్తున్నట్లు తన స్వభావానికి తానే ప్రభువయినట్టు కనిపిస్తాడు. పులి, నిప్పు, తుఫాను వంటివాడు కాదు మనిషి. అక్కడ అతడు దేనినైనా చంపి ఆ చర్యని సమర్థించుకోడానికి "నా స్వభావరీత్యా నేను చేసేను" అనలేడు. అలా చెయ్యలేడు. ఎందుకంటే పులి, నిప్పు, తుఫానుల ప్రకృతి లాంటి ప్రకృతి కాదు మనిషిది. వీటి స్వధర్మం అతడిది కాదు. అతడికి చైతన్యవంతమైన విచక్షణతో కూడిన సంకల్పం, బుద్ధి వున్నది. కనుక దానిని సంప్రదించే అతడు కర్మలు చెయ్యాలి. అలా అతడు చెయ్యకుండా తన మానసిక ప్రేరణలు ప్రలోభాల ప్రకారం గుడ్డిగా నడుచుకున్నట్టయితే తన స్వధర్మాన్ని సరిగ్గా ఆచరించడం లేదన్న మాట. మానవత్వపు పూర్తి ప్రమాణాలకు తగినట్టు కాక జంతుప్రవృత్తితో ప్రవర్తిస్తున్నట్టు అనుకోవాలి. తామసగుణ, రజోగుణ సూత్రాలు అతడి బుద్ధి మీద పట్టు సాధించాయని చెప్పవచ్చు

అతడు చేసిన ప్రతి కర్మ లేక కర్మ చేయకపోవడం అనేవి వాటి ప్రభావమే. అయినా సరే కర్మ చేసేముందు గాని, తర్వాత గాని బుద్ధిని సంప్రతించడం, బుద్ధికి సమర్థనీయంగా వుండడం అవసరం. దీనితోపాటు అతడిలో సాత్త్వికగుణం మేల్కొని వున్నది. అది తెలివిగా, తెలివితో కూడిన సంకల్పంతోనే కాక, కాంతి జ్ఞానాల ననుసరించిన సరైన కర్మ అన్వేషిగా,

ఇతరులు కోరే దానిని సానుభూతితో తెలుసుకున్నట్టు తాను సృష్టించిన స్వీయనైజానికి చెందిన ఉన్నత ధర్మాన్ని తెలుసుకుని, దానికి విధేయం అయ్యే ప్రయత్నంగా పుణ్యం, జ్ఞానం, సానుభూతి వెంట తీసుకు వచ్చే మహత్తర ప్రశాంతి, సంతోషాల భావరూపంగా ప్రవర్తిస్తుంది. మనిషి తన రాజసిక, తామసిక స్వభావాన్ని, సాత్త్విక స్వభావంతో కొద్దో గొప్పో అసమగ్రంగానైనా జయించాలి. తన సాధారణ మానవత్వ పరిపూర్ణత సాత్త్వికత వైపే వున్నదని తెలుసుకోవాలి.

సాత్త్విక ప్రకృతిలో కూడా సంపూర్ణ స్వేచ్ఛ లేదు

అయితే సాత్త్విక ప్రకృతి ప్రబలంగా వుండటమే స్వేచ్ఛ అవుతుందా? అప్పుడు మానవుడిలో వుండే యిచ్ఛ, స్వతంత్ర యిచ్ఛ అవుతుందా? నిజమైన స్వేచ్ఛ ఉన్నత చైతన్యంలో వున్నది. సత్త్వగుణంలో పరిపూర్ణ స్వేచ్ఛ లేదని గీత చెప్తున్నది. బుద్ధి యింకా ప్రకృతి ఉపకరణమే కాబట్టి అది యెంత సాత్త్విక బుద్ధితో అయినా సరే పని చేసేది ప్రకృతే అవుతుంది. ప్రకృతి పనిచేస్తే అంతరాత్మ మాయా చక్రంలో పరిభ్రమిస్తుంది. ఏది ఏమైనా మన స్వేచ్ఛలో పదింట తొమ్మిది వంతులు కేవలం కట్టుకథలు అన్నది వేరే చెప్పనవసరం లేదు. ఏ సమయంలోనైనా స్వీయ స్వయం స్థిత కర్మచే సృష్టించి నిర్దేశించబడదు.

మన యిచ్ఛ, వారసత్వం, శిక్షణ, పరిసరాలు యీ సమస్త మహాసంక్లిష్ట విషయమంతా కర్మ పేరుతో మన వెంటే వుంటుంది. కర్మ అంటే వీటితో పాటు గతజన్మల ప్రకృతి కర్మలు, ప్రపంచం వ్యక్తిలో ఏకోన్ముఖం కావటం, ఆ వ్యక్తి యెవరో యేమిటో యిచ్ఛ యేమిటో తగిన సమయంలో నిర్దేశించబడుతుంది. విశ్లేషణకందినంత వరకు ఆ కర్మ కూడా ఆ క్షణంలోనే నిర్దేశించబడుతుంది. నేను చేసాను, నేను కోరుకున్నాను, నేను బాధ పడ్డాను అంటూ నిరంతరం అహం కర్మని అంటిపెట్టుకునే వుంటుంది. కాని అది తన్ను తాను పరిశీలించుకుని, తానే విధంగా నిర్మాణమయిందో గమనిస్తే జంతువులాగే తను కూడా ప్రకృతే

తన ద్వారా పై కర్మలు చేస్తున్నట్టు గ్రహించగలడు. అంటే వ్యక్తి అనబడే జీవిలో ప్రకృతి తన్ను తాను నిర్దేశించుకుంటున్నది అని అర్థం. ఈ స్థితికి చెందిన రూపాన్ని గాఢంగా తెలుసుకోవడం చేతనే, వున్నదంతా కర్మేగాని ఆత్మ లేదని, ఆత్మ అనే భావన అహంతో నిండిన మనస్సు కల్పించిన భ్రమే అని అంటారు బౌద్ధులు. నేను యీ పుణ్యకర్మని యెన్నుకున్నాను. కాని ఆ పాపకర్మను కాదు అని అహం ద్వారా ప్రకృతి చైతన్యంగల యంత్రభాగం లాగ, బుద్ధి ద్వారా వొక కర్మ కంటె మరొక కర్మను యెన్నిక చేసేటట్లు చేసేది. ప్రకృతిలో కలిసిన సాత్త్విక సూత్ర మహత్తర తరంగం లేక ప్రవాహరూపం. అందుకే సాంఖ్యులు నిష్క్రియాపరమైన సాక్షీభూత పురుషుని సంతోషపెట్టడానికే ప్రకృతి మనలో రూపం దాలుస్తున్నదని, సంకల్పిస్తున్నదనీ అంటారు.

ఇది మరీ అతిశయోక్తి అనిపించినా, మన వ్యక్తి గతసంకల్పంయొక్క స్వేచ్ఛ ఎంత సాపేక్షమైనదో, అత్యల్పమైనదో యితర నిర్దేశికాంశాలతో ఎలా కలిసిపోతున్నదో యిక ముందు చూద్దాం. దాని బలవత్తరమైన శక్తి కూడా ఆధిపత్యం విషయంలో లెక్కకు రాదు. పరిస్థితుల ప్రవాహాన్ని నిరోధించడానికి గాని, లొంగదీసి, మార్పు చేసీ లేదా దానితో కలిసిపోయి, అదీ కాకపోతే చాలా సూక్ష్మంగా దానిని వంచించి యుక్తితో తప్పించుకుపోయే యితర ప్రకృతిని యెదిరించటానికి గాని, ఆ యిచ్ఛ మీదా ఆధారపడలేము. అత్యంత సాత్త్వికమైన యిచ్ఛనైనా సరే రాజసిక, తామసిక గుణాలు అణగద్రొక్కుతాయి. లేదా దానిలో కలిసిపోయి, వంచించి తప్పించుకుని ప్రవర్తిస్తాయి. దీని ఫలితంగా సాత్త్వికం కేవలం పాక్షికంగానే సాత్త్వికమవుతుంది. ఈ కారణం చేతనే అత్యుత్తమ మానవకర్మలో కూడా మనస్తత్వ శాస్త్రపజ్ఞానికి దొరికిపోయే బలీయమైన ఆత్మవంచన, అనుకోకుండా చేసే అమాయకపు కల్పన, తననించి తాను దాక్కొనే పరిస్థితులు యేర్పడుతూ వుంటాయి. మనం పూర్తి స్వేచ్ఛతో పనిచేస్తున్నా మనుకొన్నప్పుడు మన వెనుక మన కర్మశక్తులు దాగి వుంటాయి.

ఎంత జాగ్రత్తగా ఆత్మ పరీక్ష చేసుకున్నా అవి దొరకవు. మనం అహంకారం నించి విముక్తి సాధించా మనుకొనేటప్పటికి అక్కడ చాటుగా అహంకారం వుండనే వుంటుంది. పుణ్యాత్ముడైనా, పాపాత్ముడైనా ఎవరి మనసులో నైనా జరిగేది యిదే. మనం యథార్థంగా మన కర్మలకు, కర్మమూలాలను చూడగలిగితే గీతతో పాటు మనం కూడా గుణాలు గుణాలయందే వర్తిస్తున్నది అని తీరాలి.

ఈ కారణంచేత సాత్త్విక ప్రవృత్తి అత్యంత ప్రాబల్యం పొందినప్పుడు కూడా స్వేచ్ఛ లేదు. ఇతర గుణాల వలెనే సాత్త్వికత కూడా అహానికి, కోరికకి కట్టుబడే వుంటుంది. ఉన్నతమైన కోరిక, పరిశుద్ధమైన అహం అంటూ ఏదో రూపంలో యివి రెండూ ఆవహించి వున్నంత కాలం స్వేచ్ఛ వుండదు. పుణ్యాత్ముడి పుణ్యాహంకారం, జ్ఞానికి జ్ఞానాహంకారం వుండి తీరతాయి. పుణ్యము, జ్ఞానాల మీద వీరి అన్వేషణ సాత్త్వికాహంకారాన్ని సంతృప్తి పరచాలనే ప్రయత్నం స్వప్రయోజనార్థమే గాని ప్రపంచం కోసం కాదు. నిజమైన స్వేచ్ఛ లభించాలంటే మనలో పరిమితంగా వున్న 'నేను' రూపంలోని అహాన్ని తృప్తిపరచడం, అహానించే ఆలోచించడం, సంకల్పించడం ఆగిపోవాలి. ఇంకా చెప్పాలంటే యీ అహం అనే అడ్డుతెరను తొలగించుకుని సహజాత్మకు పైన వున్న పరమాత్మను పట్టుకోగలిగినప్పుడే నిజమైన స్వేచ్ఛ, అత్యున్నత ఆత్మ ఆధిపత్యం ప్రారంభమవుతాయి. ఇది జరగటానికి ప్రకృతికి పైగా అధివసించిన ఆ ఏకాత్మను చూచి, మన అస్తిత్వాన్ని దాని అస్తిత్వ చైతన్యంతో మేళవించాలి. దాని వ్యక్తిగత కర్మ స్వభావంలో కేవలం పరమేచ్ఛకే నిజమైన స్వేచ్ఛ వున్నది. దాని వొక్క దానికే ఉపకరణంగా చేయగలగాలి. దీని కోసం త్రిగుణాలను దాటిపోవాలి. అంటే త్రిగుణాతీతులం కావాలి. కారణం ఆ ఆత్మ సాత్త్విక గుణానికి సైతం ఆవల వున్నది. సత్త్వం ద్వారానే దానిని చేరాలి. కాని అహాన్ని వదిలిపెడితే. తప్ప దానిని చేరలేము. ఆ వైపుగా మనల్ని ఆకర్షించేది అత్యున్నతమైన, అతి తీవ్రమైన బ్రహ్మాండమైన పారవశ్య

పూరిత ఆకాంక్ష. కాని దానిలో మనం భద్రంగా జీవించాలంటే కోరిక అంతా మనలోంచి తుడిచిపెట్టుకుపోవాలి. ఒక దశలో ముక్తి కావాలనే కోరిక నించి సహితము విముక్తులం కావాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి, రంగనాథ ఆత్రేయ, (తెన్నేటి పూర్ణచంద్రరావుగారి 'శ్రీఅరవిందుల గీతాదర్శనం' ఆధారంగా)

(*SABCL* Vol. 13, pp. 206-13)

దైవానుగ్రహం కర్మ ఫలితాలను రద్దు చేయగలదు

'పాపాలు చేస్తే ఫలితం అనుభవించాల్సిందే' అంటారు సరే – కాని దీని వెనక ఒక సత్యం దాగి వున్నది. నువ్వు చేసినదేదీ వూరికే పోదు. దానికి పర్యవసానముంటుంది. నువ్వు ఏది చెప్పినా, ఏం ఆలోచించినా, చేసినా అది కార్యరూపాన్ని తాలుస్తుంది. కనీసం దాల్చేందుకు ప్రయత్నిస్తుంది. అందుకని నువ్వెప్పుడు కీడును తలపెట్టకూడదు. నీ మాటల్లో గాని, చేతల్లో గాని, ఆలోచనల్లో గాని దాని ప్రసక్తే చేయరాదు. ఒకవేళ కీడు జరిగినా దైవానుగ్రహము దానిని రద్దు చేయగలదు.

– సంపాదకుడు

At the head she stands of birth and toil and fate,
In their slow round the cycles turn to her call;
Alone her hands can change Time's dragon base.
Hers is the mystery the Night conceals;
The spirit's alchemist energy is hers;
She is the golden bridge, the wonderful fire.
The luminous heart of the Unknown is she,
A power of silence in the depths of God;
She is the Force, the inevitable Word,

The magnet of our difficult ascent,
The Sun from which we kindle all our suns,
The Light that leans from the unrealised Vasts,
The joy that beckons from the impossible,
The Might of all that never yet came down.
All Nature dumbly calls to her alone
The heal with her feet the aching throb of life
And break the seals on the dim soul of man
And kindle her fire in the closed heart of things.

Sri Aurobindo (*Savitri* p. 314)

జీవితాన్ని యోగదృష్టితో పరిశీలిస్తే నీ కనేక విషయాలు తెలుస్తాయి. అన్నిటికంటె ముఖ్యమైన విషయం నువ్వు చేసినదేదీ వృథా కాదు. ప్రతి దానికి ఒక ఫలితం వుంటుంది. – ఇంకో జన్మలో కాదు, ఇప్పుడే ఈ జన్మలోనే నువ్వు చేసే ప్రతి ఆలోచనకి, చెప్పే ప్రతి మాటకి, చేసే ప్రతి పనికి ఓ పర్యవసానముంటుంది. నువ్వు యోగివైనట్లయితే అన్ని విషయాల్లోను జాగ్రత్తగా చాలా అప్రమత్తంగానే వ్యవహరిస్తావు. అలా కానప్పుడు నువ్వు దాని పర్యవసానాన్ని అనుభవించి తీరాల్సి వస్తుంది. మరేందారి – దైవానుగ్రహాము దానిని రద్దు చేయగలదు. అటుల కాని యెడల నీ జీవితం చాల అస్తవ్యస్తంగా తయారవుతుంది. నిరంతర దైవచింతనే నిన్ను దైవానుగ్రహానికి పాత్రుణ్ణి చేయగలదు. భూమ్మీద జన్మ ఎత్తిన ప్రతివారి విషయంలోనే ఇంతే.

మానవులు ఏర్పాటు చేసుకున్న సమాజాల్లో నువ్వు నేరం చేస్తే దానికి శిక్ష తప్పదు. కాని నీ మనస్సాక్షిగా తప్పు చేస్తే దాని ఫలితం నీ అంతట నువ్వే అనుభవిస్తావు. మనుషులు ఏర్పాటు చేసుకున్న చట్టం 'నాకు తెలీదు' అన్నా అది నేరమే. దానికీ శిక్ష తప్పదు. తప్పు అని తెలీక తప్పు చేసినా దానికీ శిక్ష తప్పదు. ఈ ప్రకృతిలో కూడా సరిగ్గా ఇంతే, నీకు అది విషం అని తెలీకుండా మింగినా కూడా చావు తప్పదు కదా! దైవ

కటాక్షం ఉంటేనే తప్ప ఆ ఫలితం తప్పదు. దైవకటాక్షం సర్వ శక్తి సంపన్నమైంది కాబట్టి దేన్నైనా మార్చేస్తుంది. ఇంత వరకూ నేను చెప్పిన దాని భావం అదే. ఆ కటాక్షం ప్రాప్తించకపోతే ఇక (ఆశే లేదు) ఆశ వదులుకోవచ్చు. కాని ఈ జీవులు ఆ కటాక్షం గురించి తెలుసుకోలేరు.

ప్రశ్న: పిలిస్తేనే ఆ కటాక్షం కలుగుజేసుకుంటుందా?

నేను అలాగే అనుకుంటున్నాను. కేవలం అచ్చంగా కాదు. కాని దైవకటాక్షం పట్ల నిజంగా నమ్మకం, అభిలాష ఉంటే అది తప్పక కలుగజేసుకుంటుంది. చిన్నపిల్ల తల్లి దగ్గరికి పోయి అమాయికంగా 'అమ్మా, నా కిది కావాలి' అని అడిగినట్లుగా అడిగితే తప్పక కటాక్షం సిద్ధిస్తుంది. అంత నిర్మలంగా 'నా కిది కావాలి' అని అర్థిస్తే తప్పక కటాక్షం వింటుంది అని నమ్మకం. మరొకరికి మంచిది కానిది అడిగితే అది వినదు. హాని చేసేది, మంచి కాని దాన్ని అడిగితే అది వినదు.

ప్రశ్న: ఈ పిలుపుకు కారణం ఏమిటి? ఫలితం ఏమిటి?

పిలవడం తప్పదేమో. ఎంచేతనంటే కోడి ముందా? గుడ్డు ముందా? నాకైతే తెలీదు. కటాక్షం నిన్ను దాన్ని పిలిచేలా చేస్తుందో లేక నువ్వు పిలిచాక అది వస్తుందో చెప్పడం నిజంగా చాలా కష్టం.

కాని ముఖ్యంగా ఉండవలసిన నమ్మకమే ఉండడం లేదు.

ప్రశ్న: 'మనం కర్మకు బద్ధులం' అని ఒకసారి మీరు అన్నారు. కాని మరోసారి దివ్యకటాక్షం ప్రసరిస్తుంది అన్నారు. రెండూ ఒకదానికి ఒకటి అతకటం లేదు కదా! ఎలా?

దివ్యకటాక్షం కర్మను సంపూర్ణంగా లేపేస్తుంది. ఎండలో పెట్టిన వెన్నలా అది కర్మను కరిగించివేస్తుంది. ఇప్పటి దాకా నేను చెప్పింది అదే. నువ్వు దీన్నే ఇంకోలా చెప్పావు అంతే. నీ స్థానంలో నేను వుండి అడుగుతున్నా చూడు. నిజంగానే నీకు అచ్చమైన అభిలాష ఉంటే, నీ సాధన (ప్రార్థన) తీవ్రంగా ఉంటే నిజంగానే అన్నింటినీ మార్చేసేదాన్ని. నీలోకి నువ్వే తీసుకు రావచ్చు. దీనికో చిన్న ఉదాహరణ. దీనివల్ల నీకు బాగా అర్థం

కావచ్చు. చూడు. ఒక రాయి లేదా ఒక పెంకు వదులుగా ఉంటే పడిపోతుంది. అవునా? కాని వాటిని కిందకు పడనీయకుండా చెయ్యి అడ్డం పెట్టే దృఢనిశ్చయం కలవారు అలా పోతూ చెయ్యి అడ్డం పెడితే అది చేతిలో పడుతుందే తప్ప నేల మీద కాదు కదా? కాబట్టి అతగాడు ఆ రాయి లేదా పెంకు దారిని మార్చేశాడు కదా! అది చేతిలో పడడంవల్ల ఎవరి నెత్తి మీదా పడకపోవడం, ఎవరినీ చంపకపోవడం (హాని చేయడం) జరిగింది కదా? ఇదేమిటి అంటే బాగా నిశ్చయించుకున్న మనస్సాక్షి తాను ఉన్న భూమిక లోంచి అంత నిశ్చయం లేని చలనం ఉన్న భూమికలోకి ప్రవేశించడమే.

ప్రశ్న: అయితే కర్మ ఫలితాలు (పరిణామాలు) అంత తీవ్రంగా (ఘోరంగా) కావా?

అస్సలు కావు. ఇంచుమించు అన్ని మతాల్లోనూ ఇలా చెప్పిన వాళ్లు ఉన్నారు. వాళ్ళు కొన్ని మినహాయింపులేని నియమాలను చెప్పారు. కాని నా దృష్టిలో ఆ నియమాలను వాళ్ళు ఈ ప్రకృతిలో తమను ఆరోహించుకోడానికే, తమను సమర్థించడానికే చెప్పారు. మనుమల్ని సమర్థించే, ప్రకృతి స్థానంలో తాము ఉండాలనే ఇల్లాంటి ప్రవృత్తి ఎప్పటి నుండే ఉంది. అంచేత వాళ్లు 'నీవు చేసిన ప్రతి పనికీ ఫలితం తప్పదు...' అన్నారు. ఈ అభిప్రాయం మనుషులు తాము చేసేదాని ఫలితం ఏమిటో తెలీకుండా పనులు చేస్తున్న దశలో, తెలియని దర్పంతో నిండిపోయిన దశలో అలాంటి మనుషుల తత్వాన్ని మార్చే ఒక ప్రత్యేక పరిణామదశలో చాలా బాగా కుదురుతుంది. ఇలాంటి జనాలు ఇప్పుడు కూడా చాలామంది ఉన్నారు. వాళ్లు వాళ్లకి అనిపించింది చేసేస్తారు. వాళ్ల పని వల్ల ఫలితం వాళ్లు లేదా ఇతరులు అనుభవిస్తారా అని ఆలోచించరు. అంచేత మరొకరు మీతో "జాగ్రత్త! ఫలితాల ప్రభావం ఎక్కువ కాలం ఉంటుంది" అని చెప్పడం మంచిదే కదా! మరికొంతమంది "దీనికి ఫలితం నీవు మరో జన్మలో అనుభవిస్తావు" అని చెబుతారు. ఇవన్నీ ప్రజల మంచికే. ఇంకా కొన్ని మతాల వారు "నీవు పాపం చేస్తే తప్పక

నరకానికి పోతావు" అని చెప్తారు. ఆలోచించండి. కాబట్టి జనా లకి ఇలాంటి భీతి ఉంది. ఆ భీతి వాళ్ళని కొంచెం ఆపుతుంది. తీవ్రమైన ప్రేరణకు లొంగే ముందు కొంచెం ఆలోచించేలా చేస్తుంది. కాని అన్నివేళలా కాదు. ఒక్కోసారి ఈ ఆలోచన అంతా అయిపోయాక రావచ్చు, కాస్త ఆలస్యంగా.

కాని ఇదంతా కచ్చితంగా అలాగే కాదు. చాలా అందంగా చాలా చిన్న చిన్న తునకలుగా అన్నింటినీ ముక్కలు చేసే చాలా కచ్ఛితమైన మానసిక నిర్మాణాలు ఉన్నాయి. అవి "ఇలా చెయ్యి, అలా చెయ్యి, ఇది కాకపోతే అది" అని చెబుతూ ఉంటాయి. నిజంగా జీవితంలో ఏమిటీ గందరగోళం? అంచేతే ప్రజలు భీతిల్లి పిచ్చెక్కిపోతున్నారు. "అది అలాగా లేక ఇలాగా" అనుకొంటూ. నిజానికి వాళ్ళకి అదీ అక్కర లేదు, ఇదీ అక్కర లేదు. వాళ్ళు ఇంకో అంతస్థుకి పైకి ఎక్కాలి. దానికి ఉన్న తలుపు తాళంచెవి వాళ్ళకి ఇవ్వాలి. ఆ తాళంచెవి ఏమిటి అంటే, నేను చెప్పానే, నిజంగా కచ్చితమైన అభిలాష లేదా చాలా తీవ్రమైన సాధన (ప్రార్థన). నేను 'లేదా' అన్నాను. కాని నిజానికి 'లేదా' కాదు. కొంతమందికి అది ఇష్టం. కొంతమందికి ఇది ఇష్టం. కాని ఇద్దరి లోనూ ఆ అమేయశక్తి ఉంది. దాన్ని (ఆ శక్తిని) ఎలా వాడుకో వాలో నువ్వు తెలుసుకోవాలి. అంతే. వాళ్లు ఇద్దరిలోను చాలా అందమైంది ఉంది. దాన్ని గురించి మరో రోజు చెప్తాను. అసలు 'కచ్చితమైన అభిలాష' లో ఏముందో 'తీవ్రమైన సాధన' లో ఏముందో ఎంచేత అవి రెండూ అందమైనవో మరోసారి చెప్తాను. కొందరికి సాధన గిట్టదు (పడదు) పైగా మనసు లోలోపల గర్వం, అతిశయం పేరుకొని ఉంటాయి. కొందరికి అసలు అభిలాష ఉండదు. అసలు వాళ్ళలో గాఢమైన నమ్మకం, నమ్రత అనే జ్వాలలు లేకపోవడమే దీనికి కారణం. నిజానికి ఈ రెండూ చాలా అవసరం. గాఢమైన నమ్మకం, నమ్రత రెండు కర్మను మార్చేస్తాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: 'ఎమ్మెస్కె'

(*CWM* Vol. 5, pp. 362-67; 91-93)



అఖిల

అఖిల భారత పత్రిక, అక్టోబరు 2004

విషయసూచిక

శ్రీమాతారవిందుల ప్రవచనములు

7/10/2007

విభాగము I

విభాగము II

విభాగము III

ఉపోద్ఘాతము

జీవితాన్ని మూడుపూలు ఆరుకాయలుగా పండించుటయే యోగము. దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్న మానవాళిని దిశానిర్దేశము చేయునది కూడ యోగమే. 'Yoga is the greater art of life' అని శ్రీఅరవిందులు అన్నారు కదా. దీన్ని ఎటుల సాధించవలెనో మనం నేర్చుకోవాలి. దేవతారాధన మన దేశంలో అవిచ్ఛిన్నంగా జరుగుతున్న సాంప్రదాయము. దేవతలను మనలోకి ఆహ్వానించి, ఈ గుప్పెడు మనస్సు స్థానే ఆ దేవతల చైతన్యాన్ని ప్రతిష్ఠించాలి. దేవతల శక్తి అమోఘము. అది ఒక జలపాతం లాంటిది. ఒకటి కాదు వెయ్యి నయాగరాలు కూడ వారి శక్తికి సమానం కాదు. మహాలక్ష్మి, దుర్గ మొదలైన దేవతలందరు అటువంటి మహాశక్తులే. దుర్గాదేవి, మహాకాళి, ఈ సంచికలో వర్ణింపబడ్డారు. ఈ దుర్గా స్తోత్రము ఎంతో గంభీరంగా 'ధిమిధిమి దింధిమి' అనే మహిసాసుర మర్దినీ స్తోత్రాన్ని స్ఫురింపచేస్తుంది. మహాకాళి సంగతి సరేసరి. ఆమె శక్తి అనంతము. ఆమె ఆకాశాన్ని ఛేదించుకొని శిరస్సులోకి దిగివచ్చినప్పుడు అంతా వెలుగే, అంతా చైతన్యమే. నువ్వు మరో మనిషివై పోయినట్లే. ఇక 'సావిత్రి' అంటారా అదో సుదీర్ఘమైన గాథ, మహా మంత్రము. అది భవిష్యవాణి. అది ఒక స్పిరిట్యువల్ డైనమో. అది మానవమాత్రులకు అంత తేలికగా అర్థమయ్యే విషయం కాదు. అయితే శ్రీమాత దాన్ని గురించి చేసిన సుదీర్ఘ ప్రసంగము కూడ ఇందు చేర్చినాము. 'సావిత్రి' చదవటం వలన పవిత్రమైన వాతావరణం ఏర్పడుతుంది. నీ కెటువంటి కష్టమొచ్చినా, ఎంత కఠినమైన సమస్య వచ్చినా సావిత్రి పుస్తకాన్ని చదివితే నీకు పరిష్కారం లభిస్తుంది. ఇంతటి మహత్తరమైన కావ్యాన్ని మనం తప్పకుండా పరిచయం చేసుకోవాలి, తద్విషయాలను నిత్యజీవితంలో అనుసరించాలి. ఈ మహత్తరమైన మంత్రరాజమునకు మనం వారసులం.

— సంపాదకుడు

దుర్గా స్తోత్రము

మాతా! దుర్గా! సింహవాహినీ, సర్వశక్తిదాయినీ, మాతా! శివ ప్రియా! భవదీయ శక్త్యంశ సముద్భూతమే యగు మా భారత యువజనగణము భవన్మందిరమున నుపవిష్ఠులై నిను బ్రార్థించు చున్నారలు. వినుమో జననీ! నీవీ భారతావని యందున నావి ర్భవింపుము! ప్రకాశింపుము!

*

మాతా! దుర్గా! యుగయుగముల నందునను మేమీ మానవ శరీరధారణ మొనర్చి, జన్మజన్మము నందునను భవదీయ కార్య నిర్వహణ మొనర్చి, మరల నీ ఆనందధామమునకు మరలి వచ్చు చున్నారము. ఈ మారును జన్మ మెత్తి, యీ భవదీయ కార్య నిర్వహణ వ్రతమునకై మే మిదే కంకణధారణ మొనర్చితిమి. వినుమో జననీ! నీవీ భారతావనిని పునరావిర్భూత వగుదువు గాక! మాకిక నండదండవై మసలుదువు గాక!

*

మాతా! దుర్గా! సింహవాహినీ, త్రిశూలధారిణీ, కవచావృత చారు శరీరధారిణీ, జయదాయినీ, మాతా! ఈ భారతవర్షము నీకై ప్రతీ క్షించుచున్నది; భవన్మంగళ మయమూర్తిని బొడగాంచుటకై యీ భారతభూమి బహుళోత్సాహభరితమై యున్నది – వినుమో జననీ! నీవీ భారతావనిని పునరావిర్భవింపుము! ప్రకాశింపుము!

*

మాతా! దుర్గా! బలదాయినీ, జ్ఞానదాయినీ, ప్రేమదాయినీ, శక్తి స్వరూపిణీ! భయంకారిణీ, సౌమ్యస్వరూపిణీ, రౌద్రరూపిణీ! మా యీ జీవనసంగ్రామము నందు, – ఈ భారత సంగర రంగంబు నందు – నీ వలననే ప్రేరితులమగు మేమెల్లరమును సమర యోధులము. మా ప్రాణమందున, మనమందున ఆసురశక్తిని, తదూర్జమును, – నిక మా హృదయము నందున, బుద్ధి యందున, ఓ మాతా! దేవతాతత్త్వమును, దేవతాజ్ఞానమును, బ్రసాదింతువా!

*

మాతా! దుర్గా! జగజ్జేగీయమాన శ్రేష్ఠ భారతజాతి ఘోర తిమిరావణముచే సమావృతమై యుండెను; ఇపుడిక నీవో, జననీ, గగనతలమున మెల్ల మెల్లన నుదయించుచు నున్నదానవు; నీదు స్వర్గధామపు సుశరీర శోభచే, — తిమిర వినాశకర ప్రకాశముచే, — ఉషస్సావిష్కారము నొందుచున్నది. ఓ జననీ! నీదు ప్రకాశమును ప్రవృద్ధ మొనర్పుము! ఏ తద్ధ్వాంతము (ఈ చీకటి) నిదే విధ్వంస మొనర్చి, నిర్ధూతము నొనర్పుము!

*

మాతా! దుర్గా! మేము భవత్సంతానము; భవదీయ కృపాప్రభావముచే, భవత్ప్రభావముచే త్వదీయ మహత్కార్యమునకు, మహద్భావమునకు మే ముపయుక్తుల మయ్యెదము; కావున నో జననీ! మా క్షుద్రత్వమును మటుమాయ మొనర్పుము! మా స్వార్థమును మడియింపుము! మా భయంబును మంట గల్పుము!

*

మాతా! దుర్గా! కాళీరూపిణీ, కపాలధారిణీ! దిగంబరీ, కృపాణపాణీ! దేవీ, అసుర సంహారిణీ! భవద్భీషణ ఘోషణ కారణమున మారణము నొంది మా యంతశ్శత్రువులు మటుమాయమై యంతరించును గాక! వీనిలో నే యొక్కటియును మాలో నిక మనియుండకుండును గాక! అపుడు మేము విమలులమై, వినిర్మలులమై వెలయుదుము గదా! ఇదే మా ప్రార్థనము, ఓ జననీ! నీవిక ప్రాదుర్భవింపుము!

*

మాతా! దుర్గా! స్వార్థము చేతను, భీతచేతస్కత చేతను, క్షుద్రాశయత్వము చేతను ప్రస్తుత మీ భారతజాతికి మృతియే గతి యగుచున్నది. ఓ జననీ, మమ్ముల ఉన్నతులను, ఉన్నతోద్యములను నొనర్పుము; మమ్ముల నుదారచేతస్కులను, సత్యసంకల్పులను నొనర్పుము; మే మిపుడిక అల్ప అభీప్సితులము, భయభీతులము, చేష్టారహితులము, సోమరిపోతులము గాకుందుము గాక! మాతా! నీ విట్లొనర్పవా!

*

మాతా! దుర్గా! మేము నీ ప్రియ ఆర్య సంతానమే! మాలో నీ యోగశక్తిని విస్తార మొనర్పుము; మాలో నిపుడు మఱుగుపడి యుండిన యా శిక్షణమును, వీరచరిత్రను, మేధాశక్తిని, శ్రద్ధాభక్తిని, తపస్సును, బ్రహ్మచర్యమును, సత్యజ్ఞానమును వికసిత మొన ర్పుము! దుర్గా! విశ్వమున కీ సమస్తమును వితరణ మొనర్పుము. ఓ జననీ, దుర్గా, దుర్గతి నాశినీ, జగదంబికా! ఇదే యీ మాన వుల సహాయతకు మరలి రమ్ము! మా కొరకిదే – ప్రకటితవు గమ్ము!

*

మాతా! దుర్గా! మా అంతస్థ శత్రువులను హతమొనర్చి నీవు, మాకు గల యీ బాహిర బాధలను, బహుళ విఘ్నములను, భస్మీ భూతముల నొనర్పుము. మాతా! ఈ పరిపూత భారతభూతలము నందలి యా పావన వన వీధులందున, సారసహిత సుక్షేత్రము లందున, ఉన్నత గగన సమాగమ భాగ్యగతములగు నా నగ (పర్వత) తలమ్ములందున, పరిపూత నీర పరిపూరిత సరిత్తీర (నదీతీర) ములందున, బలయుతమగు నీ భారతజాతి, – పరా క్రమవంతమగు, పరమోన్నత చేతోవంత (బుద్ధిమంత) మగు నీ భారతజాతి – ఐకమత్యము తోడుత, ప్రేమ తత్వము తోడుత, సత్యశక్తి తోడుత, శిల్ప, సాహిత్య, విక్రమ, విజ్ఞాన విభూతుల తోడుత పరమ పవిత్రమై యధివసించును గాక! మాతా! త్వత్పాద పద్మమ్ముల గూర్చి యిదే మా ప్రార్థనమ్ము, ప్రకటితవు గమ్ము!

*

మాతా! దుర్గా! మా దేహమందున యోగబలము మూలమున ప్రవేశింపుము. మేము నీ హస్తములందలి ఆయుధముల మగు దుము, – అశుభ వినాశి ఖడ్గరాశి మగుదుము, – అజ్ఞానవినాశి, అనూన విభాసి, ప్రదీపరాశి మగుదుము. వినుమో జననీ! భార తావని యందలి యీ నవయువ జనగణ ప్రార్థనమును వినుము, – ఈ శుభకామనము (కోరిక) ను సఫలము సల్పుము; మాతా, నీవే మా యంత్రివై త్వదీయ హస్తము లందలి యంత్రములమగు మమ్ములను నీ యథేచ్ఛగ నడిపింపుము. నీవే మా అశుభ హంత్రి

వగుచు భవదీయ బాహువులందలి బహుళ ఖడ్గముల మగు మమ్ముల నీ యిచ్చ వచ్చిన రీతిని త్రిప్పుము. నీవే మా జ్ఞానదీప్తి ప్రకాశిని వగుచు తావకీన కరమున ప్రదీప్తముల మగు మమ్ము లను నిక నీ కరముల ధరియింపుము. ప్రకాశింపుమో జననీ!

*

మాతా! దుర్గా! ఈ మారు మాకు నీదు సాక్షాత్కారమ్మైన యీం యనంతరము నిన్నింక మరెన్నటికిని విసర్జింపబోము; మందు శ్రద్ధా భక్తి ప్రేమపాశముల తోడుత నిను బంధింప నున్నారము! రమ్మో జననీ! మా మనః ప్రాణ శరీరమ్ముల మూలమ్మున, — ఆ వాని ఆంతరమ్మున (లోన) నీ వావిర్భూతవు గమ్మ!

*

వీర మార్గ ప్రదర్శిని! వేంచేయుము! మే మిపుడింక నిన్ను విడు వంబోము. ఈ మా జీవన సర్వస్వమును నెడతెగని యొకే యొక దుర్గాపూజా మహోత్సవ మగు గాక! ఈ మా సమస్త కార్య స్తోమ (సమూహ) మును అనవతర కైంకర్య మగు గాక! ప్రేమ మయమును, శక్తిమయమును, మాతృసేవా వ్రతముచే నత్యంత యోగ్యతా ప్రయుక్తమును నగు గాక! ఇదే, మాదు ప్రార్థన మో మాతా! నీ విక నీ భారతావని లోన నావిర్భూతవు గమ్మ! ప్రకా శమానవు గమ్మ!

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అరవింద పాద సేవానంద (వీరభద్ర)

(*SABCL* Vol. 8, pp. 215-16)





దుర్గాదేవిని గురించి శ్రీఅరవిందులు

మహేశ్వరి, మహాకాళి అంశల ద్వంద్వస్వరూపము దుర్గాదేవి – ఆమెలో మహాలక్ష్మి లక్షణాలు అంతగా లేవు. శ్రీకృష్ణుడు, మహాకాళి కలిసి సాక్షాత్కరించడం మన యోగంలో చాలా గొప్ప విషయం. ఆ యిద్దరి నామములు నీలో కలిసి వినబడటం అనేది అత్యంత శుభ సూచకము.

*

శ్రీమాత శక్తులనేకములు – వాటిలోని రక్షణ శక్తి పేరు దుర్గ.

*

దుర్గారూఢమైన సింహము దివ్యచైతన్యపు ఆవిర్భావమునకు – ముఖ్యంగా దివ్యీకరింపబడిన (divinised physical vital) భౌతిక ప్రాణికమూ, ప్రాణికావేశముల ద్వారా (vital emotional) పని చేయుటకు చిహ్నము.

*

దుర్గాదేవి జగన్మాత యొక్క ఒకానొక అంశ – విజయానికి, రక్షణకు చిహ్నము. ఖండిత శిరస్సు భగవంతునిచే సంహరింపబడిన రాక్షసుని చిహ్నము.

అనువాదము: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకట్రామ శాస్త్రి

(*SABCL* Vol. 25, p. 75)

అధిమనస్సు (Overmind) మూలస్థానంగా గల మహాకాళి శరీరవర్ణం నలుపు గాదు, ఘోరస్వరూపమున్నూ గాదు. ఈ తల్లి ఎల్లకాలములలోను నిశాచరులను ఎదుర్కొన్నప్పుడునూ, సర్వకాలములలో మేలిమి బంగారువర్ణంతో శోభిస్తుంది.

శ్రీఅరవిందులు

(*SABCL* Vol. 25, p. 75)

జగన్మాత మహాకాళీ తత్త్వము

సృష్టి నిర్వహణ కోసం శ్రీమాతలోని నాలుగు అంశలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఒక్కొక్క అంశ మూర్తీభవించిన ఒక్కొక్క గుణము – జ్ఞానము, శక్తి, సౌందర్యము, కర్మకౌశలము. మహాకాళి ప్రచండమైన దివ్యశక్తి స్వరూపము. ఆమె శక్తి అమోఘము. ఆ శక్తి ముందర నిన్ను ఎదిరించే ఎట్టి అవరోధములైనను ఒక్క తృటిలో తొలగిపోవలసినదే. ఆమె అండదండలతో నువ్వు నీ గమ్యానికి ఒక్క పరుగున చేరగలవు.

– సంపాదకుడు

ఈ సృష్టికి మార్గదర్శకత్వ నిర్వహణలోను, ఈ జగన్నాటక విన్యాసములోను, జగన్మాత పాత్రలో చతుర్విధశక్తులైన దివ్య స్వరూపాలు, ప్రస్ఫుటంగా మనకు గోచరిస్తాయి. ఈ నాల్గింటిని, మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి స్వరూపాలని గ్రహించనగును.

మహాకాళి తత్త్వము విస్తృతి కాదు, ఉన్నతి. ఔన్నత్యంతో కూడుకొన్న ఈ తత్త్వంలో శక్తిసామర్థ్యాలు, బలప్రాబల్యములకే పెద్ద పీట. జ్ఞానము కాదు, కఠోరమైన తపన, కృషి, ఎట్టి ప్రతిబంధకమునైనా అధిగమించే సంహారశక్తి ఈ కాళీతత్త్వ ప్రత్యేకతలు. ఈ చల్లని తల్లి దివ్యతేజము, ధ్వంసక్రియా విశేషంగా బహిర్గతమవుతుంది. వేగమే స్వరూపము కాగా, శీఘ్రగామియై, కార్యరూపం దాల్చి, ఆదిలోనే ప్రత్యర్థిపై తేరుకోలేని దెబ్బ వేయగలదు. అసురులకు భయోత్పాతకమైన ఈ కాళీమాత దైవదూషకులకు భయంకర స్వప్నమై, అలుపెరుగని పరాక్రమశాలిగా విరాజిల్లుతుంది. కౌశల్యలేమిని, నిత్యజీవితంలో ప్రతిఘటనను క్షమించదు. సృష్టిలో జడత్వ, మూర్ఖత్వాలపై కొరడా ఝుళిపిస్తుంది. *సహజంగా క్రోధస్వరూపియైన కాళీమాత అరిషడ్వర్గాలన్నిటినీ ఒక్క తృటిన అణచివేయగలదు. భగవత్సేవ యందు అలసత్వము, అశ్రద్ధ, సోమరితనము ఏ మాత్రము సహింపదు. అవసరమైతే ఒక పోటు పొడిచి కర్తవ్యనిర్వహణకు పురికొల్పగలదు. అమ్మ*

చేపట్టే ప్రక్రియలు శీఘ్రాతి శీఘ్రమ్మై, సూటిగా గ్రుచ్చుకొని, తీవ్రమైన తపనను ప్రేరేపించగలవు. శూరత్వము, డేగ కన్నుల వలె బహునిశితమ్మై, విశాలమ్మైన దృష్టిగల కాళీమాత శీఘ్రగామిన్మై, దీనజన సంరక్షణార్థమ్మై, తన చేతులు చాపుకొని యున్నది. ఈ మాత జగన్మాత. ఆమె క్రోధానికి పట్టపగ్గాలు లేవు. అయినప్ప టికి దివ్యానురాగ కారుణ్యమూర్తి. ఏ క్షణంలో నైనా ఆమె తన బలప్రదర్శనను జేయగా, ఆటంకాలుగాని, భక్తులను వెంటాడే శత్రువులకు గాని శృంగభంగము తప్పదు. కాళీమాత క్రోధము పాపులకు భయోత్పాదకము కాగా, ఆమె తీవ్రతను పిరికివాళ్లు తట్టుకోలేకపోగా, మహనీయులు, విజ్ఞులు మొ॥ వారు ఆమెను భక్తితో ఆరాధిస్తారు. ఎందుకంటే కాళీమాత, దండించినప్పటికి అది తమ యందున్న ప్రతిఘటించే తత్వాన్ని సత్యాన్వేషణ దిక్కుగా మరలునట్లు చేస్తుంది. అనిత్యమైన వాటిని నిర్మూలి స్తుంది. వందలాది సంవత్సరాలుగా ముద్ద గట్టిన ఈ జడత్వాన్ని నిర్మూలించుటకు కాళీమాతకు ఒక్క పూట చాలు. కాళీమాత తత్త్వం ఆనందతత్త్వమే. ఈ తత్త్వం ఏ కారణంగా నైనా లోపిం చినా ఆనందస్వరూపంలో హెచ్చుతగ్గు లున్నప్పటికీ రసవిహీనమై, ఆర్ద్రత ఎండిపోతుంది. జ్ఞానస్వరూపిగా ఈ తల్లి జయకేతనం ఎగురవేస్తుంది. సౌందర్యోపాసన, సర్వత్రా సమతుల్యత పాటిం చటంలో ఉచ్చతరమైన విలువలకి ప్రాముఖ్యం కలుగచేస్తుంది. మందంగాను, శ్రమతో కూడుకొన్న సాధన పరమోచ్చ స్థితిని చేరుకొన్న పిమ్మట వేగవంతం చేసి సాధనను పటిష్ఠం చేయ గలదు. పరమోత్తమమైన లక్ష్యాలు, మహోన్నత స్థితులు, పరమా నంద స్థితులు మాత్రమే కాళీమాతకు సంతృప్తిని కలిగిస్తాయి. జగన్మాత తోడుంటే విజయానికి ఎన్నడూ ఢోకా లేదు. ఈ చల్లని తల్లి కరుణిస్తే, ఈ సృష్టిలో సాధ్యం కానిది ఏదీ ఇప్పుడు గాని, ముమ్ముందు గాని ఉండదనటంలో సందేహం లేదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: శ్రీశరణ్

(*SABCL* Vol. 25, pp. 25-30)

మంత్రము

మనకు స్థూలమైన శబ్దమును గురించే తెలుసు. నిశ్శబ్దమైన శబ్దమును గురించి తెలియదు. కాని యోగులకిది క్రొత్త కాదు. వారు లోతైన చైతన్యంలో విహరిస్తూ వుంటారు. మనకు దృశ్యము కాని దృశ్యములు, శ్రవణము కాని శబ్దములు వారి కనుభూతమౌతూనే వుంటాయి. అట్టి శబ్దములకు మామూలు శబ్దము కన్న అధికమైన సృజనశక్తి ఉంటుంది. మంత్రములు ఈ కోవకు చెందినవే. మన మన్వేషించవలసినవి ప్రాపంచిక వస్తువులు కావు. ప్రాపంచిక వస్తువులకు ఆధారమైన మూలతత్త్వము.

— సంపాదకుడు

రాజయోగ ధ్యానంలో మనస్సును అదుపు చేసేందుకు దేనినైనా ఆధారంగా గ్రహించాలి. మనస్సు మర్కటం గనక నిలిచిన చోట నిలువక గంతులేస్తూ ఉంటుంది. దాని చలనాలను నిరోధించటానికొక ఆధారం, ఓ కట్టుగొయ్య కావాలి. ఆ కట్టుగొయ్య దైవ సంబంధం కావాలి. సాధారణంగా ఒక నామం కానీ, ఒక మంత్రం కానీ, ఒక రూపం కానీ ఐతే తద్వారా మనస్సు దైవలగ్నమౌతుంది. *ఈ భావన మీద కేంద్రీకరిస్తే భావం నుండి మనస్సు సత్య పరిధిలోకి ప్రవేశిస్తుంది. అప్పుడది దానిలో మునిగి నిశ్శబ్దత పొందుతుంది. తాదాత్మ్యం పొందుతుంది. అంటే దానిలో అది ద్రవించి లీనమైపోయినదన్న మాట.*

*

ఓ మంత్రమో – దివ్యాక్షరమో – నామమో – ప్రతీకో – ఏదైనా సరే దాని వల్ల చాలా ఉపయోగముంటుంది. భారతీయ యోగ శాస్త్రం దీనిని చాలా చర్చించింది. ఈ మంత్రరహస్యం – షట్చక్రాలు – కుండలినీ శక్తి – ఈ తంత్ర విష.యమంతా మానవ సూక్ష్మ-స్థూల శరీర నిర్మాణ సంబంధమైన విజ్ఞానశాస్త్రం, దాని సాధన విధానాలు అన్నీ మంత్రం వివరిస్తుంది. ఈ తంత్రయోగ సాధనలకది ఒక మహాభారతం. ఈ దేశంలో దానిని సాధన మార్గంగా గ్రహించని మతం లేదంటే ఆశ్చర్యపడనక్కర లేదు.

ఆత్మచైతన్యము (psychic consciousness) భగవంతునితో సాన్ని హిత్య సంబంధాలు పెంపొందించుకొనే ఆధ్యాత్మిక సాధనం. దీని వల్ల సాధకుని అంతః ప్రపంచ ద్వారాలు తెరవబడతాయి. అదొక ప్రతీకా జగత్తు. అన్నీ ప్రాణవంతములు, తేజోవంతములు. ఇవన్నీ సాధకునికి ఆత్మపరిణతిని కల్గిస్తాయి. ఆత్మానుభూత సాన్నిహిత్యానికి దారి కల్పిస్తాయి. ఆత్మశక్తికి – ఆనందానికీ – లేదా జ్ఞానానికీ అవి మార్గాలు, సోపానాలు. దీనికి మంత్రమొక బృహత్ సాధనం. అదొక ప్రతీక. ఒక పనిముట్టు. నాదశరీరమై భగవత్ సాక్షాత్కారానికి – పరమాత్మ వ్యక్తీకృతికి – భగవత్ శక్తులకు – రూపాలకు అవకాశం కల్పిస్తుంది. యోగంలో ఇది చాలా ముఖ్యం. పరమాత్మ రూపాలెన్నో మనకు దర్శనమిస్తాయి. వాటి ద్వారా పరమేశ్వరుని సాక్షాత్కృతి లభ్యమౌతుంది. అప్పుడు ఆత్మార్పణకూ – భక్తితో అర్పించటానికీ ఎంతో వీలౌతుంది. ఇంతే కాక ఆయా మూర్తుల *లోకాలకు పోయి రావటం – ఆ మహాత్ముని ప్రకాశ సాన్నిధ్యం కలగటం తటస్థిస్తుంది. ఆయన ఆదేశం – ఆజ్ఞ – నోటి మాట సాన్నిహిత్యం – స్పర్శ – మార్గ నిర్దేశం – మనకు లభిస్తాయి.* తత్త్వదశ కెగబ్రాకిన మన అంతశ్చైతన్యం ద్వారా ఇదంతా సంభవిస్తుంది. పరమేశ్వర చరణ సాన్నిహిత్యం అతని మాట చేష్టాదులన్నీ మనకు దర్శనపథంలో సాక్షాత్కరిస్తాయి.

*

'ఓం' అనే మంత్రం బ్రహ్మచైతన్యాన్ని భౌతికపదార్థమయ కక్ష్య నుండి తురీయస్థితి వరకూ నాలుగు స్థితుల్లోనూ వ్యక్తం చేసే ప్రతీక. ఆ మంత్రం బ్రహ్మచైతన్యాన్ని తన యందు ధరించటమే గాక, దాని ప్రతీకగా నిలిచి స్పందనల ద్వారా దానిని ప్రసన్నం చేసుకోడానికి ఉపకరిస్తుంది. అందువలన మంత్రం అన్ని భౌతికరూపాల అంతస్సత్త (inner being) లోనూ, ప్రజ్ఞానజగత్తు లోనూ, మనకు పైనున్న అతిమానస చైతన్యానికి చెందిన కారణమయ కక్ష్యలోనూ, విశ్వస్థితికి పరమమైన విముక్త స్థితిలోనూ

కూడా ఏకచైతన్యంగా వర్తిస్తూ వుంటుంది. మంత్రోపాసన చేసే వారు ఈ చివరి స్థితికి చెందిన వారై వుంటారు.

*

వేదఋషుల దృష్టిలో మంత్రమంటే దైవప్రచోదితమైన దర్శనం, దర్శనంగా పర్యవసించిన జ్ఞానం. కొంచెం వివరంగా ఆధునిక పరిభాషలో చెప్పాలంటే అది అంతరాంతరాల్లో కలిగే సత్యమైన, స్వచ్ఛమైన అనుభూతి – ఆత్మయొక్క సత్యం, ప్రకృతియొక్క సత్యం, విశ్వంయొక్క సత్యం; అదే జీవితమూ, జీవితానుభూతీ, కర్తాకర్మాక్రియా అన్నీను! అది లయాత్మకమై ఛందస్సుయొక్క రెక్కల మీద సాగే మహత్తర భావవిన్యాసం. దర్శనమూ, శ్రవణమూ ఒకటైన విడదీయరాని స్థితి! సృష్టికర్త ద్వారా గానీ, మానవవాహిక ద్వారా గానీ ఋక్కు అనే ఉజ్వలమైన వాక్కును మనసు అంతర్దర్శనంగానూ, అంతశ్శ్రవణంగానూ పొందుతుంది.

మంత్రం హృదయంలో ఉద్బుద్ధమై, తత్త్వవిచారణ సామర్థ్యం కలిగిన మనస్సులో రూపొంది, పరమాత్మని శాశ్వతత్వమనే రథంలో దర్శింపబడే సత్యం. పరమాత్మనియొక్క ముఖంగానో, ఆకారంగానో మనకు దర్శనమిస్తుంది. మానసిక కక్ష్యలో విన గలిగినవాడు మాత్రమే మంత్రద్రష్టలైన కవుల వాక్కులను విన గలుగుతాడు. ఈ క్రింది మూడు లక్షణాలు సమకూరినపుడే మంత్రవాక్కు వెలువడుతుంది: అంతరాంతరాల్లోని సత్యాన్ని దర్శించాలంటే శ్రవణం దాని ననుసరించాలి. మంత్రం యొక్క లోపలి పొరల్లోని దివ్యత్వాన్ని మనస్సు ఆవరించాలి. ఆ విధంగా మనస్సు ఆత్మస్థితి నందుకునేటప్పుడు మంత్రసందేశం యొక్క సాహచర్యాన్ని పొందాలి. లేక దాని వెనువెంటనే లయాత్మకమైన ఋక్కు రూపంలో సత్యాని అనుసరించాలి.

మంత్రం అతి ఉదాత్తమైన, పరమ శక్తివంతమైన లయాత్మకమైన శబ్దం యొక్క ప్రత్యక్ష స్వరూపం. దీని అంతర్దర్శన, దార్శనిక దివ్యావేశం వలన ఆత్మ మనస్సును తన వెలుగులో పూర్తిగా నింపివేస్తుంది. ఆత్మయొక్క సాక్షాత్కార, సాన్నిధ్యాల

ద్వారా అంతస్సత్యం ద్వారా, ఆత్మరూపాలనూ, ఋతంలో జనించే పరమాత్ముని రూపాలనూ మంత్రం ఆవిష్కరిస్తుంది.

*

తేజస్సునూ, మహిత వాక్కునూ తనలో నింపుకున్న మంత్రం పరిమితమైన మానవుడిని తన అనంతత్వంలో లీనం చేసుకుం టుంది. నేను 'భవిష్యత్ కవిత' 'The Future Poetry' అన్న గ్రంథంలో వివరించడానికి ప్రయత్నించినట్లు మాంత్రిక కవిత అధిమానసం (Overhead inspiration) నుంచి గానీ, ప్రజ్ఞాత మానసం (Intuition) నుంచి గానీ ఉద్భవిస్తుంది. ఆ కవిత్వంలో ఈ క్రింది లక్షణాలుంటాయి.

1. మాటలు మామూలుగా వ్యక్తం చేసే బాహ్యార్థాన్ని కాక అంతరార్థ స్ఫూర్తిని కలిగి వుంటాయి.
2. కవిత్వంలో వుండే మామూలు లయ మాత్రమే గాక జగత్సృష్టి నుండి వ్యక్తమవుతూ, మళ్ళీ దానిలో లీన మయ్యే ఛందోలయాత్మకత వుంటుంది.
3. ఈ కవిత్వం కేవలం మానసిక, ప్రాణిక, భౌతిక విష యాలనూ, సూచనలనూ, విలువలనూ మాత్రమే కాక, వాటికి ఆధారభూతమై, వాటిని వెనుక నుండి నడి పించే శుద్ధచైతన్యాన్ని వ్యక్తం చేస్తుంది.

*

నిజానికి – వాక్కు సృజనాత్మకమైనది. ఇది మనోవికారాల్ని, మానసిక స్వరూపాల్ని, క్రియాప్రేరణలను సృష్టిస్తుంది. వాక్కుకి గల ఈ సృజనాత్మక చర్యను మంత్రోపాసన ద్వారా సనాతన వైదిక సిద్ధాంతమూ, ఆచరణా కలిసి విస్తృతం చేస్తాయి.

మంత్రం అంటే మరేమీ కాదు. మన అంతరాంతరాల్లో అట్టడుగు పొరల్లో ప్రగాఢ సృజనాత్మక చైతన్యంతో పొటమ రించి శక్తిని (బ్రహ్మతత్త్వాన్ని) సంతరించుకున్న పదమే మంత్రం. ఇదే మంత్రసిద్ధాంతం. ఈ మంత్రం మానసికమైనది కాదు. హృద యంలో గూడు కట్టుకున్న స్పందన వల్లనే తప్ప మేధవల్ల రూపు దిద్దుకోదు. హృదయస్పందనతో ఆవిర్భవించిన భావంనే నిరం

తంరంగా ధ్యానించబడుట వలన మరింత *ప్రదీప్తమై, విస్పష్టమై, వినిపించే శబ్దంగానో, వినిపించని ప్రణవంగానో బయటకు నెట్టి వేయబడుతుంది. వినిపించే శబ్దం కంటె వినిపించని ప్రణవానికే ఎక్కువ శక్తి ఉంటుంది.* సృజనాత్మక చర్యలో ఇది కచ్చితమైన ఫలితాన్ని ఇస్తుంది.

మంత్రం మనలో నూతన మానసిక సామర్థ్యములను సృష్టించడమే కాదు. అది వరకు మనకు లేని విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని బహిర్గతం చేస్తుంది. మంత్రం ఉపాసకునిలోనే గాక, ఇతరుల మనస్సుల్లో కూడా అటువంటి ఫలితాన్నే ఇస్తుంది. అంతేకాదు పరిసర మానసిక, ప్రాణిక భూమికలలో ప్రకంపనలను సృష్టిస్తుంది. ఫలితంగా భౌతికతలంలో వారి సాధనలోను, క్రియల్లోను, ఆఖరికి వస్తురూపాలను మలచడంలో కూడా ప్రభావం చూపుతుంది.

సావిత్రిలో మంత్ర వివరణ

కర్ణములందు మరి మరి మార్మోగిన మంత్రతరంగములు
మేధను మథియించగా మార్మిక సందేశములు
అజ్ఞానపు కణములలో ఆరావము ముర్మురించు;
భావార్థము నెరుగలేక శబ్దముపై ధ్యాస నిలుపు అవగాహనకై
మనసున తానెంతో శ్రమ చెందును
తళుకు లీను అర్థోక్తులు సత్యంబును విప్పలేవు;
తన లోపలి నిశ్శబ్దపు లోతులందు మునిగిపోవు.
అంతశ్శ్రవణంబు వలన పునరావృతమగు మంత్రము;
ఛందోవైభవ మధుమయ సామముగా రూపుదాల్చు
భావము, దృశ్యము, ఇంద్రియములు, ఆత్మానుభూతి యందు
మాటలు వర్ణింపలేని ఆనందముగా మారును కలిసి;
బృహత్ విక్రమంబు పొంది శక్తిరూపు దాల్చును,
అనంతజ్ఞాన సాగరమ్ము లతనిని ముంచెత్తివేయు;
శ్వేతకిరణ కాంతిరేఖ రూపాంతస్థితిని కూర్చు
మృణ్మయుడగు మానవుండు హిరణ్మయునిగా మారును,

ఆనందపు ధావులలో ప్రశాంత స్వర్గసీమలలో
పరమాత్ముని దర్శించును. పరావాక్కు నందుకొనును.
ఆంగ్ల మూలం:
...when the mantra sinks in Yoga's ear,
Its message enters stirring the blind brain
And keeps in the dim ignorant cells its sound;
The hearer understands a form of words
And, musing on the index thought it holds,
He strives to read it with the labouring mind,
But finds bright hints, not the embodied truth:
Then, falling silent in himself to know
He meets the deeper listening of his soul:
The Word repeats itself in rhythmic strains:
Thought, vision, feeling, sense, the body's self
Are seized unutterably and he endures
An ecstasy and an immortal change;
He feels a Wideness and becomes a Power,
All knowledge rushes on him like a sea;
Transmuted by the white spiritual ray
He walks in naked heavens of joy and calm,
Sees the God-face and hears transcendent speech...

మూలం: శ్రీఅరవిందులు
భావానువాదం: తుమ్మపూడి కోటీశ్వర రావు, ధారా రాధాకృష్ణమూర్తి; పున్నమరాజు నాగేశ్వరరావు (డిసెంబరు 2001 అఖిల నుండి)

(*SABCL* Vol. 20, pp. 518, 516; Vol. 21, p. 848;
Vol. 23, pp. 745-46; Vol. 9, pp. 199-200, 369-70;
V0l. 12, pp. 169-70; Vol. 28, p. 375)

జపం ఎలా చేయాలి?

మానవశక్తి పరిమితము. దేవతల శక్తి అపరిమితము. ఆ దేవతల శక్తిని పొందేందుకు మార్గం కావాలి. అందులకు జపమొక ముఖ్యసాధనము. కానీ జపమెలా చేయాలో నేర్చుకోవాలి. ఊరికే పెదిమలతో నామం ఉచ్చరించగానే సరిపోదు. ఒక రథంలో దేవుడొచ్చినప్పుడు నీవు రథాన్ని చూడవు కదా. అందులోని దేవుడినే చూస్తావు. జపంలో కూడ అంతే. నామము దేవత యొక్క బాహ్యస్వరూపము మాత్రమే. నిగూఢంగా దాని లోపల ఆమె దాగి ఉంటుంది. అంతరంగికంగా ఆమె దర్శనభాగ్యము కలగాలనే తపనతో నామజపం చేసినపుడు అది ఫలిస్తుంది.

— సంపాదకుడు

జపమనగా ఎక్కాలు వల్లించినట్లు వల్లించడము కాదు. నీ మనస్సులో ఆ దేవతా లక్షణాలను, శక్తి సౌందర్యములను అదే పనిగా ధ్యానిస్తూ జపం చేయటం ఒక పద్ధతి. దీనిని మానసిక జపం అనవచ్చు. అంటే నీవు ఉచ్చరించే ప్రతి అక్షరంలోనూ ఆ ప్రార్థన, ఆ తపన, ఆ తత్పరత ఉద్దీపనమై ఉండాలి. భక్తిభావంతో తహతహలాడుతూ నీ హృదయంలో నుంచి పొంగిపొరలే ఆవేదనతో చేసేది మరో మార్గము – అంటే నీ మనస్సుకు వేరే వ్యాపకము లేదన్న మాట. లేదా నీ హృదయము వేదనాభరితమై ఆ దేవత కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. అయితే ఈ జపం వలన మనస్సు శుష్కించిపోయినా, ప్రాణికం అల్లకల్లోలమయినా (if it makes the vital restless) ఈ పద్ధతులు పనికి రావు.

ఆ నామములో ఉన్న శక్తి మీద, ఆ దేవతా మహిమ మీదనే ఆధారపడటం మూడవ మార్గము. ఇది చాలా ఓర్పుతో కూడినది, సావధానంగా చేయవలసిన పని. ఆ దేవతాశక్తి యొక్క ప్రకంపనలు నీ అంతరంగ జీవుని మీద తగినంత ఒత్తిడి చేయగా, ఆ జీవి జాగృతమై కళ్లు తెరిచేంత వరకు వేచి వుండాలి. అయ్యో ఇంకా జరగటం లేదేమిటి అనే ఆలోచన గనక కలిగినట్లయితే ఆ ప్రక్రియ అక్కడే ఆగిపోతుంది గాని నీకు తగలదు. అందుకనే

కదా నీ మనస్సును ప్రశాంతంగా ఉంచుకో బాబూ, దాంతో కుస్తీ పట్టకుండా ఆ మనస్సు కొంత పదునై, చైత్యపురుషుడు ఆవిష్కారమయ్యేందుకు తగినంత సావధాన చిత్తముతో వేచివుండు బాబూ అంటాము. నీవు ఒక పద్యం కట్టాలన్నా, సంగీత బాణి కూర్చవలెనన్నా, ఆవేశం కలిగేంతవరకు నిశ్శబ్దంగా వేచి వుండవూ, జపం విషయంలో కూడా అంతే.

*

నామజపం గొప్పది. మహాశక్తివంతమైనది.

*

నీవు మంత్రాన్ని వల్లించినప్పుడు, అది లోపల నుంచి మళ్ళీ వినపడుతూ ఉంటుంది. అంటే నీ జీవుడు దాన్ని గమనించి లోపల నుంచి మళ్ళీ పలుకుతాడు. అది చాలా గొప్ప అనుభూతి.

*

మన యోగంలో ప్రార్థనా ధ్యానములకు చాలా ప్రాముఖ్యం ఉన్నది. అయితే వాటిని ఎలా చేయాలో నేర్చుకోవాలి. ప్రార్థన నగా హృదయంలో నుంచి ఉవ్వెత్తున ఎగసే ఒక ఆవేదన. ధ్యానం కూడా ఏదో మొక్కుబడిగా కాకుండా కాంతిపుంజాలతో సజీవంగా దానంతటదే జరగాలి. అలా కాకుండా: 'ఇది చచ్చి నట్లు చేయాలిరా బాబూ' అని ఒక విధిగా చేస్తేమట్టుకు ప్రయోజనం ఉండదు. మరి నువ్వు నిరంతరం ఫలితం కోసం ఎదురు చూస్తూ అలాగే చేస్తున్నావు కదా. అందుకనే కదా ముందర నీ మనస్సును, దృష్టిని మార్చుకోమని చెప్పేది.

ఎప్పుడయితే నీ చైత్యపురుషుడు (psychic) ముందరకు వస్తాడో, అప్పుడు నీవు ఇక తన్నుకోవాల్సిన పని లేదు. అంతా సంతోషమే. అంతా ఆనందమే. అప్పుడు ఇక ప్రార్థన, ధ్యానం నిరంతర భక్తి ప్రవాహాము – ఒకటేమిటి అన్నీ కూడ కరతలామలకములే. కూర్చున్న వెంటనే ధ్యానము దానంతటదే వెంటనే మొదలైపోతుంది!

ధ్యానమనగా మేధకు, జ్ఞానానికి సంబంధించిన విషయం. హృదయావేశము కాదు. అటువంటప్పుడు నీవు ధ్యానాన్ని కోరు

కున్నప్పుడు, ధ్యానము పట్ల అయిష్టత పనికిరాదు. హృదయంలో దృష్టిని కేంద్రీకరించటం ధ్యానము (meditation) కాదు. అది దైవాన్ని, నీ ప్రియతమ దైవాన్ని పిలవటమే. మన యోగము కేవలం జ్ఞానయోగమే కాదు. జ్ఞానము కేవలం ఒక సాధనా మార్గము అంతే. అనేక మార్గములలో ఇదొకటి. ఆత్మసమర్పణ, భక్తి, హృదయసంబంధితాలు. అంతా ఆ హృదయ ప్రాతిపదిక మీదనే ఆధారపడి ఉంటుంది. ఇక్కడ జపము, భక్తి, సాధన చేసేవాళ్లు చాలామంది ఉన్నారు. కేవలం ధ్యానం మీద ఆధార పడే వాళ్లు చాలా తక్కువమంది. ప్రేమ, భక్తి, కర్మలు, మన యోగానికి ముఖ్యాధారములు. కేవలం జ్ఞానం మీద ఆధారపడి ఈ యోగాన్ని చేసేవాళ్లు ఎంతమంది ఉంటారు? బహు కొద్ది మంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 23, pp. 745, 746, 748, 533-34)

పూర్ణయోగంలో మంత్రసాధన

పూర్ణయోగంలో ఒకానొక మంత్రమన్నదేదీ లేదు. సాధకులు తమకు అవసరమని భావించినంత వరకు మంత్రోపాసన సాగించవచ్చు. సాధకునికి మనోదారుఢ్యము, హృదయనిష్ఠ, సంకల్ప బలము తప్పనిసరి. వీటిని అన్నీ జోడించి, త్రికరణశుద్ధిగా, సాధకుడు సత్యదర్శనముకై అణువణువునా తపించిపోవాలి. ఇందుకు మంత్రోపాసన దోహదం చేస్తే శుభం. అయితే మంత్రోపాసనలన్నిటిలోను ఓంకారోపాసన మిక్కిలి విశిష్టమైనది. యథావిధిగా చేసే ఓంకారోపాసన, ఊర్ధ్వలోకాలంతటా ఆవరించి యున్న విశ్వచేతనను అందుకోటానికి ఒకానొక బాట, ఒకానొక సోపానము. అంతే గాదు. పైనున్న ఆ విశ్వచేతన సాధకుని శరీరం లోనికి చొచ్చుకొనిపోయి, వానిని తరింపచేస్తుంది.

ఈ మంత్రయోగంలో ఉపాసించబడే ఒకే ఒక మంత్రం 'శ్రీమాత', కాకపోతే మా ఉభయుల నామాలు మాత్రమే. సాధకుడు హృదయం పైనగాని, శీర్షోపరిభాగంపైగాని చిత్తాన్ని ఏకాగ్రం చేయాలి. ఈ రెండు ఉపాసనలు భిన్నమైనవి. ఫలితాలు కూడా భిన్నమే. *మొదటిది చైత్యపురుష వికాసాన్ని కల్గించి భక్తి, ప్రేమల నావిష్కరించి తల్లి సాయుజ్యాన్ని కల్గిస్తూ నిత్యమూ హృదయ కమలంలో ఆమె ఉనికిని స్థాపిస్తుంది.* అంతేకాక ప్రకృతిలో ఆమె శక్తిమంతమైన కర్మానుష్ఠానాన్ని అనుభవింప చేయగలదు. రెండవది సాధకుని ఆత్మసాక్షాత్కారమునకు మార్గము సుగమం చేస్తూ అతన్ని ఒక్కొక్క మెట్టు ఎక్కించి ఊర్ధ్వచేతనా భూమికలను ఆరోహింప చేస్తుంది. ఈ విధంగా సాధకుని చైతన్యావరోహణ కల్పించి మహాచైతన్యాన్ని తనలోనికి అవతరింప చేస్తుంది. ఈ చైతన్యారోహణ – అవరోహణ ఈ రెండవ మార్పు ప్రత్యేకత.

*

నామజపంతో నీవు దైవాన్ని ఆరాధించవచ్చు. నిన్ను రక్షించమని, భక్తిని తీవ్రం చేయమని, అంతశ్చేతనా ద్వారములను తెరవమని వేడుకోవచ్చు. సుప్తచేతనలో (subconscious) అవసరమైన ప్రక్రియలన్నీ ఈ నామజపం వలన జరుగుతాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: శ్రీశరణ్ (డిసెంబరు 2001 'అఖిల' నుండి)

(*SABCL* Vol. 23, p. 746)

శ్రీఅరవిందులు ఇచ్చిన మంత్రములు

ఓం ఆనందమయి చైతన్యమయి సత్యమయి పరమే

*

ఓం తత్సత్ జ్యోతిరరవింద
ఓం సత్యం జ్ఞానం జ్యోతిరరవింద

*

OM Sri Aurobindo Mira

Open my mind, my heart, my life to your Light, your Love, your Power. In all things may I see the Divine.

16-7-1938 Sri Aurobindo

శ్రీమాతారవిందుల ఇద్దరి పేర్లు ఉన్న మంత్రాన్ని తన కనుగ్రహించమని ఒక సాధకుడు శ్రీఅరవిందులను కోరగా వారు దీనిని ఇచ్చారు.

"నువ్వు కోరినట్లు మా నామధేయములతో కూడిన ఒక మంత్రమును ఇస్తున్నాను. దీని సహాయంతో నువ్వు నీ కష్టముల నధిగమించి అంతరంగికంగా గట్టి పునాదిని వేయగలవని ఆశిస్తున్నాను".

కాని సాధకునికి ఒక సంశయం వచ్చింది.

"మీ నామధేయములే కాకుండా మిగతా మాటలు కూడా ఉన్న ఆ వాక్యమంతా ఒకే మంత్రమంటారా?"

శ్రీఅరవిందులు జవాబు: "అవును." (18-7-1938)

(*SABCL* Vol, 25, p. 79; *Sri Aurobindo Archivies & Research,* Dec 1985, p. 125; *SABCL* Vol, 26, p. 512; *AIM* Dec 2001)

*

శ్రీఅరవిందుల గాయత్రి

తత్సవితుర్ వరం రూపం జ్యోతిః పరస్య ధీమహి।
యన్నః సత్యేన దీపయేత్॥

అతిమంగళకరమైన సావిత్రి రూపమును, సత్యమును మనలో ప్రకాశింపచేసే పరంజ్యోతిని గురించి ధ్యానము చేయుదము.

*

ధ్యానానికి శ్రేష్టమైన విషయం

ప్రశ్న: మనం దేన్ని గురించి ధ్యానం చేయాలి?

అది నీ స్వభావాన్ని బట్టి ఉంటుంది. ఏదైతే నీ తత్వానికి, నీ ఉన్నత ఆదర్శాలకు నచ్చుతుందో దాన్ని గురించి చేయాలి. నన్నడిగితే మాత్రం ఎప్పుడూ కూడ ఆ పరబ్రహ్మ మీదే దృష్టి నిలిపి ధ్యానం చేయడం శ్రేష్టమంటాను. అంటే అందరిలో భగవంతుడున్నాడనీ, అందరూ భగవంతునిలోనే ఉన్నారనీ, అంతటా భగవంతుడే నిండి ఉన్నాడనే భావంపై మనసు నిలిపి ధ్యానం చేయాలి. భగవంతుని వైయక్తిక రూపంలో నైనా, అవైయక్తిక రూపంలో నైనా, లేక సర్వాంతర్యామిని గురించి అయినా ధ్యానించవచ్చు. ఏదైనా ఫర్వాలేదు. అన్నిటిలోకీ ఇదే మంచిదని నేను తెలుసుకున్నాను. ఎందువల్లనంటే అది అన్నిటిలోకీ ఉత్కృష్టమైనది. అందులోనే అన్ని సత్యాలూ ఇమిడి ఉన్నాయి. ఈ ప్రపంచ సత్యాలనే కాకుండా మిగతా లోకాల సత్యాలను కూడ అందులోనే ఇముడ్చుకుంటుంది. 'సర్వం బ్రహ్మ'

(SABCL Vol. 26, p. 513; Vol. 23, p. 722)

*

శ్రీమాత ఇచ్చిన ప్రార్థనలు, మంత్రాలు

(14 మార్చి 1973 నాడు ఒక శిష్యునితో
శ్రీమాత సలిపిన సంభాషణ)

పరిస్థితులు చాలా ఘోరంగా తయారయినై. అందుకని మనం 'చాలా' ప్రశాంతంగా, 'చాలా' ప్రశాంతంగా, 'చాలా' ప్రశాంతంగా ఉండాలి. నా పాతమంత్రం గూర్చి చెబుతా విను. అది బాహ్యా చేతనను ప్రశాంతపరచే మంత్రం:

ఓం నమో భగవతే

సమస్తాన్నీ ప్రశాంతపరిచే శక్తి ఆ మంత్రాని కున్నది.

*

(జూన్ 1971 లో బంగ్లాదేశం యుద్ధమప్పుడు
దేశ ప్రజలకు శ్రీమాత ఇచ్చిన మంత్రము.)

Supeme Lord, Eternal Truth
Let us obey Thee alone
and live according to Truth.

మహాప్రభో, శాశ్వత సత్యమా
మేము నీకు మాత్రమే విధేయులమై
సత్యజీవమును అవలంబించెదము గాక.

*

శ్రీమాతారవిందులారా శరణు శరణు

*

ప్రార్థనలు

మహాప్రభో, మిమ్మల్ని నమ్ముకుంటే
అన్ని కష్టములు తీరిపోవును. అట్టి
విశ్వాసమును ప్రసాదింపవే.

*

మహాప్రభో, నీ అనుగ్రహమును మేమెప్పటికీ విస్మరింపబోవు నట్లు కటాక్షింపవే!

*

మేము శాశ్వత చైతన్యముతో తాదాత్మ్యము చెంది అసలు అమరత్వము అంటే ఏమిటో ఎరుగునట్లు మమ్ముల ననుగ్రహింపుము.

తెలుగు మూలం/అనువాదం: డిసెంబరు 2001 అఖిల;
డా॥ ఎ. ప్రభావతి. డా॥ ఎ. వెంకట్రామ శాస్త్రి;
డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 12, p. 449; Vol. 13, pp. 379, 32; Vol. 15, p. 227; Vol. 16, p. 435)

ఆకాంక్షతో పాటు నీలో కొంత చిత్తశుద్ధి, పట్టుదల ఉండాలం టాను. కేవలం ఓ రెండు రోజులు ప్రయత్నించి, వెంటనే ఏదో ప్రళయం వచ్చినట్లు నిరాశ నిస్పృహాలలోకి వెళ్ళవద్దు. ఆ భగవంతుడికి మీకు సహాయం చేసే అవకాశం ఇవ్వండి మరి. ఆయన మీలోకి ఏదన్నా వెలుగురేఖ తేవాలనుకునేంతలోనే దాని మీద నిరాశ అనే నీళ్ళు చల్లకండి. మీకు అది కేవలం ఒక చిన్న కొవ్వొత్తి వెలుగే అనిపించవచ్చు. అంత పెద్ద కాంతిలా అనిపించకపోవచ్చు. కానీ, భగవద్ విషయాలలో, ఈ మానవ శరీరంలోనూ, జీవంలోనూ, ఆలోచనలలోనూ, అలుముకుని వున్న చీకటిని తొలగించడానికి మొదటి మెట్టు ఓ చిరుదీపమే! తరవాత కాస్త పెద్ద వెలుగు. ఆ పైన భానోదయము వస్తాయి. కానీ, ఆ అంకురార్పణ నుంచి క్రమంగా రెండో చరణానికి వెళ్లే అవకాశం ఇవ్వాలంటే, దుఃఖం, అపనమ్మకం, నిరాశలు, అడ్డురాకూడదు.

మొదట్లో చాలా కాలం వరకూ, ఈ యనుభూతులు అప్పుడప్పుడు, చాల అరుదుగా కలుగుతాయి. వాటిని అలాగే అభివృద్ధి అవనిస్తే, ఆ మధ్యలోని కాలవ్యవధులు క్రమంగా తగ్గిపోయి, చివరికి నిరంతర ఆత్మజ్ఞాన ఆనందస్థాయి వస్తుంది. కానీ, మీరసలు ఆ వికాసానికి అవకాశమే ఇవ్వడం లేదు. కాలాన్నంతటినీ అసహనం, నిరాశ, సంశయాలతో నింపితే, ఎప్పటికీ ముందుకి కదిలే అవకాశం లేకుండా, ప్రారంభదశలోనే ఉండిపోతారు.

మీరు వేరే రకాల కష్టాల నెన్నిటినో ఎదుర్కొన్నారు. తిప్పికొట్టారు కూడ. కానీ, ఈ సమస్యని చాలా రోజులు తాత్సారం చేసి బలపరచారు. అందుకే దీనిని దృఢ నిశ్చయంతో నిర్మూలించాలి. యోగసాధనకి పూర్తి సంశయ నివృత్తి అవసరమనను. ఎందుకంటే సంశయం మనస్సు మీద ఎప్పుడూ దాడి చేస్తూనే ఉంటుంది. ఎటొచ్చీ, నా సలహా ఏమిటంటే, సంశయానికి పెద్దపీట వేసి, స్వాగతం పలకొద్దు. మీ హృదయంలోకి

రావాలనుకునే దివ్యకిరణాలని దుఃఖం, నిస్పృహాలతో తిప్పికొట్ట వద్దు!

వాస్తవానికి మీ క్షేమం కోసమైనా, ఈ భూమి క్షేమం కోసమైనా ఇది తప్ప వేరుమార్గం లేదని ఖచ్చితంగా గుర్తించండి. ఎటుచూసినా కనపడేవి భూకంపాలూ, శిధిలమయే నాగరికతలూ, ఎందరో హిట్లర్లూ, అయోమయం, భీభత్సమే. నిజానికి ఈ కష్టాలే మిమ్మల్ని మీ ఏకైక లక్ష్యంకేసి కదలడానికి మీరు ఈ భూమి మీదికి రావడానికిగల ఏకైక కారణం. ఏ దివ్యకార్య ఆచరణలో సహకరించడమైతే వుందో, ఆ పరిస్థితులు మిమ్మల్ని అదే దిశలో ముందుకు సాగడానికి సహకరిస్తాయి.

నిజమే, మీరన్నట్లు – మార్గం క్లిష్టంగా, సుదీర్ఘంగా, పెద్దగా ఏ ప్రోత్సాహం లేకుండానే వుందనుకుందాం. ఐతేనేం? అసలు ఇంత గొప్ప కార్యాన్ని సునాయసంగా సాధించాలనికానీ, విజయం అతి త్వరగా రావలని కాని ఎందుకనుకోవాలి? కష్టాలను ఎదుర్కోవల్సిందే. వాటిని ఎంత ఉత్సాహంగా స్వీకరిస్తే, అంత త్వరగా వాటి నధిగమించవచ్చు. మనకి అనుక్షణం గుర్తుండవలసిందల్లా దృఢనిశ్చయం, 'నేను సాధించాలి, సాధిస్తాను' అనే ధీమా. ఇదే విజయానికి మూలమంత్రం. అసంభవమా? అసంభవమనేదేదీ లేదు – కష్టాలుంటాయి, చీకాకులుంటాయి కానీ అసంభవాలు అసంభవం. ఏదయితే మనం దృఢంగా చేయదలుస్తామో, అది నేడో రేపో, ఏదో నాటికి అయి తీరుతుంది. నిరాశ చీకటి నీడలని, తరిమేసి ధైర్యంగా మీ యోగంలో ముందుకి అడుగు వెయ్యండి. అంధకారం తొలగేకొద్దీ, మీలోని జ్ఞాన ద్వారాలు తెరుచుకుంటాయి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: బి. వరలక్ష్మి

(*SABCL* Vol. 23, pp. 628-29)

'సావిత్రి' ని గురించి శ్రీమాత

Savitri

the supreme revelation of

Sri Aurobindo's vision

*

'సావిత్రి' ఒక అద్భుతమైన భవిష్యద్దర్శనము. భవిష్యత్తులో ఫల సిద్ధికై మానవాళిని బంగారు భవిష్యత్తు వైపు నడిపించగల మహేతిహాసము.

*

కొన్ని సూచనలు

1. రచయితకు కలిగిన ఆధ్యాత్మికానుభూతుల రోజువారీ డైరీ.
2. పూర్ణయోగ సాధన చేద్దామనుకునే వారికి వీలుగా అన్ని వివరాలను తెలియచేసే సంపూర్ణమైన సాధనా విధానము.
3. భగవంతుని దిశగా భూదేవి చేయు మహాప్రస్థానము.
4. మానవ శరీరం ధరించిన దివ్యమాత పృథ్వీలోని అజ్ఞానం, అసత్యాల నెదుర్కొనుటలో సంభవించిన అనుభూతులు.

*

శ్రీఅరవిందుల రచనలు చదివే విధానం ఏమిటంటే మనస్సును సాధ్యమైనంత వరకు నిశ్శబ్దంగా ఉంచి ఏకాగ్రబుద్ధితో ప్రతిసారీ కొంచెం కొంచెమే చదవాలి. చదివిన దాన్ని వెంటనే అర్థం చేసుకోడానికి ప్రయత్నించకుండా *నిశ్శబ్దం పాటించి ఊర్ధ్వోన్ముఖమై జ్ఞానం కోసం ఆకాంక్షించాలి.*

తర్వాత ఒకటి రెండు సంవత్సరాలకు మళ్ళీ చదివినప్పుడు నీకు మొదటిసారి సరిగ్గా బోధపడలేదని తెలుస్తుంది. ఆ తర్వాత సరైన అవగాహన ఏర్పడుతుంది.

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకట్రామ శాస్త్రి

(*CWM* Vol. 13, p. 24; Vol. 16, p. 294; Vol. 12, p. 206)

'సావిత్రి' – మహామంత్రము

శ్రీమాత వివరణ[1]

(అనేక సంవత్సరాల తర్వాత జ్ఞప్తికి తెచ్చుకొని రాసినది)

నువ్వు 'సావిత్రి' గ్రంథమును చదువుతావా?

ఆ! చదువుతాను తల్లీ! చదువుతాను.

మొత్తం కావ్యమంతా చదివినావా?

ఆ! చదివాను తల్లీ! రెండు సార్లు చదివాను

చదివినదంతా నీకు అర్థమైందా?

లేదు! కొంచెమే అర్థమైంది. నాకు కవిత్వమంటే ఇష్టం. అందుకని అది చదువుతాను.

అర్థం కాకపోయినా పరవాలేదు. – *'సావిత్రి'* గ్రంథం సదా చదువుతూ ఉండు; చదివినప్పుడల్లా నీకు ఒక క్రొత్త విషయం గోచరమౌతుంది. ప్రతిమారు ఒక నూతనమైన మెరుపు, ఒక నవ్య అనుభూతి కలుగుతాయి. నీకు ఇంతకు ముందర అర్థం కానివి హఠాత్తుగా స్పష్టమై అక్కడ లేనివి కూడ ప్రత్యక్షమవుతాయి. అందలి మాటలు, పంక్తుల నుండి సర్వదా, ఒక అనుకోని దృశ్యం ఆవిర్భవించి దర్శనమిస్తుంది. నీవు ఎన్ని మారులు చదివి అర్థం చేసికొనుటకు ప్రయత్నిస్తావో, అన్ని మార్లు అందులో దాగియున్న ఒక క్రొత్త విషయం విప్పారి గోచరమై నీ జ్ఞానభాండారానికి చేరుతూ ఉంటుంది. నీవు ఇదివరలో చదివిన పద్యభాగాలే వెనుకటికంటే విభిన్నమైన ఒక నూతన కాంతితో, నీవు తిరిగి చదివనప్పుడల్లా దర్శనమిస్తూ ఉంటాయి. ఇది అనివార్యము – సర్వదా నీ అనుభూతి సుసంపన్నమౌతూ ఉంటుంది. అడుగడుగునా ఒక నూతన దృశ్యం అభివ్యక్తమై దర్శనమిస్తూ

---

[1] శ్రీమాత ఒక శిష్యునికి ఈ విధంగా రాసారు. ... చాలా సంవత్సరాల క్రితం, 18-1-1960 నాడు నేను మోనా సర్కార్‌తో చాలాసేపు 'సావిత్రి' ని గురించి మాట్లాడాను. నేను చెప్పిందంతా అతను ఫ్రెంచిలో రాసుకున్నాడు. ఈ మధ్య నేను దాన్ని చూసాను. మొత్తం మీద అంతా బాగానే వున్నది. 4-12-1967

ఉంటుంది. కాని, నీవు ఈ గ్రంథాన్ని ఇతర పుస్తకాలవలె, వార్తా పత్రికలవలె చదవకూడదు. నీ మస్తిష్కం ఇతర ఆలోచనల వినా, వినిర్మలమై ఖాళీగా ఉండాలి. నీవు ఏకాగ్రచిత్తుడవై, ప్రశాంతో న్ముఖుడవై, నిశ్చలముగా ఉండాలి. అప్పుడు అందలి పదాలు, లయలు, ప్రకంపనలు, నేరుగ నీ మస్తిష్కం లోనికి పోయి, నీ మెదడుపై తమ ముద్ర వేస్తాయి. నీ ప్రయత్నంతో నిమిత్తం లేకుం డానే తమ భావాన్ని నీకు విపులీకరిస్తాయి.

మహోన్నతమైన ఆధ్యాత్మిక శిఖరాలను ఆరోహించటా నికి ఒక్క *'సావిత్రి'* చాలు. *'సావిత్రి'* ని ఎవ్వరైనా ధ్యానపరమైన అధ్యయనం చేయగలిగితే వారు అవసరమైన సహాయాన్నంతా పొందగలుగుతారు. *ఈ మార్గాన్ని (శ్రీఅరవిందుల పూర్ణయోగ మార్గాన్ని) అనుసరించ దలచినవారికి ఇది ఒక సుస్థిరమైన సహాయాన్ని అందిస్తుంది. అట్టివారిని, శ్రీఅరవిందులే చేయి పట్టు కొని, చేరవలసిన పరమ పదానికి నడిపించుకొని పోతారు.* అప్పుడు ఎంత కష్టమైన సమస్యకైనా సమాధానమూ దొరుకు తుంది, ప్రతి క్లిష్ట పరిస్థితికీ పరిష్కారమూ లభిస్తుంది. నిజానికి యోగాభ్యాసానికి అవసరమైన సర్వవిషయాలు దీనిలో ఉన్నాయి.

ఈ గ్రంథంలో శ్రీఅరవిందులు విశ్వాన్నంతా ఇమిడ్చి నిబం ధించారు. ఇది ఒక అద్భుతమైన గ్రంథము. దేదీప్యమానమై అపు రూప, అసమానమైన పరిపూర్ణతతో విరాజిల్లుతున్న గ్రంథమిది.

నీకు తెలుసా! *'సావిత్రి'* ప్రారంభించటానికి ముందర శ్రీఅరవిందులు నాతో ఇలా అన్నారు.

"ఇంతవరకు ఎవరూ కనీ వినీ ఎరుగని ఓ మహాగ్రంథం నా ద్వారా ఆవిష్కారము కానున్నది. మొదట సంశయించాను. కాని, ఇప్పుడు నేను నిశ్చయించుకొన్నాను. మరి ఎంతవరకు విజయం సాధించగలనో తెలియదు. కానీ భగవదనుగ్రహం కోసం ప్రార్థిస్తున్నాను."

దీని అర్థమేమిటో తెలుసా!

నిన్ను ముందరే హెచ్చరిస్తున్నాను. అది ఆయన మాట తీరు, దివ్యనమ్రతతో కూడిన ఉదాసీనత. ఆయన ఎన్నడూ అహంకారంతో నొక్కి వక్కాణించరు.

ఆయన ఈ గ్రంథరచనకు వాస్తవంగా ప్రారంభించిన రోజున నాతో ఇలా అన్నారు.

"అంతులేని అనంతత్వం లోనికి, చుక్కాని లేని పడవపై ప్రయాణం చేయటానికి ప్రారంభించాను."

ఆరంభించిన తరువాత, ఆపకుండ పేజీల తరబడి వ్రాశారు. అదంతా, ఉన్నత భూమికలలో ఇదివరకే పూర్తిగా రూపుదాల్చి ఉన్నదానిని ఒక వ్రాయసగాడు వలె వ్రాయటం మాత్రమే వారి పని అన్నట్లు రచన సాగిపోయింది.

నిజానికి, 'సావిత్రి' కావ్యం మొత్తం ఉన్నత సీమలనుండి, ఒక్కమారు మూకుమ్మడిగ అవతరించగా, శ్రీఅరవిందులు తన ప్రజ్ఞాప్రాభవాలతో ఆ కవితాపంక్తులను ఒక క్రమంలో కూర్చి, ఒక మహోన్నత, అద్భుతశైలిలో రూపొందించారు. కొన్ని సమయాలలో వందలాది పంక్తులు, అంతఃస్ఫురణతో దొర్లి రాగా, శ్రీఅరవిందులు వాటిని అటులనే ఉంచారు. కవిత్వం (కవితావేశము) ఉన్నత సీమలనుండి ప్రేరేపింపబడుటకు ఆయన నిర్విరామమైన కృషి చేసి చాలా శ్రమపడ్డారు. ఏమి వైభవోపేతమైన గ్రంథరాజాన్ని సృష్టించారు! ఔను! అది ఒక వాస్తవమైన సృష్టియే. దానితో సమానమైన మరియొక గ్రంథం లేనే లేదు. సర్వం దానియందున్నది; అయినా, దాని స్వరూపం అతి విస్పష్టత, చక్కని నిర్మలత్వాలతో తేటతెల్లమై దొర్లుచు, శాశ్వత సత్యాన్ని వహించి ఉన్నాయి.

బిడ్డా! నేను అనేక గ్రంథాలను చదివాను; కాని, 'సావిత్రి' గ్రంథంతో సమానమైనది నాకు తటస్థపడలేదు. నేను గ్రీక్, లాటిన్, ఇంగ్లీషు భాషలలో శ్రేష్ఠమైన గ్రంథరాజాలను అధ్యయనం చేశాను; అట్లే, ఫ్రెంచి, జర్మన్, వాఙ్మయాలలోని పేరెన్నికగన్న పుస్తకాలను పఠించాను. అంతేకాదు, ప్రాక్పశ్చిమదేశాలలోని గొప్ప పౌరాణిక గ్రంథాలను చదివాను; కాని నేను తిరిగి ఉగ్గడిస్తు

న్నాను. *'సావిత్రి'* గ్రంథంతో సమానమైన ఉద్గ్రంథం నాకు కన పడలేదు. సాహిత్యగ్రంథాలన్నియు, వట్టి పేలవంగా తత్వసారం లేని రసహీనమైన చప్పని రచనలుగా నాకు కనిపించాయి. అసాధారణమైన, అరుదైన కొద్ది పుస్తకాలు తప్ప, అవి కూడ *'సావిత్రి'* లోని అల్పమైన అంశంగానే తోచును. ఏమి వైభవము! ఏమి వైశాల్యము (విస్తరణ)! ఏమి వాస్తవికత! ఆయన సృష్టిం చింది ఒక శాశ్వతమైన అమృత గుళిక. తిరిగి ఉద్ఘాటిస్తున్నాను. ఈ ప్రపంచం మొత్తంలో దానితో సమానమైనది లేదు. అందలి సాక్షాత్కార సంబంధమైన యథార్థ తత్త్వదర్శనములను ప్రక్కన పెట్టినా, అందలి సారభూతమైన, భావావేశప్రేరణను, కవిత్వపం క్తులను మాత్రమే గమనించినను, దాని విశిష్టత శ్రేష్ఠమైన ప్రాచీన సాంప్రదాయకమైన కోవకు చెంది ఉంది. ఆయన సృష్టి మాన వుని ఊహ కందదు; అతని కర్థం కాదు. ఏలన, అందు ప్రతి పర్వంలోను నిశ్శేషమైన సర్వం ఇమిడి ఉంది.

'సావిత్రి' గ్రంథం ఒక భగవదావిష్కరణం, ఒక దివ్య ధ్యానం, అనంతం, శాశ్వతమైన పరాత్పర తత్త్వాన్వేషణమని భావించవచ్చును. అమృతత్వానికై చేసే ఆకాంక్ష దృష్టితో, దానిని పఠించినట్లైతే, ఆ పఠనమే అమృతత్వాన్ని అందించే మార్గదర్శి కాగలదు. ***'సావిత్రి' గ్రంథపఠనమే యోగాభ్యాసం; ఆధ్యాత్మిక తపస్సు; భగవత్సాక్షాత్కారానికి అవసరమైనవన్ని అందు లభ్యం కాగలవు.*** యోగంలోగల మెట్లన్నీ (దశలన్నీ) అందు సూచించబడ్డాయి; ఇతర యోగాలలోని రహస్యాలు కూడ అందు వివరించబడ్డాయి. ఆ గ్రంథంలోని ప్రతి పంక్తిలోను వివరింప బడిన విషయాన్ని, అతిశ్రద్ధతో అనుసరిస్తే, తప్పక అతడు చివ రకు అతిమానస యోగంలోని రూపాంతరీకరణ సిద్ధిని పొంద గలుగుతాడు. అది, నిజానికి ఒక అమోఘమైన మార్గదర్శి; అది నిన్ను మధ్యలో వదలివేయదు. అందలి మార్గాన్ని అనుసరించిన వాళ్లకు అది సర్వదా సహకరిస్తుంది.

'సావిత్రి' లోని ప్రతి పద్యం ఆవిష్కరింపబడిన మంత్రమే. అది మానవుడు సాధించిన సర్వజ్ఞానాన్ని అతిక్రమించి ఉన్నది.

నేను తిరిగి చెపుతున్నాను. దానిలోని పదాల కూర్పు లయబద్ధ మైన స్వరధ్వనితో నిండి శబ్దము యొక్క మూలస్థానమైన ఓం కారం వద్దకు నిన్ను తీసుకొనిపోవును.

నా బిడ్డా! ఔను, సర్వం అందున్నది. రహస్యవిద్యా తత్త్వం, గూఢ విద్య, తత్త్వశాస్త్రం, పరిణామసిద్ధాంత చరిత్ర, మానవజాతి చరిత్ర, దేవతల చరిత్ర, సృష్టిక్రమం, ప్రకృతి స్వరూపం, ఒకటేమిటి, అన్నీ అందులో ఉన్నాయి. ఈ విశ్వం ఎట్లు సృష్టింపబడింది? ఎందుకు సృష్టింపబడింది? దీని పర మార్థం ఏమిటి? విధి విధానం ఎలాంటిది? ఈ విషయాలన్నీ దానిలో ఉన్నాయి. నీకు స్ఫురించే ప్రశ్నలన్నిటికి అందులో సమాధానం దొరుకుతుంది. సర్వం విశదీకరింపబడింది. మాన వుని భవిష్యత్తు, పరిణామ భవిష్యత్తులు కూడా. అంతే కాదు, ఇంతవరకు ఎవరికీ తెలియని విషయములు దానిలో వివరింప బడినాయి. ఈ ప్రపంచ రహస్యాన్ని తెలిసికొనగోరే ఆధ్యాత్మిక జిజ్ఞాసువులు అతి తేలికగా అవగాహన చేసికొనగల, అందమైన భాషలో సుస్పష్టంగా వర్ణింపబడింది. కాని, ఆ రహస్యము పద ములు, పంక్తుల వెనుక (నేర్పుగ) నిక్షిప్తం చేయబడింది. దానిని కనుగొనదలచిన వ్యక్తి వాస్తవమైన స్థాయిని అందుకొన్న చైతన్యం (జ్ఞానం) కలిగి వుండాలి. ఆ గ్రంథంలో భవిష్యత్తులోని విషయాలను, రాబోవు కాలంలోని పోకడలు అద్భుతమైన విస్ప ష్టతతో ప్రకటించబడినవి.

సత్యాన్వేషణకు చైతన్యాన్ని కనుగొనటానికి, ఈ ప్రపం చంలోని సమస్యలను పరిష్కరించటానికి అవసరమయ్యే జ్ఞానాన్ని ఆ గ్రంథంలో సూచించారు. అజ్ఞానంనుంచి విముక్తిపొంది, ఉన్నత భూమికలలోకి పోయే మార్గాన్ని నిరూపించారు. ప్రతి చైతన్య భూమికను ఎలా ఆరోహించాలో, ఎలా మృత్యువుయొక్క అవ రోధాన్ని అధిగమించాలో వివరించారు. ప్రతి స్థితిని ఎలా చేరాలో, అమృతత్వాన్ని ఎలా సాధించాలో ఆ విధానాలను అన్నిటిని విపులంగా తెలియజేశారు. ఆ (యోగ) ప్రయాణాన్ని అంత విస్ప ష్టంగా వర్ణించారు. నీవు తెలుసుకొనగలుగుతావు. 'సావిత్రి'

గ్రంథపఠనమే ఒక వాస్తవమైన అనుభూతి. మానవుడు సంపాదించిన రహస్యాలను అన్నిటిని ఆయన ఆవిష్కరించారు. ఇవన్నీ 'సావిత్రి' గ్రంథంయొక్క లోతులలో కలవు. కాని, వాటిని – అనగా, చైతన్యభూమికా అనుభూతిని, అతిమానసానుభూతిని మృత్యుతరణ (మృత్యుంజయ) అనుభూతిని తెలుసుకొనటానికి నీకు తగినంత జ్ఞానం ఉండాలి. పూర్ణయోగంలో సమగ్రమైన ప్రగతిని సాధించటానికి అవసరమైన అన్ని దశలను, ప్రతి మెట్టును ఆయన నిరూపించి వర్ణించారు.

ఇదంతా ఆయన స్వయంగా అనుభవించినదే. అంతకంటె ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఇదంతా నేను స్వయంగా అనుభవించింది కూడ. ఆయన నా సాధననే అందు ప్రకటించారు. ఆయన ప్రదర్శించిన ప్రతి వస్తువు ప్రతి సంఘటన, ప్రతి సాక్షాత్కారం ఆయన చేసిన వర్ణనలు, దానిలో పేర్కొనబడిన రంగులతో సహా నేను చూసినవి. ఆయన ప్రయోగించిన పదాలు, వాక్యాలు అన్నీ సరిగ్గా నేను విన్నవే. ఇదంతా నేను ఆ పుస్తకం చూడకముందే సంభవించినవి. తరువాత నేను 'సావిత్రి' గ్రంథాన్ని అనేక పర్యాయాలు చదివాను. కాని ఇతః పూర్వం ఆ గ్రంథరచన చేస్తున్నప్పుడు ఆయన నాకు చదివి వినిపిస్తూ ఉండేవారు. నాకు వింతగా కనిపించిందేమంటే ఆయన ఉదయం చదివి వినిపించిన విషయములే నాకు గతరాత్రి సంభవించిన విషయాలవటం. మాటలు కూడ అవే. ఔను, వర్ణనలు, రంగులు, చిత్రాలు నేను చూచినవే, మాటలు నేను విన్నవే, అన్నీ నేను విన్నవే. శ్రీఅరవిందులు అద్భుతమైన రసవంతమైన కవితలో రచించారు. నేను గత రాత్రి ఏమి అనుభవించానో, అవే ఆయన మరుసటి ఉదయం నాకు చదివి వినిపించేవారు. అది ఒక రోజు మాత్రమే కాదు, యథాలాపంగా జరిగింది కాదు. రోజుల తరబడి అట్లు జరిగింది. ఆయన చెప్పిన విషయాలన్నీ నాకు గత రాత్రి కలిగిన అనుభూతులతో పోల్చి చూచుకొనేదానిని, అవి సరిగా సరిపోతూ ఉండేవి. నా అనుభూతులు ఆయనకు చెప్పిన తరువాత ఆయన కవిత్వంలో నిబంధించటం కాదు. నేను దర్శిం

చినదంతా ఆయనకు ఇదివరకే తెలిసి ఉన్నదే. నా అనుభూతులను విస్తృతంగా ఆయన ప్రకటించారు. అవి ఆయన అనుభవాలు కూడ. అది మేమిద్దరం కలిసి అతిమానసంలోకి చేసిన సాహసప్రయణ గాథ.

ఈ విషయాలు శ్రీఅరవిందులు అనుభవించిన వాస్తవాలు, విశ్వాతీత సత్యాలు. సాధారణ మానవుడు కష్టసుఖాలను అనుభవించినట్లుగా, ఆయన ప్రత్యక్షంగా అనుభవించారు. నిశ్చేతన తమోమయ అంధకారాలలో, మృత్యువు పొలిమేరలలో గూడ, శ్రీఅరవిందులు సంచరించారు. ప్రాపంచిక దుఃఖాలనే బురదలో నుండి విముక్తమై, విశాల ఆధ్యాత్మిక సామ్రాజ్య సరిహద్దులలో వాయువును పీలుస్తూ, పరమానంద సీమలో ప్రవేశించారు. ఆయన లోకాలన్నింటి గుండా ప్రయాణం చేస్తూ వాటి పరిస్థితులను, పర్యవసానములను అనుభవిస్తూ, ఊహకు మించిన బాధలను సహనంతో అనుభవించారు. ఆయనవలె అనేక కష్టాలను అనుభవించిన వ్యక్తి ఇంతవరకు ఎవరును లేరని చెప్పవచ్చును. పరాత్పరుడితో ఐక్యం చెందటం వలన కలిగే ఆనందముగ దుఃఖాన్ని రూపాంతరీకరించటానికి ఆయన వాటిని (దుఃఖాలను) అనుభవించి రుచి చూచారు. అది ప్రపంచచరిత్రలోనే విశిష్టమైన, అసమానమైన ఒక సంఘటన. ఇదివరలో ఇట్టి సంఘటన – అనగా అతిమానస భూమికలోనికి మనం నిశ్చయజ్ఞానంతో ధైర్యముగ ఆరోహించగలగటానికి, అపరిచితసీమలలో మార్గాలను మొట్ట మొదటగా శ్రీఅరవిందులు తయారుచేసారు. మన సాధన సునాయసంగా ఉండేటట్లు చేసారు. *'సావిత్రి'* గ్రంథం ఆయన రూపాంతరీకరణ యోగాన్ని సంపూర్ణంగా వివరించే మహాకావ్యం. ఈ పూర్ణయోగం ప్రప్రథమంగా భౌతికచైతన్యంలో ప్రతిష్ఠించి ప్రదర్శించటం ఇదే మొదటిసారి.

కాని, మానవుడు దీనిని అర్థం చేసికొని గ్రహించటానికి ఇంకా సిద్ధంగా లేడు. అది అతి ఉన్నతం, అతివిశాలమై అతనికి అందుబాటులో లేదు. *'సావిత్రి'* గ్రంథం బుద్ధితో అర్థం చేసుకొనటం అసాధ్యం. కనుక మానవుడు దానిని తెలుసుకొనటం

గాని గ్రహించటంగాని సులభసాధ్యం కాదు. ఆ గ్రంథాన్ని అర్థం చేసుకొని, జీర్ణించుకొనడానికి, ఆధ్యాత్మిక అనుభూతులు అవసరం. యోగసాధనలో ముందుకు సాగి గొప్ప ప్రగతి సాధించినవాడే దానిని చక్కగ జీర్ణించుకొనగలుగుతాడు. కాదు! ఆ గ్రంథంలోని కవిత్వం, ఆయన రచించిన 'భవిష్యత్ కవిత' (Future Poetry) ఉటంకించిన కవితాశైలిలో రచింపబడింది. అందుచేత అది భవిష్యత్కాలానికి చెందిన గ్రంథం. ఆ కవితాశైలి అతి సూక్ష్మం, అతి సున్నితం. అది మనస్సుతోగాని, మనస్సు ద్వారా గాని రచించబడలేదు. అది ఒకానొక ధ్యానసమాధిలో ఆవిష్కరించబడింది.

కొందరు విద్వాంసులు, దానిని 'హోమర్', 'వర్జిల్' కవుల గ్రంథాలతో పోల్చి వాటికంటె క్రింది శ్రేణిలోనిదని చెప్పటానికి సాహసిస్తున్నారు. వారికి అది అర్థం కాలేదు. అర్థం కాదు. వారికి ఏమి తెలుసు? ఏమీ తెలియదు. వారికి దానిని బోధించుట వృథా ప్రయాస, సుదూర భవిష్యత్తులోనే మానవుడు దానిని అర్థం చేసుకొనగలడు. నేను చెప్పుతున్నాను. విను; ముల్లోకాలలో 'సావిత్రి' గ్రంథంతో సమానమైన గ్రంథం వేరొకటి లేదు. అది గూఢాతిగూఢమైన గ్రంథము. అది 'పరమోత్కృష్టమైన పురాణము', పరమ శ్రేష్టమైన సాహిత్యము, అత్యుత్తమమైన కవిత్వము. మహోన్నతమైన దర్శనము, గ్రంథవిస్తారాన్ని అనగా అందలి పంక్తుల సంఖ్యను బట్టి కూడ అది ఒక గొప్ప గ్రంథం. మానవుడు మాట్లాడే మాటలు దానిని ('సావిత్రి' గ్రంథాన్ని) వర్ణించలేవు. దానిని వర్ణించటానికి, ఉత్తమోత్తమం (Superlative and Hyperbole) వంటి పదాలు కావలెను. అది ఒక పరమోత్కృష్టమైన బృహత్పురాణము. మానవుని మాటలు దానిని లేశమాత్రమైనా వర్ణించలేవు. దాని విలువ అపారము. ఆధ్యాత్మిక విలువలు తదితర విలువలు అన్నీ దానిలో ఉన్నాయి. అందలి విషయం శాశ్వతమైనది. అది చేసే ప్రబోధం అనంతము. దాని క్రియావిధానాలు అద్భుతాలు. నీవు ఆ గ్రంథానికి ఎంత సన్నిహితం కాగలిగిన, ఎంత చక్కగా అధ్యయనం చేయగలిగిన అది నిన్ను అంత

ఉన్నతంగా ఉద్ధరించగలుగుతుంది. అది అనిర్వచనీయమైన ఒక అద్భుతం; పరమ పవిత్రము; శ్రీఅరవిందులు మానవజాతికి అంకితం చేసిన అతిసుందరమైన గ్రంథరాజం; పరమశ్రేష్ఠమైనది. అదేమిటో మానవుడెప్పుడు తెలుసుకోగలడు? మానవుడు సత్య జీవితాన్ని ఎప్పుడు ఆచరించగలడు? తన జీవితంలో ఈ గ్రంథాన్ని ఎప్పుడు జీర్ణించుకోగలడు? ఇదంతా ముందు కాలంలో గమనిం చవలసి ఉంది.

బిడ్డా! *'సావిత్రి'* గ్రంథం ప్రతిరోజు పఠించాలి. సక్రమ పద్ధతిలో చదవాలి; సరైన దృష్టితో చదవాలి. అది తెరచి, చదవ డానికి ముందు మనస్సును అతినిర్మలంగా చేసుకోవాలి. ఏ ఆలోచనలు లేకుండా చేసి, ధ్యానముద్ర వేస్తే మరీ మంచిది. దానిని చేరటానికి రాచబాట హృదయమే. నేను చెపుతున్నా విను. నీవు వాస్తవమైన ఆకాంక్షతో ఏకాగ్రతలో ఉండగలిగితే, నీలోని జ్యోతిని, నీ అంతరాత్మజ్యోతిని, పరిశుద్ధ పవిత్రజ్యోతిని అతిస్వల్పకాలంలో వెలిగించుకోగలవు. బహుశః కొద్ది రోజుల లోనే చేయగలవు. సాధారణంగా నీవు చేయలేని పనులన్నీ *'సావిత్రి'* సహాయంతో చేయగలవు. ప్రయత్నించు; దాని విశి ష్టత, నవ్యత నీకే తెలియగలదు. ఈ దృష్టితో ఈ విధమైన పూర్వరంగం గల చైతన్యంలో శ్రీఅరవిందులకు నీవు చేసే అర్పణగా పఠనం చేయాలి. *'సావిత్రి'* గ్రంథం ఒక చైతన్యగర్భిత మూర్తిగా నీవు గ్రహించగలవు. నేను తిరిగి చెపుతున్నాను. యోగాభ్యాసం చేయటం అవసరమని తలచి, నిజాయితీతో కోరు కొనేవాళ్ళు *'సావిత్రి'* సహాయంతో ఉన్నతమైన యోగశిఖరాలను ఆరోహించగలరు. *వాళ్లు 'సావిత్రి' మహాకావ్యంలోని రహస్యాన్ని గ్రహించగలరు. గురువు అవసరం లేకుండానే తెలుసుకోగలరు.* సాధకుడు దానిని ఎక్కడైనా అభ్యసించగలడు. అతనికి అవసర మైన విషయాలన్నీ *'సావిత్రి'* గ్రంథంలో కనుగొనగలడు. అదే అతనికి మార్గదర్శి. అతనికి కష్టాలు దాపురించినప్పుడుగాని, ప్రగతి సాధించటంలో ఎటు వెళ్లవలెనో తెలియనప్పుడు, అవరో ధాలను అధిగమించవలసి వచ్చినప్పుడు ఇవి సాధారణంగా ప్రతి

క్షణం ప్రతి మానవుడికి ఎదురయ్యే క్లిష్టపరిస్థితులు – *అతడు ప్రశాంతచిత్తంతో నిశ్చలంగా ఉన్నచో అవసరమైన సూచనలు, సుస్థిరసహాయాలు అందగలవు.* అతడు ప్రశాంతంగా ఉండి భగవంతుడికి ఉన్ముఖుడై చిత్తశుద్ధి కలిగి ఉంటే, చేయి పట్టుకొని నడిపింపబడుతున్నట్లు సర్వదా అనుభూతి పొందుతాడు. అతడు విశ్వాసంతో చిత్తశుద్ధితో ఆత్మార్పణ చేసుకొనగలిగితే జీవితపరమార్థాన్ని (యోగం యొక్క పరమ లక్ష్యాన్ని) చేరగలడు.

నిజంగా '*సావిత్రి*' ఓ గొప్ప మూర్తి, ఓ దేవత – సజీవ గ్రంథము. అది చిచ్ఛక్తి గుంభితమై ఉంది. అది మతాలకు, తత్త్వశాస్త్రాలకు అతీతమైన పరమోన్నత జ్ఞానంతో నిండి వుంది. అదే ఆధ్యాత్మిక పథం, యోగం, తపస్సు, సాధన, సర్వం అదే. అది ఏకరూపంగా విరాజిల్లుతున్నది. '*సావిత్రి*' లో అమోఘమైన శక్తి ఉంది. అందుకొనే సామర్థ్యం గలవాళ్లకి అది జ్ఞానకిరణాలను విరజిమ్ముతుంది. అవి ప్రతి చైతన్యభూమిక నుండి బయలుదేరే వాస్తవమైన కంపనలు. అది ('*సావిత్రి*' గ్రంథం) నిరుపమానమైనది. సర్వైశ్వర్య సంపన్నమైన సత్యం. శ్రీఅరవిందులు దానిని ఈ భూలోకంలోకి తీసుకొనివచ్చారు. బిడ్డా! '*సావిత్రి*' రహస్యాన్ని కనుగొనటానికి ప్రయత్నించు; భవిష్యత్తును ఉద్దేశించి, శ్రీఅరవిందులు ఇచ్చిన సందేశం మన కోసం దానిలో ఆవిష్కరించబడింది. నీవు ఆచరించవలసిన పని, నీ ముందున్న కరవ్యము ఇదే. ఇది కష్టసాధ్యమైనప్పటికీ, ఆచరణయోగ్యమైనది.

5-11-1967

ఆశీస్సులు
శ్రీమాత
అనువాదం: మానాప్రగడ శ్రీరాములు
(రాబోవు ప్రచురణ నుండి)

'సావిత్రి' ని గురించి శ్రీఅరవిందులు

(కొన్ని వివరణలు)

మహోన్నతస్థాయికి ఆరోహణా పరికరంగా 'సావిత్రి' ని నేను ఉపయోగించాను. నేను 'సావిత్రి' ని ఒకానొక మానసిక స్థాయిలో ప్రారంభించాను. అక్కణ్ణించి మహోన్నత చేతనాస్థాయికి ఒక్కొక్క మెట్టే ఎక్కుతున్న కొద్దీ ఆ స్థాయిలోంచి మళ్లీ తిరిగి రాస్తూ వచ్చాను. అంతేకాదు. ఎక్కడైనా ఒక భాగం దిగువస్థాయిలోది అని అనిపిస్తే చాలు. అది మంచి కవిత్వమైనా సరే దాన్ని మార్చి తీరాల్సిందే! సాధ్యమైనంత వరకు అంతా మేలిమి బంగారం తప్ప కల్తీ పనికిరాదు. 'సావిత్రి' ని ఎలాగో అలా పూర్తి చెయ్యాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. వ్యక్తి యోగచైతన్య స్థాయిలో కవిత్వం రాయడానికి అవకాశం ఉందా? ఉంటే దాన్ని సృజనాత్మకంగా రూపొందించడం ఎలా? ఈ విషయాలను పరిశీలించే ప్రయోగాత్మక క్షేత్రంగా నేను 'సావిత్రి' ని భావించాను.

*

కావ్యం పేరును బట్టి 'సావిత్రి' మొత్తం అంతా ఒక పురాణగాథ, ఒక ప్రతీక. కావ్యం తొలి అధ్యాయం కీలకమైన నాందీవాచకం, సూత్రధారి చేసే ఒక ప్రకటన అన మాట. కాబట్టి ఇందులో ఉబుసుపోక కబుర్లు గాని, ప్రయోజనరహితమైనవి గాని ఉండవని నిశ్చయించుకోవాలి. ప్రతీదీ అవసరమైనదే. కాబట్టి ఈ కావ్యం అన్యాపదేశంగ అందించే సందేశం ఏమిటో గ్రహించి దాన్ని పూర్తిగా అవగాహన చేసుకోగలగడానికి సంపూర్ణ శ్రద్ధతో ప్రారంభించండి. ఏమి రాశారు? కావ్యం పరమార్థం ఏమిటి? అనేవి తెలుసుకోవడం, ఆపైన విషయం పట్ల శ్రద్ధ ఉండడం – ఈ కావ్య పఠనానికి తప్పనిసరి. అవి లేకుండా చదివేవారికి 'ఇంత పెద్ద పద్యమేమిట్రా బాబు' అని అనిపించవచ్చు.

కేవలం అందమైన పద చిత్రాలల్లటం కాదు నాకు కావలసింది. నాకు మరీ ముఖ్యవిషయం ఏమిటంటే – సమస్త సృష్టికి ఆధారభూతమైన అచేతనశక్తి లోని శాశ్వత భావనల సర్వస్వాన్ని

అనుభూతి చెంది, అందులోని పరమ సత్యాన్ని పూర్తిగా గ్రహించేందుకు పాఠకుణ్ణి సమాయత్తం చేయడమే నా ప్రధాన ధ్యేయం. ఇది ఒక నేపథ్యం వంటిది. వివిధ విషయాలను సమకూర్చి చక్కగా పేర్చిన చట్రం వంటిది. ఇది లేకపోతే ఈ వివరాలన్నీ కేవలం సంబంధం లేనివిగా సంఘటనలు చెదిరిపోయో, లేకపోతే దూరదూరంగా విడిపోయో ఉండిపోతాయి. కాబట్టి పూర్తి జ్ఞానోదయం అయ్యేవరకు అటువంటి అవసరం ఉంటుంది. ఆ తరువాత అదే అదృశ్యమౌతుంది. ప్రతీ పదబంధమూ దాని సందర్భానికి, స్థానానికి చెందిన అంతరార్థాన్ని సరిగ్గా అందిస్తుంది.

*

'సావిత్రి' లో నేనెక్కడా కేవలం వర్ణన కోసమో లేదా అలంకారికమైన భాషా భేషజం కోసమో రాయలేదు. నేను దర్శించిన దానిని, అనుభూతి చెందిన దానిని మాత్రమే పద్యంలో స్పష్టంగా ఆవిష్కరించడానికి సదా ప్రయత్నించాను. ఒకవేళ ఎక్కడైనా నేను భాషాసంపదతో బరువైన పదాలు గుప్పించి ఉంటే అది నేను కేవలం సరదా పడి చేసింది కాదు. చెప్పే విషయంలో సహజంగానే ఆ బరువు ఉందన్న మాట. పోనీ ఉందని అనుకున్నానన్న మాట. నా ఆలోచన, నా దృక్పథాన్ని బట్టి అలా అనిపించి ఉండవచ్చు కదా! ఒక భావం ఆవిష్కారం అయినప్పుడు దానిని నేను బాగా పరిశీలన చేస్తాను. అంటే మేధోసంబంధంగానో, ఛందోపరంగానో ఆ పరిశీలన ఉండదు. నా అంతరాత్మ ప్రేరణను బట్టి పరిశీలిస్తాను. క్షుణ్ణంగా పరిశీలన చేసిన తరువాతనే నిర్ణయం తీసుకుంటాను. ఆ భావం వ్యక్తీకరణ సరిగ్గా ఉందా లేదా అని బేరీజు వేసుకుంటాను. ఒకవేళ సరిగ్గా లేదనిపిస్తే సరియైన స్పందన పూర్తిగా వచ్చి, దానిని సమర్థవంతంగా అక్షరబద్ధం చేసేటంత వరకు అలా దానిని మారుస్తూనే ఉంటాను. అంతేగాని పదాల పొందిక బాగుందనో, పద్యం నడక బాగుందనో సమాధానపడను. ఒక ప్రమాణం వచ్చే వరకు అలా తిరిగి రాస్తూనే ఉంటాను – ఇదీ నా సాధన పద్ధతి. అసాధారణమైన అనుభవంతో నేను దర్శించిన దానికి అక్షరరూపమే 'సావిత్రి'

సామాన్యుల మనోభావ చిత్రణకు దీనికి చాలా తేడా ఉంటుంది. ఆ అనుభవాలు వేరు; నా అనుభవాలు వేరు. సామాన్య పాఠకులు 'సావిత్రి' ని అర్థం చేసుకోగలరని, భావాన్ని ఒంట బట్టించుకోగలరని భావించడానికి వీలు లేదు. వారే కాదు; కొంత పరిజ్ఞానం ఉన్నవారు సైతం తొలిపఠనంలోనే దీనిని జీర్ణించుకోగలరని కూడా భావించకూడదు.

సావిత్రిని ఇదివరకు పఠించి ఒక రకమైన అనుభవాన్ని సంతరించుకున్నవారూ, లేనివారూ కూడా 'సావిత్రి' ని అవగాహన చేసుకోవడానికి సన్నద్ధం కావాలి. వారి మానసిక చైతన్యాన్ని బట్టీ, వారికిగల మేధోసంపదను బట్టీ, లేదా అంటే వారి మానసిక శిక్షణబట్టి వారంతట వారే స్వతహాగా కృషి చేస్తే కొంతవరకైనా భావాన్ని గ్రహించ గలుగుతారు. పద్యం పరమార్థాన్ని పూర్తిగా అవగాహన చేసుకోలేకపోయినా ఆ కవిత సృష్టించే చైతన్యారామం లోకి ప్రవేశించి స్పందించగలుగుతారు. కవితార్థాన్ని పసిగట్ట గలుగుతారు. ఇవేవీ లేకుండా ఏ రకంగాను సంసిద్ధంగా లేని పాఠకుడు స్పందించడం కష్టం. మొత్తం మీద అందరూ అనుకుంటున్నట్టుగానే ఇది ఒక నూతన రీతిలో వినూతన భావావిష్కరణ శైలిలో ఒక సరికొత్త కావ్యం.

సావిత్రీ సత్యవంతుల కథలోని ప్రతీకలు

సావిత్రీ సత్యవంతుల గాథను మహాభారతంలో మృత్యువును జయించిన ఓ పాతివ్రత్య వృత్తాంతంగా చిత్రీకరించారు. అయితే ఇందులో మానవగాథకు చెందిన వివిధ లక్షణాలు చూపడాన్ని బట్టి వేదపరిధిలోని అనేకానేక ఊహాత్మక కల్పిత ప్రతీకల్లో ఇది ఒకటి కావచ్చు.

సత్యవంతుడు తనలో దివ్యసత్యాన్ని ధరించిన జీవాత్మయై, మృత్యువు, అజ్ఞానాల చేతుల్లో చిక్కి మర్త్యలోకంలోకి అవరోహణం చెందింది.

'సావిత్రి' ఓ దివ్యమూర్తి. సూర్యుని (సవిత్రుని) కుమార్తెగా, పరమ సత్యదేవతగా క్రిందికి దిగివచ్చింది. వచ్చింది అంటే జారి

పడి రావడం కాదు. అశ్వపతిని రక్షించడం కోసం ఈ లోకంలో ఆయన పుత్రికగా అవతరించింది. సర్వశక్తిని ఆధ్యాత్మిక సాధనలో కేంద్రీకరించి గాఢ తపస్సు చేసి సాధించిన తపోశక్తి ఆయనది. మృత్యువు నుండి అమరత్వ భూమికలకు ఊర్ధ్వగమనం చేయడానికి ఆ శక్తి మనకు ఉపకరిస్తుంది.

సత్యవంతుని తండ్రి ద్యుమత్సేనుడు అంధత్వంలో భూలోకం లోకి పతనమైన దివ్యమనస్సు. దార్శనిక దివ్య సామ్రాజ్యాన్ని, దానితో పాటు ఆ వైభవాన్ని కోల్పోయి అంధునిగా ఈ భూమి మీద పడ్డాడు. అయినప్పటికీ ఇది కేవలం కొన్ని గుణాలకు రూపకల్పన కాదు. ఇందులోని పాత్రలు నిర్దిష్టమైన కొన్ని వ్యక్తిత్వ లక్షణాలకు కేవలం మూర్తరూపాలు కావు. అవతారాలైనా లేక ఈ లోకంలో ఉద్భవించిన సజీవ చైతన్యశక్తులైనా కావచ్చు. వాటితో మనం నిత్య సంబంధాలు కలుపుకోవచ్చు. నాశనం అయ్యే అశాశ్వత స్థితి నుండి దివ్యచైతన్య స్థితిని చేరుకుని శాశ్వత స్థానాన్ని చేరుకునే మార్గాన్ని చూపి మానవులకు సహాయపడ్డం కోసం ఆ దివ్యశక్తులు మానవరూపంలో అవతరిస్తాయి.

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

(*SABCL* Vol. 26, pp. 229, 247-48, 249, 259, 265)

యోగము అభ్యసించ దలచిన వారికి 'సావిత్రి' ప్రత్యక్షంగా దారి చూపిస్తుంది. శ్రీఅరవిందులే నిన్ను చెయ్యి పట్టుకొని నడిపించి గమ్యానికి చేరుస్తారు. అది అన్ని ప్రశ్నలకు సమాధానము. అన్ని సమస్యలకు పరిష్కారము, యోగములో ఎదురయ్యే అవరోధాలన్నిటిని అధిగమించే మార్గం చూపించే సంజీవిని.

శ్రీమాత

'సావిత్రి' లోని కొన్ని దీపికలు

ముసుకు కప్పుకొన్న మహాచైతన్యం తన సింహాసన మధిష్ఠించింది.
అంధకారం చిక్కపడి అతని కంఠధఘ్నమై ఊపిరాడనివ్వనప్పుడు
మనిషి భౌతిక మనస్సే దీపమైనప్పుడు,
చీకటి రాత్రిలో దొంగ కాలిసవ్వడి లేకుండా
ఇంట్లో ప్రవేశించినట్లు,
ఒక గొంతు అస్పష్టంగా విన్పిస్తుంది, జీవాత్మ తల ఊపుతుంది,
ఒక శక్తి మనోమందిరంలో ఆవహించింది,
ఒక అందం, ఒక మాధుర్యం జీవిత రహస్యద్వారాలు తీసింది.
అందం, అడ్డగిస్తున్న విశ్వాన్ని ఆక్రమించి,
సత్యజ్యోతిస్సు ప్రకృతిని ఆశ్చర్యంగా బందీని చేస్తుంది.
దైవం నిగూఢంగా హృదయంలో ఆనందమై తరంగిస్తుంది.
భూమండలమంతా హఠాత్తుగా దివ్యమైపోతుంది.
పదార్థం సహితం దివ్యకాంతు లీనుతుంది.
ప్రతి దేహంలోను పరంజ్యోతి ప్రకాశిస్తుంది.
నిశారాత్రులు నక్షత్రాల దివ్యసంగీతంతో మేల్కొంటాయి
పగళ్ళు భక్తి పారవశ్యతో గిరి ప్రదక్షిణం చేస్తాయి,
మన సంకల్పం పరమాత్మని శస్త్రం,
ఆలోచనలన్నీ ఆత్మభాస్కర కిరణాలు.

A few shall see what none yet understands;
God shall grow up while the wise men talk and sleep;
For man shall not know the coming till its hour
And belief shall be not till the work is done.

*

జీవాత్మా! నీ కింకా ఆనందప్రభాతం కాలేదు.
నీవు అనంతశాంతాత్మ గుమ్మంలో అడుగు పెట్టావు,
నీవు దివ్యానందం లోతుల్లోకి దూకావు
కానీ, నీ ఆత్మశక్తినీ, ఉద్యమాన్ని గాలికి వదిలివేసావు కదా!
ఆత్మపథంలో విచీకటి లోయల్లో విసరివేసావు?

నీలో నున్న ఆ ఏకతత్త్వమే ప్రభువూ, విశ్వమూ,
తదాత్మ సంకల్పాన్ని చుక్కల వీధిలో పారవేసావు;
తప్పించుకుపోతున్నావు సుమా –
ఇది నీకు కిరీటం తొడగదు, రాజ్యం కట్టబెట్టదు,
పరార్థలోకం నుండి వచ్చిన పని విస్మరిస్తున్నావు
ఏదీ పూర్తి కాలేదు, ప్రపంచం నడిచిపోతూనే వుంది
ఎందుకు? భగవంతుని విశ్వకార్యం అర్ధం లోనే ఆగిపోయింది,
శాశ్వత నిషేధ సూత్రం నీ కళ్ళల్లోకి చూచిందో లేదో,
నీ హృదయం చచ్చిపోయింది.
ఏదీ ప్రణయినీ దరహాసమైన విధిసూత్రం?
అమృతత్వం హృత్కుహరంలో వెలుగుతున్నది,
సృష్టికర్త యజ్ఞంలో మంత్రం మార్మోగుతున్నది
ఓంకారం పరమాత్మను చేర్చే దివ్యాక్షరం
అది, శాంతానందాల సేతువు –
వధూసౌందర్య కాంక్షా స్వరూపం
దివ్యశత్రువుల రహస్య భాషణాల శయనాగారం,
కాపాడే చిరునవ్వు – వస్తుసామ్రాజ్య హేమశిఖరం
ఆ విధిసూత్ర మేమైనది?
జీవిత రహస్య జలపాతంలో ఇదీ సత్యపద్మమే
నీలి జలతారు తెర తొలగినది; మేం దర్శించాం
విశ్వప్రభుని మహాఛాయామూర్తిని;
కానీ వెలుగు తెర తీసిన దెవ్వరు
ఆ మహాప్రభుని దివ్యతనువు దర్శించిన దెవ్వరు?

*

యోగనర్తన చలనవలయాల్లో లాగా
పూజారిణి పూర్ణావేశం,
ఊర్ధ్వాకాశగోళం నుండి, ఉత్తేజితమైనట్లు,
మహాత్ముల దేవాలయంలో ప్రవేశిస్తున్నది.
సంతోష హస్తాలలో శాంత నిర్భర హృదయం
సృజన స్పందనంతో అధిష్ఠించింది.

ఒక శరీరం ఉషస్సులో పురాణ కథలాగా
దాగిన దేవతకు కట్టిన గుడిలాగా
లేదా
పరమవ్యోమానికి బంగారు గుడి తలుపులు.

ఈ పంక్తులకు ఆంగ్లమూలం:

As in a mystic and dynamic dance
A priestess of immculate ecstasies
Inspired and ruled from Truth's revealing vault
Moves in some prophet cavern of the gods,
A heart of silence in the hands of joy
Inhabited with rich creative beats
A body like a parable of dawn
That seemed a niche for veiled divinity
Or golden temple-door to things beyond.

ఆమె కాలానుసరణ చరణవిన్యాసంలో,
దివ్య లాస్యలయలు;
ఆమె దృష్టి – ఆమె దరహాసం –
మృణ్మయపదార్థంలోనూ, దివ్యతను మేల్కొలుపుతుంది,
వారి గాఢానందం –
మానవ జీవితాలపై అమృతవర్షం
ఆత్మప్రదానమే ఆమెకు స్వాభావిక చేష్ట;
ఆమె, ఆకాశమంత విశాలమైన, సముద్రమంత –
అగాధమైన దయామూర్తి;
సృష్టిలోని ఉత్కృష్ట సంపద అంతా ఆమె సొంతం,
ఆమె దయాదృష్టి వెన్నెలవాక,
ఆమెలోని ఉత్కంఠ నీలాకాశప్రశాంతి,
జీవాత్మ వేటాడబడే పక్షిలాగా –
అలసిన రెక్కలతో అజ్ఞాన లోకాల కందకుండా,
ఎగిరిపోయి;

స్మృతికందిన పాలిండ్లపై విశ్రాంతి పొందుతున్నది.
రక్షాకవచమైన శాంతాద్భుత స్వర్గంలో
మధువహ్ని ప్రవాహాల ద్వారా జీవితాన్ని వెనక్కు త్రిప్పి త్రాగ వచ్చు;
జారిపోయిన ఆనందఫలానుభవం పొందవచ్చు,
ఆమె కాంతి లోకవాతావరణ శాంతి ననుభవించు,
అమె చల్లని విచిత్ర పాలనలో అంతా పూర్ణానందమే,
అనంత కారుణ్యం – నిశ్శబ్దాశ్రమం
ఆమె అంతస్సహాయ దృష్టి తలుపులు లేని స్వర్గం,
ఆమె ప్రేమకు అవధులు లేవు – విశ్వమంతా వ్యాప్తమైనది
ఆ తల్లి గుండెలో సృష్టి అంతా ఆదమరచి నిద్రపోవచ్చు.

*

నా హృదయ భావంలో మేల్కొన్నావు
పూర్ణ ప్రేమానుభవంతో విశ్వైక్యభావనే జీవితమంటే,
ఇదే మా దివ్య పరిణామ మహిమ,
పూర్ణ సత్యావగాహన. ఇదే.

అనువాదం: తుమ్మపూడి కోటేశ్వరరావు

(*SABCL* Vol. 28, pp. 55, 310-11, 15; Vol. 29, p. 724)

'సావిత్రి' ని ఎలా చదవాలో నీవు నేర్చుకోవాలి. ఒక్క క్షణం కళ్ళు మూసుకొని ధ్యానం చేసి, ఏ విధమైన ఆలోచనలు లేని నిర్మలమైన మనస్సుతో చదవాలి. ఈ విధంగా చదివిన యడల నీ హృదయాంతరాలలో ఆకాంక్ష జ్వలిస్తుంది. విస్ఫులింగము వెలిగింప పడుతుంది. నిన్ను శ్రీఅరవిందులకు నివేదించుకొని చదివావంటే ఇక యోగంలో నువ్వు పరుగున పురోగమించెదవు

శ్రీమాత

కష్టాలు



Without grief (Asoka)

అఖిల

అఖిల భారత పత్రిక, నవంబరు 2004

కష్టాలు

శ్రీమాత ప్రవచనములు

శ్రీఅరవిందుల ప్రవచనములు

ఉపోద్ఘాతము

సుఖంగా జరగవలసిన ఈ జీవయాత్రలోకి బాధ దుఃఖములు ఎక్కణ్ణుంచి వచ్చినై? అఖండమైన వస్తువు అణువణువుగా చీలి పోవడం ద్వారా సృష్టి సంభవించినది. అనంతత్వము దిశా పరిమితం కావడం వలన అహంకారం పుట్టింది. ఈ అహంకారానికి రెండు ముఖములు కలవు. మొదట్లో దాని ద్వారానే సృష్టి జరిగింది. మళ్లీ సృష్టి పురోగమనానికి ప్రతిబంధకమూ అదే. వేర్పాటు భావమే దుఃఖమునకు హేతువు. అయితే వేరైపోయినప్పటికి మూల పదార్థంతో ఒకటే అనే భావము తనలో నిక్షిప్తమై ఉన్నది. అది మానవుని అంతరంగంలో ప్రకాశిస్తూ అతనిని దైవోన్ముఖంగా పయనించుటకు ప్రేరేపిస్తుంది. మామూలుగా మనిషి జీవితం సాఫీగా గడచిపోతున్నంత వరకు అతనికి ఏ విధమైన ఉన్నత భావములు కలుగవు. ఈ కుంభకర్ణుడిని తట్టి లేపడమే బాధ, దుఃఖముల కర్తవ్యమూ, ప్రయోజనమూను. ఈ సంచికలో ఈ విషయములు చాలా వివరంగా చర్చించబడినవి. సాధక మహాశయులు వీటిని చదివి తెలుసుకోవడమే కాకుండా ఆచరణలో కూడ పెట్టగలరని మా ఆశయము.

— సంపాదకుడు.

దుఃఖబాధితులకు ఓ శుభవార్త

గాఢమైన దుఃఖము, మనసును దహించివేసే సందేహము, తీవ్ర మైన బాధ ఎప్పుడైనా మిమ్మల్ని ముంచెత్తి నిరాశకు గురిచేస్తే, శాంతి, ప్రశాంతతల పునః సముపార్జన కొౕక మార్గం ఉన్నది.

మన చేతనాగాధములలో ఒక పరంజ్యోతి దేదీప్యమానంగా ప్రకాశిస్తుంటుంది. అదెంత దేదీప్యమానమైనదో అంత పవిత్రమై నది కూడాను. సర్వభూతములను తరంగితము జేసి పోషించి ప్రకా శింప జేసే విశ్వజనీన దైవత్వపు సచైతన్య, సజీవ ఖండిక ఆ జ్యోతి. ఆ భగవంతుని నియమావళికి బద్ధసంకల్పులైన వారికి అతిశక్తివంతమైన నిరంతర మార్గదర్శి ఆ జ్యోతి. దాన్ని చూడా లని, వినాలని, విధేయులుగా ఉండాలని కాంక్షించేవారికి ప్రేమైక క్షమతో ఉపశమనాన్నిచ్చే సహాయకారి ఆ జ్యోతి. దాని పట్ల చిత్త శుద్ధితో కూడిన ఏ నిరంతర ఆకాంక్షా వృథా కాదు. ప్రగాఢమైన గౌరవప్రదమైన నమ్మకం నిరాశ చెందదు. ఏ ఆశా వమ్ము కాదు.

నా హృదయం ఎంతో కలత జెందింది – దుఃఖించింది. దుఃఖభారంతో దాదాపు శకలమైంది. తట్టుకోలేని బాధతో క్రుంగి పోయింది. కాని ఓ దివ్యోపశమన ప్రదాతా! నిన్ను పిలిచాను నేను. భక్తితో ప్రార్థించాను. కనులు మిరుమిట్లు గొలిపే నీ దివ్య ప్రకాశం నాకు సాక్షాత్కరించి, నన్ను పునరుజ్జీవుణ్ణి చేసింది.

మూలం: శ్రీమాత

అనువాదం: మాడభూషణం రాజగోపాలాచార్య

(*CWM* Vol. 2, p. 19)

బాధ అదృశ్యమైపోయే ఆనందపు టంచులకు ఆరో హించినప్పటికీ అదొక పారవశ్యమనే ఆచ్ఛాదనలో మిగిలే ఉంటుంది.

శ్రీఅరవిందులు

నేనెవరిని? ఎందుకున్నాను?

నీ నిజస్వరూపం నీకు తెలియదు. మానవజీవితానికి ఓ పరమార్థ మున్నది. మానవునిలో దేవుని అంశ నిగూఢంగా దాగి వున్నది. మనిషి లోతులలో దేదీప్యమానంగా వెలిగిపోయే చైత్యపురుషుడు న్నాడు. అతనిని పైకి రప్పించి జీవితాన్ని ఆయన కప్పచెప్పినట్లు యితే అప్పుడు నీ జీవితమంతా జ్యోతిర్మయ మవుతుంది. ఈ చైత్యపురుషుణ్ణి పైకి ఎలా రప్పించాలి అనేదే ప్రశ్న. జీవితం సుఖంగా గడిచిపోతున్నంత కాలం నీలో ఇటువంటి ప్రశ్న ఉద యించనే ఉదయించదు. పరిస్థితులు విషమించినప్పుడే ఇది జరు గుతుంది. కాబట్టి జీవితంలో కష్టాలకి, దుఃఖాలకి కూడ ఒక ముఖ్యమైన ప్రయోజన మున్నదన్న మాట! – సంపాదకుడు

“నేనెవరిని? అసలు నేనెందుకు పుట్టాను? ఈ శరీరాన్ని ఎందుకు ధరించాను. ఈ భూలోక జీవితాన్ని ఎందుకు గడపవలస వస్తోంది.” అని తమని తాము ఎంతమంది ప్రశ్నించుకుంటారు? చాలామందిలో ఇటువంటి ప్రశ్నలు ఉదయించనే ఉదయించవు. ఉదయించిన వారిలో సమాధానాల కోసం అన్వేషించేవాళ్ళు ఇంకా తక్కువ మంది.

అసలు ఇలాంటి ఆలోచన రావటానికి కూడా అదృష్టం ఉండాలి. సమాధానం పొందడానికి కూడా ఒక దైవికమైన అవ కాశం కలగాలి. ఉదాహరణకి శ్రీఅరవిందులు లేదా అలాంటి మహాత్ములు, యోగులు, ఋషులు ఈ ప్రశ్నలకు అంకిత భావ ముతో సమాధానము నన్వేషించిన పరమ మహనీయ సమున్నత వ్యక్తుల పవిత్ర గ్రంథాలను చదవకుండా, పరిశీలించకుండ, విన కుండా తత్త్వచింతన సాధ్యం కాదు. కాబట్టి కొన్ని లక్షల కోట్ల మంది ఈ విషయాన్ని విననైన విని వుండరు. అలాగే ఒక మత పరంగా, ఒక సాంప్రదాయపరంగా ఒక విశ్వాసం కలిగి గాని, ఈ భూమిలో మన మెందుకున్నామో అని చెప్పిన మాటలను విన్న ప్పుడు గాని మనకు ఇలాంటి ఆలోచనలు కలగవు. సామాన్యంగా

చిన్నతనంలో ఆడుతూ పాడుతూ, తింటూ తిరుగుతూ ఉన్నప్పుడు గాని, కొంచెం పెద్దవారైన వారికి వారి జీవన వ్యవహారము సాఫీగా సాదా సీదాగా గడుస్తున్నప్పుడు ఇలాంటి ఆలోచనలు రానే రావు. *ఏదైనా ఒక సమస్య, ఒక విపత్కర పరిస్థితి ఏర్పడినప్పుడు ఒక పెద్ద ఎదురు దెబ్బ తగిలినప్పుడు మాత్రమే "అసలు నేనిక్కడ ఎందుకున్నట్లు?"* మొదలైన ప్రశ్నలు మెదడులో మెదులుతాయి. ఒకసారి ఎవరైనా ఆత్మీయుల వియోగం సంభవించినప్పుడో లేక మిక్కిలి తీవ్రమైన బాధాకరమైన గొప్ప విషమ పరిస్థితులు సంభవించినప్పుడో మాత్రమే, కాస్త విచక్షణ గలవారైతే "ఎందుకీ పరిస్థితి రావాలి? దీని ఉపయోగమేమి? ఇది ఎలా ఉపయోగపడుతుంది?" అనే ప్రశ్నలు వేసుకుంటారు.

ఇది ఒక సదవకాశము, అంతర్విచారణకి, అంతర్మథన మొనర్చడానికి ఇది ఒక సందర్భమని భావించాలి. నీలో ఒక దివ్యసన్నిధి వున్నదని నీవు గుర్తించినప్పుడు నువ్వు దాని నన్వేషించటం మొదలు పెట్టాలి. అప్పుడే మన యోగసాధన మొదలవుతుంది.

నీలో దైవాంశ మున్నదని తెలిసినప్పుడే కదా దాని కోసం అన్వేషణ మొదలయ్యేది. మనిషి ఎప్పుడైతే ఈ పాంచభౌతిక శరీరంతో జన్మ ఎత్తుతాడో ఆ క్షణం నుంచి లోలోపలి అగాధాలలో ఈ చైత్యపురుషుడుంటాడు. దివ్యచరితార్థత కోసం మనిషిని నిరంతరం తోస్తూనే వుంటాడు. కాని దీన్ని ఎంతమంది గుర్తించగలరు? తమలో చైత్యపురుష డొక డున్నాడని ఎంత మందికి తెలుసు? కొన్ని ప్రత్యేక పరిస్థితులలోనే అలా జరుగుతుంది. బాధ కలిగించే విషమ పరిస్థితులు వస్తే గాని, మనిషి అటు మళ్లడు! లేని యెడల ఈ బ్రతుకు గుడ్డెద్దు చేలో పడ్డట్టే సాగిపోతూ వుంటుంది. కాని ఒకటి మట్టుకు నిజం. మనిషి అగాధాలలో చైత్యపురుషుడు మట్టుకు అదే పనిగా మళ్లి మళ్లి జీవిని జాగృతము చేసి దైవంతో విడిపోయిన బంధాన్ని తిరిగి పునరుద్ధరించేందుకని పరిశ్రమిస్తూ వుంటాడు. కాని నీకీ సంగతి తెలియనే తెలియదు కదా!

అంతవరకు నీ జీవితం మసగవెలుగులో తడుముకోవల సిందే. "అయ్యో నేనెంత దురదృష్టవంతుణ్ణి? నా విధి రాత ఇలా వున్నదేమిటి? నా గతి ఇంతేనా? నన్నెవరు మార్చలేరా? నా జీవితం ఇంత అస్తవ్యస్తంగా వున్నదేమిటి?" అనే భారంతో క్రుంగి పోతూ వుంటావు. నీలోని ప్రతి కదలిక నిన్ను దేవుని దగ్గరకు తీసుకొనిపోయే మార్గమే అని తెలుసుకుండేంత వరకు ఈ బాధ తప్పదు మరి.

*

దైవం పట్ల నిజాయితీగా ప్రవర్తించటం చాల కష్టం. (As it is very difficult to be sincere....). అందుకనే జీవితములో విఘాతాలు తగులుతూ వుంటాయి. ఒక్కొక్కప్పుడు భరించలేనంత ఘోరంగా వుంటాయి కూడాను. ఎందుకని? నిన్ను మూర్ఖత్వము నుండి తప్పించేందుకే. మనిషి స్వభావం అంతే గదా! నీకు విపరీతమైన బాధ, దుఃఖము నిన్ను కుదిపివేసే పరిస్థితి వస్తే గాని నీ కళ్లు తెరచుకోవు!

నిజానికి నిన్ను నడిపించేది దివ్యచైతన్యమూ, దివ్యకటాక్ష మూను. కాని ఈ సంగతి నీకు తెలియదులే. దివ్యచైతన్యము వినా, దివ్యకటాక్షము వినా నీకు ఉనికి లేదని, నీవేమి చేయలే వని, నీకు అస్తిత్వం లేదని, అసలు ఏమీ లేనే లేదని నీకు తెలిసేందుకు ఎన్ని సమ్మెట వేట్లు పడాలి? ఈ సత్యము నీకు ఒకసారి గనుక తెలిస్తే ఇక సమస్య తీరిపోయినట్లే. ఇక కష్టా లెక్కడివి? అవి మాయమైపోయినై! ఈ విషయం నీకు సమగ్రంగా తెలిసినప్పుడు అడ్డంకులన్నీ తొలగిపోయినట్లే. కాని అది చాల కాలం పట్టవచ్చు.

పై పేరాకు ఆంగ్ల మూలం:

How many blows are needed in life for one to know to the very depths that one is *nothing*, that one can do *nothing*, that one *does not exist*, that one is *nothing*, that there is no entity without the divine Consciousness and the Grace. From the moment one

knows it, it is over; all the difficulties have gone. When one knows it integrally and there is nothing which resists... but till that moment... And it takes very long)

*

ప్రశ్న: ఈ కష్టాలన్నీ ఒకేసారి ఎందుకు రావు?

అలా జరిగితే నీ ప్రాణమే పోతుంది. ఇంతటి తీవ్రమైన విఘాతాలను నీవు భరించలేవు. పిండి పిండి అయిపోతావు. అందుకనే ఇటువంటి సంఘటనలు మోతాదుగానే కలుగుతూ వుంటయి. అది నీ ఆత్మబలాన్ని, సామర్థ్యాన్ని బట్టి ఉంటుంది. ముఖ్యంగా నీ ప్రయత్నంలో క్షణం ఏమరుపాటైనా పనికి రాదు.

*

ప్రశ్న: మధుమయీ! దేవుడు మనలోని లోటుపాట్లను ఎత్తి చూపించేందుకే కష్టాలను కలిగిస్తాడా!

నీవు కష్టాలను ఎదుర్కోగలిస్తే అంతే మరి. నీకు కష్టం కలిగినప్పుడు పిరికివాని వలె దానికి లొంగిపోకుండా దానిని అధిగమించేందుకు ప్రయత్నించినట్లైతే దేవుడు నీ వెనకాలే వుండి నీకు దన్నుగా వున్నాడన్న మాట. అలా కాకుండ పిరికిపందవైనట్లైతే నీవు దైవసాన్నిధ్యాన్నే కోల్పోయావన్న మాట. నీ భయం వలన నీవే దైవంతో తెగతెంపులు చేసుకొన్నావన్న మాట. కాని విక్రమార్కుని వలె కష్టాలని ధైర్యంగా ఎదుర్కొన్నట్లైతే దైవం నీ చెంతనే వుండి నీకు సహాయపడతాడు అనటంలో ఏమాత్రం సందేహం లేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ దోర్బల ప్రభాకర శర్మ,

డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 9. pp. 15-19; Vol. 6, pp. 323-24, 461)

భగవంతుడు చిత్రహింసలు పెట్టే ఓ రాక్షసుడా!

అపారంగా ప్రేమిస్తాడు గనుకనే మనను భగవంతుడు చిత్రహింసలకు క్రూరంగా గురి చేస్తాడు. మీరు శ్రీకృష్ణుని దర్శించి, ఆయనతో క్రీడించ లేదు గనుక మీకీ విషయం అర్థం కాదు.

శ్రీఅరవిందులు (మెరపులు – తలపులు)

ప్రశ్న: శ్రీకృష్ణుడితో క్రీడించటమంటే ఏమిటి? భగవంతుడు క్రూరంగా చిత్రహింసలు పెడతాడనటంలోని అంతరార్థం ఏమిటి?

శ్రీకృష్ణుడు సర్వాంతర్యామి. ప్రతి జీవిలోనూ, సర్వ సృష్టిలోను వర్తిస్తూ, నర్తిస్తూ తన సన్నిధి కల్పిస్తాడు. ఆ పరాత్పరుని అనంతమైన ఆనందానికీ, పరమ ప్రేమకూ శ్రీకృష్ణుడు ప్రతి రూపం. ఆయనే క్రీడించేవాడూ, క్రీడా, ఆ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు కూడా. సంకల్పించేదీ, రూపకల్పన చేసేదీ, నిర్వహించేదీ పూర్తిగా ఆయనే గనుక ఈ క్రీడయొక్క స్వరూపమూ, పర్యవసానమూ ఆయనకే తెలుసు. వీటిల్లో ఆనందానికి తప్ప మరి దేనికీ తావు లేదు. శ్రీకృష్ణుని దర్శించటమంటే దైవంయొక్క అంతర్యామిత్వాన్ని అనుభవించటమే. ఆయనతో క్రీడించటమంటే ఆ అంతర్యామిత్వం యొక్క ప్రత్యభిజ్ఞతను పొంది కృష్ణ చైతన్యంలో ఒకటై కరిగిపోవటమే. ఈ స్థితి నీకు లభిస్తే ఆ క్రీడామయుని క్రీడలోని ఆనందం తక్షణం సిద్ధించినట్లే! నీ ప్రత్యభిజ్ఞ ఎంత గాఢము, పూర్ణము అయితే, నీకు సిద్ధించే ఆనందం అంత పరిపూర్ణమవుతుంది.

నీ చైతన్యంలో ఏ మూలనైనా (ఏ కోశాన్నైనా), ఇంద్రియార్థ గ్రహణంలో గానీ, భావంలో గానీ, అవగాహనలో గానీ, భౌతిక దృష్టి చోటు చేసుకుంటే, ఇతరులు పడే బాధలు చాలా ఘోరంగా కనిపించి, భగవంతుడు చిత్రహింసలు పెట్టే పరమ క్రూరుడిగా కనిపిస్తాడు. అలా కాకుండా, భగవంతుని సర్వాంతర్యామిత్వం పట్ల నీకు ఎఱుక కలిగితే, ఆయన క్రీడలోని మహానీ

యమైన ప్రేమతత్త్వాన్ని గ్రహిస్తావు. *ఆ అవగాహన నీకు లభిం చిన నాడు ఆయన ఇచ్ఛాపూర్వకంగా హింసకు పూనుకొనటం లేదనీ, నిన్నూ, సర్వ జగత్తునూ, ఉద్ధరించే ప్రయత్నంలో ఆ కరుణా సముద్రుడు, అత్యంత త్వరితగతిలో సారథిగా పరిపూ ర్ణత వైపు నడిపిస్తున్నాడనీ నీకు విశదమవుతుంది.* పరిపూర్ణత సాపేక్షమైనదనీ, నవ నవోన్మేషమైన ఈ పరిపూర్ణత నిరంతరం అధిగమించే ఉన్నత శిఖరాల వైపు పురోగమిస్తున్నదని కూడా నీకు తెలుస్తుంది.

జీవితాన్ని అంటే పార్థివ జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవా లంటే – అది పరిణామం చెందుతున్న ఉన్నత ఉత్తమ కక్ష్య లను దర్శించాలి. అంటే వర్తమానాన్ని మాత్రమే దర్శించటం కాక, గతాన్ని భవిష్యత్తునూ కూడా – గతంలో ఎలా వున్నదీ, వర్తమానంలో ఎలా వర్తిస్తున్నదీ, భవిష్యత్తులో ఎలా రూపొంద బోతున్నదీ కూడా తక్షణమే దర్శించాలి. *దేనినీ నిరాకరించటం గానీ, పరిహరించటం గానీ చేయకూడదు. ప్రతి అంశానికీ దాని సముచిత స్థానమివ్వాలి.* అన్నిటి మధ్యా మంచి పొందికా, కూర్పూ, అమరికా, సామరస్యమూ వుండాలి. అప్పుడు ఛాంద సుల చేత భ్రష్టమైనవిగా, నింద్యమైనవిగా భావింపబడి, అభిశం సించబడినవన్నీ కూడా నిజమైన దివ్యజీవితానికీ ఆనందానుభూ తికీ హేతుభూతాలవుతాయి. అప్పుడు పరమ పురుషుడైన నంద నందనుని ఆనంద దరహాసం అందుకొనటం గానీ, అనుభూతం చేసుకొనటం గానీ, ఆ అనుభూతిలో ఆనందంగా జీవించటంగానీ అసంభవం కావు. అపుడు ఆ నందకిశోరుని ముగ్ధమోహన దర హాస కాంతిలో విషాదఛాయలన్నీ మాయమవుతాయి. ప్రతి బాధా తొలగుతుంది. ప్రతి వ్యధకూ ఉపశమనం లభిస్తుంది. కృష్ణుడనే అంతరాదిత్యుని కాంతిహేల నీ జీవితాన్ని వెలిగిస్తుంది. రసమయ బృందావన విహారంలో ఆనందం లభిస్తుంది.

మూలం: శ్రీమాత

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

(*CWM* Vol. 10, pp. 51-52, 157-58)

బాధలను కోరుకునేవారు

ప్రశ్న: సాధువులు మేకుల పడకలపై పవళించడం, క్రైస్తవ సన్యాసులు కొరడా దెబ్బలు తినడం, వెంట్రుకలతో చేసిన దుస్తులను ధరించడం మొదలైన విధానాలన్నీ హింసలో ఆనందం పొందే ప్రవృత్తి లక్షణమనిన్నీ, వాళ్లు అంగీకరించకపోయినప్పటికీ అది చిత్రహింసలను అనుభవించాలనుకునే అవచేతన (subconscious) పనే అని మీరు చెప్పారు.

Four Austerities and the Four Liberations

అవును సన్యాసులు మేకుల మీద పడుకొని నిద్రించడం నీవు చూడలేదా? అది చాలా చోట్ల జరుగుతుంది. నేను కూడా ఫొటోలు చూశాను. అది వారి వైరాగ్యాన్ని ఋజువు చేసుకోటానికైనా చేయవచ్చు. కాని కొంతమంది మాత్రం నిజంగానే చేస్తారు. చూసేవారికి అది ఒక వేషంగా తోచవచ్చు. అట్లా నిజంగా చేసే వారిని ప్రశ్నించినప్పుడు మాత్రం తమ శరీరంతో తమకి అసంగత్వం ఎంతవరకున్నదీ తెలుసుకోడానికే చేస్తున్నామంటారు. మరి కొంతమంది ఏం చెపుతారంటే ఆత్మవిమోచనం సిద్ధించాలంటే శరీరాన్ని ఆ విధంగా బాధలకు గురిచేయాల్సిందే నంటారు. నన్నడిగితే మాత్రం శరీరంలో ఒక భాగమైన ప్రాణికము బాధ భరించడంలో ఒక రకమైన ఆనందాన్ని పొందుతుంది కాబట్టి అది బాధని కోరుకుంటుంది అని చెపుతాను. కొంతమంది పిల్లలు కూడా ఎక్కడైనా దెబ్బ తగిలితే ఆ దెబ్బనే గట్టిగా నొక్కుతూ మరి కాస్త నెప్పి పుట్టేట్లుగా చేసుకోవడం నేను చూశాను. అంటే అందులో ఒక ఆనందముందన్న మాట. కొంతమంది పెద్దవాళ్లు కూడా అలాగే చేస్తారు. "నీవు సంతోషంగా లేవు అంటే నీవు ఆ విధంగా ఉండాలనే కోరుకుంటున్నావు. నీకు బాధ కల్గిందంటే నీవా బాధను కోరుకుంటున్నావన్న మాట. లేకపోతే నీకు బాధ కలగనే కలగదు." ఇలా నేను అందరికి చెపుతాను. అయితే ఈ విధంగా కోరుకోవటం సామరస్య, సౌందర్యాలకి వ్యతిరేకమైన

అనారోగ్య భావన; తీవ్రమైన బాధలు, వేదనలు పొందాలనే వికృత కోరిక.

నీకు తెలుసునో లేదో కాని అతిభయంకరంగా, ఊహాకందని చిత్రహింసలు కనిపెట్టిన దేశం చైనా. నేను జపాన్‌లో ఉన్నప్పుడు అక్కడి జపాన్ దేశీయుణ్ణి దాన్ని గురించి అడిగాను. అతనికి చైనా దేశమన్నా, ఆ దేశీయులన్నా అభిమాన మెక్కువ. సాధారణంగా జపాన్ దేశీయులలో అది అరుదు. అతను తూర్పు దేశవాసులందరికీ, జపాన్‌వారితో సహా అందరికీ సున్నితత్వం తక్కువ, మోటుతనం ఎక్కువనీ, కొద్ది బాధలకు వారు స్పందించరు కాబట్టి, వారి తెలివితేటలన్నీ ఉపయోగించి క్రూరమైన చిత్రహింసా విధానాలను కనిపెట్టవలసి వచ్చిందని చెప్పాడు. వారంతా చైతన్యం తక్కువ, జడత్వం ఎక్కువ కలవారు కావటం వల్ల సంవేదనాధిక్యత ఉండదు. తీవ్రమైన వేదనలకు గురి చేస్తే తప్ప కొంచెమైనా స్పందించలేరు. ఆ క్రూరత్వమే వారికి తగిన సంవేదనలను కలిగించగలదు. అందుకే వారు క్రూరంగా తయారైనారు. ఆ విధంగా చిత్రహింసలకు గురిచేసినప్పుడు నరాల ఉద్రిక్తత పెరుగుతుంది. అది ఒక సంవేదనని కలుగచేస్తుంది. వారు స్పందించడానికి అది అవసరము. అది లేకపోతే వారికి స్పందనే ఉండదు.

మూలం: శ్రీమాత

అనువాదం; డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 6, pp. 70-71; Vol. 14, p. 266)

నీకు చెప్పేదేమిటంటే ఎన్నడూ బాధను గురించి అనుబంధం పెంచుకోవద్దు. అప్పుడే బాధ నిన్ను పూర్తిగా వదిలేస్తుంది. పురోగమనం సాధించడం కోసం బాధననుభవించ నక్కర్లేదు. నిదానమైన, ఉత్సాహభరితమైన సమత్వం వలన ఉత్తమమైన పురోగతి సాధ్యమవుతుంది.

రెండు రకాల బాధలు

బాధలు రెండు రకాలు. ఒకటి అహంకార జనితము. రెండవది దైవకారుణ్యార్ద్ర భరితము. తనకు చెందవలసిన దానిని ఎవరో అన్యాయంగా కాజేసారని తన హక్కులను నష్టపరచారని, అట్టి వారి మీద కసి తీర్చుకోవాలని ఉండటం మొదటి తరగతి. ఇది నీ చేతనాస్థాయిని దిగజారుస్తుంది. రెండవది అహంకారపూరితం కాదు, ఆత్మ సంబంధితము. నీ చైత్యపురుషుడు మేల్కొని యిత రుల బాధలకు తను కూడ స్పందించగా, వారి పట్ల సానుభూతి వలన కలిగినది. — *సంపాదకుడు*

నిజ జీవితంలో చాలా మటుకు కలిసే కనిపిస్తున్నప్పటికీ, బాధల్ని (దుఃఖములను) రెండు వర్గాలుగా విభజించవచ్చు.

మొదటి రకం కేవలం అహంకారం వల్లే కలుగుతుంది. – తమ హక్కులు కోల్పోయామనో, అవసరాలు తీరలేదనో, మాన సికంగానో, శారీరకంగానో అవమానించబడ్డామనో – ఇలాంటి కారణాలే వుంటాయి. ఈ వర్గంలోని అన్ని బాధలూ (suffering) అసురప్రభావం వలన కలుగుతాయి. ఈ విధంగా అసుర శక్తులు నీలోకి ప్రవేశించటమే కాకుండా తద్వారా ప్రపంచంలో వాటి కార్యమును నెరవేరుస్తాయి. దాని వలన దృఢమైన వాళ్లలో ద్వేషము, ప్రతీకార భావము పెరుగుతాయి. అర్భకులైతే నిరాశా నిస్పృహాలు జెంది చచ్చిపోదామనుకుంటారు.

రెండో రకమైన బాధకి (suffering) మూలకారణం ఇందుకు భిన్నము. దివ్యప్రేమ, సానుభూతి వల్ల, ఈ ప్రపంచంలో ఏ కారణం వల్ల కలిగిన వేదనలైనా, వాటి పట్ల సానుభూతే ఈ బాధకి మూలం. ఈ బాధ పూర్తిగా ఆత్మానుభూతి (psychic = చైత్యము), ఇందులో అహంభావానికీ, దైన్యానికీ తావు లేదు. శాంతం, కార్య దక్షత, భవిష్యత్తు పట్ల ఆశ, విజయానికి కావలసిన దృఢనిశ్చయం వుంటాయి. దీని వల్ల బాధితులకి కేవలం జాలి చూపడం కాక,

ఊరటనిచ్చి, అజ్ఞానంలో కలిగే ఆందోళనని తన జ్ఞానరేఖలతో తొలగించడం జరుగుతుంది.

ఉన్నతమైన, స్వచ్ఛమైన ఈ సానుభూతిజనిత వేదన కేవలం సంపూర్ణ దివ్యత్వంలోనే సంభవమనిపిస్తుంది. నిజమే. కానీ దయగల విశాలహృదయులందరి లోనూ, అహంభావమనే కారుమేఘం వెనక మెరిసే మెరుపులా, క్షణికంగా, ఈ ఉత్తమ లక్షణం కనిపిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. వరలక్ష్మి

(*CWM* Vol. 15, p. 359)

దుఃఖానికి కారణం

వేర్పాటు భావమే ఈ దుఃఖమునకు కారణం. సృష్టికర్త నుండి నీవు వేరైపోయావు. నువ్వు ఆయనకు దూరమైనావు. నువ్వు ఆయన అధీనంలో లేవు. నీకాయన స్పృహ లేదు. ఆనందాన్ని ప్రతిబింబించవలసిన జీవునిలో అజ్ఞానం తాండవించడమే ఈ దుఃఖానికి కారణం. — *సంపాదకుడు*

ఈ సృష్టి మానవునిలో చైతన్యవంతమవుతుంది ప్రగతి సాధించి తిరిగి ఆ ఆనందమయుని చేరేందుకు ఆత్మ స్పృహని పొందింది. తనకి తెలియకనే ఆ ఆనందమయ పురుషుని తనలో ధరించి ఉంటుంది; తనలోనూ, ఇంద్రియాలలోనూ, జీవితంలోనూ తనకి తెలియకనే ఇమిడివున్న అతనిని తెలుసుకోవాలనుకుంటూ అన్వేషిస్తుంది. జగత్తు కూడా అంతే – భగవంతుని గురించి ఎరుగదు – ఎందుకంటే తనను గురించే తను ఎరుగదు. కనుక తనని తాను తెలుసుకున్నప్పుడే, అస్తిత్వంలోని అపూర్వ ఆనందం అనుభవించగలదు.

ఈ ఆనందానికి రహస్యం – ఏకత్వంలో అదృశ్యమవడం కాదు. ఏకత్వం తెలిసి వుండటం. భగవంతుడు – మాన

వుడు, ఈ లోకము – పరలోకము – ఒకరి నొకరు తెలుసుకోవడం ద్వారా ఏకత్వం సాధిస్తారు. దుఃఖానికి మూలం అజ్ఞానమైతే, ఈ అజ్ఞానానికి మూలం ఈ ఏకత్వం తెల్ళుసుకోలేని భిన్నత్వమే.

శ్రీఅరవిందులు (*మెరుపులు – తలుపులు*)

శ్రీఅరవిందుల మాటల్లో స్పష్టమయే దేమిటంటే, ఈ విశ్వముయొక్క నిజస్వరూపము భగవంతుడు – ఆనందమయుడు. ఆనందంతో ఆనందం కోసమే ఈ సృష్టి జరిగింది. ఈ ఆనందానుభవం ఈ సృష్టికీ, ఆ సృష్టికర్తకీ సంపూర్ణ ఏకత్వంతోనే సాధ్యం. – that is, the Creator – the Possessor being possessed by his creation, a sort of reciprocal possession which is the very essence of the Oneness and the source of all delight.

ఈ పరస్పర అవగాహన లోంచి వచ్చే ఏకత్వం లోపిస్తే, భిన్నత్వమూ, అవిద్య (Ignorance), తద్వారా దుఃఖం కలగడం సహజమే. శ్రీఅరవిందులు అవిద్య అనగా నిశ్చేతన (Nescience), ఆత్మస్పృహ లేకుండా వుండటమంటారు. నిజమైన అజ్ఞానం (అవిద్య) మన అస్తిత్వం గురించీ, ఏకత్వం గురించీ తెలియక పోవడమే. అదే దుఃఖానికి మూలం.

ఏకత్వంలోంచి భిన్నత్వం మొదలై, సృష్టి ప్రారంభమయినప్పటినించీ అవిద్యదే (Ignorance) పై చేయిగా వుండి దుఃఖం రాజ్యమేలుతోంది. ఎప్పుడైతే అంతరంలోని దివ్యశక్తితో సంబంధం ఏర్పడుతుందో వెంటనే దుఃఖం దూరమవుతుందని ఆత్మజ్ఞాన అనుభూతి కలిగిన వారందరికీ అనుభవమే. ఇక్కడ మనం సునిశితంగా ఆలోచించవలసిన అంశం ఏమిటంటే – కొన్ని ఆధ్యాత్మిక మార్గాలు, సృష్టిమూలం ఆనందం కాదనీ, కోరిక అనీ వాదిస్తున్నాయి. ఈ సృష్టి చేయాలనే ఆలోచన, సృష్టిలో భగవంతుని ఆత్మ అభివ్యక్తీకరణకు కారణం ఆనందం కాదనీ, కేవలం కోరికేనని ఎంతోమంది ఋషులు, జిజ్ఞాసువులు అంటున్నారు. బౌద్ధమత సిద్ధాంతం కూడ ఇదే చెబుతుంది. ఈ లోకంలోని

దుఃఖాలకి పరిష్కారం ఆనందం నెలకొల్పే ఏకత్వ స్థాయికి బదులు సకల కోరికలనీ సమూలంగా తృణీకరించి అస్తిత్వానికే దూరంగా, భిన్నంగా అస్తిత్వలేమిని (annihilation) సూచిస్తారు.

ఈ దృక్పథం సరైనది కాదు. ఒక అపార్థం (misunderstanding) వల్ల వచ్చింది. మానవుని ఆధ్యాత్మిక ప్రగతి చరిత్రలోనే ఇది అతి పెద్ద వక్రీకరణ. మోక్షానికి సూచించిన మార్గాలేవయినా ప్రగతిశీలంగా, ఉపయోగకరంగా వున్నాయి. కానీ ఈ సృష్టి ఉనికే చెడు అనీ, కోరిక మూలంగా సృజించబడిందనీ, వీలున్నంత త్వరగా దీనినుంచి విముక్తి పొందడమే లక్ష్యమనే సిద్ధాంతం అత్యంత హానికరమైన వక్రీకరణ.

బహుశ ప్రపంచ చరిత్రలో ఈ ఆలోచన ఏదో ఒక దశలో ఉపయోగపడిందేమో! ఎందుకంటే, ప్రపంచ చరిత్రలో ప్రతిదీ ఏదో ఒకప్పుడు ఉపయోగపడుతుంది. కానీ ప్రస్తుతం ఇది పాతదై, అరిగిపోయి, నిరుపయోగమై, దాని కంటే ఉత్తమమై, ఏకత్వం లోని ఆనందమయ స్థితిని అభివ్యక్తం చేసే సత్యానికి చోటు ఇవ్వవలసి ఉంది.

ఈ దృక్పథం ఈ భూమి మీద అభివ్యక్తమవడం నూతనంగానే జరిగింది. ఇది తనకి పూర్వం వేళ్ళూనుకుని ఉన్న అన్ని ఆధ్యాత్మిక ఆలోచనలనీ తొలగించి, వినూత్న జ్ఞానమైన దివ్య చైతన్య అనుభూతికి మార్గం ఏర్పరచాలి. అందుకే ఈ సృష్టి విజయం కేవలం సంపూర్ణ ఆనందమయ దివ్య అనుభూతి ద్వారానే సాధ్యమంటాను.

శ్రీఅరవిందు లందుకే హెచ్చరిస్తూ, ఈ దివ్య ఆనందానుభూతి ప్రాపంచికమైన అన్ని అనుభూతులకీ అతీతమంటారు. ఈ దివ్య ఆనందం ప్రపంచంలో సాధారణంగా అనుభవమయ్యే సంతోషానికీ, హాయికీ భిన్నంగా, అతీతంగా, వీటిని జయిస్తే కానీ సాధ్యం కాదు, అనుభవంలోకి రాదు.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. వరలక్ష్మి

(*CWM* Vol. 9. Pp. 7-9)

నీ దీక్షకు పరీక్ష

నువ్వు దేవుని బిడ్డవైనప్పుడు దుష్టశక్తుల నిన్నేడిపించడ మేమిటి అనే ప్రశ్న రావచ్చు. ప్రస్తుతం నీలో దివ్యచైతన్యం బదులు అహం కారమే ప్రకాశిస్తుంది. ఆ అహంకారాన్ని పోగొట్టాలంటే అగ్ని పరీక్షలు అవసరం. ముడిబంగారానికి పుఠం పెట్టినప్పుడు గదా మెరుగు వచ్చేది. — సంపాదకుడు

దివ్యజనని ముఖారవిందం సుందరం. కాని ఆమె కూడ కఠినంగాను, భయంకరంగాను వుండగలదు. అలా కాకపోతే అమరత్వ మనేది బిడ్డ లాడుకోడానికి తేలిగ్గా యివ్వదగ్గ ఒక ఆట వస్తువా యేమి? లేక దివ్యజీవన మనేది ఉచితంగా లభించ గల బహుమానమా? కాకపోతే కిరీటమనునది ఒక బలహీనుని కివ్వదగ్గదా? కాదు, కాదు. కనుక ఉచితమైన రీతిలో శ్రమించు – నీకు ఫలితం దక్కుతుంది. – శ్రీఅరవిందులు
(*SABCL* Vol. 17, p. 40)

"అసుర శక్తులకు (adverse forces) నీ జీవితంలో జోక్యం చేసికొని నిన్ను ఏడిపించే హక్కు ఎవరిచ్చారు?" అనే ప్రశ్న మరల తలెత్తుతుంది. కాని యిదే నీ చిత్తశుద్ధికి అవసరమగు కచ్చితమైన పరీక్ష. మార్గం సుగమంగా వుంటే ప్రతివారూ యోగం చేస్తారు. ఎలాంటి ఆటంకాలు, ఎలాంటి శ్రమ లేకుండ గమ్యాన్ని చేరగలిగే అవకాశమే వుంటే ప్రతి ఒక్కరూ గమ్యం చేరుకొన గలరు కదా? కాని ఆ విధంగానే జరిగేట్లయితే గమ్యం చేరినవారి పరిస్థితి కూడా వారు బయలుదేరిన సమయాన వున్నట్టి స్థితిగానే వుంటుంది. అంటే ఎక్కడేసిన గొంగళి అక్కడే వున్నట్టు వుంటుందన్న మాట. వారిలో ఏ పరివర్తనా వుండనే వుండదు! అనగా క్రొత్త ప్రపంచం అచ్చం పాత ప్రపంచం వుండినట్లే వుంటుంది. అలాంటిది శ్రమకు తగ్గ ఫలితం అనిపించుకో జాలదు. కనుక అనవసరమైన దానిని త్రోసివేసే ఒక ప్రక్రియ స్పష్టంగా అవసరమే. అప్పుడే నూతన జీవితాన్ని ఆవిష్కరించుటకు సమర్థ వంతమైనదేదో అదే నిలుస్తుంది. ఇదే పరీక్షకు కారణం కాని మరేదీ

కాదు. అంతే కాదు, ఇదే అత్యుత్తమ కారణం కూడ. *కఠిన పరీక్ష లేదా అగ్ని పరీక్షకు నిలువగలిగినదే పరిపూర్ణ పరిశుద్ధంగా తయారవుతుంది. అంతా కాలిపోయిన తర్వాతనే పరిశుద్ధమైన మేలిమి బంగారపు కణిక మిగులుతుంది.* అది అలానే జరుగుతుంది. ఈ విషయంలో మనిషి అంతర్గత దుష్ట సంస్కారాలను చాలావరకు బైటకి నెట్టి వేసేది 'ఇది తప్పు, ఇది పుణ్యము, ఇది ముక్తి' ని తెల్పే మతబోధనమే.

కాని యిందులో నిరంకుశమైన దైవనిర్ణయమేమీ లేదు. అందుకు భిన్నంగా ప్రతివారికి ఉత్తమమైన, అవసరమైన, అనుకూలమైన పరిస్థితులే దైవం కల్పిస్తాడు. మొన్నొకనాడు మాటల సందర్భంగా *భగవంతుడు తన ఆప్తుల పట్లనే కఠినంగా ప్రవర్తిస్తాడని చెప్పుకొన్నాం కదా?* ఈ మాట తమాషాగా చెప్పిన మాట అయి వుండొచ్చని నీవు భావించావు కదూ? కాని అలా కాదు, అది సత్యమైనదే. ముందుచూపుతోను, ఈ పరిశుద్ధ జ్వాల గుండా పయనించగలవారు కూడా వుంటారు. అలాంటి వారికే అత్యధిక ఫలితాలను పొందుటకు అనుగుణమైన పరిస్థితులు సమకూర్చబడి వుంటాయి. తీవ్రవిచారం నీకు సంభవించినపుడు నీకు నీవే, 'ఈ కష్టాన్ని అనుభవించడానికి నేను అర్హుణ్ణి అని ఈ బాధ రుజువు చేస్తుంది. ఈ బాధను యెదిరించి పోరాడగలది యేదో నాలో వుందని రుజువవుతున్నది' అని తెలుసుకో. అపుడు నిన్ను నీవు బాధించుకొనుటకు బదులు సంతోషపరచుకొంటావు. ఇంకను నీవు అలాంటి సమయాన విచారకర పరిస్థితులను సైతము అత్యంత ఉత్సాహంతో స్వీకరించగల శక్తి నీలో గుర్తిస్తావు.

మనిషి మనసు యిలాంటిదే. కావాలంటే పరీక్షించి చూడండి. ఇది చాల సులభ ప్రయోగమే. పరిస్థితి ఎలాంటిదైనా సరే, నీ మనస్సు దానిని కొద్దిగానైనా అనుకూలమైనదేనని భావించడానికి అలవాటుపడితే అది విచారకరంగా అనిపించదు. ఇది ప్రసిద్ధంగా తెలిసిన విషయమే. మనస్సు ఒక విషయాన్ని లేదా ఒక పరిస్థితిని అంగీకరించనంత వరకు అది దాని నెదిరించి శ్రమ

పడుతుంది, పోరాడుతుంది. దాన్ని నిరోధించడానికి ప్రయత్నిస్తుంది. అంతటితో ఆరంభమవుతాయి, లోపల బాధలు, కష్టాలు, తుఫాన్లు, పోరాటాలు. కాని నీ మనస్సు "*మంచిది, ఈ కష్టం నాకు రావలసి వుండే వచ్చింది*" అని భావించిన క్షణాన ఏమి సంభవించినా నీవు బాధపడక, తృప్తిచెంది వుంటావు. తమ దేహంపై ఆ విధమైన మానసిక ఆధిపత్యాన్ని పొంది ఎలాంటి పరిస్థితులలోను బాధపడనట్టి వారున్నారు. అంతేగాదు కొందరు మర్మజ్ఞు (Mystics) లున్నారు. వారిపై విధించబడిన బాధ దైవ సాక్షాత్కారానికి, దైవసాయుజ్యానికి సోపానంగా వున్నదని తోస్తే, వారు ఆ బాధను ఏ మాత్రమూ అనుభూతి నొందరు. వారి దేహం కూడ వారి మనోభావనా బలంచే ఉత్తేజితమవుతుంది. ఈ ఘటన తరచు సంభవించినదే. ఇలాంటి విద్యలో ఉత్సాహమున్న వారిలో అలాంటి అనుభవాలు సర్వసామాన్యములే.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నరసింహయ్య

(*CWM* Vol. 4, pp. 354-55)

శారీరక బాధ ఒక హెచ్చరిక

అసలు ఈ శరీరానికి బాధ లెందుకు కలగాలి బాబూ? నీది దివ్య శరీరం కాదు గదా, అది పాంచభౌతికము. మంటలో చేయి పెడితే చేయి కాలుతుంది. మధ్య మధ్యాన హెచ్చరిస్తూ ఉంటేనేగాని నువ్వు బాగుపడవు. — *సంపాదకుడు*

శారీరక బాధలా? బాధ అనేది ప్రకృతి విధివిధానం అనుట స్పష్టం. ఈ విషయం మీకు తెలుసునని నేను భావిస్తాను. బాధ అనేది ప్రకృతి సూచించు ఒక సూచకము. ఉదాహరణకు శరీర నిర్మాణంలో యేదేని లోపం వుంటే, దాని వల్ల బాధ లేకపోతే, ఆ లోపాన్ని సరిదిద్దుకోవడానికి అవకాశముండదు. బాధ కలిగి

నపుడే రోగాన్ని బాగు చేయించుకోవాలని ఆలోచిస్తారు. అనారోగ్యం వల్ల నీ కెలాంటి బాధా కలుగకపోతే దాన్ని నయం చేసుకోవాలని నీవు అనుకోవు. కనుక ప్రకృతి పొదుపు విధానంలో శారీరక బాధ యొక్క ప్రథమ కారణం నీ కొక హెచ్చరిక నివ్వడమని నేను భావిస్తాను.

దురదృష్టవశాత్తు ప్రాణమయ సత్తా (vital) ఈ విషయంలో అనవసరంగా జోక్యం చేసుకొంటుంది. అది బాధను ఎక్కువ చేయుటయందు, అటు నిటు త్రిప్పుట యందు, సందడి చేయుట యందు వక్రసంతోషాన్ని పొందుతుంది. ఈ అవగుణం మొత్తం దేహప్రక్రియా పద్ధతినే చెడగొడుతుంది. ఎట్లనగా ప్రాణమయ సత్తా యొక్క జోక్యం ఒక సూచకముగ నుండదు. కొన్ని వేళల్లో అది వ్యాధిని గూర్చి, వ్యక్తిలో సుఖానుభూతి కలిగే అవకాశంగా తయారవుతుంది. వ్యాధి పట్ల ఆసక్తి కలిగిస్తుంది. వ్యక్తి తనపై తానే సానుభూతి ప్రకటించుకొనేట్లు చేస్తుంది. అది యిలాంటి హేయములైన కుటిల ఫలితాలను కలిగిస్తుంది. కాని మౌలికంగా బాధ అనేది 'జాగ్రత్త సుమా! నీ దేహారోగ్యంలో క్రమం తప్పింది, జాగ్రత్త!' అని తెల్పే హెచ్చరిక.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నరసింహయ్య

(*CWM* Vol. 6, p. 406; Vol. 4, p. 295)

మానవులు బాధల ననుభవించకపోతే వారెలాంటి అభివృద్ధిని పొందలేరు. మనిషి సంపూర్ణంగా తృప్తి చెంది వున్నప్పుడు, అతని ఆకాంక్ష నీళ్లు కారుతూ అంతంత మాత్రంగానే ఉంటుంది.

శ్రీమాత

శారీరక బాధలు, వాటి పాత్ర

అనేక విధములైన రూపాలను తయారుచేసి ఆఖరికి మనిషిని నిర్మించినప్పుడు అతనిని జూసి దేవతలందరు హర్షించారట. ఇది అలనాటి కథ. ఇప్పుడు ఈ శరీరం కూడ తన ధర్మాన్ని మార్చు కొని దివ్యశరీరంగా మారవలసిన సమయం వచ్చింది. పైనుంచి ఒక శక్తి దిగివచ్చి దానిని మార్చేందుకు ప్రయత్నించినపుడు అది బాధలు పడటం సహజమే. — సంపాదకుడు

ప్రశ్న: శరీరానికి బాధలు ఎందుకని కలుగుతాయి?

ఈ మధ్య చాలా రోజులుగ ఈ శరీరం చాల బాధపడు తున్నది. తరచి చూచినట్లైతే పైనుంచి పనిచేస్తున్న శక్తి ఒత్తిడి వలనే శరీరం బాధపడుతోంది. అయితే ఈ బాధ ద్వారానే ఈ జడత్వము లోనుంచి బయటపడుతుంది కూడా... the action of the Force translated itself externally by what we call "suffering" because that is the only kind of vibration which can pull Matter out of its inertia.

మూలతః భగవంతుడు పరమ శాంతమూర్తి. కాని ఆ శాంతము భౌతికపదార్థంలోకి వచ్చేసరికి తమస్సు, జడత్వములుగ ద్యోతకమవుతుంది. దీని అర్థమేమిటి? పదార్థము యొక్క జడ త్వము దివ్యశాంతి యొక్క ప్రతిరూపమే కనుక దానిని మార్చే పని లేదు. పైనుంచి ఒక మహాశక్తి దిగివచ్చి దానికి షాక్ ట్రీట్ మెంట్ ఇచ్చి జాగృతపరుస్తుంది. శరీరము ఈ షాక్‌ను తట్టుకో లేక విపరీతమైన బాధ పడుతుంది. The supreme Peace, the supreme Calm are deformed and disfigured into inertia and into *tamas*, and precisely because this was the deformation of true Peace and Calm, there was no reason why it should change! A certain vibration of awakening – of reawakening – was necessary to come out of this *tamas*, that could not pass directly from *tamas* to Peace; something was needed to shake the *tamas*, and that is translated externally by suffering.

నేను చెప్పేది శరీరం అనుభవించే బాధలను గురించి – ప్రాణిక, మానసిక ఆవేశపూరిత బాధల సంగతి వేరు. ఎందుకంటే వాటి ప్రాప్తి స్థానము మనస్సు. ఒక్క ముక్కలో చెప్పాలంటే వీట న్నిటిని అనృతము (Falsehood) అని అనవచ్చు. కాని ఈ శారీ రక బాధ ఉన్నదే – అది ఒక పిల్లవాడ్ని కొట్టినట్లు అనిపి స్తుంది. ఎందుకంటే పదార్థంలో falsehood has become igno-rance. (అనృతము అవిద్యగా మారింది.) అంటే ఏమిటి? ఇందులో దురుద్దేశ్యమేమి లేదు. పదార్థంలో దురుద్దేశ్యము (bad will) ఏమీ లేదు. అంతా జడత్వము, అవిద్య. All is inertia and ignorance. అసలు సత్యాన్ని గురించి దానికి తెలియనే తెలియదు. తన మూలము దైవమే అని తెలియదు. శారీరక బాధలను నివారించే అవకాశమున్నదని కూడ తెలియదు. ఈ అసమర్థత (అజ్ఞానము) శరీరకణాల లోనే యున్నది. అది శరీరచైతన్యంలో బాధగా పరి ణమించి శరీరాన్ని ఉత్తేజపరచి పరివర్తనమునకు దారి తీస్తుంది.

శరీరకణాల్లో ఆకాంక్ష పుట్టింది. ఆ ఆకాంక్ష అంతకంతకు తీవ్రతరమవుతుంది. తీవ్రతరమై ఈ పరిణామము ఎందుకింత కష్టమౌతోందోనని ఆ కణాలు ఆశ్చర్యపోతున్నాయి. అంటే ఆ కణాల్లో మృదుత్వము లోపించటం వలన ఈ బాధ ఎక్కువ అవుతుంది. ఆ క్షణంలో ఆ ఆకాంక్ష పదిరెట్లు పెరిగి అతి తీవ్రమై స్థిరంగా వుండిపోతుంది. కాని ఆ తీవ్రతను అలా ఆ స్థాయిలో ఉంచటం కష్టమే. వెంటనే మళ్లి పతనమైపోయి అంతా జడమే అవుతుంది. మళ్లి బాధ పెరగటం, ఆకాంక్ష తీవ్రతరం కావటం, అది అట్లా వుండిపోవటం జరుగుతూ వుంటుంది. *గంటల తర బడి ఏ మాత్రమూ సడలింపు లేకుండ ఆ పిలుపు దైవంతో సాయుజ్యము చెంది దైవమే కావాలని ఆకాంక్షిస్తూ వుంటుంది.* ఇలా ఎందుకని జరుగుతుందంటే బాధ ఎక్కువ కావటమే దానికి కారణం. పైకి వెళ్తూ వుండటం, మళ్ళీ క్రిందికి పడిపోతూ వుండటం, పైకి వెళ్ళడం, పడిపోతూ వుండడం నిరంతరం జరుగుతూనే వుంటుంది. దీనికి అంతం వుండదు. ఈ ప్రక్రియ

త్వరగా జరగాలనంటే కొరడా దెబ్బలు అవసరమని నాకు స్పష్టంగా తెలుస్తుంది.

ఈ పరిస్థితి వున్నప్పుడు అకస్మాత్తుగ ప్రేమపూర్వకమైన దివ్యస్పర్శ కలుగుతుంది. అప్పుడు ఈ బాధ, ఈ ఘోరావస్థను, ఈ వైపరీత్యములను పోగొట్టమని ఒక ఆకాంక్ష పుడుతుంది. అప్పుడు ఆ భగవత్ప్రేమ దిగి వచ్చినప్పుడు "ఆహా! ఈ దివ్యకటాక్షము ఎంత మధురంగా ఉన్నది. ఈ శరీరము ఆ అనుభూతిని ఎలా అనుభవిస్తున్నదో చూడు" అని అనిపిస్తుంది. అప్పుడు మనస్సులోని ఆలోచనలు ఆ దివ్యశక్తిని నాలుగు మూలలా ప్రసరించేందుకు ఒక సాధనం అవుతాయి. ఈ శక్తి, ఈ మధుర స్పందన మున్నదే అది ఈ ప్రపంచం మీద ఒత్తిడి చేస్తుంది. తనను ఎవరైనా గ్రహిస్తారేమోనని వెతుక్కుంటుంది. నీ ఆలోచనా శక్తి చాల ముఖ్యం. *అయితే అది నీ సొంత ఆలోచన కాకూడదు. దానిని భగవంతునికి సమర్పించినపుడు అది ఆయనకు ఒక చక్కటి ఉపకరణము అవుతుంది.* ఉన్నత చైతన్యమే దానిని కదిలించి ఎక్కడికి కావాలంటే అక్కడకు పంపిస్తుంది.

ప్రశ్న: బాధలను పోగొట్టటం ఎలా?

నువ్వు ఒక సంగతి తెలుసుకోవాలి. ఎక్కడైతే కీడు వున్నదో దాని పరిష్కారం కూడ దానితో జతపరచి వుంటుంది. దుఃఖానికి (బాధలకు) చికిత్స కూడ దానితో జతపరచే వుంటుంది. అందుకని నీ కెక్కడైనా 'చెడు' కనబడినపుడు దానిని తిట్టుకోకుండా, "దీనికి కూడ ఒక ప్రయోజనము ఉన్నదిలే, ఈ సృష్టి గతిలో పురోగమనానికి బాధ కూడ అవసరమే. అందుకనే ఈ బాధ వున్నది. దాని వలన ఒక ప్రయోజనము జరగవలసియున్నది" అని తెలుస్తుంది. ఈ దృష్టితో కనుక నీవు వున్నట్లైతే నీ బాధ కూడ మాయమైపోతుంది. కాబట్టి బాధ పురోగమనానికి ఒక సాధనము. పురోగమనము, బాధ, నివారణ ఈ మూడు ఏకకాలంలోనే వుంటాయి.

ఆ క్షణంలో పైనుంచి వచ్చే పరివర్తన శక్తి నీకు కనుక బాధ కలిగించినట్లైతే అందులోనే అవసరమైన ఆకాంక్ష, నివార

ణోపాయము కూడ వుంటాయి. పరివర్తనము జరిగి నీ బాధ కూడ మాయమైపోతుంది. బాధ బదులు ఇంతవరకు ఈ భూలోకంలో తెలియని ఒక అపరిమితమైన సంతోషము, ఆనందము కలుగుతాయి. It is a supersensation, in a perfect peace and which is obviously the only thing that can be eternal. మనము ఆనందం అనే వస్తువును మన భాషలో చెప్పదగినంతవరకు చెప్పడమైనది.

ఈ అనుభూతిని ఇంతవరకు ఈ సృష్టిలో ఎవరూ అనుభవించి యుండరు. చాల స్వల్పస్థాయిలోనే ఏదో యొక మెరుపు మెరిసినట్లు మాత్రమే ద్యోతకమై వుంటుంది. ఇప్పుడిప్పుడే ఆనందము ఇంతటి పూర్ణస్థాయిలో ఈ భూమి మీద తెలియబడుతుంది. కాని ఈ భౌతికపదార్థము, ఈ కణములకు భయము గాని, ఆతురతగాని వున్నాయని చెప్పను గాని ఏదైనా క్రొత్త అనుభూతి కలిగినపుడు, వాటికది అలవాటు లేక ఎలా అనుభవించాలో చేతకాదు. అది బాధగా పరిణమిస్తుంది. ఎప్పుడైతే ఆకాంక్షతో, సమర్పణతో సమర్పించినపుడు ఇక భయము లేదు, బాధ లేదు. అంతా సంతోషమే, పరమానందమే.

ఈ క్రొత్త శక్తిని గురించి చెప్పుకున్నాం గదా, ఈ శక్తి, ఈ కటాక్షము నీలో ఏ విధంగా పనిచేస్తుందో నీవు కనుక గుర్తించినట్లైతే ఇక నీ సమస్య తీరిపోయినట్లే.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 11, pp. 41-44)

అంతరంగిక విముక్తి

డబ్బు, ఆస్తిపాస్తులు మనిషికి సంతోషానిస్తాయిట! మరి ఇదే నిజమైతే అత్యంత సంపన్న దేశాలలో మనుషులు ఎక్కువ క్షోభను అనుభవిస్తున్నారు – ఎందుకని? ఎక్కడో, ఏదో లోపమున్నది. అహంకారమే దీనికి కారణము. అహంకారం పోవాల్నంటే అంతరంగిక విముక్తి పొందాలి. అప్పుడే మనిషి ఉన్నత చేతనాస్థాయిని అందుకోగలడు. ఇక అతని దృష్టే మారిపోతుంది.

– సంపాదకుడు

అహంకారంలోనే జీవిస్తూ, ఆ అహంకారాన్ని తృప్తిపరచాలని చూచేవాడు మూర్ఖుడు. అహంకారాన్ని అధిగమించి, అహంకార రహితమైన ఒకానొక చేతనాస్థాయిని చేరుకొంటే తప్ప నీవు నీ గమ్యాన్ని అందుకోలేవు. తమాషా ఏమిటంటే, అప్పుడిక అహంకారానికి అవసరమే వుండదు. దాని పాత్ర తీరిపోయిందన్న మాట!

ఈ అహంకారము వేర్పాటు భావము వలన కలిగినది. ఎప్పుడైతే పూర్ణవస్తువు నుండి జీవుడు వేరైపోయినాడో అప్పుడే ఈ అహంకారము పుట్టింది. దానితో పాటే అనేకమైన అవరోధాలు, కష్టాలు, దుఃఖము మొదలైన సంకటాలాన్నీ ప్రారంభమైనాయి. వాటినే మనం విరోధమైన లేక అదైవిక శక్తులు అంటున్నాము. కాని మనం అంతరంగికంగా ప్రక్షాళనము గావించుకొని పరిశుద్ధమై అహంకారాన్ని విరగడ చేసుకొనేందుకు ఆ శక్తుల ఆవశ్యకత యున్నది. ఆ శక్తులు పనిజేయడం వల్లనే అహంకారం పుట్టింది. దాని ఆయుర్దాయం పెరిగింది. ఎప్పుడైతే అహంకారం మాయమైపోతుందో అప్పుడీ శక్తులు కూడ నశించిపోతాయి. ఈ ప్రపంచములో వాటి అవసరం తీరిపోతుంది.

అంతరంగికంగా విముక్తమై కల్మషాలు పూర్తిగ పోయి పరిశుద్ధమై చిత్తశుద్ధి కలిగనప్పుడు ఇక బాధ, దుఃఖము ఎక్కడివి? మాయమైపోయినవి. ఉన్నత చైతన్యాన్ని అందుకొని గమ్యాన్ని చేరుటకు ఇక వాటి అవసరం లేదు.

కాబట్టి నీ శ్రాయశక్తులా పాటుపడి అంతరంగిక పరివర్త నము సాధించుటయే నీ కర్తవ్యము. అప్పుడే నీవు నీ బాధలను జయించి ఫలితాలను అనుభవించెదవు. ఇక దుఃఖంయొక్క ఆవ శ్యకత తీరిపోయినట్లే గదా!

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 3, p. 218)

బాధ కూడ ఒక సాధనమే

బాధలను జీవుడు కోరి తెచ్చుకుంటున్నాడనుకుంటారేమో, అదేమీ కాదు. నిన్ను నిద్ర నుండి లేపేందుకు, దైవం కోసం ఆకాంక్షింప చేసేందుకు అది ఒక సాధనము. నువ్వు సుఖసంతో షాలలో మునిగి తేలుతున్నంత కాలం అది జరగదు. కాని నొప్పి కలిగినప్పుడు భరించలేనంతగా నిన్ను కుదిపివేసినప్పుడే నువ్వు కళ్ళు తెరిచి "అరె ఏమయింది" అని ఆలోచించడం మొదలు పెడతావు. *— సంపాదకుడు*

బాధ కలగడం లోని గూఢార్థమేమిటో, అది మనని ఎక్కడికి చేరుస్తుందో పరిశీలిద్దాము. బాధ అనేది ఆత్మకు అవసరమని కొందరి నమ్మకం. కేవలం బాహ్యదృష్టితో, అరకొర జ్ఞానంతో వారలా అనుకోవచ్చు. కానీ అది నిజం కాదు. ఆత్మయొక్క నిజ ధర్మం ఆనందం – సుస్థిరంగా ఒడిదుడుకులు లేకుండా, బేషర తుగా కలిగే అమందానందం. బాధ కలిగినప్పుడు ఓర్పుగా, దైవ కృప యందు అచంచల విశ్వాసంతో ఆకాంక్షిస్తూ దాన్ని తప్పిం చుకోవాలనుకోకుండా పట్టుదలతో దాన్ని అనుభవిస్తే జాజ్వల మానమైన సత్యాన్ని, ప్రతివస్తువులోనూ మూలాంశగా వెలుగు తున్న పరమానందాన్ని పొందవచ్చు. ఆ విధంగా ఆనంద కవా

టాలు బాధ ద్వారా తేలిగ్గా, సూటిగా తెరుచుకుంటాయి. సంతృప్తి దొరికే సందర్భం కంటే బాధానుభూతులే దగ్గిర దారి అన మాట.

నేను ఒట్టి సంతోషాన్ని (pleasure) గురించి కాదు చెపుతున్నది. అద్వైతే ఈ సంపూర్ణ దివ్యానందం నుంచి నిరంతరం వైదొలగి పోతుంటుంది.

సంతోషమనేది ఒక రకంగా మనని మభ్యపెట్టి మన లక్ష్యానికి దూరం చేస్తుంది కాబట్టి సత్యం కావాలనుకునేటప్పుడు దాని మోహంలో పడకూడదు. సంతోషం మనని పూర్తిగా హరించి వేస్తుంది, మనని మోసం చేస్తుంది; లక్ష్యాన్నుంచి దారి మళ్ళిస్తుంది. బాధ మళ్ళీ మనల్ని లక్ష్యం వైపుకి మరల్చి దాన్ని భరించడానికి సలిపే ఏకాగ్రత ద్వారా మనని నాశనం చేయటానికి వచ్చిన దాన్ని ఎదుర్కొనేటట్లు చేస్తుంది. దృఢంగా ఉన్నట్లైతే బాధ ద్వారా మన అసలైన శక్తిని తిరిగి పొందవచ్చు. నమ్మకం సడలినప్పుడు బాధ ద్వారానే దాన్ని తిరిగి పొందవచ్చు. బాధకు అతీతంగా ఉండేదే విశ్వాసము.

తనను తాను మరచి సుఖసంతోషాలతో మునిగి తేలుతూ దేన్నీ సీరియస్‌గా పట్టించుకోకుండా, అన్నీ తేలికగా తీసుకుంటూ జీవితాన్ని గడిపేస్తే మనం ఒక అమూల్యావకాశాన్ని పోగొట్టుకున్నట్లే. అంటే జీవితంలో పరిష్కరించవలసిన ఒక సమస్య ఉన్నదనీ, మనం అన్వేషించవలసిన వస్తువు ఒకటి ఉన్నదనీ, బ్రతుకుకి ఒక అర్థం, పరమార్థం ఉన్నాయనీ, జీవితం ఊరికే గడిపేసి వెళ్ళిపోవటానికి కాదనీ, ఇక్కడుండి ఏమీ నేర్చుకోకుండా, ఏమీ సాధించకుండా ఉండటం వ్యర్థమనీ, అనుకోకుండా ఆదమరచి బ్రతికేవారు ఒక అద్భుత అవకాశాన్ని జారవిడుచుకుంటున్నారన్న మాట. అది అపురూపమని కాదు గాని, పురోగమనానికి సరైన క్షేత్రమూ, జీవిత రహస్యాలని గ్రహించగల సమయమూ కాబట్టి ఈ జీవితావకాశాన్ని వదులుకోకూడదని నా ఉద్దేశము. ఈ అవకాశం జీవిత పరమార్థాన్ని గ్రహించి నిన్నొక అడుగు ముందుకు నడిపిస్తుంది. ఆ విధంగా పురోగమించి దివ్యజీవనంలో ఉండే శాశ్వత పరమానందంతో అనుసం

ధానం చేయగల పరమ రహస్యాన్ని నీకు కరతలామలకం చేస్తుంది.

పై పేరాకు ఆంగ్లమూలం:

When one enjoys oneself and forgets, when one takes things as they come, tries to avoid being serious and looking life in the face, in a word when one seeks to forget, to forget that there is a problem to solve, that there is something to find, that we have a reason for existence and living, that we are not here just to pass our time and go away without having learnt or done anything, then one really wastes one's time one misses the opportunity that has been given to us, this – I cannot say unique, but marvellous opportunity for an existence which is the field of progress, which is the moment in eternity when you can discover the secret of life; for this physical, material existence is a wonderful opportunity, a possibility given to you to find the purpose of life, to make you advance one step towards this deeper truth, to make you discover this secret which puts you into contact with the eternal rapture of the divine life.

(నిశ్శబ్దం)

అలాగని బాధలను కావాలని ఆహ్వానించడమో లేక శరీరాన్ని చిత్రహింసలకు గురి చెయ్యటమో మూర్ఖత్వమే అవుతుంది. అయితే బాధలను తప్పించుకొని తిరిగే ప్రయత్నాలుగానీ, పైపైన చేసే అల్పచర్యలు గానీ, దాని పైనుంచి వేరే విషయాల పైకి దృష్టి మరల్చే ప్రయత్నాలు గానీ పిరికితనమనే అనిపించుకుంటుంది. *నీకు బాధ కలిగిందంటే ఏదో ఒకటి బోధించడానికే వచ్చిందని తెలుసుకోవాలి. అది ఎంత త్వరగా గ్రహిస్తే అంత త్వరగా బాధపడే అవసరం తీరిపోతుంది. ఎందుకంటే ఆ రహస్యంతోనే బాధకు ఉత్పత్తి ఏదో, కారణమేదో దాన్ని అధిగమించడమెలాగో తెలుస్తుంది.*

అసలు రహస్యమేమంటే అహం నుంచి బయటపడాలి. ఆ బంధిఖానా నుంచి విముక్తి పొంది, భగవంతునితో సాయుజ్యం పొంది ఆయనలో లీనం కావాలి. ఆయన నుంచి మనని వేరు చేసేదాన్ని దేనినీ కూడా సహించకూడదు. ఆ రహస్యాన్ని ఒక్క సారి ఆవిష్కరించుకొని తమలో దాన్ని సిద్ధింపచేసుకుంటే బాధ తన ఆధారాన్ని కోల్పోతుంది. వేదన మాయమైపోతుంది. అతి శక్తివంతమైన ప్రతిక్రియ ఇదే.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 9, pp. 40-42)

బాధ – ప్రకృతి మనకు నేర్పే పాఠం

ఈ శరీరం బాధ నెంతవరకు భరించగలదు అనేదే ప్రశ్న. మానవ మనస్సు ఈ బాధను గురించి అదే పనిగా ఆలోచించడం వల్ల బాధ ఎక్కువౌతుంది. దానిని అదుపుచేస్తే అంతకంటే ఎక్కువ బాధను భరించడం సాధ్యమే. – *సంపాదకుడు*

ప్రకృతి మాత స్పర్శనే మనం బాధ అనుకుంటాము. బాధను భరించి ఆనందాతిరేకంలో పరవశించి ఎలా వృద్ధి పొందాలో నేర్పించేదే ఈ స్పర్శ. అమ్మ మూడు దశల్లో ఇది నేర్పిస్తుంది. అది ఓర్మి, సమత, ఆనందపారవశ్యము.

శ్రీఅరవిందులు (*మెరపులు – తలపులు*)

నువ్వు బాధల పట్ల ఉదాసీనంగా ఉన్నప్పుడు ఆ సహనమే నీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది నిన్ను సూటిగా ఆనందం వైపుకి నడిపి స్తుంది. అయితే ఆ బాధల పట్ల సరైన వైఖరి అవలంబించ గలి గితేనే ఇది సాధ్యమవుతుంది. దైహికబాధల సంగతి వేరుగా ఉంటుంది.

దేహానికి బాధను సహించడమెలాగో నేర్పిస్తే అది అంత కంతకు తన్యతను పొంది (resilient) చెక్కుచెదరకుండా చక్కగా ఉండగలదు. కొంచెం బాధ కలగంగానే తలక్రిందులై నంతులత చెడగొట్టుకోకుండా నిశ్శబ్దంగా భరించడం నేర్చుకుంటే శరీరానికి అస్వస్థతను ఎదుర్కొనే శక్తి ఇనుమడిస్తుందని చెప్పవచ్చు. అలా జరగటం నిజంగా గొప్ప విషయమే. కేవలం బాహ్యదృష్టితో ప్రాక్టికల్‌గా నన్ను నేను ప్రశ్నించుకుంటే నాకు తోచింది ఇదే. అంతర్గతంగా కూడా చిన్న చిన్న అనుభవాల వల్ల కూడా ఇది నిజమని తేలింది. ఈ శరీరం మనం అనుకున్నదాని కంటే ఇంకా చాల ఎక్కువే భరించగలదు. అలా ఓర్చుకోవాలంటే దానికి భయం, ఆందోళన ఉండకూడదు. మనస్సు అడ్డురాకుండా శరీరం తనకు తానై ఉన్నప్పుడు దానికి భయంగానీ, ఆందోళన గానీ, జరుగబోయే దాన్ని గురించి శంకగానీ ఉండదు. ఏ వ్యధా కలగదు. ఎంతైనా భరించగలదు.

రెండవది: శరీరం బాధను భరించాలని తీర్మానించుకుంటే, అది అలా నిశ్చయించుకొని సిద్ధపడితే బాధ తీవ్రత మటుమాయమవుతుంది.

నీవు ప్రశాంతంగా ఉంటే (అంతర్గతమైన ప్రశాంతత చాలా అవసరం) బాధ ఒక ఆనందానుభూతిగా మారుతుంది. ఆనందమంటే అదేదో సుఖాన్నిస్తుందని కాదుగానీ, నీకొక శమన కలుగుతుంది. ఇది ఒక దైహిక అనుభవం మాత్రమే, ఆఖరు స్థితి దైహిక కణాలలో దైవంపై విశ్వాసం కుదరటము, భగవంతుని పైనా, భగవత్సంకల్పం పైనా, ఆయన ఆధిపత్యం పైనా అచంచల విశ్వాసం ఏర్పడి అంతా మంచికే జరుగుతోందనుకున్నప్పుడు ఒక పరవశం కలుగుతుంది. దేహకణాలన్నీ విచ్చుకొని, తేజోపూరితములై దివ్యానుభూతిని పొందుతాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 10, pp. 170-71)

ఈ శత్రువు అంతరించేదెప్పుడు?

ఆనందం వేరు. ఇంద్రియములు 'సుఖము' అని అనుకుండేది వేరు. శ్రీమాత చాలా చమత్కారంగా ఈ విషయాన్ని చెప్పారు. ఈ 'సుఖము' ఒక మత్తుమందు లాంటిదట. మనం దాంతోటి తృప్తిపడి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది' అన్నట్లు ప్రవర్తిస్తామట. ఇది దైవసామ్రాజ్యాన్ని రాకుండా చేసే దుష్టశక్తుల పన్నాగము.

—. సంపాదకుడు

వేర్పాటు భావంతోనే బాధ, వ్యధ, దుఃఖము, అవిద్య, అసమర్థత మొదలైనవన్నీ ఏర్పడ్డాయి. సంపూర్ణమైన ఆత్మార్పణ, ఆత్మ విస్మరణలు సర్వసమర్పణ ద్వారా కలిగినప్పుడు బాధ అదృశ్యమై, దాని స్థానంలో అనాచ్ఛాదిత ఆనందం నెలకొంటుంది.

ఈ విధంగా ప్రపంచంలో ఆనందం స్థిరపడినప్పుడు నిజమైన పరివర్తనం జరిగి ఒక సరికొత్త జీవనం, సరికొత్త సృష్టి, సరికొత్త సిద్ధి ఏర్పడతాయి.

నిజం చెప్పాలంటే దుష్టశక్తుల (adversary) వల్లనే బాధ అనేది ప్రపంచంలోకి వచ్చింది. కేవలం ఆనందం మాత్రమే దాన్ని పూర్తిగా జయించగలదు.

(దీర్ఘ నిశ్శబ్దం)

సృష్టికార్యం చేసింది ప్రమోదమే (delight) కాబట్టి అది కూడ ఈ పని చేయగలదు.

(నిశ్శబ్దం)

నేను ఇక్కడ మాట్లాడుతున్నది సాధారణంగా అందరూ అనుకునే సంతోషాన్ని గురించి కాదు. అది నేను చెప్పిన ఆనంద స్థితి దరిదాపులకి కూడ రాదు. అది కేవలం మనుషుల్ని దారి మళ్ళించడానికి కల్పించిన అసురసృష్టి; సుఖభోగాల వల్ల కలిగే భ్రమ తప్ప ఇంకేం కాదు. ఇంకా చెప్పాలంటే అసలు కర్తవ్యాన్ని విస్మరించి, ఉపేక్షించడంవల్ల పొందే సుఖభావము.

(నిశ్శబ్దం)

నేను చెప్పే ఆనందం పరిపూర్ణ ప్రశాంతస్థితి, క్రీనీడలు లేని వెలుగు, అదే సామరస్యము, సంపూర్ణమైన సౌందర్యము, అనివార్యమైన ఒక శక్తి. ఆ ఆనందం సాక్షాత్తు భగవంతుడే, అతని సంపూర్ణత్వం, అతని సంకల్పము, దివ్యసిద్ధి.

ప్రశ్న: అమ్మా! ఆనందమే శత్రువును జయించగలదు అన్నారు కదా! కానీ శత్రువును జయిస్తే కదా ఆనందాన్ని పొందేది

కానే కాదు. శత్రువును లెక్కచేయకుండా దాటి వెళ్లిపోవాలి. మొట్టమొదటగా నీవు వాని ప్రభావం నుంచి బయటపడాలి. వాని ప్రభావంనించి బయటపడటం ఒక ఎత్తు. వానిని జయించడం మరో ఎత్తు. ఈ రెండింటికీ తేడా ఉంది. వాణ్ణి జయించడం అంత తేలిక కాదు. వాడి కంటే ఎక్కువ శక్తి సంపన్నుడవు కావాలి. కాని వాని ప్రభావం నుంచి పూర్తిగా బయటపడి స్వేచ్ఛను పొందటం నీ చేతిలోనే ఉంది. అట్లా బయటపడిన క్షణం నుంచీ నీ ఆత్మసమర్పణ సంపూర్ణం కాగలదు. అలా సంపూర్ణంగా సమర్పణ చేసుకున్నప్పుడు ఆనందం లభిస్తుంది. ఆ విధంగా శత్రువుని పరాజితుణ్ణి చేసి పూర్తిగా పారద్రోలటానికి చాలా ముందరగానే ఆనందాన్ని చేజిక్కించుకుంటావు.

ఈ ప్రపంచంలో వాని అవసరం తీరిపోయినప్పుడు ఆ శత్రువు దూరమైపోతాడు. కానీ వాని ఆవశ్యకత మనకి బాగా తెలుసు. బంగారపు స్వచ్ఛత తెలుసుకొనే గీటురాయి మాదిరిగా వాని అవసరం మన కుంది.

ఎవ్వరైనా నిజమైన విధేయత కలిగి ఉండేటట్లైతే ఆ శత్రువు వారి దరిదాపులకు రాలేడు. ఇక్కడ విధేయత అంటే నేనూ, శ్రీఅరవిందులు చెప్పినట్లు మీలో ఏ భాగమూ కూడా మీ ఆకాంక్షను గానీ, ఆత్మసమర్పణ గావించుకోవాలనే సంకల్పాన్ని గానీ ప్రశ్నించకూడదు. ఏ భాగమూ కూడా స్వతంత్రించి తన ఇష్టప్రకారం నడుచుకోటానికి దొంగవేషాలు వేయకూడదు. అది కపటం, దుష్టత్వం, మోసంతో కూడిన అనేక వేషాలు వేస్తుంది. దురదృష్టం ఏమంటే మానవునికి తనను తానే మోసం చేసుకొనే

స్వభావం అంతర్గతంగా ఉంది. అలా మోసం చేసుకుంటున్న కొద్దీ అది మోసమనే జ్ఞానం తక్కువైపోతుంది. అలా కాక ఎవ రైనా అచ్చంగా విధేయులై నడుచుకుంటే మాత్రం ఆ శత్రువు వారి దరికి చేరలేడు. వాడు ఆ ప్రయత్నం కూడా చేయడు. ఎందుకంటే ఆ ప్రయత్నమే వాడి వినాశము కదా!

మూలం: శ్రీమాత

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 7, pp. 401-03)

బాధ నుండి ఉపశమనం పొందే మార్గం

ప్రతివారు అనేక కారణముల వలన తమ శరీరములోని వివిధ భాగములలో నొప్పులతో బాధపడుతూ ఉంటారు. వాటిలో శారీ రక రుగ్మతలు, సమతౌల్యము లోపించుట ప్రధానమైనవి. వాటికి సముచితమైన చికిత్స, సకాలములో చేసి, వారిని బాధించే నొప్పిని తగ్గించవచ్చు.

భౌతిక అసమానతలకు, రుగ్మతలకు గల కారణములను సమూలముగా నిర్మూలించకపోతే వాటి ద్వారా తరచూ నొప్పితో బాధపడుతూనే ఉంటారు. ఏ కారణము వలన బాధ వచ్చినప్ప టికీ నాడీమండలంలోని నరముల ద్వారా జరిగే దాని ప్రసార మును స్తంభింప చేసినచో ఆ నొప్పి వెంటనే తగ్గిపోతుంది.

బాధ నివారణకు రెండు ప్రధానమైన మార్గములు వున్నవి. అవి 1) శరీరము లోపలనుంచి వచ్చే నివారణ మార్గము, 2) శరీ రమునకు వెలుపల నుంచి వచ్చే నివారణ మార్గము. వీటిలో మొదటిదైన శరీరము లోపల నుంచి వచ్చే నివారణ మార్గముల ద్వారా చాలా కాలము శాశ్వతంగా బాధ నుంచి ఉపశమనము లభించును. శరీరానికి బాహ్యంగా వున్న నివారణ మార్గముల వలన బాధ తాత్కాలికంగా మాత్రమే తగ్గుతుంది. వైద్యచికిత్స శరీరమునకు బాహ్యంగా వున్న నివారణ మార్గము.

దంతముల నొప్పి వలన బాధ పడే వ్యక్తులు వున్నారు. వీరిలో సుకుమారులైన కొందరు "నాకు నొప్పి తీవ్రముగా వున్నది. ఈ బాధను భరించలేను" అని బిగ్గరగా కేకలు వేస్తూ వుంటారు. ఆ విధంగా చేయటం వలన వారి నొప్పి తగ్గుతుందా? తగ్గదు. "నొప్పి భరించలేను" అని ఎంత బాధపడినప్పటికీ ఆ దంతముల నొప్పి నుంచి ఉపశమనం లభించదు. నొప్పి వచ్చిన దంతములు కదలకుండా పూర్తిగా విశ్రాంతిగా వున్నప్పుడు మాత్రమే నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

శరీరములో గల వివిధ అవయవాలలో దేనికైనా వ్యాధి రావచ్చు. వ్యాధి వచ్చినప్పుడు నొప్పి వస్తుంది. ఏ అవయవము నకు రుగ్మత వచ్చి నొప్పి, బాధ కలిగినప్పుడు, ఆ వ్యక్తి దానిని. అనగా, రుగ్మత గల ఆ అవయవమును కదపకుండా పూర్తిగా విశ్రాంతిగా వుండాలి. దీనికై వైద్యశాస్త్రంలో 'మత్తుమందు' ఇచ్చి నొప్పితో బాధపడకుండా చేస్తారు. మత్తుమందు యివ్వకుండా రోగము వచ్చిన అవయవమును కదపకుండా విశ్రాంతిగా వుంచటం కూడా సాధ్యమే. అట్టి స్థితిని 'సాధన' ద్వారా పొంద వచ్చు.

శరీరమునకు బైట నుంచీ డాక్టరు ఇచ్చే మత్తుమందు జబ్బుచేసిన ఆ అవయవము నుంచి ఆవిర్భవించే నొప్పిని నాడీ మండలముల లోని నరము దానిని అనగా, ఆ నొప్పిని ప్రసారము చేయకుండా తాత్కాలికంగా నిలిపివేస్తుంది. నాడీమండలములో నరము ద్వారా జరిగే ప్రసారము మెదడుకు చేరటం ఆగిపోవుట వలన ఆ వ్యక్తికి నొప్పి తెలియదు. శరీరము లోపలి నుంచీ అనగా సాధన ద్వారా నొప్పి వచ్చే భాగమునందు గల నాడీమండలము లోని నరము ప్రసారము స్తంభించుట వలన ఆ వ్యక్తికి నొప్పి తెలియదు.

ఎవ్వరైతే తమ మనస్సును చిత్తమును అదుపులో వుంచు కుంటారో అట్టి వ్యక్తుల నాడీమండలములో నరములు కూడా వారి అదుపులో వుంటాయి. దీనిని సాధించటానికి 'సాధన' ఉప యోగపడుతుంది.

అట్టి సాధన ఆరోగ్యవంతులైన స్త్రీపురుష లందరూ సుల భంగా చేయవచ్చు. క్రికెట్, ఫుట్‌బాల్ మున్నగు ఆటలు ఆడుతు న్నప్పుడు, వ్యాయామం చేసేటప్పుడు ఆటగాళ్ళకు గాయములు తగులుతూ ఉంటాయి. ఆ విధంగా గాయములు తగిలినప్పుడు నిస్సహాయంగా బాధపడుతూ చాలామంది చతికిలబడి కూర్చుం టారు. అలా కాకుండా గాయమైన భాగములోగల నాడీమండలం లోని నరము, ఆ బాధను మెదడుకు ప్రసారం చేయటం వలన తమకు నొప్పి కల్గుతోంది అని గ్రహించి, ఏకాగ్రత కలిగిన చిత్త ముతో దానిని నిలిపివేయ గల్గినచో ఆ వ్యక్తుల బాధ వెంటనే తగ్గిపోతుంది. వెంటనే వారు ఆటలో పాల్గొంటారు.

మీరు ఎవరైనా నొప్పితో బాధపడుతున్నప్పుడు నొప్పి వున్న భాగములోగల నాడీమండలంలోని నరము చేసే ప్రసార మును మీ అధిమనస్సు ద్వారా స్తంభింప చేయడంలో కృత కృత్యులవ్వాలి. నిర్మలమైన మనస్సు కల్గినప్పుడు అలా చేయటం సులభమే! ప్రయత్నించి చూడండి!


మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ టి.వి.ఎ.ఎస్. శర్మ

(*CWM* Vol. 6, pp. 406-08)

భగవంతుడు బాధను మనకు నాలుగు దశలవారీగా ఇస్తున్నాడు. బాధ బాధగానే ఉండటం ; బాధ ఆనం దాన్ని కలుగచేయడం ; బాధే ఆనందంగా కావడం ; అది పూర్తిగా ఆనందంతో పరవశించిపోవడం.

శ్రీఅరవిందులు



The Mother

నీలో నువ్వు క్రుంగి కృశించి పోవద్దు

నీకు ఒక్కొక్కప్పుడు జీవితం అంటే విసుగుపుట్టి చాలా బోరు కొడుతుంది కదూ!. దానికీ ఒక ప్రయోజన మున్నది. 'నేనేదో నేర్చుకోవాలన్న మాట. నన్ను సుషుప్తి నుండి మేల్కొలిపి పురో గమింప జేయుటకే అలా జరుగుతుంది' కాబట్టి ఈసారి నీకేం తోచనప్పుడు నిన్ను నీవు లోతుగా పరిశీలించుకో.

– సంపాదకుడు

కొన్ని సందర్భాలలో జరిగే ప్రతి సంఘటనతో నీవు నిరుత్సా హాము చెందుతావు. అంతే కాదు, మరికొన్ని విషయముల వలన నీవు విసుగు చెంది, మూఢుని వలె కూడా ప్రవర్తిస్తావు. అటు వంటి సమయములలో నువ్వు క్రుంగి కృశించి పోవద్దు. 'విసు గును కల్గించే ఈ విషయముల ద్వారా నేను సరికొత్త సంగతు లను తెల్సుకోవాలి. వీటి ద్వారా నేను కొంచెమైనా అభివృద్ధిని సాధించాలి. నాలో వున్న సోమరితనాన్ని జయించాలి. నాలోని బలహీనతలను అధిగమించాలి' అని తీర్మానించుకోవాలి.

నీ జీవితంలో ఎదురుదెబ్బలు ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు, విధితో పోరాటం చేస్తున్నప్పుడు, దురదృష్టములు నిన్ను వెంటా డుతున్నప్పుడు కూడా నిరుత్సాహాము, నీరసము వచ్చి, నీవు మూఢుని వలె ప్రవర్తిస్తావు. అటువంటి ఆపత్కర సమయములో నీకు మరుపు వస్తుంది. తెలిసిన వాటి నన్నింటినీ ఆ కంగారులో మరిచిపోతావు. నీకు పరధ్యానము కల్గుతుంది. ఆ పరధ్యానములో తెలివితక్కువగా ప్రవర్తిస్తావు.

మిక్కిలి బాధను కలిగించే సన్నివేశమును ఎదుర్కొనవల సిన పరిస్థితి నీకు వాటిల్లినప్పుడు నీవు మొద్దుబారి పోవద్దు. దిగ్భ్రాంతి చెంది, సొమ్మసిల్లి తెలివితప్పి, మూర్ఛపోవద్దు. నీకు తీవ్రమైన బాధను కలిగించిన విషయములను లోతుగా పరిశీలించు. అప్పుడు మాత్రమే దాని హృదయాంతరములలో గల దివ్యమైన కాంతి నీకు గోచరమౌతుంది.

ఆ కాంతికిరణముల సహాయముతో నిన్ను క్రుంగతీస్తున్న బాధలో దాగివున్న సత్యము, స్థైర్యము (శక్తి) ఆనందము నీకు గోచరమౌతాయి. నువ్వు క్రుంగి కృశించకుండా స్థిరమైన చిత్తము కల్గివున్నప్పుడు మాత్రమే ఆ దివ్యత్వము నీకు సాక్షాత్కారమౌతుంది.

ఆ విధంగా వుండగల్గినప్పుడు మాత్రమే జరుగుతున్న ప్రతి సన్నివేశమును (గొప్పదైనది కావచ్చు లేదా సూక్ష్మమైన దానినైనా) సద్వినియోగము చేసుకొని నీవు అభివృద్ధి సాధించగలవు. ఎంతటి నిస్సారమైన విషయములోనైనా దాగుకొని వున్న రహస్యమును తెల్సుకొని దాని ద్వారా నీవు లాభము పొందుతావు. నీ మనస్సును పూర్తిగా లగ్నము చేయకుండా నీవు యితరులతో సంభాషించు సందర్భములలో కూడా కుతూహలం కలిగించే నూతన విషయములను గురించి తెల్సుకొనగల పరిశీలనాశక్తిని నీవు అభివృద్ధి చేసుకోవాలి.

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: డా॥ టి.వి.ఎ.ఎస్. శర్మ

(*CWM* Vol. 12, pp. 74-75)

నీవు కష్టపడి నీ బలహీనతలను జయించాలి. నీ హద్దులను దాటిపోవాలి. ముఖ్యంగా నీ అహంకారంతో 'అయ్యా, నీ కాలం తీరిపోయింది. తమరిక దయచేయండి.' అని చెప్పాలి. మనకు కావలసినది అహంకారంలేని ఒక నూతన జాతి. అహంకారము స్థానే దివ్యచైతన్యముగల జాతి.

శ్రీమాత

(*CWM* Vol. 11, p. 307)

కష్టాలకు కారణాలు, నివారణోపాయాలు

ఈ సృష్టికంతటికీ మనిషంత దుఃఖజీవుడు వేరొకడు లేడట. జంతువులకు వివేచన శక్తి లేదు. రేపేం జరగబోతోందని విచారించ నవసరం లేదు. కాని మనిషి అలా కాదే.! జంతువులకు సమస్యలే వుండవు. మనిషి సంగతి వేరే చెప్పక్కర్లేదు. దీని కొక్కటే మార్గము. ఈ మనస్సును దాటిపోవాలి. ఉన్నత చైతన్యాన్ని సంపాదించాలి. ఇక నీ సమస్య లన్నిటిని అదే పరిష్కరిస్తుంది. — *సంపాదకుడు*

బ్రతుకు తీరులో మనిషికి, పశువుకు వైవిధ్యం ఉంది. మనిషికి తన బ్రతుకు తీరును గురించి ఆలోచించే బుద్ధికుశలత ఉంది. పశువుకు అది లేదు. దానంతట అదే యాంత్రికంగా ఎట్టి ఆలోచనా లేకుండానే జీవిస్తుంది. అందుకే అది హాయిగా నిశ్చింతగా బ్రతుకుతుంది. తన అస్వస్థత, బాధ, ప్రమాదాలను అది ఊహించ లేదు. ఆ స్పృహే దానికి ఉండదు.

మానవులు నిరంతర దుఃఖభాజనులు — రాబోయే వ్యధలను, ప్రమాదాలను, అతిగా ఊహించుకుంటూ, కల్పన చేసుకుంటూ బాధపడుతూ ఉంటారు. భూమి మీద జీవించే జీవరాసులలో అత్యంత వేదనాపరుడు మానవుడే అంటే సత్యదూరం కాదు. మనిషికి ఇది తన పూర్వీకుల నుంచి అనువంశికంగా వస్తున్న దిక్కుమాలిన వ్యాధి. దీని నుంచి విముక్తికి ఒక్కటే మార్గం. నిమ్న చేతనాస్థాయి నుంచి ఉన్నతంగా ఎదిగి, అచంచల విశ్వాసంతో, పరిపూర్ణ అర్పణభావంతో దివ్యచేతనా స్థాయిలో బ్రతుకు పండించుకో గల్గటమే! ఈశ్వరుని చేతిలో ఉపకరణంగా మిగిలి ఉండటమే.

సహజాతమైన చైతన్యాన్ని వదులుకొని మనిషి పశుస్థాయికి దిగజారలేడు. తాను ఉన్న దౌర్భాగ్య పరిస్థితి నుంచి బయటపడే మార్గం ఒక్కటే. నిమ్నస్థాయి నుంచి దృఢవిశ్వాసంతో తేజోమయ పరమోన్నత చైతన్యస్థాయికి పరివర్తన చెందటమే!

నిర్లక్ష్యంగా తెగిన గాలిపటంలా బ్రతికే హీనమైన బ్రతుకు మరొకటి ఉండదు. పశువు తనకు తానుగా సమస్యలు సృష్టించుకోదు. అంతర్బుద్ధి (instinct) ప్రచోదనతో అలా అలా బ్రతికేస్తుంది. పశువుకి సామూహిక చైతన్యం (collective consciousness) ఉంటుంది. దాని బలంతో అంతర్నిహితమైన స్వయంచాలక తెలివితో బాహ్యేంద్రియ ప్రేరణ లేకుండానే అది జీవిస్తుంది. మనకు మల్లె దానికి ముందుచూపు లేదు. 'తన బ్రతుకు బాధ్యత తనది కాదు' అనుకున్నట్లుగా జీవిస్తుంది. అందుకే దానికి ఏ బాదరబందీలు ఉండవు. మనిషి అయితే బ్రతుకుభారం అంతా తానే భరిస్తున్నట్లు దేవురించుకుపోతాడు. తన్ను తానుగా ఉన్నత చైతన్యానికి అర్పించుకొని తానొక ఉపకరణంగా మిగిలివుంటే ఏ పేచీపూచీలు ఉండవు కదా!

కాకపోతే ఇందుకు తగిన వివేకం కావాలి. దురదృష్టం వల్ల మనిషి వల్లమాలిన కర్తృత్వభావంతో బ్రతుకుతాడు. అబ్బ! ఇప్పుడు నేను ఏం చేయాలి? ఏమి కాబోతోంది? ఈ నిరంతర శేషప్రశ్నలతో తలక్రిందులౌతూ ఉంటాడు.

కాబట్టి ఏ ఆధ్యాత్మిక శిక్షణ అయినా, 'అన్యథా శరణం నాస్తిత్వమేవ శరణం మమ' అన్న మూలసూత్రంతో ప్రారంభింపబడవల్సినదే! లేకపోతే చిత్తశాంతి దుర్లభం.

సాధారణ జీవిత కార్యకలాపాలకి, బాహ్యేంద్రియ కర్మలకి దూరమైతేనే తప్ప నిశ్చల నిర్వికల్ప సమాధి సిద్ధించదనే ధోరణి (ఇది సంప్రదాయ సన్యాసధోరణి) ఉన్నది. దీనికి మించిన కార్యక్రమం ఒకటి వున్నది. విశ్వాసము, ఆకాంక్ష ప్రాతిపదికలుగా, ప్రతిఫలాపేక్ష లేక (ఆధ్యాత్మిక) పురోగమనం ధ్యేయంగా కర్మాచరణ చేస్తూ సాధన సాగించడం. ఈ పరమార్థ సాధన కొరకే వ్యక్తికి చైతన్యం (consciousness), పశువుకు లేనిది ప్రసాదించబడినది.

(ఈ చైతన్యం ఆలంబనగా) పరమోన్నత దివ్యశక్తి పట్ల పరిపూర్ణ విశ్వాసంతో నిశ్చలంగా నిరామయంగా సమస్యల నెదుర్కొంటూ వేసే ప్రతి ముందడుగూ (పరిణామక్రమంలో) వ్యక్తికి

దృఢమైన ప్రగతిశీలమైన ముందడుగు అవుతుంది. ఆధ్యాత్మిక సాధనలో ఇది ఓ నూతన దృక్పథం.
పై రెండు పేరాలకు ఆంగ్లమూలం:

The next step is to face the problem, but with the calm and certitude of an absolute trust in the supreme Power which knows, and can make you act. And then, instead of abandoning action, one can act in a higher peace that is strong and dynamic.

This is what could be called a new aspect of the divine intervention in life, a new form of intervention of the divine forces in existence, a new aspect of spiritual realisation.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 9, pp. 303-05)

బాధితులకు ఓ సందేశం

మన దుఃఖానికి మూలకారణం ఈ పాంచభౌతిక శరీరంయొక్క జడత్వమే. అయితే అటువంటి జడపదార్థంలో కూడ దేవుడు తన ప్రేమను నిక్షేపించాడు. నువ్వు దానిని కనుక పిలిచినట్లయితే అది తప్పకుండా నిన్ను ఆదుకుంటుంది. — సంపాదకుడు

చితికిపోయి, క్రుంగిపోయి, దెబ్బతిని, పడిపోయి, జీవితంలో ఓడిపోయాం అనుకునే ఓ మానవులారా, ఓ స్నేహితుని మాటను కాస్త వినండి.

అతనూ మీలాగే బాధల ననుభవించాడు. బాధల్ని పంచుకున్నాడు. ఈ భూమ్మీద మంచిచెడ్డల్ని రెండింటినీ అనుభవించాడు. అతనికీ ఆకలిదప్పులూ, ఏకాకితనం, అనాథత్వము. నిరాశ అన్నీ తెలుసు. అంతేకాదు అనుమానాలూ, తప్పొప్పులూ, ఓటములూ, అన్ని బలహీనతలూ, అన్నీ తెలుసు.

కాని అతడేమంటాడో తెలుసా? లే, ధైర్యంగా ఉండు. ప్రతి ఉదయం లేతకిరణాలతో ఆ సూర్యుడు ఈ భూమికి చెప్పే దాన్ని విను. అదేమిటో తెలుసా? ఆశ, ఉపశమనం.

ఏడ్చేవాళ్ళూ, బాధతో వణికిపోయేవాళ్ళూ, బాధలకి అంతం లేదని అనుకొనేవాళ్ళూ, అంతా చూడండి. సాయంసంధ్య రాకుండా రాత్రి అవుతుందా? దట్టమైన చీకటి తొలగిపోకుండా ఉదయం వెలుగు వస్తుందా? సూర్యుడు కరిగించలేని దట్టమైన మంచు ఉందా? సూర్యుడు బంగారుపూత పూయని మేఘం ఉంటుందా? ఎప్పటికైనా ఎండిపోని కన్నీటి చుక్క ఉంటుందా? ఇంద్ర ధనుస్సు విరియని పెనుతుఫాను ఉంటుందా? వసంతంగా మారని హేమంతం ఉంటుందా?

సరిగ్గా మీకు కూడా అంతే. బాధల వెంటే భోగం, దుఃఖం వెంటే ఆనందం, ఓటమి వెంటే జయం, పడిపోవడం వెంటే ఎగిసిపోవడం, ఏకాంతం వెంటే సందడైన జీవితం, తిరస్కారం వెంటే పురస్కారం. కాని ఒక్కోసారి చిన్న అపార్థం కలుగుతుంది. చివరగా చెప్పేదేమంటే శక్తిగా మార్చలేని బలహీనత అంటూ వుండదు. అలాంటి గొప్ప బలహీనతలోనే భగవతత్త్వం తనకు తానై మనకు విప్పి చెబుతుంది.

విను, నా చిన్నారీ.

ఇవ్వాళ ముక్కలయ్యాం, పడిపోయాం అనుకొనేవాళ్ళూ ఇంకేమీ లేదని అనుకొనేవాళ్ళూ, మీ బాధని తీర్చేవాళ్ళూ మీ ఆత్మాభిమానాన్ని నిలబెట్టేవాళ్ళూ లేరని అనుకొనేవాళ్ళూ ఇంతకు ముందెప్పుడూ ఇంత గొప్పగా లేమని అనుకొనేవారూ అంతా వినండి. అతడు ఎంత అగ్రేసరుడంటే, ఎంత కూరుకుపోయినా లేవదీస్తాడు. అగాధం ఎంత లోతుగా ఉంటే అంత పైకి లాగుతాడు.

ఇది మీకు తెలుసా? చాలా మహనీయ శక్తులన్నీ వెలుగు కూడా చొరని ముసుగులున్న పదార్థాల లోపలే దాగున్నాయి.

కఠిన పరీక్ష కాని, బాధలు కాని, మిమ్మల్ని క్రుంగదీసినా, బాధల అధోలోకపు లోలోతుల్లోకి కూరుకుపోయినా ఏమీ నొప్పి

పెట్టిందనుకోవద్దు. ఎంచేతంటే అప్పుడే ఆ దివ్యప్రేమ, అమోఘ దీవన నిన్ను చేరతాయి. ఎంచేతంటే బాధల్ని కరిగించి, శుద్ధి చేసే మూసలోంచి మీరు బయటపడి ఉన్నతులు కాబోతున్నారన్న మాట.

మీరు క్రూరత్వంలో ఉంటే – నిశ్శబ్దంలో నినాదాన్ని వినండి. మీ చెవులకు పొగడ్తలూ, ఉబ్బేసే మాటలే నచ్చుతాయి. కాని ఆ నిశ్శబ్దంలో నినాదం మీ ఆత్మకు తృప్తి నిస్తుంది. అంతే కాకుండా అది లోతుల్లోని మారుమోతలనీ దివ్యమైన మధురమైన పలుకునీ మీలో జాగృతం చేస్తుంది.

మీరు గాఢమైన రాత్రిలో నడుస్తూ ఉంటే రాత్రిలోని అమూల్యనిధుల్ని పోగుచెయ్యండి. మంచివెలుగులో జ్ఞానమార్గాలూ వెలుగుతాయి. కాని రాత్రిలోని ఆ తెల్లని తేజస్సులోనే దివ్య నిధులు, కచ్చిత మార్గాలన్నీ దాగి వున్నాయి.

మీ నుండి అన్నీ లాగేసుకుంటే అదే నిజమైన కలిమికి త్రోవ. నిజంగా మీకు ఏమీ లేకుండాపోతే అన్నీ మీకు సమకూరుతాయి. ఎంచేతంటే నిజాయితీగా, నిష్కపటంగా ఉన్న వాళ్లకి వాళ్ల చెడ్డల్లోంచే మంచి జరుగుతుంది.

నేలలో నాటిన ప్రతి విత్తూ వేలని సృష్టిస్తుంది. ప్రతీ బాధల రెక్కల తాకిడీ విజయానికి దగ్గరి త్రోవే.

ఆగకుండా బాధ మనిషిని క్రుంగదీస్తూ ఉంటే, నాశనమవడానికి వాడు చేసేవన్నీ వానిని గొప్పవానిగా చేస్తాయి.

ప్రపంచాల కథని వినండి. చూడండి. గొప్ప శత్రువు జయించబోతున్నాడు. అతడు వెలుగును చీకటి చేస్తాడు. రాత్రి నిండా నక్షత్రాలే. అతనికి విశ్వజనీనత అంటే పడదు. ఈ గోళపు సమైక్య అధికారాన్ని అతడు ముట్టడిస్తాడు. దాని శ్రావ్యతను బద్దలుకొట్టి దాన్ని ఛిన్నాభిన్నం చేస్తాడు. నాలుగు అనంతాలకి చిందరవందన చేస్తాడు. కాని ఆ రజను నుండే బంగారుమొలక పుడుతుంది. అది అనంతాన్ని సారవంతం చేస్తుంది. విపుల కక్ష్యలో శాశ్వత కేంద్రం చుట్టూ పరిభ్రమించేలా చేస్తుంది. నాశనం చేద్దామనుకున్న అధికారాన్ని ఇంకా విస్తృతం చేస్తుంది.

అపారమైన ఆత్మీయతను పెనగొన్న ఆ ఆదిమలోకపు నాదం చాలా హృద్యమైనది. కాని దానికంటె ఇంకా హృద్యమైనవి ఇంకా లోకాల నాదాలు గాయకబృందాల్లా శాశ్వత జయ మంత్రాన్ని స్వర్గాన్ని నింపివేయడం.

మళ్లీ విను. ఈ లోకంలో మానవుడు వాని దివ్యమూలాల నుంచి వేరుపడ్డ ఆ స్థితి బాగా హీనమైనది. వానికి పైనే బలవంతంగా లాక్కునేవాని హద్దులు బాగా వ్యాపించి ఉన్నాయి. వాని లోకాలోకము ప్రవేశద్వారము దగ్గరే మండుతున్న కత్తులు కాపలా కాస్తున్నాయి. అతడు జీవనమార్గంలో ఎంత మాత్రం ఎదగలేడు. కాబట్టి, వాని లోలోపలే ఆ ఆధారం ఉద్భుదం అవుతుంది. పై నుంచి వచ్చే ఉన్నతమైన కాంతిని ఎంతమాత్రం భరించలేడు కాబట్టి వాని ఉనికి కేంద్రం దగ్గరే కాంతి ప్రకాశిస్తుంది. అతడు ఎంతమాత్రం దివ్యమైన ప్రేమసందేశం అందుకోలేడు కాబట్టి ఆ ప్రేమే ప్రతీ జీవినీ తన నివాసస్థానంగా చేసుకుంటుంది.

ఇలాగే ఈ ఏకాకి దుఃఖమయమైన ఫలవంతమైన లోకంలో అణువణువునా దివ్యమైన ఆలోచనే ప్రతి జీవిలోనూ దివ్యత స్థానాన్ని పొందుతుంది.

నిజంగా బాధలోనే జయం దాగుంది.

బాధ తప్పనిసరిగా వచ్చేది కాదు. అది రావలనీ కోరరు. కాని అది వస్తే మాత్రం ఎంత సాయం చేస్తుంది!

మన మనసు ముక్కలైపోతోందనుకున్న ప్రతీసారీ ఒక కొత్త తలుపు మనలో తెరుచుకుని మనలో దాగుకొని ఉన్న నిధులన్నింటికీ దారి చూపుతుంది.

ఇలాంటి వరుస అవరోహణాల్లో తెర తొలగి భగవంతుని దర్శనం అవుతుంది. ఓ స్వామీ, మొత్తమంతా చొచ్చుకుపోయే ఆ జీవనసాంద్రతని కాని దీన్ని కప్పేసే ఆ కాంతిని కానీ, ఎప్పటికీ నిలిచిపోయే ఆ దివ్యప్రేమను కానీ వర్ణించ నెవరి తరము?

మూలం: శ్రీమాత

అనువాదం: ఎమ్.సి. కనకయ్యా

(*CWM* Vol. 2, pp. 42-44, 20)

Constant Denials By The Divine

Death is the constant denial by the All of the ego's false self-limitation in the individual frame of mind, life and body.

Error is the constant denial by the All of the ego's false sufficiency in a limited knowledge.

Suffering of mind and body is the constant denial by the All of the ego's attempt to confine the universal Ananda to a false and self-regarding formation of limited and exclusive enjoyments.

It is only by accepting the oneness of the All that the individual can escape from this constant and necessary denial and attain beyond. Then All-being, All-force, All-consciousness, All-truth, All-delight take possession of the individual soul. It changes mortality for immortality.

But the way of attaining to immortality is not by the self-dissolution of the individual formation into the flux of Prakriti, neither is it by prematurely dissolving it into the All-soul which Prakriti expresses. Man moves towards something which fulfils the universe by transcending it. He has to prepare his individual soul for the transcendence and for the fulfilment.

Sir Aurobindo

(*SABCL* Vol. 12, pp. 110-11)

Pain was the first-born of the Inconscience
Which was thy body's dumb original base;
Already slept there pain's subconscient shape:

Sri Aurobindo

(*Savitri*, p. 443)

అనుభవంతో ఆత్మ ఎదుగుతుంది

ఆత్మాభివృద్ధికి మానవజీవిత మొక క్షేత్రము. ఈ జీవితంలో సంభవించేదంతా, నీ పెరుగుదలకు ఒక సాధనము. నీ కెవ్వరైనా డబ్బు యిస్తే సంతోషించవూ! అప్పుడు విచారానికి తావు లేదు గదా. జీవితంలో నీ కెదురయ్యే సమస్తమైన అనుభూతులకు నువ్వు అదే విధంగా స్పందించాలి. — *సంపాదకుడు*

ఇహాజీవనం ఒక క్రమ పరిణామం. ఆత్మ అనుభవంతో ఎదుగుతుంది. అనుభవం ద్వారా ప్రకృతి ఏదో ఒకదాన్ని సాధిస్తుంది. బాధలు కూడా ఆ సాధన కోసమే. కాని అజ్ఞానంలో కలిగే సహజమైన తప్పులు, తొట్రుపాట్లపై భగవంతుడు లేదా విశ్వధర్మం మనపై రుద్దిన తీర్పు కాదు.

*

నీ లేఖలో వ్రాసిన దృక్పథం సక్రమమైనదే. మన మార్గంలో ఎదురయ్యే కష్టాలేవీ సాధించబోయే విజయం కోసం చెల్లించే అతిపెద్ద మూల్యమేమీ కాదు. వాటిని సక్రమ దృక్పథంలో స్వీకరిస్తే, అవి విజయానికి సాధనాలూ అవుతాయి.

*

దైహిక కష్టాలు అజ్ఞానశక్తుల దాడుల వల్ల కలిగేవే, కాని మనకు తెలిస్తే వాటినే స్వచ్ఛతా సాధనకు మార్గాలుగా మార్చుకోవచ్చు. అయితే ఇందులో ఉత్తమమైన, తక్కువ కష్టతరమైన సాధనా మార్గాలూ ఉంటాయి.

*

నీ సందేహాల తార్కికత నా కర్థమయిందో లేదో నేను చెప్పలేను. ఉదాత్తమైన, నిస్వార్థ మిత్రుడి బాధలు యోగం అనే ఆశను ఎలా నిరర్ధకం చేస్తాయి? ఈ ప్రపంచంలో ఎన్నో చీకటి కోణాలున్నాయి. కాని అందుకోసమే కదా యోగం చేయాల్సింది! ప్రపంచమంతా ఆనందంగా, అందంగా, ఆదర్శంగా ఉంటే, దాన్ని మార్చా

లని ఎవరనుకుంటారు? ఉన్నత చైతన్యాన్ని ఐహిక మనస్సు, పదార్థాల లోకి దించాలన్న అవసరం ఎందుకు కల్గుతుంది?

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: మాడభూషణం రాజగోపాలాచార్య

(*SABCL* Vol. 22, p. 441; Vol. 24, pp. 1636, 1566, 1637)

బాధలు మనకు లాభదాయకములు

సుఖదుఃఖాలను గురించి ఎవ్వరికి సరైన అభిప్రాయముండదు. సాధారణంగా దుర్మార్గులు నరకం అనుభవిస్తారని మంచివాళ్లకు సుఖసంతోషాలు కలుగుతాయని జనవాక్కు. కాని అది స్థూల మైన అభిప్రాయం మాత్రమే. ఆధ్యాత్మిక దృష్టి ఇందుగు పూర్తిగా భిన్నము. *— సంపాదకుడు*

బాధలు భరించి అడుగడుగునా ప్రతికూల పరిస్థితుల నెదుర్కోవటం దురదృష్ట మనుకుంటావేమో – నిజానికి ఈ బాధల కంటె భోగభాగ్యాలు ఇంకా ఘోరమైన శాపమనుకోవాలి. (Indeed adversity, suffering may often be regarded as a reward to virtue than as a punishment for sin...) నిజానికి బాధల ద్వారా దేవుడు నిన్ను శిక్షిస్తున్నాడని అనుకుండే బదులు, ఆయన నీ ఆత్మప్రక్షాళనానికి, దైవోన్ముఖంగా పయనించేందుకు ఒక గొప్ప అవకాశం కల్పించి నీకు సహాయం చేస్తున్నాడని తెలుసుకోవాలి. మరి బాధల వలన నీకు మనస్తాపము ఎందుకు కలగాలి?

నీలో చైత్యపురుషుడు ఆవిష్కారమై లేదా కనీసం ఆయన వెలుగులో నీ వున్నట్లయితే అంతరంగికంగా నీకే విధమైన మనస్తాపము వుండదు. బాహ్య బాధలా – అవి నీ ఆత్మని గాని, చైతన్యాన్ని గాని ఏమాత్రం బాధించవు. *నిజానికి ఆ బాధలు కూడ ఒక వెలుగుబాటే – నీ సాధన ఎంతో మధురంగా, ఆనందం పరవళ్లు తొక్కుతూ సాగిపోతుంది. దైవశక్తి దిగివచ్చి నీకు దారి*

చూపిస్తూ నీ జీవితాన్ని దిగ్విజయ యాత్రగా నడిపిస్తుంది. – even adverse things and happenings become a means for its advance and for the growth of the spirit.

మూలం: శ్రీఅరవిందులు
సంక్షిప్తం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 16, p. 87; Vol. 24, pp. 1616-17)

బాధల్ని రుచిమరిగే ప్రాణికం

మానవ ప్రకృతి చాలా విచిత్రమైనది. దుఃఖ మొచ్చినపుడు ఎంత బాధపడ్డప్పటికీ అది లేనప్పుడు 'ఏం తోచటం లేదు. జీవితం చాలా చప్పగా వున్నదని' నీలోని జీవుడనుకుంటాడు. నీ నిజ స్వరూపమైన ఆత్మను పట్టుకుంటేగాని అసలు విషయం నీ కర్థం కాదు. *– సంపాదకుడు*

మనలోని ఉపరితల ప్రాణికం (నిజమైన ప్రాణికం లోతులు విభిన్నంగా ఉంటాయి) ఒక వైపు సుఖసంతోషాల వైపు, మరో వైపు బాధలు, నిరాశ, నిస్పృహ, దుఃఖాంత జీవితం వైపు ఆకర్షింపబడుతుంది. జీవితంలోని ఈ వెలుగునీడలంటే ప్రాణికానికి ఎంతో ఇష్టం. కాని యోగంలో మాత్రం దేదీప్యమానమైన, విశాలమైన, స్వేచ్ఛాయుతమైన శాంతి లేక ఆనందమయ తీవ్రత, లేక రెండింటి సంలీనం ఆత్మ, మనస్సుల, నిజమైన ప్రాణికం యొక్క నిజమైన సమస్థితి. అటువంటి సమస్థితిని పొందడం సాధకునికి సాధ్యమే. ఆ స్థితిని పొందడానికి ముందు దివ్యత్వం పొంద నవసరం లేదు.

నిరాశ, నిస్పృహ, దుఃఖం, బాధల్ని అధిగమించడం అంత తేలిక కాదు. ఎందుకంటే ప్రాణికంలోనిదేదో వాటిని గట్టిగా పట్టి వుంచుతుంది. జీవననాటకంలో భాగంగా వాటి అవసరం ఉంది. కామం, క్రోధం, ఈర్ష్య మున్నగు వాటిని అధిగమించడం తేలిక అని నేను ఎప్పుడూ చెప్పలేదు. వాటిని జయించడం కష్టం.

ఎందుకంటే అవి ప్రాణికంలో పాతుకుపోయి వున్నాయి. వాటిని త్రోసిపుచ్చినా, అవి అలవాటువల్ల తిరిగి చేరతాయి. సాధారణ ప్రకృతి దాల్చి పాత ప్రతిస్పందనలు తిరిగి జీవం పోసుకోవడం వల్ల అవి తిరిగి విజృంభిస్తాయి. భౌతిక మనస్సు, చైతన్యం (బాహ్యచేతన) బాధల్ని ద్వేషిస్తాయి. ఇతరులు బాధపడడం కూడా అవి ద్వేషిస్తాయి. ఈ జీవన నాటకం నుండి తప్పించు కోవడం కొద్దిమందికే సాధ్యం. ఇంకా లోతుగా పరిశీలిస్తే ప్రాణి కంలోని 'దేదో' బాధల్ని అంటిపెట్టుకొని వుంటుంది. ఈ నాటకం సాగడానికి అది అవసరం. దానిని గుర్తించి, లోలోపల దానిని తరిమికొట్టాలి. అది విశ్వజీవనంలో బలిష్ఠంగా లోపల తిష్ఠ వేసి కూర్చుంటుంది!

మనిషి మనస్సు, భౌతికం బాధల్ని ఇష్టపడవు. ఇష్టపడితే అది బాధ ఎలా అవుతుంది? జీవితానికి 'మసాళా' అవసరం. కాబట్టి ప్రాణికం దానిని కోరుకుంటుంది. నైరాశ్యాలను (depressions) ఎంతగా రూపుమాపాలని మనస్సు కోరుకున్నప్పటికీ అవి పునరావృతమవుతుంటాయి. ఎందుకంటే ప్రాణికం ప్రతి స్పందిస్తుంది. గ్రామఫోను రికార్డులాగా ఒకే చలనాన్ని పునరా వృతం చేస్తుంటుంది. వీటి పునరావృతం వెనుక హేతువు ఏదీ కనిపించదు. అవి చాలా వరకు అత్యల్పమైనవి. పునరావృతానికి తగిన కారణం అవి చెప్పలేవు. అది న్యాయబద్ధమేనని నిరూపిం చడానికి బదులు వాటి నుండి విడివడటానికి గట్టి సంకల్పం ముఖ్యం. వాటికి స్వాగతం పలుకకుండా వాటిని త్రోసిపుచ్చాలి. ఈ విధంగా మనిషి ప్రకృతిలోని ప్రమాదభూయిష్టమైన, బాధా కరమైన మచ్చను చివరికి రూపుమాపవచ్చును.

ఈ ప్రపంచ నియమాలు అజ్ఞాన నియమాలు మాత్రమే. అజ్ఞానం ఉన్నంత వరకు ప్రపంచంలోని భగవంతుడు వాటిని పరిరక్షిస్తుంటాడు. తాను పరిరక్షించకపోతే ప్రపంచం శిథిలీకృత మవుతుంది. అజ్ఞానం నుండి బయటపడి 'వెలుగు' వైపు ప్రయా ణించడానికి కొన్ని సందర్భాలు అవసరం.

సాధకుని మనస్సు సత్యంతో సహకరించాలి. దివ్యశక్తితో అతని సంకల్పం సహకరించాలి. ప్రాణికానికి, భౌతిక మనస్సును దివ్యశక్తి చేసే పని నెమ్మదిగా సాగినట్లు కనిపిస్తుంది. కాని ఆ శక్తి మానవప్రకృతిని 'కాంతి' లోకి ఉద్ధరిస్తుంది. సహకారం పూర్తి కాగానే, పురోగతి తీవ్రమవుతుంది. సమయం ఎక్కువగా అవుతున్నదని సాధకుడు విసుగు చెందరాదు. మావన ప్రకృతి లోని అంధత్వం, బలహీనతల్ని తొలగించడానికి శ్రమించడం చాలా అవసరం.

విశ్వాసం, చిత్తశుద్ధి, సమర్పణ ఉన్నప్పుడు ఈ సహకారం తేలిక అవుతుంది. సృష్టిలోని అనేక విషయాలతో బాటు, తనకు తెలియని విషయాలను వాటి మంచి చెడులను నిర్ణయించడానికి భౌతికమనస్సు విరమించుకుంటే, 'వెలుగు' ను స్వీకరించడం తేలిక అవుతుంది. తనకు తెలియని విషయాలు సైతం తన అనుభవం, తనకు కలిగిన జ్ఞానవికాసం వల్ల అర్థం అవుతాయి. సంపూర్ణ సమర్పణ భావంతో మనస్సు, ప్రాణికం తమను తాము భగవంతుని కాంతిహస్తానికి సమర్పించుకుంటే, దివ్యశక్తి పని తేలికవుతుంది. చక్కని ఫలితాలు వస్తాయి. ప్రతిఘటిస్తే దివ్య శక్తి చేసే పనికి మరింత సమయం పడుతుంది. లోపలి నుండి పని కొనసాగాలి. ప్రతిఘటనను రూపుమాపడానికి, మానవ ప్రకృతిని సంసిద్ధం చేయడానికి అజ్ఞాతంగా దివ్యశక్తి తన పని చేసుకుపోవలసి వుంటుంది.

*

మన జీవితం అజ్ఞాన (అవిద్య) బంధురం. బాధ, దుఃఖం అన్నవి ఈ అజ్ఞాన పర్యవసానాలే. బాధ, దుఃఖం, వాటికి వ్యతిరేకమైన సుఖసంతోషాల మయమైన అన్ని రకాల అనుభవాలతో మను షుల జీవితాలు అభివృద్ధి చెందుతుంటాయి. సరియైన పద్ధతిలో వాటిని ఎదుర్కొంటే ఏ వ్యక్తికైన బలం పెరుగుతుంది. పోరాటా లకు, సాహసానికి, మహత్కార్యాలలో ప్రయత్నాలకు సంబంధిం చిన బాధలు, కడగండ్లలో చాలామంది ఆనందం పొందుతారు. బాధల్ని, బాధల కోసమే కాకుండా ఒక పోరాటం (ఉద్యమం)

వెనుక గల ఆకర్షణ, ఉత్తేజం వల్ల బాధల్లో ఆనందం పొందు తారు వారు. నిండు జీవితంలో, వెలుగునీడలలో ఆనందం పొందేది ఏదో ప్రాణికంలో దాగి వుంది. తనదైన ఆవేదనలోను, దుఃఖాంత సన్నివేశాలలోను, రోగాలు, న్యూనత భావంలోను ఆనందం పొందే ఒకానొక వైకల్యం ప్రాణికంలో ఉంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యు.జ్ఞన్న

(*SABCL* Vol. 24, pp. 1366, 1354-56, 1357)

ఆత్మసాక్షాత్కారమే దుఃఖ నివారకము

ఆత్మ స్వభావము తనను తాను విస్తరించుకోవడం. అందులో నుంచి పుట్టిన మనస్సుకు ఈ సంగతి తెలియదు. అయినప్పటికి ఆత్మ యొక్క ముద్ర తన మీద ఉండటం వలన తనకు కలిగే బాధలుకూడా తన పెరుగుదల కవసరమని, అవి ఆనందంయొక్క మారువేషాలేనన్న స్ఫూర్తి తనలో ఎక్కడో దాగి వుంటుంది.

– సంపాదకుడు

సృష్టిలోని జీవుని పునర్జన్మలు ఆధ్యాత్మిక జీవన పరిణామ దశకు చెందినవని గ్రహించటం అవసరం. ఈ పరిణామదశ పూర్తి అగు నప్పటికి – ఏ నాటికో ఒక నాటికి పూర్తి కాక తప్పదు – జీవుడు అవిద్యాస్థితి నుంచి ఆత్మజ్ఞాన స్థితికి అధిగమించగా ఈ పునర్జన్మ క్రమము గూడ, అంతం కాక తప్పదు. ఈ విషయు మెలా వున్నా మరొక ముఖ్యవిషయ మొకటి ఎప్పుడూ గుర్తుం చుకోవాలి. అదే బహుదీర్ఘమై, సర్వకాలములోను ఆచరింపబడు కర్మ ప్రక్రియ. ఆత్మతత్త్వము నిత్యచైతన్య స్వరూపమని గ్రహిం చాలి. సత్, చిత్, ఆనందములు ఆ తత్వ లక్షణములని తెలుస్తు న్నది. సృష్టిక్రమానికి, ఈ ఆనందస్థితి ఒకానొక అనవసర బెడ దయని గాని, వేదనాపూర్వకమైనదనిగాని తలచటం తగదు.

ఆత్మస్వరూపానికి, ఈ సకల సృష్టి ఆనందహేతువే గాని, దుఃఖ కారణ మెన్నటికీ కానేరదు.

అవ్యక్తమైన ఈ ఆనందస్థితికి ఆద్యంతాలుగాని, అవధులు గాని లేవు. తాను, తనది అని తలచే అజ్ఞానస్థితితో కూడుకొన్న మానసిక దౌర్బల్యము హేతువు కాగా, ఆత్మ స్వరూపాన్ని గ్రహిం చలేక, సృష్టికర్మ లందు విపరీతంగా వక్రీకరించటం జరుగు తున్నది. శక్తిసామర్థ్యాలు అంతంత మాత్రమై యుండగా, నిత్య జీవితము యొక్క ఒడుదుడుకులతో సతమవుతున్నప్పటికీ, వీని ఆశలకు ఆకాశమే అంచు; పురోగతికి మూలమై, వ్యక్తిత్వప్రదర్శ నకు బీజమైన ఈ జీవునికి కర్మప్రక్రియలో సంభావించే ఒడి దొడుకులు. ఆనందస్థితికి ఆటంకం కలిగించవు. అయితే తప్ప టడుగులతో సాగుతున్న ఈతడు మున్ముందు ఒక చైతన్యస్వరూ పంగా సర్వాతీతమైన శక్తిగా ఆవిర్భవించగలిగినపుడు సర్వదుఃఖ ములు సమసిపోయి బ్రహ్మానంద స్వరూపంగాను, ముక్తజీవుని గాను వెలిగిపోగలడు.

బౌద్ధతత్త్వంలో కర్మ దుఃఖసంబంధమని గ్రహించిన గౌతమ బుద్ధుణ్ణి కర్మకు మూలమైన సంకల్పము లేక ఇచ్ఛను త్యజించు టకు మార్గాన్వేషణకై పురికొల్పింది. ఇది కొంతవరకు సత్యమే. సర్వదుఃఖోపశమనమైన ఆత్మసాక్షాత్కారమునకు మించినది మరొ కటి ఈ సర్వసృష్టిలో కానరాదు. ఈ మాట వాస్తవమే. అయితే ఆధ్యాత్మ పరిణామము లేక పురోగతి అనగా అచంచలమైన ఆత్మ సాక్షాత్కారము మాత్రమేనన్న వాదన సరి కాదు. అద్దానిని సర్వ కాలములలోను, సర్వావస్థలలోను, సర్వకర్మ లందున్నూ ప్రతిబిం బింప చేసుకోవటం అవసరం. కర్మ ప్రక్రియలో జీవుని ఆనంద స్థితి, నిశ్శబ్దస్థితిలో అతని ఆనందస్థితి, రెండున్నూ, ఎన్నటికీ వేరు కాదు. ప్రశాంతస్థితిగా వ్యక్తమయ్యే ఈ ఆత్మస్థితి సృష్టిలో ఆద్యంత రహితమని గ్రహించాలి. ఆత్మసాక్షాత్కారము పొందినపుడు ప్రశాం తస్థితి జారిపోకుండా జాగ్రత్త వహించాలి. పునాది బలంగా ఉంటే దాని పైన నిర్మించుకొనే కట్టడానికి ఢోకా లేదు.



ఈ లోకంలో బ్రహ్మము (Absolute) రెండు అవస్థలలో అభి వ్యక్తమవుతుంది – సత్త (Being), సంభూతి (Becoming). సత్త సంభూతి కంటె వేరు కాదు. సృష్టిలో అంతర్లీనమై, అణువణు వునా నిండి, అనంతమైన సృష్టి పరిణామాలలో పాలు పంచుకుం టుంది. సంభూతి తనను తాను సంపూర్ణంగా తెలుసుకునే ముందు, తానే సత్త్వమని కూడా తెలుసుకోవాలి. అనంత పరిపూర్ణత్వాన్ని తెలుసుకోవడం ద్వారా తన స్వభావాన్ని కూడా అనంతంగా చేసుకున్నప్పుడే, సృష్టిలోని జీవాత్మ ఆత్మజ్ఞానం, అమరత్వం పొందగలదు. దానిని సాధించడమే మన అస్తిత్వ/జీవితలక్ష్యం.

శ్రీఅరవిందులు

(*SABCL* Vol. 19, p. 659)

కర్మ అనగా క్రియాపరమైన ఆత్మసంకల్పమే అనగా ఆత్మ సంకల్పానికి మారుపేరని తెలుసుకోవచ్చును. జీవుని సంకల్పమే కర్మరూపంగా వ్యక్తమవుతున్నది. మనోదౌర్భల్యముతో కూడు కొన్న సంకల్పమే సృష్టిలో బంధహేతువగుచున్నది. అందువల్ల సంకల్పమునకు అవధులన్నీ తొలగిపోగా, ఆనందహేతువు కాగ లదు. ఈ ఆనందస్థితిచే ఒక నిర్మాణకౌశలంలోనూ, ఒకానొక కావ్యసృష్టిలోను, సంగీత మాధుర్యంలోను, దైవలీలలోను మనకు గోచరిస్తుంది. కంటికి ఇదంత కన్పించనప్పటికీ ఆనందస్థితిని చేరుకోటానికి మొదటి మెట్టు మాత్రమే. ఈ ఆత్మస్వరూపమే మన ఉనికికి, మన సర్వప్రక్రియలకు హేతువు. తాను మనస్సులో గుప్తమై, మెల్ల మెల్లగా సృష్టిలో కర్మ ప్రక్రియ లందు బహిర్గతం గావటమే ప్రకృతిలో స్వస్వరూపము యొక్క లీలావిశేషము.


మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీశరణ్

(*SABCL* Vol. 16, pp. 150-52)

సమాచార పత్రం

అమల్ కిరణ్ (కె.డి. సెత్నా) గారు 25 నవంబరు, 2004 నాటికి 100 ఏళ్లు, నిరోద్‌బరన్ గారు 17 నవంబరు 2004 నాటికి 101 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. 'అఖిల' తరఫున, పాఠకుల తర పున వీరిద్దరికి మన హృదయపూర్వక శుభాకాంక్షలు

శ్రీఅరవిందుల వర్ణచిత్రము, నూతన వర్ష సందేశముతో కూడిన A Page-mark cum Calendar జనవరి 2005 సంచికతో పాటు చందాదార్లకు, సొసైటీ సభ్యులకు (పత్రిక లేనివారికి) Book-post ద్వారా పంపబడును. అదనపు కాపీలు కావలసిన వారు ఒక కార్డుకు రు 2.00, తపాలు ఖర్చులు ఎనిమిది కార్డు లకు రు 5.00. 100 కార్డులకు రు 30.00 advance పంపి Sri



Happy heart

January 2005

S	M	T	W	T	F	S	S	M	T	W	T	F	S
						1	2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29	30	31					

Significance of the flower:

Happy heart

Smiling, peaceful, radiant, without a shadow

Reproduced from:

Navavihan's new Desk Calendar 2005

Calendar Size - 8" X 5.75". Price - Rs 60.00 (Postage extra)

For information on discount for bulk orders and
personalised complimentary printing please contact:

Navavihan, Sri Aurobindo Ashram, Pondicherry- 605 002
Email - navavihan@eth.net

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72
PO. Regn. TN/PMG(CCR)/39/03-05 and WPP No. 35/03-05

SRI AUROBINDO SOCIETY, PONDICHERRY - 605002

9/12/2004



పునర్జన్మ – ఆత్మ మహాప్రస్థానం

అఖిల భారత పత్రిక, డిసెంబరు 2004

K S Reddy

పునర్జన్మ – ఆత్మ మహాప్రస్థానము

శ్రీమాతారవిందుల ప్రవచనములు

ఉపోద్ఘాతము

'నేను క్రిందటి జన్మలో ఎవరో తెలుసుకోవాలని వుంది' అని అందరికీ అనిపిస్తుంది. కాని అంతకంటే "ఈ జన్మలో నేనేం చేయాలి? నేను దైవసంకల్పాన్ని ఎంతవరకు నెరవేరుస్తున్నాను? ఈ అపూర్వ అవకాశాన్ని అజ్ఞానం వలనగాని, నిర్లక్ష్యం వలన గాని తృణీకరించకుండ చైతన్యాన్ని ఉన్నతస్థాయిలో నిలబెట్టి నా శ్రాయశక్తులా ప్రయత్నించాలి" అని అనుకోవడం మన ఉత్తమోత్తమ కర్తవ్యము. కొంచెం తరచి చూచినట్లైతే పూర్వ జన్మల గురించి సాధారణంగా ప్రచారంలో వుండే కథలన్నీ కట్టుకథలే యని, వాటిలో ఏమాత్రం నైజం లేదని తేలిపోతుంది. క్రిందటి జన్మలో తను ఒక మహారాజుననో లేక ఫలానా గుళ్ళో ఒక పూజారిననో చెప్పుకునే వాళ్ళని నమ్మకండి. నిజానికి మనస్సు శరీరంతోనే అంతరించిపోతుంది కనుక ఇటువంటి విషయాలు మరుజన్మలో జ్ఞాపకం వుండే అవకాశమే లేదు. అయితే ఒక జన్మలోని అతిముఖ్యమైన సంఘటనలు, హృదయాంతరాలని కుదిపివేసే సన్నివేశములు చైత్యపురుషని మీద బలమైన ప్రభావాన్ని చూపిస్తాయి. పూర్వజన్మల వృత్తాంతము స్మృతిపథములో అంతవరకే మిగిలివుంటుంది. (మొసలినోట్లో పడ్డ గజేంద్రుడు ఎన్ని జన్మలకైనా ఆ వైపరీత్యాన్ని మరచిపోగలడా?)

— సంపాదకుడు

To weep because a glorious sun

To weep because a glorious sun has set
Which the next morn shall gild the east again;
To mourn that mighty strengths must yield to fate
Which by that force a double strength attain;
To shrink from pain without whose friendly strife
Joy could not be, to make a terror of death
Who smiling beckons us to farther life,
And is a bridge for the persistent breath;
Despair and anguish and the tragic grief
Of dry set eyes, or such disastrous tears
As rend the heart, though meant for its relief,
And all man's ghastly company of fears
Are born of folly that believes the span
Of life the limit of immortal man.

Sri Aurobindo

సారాంశము

నేడు సూర్యుడు అస్తమించాడని విచారించడం తగునా,
ఆయన రేపు ప్రొద్దున మళ్లి ఉదయిస్తాడు కదా!
బాధలంటే భయపడటం తగునా, అది యొక సయ్యాట,
సంతోషానికి మార్గమే కదా!
మృత్యువంటే హడిలిపోవడం తగునా, అది మలి జీవితానికి
సోపానమే గదా!
ఆపదలు కలిగినప్పుడు శోకించడం తగునా, ఈ జన్మే నీకు
పరాకాష్ఠ కాదోయ్! ఇంకా అనేక జన్మల సౌభాగ్యం నీ
కుండనే వున్నది గదా!

(*SABCL* Vol. 5, p. 124)

పునర్జన్మ – ఒక ఆధ్యాత్మిక సత్యం

మనకి పూర్వజన్మ స్మృతులు ఎందుకు వుండవు! మనస్సుకు అట్టి సామర్థ్యము లేదు కనుక. జన్మ ఎత్తేది మనస్సు కాదు గదా, ఆత్మ. ఆత్మకు నీ మనస్సులో ఏమి జరుగుతోందో తెలియదు. ఒక జన్మలో సాధారణంగా జరిగే దినచర్యలు, దాని విశాలదృష్టికి ముఖ్యం కావు. ఆత్మపరిధి అతి విశాలమైనది. అది అనంతవిశ్వంలో, అనంతకాలంలో సంచరిస్తూ వుంటుంది. సృష్టి విన్యాసము, విశ్వనిర్మాణము, ఆత్మల ఉద్భవము, వాటి చిత్ర విచిత్ర గతులు వీటినన్నిటిని అది గమనిస్తూ వుంటుంది.

– సంపాదకుడు

ఆత్మకు పునర్జన్మ ఉందనడానికి వేరే కొత్తగా రుజువులు ఏవీ అవసరం లేదు. ఆత్మకు నాశనం లేదనే నిత్య సత్యమే దీనికీ వర్తిస్తుంది.

> *విశ్వాసం కుదిరిందా ఇక తిరుగు లేదు.*

ఆత్మ నాశరహితమైనది అనే విషయం స్పష్టమయ్యే రోజు వస్తుంది. తనకు గల శాశ్వతం, నాశరహిత లక్షణాలను తనకు తానే తెలుసుకోగలుగుతుంది. ఒకసారి అటువంటి విశ్వాసం కుదిరిందా ఇక తిరుగులేదు. ఆత్మ శాశ్వతత్వానికి అనుకూలంగాను, ప్రతికూలంగాను ముసురుతున్న హేతువాదాలన్నింటిని స్వీయవిశ్వాసమూ, నిత్యసత్యమూ కలిసి గాలి కబుర్లుగా తోసిపారేయగలవు. అప్పుడు సంపూర్ణ విశ్వాసమే తప్ప విచికిత్స అనేది ఉండనే ఉండదు. సందేహాలకు అవకాశమే ఉండదు. అయితే అటువంటి విశ్వాసం కేవలం మేధోపరమైన సిద్ధాంతంగా వస్తే మాత్రం లాభం లేదు. మన ఊపిరి ఎంత ఐహిక వాస్తవమో, అంతటి స్పష్టమైన వాస్తవంగా మనకు విశ్వాసం కుదరాలి. అటువంటిది కలిగిందా – ఇక వాదోపవాదాలతోగాని, సాక్ష్యాధారాలతోగాని పని లేదు.

విశ్వాసంలో కూడా విచికిత్స ఉండకపోదు

అదే విధంగా ఆత్మ తనకుగల శాశ్వత లక్షణంతోపాటు తనకు పరిణామ క్రమమైన ధర్మం కూడా ఉందని తెలుసుకునే సమయం ఆసన్నమౌతుంది. ఆ రోజు రానే వస్తుంది. అప్పుడు తన ఈ ప్రస్తుత పరిణామ స్థితి ఏర్పడ్డానికి కారణాలైన పూర్వపు తరాలను తెలుసుకోగలుగుతుంది. ప్రస్తుత రూపం ధరించడానికిగాను – గతించిన కాలవాహినిలో ఎటువంటి సన్నాహాలు జరిగాయో అవగాహన చేసుకోగలుగుతుంది. ప్రస్తుత స్థితి రూపొందడంలో ప్రధానపాత్ర వహించిన సన్నివేశాలను పరిశీలన చేయగలదు. గతంలో తన ఆత్మస్థితిగతులను, పరిసరాలను, అప్పటి కార్యకలాపాలను లీలగానైనా స్మరణకు తెచ్చుకోగలదు. అంతే కాదు, రాబోయే కాలంలో తన పరిణామ ప్రగతిని కూడా పసిగట్టగలదు. పునర్జన్మను గురించిన సరియైన చైత్యాత్మక విశ్వాసం ఇదే! ఈ విశ్వాసంలో కూడా విచికిత్స ఉండకపోదు. సందేహాలు రాకపోవు. అయితే ఆ సందేహాలు ఆత్మదార్శనికతకూ, స్మృతులకు సంబంధించినవయి ఉంటాయి. అంతే కాదు, ఆత్మ అభ్యుదయానికి చెందిన ప్రక్రియా, పునర్జన్మ సిద్ధాంతాలను గురించిన ప్రశ్నలు తప్పకుండా పుట్టుకొస్తాయి. విజ్ఞానం, పరిశీలనలు, ఫలితాలు వంటివాటి పాత్ర ఎంతో కొంత ఉండక తప్పదు.

ఆలోచన ఎక్కువైతే చిక్కులు చిక్కబడతాయి

ప్రశ్నలు పుట్టుకువస్తే ఆలోచనలకు ద్వారాలు తెరచినట్టే కదా! ఎంత ఎక్కువగా ఆలోచించి ఎంత ఎక్కువగా అనుభూతి చెందితే పునరవతరణను గురించిన సందేహం అంత సర్వసామాన్యమై అంత నిర్ధారణమైపోతుంది. ఈ స్థితిలో అన్వయ క్లిష్టత విధిగా ఉంటుంది. ఎందుకంటే ఈ సిద్ధాంతంలో ఒకదాని కొకటి పొంతన కుదరదు. దాంతో నిత్య సత్యాన్ని తెలుసుకునే అవకాశాలు చిక్కుల్లో చిక్కుబడిపోతాయి. ధర్మం అతిసూక్ష్మమైనదీ, ఊహించరానిదీ *అణుర్ హ్యేష ధర్మః* కావడం వల్ల, ఈ విచికిత్సలోంచి బయటపడడానికి సుదీర్ఘమైన

కాలం పట్టవచ్చు. కనుకనే చిరకాలం ఉండే గట్టి పట్టుదల అవసరం అవుతుంది.

*

ఆధునిక విజ్ఞానానికి ఆత్మ గురించి ఏమి తెలుసు

ఆధునిక చింతన ప్రకారం పునర్జన్మ అంటే ఓ ప్రతిపాదన కిందో, ఓ వాదం కిందో లెక్కగాని, అంతకంటె మరేమీ కాదు అనిపిస్తుంది. ఆధునిక వైజ్ఞానిక విధానాలతో ఇది రుజువు కాలేదు. వైజ్ఞానిక సంస్కృతిని సంతరించుకున్న సందిగ్ధ మనస్సును ఆధునిక విజ్ఞానం అవునూ అనిపించలేదు – కాదూ అనిపించలేదు. ఎందుకంటే ఆత్మకుగల పూర్వజన్మ వృత్తాంతము గురించిగాని, ఉత్తర జన్మ ఉదంతంగాని ఈ ఆధునిక విజ్ఞానానికి ఏమీ తెలీదు. అంతెందుకు? మానవులకు ఆత్మ ఉంటుందన్న విషయమే దానికి బొత్తిగా తెలీదు. తెలుసుకోలేదు కూడాను. ఎందుకంటే దాని పరిధి రక్త మాంసాలు, మస్తిష్కం, నరాలు, గర్భధారణ, దాని పెరుగుదల వంటివాటికే పరిమితం, అంతే – వాటిని దాటి వెళ్ళలేదు.

భౌతిక ఆధారాలతో ఆధిభౌతిక విషయాలా?

పునర్జన్మ అనేది సత్యమా? అసత్యమా? దీని నిగ్గు తేల్చడానికి ఆధునిక చర్చకు కావలసిన పరికరాలు లేవు. స్పష్టంగా చెప్పాలంటే శోధన, సునిశిత పరిశీలన, పరిశోధన ఇలా వనరులు అన్నింటినీ కూడగట్టుకుని కేంద్రీకరించినప్పటికీ సత్యశోధనకు అవి ఎందుకూ పనికి రావు. భౌతికప్రకృతికి అతీతమైన విషయాలలో ఆధునిక విమర్శకు బొత్తిగా పరిజ్ఞానం లేదు. వివరాలు సేకరించడంలోనూ, విశేషాలను వెలికి తీయడంలోనూ, ఆధునిక విమర్శారంగం దిట్టమైనదే! అందులో సందేహం లేదు. అయితే ఆ వివరణాంశాలు, వాటి పరిశోధనల ఆధారంగానే ఉంటాయి. కేవలం బాహ్య ఆధారాలతో ప్రకటించే పరిశోధనా ఫలితాలు విశ్వాసనీయమైనవే అని గట్టిగా చెప్పేందుకు తగిన సాధనాలు ఆ రంగానికి లేవు. కాబట్టి నాటి

సిద్ధాంతాలు నేడు నిలవవు. రేపటికి నేటి సిద్ధాంతాలు పోయి మళ్లీ కొత్తవి పుట్టుకు వస్తాయి!

సందేహాస్పదమైన చారిత్రక నిర్ణయాల్ని సైతం తప్పుగానో, ఒప్పుగానో చెప్పే పరికరాలు లేవు. వందేళ్ల క్రితం నాటి వివాదాన్నే అది అవునూ అనలేదు, కాదూ అనలేదు.

"జీసస్ క్రీస్తు చారిత్రక పురుషుడేనా?" అనే ప్రశ్నకు ఆధునిక విమర్శ ఏం చెపుతుంది? నోరు విప్ప లేదు. ఇదే చెప్పలేనప్పుడు పూర్తిగా ఆత్మసంబంధమైన పునర్జన్మ గురించి ఏ నిర్ణయం తీసుకోగలదు? పునర్జన్మ వివాదం పరిష్కారం కావాలంటే దానికి భౌతిక ఆధారాల కంటే మనోవిజ్ఞాన శాస్త్రం పైనే నిర్ణయాలు జరగాలి.

జ్ఞాపకం లేనివన్నీ అసత్యాలేనా?

పునర్జన్మను సమర్థించే వారూ, వ్యతిరేకించేవారూ ఇద్దరూ కూడా సాధారణంగా విసిరే వాదనలు తరచు బలహీనంగానో, నిరర్థకంగానో మిగిలిపోతున్నాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే పునర్జన్మ ఉందనిగాని, లేదనిగాని చెప్పే సమర్థత ఈ ప్రపంచంలో ఎవరికీ లేదు. ఉదాహరణకు: పునర్జన్మను తృణీకరించేవారు తరచు విజయగర్వంతో ఒక అస్త్రాన్ని ప్రయోగిస్తూ ఉంటారు. అదేమిటంటే – "గత జన్మలలోని సంఘటనలు మనకు గుర్తు లేవు కదా. కాబట్టి పూర్వజన్మలు లేవు" ఇదీ వరస. ఇటువంటి వాదానికి ఓ చిరునవ్వే తప్ప ప్రతివాదం ఏముంటుంది? తెలివితేటలు ప్రదర్శించే పిల్లల కంటె తాము అధికులమని వారికి వారే ఊహించుకుంటారు.

సరే! ఈ వాదం మానసిక విషయానికి సంబంధించినదే. అయితే సామాన్య మానవుల జ్ఞాపకశక్తికి గల సహజ లక్షణాన్ని వీరు విస్మరిస్తున్నారు. మనం ప్రస్తుతం జీవించి ఉన్నామనేది సత్యమే కదా! అందులో ఏ సందేహమూ ఉండదు. అవునా! అయితే ఈ జీవితంలో మన జ్ఞాపకశక్తి ఏ మేరకు ఉంది? నిన్న మొన్నటి విషయాలలో మన జ్ఞాపకశక్తి బాగానే ఉంటుంది. కాలం గడుస్తూ సంఘటనలు వెనకబడి దూరం అయ్యేకొద్దీ అవి సంది

గ్ధంగానో, వివరాలు తరిగిపోతోనో ఉంటాయి. ఇంకా ఇంకా కాలం గడుస్తున్న కొద్దీ ఏవో కొన్ని ముఖ్యమైన అంశాలే తప్ప వివరాలు జ్ఞాపకం ఉండవు. మన జీవితంలో ప్రారంభంలో మస్తిష్కం అంతా ఖాళీయే కదా!

చిన్నప్పటి సంగతులన్నీ జ్ఞాపకం ఉన్నాయా?

తల్లి ఒడిలో ఉన్నప్పటి శైశవదశ ఇప్పుడు నీకు జ్ఞాపకం ఉన్నదా! మరి దీన్ని ఏమందాం? ఆ శిశు దశ నీ ప్రస్తుత జీవితంలో ఒక భాగమే కదా! ఒక వ్యక్తి తన శిశుదశలోని విషయాలను నెమరుకు తెచ్చుకోలేనట్లుగానే ఆ వ్యక్తి తన గతజన్మ విషయాలను కూడా స్మృతికి తెచ్చుకోలేడు. శిశు దశ నాటి విషయాలనే కాకుండా గడిచిన సంవత్సరాలలోని విషయాలలో చాలా వాటిని మర్చిపోతున్న ఈ జ్ఞాపకశక్తిని, ఈ అల్పిష్టి మస్తిష్కాన్ని శిశుదశకు ముందూ, జన్మకు ముందూ, అది రూపం ధరించడానికి పూర్వము నాటి సంగతులు జ్ఞాపకం చేసుకోవాలని వాంఛిస్తున్నాం. అలా చేసుకోలేకపోతే "మీ పునరవతరణ సిద్ధాంతం వట్టి బూటకం" అని గోల చేస్తున్నాం. సామాన్య మానవుడికి గల ఇటువంటి సారహీనమైన వివేచన ఈ రకం హేతువాదాన్ని దాటి వెళ్లలేదు.

వాస్తవాలుగాని, స్థితిగాగాని, సంఘటనలుగాని లేదా ప్రతీకలుగా గాని గతజన్మ విశేషాలు స్మృతికి తెచ్చుకోవాలంటే అది కేవలం భౌతికాతీత చైతన్యం (psychical memory) పొందడంవల్ల మాత్రమే సాధ్యం అవుతుంది. ఇటువంటి చైతన్యం భౌతిక పరిధుల్ని అధిగమిస్తుంది. మానవ మస్తిష్కంలో ఇదివరకు ముద్రపడిన ఐహిక అంశాలపై అది ఇతర కొత్త అంశాలను పునర్ముద్రణ చేస్తుంది.

అటువంటి చైతన్యం వల్లగాని, భౌతిక స్మృతివల్ల గాని మనకు గతజన్మలకు సంబంధించిన గట్టి రుజువులు లభించినంత మాత్రాన పునర్జన్మ సిద్ధాంతంపై ఇదివరకటి కంటె నమ్మకం పెరుగుతుందన్న నమ్మకం నాకు లేదు. ఆ విషయంలో నాకున్న సందేహం నాకు ఉంది. గత జన్మల తాలుకు స్మృతులను నెమరు

వేసుకునే సంఘటనలను మనం వింటూనే ఉన్నాం. అవి తమ గత జన్మ తాలూకు జ్ఞాపకాలేనని నమ్మబలుకుతున్నారు. అటు వంటి సందర్భాల్లో రుజువులను పరిశీలన జరిపి, బాధ్యతతో పరీక్షించి తమ అంతరంగిక పరిశోధనకు (psychical research) బలం చేకూర్చే పనులు ఏవీ చేయకుండానే వాటిని కొట్టిపారేస్తున్నారు

పటిష్ఠమైన ప్రాతిపదికగల రుజువులను చూపేవరకు హేతు వాదాలు వాటిని కేవలం సందేహాలను గుప్పుతూనే ఉంటారు కూడా. ఒక వేళ ఆ స్మృతులు వాస్తవాలే అని రుజువైనప్పటికీ కూడా వారు అంగీకరిస్తారని అనలేం. అవి నిజమైన స్మృతులు కానేకావని, సాధారణ పరిధిలో అనుభవంలో ఉన్న భౌతికజ్ఞాప కాలేనని అంటారు. అదీ కాకపోతే ఇతరులు ఎవరో వారికి ఆ విషయాలను చేరవేశారని, వాటిని మనోచాంచల్యం వల్లనో, శారీ రక బలహీనత వల్లనో, చిత్తభ్రమవల్లనో పూర్వజన్మ స్మృతు లుగా మలుచుకున్నారని ఆరోపిస్తారు.

ఒక వేళ రుజువులు మరీ పటిష్ఠంగా ఉన్నప్పటికీ వారు ఒప్పుకోరు. హేతువాదంలో ప్రధానమైన ఏ విధానం ద్వారా కూడా తృణీకరించడానికి వీలు లేకపోయినా సరే! పునర్జన్మకు పటిష్ఠ మైన రుజువుగా దానిని అంగీకరించరు.

ఒక అంశానికి చెందిన వాస్తవాల సమాహారం కోసం మనస్సు వందల, వేల సైద్ధాంతిక వివరణలను కల్పించగలదు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

(*Essays Divine and Human*/ *CWSA* Vol. 13, pp. 268-69)

వాసాంసి జీర్ణాని

అంతాల అనంతమైన ఈ సృష్టిక్రమంలో....
మనలోని పారమార్థిక ప్రమోదము క్షణభంగురము కాదు,
అంతే కాదు, ఓ జన్మతో మన ప్రయాణం పరిసమాప్తి కాదు;
మనలో, మన ఆత్మలు అనంతంగా కుదురుకొన్నవి
అఖండానంద సంసిద్ధి సంకల్పమై, అనంత నిరీక్షణ కాయత్తమై

జీవాత్మ పరమాత్మల ఒడ్డు పొడుగులు ఈడైనవి
అవి అనాది సంజనితములు, ఎఱుక కందని పుట్టుకలు;
ఈ నిరంతర పునరుత్పత్తి క్రమం, ఈ అపార ప్రకృతి నమూనా
పృథ్విలో రూపొందించిన లౌకిక రూపకల్పనలు కావు,

అంతే కాదు, అవి తమ అవశేషాలను వసుంధరకు వారసత్వంగా
అందించవు
తమలోనే అంతర్లీనం గావించుకొంటవి అనంతశయనంగా
అవధులెరుగని గతకాలపు వారసత్వం, నీ ఉద్రేక ఉద్విగ్న
తాకిడుల అడుగున అనంత భవిష్యద్వాహినులు పొంగి
పొర్లుతవి.

మనం మరచిపోయిన గతం మనతోనే ఉంది అనశ్వరంగా
గత జన్మలలో సంభవించిన జననమరణాలు
ఒక్కొక్కప్పుడు మన ఆత్మలు
అదృశ్య శిఖరాగ్రాల వైపున కెగ బ్రాకుతున్నవి.
మఱియు, ఈ మనసు మేలిముసుగు తెరల చాటునుండి కూడా
ఆత్మ కొన్నిసార్లు చూపులు వెలుపలికి సారించి
మనకు సంక్రమించబోయే అనంతకాల స్రవంతులను
అవలోకిస్తుంది – గడచిన అనంత విశ్వాగమన గగన వాటికలో,

అలా కాకపోతే మన వెనుక నున్న చిక్కువడని
అంబరపు నూలుపోగుల నును వెలుగుల మధ్య నుంచి
ఱెప్ప వాల్చకుండా అవలోకిస్తాం – కాలగమనంలో
కూరుకుపోయిన
అనాదికాలంలో అనంతంగా సాగిన నక్షత్రాల కదలికల
అనంత దృశ్యమాలికలను.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అన్నవరపు ఆదిశేషయ్య

ఆంగ్లమూలం:

Rebirth

Not soon is God's delight in us completed,
Nor with one life we end;
Termlessly in us are our spirits seated
And termless joy intend.

Our souls and heaven are of an equal stature
And have a dateless birth;
The unending seed, the infinite mould of Nature,
They were not made on earth,

Nor to the earth do they bequeath their ashes,
But in themselves they last.
An endless future brims beneath thy lashes,
Child of an endless past.

...Our past that we forget, is with us deathless,
Our births and later end

Already accomplished. To a summit breathless
    Sometimes our souls ascend,

...And even from this veil of mind the spirit
    Looks out sometimes and sees
The bygone aeons that our lives inherit,
    The unborn centuries:

...Or else the web behind us is unravelled
    And on its threads we gaze, –
Past motions of the stars, scenes long since travelled
    In Time's far-backward days.

Sri Aurobindo

(*SABCL* Vol. 5, pp. 51-52)

మనం మన అంతరాల్లోకి ఏమాత్రమైనా వెళ్ళగలి
గితే అసలు రహస్యం – యుగయుగాలుగా నిత్య
చైతన్యంతో బహుళ రూపాలతో ఆవిష్కృతం అయ్యే
ఆత్మ మనలో ఉందనే విషయం మనకు అవగతం
అవుతుంది.

శ్రీమాత

మాండవ్య మహర్షి మనోభావ విపంచి

ఓ పరమాత్మా! అంతిమంగా మానవుడు పరస్పరం బురద జల్లుకొనే ఆటకు చెల్లుచీటీ వ్రాసి, తదేకంగా ఆదిత్యుణ్ణి, నక్షత్ర మాలికల్ని హస్తగతం చేసుకొని రూపాన్ని ధర్మాన్ని, జీర్ణమైన క్రమాన్నీ పునరుజ్జీవింపజేసే ఉషోదయం తప్పదని నాకు తెలుసు.

అప్పుడు వేదనలు, వైరుధ్యాలు విశ్వం నుండి అంతర్ధానమై నిర్జీవ నిర్మానుష్య ప్రదేశాలు పాటల వర్షానికి స్వాగత గీతాలాపన చేయుదురు గాక!

నిశ్శబ్దపు టెడారులలోని ఒయాసిస్సు జలతరంగిణులు ధ్వనించు గాక!

మఱొక్కసారి మానవుడు భగవంతుని,

యథార్థ ప్రతిరూప సాక్షాత్కార్య భాగ్యము పొందు గాక.

*

నేను అధైర్యపడి గుండె నిబ్బరం కోల్పోను

తీరని దాహం నన్ను వెన్నాడుతున్నది, అది ఎక్కడో ఒక చోట నీటి ఊటను పసిగట్ట గలదు.

అవును, అయితే ఈ జన్మలో మాకది ఎప్పుడూ లభించక పోవచ్చు; – ప్రకృతి సహజ స్వభావ గుణాలు మార్గంలో ఓ భూతంలా అడ్డునిలువవచ్చు – అఘాతం సృష్టించవచ్చు, గత ఆవేశకావేశాలు అడ్డుతగల వచ్చు, పాత సందేహాలు మరల పొట మరించవచ్చు.

అలాంటి సందర్భాలలో మనలను సంతుష్టిపరచగల ఇతర ప్రాణులెవ్వరైనా ఇక్కడగాని, ఆవలగాని లభ్యమవుతారా?

ఓ భగవాన్! నేను దృఢమైన కృషిని ఈ దిశలో సాగిస్తాను.

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

(ఆంగ్లమూలం తరువాయి పేజీలో)

The Meditations of Mandavya

I know, O God, the day shall dawn at last
When man shall rise from playing with the mud
And taking in his hands the sun and stars
Remould appearance, law and process old.
Then, pain and discord vanished from the world,
Shall the dead wilderness accept the rose
And the hushed desert babble of its rills;
Man once more seem the image true of God.

*

I will not faint, O God. There is the thrist,
And thirst supposes water somewhere. Yes,
But in this life we may not ever find;
Old nature sits a phantom by the way,
Old passions may forbid, old doubts return.
Then are there other lives here or beyond
To satisfy us? I will persist, O Lord.

Sri Aurobindo

(*SABCL* Vol. 5, p. 89)

నీ క్రిందటి జన్మలను గురించి తెలుసుకుండేందుకు మనస్సుతో ఆలోచిస్తే లాభం లేదు. నీ ఆత్మను దర్శించి దాని నాశ్రయించినప్పుడే అది సాధ్యము.

పునర్జన్మ అనుభూతులు

మానవజన్మ ద్వారా దేవుడు తన ప్రయోజనాన్ని నెరవేర్చుకుంటాడు. అఖండమైన దివ్యచైతన్యము అచేతనలో మునిగిపోతుంది. తిరిగి దివ్యచైతన్యమును పొందుటకు మానవజన్మ ఒక సాధనము. మానవుని బాహ్యస్వరూపము పాంచభౌతికము. కాని అందులో అతని చైత్యజ్ఞానము బీజరూపములో వుంటుంది. అనేక జన్మల ద్వారా అది పెరిగి పరిపక్వమవుతుంది. ఈ పెరుగుదలకు మానవజీవితంలోని దైనందిన కార్యక్రమములు అప్రధానములు. అతని జీవితంలో గాఢముద్రలు పడే ముఖ్యమైన సంఘటనలు మాత్రమే జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి. ఆత్మోన్నతి పొందటం కోసమే అతను అనేక జన్మలను దాలుస్తాడు. ఒక జన్మలో చక్రవర్తి, మరుజన్మలో బిచ్చగాడు కావచ్చును. అయితే రాజలాంఛనాలేవీ అతని ఆత్మకు గుర్తుండవు. కొన్ని లోతైన సంఘటనలు మాత్రమే ఆత్మస్థమై అతని చేతనలో జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

— సంపాదకుడు

పూర్వజన్మ అనుభూతులు

తమ పూర్వజీవితాలను గురించి, జ్ఞాపకమున్నది అని చెప్పేవాళ్ళను నీవు నమ్మకూడదు. ఎందుకంటే అవన్నీ వాళ్ళేదో మానసిక, ప్రాణికసీమలలో విహరిస్తూ అల్లే కట్టుకథలు కనుక. ఒక పేరుబడ్డ స్త్రీ తన పూర్వ జీవితాల్లో కోతి దగ్గర్నుంచి మనిషి దాకా జ్ఞాపకమున్నదని చెప్పిన విషయం నీకు తెలిసే ఉంటుంది. కానీ అది ఆమె ఊహ మాత్రమే – ఎందుకంటే అలా జ్ఞాపకముంచుకోవడం అసాధ్యం.

అసలేం జరుగుతుందంటే, ఉదాహరణకు ఒక దివ్యాణువు దాని ఆకర్షణతోగాని, అభిమానంతోగానీ, తాను కోరుకోవడంతో గానీ తన చుట్టూ, చైతన్యాన్ని పోగుచేసుకుంటుంది. ఇది జంతువుల్లో కూడా జరుగుతూ ఉంటుంది – మనమే గొప్ప అని అనుకోకూడదు. మనకే చైత్యపురుషుడు (psychic being) ఉన్నాడనీ

మిగతా సృష్టిలో దేనికీ లేదనీ అనుకోగూడదు. అసలిది ఖనిజంలో ప్రారంభమవుతుంది. మొక్కల్లో ఇంకొంచెం వృద్ధి చెందుతుంది. జంతువుల్లో దాని ఉనికి ప్రస్ఫుటమవుతుంది. తర్వాత చైత్యపురుషుడు తగుమాత్రంగా పెరిగి పరిపక్వమైనప్పుడు స్వతంత్ర చైతన్యమూ, ఇచ్ఛా ఏర్పడుతాయి. అలా ఎన్నో జన్మలెత్తిన తర్వాత, వైయక్తికమై తనకు తానే గుర్తెరిగి, తన కదలికలను, తానే గుర్తించి, తన పెరుగుదలకు కావలసిన వాతావరణాన్ని ఎందుకు కోరుకుందో గూడా గుర్తిస్తుంది. ఇలా గుర్తెరిగిన తరుణంలో, తన జీవితాన్ని భూమి మీద చాలించే ముందర, తన మలిజన్మ ఎటువంటి సందర్భాలలో తన చైత్యపురుషుడికి, పురోగతి జరగగలదో, అలాంటి భౌతిక జీవితాన్నే నిర్ణయించుకుంటుంది.

తన ప్రస్తుత జన్మలో, దేహం చాలించే కొన్ని క్షణాల ముందర, తదుపరి జన్మ ఎటువంటి పరిస్థితుల్లో గడపాలో నిర్ణయించుకుంటుంది. ముఖ్యంగా చైత్యపురుషుడు, భూమి మీద భౌతికకాయంలోనే పురోభివృద్ధి చెందగలడు. చైత్యపురుషుడు దేహం చాలించగానే విశ్రాంతిలోకి వెళ్లి చాలకాలం, ఇష్టమొచ్చినంత కాలం, తన పెరుగుదల కవసరమైన విశ్రాంతి తీసుకొంటుంది. ఆ జన్మ ప్రయోజనాలను జీర్ణించుకోవాలి గదా మరి. అదే passive progress. అందుకు కావలసినది విశ్రాంతి. అదే చైత్య పురుషుణ్ణి కొత్త అనుభూతుల్లోకి తీసుకువెళ్ళి, మరింత ప్రగతి సాధిస్తుంది. కానీ ఒక జన్మ పూర్తి చేసినపుడు (ఆ జన్మలో తాను చేయగలిగినది పూర్తిచేసినపుడే) జన్మ చాలిస్తుంది. తన ఉత్తరజన్మలో కావలిసిన పరిస్థితులు, ప్రదేశం సునిశితమైన ప్రోగ్రామ్, తను ఏ విధమైన అనుభవాలు పొందాలి, ఏ విధమైన పురోగతి చెందాలనుకున్నదీ, అన్నీ ఒక ప్రణాళిక రూపంలో తయారుచేసుకొని, తన ఉత్తర జన్మ తీసుకుంటుంది.

చైత్యపురుషుని అనుభవాలు

ఇక్కడ నేనొక ఉదాహరణ చెపుతాను. ఒక చైత్య పురుషుడు ఏదో ఒక కారణంగా రాజయ్యే అవకాశం ఉన్న శరీరాన్ని

ధరిస్తాడు. ఎందుకంటే, అందులోనే, ఆ పరిస్థితుల్లోనే తనకు కావల సిన అనుభూతులు లభిస్తాయి గనుక. కొంత దూరం వెళ్ళాక ఇహ ముందరకు వెళ్ళలేడు అని అనిపించినపుడు, ఈ భూమి వదిలి వెళ్ళిపోవడానికి నిర్ణయించుకుని ఒక సాధారణ మానవు నిగా సాధారణ పరిస్థితుల్లో (ఎక్కువ తక్కువా కాకుండా) తనకు ఏం కావాలో, అది చేయడానికి స్వతంత్రత ఉండే శరీరాన్ని కోరుకుంటాడు. ఎందుకంటే, రాజుకి ఎంత స్వేచ్ఛ ఉంటుం దన్నది సందేహాస్పదం. అది ఎంత బానిస జీవితమో, ఎన్ని కార్య క్రమాలు, ఎన్ని నియమసూత్రాలు. అన్నీ తన పరువుకోసం చేయవలసి ఉంటుంది అన్నది నీకు కొత్తగా చెప్పక్కర్లేదు. ఇటు వంటివి సాధారణ మానవునికి రుచించవచ్చునేమో కానీ, చైత్య పురుషుడికి సంతోషాన్నివ్వవు. ఎందుకంటే రాజు జీవితం చాల అనుభవాల్ని దూరంగా ఉంచుతుంది కనుక. అట్లా ఇటువంటి నిర్ణయం తీసుకున్న చైత్యపురుషుడు, తన అనుభవాల్ని గుర్తించు కుని, సుషుప్తావస్థలోకి ఎన్నాళ్ళు అవసరమో అన్నాళ్ళు జారుకుం టుంది.

ఇక్కడ నేను చెప్పేది చైత్యపురుషుడు పూర్తిగా తనకు తాను అనుభవించడమయినదాన్ని గురించి కానీ, పనిలో నిమగ్నమైన దాన్ని (చైత్యపురుషుణ్ణి) గురించికానీ కాదు. ఎందుకంటే అది, భవిష్యత్ జన్మలు, వాటి పరిస్థితులు నిర్ణయిస్తుంది కనుక. అందు కని ఒకానొక క్షణంలో తాను శరీరాన్ని తాలుస్తుంది. అట్లా చాల అనుభవాలు పొంది తెలుసుకొంటుంది. ఏ దేశంలో చైత్యపురు షుడు ఏ భాగం పెరిగిందో ఇంకో దేశంలో ఇంకోటి తెలుసు కున్నాక, ఏ దేశంలో తనకు కావలసిన అవకాశాలు దొరుకు తాయో, ఏ జీవన పరిస్థితులిస్తాయో సుమారుగా కావలసిన తల్లి దండ్రులు, శరీర పరిస్థితులు, భౌతికకాయం ఎట్లా ఉండాలో, ఎలాంటి శరీరమైతే తనకు కావల్సిన అనుభవాల్నివ్వగలదో, అటువంటివన్నీ నిర్ణయించుకుంటుంది. తర్వాత కాలం కలిసివచ్చి నపుడు, విశ్రాంతి లోంచి మేల్కొని, సుమారుగా అనుకూల పరి స్థితులు కలిసివచ్చినపుడు జన్మ ఎత్తుతుంది. భౌతికకాయంలో

చైత్యపురుషుడికి భౌతిక చైతన్యానికి దూరం ఉంది కనుక, ఎవరైనా అనుకున్నదాని కంటె కొంచెం వ్యత్యాసం రావచ్చు. ఎందుకంటే అది స్పష్టమైన దృశ్యం కంటె, సుమారుగానే ఊహించగలదు కనుక (ఈ పై చెప్పిన దూరంవల్ల) కానీ, ఎన్నుకున్న దేశం, తల్లిదండ్రులు, పరిస్థితులు మాత్రం తప్పు కావు. తల్లిదండ్రుల అంతఃపరిస్థితుల్లో, తేడా రాదు. ఒక్కొక్కప్పుడు నిర్ణయం కుదరకపోవచ్చు. కానీ, అదే సమయంలో, ఎవరైనా తల్లిదండ్రులు కానీ, ఒక స్త్రీ గానీ చైత్య ఆకాంక్ష కలిగి (తమకు తెలిసో తెలియకో) ఒక విశిష్టమైన శిశువు కావాలి అని అనుకుంటే, భూమ్మీద అటువంటి స్పందనం సృష్టిస్తుంది. వెంటనే చైత్య కాంతి, దీన్ని చూసి, అటువంటి స్పందన ఉన్న చోటికి పరుగెడుతుంది. అక్కణ్ణించీ, అంటే గర్భధారణ సమయం నించీ, శిశువు పెరుగుదలమీద ఒక కన్నేసి ఉంచుతుంది. దాని తయారీకి, తన ప్రణాళిక ప్రకారం, ఆ శిశువు భూమ్మీదకు వచ్చే వరకూ తన ప్రభావాన్నీ చూపిస్తుంది.

అంతా సవ్యంగా జరిగితే, అంటే ఏ ప్రమాదం లేకుండా (ఎందుకంటే ప్రమాదాలు ఎక్కడైనా జరగవచ్చు గనుక) శిశువు ఉద్భవించే ముందర చైత్యశక్తి, అంతా కాకపోయినా, తన శక్తిలో కొంతయినా ప్రవేశపెట్టి, మొట్టమొదట భూమ్మీద పడగానే, ఏడ్చిన సమయం నించీ దానికి కావలసిన అనుభవాలు (అనుభూతుల కోసం) ఒక ఊపు నిస్తుంది. దీని ఫలితం తల్లిదండ్రులకు, చైతన్యం లేకపోయినా, ఆ శిశువుకు బాహ్యాచైతన్యం లేకపోయినా (ఎందుకంటే చిన్నపిల్లలకు సాధారణంగా 4-7 సం॥ల మధ్యగాని ఈ చైతన్యం ఏర్పడదు.) అయినా చైత్యపురుషుడు ఆ పిల్లలకు కావలసిన అవసరాలు, పరిస్థితులు సర్వదా చైతన్యానుభూతి కనుగుణంగా ఏర్పరుస్తూ, అది గుర్తించగలిగే వఱకు సహాయం చేస్తూ వెనకే ఉంటుంది. కొంతమంది పుట్టిన వెంటనే తమ చైత్యపురుషుణ్ణి గుర్తించగలుగుతారు. అటువంటి శిశువులు, మనం పిల్లలు అనం. ఒక అసాధారణ గుణాలు గల

చైత్యపురుషుడి అనుభవాలు

వాళ్ళు అని పిలుస్తాం. కానీ అది, నిజంగా అసాధారణత కాదు కానీ, తనలోని చైత్యపురుషుణ్ణి వ్యక్తపరచడమే. అలాగే మరి కొంత మందికి, తమకు సూచన లిచ్చే మనుష్యుల్ని కలుసుకోకపోయినా, ఏదో తెలియని అదృశ్య హస్తము నడిపిస్తున్నట్లు భావించి, తాము అభివృద్ధి పొందుతారు. అటువంటి వాళ్ళు ఎవరినైనా కలుసుకుందాం అనుకుంటే, వారు వెంటనే తారసపడతారు. ఏదైనా పుస్తకం చదువుదామనుకుంటే అది దొరుకుతుంది. ఇంతెందుకు వారికి ఏ పరిస్థితి కావాలో, అది చక్కగా అమర్చినట్లు తారసపడుతుంది. ఎవరో తమకు కనిపించకుండా, ఇవన్నీ చేసిపెడుతున్నట్లు, తమ వెనుక కాపలా కాస్తూ తమ పురోభివృద్ధికి దోహదం చేస్తునట్లు అనిపించి, అభివృద్ధి పొందే అవకాశాలు కల్పించినట్లు జీవనయాత్ర సాగిస్తారు. అయితే చైత్యపురుషుడంటే ఏమిటి? ఎప్పుడూ, ఎవరూ, ఈ మాట వాడలేదు. లేదా దాన్ని గురించి విపులంగా చెప్పేవాళ్ళు తారసపడలేదు. కానీ ఒక్క సమావేశం చాలు, ఒక్క చూపు చాలు, వారికి జ్ఞాపకం రావడానికి, 'ఓ ఇదంతా నాకు తెలుసు' అని అనుకోడానికి.

చైత్యపురుషుని చివరిదశ

సరిగ్గా ఇదే, చైత్యపురుషుని ఆఖరి లేక చివరి దశ అభివృద్ధిలో జరుగుతుంది. దాని తర్వాత ఇహ అది భూమ్మీద జన్మ తీసుకోనక్కర్లేదు (జన్మరాహిత్యం). ఎందుకంటే తన అభివృద్ధి పూర్తయ్యింది గనుక. తర్వాత, తాను, దైవకార్యానికి అంకితం చేసుకోవడం కానీ, ఎక్కడికైనా అంటే అదే ఊర్ధ్వలోకాల్లోకి వెళ్ళడంగాని జరుగుతుంది. ఇక్కడిదాకా వచ్చాక, తనకు జరిగిన అనుభవాల్ని నెమరువేసుకొని, కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న జీవుల, అవస్థలను, వారికి కావలసిన లేదా అందించవలసిన సహాయాలను, అవసరాల్ని తేలికగా గుర్తిస్తుంది. ఇటువంటి చైత్యపురుషులు తమ ఉనికిని పూర్తిగా దైవకార్యానికే వినియోగిస్తారు. వారు యథేచ్ఛగా తమ కేది కావాలో అది కోరుకుని, జీవనయానం (నూటికి తొంభైపాళ్ళు, ఇలాగే జరగడానికి అవకాశం ఉంది) సాగిస్తారు.

కానీ సాధారణ జీవితాల్లో, అంటే ఓ మోస్తరుగా పరిణతి జెందిన మనుష్యుల్లో, చైత్యపురుషునికి, బాహ్య మానవునికి మధ్య సంబంధము అప్పుడప్పుడు జరుగుతుంది. ఇది సాధారణంగా అంతరావసరాలని బట్టిగానీ, అనుభవాల వల్లగానీ వచ్చిన ఫలితం. అటువంటి పరిస్థితుల్లో, చైత్యపురుషుడు ఉపరితలానికి వచ్చి భౌతికజీవితంలో కూడా, తన స్పర్శల ద్వారా (మాటల్లో, చేతల్లో) బయల్పడి, ఒక ఫోటో మాదిరిగా, అన్నీ ముద్ర వేసి చాలా కొద్ది సేపు మాత్రం ఉంటుంది, అప్పుడప్పుడూ జీవితంలో, ఇటువంటి క్షణాలు కన్పిస్తూ ఉంటయి. ఇవి మళ్ళీ మళ్ళీ కూడా రావచ్చు. కానీ అవి ఎంతోసేపు ఉండవు (క్షణికం). ఇవే నిజమైన చైత్య పురుషుడి జ్ఞాపకాలు, అకస్మాత్తుగా కలిగినవి మాత్రమే చెదురు మదురుగా జ్ఞాపకం వస్తుంటాయి. మానసిక రుగ్మత వల్ల కల్పించబడినవి కాకూడదు. పాత జీవితాలను గుర్తించడం అంత సులభం కాదు. నేను క్రిందటి జన్మలో ఇదీ, అదీ అని చెప్పడానికి, చైత్యపురుషుడు నిజమైన అనుభవం పొందినప్పుడే, ఒక ముఖ్యమైవ క్షణం జీవితంలో పరిస్థితుల సమూహం, ధరించిన దుస్తులో, మాట్లాడిన మాటలో, అలవాట్లో, నివసించిన వాతావరణమో ఏదో ఒక సూచన దొరుకుతుంది. అప్పుడే నువ్వు చెప్పగలవు. "ఓ అదా ఆ జీవితంలోనా? అవును నాకు గుర్తుంది" అని అంతేకానీ, ఎవరో వచ్చి తమ జీవితాలను గురించి, కోతి స్థితి నుంచి ఇప్పటి వరకూ జరిగిన మార్పులు, చేర్పులు చెపుతూ వచ్చారంటే, అది చక్కటి కట్టుకథే అని నీవు నమ్మవచ్చు.

*

ఆత్మ అవినాశి; భూమ్మీద జన్మ ఎత్తినపుడు విశ్వములోంచి మనోప్రాణిక ముడిపదార్థములను పోగుచేసికొని భౌతికశరీరాన్ని తయారు చేసుకొంటుంది. అనేక జన్మల నెత్తుతుంది. ఈ జన్మలన్నింటిని పూసలలో దారంలాగ చైత్యాత్మ (psychic) కలుపుతుంది. ఆయా జన్మల సారాంశాన్ని స్వీకరించి, అనుభవాల్ని తనలో పోగు చేసుకుంటుంది. అయితే ఒక్కొక్క జన్మలోని సూక్ష్మాతిసూక్ష్మ వివరాలు దానికి తెలియవు. ఈ జన్మలోని మని

షికి క్రిందటి జన్మలోని మనస్సును గురించి తెలియదు. ఆ జన్మలో తన్మయత్వం కలిగించే ఆత్మస్పర్శలు మాత్రమే చైత్యాత్మ (Psychic) లో మిగిలిపోతాయి. మిగతా నిత్యకృత్యమంతా మాసిపోతుంది.

కాబట్టి నువ్వు నీ చైత్యాత్మను స్పర్శించినంత మాత్రాన గతజన్మల స్మృతులు కలగవు. క్రిందటి జన్మలో తను ఫలానా మనిషిని అని చెప్పుకునేదంతా కేవలం కల్పితమేనని చెప్పాలి. మరికొంతమంది వారి జంతుజన్మల పూర్వవృత్తాంతము కూడ జ్ఞాపకమున్నట్లు చెప్పుకుంటారు. ఫలానా దేశంలో ఒక కోతిగా జన్మించినట్లు చెప్పుకుంటారు. కాని కోతులకు చైత్యజీవితో (psychic consciousness) ఏమాత్రము సంబంధముండదు. కోతి యొక్క అనుభవములన్నీ దాని మరణముతోనే అంతరించిపోతాయి. ఆత్మలో ఏ మాత్రం మిగిలి యుండవు.

మానవులలో కూడ సాధారణ జీవయాత్ర సాగిపోతూ వుంటుందే కాని, దాని ముద్రలు ఆత్మమీద పడవు. కొన్ని ముఖ్యమైన సంఘటనలు జరిగినప్పుడే అలా అవుతుంది. దీనికి కారణమేమిటంటే భౌతిక ధాతువులైన మనస్సు, ప్రాణికము మనిషి మరణించినప్పుడు విశ్వములో కలిసిపోయి వాటి వాటి ప్రత్యేక రూపములను పోగొట్టుకుంటాయి. జన్మ పరిపక్వమైనపుడు మట్టుకు అలా జరగదు. ఈ భౌతిక ప్రాణికములు కూడ చైత్యాత్మతో సంబంధమును కలిగి వుంటాయి. అప్పుడు మనిషిలోని చైతన్యము ద్వంద్వత్వములు లేక ఒకే ప్రధాన రూపములో రాణిస్తుంది. అప్పుడే మనిషికి పాతజన్మల స్మృతులు కలిగే అవకాశం వుంటుంది. అంతకు ముందర ఎవరైనా వారి పూర్వజన్మలను గురించి మాట్లాడటం హాస్యాస్పదమే అవుతుంది.

శ్రీమాత

*

మనిషి పునర్జన్మ యెత్తినపుడు పూర్వజన్మ స్మృతులు పూర్తిగ తుడిచిపెట్టుకు పోతాయనే మాట కూడ సబబు కాదు. ముఖ్యంగా చిన్నపిల్లలలో పూర్వజన్మల జాడలు కొద్ది కొద్దిగ మిగిలి వుండ

వచ్చును. అయితే అవి ఆధునిక విద్య, పరిసరాల ప్రభావము వలన మరుగన పడి అస్పష్టమై పోతుంటాయి. కొంతమంది పెద్ద వాళ్ళకు కూడ కచ్ఛితమైన పూర్వజన్మ స్మృతులు వుంటాయి. కాని లౌకిక విద్య, వాతావరణముల వలన ఆ స్మృతులు కూడ మాయమైపోతాయి. కాని ఒక విషయం మటుకు గుర్తుంచుకో వాలి. పూర్వజన్మల సారాంశము మాత్రమే చైత్యాత్మలో నమోదై వుంటుంది. అంతేగాని ఈ జన్మంత స్పష్టమైన స్పృహ వుండదు.

శ్రీఅరవిందులు

*

కాని ఈ జ్ఞప్తి మానసిక పరిధి లోనిది కాదు. మధ్యయుగంలో నేను ఫలానా రాజుననో, సామ్రాట్టుననో ప్రగల్భాలు పలికేవాళ్ళు కేవలం వారి భ్రమలకు లొంగిపోతున్నారనే చెప్పాలి. పూసగుచ్చి నట్లుగా చెప్పే రాజప్రాంగణపు వివరణలు లేక యుద్ధములు చేసి జయమును సాధించిన విశేషాలు కేవలం ఊహాకల్పితాలనే చెప్పాలి. ఇటువంటి సూక్ష్మాతిసూక్ష్మమైన వివరాలు కాదు జ్ఞాపకముం డేది. *అతి ప్రగాఢమైన అనుభూతి కలిగినప్పుడు లోని ఆత్మ తనను కప్పియున్న దట్టమైన పొరలను చీల్చుకొని పైకి వచ్చిన సన్నివేశములు మాత్రమే స్ఫురణకు వస్తాయి.* అనేక జన్మల ద్వారా పరిణామం జరుగుతూ వుంటుంది. ఆత్మ పెరుగుతూ వుంటుంది. మామూలుగా నిత్యకృత్యము జరిగిపోతూ వుంటుంది. కాని నీ చేతనా స్థాయి పెరిగే అపురూపమైన క్షణాలు లేక సన్ని వేశాలు కొన్ని వుంటాయి. ఆ ముఖ్యమైన మలుపులే మనిషికి గుర్తు వుంటాయి. అంతేగాని సమాజంలో నీ స్థానము, కుటుంబ వ్యవహారాదులు ఏమాత్రము గుర్తుండవు. ఇటువంటి పనికిరాని అల్పాల్పమైన వివరాలు పూర్తిగా మాసిపోతాయి. నీ ఆత్మ విక సించి దైవస్పర్శను పొందిన సన్నివేశములు మాత్రమే జ్ఞాపక ముంటాయి. *అటువంటి స్మృతులు చాలా గాఢంగా, సజీవంగా నిన్ననే జరిగినంత స్పష్టంగా వుంటాయి.* అప్పుడే ఆ సన్నివేశా నికి సంబంధించిన వివరాలు, వాతావరణము ఎంతో ప్రత్యక్షంగా

వుంటాయి. ఈ జన్మలోని అతి గాఢమైన అనుభూతులు కూడ దాని ముందర తీసికట్టే!

సాధారణంగా మనిషి జీవితం ఏదో కాలక్షేపంగా గడిచి పోతూ వుంటుంది. దాని వలన నీ చేతనా స్థాయిలో ఏ విధమైన మార్పు వుండదు. కొన్ని గాఢమైన సన్నివేశములు, ప్రాణాంతక మైన ఘటనలు కలిగినప్పుడు మాత్రము నీ అంతరంగిక జీవుడు తనను ఆచ్ఛాదించిన భౌతికపొరల నన్నింటిని చీల్చుకొని దేదీప్యమానంగా బహిర్గతమౌతాడు. అంతే కాదు. ఆ పిలుపు ఊర్ధ్వ లోకములలో యున్న నీ దివ్య ప్రతిరూపమును ఆకర్షించగా అది కూడ నీ లోకి దిగివస్తుంది. (This call of the being, when very strong, can also bring about the descent of a divine emanation, an individuality, a divine aspect which joins with your individuality at a given moment in order to do a given work, win a battle, express one thing or another) ఆ కార్యం పూర్తి కాగానే అది వెనక్కు వెళ్ళిపోతుంది.

Then one may retain the memory of the circumstances that were around those minutes of revelation or inspiration: one sees again the scenery, the colour of the dress that one had put on, the colour of one's own skin, the things about you at that time – all that is fixed indelibly with an extraordinary intensity, because the things of the ordinary life revealed themselves then in their true intensity and their true colour. The consciousness that reveals itself in you, reveals at the same time the consciousness that is in things. At times, with the help of these details you may reconstitute the age in which you lived or the action that you did, find out the country where you were; but it is very easy also to make a romance and take imagination for reality.

Yet you must not believe that all memories of past lives are those of moments of great crisis, of important mission or of revelation. Some times they are moments very simple, transpa-

rent, when an integral, a perfect harmony of the being was expressed. And that may correspond to altogether insignificant external situations.

నీ చైత్యపురుషుడు ఆవిష్కారమైన ఆ క్షణము మాత్రమే నీకు గుర్తు వుంటుంది. అంతే మళ్ళీ అది వెంటనే అంతర్గతమై తన యథాస్థానానికి వెళ్ళిపోతుంది. నీ ప్రస్తుత జీవితం కూడ అదే విధంగా కొనసాగుతూ వుంటుంది. ఏవో కొన్ని గాఢమైన సన్నివేశాలు తప్ప మిగతా సమయంలో మామూలు జీవయాత్ర గడిచిపోతూ వుంటుంది. నువ్వు ఏం తిన్నావో, ఏ బట్టలు వేసు కొన్నావో మొదలైన చచ్చు విషయాలన్నీ గుర్తుండవు గదా – గుర్తుండాల్సిన అవసరం కూడ లేదు. ఈ విషయాన్ని అర్థం చేసుకొంటే క్రిందటి జన్మలకు కూడ అదే న్యాయము ఎలా వర్తి స్తుందో అర్థమవుతుంది.

అతి ప్రాథమికమైన తొలిజన్మలు ఈ ఆత్మ ప్రస్థానానికి పెద్దగా లెక్కలోకి రావు. అవి కేవలం నిద్రాహారములకు మాత్రమే పరిమితము. అందుకని వాటి స్మృతులు ఏ మాత్రము ఆత్మలో మిగ లవు. మనుగడ సాగిస్తున్న కొద్దీ జన్మ పరిపక్వమై నీ చైత్యపురు షుడు కూడ బాహ్యజీవితంలో పాల్గొనటం మొదలుపెడతాడు. అవి మాత్రమే జన్మల పరంపరలో శాశ్వతంగా మిగిలిపోతాయి. ఆ స్మృతి కూడ కేవలం ఆత్మవికాసానికి సంబంధించినదై వుంటుందే కాని, నీవు నెమలి సింహాసనం మీద కూర్చుని, కొలువు తీర్చిన ఓ మహారాజువనో లేక దండకారణ్యంలో స్వైరవిహారం చేస్తున్న మృగరాజువనో కాదు. అనగా అనవసరమైన ఆత్మేతర విషయాలు నీ స్మృతిపథంలో వుండవు. నీ చైత్యపురుషుడు బహిర్గతమై శరీ రావయవములందెల్లడల వ్యాపించినప్పుడే అది సాధ్యము.

మూలం శ్రీమాత

స్వేచ్ఛానువాదం: డా॥ ఆర్. విమలాదేవి,

డా॥ ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 4, pp. 143-47; Vol. 3, pp. 148-49;
SABCL Vol. 22, p. 437; CWM Vol. 15, pp. 361-64)

పునరావృతం

విల్లు నేల జారినట్లు వింటినారి తెగినయట్లు
ఏకమైన కరద్వయము భారముగా విడినయట్లు
హృదయమలసి శ్వాస నిలచి గతియించిన
జ్ఞాపకాలు విస్మృతి లోనికి జారును.

వింటినెత్తి నారి దూర్చి సారించిన యట్లు
తానెరుగని క్రొత్త చోట క్రొంగొత్త తనువు దాల్చు
క్రొత్త జన్మ మందు క్రొంగొత్త కథలు నడుపు
విడిపోయిన జీవితాల కలుపు నెపుడు కాలము
భగ్నమైన ప్రేమకథలు క్రొంగొత్త మలుపు తిరుగు.
మానసమ్ము వినజాలదు హృది వీణల మీటులు
ఆత్మ మటుకు గురుతించును మంద్ర మధురగానము.

మూలం: శ్రీఅరవిందులు
భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

(*SABCL* Vol. 5, p. 565)

...it is much more important for us
to fix our attention upon
what we want to become than
upon what we have been.

The Mother

వ్యక్తి – వ్యక్తిత్వమూ

వ్యక్తి యనగా మూలపురుషుడు – చిత్సత్త. అది ప్రాకృత శరీరాన్ని ధరించినపుడు మనోప్రాణిక భౌతికాలతో ఒక వ్యక్తిత్వమును, కొన్ని అనుభవాలను సంతరించుకుంటుంది. పురుషుడు సుసంపన్నమౌతాడు. మళ్ళీ జన్మ ఎత్తినపుడు మరొక రకమైన జీవితాన్ని ఎంచుకొని మరొక విధమైన అనుభూతులను పొందుతాడు. 'అంతేగాని పాడిందే పాడరా పాసిపళ్ళ దాసుడా' అని చర్విత చరణము చేసి జన్మలను వృథా చేయడు; విశిష్ట జ్ఞానము, శక్తి, కార్యదక్షత, కౌశలము మొదలైన అనేక లక్షణాలతో సుసంపన్నమై సృష్టిలో తన పాత్రను ఉన్నతంగా పోషించ బూనుతాడు

– సంపాదకుడు

రాజభక్తిగా, ఔన్నత్యంగా, అపూర్వ సాహసంగా వీరుని విశాల హృదయంలో వ్యక్తమయ్యే ఏ దివ్యాంశ ఉన్నదో, అదే కవిలోని సామరస్య ప్రవృత్తిగా, ఉదాత్తశక్తిగా అభివ్యక్తమవుతుంది. ఆ శక్తి మరో వైపు మళ్ళితే కొత్త సమన్వయాన్ని సంతరించుకుని మరో రకంగా వ్యక్తమవుతుంది. దైవసాధనలో సాక్షాత్కారానికి దారి తీస్తుంది. లేకపోతే మహత్తర దైవకార్య నిర్వహాణ దక్షతగా రూపుదిద్దుకుంటుంది.

*

జీవి అనేక జన్మలెత్తుతూ రకరకాల వ్యక్తిత్వం కలిగి వివిధానుభవాలను పొందుతుంది. అయితే ఇవేమీ తరువాతి జన్మకు సంక్రమించాలనే నియమమేమీ లేదు. మరుజన్మలో ఒక కొత్త మనసునీ, ప్రాణాన్నీ, శరీరాన్నీ పొందుతుంది. గతజన్మలోని మానసిక సామర్థ్యమూ, ప్రవృత్తులూ, అభినివేశమూ, మనశ్చాంచల్యమూ మొదలైన వాటిలో జీవి కొత్త జన్మలో పనికి వచ్చే వాటిని మాత్రమే స్వీకరిస్తుంది. అన్నిటినీ కాదు. ఒక జన్మలో కవితాశక్తి కానీ, కవితా విన్యాస వైఖరిగాని వున్నా, మలిజన్మలో ఆ శక్తిగానీ, దాని పట్ల ఆసక్తిగానీ ఉండకపోవచ్చు. పైగా కొన్ని

సందర్భాలలో ఒక జన్మలో వ్యక్తం గాకుండా అణగారిపోయిన ప్రజ్ఞలు మరుజన్మలో వికసించవచ్చు. మనం గమనించ గలిగితే ఈ తారతమ్యాల వర్తనం ఏమాత్రం ఆశ్చర్యపడవలసిన విషయం కాదనిపిస్తుంది. ఎందుకంటే మన గతానుభవాల సారమంతా చైత్యపురుష కక్ష్యలో నిక్షిప్తమై నిలచి వుంటుంది. అయితే కొత్త దశలో ఆత్మ పురోభివృద్ధికీ, పరిణామానికీ అవసరమైన అనుభవాలు తప్ప వ్యక్తిగతమైనవి నిలవవు.

జీవి ఒక జన్మలో ఇంద్రియలాలసుడైనా, తరువాతి జన్మలో దానిని తృణీకరించి ఉత్తమ సాధన వైపు మరలవచ్చు. ఇటువంటి వివక్ష కేవలం ఒక జన్మలోనే జరుగవచ్చు. కొన్ని సందర్భాల్లో పాత జీవిత వాసనలేవీ కొత్త జీవితానికి సంక్రమించవు.

ఒక జీవితంలోని సంబంధ బాంధవ్యాలు జన్మజన్మలలో కొనసాగుతాయని నీవు చెప్తున్నావు. ఇది ప్రేమానుబంధాలను బట్టి ఒక్కొక్కప్పుడు జరగవచ్చు. కొన్ని సందర్భాల్లో కొందరు వ్యక్తులు అనేక జన్మలలో మళ్ళీ మళ్ళీ కలుసుకోవచ్చు. ఒక జన్మలో అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు మళ్లీ జన్మలో అన్నదమ్ము లుగాను, అక్కచెల్లెళ్ళుగాను ఉండిపోరు. ఒకే వ్యక్తి అదే బంధువుల మధ్య పుట్టి అవే రకమైన అనుభవాలు ఎల్లప్పుడూ పొందుతూ వుంటే పునర్జన్మ లక్ష్యం నెరవేరదు.

శరీరం విడిచిపెట్టిన జీవితో ప్రత్యక్ష సంబంధం పెట్టుకొనటం ఆ జీవి భూమి కక్ష్యకు సమీపంలో ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. అతీంద్రియ శాస్త్రవేత్తల ఊహాల ననుసరించి జీవి మరణించిన మూడు సంవత్సరాల వరకూ ఇతరులతో సంబంధం పెట్టుకొనటం సాధ్యమవుతుంది. కాని ఆ జీవికి భూలోకం పట్ల వున్న వ్యామోహం తగ్గక చైత్యపురుష కక్ష్యకు (psychic plane) పోకుండా భూమి కక్ష్యకు దగ్గరగా చరిస్తూ వుంటే త్వరగా పునర్జన్మ పొందే అవకాశముంటుంది. ఈ విషయంలో సర్వే సర్వత్రా ఇలానే జరుగుతుందని సిద్ధాంతీకరించడానికి వీలు లేదు. సాధారణంగా యిలా జరుగుతుందని చెప్ప

లేనంత వైవిధ్యంతో వేరు వేరు జీవుల వైనం భిన్నంగా వర్తిస్తూ వుంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

*

ప్రశ్న: ఈ జన్మలోనే రాబోయే జన్మ గురించి నిర్ణయించుకోవచ్చా? దీనికి సంబంధించిన సిద్ధాంతాలుగానీ, విజ్ఞానంగానీ ఉన్నదా?

అవన్నీ ఆత్మ స్థాయిని బట్టి చైత్యపురుష కక్ష్యలో ఏ పరిణామ దశ నందుకున్నారన్న అంశం మీద ఆధారపడి వుంటాయి. నేను నిన్న చెప్పినట్లు చైత్యకక్ష్యలో పురోగమించి, పూర్ణత్వానికి లేక పరిణతికి చాలా దగ్గరగా వుంటే మరణించడానికి ముందే తాను స్వీకరించబోయే జన్మను నిర్ణయించుకొనటం సాధ్యమవుతుంది. మిగతా సందర్భాల్లో పునర్జన్మ మెత్తటం దానంతట అదే అప్రయత్నంగా జరిగిపోతుంది. చైత్యపురుష సంకల్పమూ, శక్తీ అభివృద్ధి చెందని సందర్భాలలో జీవికి ఈ ఎన్నిక సాధ్యం కాదు. అందువలన ఈ విషయంలో ఎటువంటి సూత్రాలు, సిద్ధాంతాలూ లేవనే చెప్పవచ్చు. ఇది పరిస్థితుల మీదా, చైత్యపురుషుడు తాను ఏర్పాటు చేసుకుని అనుసరించబోయే మార్గం మీదా, దాని పుట్టుక మీదా ఆధారపడి వుంటుంది. దీనిని గురించి ఇదమిత్థమని చెప్పటం కష్టం. స్త్రీ, పురుష విషయం గురించి: ఒక జన్మ తరువాత మరో జన్మ తీసుకుండేటప్పుడు స్త్రీ పురుషుడుగా, పురుషుడు స్త్రీగా జన్మించటం చాలా జన్మల దాకా కొనసాగుతుంది. చైతన్యం పెరిగి, కార్యనిర్వహణలో చైతన్యంలో ఏకసూత్రత సిద్ధిస్తే రెండవది లేకుండా ఒకే మార్గంలా సాగిపోవచ్చు. అనంతమైన జన్మల పరిణామ చక్రంలో అందరూ స్త్రీ, పురుష జన్మలను స్వీకరించి వుంటారని నిస్సందేహంగా చెప్పవచ్చు. అందువలననే కొందరు స్త్రీలు పురుషప్రవృత్తి కలిగి వుంటారు. అలాగే కొందరు పురుషులు స్త్రీ స్వభావం కలిగి వుంటారు. అంటే వారి సహజమైన స్వభావానికి వ్యతిరేకమైన

ప్రవృత్తి కలిగి వుంటారు. అయితే జన్మలను ఎన్నుకునే సమయంలో తనను తాను సృజనాత్మకమైన మాతృరూప చైతన్యాన్ని గానీ లేక సాక్షీభూత పురుష చైతన్యాన్నిగానీ కోరుకోవచ్చు. ఇదంతా ఆ జీవి మాతృక మీద ఆధారపడి వుంటుంది.

మూలం: శ్రీమాత

*

స్త్రీలు ఎప్పటికీ స్త్రీలుగానూ, పురుషులు పురుషులుగానే ఉంటారా? ఇది చాలా జటిలమైన ప్రశ్న. పునర్జన్మప్పుడు స్త్రీపురుషులు తారుమారుగా పుడతారా అంటే అది అసాధ్యమని చెప్పడానికి వీల్లేదు. పునర్జన్మ కొన్ని పద్ధతులననుసరించి జరుగుతుంది. సాధారణంగా ప్రతివారూ ఒకే లింగాన్ననుసరించడం నాకు తెలుసు. కానీ తారుమారుగా పుట్టేవారు కూడా వుంటారు. అలాగని స్త్రీ లక్షణాలున్న పురుషులు పూర్వ జన్మలో స్త్రీలయి ఉండనక్కర లేదు. అలా తారుమారు లక్షణాలు కనబడడమనేది కొన్ని అదృశ్యశక్తుల ప్రభావమే. నిజానికి స్త్రీ పురుషులిద్దరిలోనూ ఉమ్మడిగా ఉండే లక్షణాలు చాలా ఉన్నాయి. ఇంకా కొందరిలో తమది కాని మనస్తత్వం కొంత కలిసి ఉండవచ్చు. ఒకానొక వ్యక్తి పూర్వజన్మను గురించి ఇలా అనుకోవచ్చు. "అది నేను కానే కాదు. నా మనస్తత్వం కొద్దిగా అతనిలో కనిపిస్తోంది."

పునర్జన్మ అనేది మామూలుగా అందరూ అనుకుంటున్నట్లు సులువుగా అర్థం చేసుకునేదిగా ఉండదు. అదొక జటిలమైన వ్యవహారము.

*

పునర్జన్మ అంటే జనబాహుళ్యానికుండే అభిప్రాయం సరైనది కాదు. ఆత్మ ఏ విధంగానూ మారకుండా పరిమిత వ్యక్తిత్వంతో ఒక జన్మ నుంచి మరొక జన్మకు పయనిస్తుందనటం ఆత్మపదార్థమంటే సరైన అవగాహన లేకుండా చెప్పే మాటలు మాత్రమే. తనకు దృశ్యమానంగా ఉన్న తన ఆకృతీ విశేషాలను మించి చూడలేని భౌతికమనస్సు ఆత్మను గురించి ఆ విధంగా నిస్సా

రంగా తలపోస్తుంది. దాని అంచనా ప్రకారం మరుజన్మలో వచ్చేది అదే ఆధ్యాత్మిక జీవి. అదే చైత్యవ్యక్తి మాత్రమే కాకుండా ఈ జన్మలో ఏ విధమైన స్వభావ లక్షణముందో అదే స్వభావం కూడా ఉంటుంది; కానీ పరిస్థితుల ప్రభావంవల్ల శరీరం మాత్రం మారుతుంది; అలా మారినప్పటికీ ఉండే తీరు, మనస్తత్వం, గుణ గణాలు, ఆకారము, అన్నీ ఒకే విధంగా ఉంటాయి; కొత్త జీవి తంలోని 'సింగినాదం సుబ్బారావు' పూర్వజన్మలోని 'సింగినాదం సుబ్బారావు' అవతారమే. ఇదే నిజమైతే పునర్జన్మకి అర్థమే ఉండదు, ఆధ్యాత్మిక ప్రయోజన మసలే ఉండదు. గతజన్మలోని స్వల్ప వ్యక్తిత్వం, కొద్దిపాటి మానసిక, ప్రాణిక కల్పికలు అనంతంగా మళ్ళీ మళ్ళీ పుడుతూంటే, అది పరిణామం కానే కాదు. ఈ విధంగా మన 'సింగినాదం సుబ్బారావు' ఎదుగూ బొదుగూ లేకుండా అలాగే ఉండిపోతే పునర్జన్మ అర్థరహితమైన ఒక శాశ్వత పునరావృత్తి మాత్రమే.

పునర్జన్మలో ఉండేది పాతజన్మలోని వ్యక్తిత్వమేనా?

శరీరధారియైన జీవి తన దైన పూర్ణసత్య స్వరూపాన్ని పొందాలంటే కొత్త కొత్త అనుభవాలే కాక సరికొత్త వ్యక్తిత్వం కూడా అత్యంత ఆవశ్యకము. పాతజన్మలో ఒక అనుభవము అసంపూర్ణంగా ఉండిపోతే, తిరిగి దాన్ని ఆ స్థాయిలో, ఆ మనోనిర్మాణంతో, అప్పటి శక్తిసామర్థ్యాలతోనే పొందవలసి ఉంటే ఆ పాత వ్యక్తిత్వం కొంతవరకు ఉపయోగపడుతుంది. కానీ అదంతా వృథా కాలక్షేపమే. ఒక వ్యక్తి మళ్ళీ అదే వ్యక్తిగా ఉండిపోతే సాధించేది, లాభించేది ఏమీ ఉండదు. ఒకటే పాత్ర మళ్ళీ ధరించడం వల్ల ఏ విధంగానూ జన్మసాఫల్యం జరగదు. అదే నడవడి, అవే అభిరుచులు, అవే వ్యాపృత్తులు, అవే బాహ్య, ఆంతరంగిక చర్యలు ఉండేటట్లయితే ఏ విధంగానూ, అభివృద్ధిగానీ, పరిపూర్ణతగానీ పొందలేరు. అదొక ఆవర్తిత దశాంకమే కాని, పరిణామం కాదు. మన వ్యక్తిత్వంపై మనకుండే వ్యామోహం వల్ల ఎప్పుడూ ఇలాగే కొనసాగాలనుకుంటాము. 'సింగినాదం సుబ్బారావు' ఎప్పుడూ

'సింగినాదం సుబ్బారావు' గానే ఉండిపోవాలనుకుంటాడు. ఇది పూర్తిగా అర్థరహితమే. అదే కనుక నెరవేరితే అది ఈప్సితార్థం అనిపించుకోకపోగా విసుగు పుట్టిస్తుంది.

నవ్యత్వమే పునర్జన్మలోని ఉద్దేశ్యమా

మానవ వ్యక్తిత్వమనేది కేవలం అంతర్గత పురుషుని మానసిక, దైహిక, ప్రాణిక రూప కల్పన మాత్రమే తప్ప అసలు ఆత్మ కాదు. లోపల ఉండే అసలు పురుషుడు తాత్కాలికంగా ఈ విధమైన బాహ్య వ్యక్తిత్వం కనబరుస్తాడు. అంతర్గత పురుషుడు జన్మ ధరించిన ప్రతిసారీ ఒక కొత్త రూపధారణతో, కొత్త అనుభవానికీ, కొత్త అభ్యుదయానికీ అనువుగా ఉండే వ్యక్తిత్వంతో భూమిపైకి వస్తూంటాడు. గతజన్మలోని ప్రధానతత్వం మాత్రం అటువంటి అనేక అంశాలతో బాటు అంటే ఆ అంతర్గత పురుషుని అనేక వ్యక్తిత్వాలలో ఒక వ్యక్తిత్వంగా బాహ్యమైన మనఃప్రాణ శరీరాల ముసుగు వెనుక నేపథ్యంలో ఉండి కొత్త జన్మకు కావలసిన సహాయాన్ని అవసరమైనప్పుడు అందిస్తూ ఉంటుంది. అంతవరకే దాని ప్రయోజనం తప్ప అదే పూర్తి వ్యక్తిత్వంగా ఉండలేదు. పాతలక్షణాలని యథాతథంగా కొత్త వ్యక్తిత్వంగా కూర్చలేదు.

అంతేకాక పునర్జన్మలోని జీవి గతజన్మ కంటే పూర్తిగా వ్యతిరేక స్వభావాన్నీ, లక్షణాలనూ కలిగి యుండవచ్చు. అంత కంటే ఎక్కువ సామర్థ్యాన్ని, అధికమైన వ్యక్తిత్వాన్నీ పొందవచ్చు. ఎందువల్లనంటే గతజన్మలో బయల్పడని శక్తిసామర్థ్యం వెలువడాలనే ఆతృతతోనూ, అప్పుడు ప్రారంభించి అసంపూర్తిగా మిగిలిపోయిన కొన్ని కార్యక్రమాలు వాటిని నెరవేర్చే దక్షతగల వ్యక్తిత్వం ఏర్పడడం కోసమూ వేచియుండవచ్చు. ఈ విధంగా అవన్నీ రెట్టించిన ప్రేరణతో, సామర్థ్యంతో పునర్జన్మలో ఏర్పడాలనుకున్నప్పటికీ అన్నీ కొత్త వ్యక్తిత్వంలోకి చేరకపోవచ్చు. ఉపయోగకరమైన సామర్థ్యాలు గతంలో ఎన్ని రకాలుగా ఎంత అధికంగా ఏర్పడినాయో, అనుభవాలు ఎంత సమృద్ధిగా, సుసంపన్నంగా పోగై యున్నాయో అవన్నీ కూడా అంతకంటే అధిక

ప్రయోజనకరంగా పునర్జన్మలో పొదుకుంటాయి. వాటిలోని జ్ఞాన సముపార్జనా సామర్థ్యము, అధికారము, గుణశీలము, ప్రపంచానికి ఉపయోగపడే తీరు, ఈ జన్మలో ముందుకు వచ్చి క్రమబద్ధమవుతాయి. ఈ విధంగా మరుగున ఉండి ఈ కొత్త వ్యక్తిత్వాన్ని సుసంపన్నం చేసే మానసిక, ప్రాణిక, సూక్ష్మభౌతిక వ్యక్తిత్వాలు ఎన్ని ఎక్కువ ఉంటే ఆ వ్యక్తిత్వం అంత గొప్పగా తయారవుతుంది. అలా అది పరిణామ దశలో సంపూర్ణమైన మానసిక స్థాయిని చేరుతుంది. అక్కణ్ణుంచి ఆ స్థాయిని అధిగమించి తరువాత స్థాయి సమీపానికి చేరుకుంటుంది. అనేక వ్యక్తిత్వాలు సమ్మిశ్రితమై ఒకే వ్యక్తిలో కూడటం పరిణామక్రమంలో ఆ మనిషి పరిపక్వ దశను సూచిస్తుంది. అంతటి సమర్థతతో కూడిన ఆ కేంద్రస్థ పురుమడు బహుముఖాలుగా ఉన్న ఆ ప్రకృతిని సమన్వయపరచి క్రమబద్ధం చేయటానికే కృషి చేస్తాడు. ఇలా పూర్వజన్మలలో కూడిన అనుభవ సంపద ఉపయోగపడటమనేది అప్పటి వ్యక్తిత్వం పునరావృతమైనట్లు కాదు; అదంతా నూతన జన్మ సంపూర్ణ సిద్ధిని పొందటమే. పునర్జన్మ అనేది పాత జన్మలలోని వ్యక్తిత్వాన్ని పునః సృష్టి చేయటంగానీ లేక దాన్నే కొనసాగేటట్లుగానీ చేస్తున్న యంత్రాంగం కాదు. అది ఆధ్యాత్మిక జీవిని పరిణమింప చేయాలనుకునే ప్రకృతి విధానము.

మూలం: శ్రీఅరవిందులు

*

మరణించిన జీవి వెంటనే వేరొక జన్మ ధరిస్తుందా?

పునర్జన్మ దాల్చే విషయంలో అందరికీ ఒకే సూత్రం వర్తించదు. కొంతమంది వెంటనే జన్మ ఎత్తుతారు. మరణించిన తల్లిదండ్రులపై పిల్లలు ఎక్కువ మమకారం పెట్టుకున్నట్లైతే, ఆ తల్లిదండ్రుల అంశలు కొన్ని వీరిలో విలీనమైపోతాయి. ఆ బంధము వల్ల వారు వెంటనే పునర్జన్మ ఎత్తుతారు. కొంతమంది ఎన్నో వందలు, వేల సంవత్సరాలు గడిచే వరకూ మళ్ళీ జన్మించరు. వారికి అనువైన పరిస్థితులు

చేకూరేంత వరకూ వేచియుంటారు. యోగులైన వారైతే తాము ధరించబోయే శరీరాన్ని తమకు అనుకూలంగా ఉండేటట్లు తయారు చేసుకుంటారు. తనుగా జన్మించబోయే శరీరాన్ని చిన్నప్పట్నించీ తన కార్యక్రమానికి పనికివచ్చే విధంగా మలుచుకుంటూ నిర్మిం చుకుంటారు. బిడ్డ తల్లిదండ్రులు నిమిత్తమాత్రులు మాత్రమే.

పునర్జన్మ ధరించేది ఎవరు?

సాధారణంగా పునర్జన్మ అంటే ఒక వ్యక్తి మళ్ళీ అతనుగానే పుడతాడు అని అందరూ అనుకుంటారు. ఇది శుద్ధ పొరపాటు. అయితే వారిలో కొన్ని అంశలు మాత్రం ఇతర అంశాలతో కూడిన కొత్తశరీరం ఏర్పడటం మాత్రం నిజం. శరీ రాలు నశించినప్పటికీ వారి వారి ఎరుక వారి కుంటుందా అని మీకు అనుమానం రావచ్చును. సాధారణ మానవులందరూ కేవలం భౌతికంగా జీవించటం వలన శరీరం నశించినప్పుడు వారి దంటూ ఏమీ మిగలకపోవచ్చు. మనః ప్రాణాలు కొంత వరకూ మిగిలి ఉన్నప్పటికీ అది వారి భౌతిక వ్యక్తిత్వం కాజా లదు. అందులో బాహ్యావ్యక్తిత్వపు చిహ్నాలు ఏమాత్రం ఉండవు. దానికి కారణం అతను బాహ్యావ్యక్తిత్వ ప్రేరణలు, కోరికలతో ఏర్పడిన తాత్కాలిక జీవి కాబట్టి అది అలా ఉండటంతోనే తృప్తి పడుతుంది. అలా ఏర్పడిన జీవి తాత్కాలిక శరీరధర్మాల సంవి ధాన, సంలగ్నాలతో కొంతకాలం నిలబడి అవి ఆగిపోగానే అది కూడా ఉనికిని కోల్పోతుంది. అలా కాకుండా ఆ శరీర ధర్మాలు గతంలో మనస్సు విధించిన క్రమశిక్షణకు లోబడి, దాని ఆదర్శా లకు అనుగుణంగా నడుచుకున్నట్లైతే, ఆ జీవికి నికార్సయిన వ్యక్తిత్వం ఉండి తన పృథ్వీజీవితపు స్మృతులతో చైతన్యవం తంగా నిలుస్తుంది. కళాకారులు, వేదాంతులు వంటి వికాసం పొంది, వ్యవస్థీకృతమై, వైయక్తిక జీవితాలు గడిపిన వారి ప్రాణిక సత్వాలు మాత్రం నిలిచే ఉంటాయని చెపుతారు. వారి చైత్య పురుషని ఛాయలను కొంతవరకు వారి బాహ్యాచైతన్యంలో ప్రవే శపెట్టటం వల్ల ఆ చైత్యపురుషడి అమరత్వం వారికి సిద్ధిస్తుం

దన్న మాట. జీవుని పురోగమింప చేస్తూ క్రమక్రమంగా దైవ సంకల్పం చుట్టూ చేర్చడమే చైత్యపురుమని ఆదర్శము.

మూలం: శ్రీమాత

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి, డా॥ అమరవాది ప్రభావతి, డా॥ అమరవాది వెంకట్రామ శాస్త్రి

(SABCL Vol. 22, pp. 452, 453, 435-36; CWM Vol. 4, p. 183; SABCL Vol. 22, p. 448; Vol. 19, pp. 816-18; CWM Vol. 3, pp. 145-46; Vol. 15, p. 135)

కర్మ: బంధమా లేక పరిణామ సాధనమా?

కేవలం పాపపుణ్యాల వలనే నీ జీవితం నిర్ణయింపబడుతుందనే వాదన ఉచితం కాదు. ఆత్మ మనుగడను అనేక జన్మల ద్వారా సాధించవలసి యున్నది. అది మొదట జడపదార్థాన్ని చీల్చుకొని బయటపడింది. ఆ స్థాయి నుంచి అంతకంతకు పెరిగి పెద్దదై, చైతన్యవంతమై దివ్యకాంతితో ప్రకాశించవలసి యున్నది. ఈ ఆధ్యాత్మికయానము యొక్క తీరుతెన్నులు మేధకు అర్థమగునవి కావు. అట్టి సామర్థ్యము చైత్యపురుమనకు మాత్రమే వుంటుంది. జన్మాంతమప్పుడు తన పెరుగుదలకు ఏ విధమైన జీవితం కావాలో అటువంటి జన్మను ఆత్మ ఎంచుకుంటుంది.

— సంపాదకుడు

కర్మ సిద్ధాంతానికి సంబంధించిన సంప్రదాయ సిద్ధాంతాలు కొన్ని వాడుకలో ఉన్నాయి. ఇవి బాహ్య మనోచేతనాస్థాయి లోనివి, పస లేనివి, అనాగరికమైనవి, నిరుత్సాహపరచేవి. పాపము, పుణ్యము, న్యాయము, ధర్మము, శిక్ష, పురస్కారము లాంటి నైతిక సూత్రాలు నిజానికి అప్రధానమైనవి.

కర్మ సిద్ధాంతం ఆధ్యాత్మిక పురోగమనశీలమైనది. నైతిక నియమబద్ధమైనది కాదు. విశ్వప్రకృతి గమనం విశ్వసనీయమైన ఒక ఆధ్యాత్మిక సత్యమునకు నిబద్ధంగా ముందుకు సాగుతోంది. యాంత్రికంగా జరగటం లేదు. ఇది సంకుచిత, కఠిన, అల్ప, నైతిక సూత్రాలకు ఒదిగి ఉన్నది కాదు. పాపపుణ్యాలు, శిక్షా, పురస్కారాలు, ఆత్మోన్నతికి సహకరించని పసలేని భావాలు. దివ్య విశ్వ ప్రకృతి లక్ష్యం మహోన్నతమైనది, అతి గాఢమైనది, ఆధ్యాత్మిక పురోగమనశీలమైనది, జీవాత్మను ఉన్నత చైతన్య కాంతిశిఖరాల నధిరోహింప చేసేది. విశ్వ విజ్ఞాన సంకల్ప శక్తులు జన్మ, పునర్జన్మలకి ప్రేరకాలు. నిమ్నచేతనను ఉన్నతచేతనకి అధిరోహింప చేసే కర్మసూత్రాలు. కర్మసిద్ధాంతం నైతిక నియమావళనే ఉక్కు చట్రంలో బంధింపబడేది కాదు.

*

పునర్జన్మ పాపపుణ్యాల కధీనమై ఉండదు

ఆధ్యాత్మిక పురోగతిలో చైత్య పురుష ప్రభావం పునర్జన్మపై ఉంటుంది. మరణానికి ముందే అంతవరకు జీర్ణించుకొని ఉన్న గతజన్మానుభవాల నాధారంగా చైత్యపురుషుడు ఉత్తరజన్మకు అనువైన భౌతికరూపానికి ఆకృతి నేర్పర్చుకొని పునర్జన్మకు సంసిద్ధంగా ఉంటాడు. ఆధ్యాత్మిక పరిణతి లేనివారికీ సౌలభ్యం అసాధ్యం. ఏవేవో భౌతిక, విశ్వ శక్తుల కలగాపులగ గందరగోళంలో వీరి పునర్జన్మకి కావలసిన ఉపకరణం (శరీరం) అపరిపూర్ణంగా, అస్పష్టంగా, బలహీనంగా నిర్మాణమౌతుంది. చైత్యపురుష సంసర్గంతో జీవునికి తన యెరుకలోనే పునర్జన్మ లభిస్తుంది. పునర్జన్మ త్వరితంగా లేక ఆలస్యంగా పొందటం కూడా చైత్యపురుష ప్రభావానికి లోబడే ఉంటుంది.

పునర్జన్మ పాపపుణ్య కర్మఫలాల కనుగుణంగా ఉంటుందనేది, గతానుగతికంగా వినిపించే వాదం. గతజన్మలో చేసిన దుర్మార్గాల ఫలితంగా ఈ జన్మలో కష్టాలు అనుభవించడం, ఈ జన్మలో పండిన భౌతిక సౌఖ్యాల పంటకి గతజన్మ సన్మార్గ జీవనం – ఈ వాదం నమ్మించేదిగా ఉన్నప్పటికి, వట్టి అనుచిత

మైన ఛాందసవాదం. సహేతుకమైనది కాదు. గతజన్మ కర్మల తాలూకు శక్తుల ప్రభావం మలిజన్మలో ప్రతిఫలిస్తుంది నిజమే. కాని ఈ సూత్రాన్ని మరీ సాగదీసి పిడివాదంగా మార్చటం సరి కాదు. జన్మకి సాఫల్యత అనుభవసారంతో ఉన్నతగతి. ఖేద మోదాలు, అదృష్ట దురదృష్టాలు మంచిచెడుల నైతికసూత్రాలపై ఆధారపడి వుండవు. కాకపోతే మంచిచెడులు స్వభావాన్ని ఉచ్ఛ నీచాలుగా మార్చటానికి దోహదం చెస్తాయి. ఫలితంగా ఉన్నత స్వభావం బాధల కతీతంగా ఉద్ధరింపబడుతుంది. నీచస్వభావం, దుష్టత్వ బాధలను సుడిగుండంలో సుడులు తిరుగుతూ ఉంటుంది.

*

(చైత్యపురుష) దివ్యకేంద్ర అనుసంధానంతో వ్యవస్థీకరింపబడని బాహ్యారూపాన్ని మాత్రమే జీవుడు కోల్పోతాడు. నిజ మానసిక, ప్రాణిక, సూక్ష్మశరీర భాగాలు నిలద్రొక్కుకొని ఉంటాయి. వీటి చిహ్నాలే కర్మబంధాలుగా మిగులుతవి.

— శ్రీమాత

*

కర్మలు, కర్మఫలాలు (పాపపుణ్యాలు) జీవాత్మని సక్రమమార్గంలో పెట్టి పునర్జన్మకి నిర్దేశితమైన నైతిక సూత్రాలుగా ఉద్దేశింపబడి నవే అనుకుంటే జీవునికి గతజన్మ కర్మలు, తత్ఫలితాల స్మృతులు నిరాకరించడం పెద్ద పొరపాటే కదా! గతజన్మలోని స్మృతులు కనుక ఉంటే జీవుడు పాపపుణ్యకర్మఫలాలను బేరీజు వేసుకొని తన నడవడిని సంస్కరించుకోగలడు కదా! అలాగైనా కూడా, లోకంలో దుర్మార్గులకు భోగాలు, సన్మార్గులకు కష్టాలు సమకూ డుతున్నాయే! ఈ విపరీతానికి గతజన్మ అనుభవాల స్మృతులు, మలిజన్మలో సుస్పష్టంగా కాకపోవటమే అనుకోవచ్చు. కాని ఇది సరి కాదు. పోతే ప్రకృతి విధివిధానంలో ఎప్పటికీ సన్మార్గజీవ నమే వివేకవంతమైనదనేది యథార్థం. జీవుని అంతరంగ చైత్య పురుషునికి గతజన్మ స్మృతి ఉంటుందని, దేహం చాలించాక గత జన్మ అనుభవ స్మృతులు నెమరువేసుకుంటుందని చెప్పవచ్చు. ఇది బాహ్యంగా ప్రస్ఫుటం కాకపోవచ్చు. ఏది ఏమైనా గతజన్మ

స్మృతులు మలిజన్మకు పెద్దగా సహకరించకపోవచ్చు. జీవులు పాపకర్మలు కొనసాగిస్తూ, జీవిస్తూ ఉండటం చూస్తుంటే గత జన్మ అనుభవాల నుంచి వారు పాఠాలు నేర్చుకొని లబ్ధి పొందే అవకాశం కూడా లేదు.

పునర్జన్మకి గతజన్మ స్మృతులు అవరోధమే!

పరిణామక్రమంలో వైశ్వాన్యయ అనుభూతుల తోడ్పాటుతో జీవుడు (జన్మ పరంపరలో) నూతన ఉన్నత వ్యక్తిత్వసౌధాల నధిరోహిస్తూ ముందుకు సాగటం కొరకే, పునర్జన్మ. ఇదే పునర్జన్మ పరమార్థం కాగా గత జన్మ స్మృతులు ఇందుకు దోహదపడవు సరి కదా అవరోధాలుగా తయారవుతాయి. గతజన్మ తాలూకు వైయక్తిక స్వభావాలు, లక్షణాలు, చింతనలు భారమే అవుతవి. నూతన ఉన్నత వ్యక్తిత్వ రూపకల్పనకు, నూతన అనుభవ సేకరణకు, వైయక్తిక స్వభావ లక్షణాలైన రాగద్వేషాదులు గుదిబండలై ఆత్మ వికసనానికి ఇబ్బంది కలిగిస్తాయి. ఉన్నత చైతన్యభూమికల ఆరోహణకు అడ్డుతగులుతాయి. జీవుని వికాసం పరిణామక్రమంలో గతజన్మల అనుభవసార ఉద్దీపనతో జరుగుతుంది. ఇది మానసికస్థాయిలో జరిగే పని కాదు. అందుకే ఇక్కడ గతస్మృతుల ప్రసక్తిగాని, వాటి ప్రాధాన్యత గాని ఉండదు. గాలి, ఎండా, వానల పంచభూతాత్మక శక్తుల ఆలంబనలో, వాటిని అచేతనంగా తనలో ముకుళించుకుంటూ మొక్క చెట్టుగా పెరగటం లేదూ? అదే విధంగా మనిషికి గతజన్మ స్మృతి లేకుండా చేయటం విశ్వవిజ్ఞాన విధివిలాసం. పరిణామ ప్రక్రియ కిదవశ్యం, అపేక్షణీయం.

శ్రీఅరవిందులు

*

వ్యక్తి పరిపూర్ణ వికాసానికి పూర్వజన్మానుభవ జ్ఞానం ఆసక్తిదాయకంగానే ఉంటుంది.. కాని ఇది అప్రధానం. అంతకంటే భవితవ్యంపై దృష్టి సారించి ఉన్నత చైతన్య స్వభావాల నార్జించటం చాలా ముఖ్యం. ఈ జ్ఞానసాధనకి ఆకాశమే హద్దు.

*

మనం సాధారణంగా అనుకునే 'కర్మ', 'విధివిలాసము' జన్మ వాసనల ఫలితాలు – ఇవి జీవులను క్రుంగతీస్తాయి. వీటిని అను భవించి తీరాలిట! కాని దైవానుగ్రహాన్ని అపేక్షిస్తే దైవబలంతో వీటిని రద్దుచేయవచ్చు. ఇందుకు గొప్ప సహనము, ధైర్యము కావాలి. వీటికి మించి భక్తిప్రపత్తి ఉండాలి. ఏమాత్రం దైవభక్తి, విశ్వాసము ఉన్నా కర్మఫల విముక్తి అలవోకగా లభిస్తుంది. ఆత్మ నిగ్రహం, ధైర్యం, ఓరిమి, నిరోధకశక్తి కావాలి. కష్టనష్టాలను నేరుగా ఎదుర్కొనటం మానేసి, అమ్మబాబోయి! నేనిది భరించ లేననే పలాయన ధోరణి విడనాడాలి. అన్నిటికీ మించి దైవంపై అచంచల విశ్వాసం, ఆర్తి కావాలి. ఇందుకు గాఢమైన సంకల్ప బలం తోడు ఉండాలి. లేకపోతే పలాయన మార్గమే శరణ్యం అవుతుంది. 'నేను చచ్చిపోతాను! చచ్చిపోతానంటూ' గగ్గోలు పెడుతూ నా దగ్గరికి ఎంతమంది రాలేదు! అలాంటివారికి నా సమాధానమేమిటో తెలుసా? చచ్చిపోతానంటున్నారు కదా! అలాగే కానీయండి. చావటాని కెలాగూ సిద్ధపడ్డారు కదా! ఓ పని చేయండి. మీ అహాన్ని చంపండి. 'నేను' 'నాది' అనే భావాన్ని చంపివేయండి. అహాన్ని చంపగలిగే సాహసం మహత్త రమైన సాహసం! కర్మఫలం అవశ్యం అనుభవించాల్సినదే! అందుకు సిద్ధం కావల్సినదే! నిరహంకారంగా కర్మఫలాల నను భవించడం బలే సులువు. మన నిజస్వరూపానికి, అహంకార రూపానికి మధ్య ఓ అగాధముంది. నీ అహంకారరూపమే నీ మతి చెడగొట్టేది! అందుకే, అలాటప్పుడు స్థాణువులా నిశ్చలంగా ఉండాలి. అపుడు నీ మతిభ్రమణం పలాయనం చిత్తగిస్తుంది.

ఏనాటికైనా అంతరంగ విముక్తికి సత్ప్రయత్నం జరగాలి. నిర్ణయం తీసుకోవాలి. నిజం చెప్పాలంటే అందుకు సమయం ఇప్పుడు ఆసన్నమై ఉంది. భూభౌతిక ఆవరణలో దివ్యచేతన పరి భ్రమిస్తూ ఉన్నది. క్రొత్తయుగం ఆరంభమైనది. వేల సంవత్సరాల తర్వాత ఆసన్నమైన దైవీ ముహూర్తం, చైతన్యాన్ని అమలినంగా చేసుకోగలిగితే మహదవకాశం. విధి బలీయం అనుకునే స్థితి ఇప్పుడు లేదు. *మన మిప్పుడు చేయవలసినది రూపాంతరీకరణ*

దిశగా మనకు మనమే క్షాళన చేసుకుంటూ ముందుకు సాగిపో వటమే. సత్యచేతన సాధనా ప్రక్రియలో నిమగ్నం కావటమే, విముక్తికిదే దగ్గర దారి.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(Essays Divine and Human/ CWSA Vol. 13, p. 427; SABCL Vol 22, pp. 444-45; CWM Vol. 15, p. 134; SABCL Vol.19. pp. 818-19; CWM Vol. 16, p. 353; Vol. 15, pp. 391-94)

జన్మ రాహిత్యం – మోక్షం

ఈ విశ్వాంతరాళంలో ఒక ప్రణాళిక ఉంది. దాని ప్రకారం ఎంత ఎత్తైన ఉన్నతమైన స్వర్గధామం చేరినా పునర్జన్మ తప్పదు. కాని ఆ పురుషోత్తముని చేరిన ఆత్మకు మాత్రం పునర్జన్మ అనేదే ఉండదు. ఆ అనిర్వచనీయమైన (మాటల్లో చెప్పలేనటువంటి) బ్రహ్మకు సంబంధించిన జ్ఞానానికి ఫలితం ఉంటుంది. సరిగ్గా అటువంటి ఫలితమే తనంత తానై ఉన్నవాడు, అన్ని కర్మలనూ చేయించేవాడు, సమస్త జీవరాశికి చాలా సన్నిహితుడు అయిన ఆ పరమాత్మను కర్మ జ్ఞాన ప్రేమల ద్వారా ఆకాంక్షించటం వలన కూడా పొందవచ్చు. ఆ విధంగా ఆయన్ని తెలుసుకోవడం వల్ల మరి పునర్జన్మ బంధనం తప్పనిసరి కాదు. కర్మల బంధం తప్పనిసరి కాదు. పైగా ఈ అశాశ్వతమైనట్టి (క్షణభంగురమైన) బాధాభరితమైనట్టి మానవజన్మ నుండి శాశ్వతంగా తప్పించు కోవాలి అనుకొనే ఆ ఆత్మకు ఉండే కోరిక సఫలమౌతుంది కూడాను.

*

అప్పట్లో ఒకటో రెండో శైవశాఖల్లో తప్ప మిగతా అన్ని చోట్లా జన్మరాహిత్యమే చాలా ప్రగాఢమైన ఆదర్శం. కాని దీనికీ ఆ దైవం

అనేక జన్మలు ఎత్తుతాడనే వాదనకు పొంతన కుదరదు. ఎందు చేతనంటే భగవద్గీతలో చెప్పిన పరమోన్నతస్థితి భగవంతునిలో వసించుటయేగాని లయించుట కాదు. అలాంటి పక్షంలో ఇక ఆ దివ్యచేతనలో వసించే ముక్తులూ సిద్ధులూ పునర్జన్మను గురించి, దాని బాధల్ని గురించి భయపడడంలో అర్థం లేదు.

శ్రీఅరవిందులు

*

ప్రతి పరిపూర్ణ చైతన్యవంతమైన, పరిపక్వమైన చైత్య పురుషునికి పునర్జన్మ ఎత్తడానికీ, ఆ పునర్జన్మ ఎప్పుడూ కావాలంటే అప్పుడు ఎత్తడానికీ స్వేచ్ఛ ఉంటుంది.

శ్రీమాత

భావానువాదం: ఎమ్మెస్కె

(*SABCL* Vol. 13, p. 283; Vol. 22, p. 443; *CWM* Vol. 15, p.136)

జీవితానుభవాల నుంచి సంక్రమించే ఇక్కట్లు అనుల్లంఘనీయమైనవి కావు. కొన్ని ప్రతిబంధకాలుగా ఉన్నా (ఆధ్యాత్మిక జీవనానికి) వాటిని తరిమికొట్టి సహాయకారులుగా ఉన్న వాటిని ఆహ్వానించాలి.

శ్రీఅరవిందులు

(*SABCL* Vol. 22, p. 445)

పునరుత్థానము
(Resurrection)

పునరుత్థాన మనగా పాతచైతన్యము సమసిపోవటం. అయితే దీనికి గతజీవనంతో తెగతెంపులు చేసికోవడం వుండదు. పాత జన్మకి, ఈ జన్మకి కొంత సామ్యముంటుంది. నిమ్నప్రకృతికి వీడ్కోలు చెప్పి కొత్త శరీరాన్ని ధరించటం జరుగుతుంది. పునరుత్థానంలో పాతశరీరాన్ని త్యజించినప్పటికి అందులోని మేలైన లక్షణాలు నశించిపోకుండా మిగిలిపోయి కొత్తశరీరాన్ని సుసంపన్నము చేస్తాయి. ఒక విషయం గుర్తుంచుకోవాలి. భూలోకంలో జన్మ యెత్తినప్పుడు, నిమ్నలోకాలలోకి దిగిపోయిన ఆత్మ అంధకారబంధురమై అచేతన మృత్యువులలో చిక్కుకున్నప్పటికి తిరిగి జాగృతమవుతుంది. బలాన్ని పుంజుకుంటుంది. అచేతన ఎంత ఘోరమైన పరిస్థితో నీకు తెలియదు. అది నిశిరాత్రి కంటె చాలా కనా కష్టమైనది. నీవు ఒకసారి అక్కడికి వెళ్ళి తిరిగివచ్చినట్లైతే ఏమాత్రం వెలుగు చూపని కికారణ్యాము కూడ ధగధగ మెరిసిపోతూ వుంటుంది! అచేతన ఎంత ఘోరమైనదో ఇప్పుడు తెలిసిందనుకుంటాను. అలాగే నీవు అతిమానసజ్యోతిని దర్శించి తిరిగి ఈ లోకములోకి వచ్చినట్లైతే దేదీప్యమానమైన సూర్యుడు కూడ నల్లగా కనబడతాడు! గాఢాంధకారములో కూడ ఒక పరంజ్యోతి నిక్షిప్తమై వుంటుంది. ఆ వెలుగు, ఆ చైతన్యము నీలో జాగృతమైనట్లైతే దానినే మనం పునరుత్థానము అంటాము.

మూలం: శ్రీమాత

అనువాదము: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 3, p. 147)

జీవన్ముక్తుడు

తన్మయత్వంతో ఎవరైతే ఆలోచనా శూన్యంగా, మౌనంగా కాలపు
నత్తనడక నుండి విముక్తులై, దివ్యానుభూతి
సంశ్లేషణ నందుతారో,
వారు జీవాత్మ రూపురేఖలని, ఆనవాళ్ళని బహిరంగపరచి, పర
మాత్మ నిగూఢ, నిశ్శబ్ద పరిధిలో ఉన్నతా
సనంపై ఉపవిష్టులవుతారు.
ఇక్కడ తానో నశ్వర కాయంతో సప్తపది నెఱపినా,
ఎల్లలు పరిమితులు ఎఱుగని అనశ్వరుడతడు;
కల్పకల్పాంతరాలతని ఖేలావని,
జీవితం, దాని విభిన్న భంగిమలు, వెలుగు వెదజల్లే నీడలు.

కేవలం నిరీక్షిస్తున్న ప్రకృతి ముంగిట దైవికశక్తుల్ని నిలిపి,
ఆమె దుర్భర శ్రమను ఉపశమింపజేయటానికి విస్తృత శాంతి
ఱెక్కలు విప్పి,
అదుపు, ఆజ్ఞ, హద్దుపద్దూ లేని అంధకారం మీద కాంతి వెదజల్లి
ఆమె పురాతన శోకార్తిని ఆనందంగా స్వస్థపరచటానికి,

అతడు పరిభ్రమిస్తూ బ్రతుకుతాడు. వ్యర్థమైన విషయాలు మనసు
యొక్క కొద్ది బుద్ధులు.
ఎవని ఆత్మ అనంతత్వాన్ని, అనశ్వరతని
తన అధీనంలో వుంచుకొని
అనుభవైకవేద్యం గావించుకొని తాదాత్మ్యం చెందుతుందో,
అతనికి సర్వమూ మార్గదర్శకమై, ప్రేమాత్మకమై, అభిరక్షితమై
అలరారుతుంది.

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

(పై కవిత ఆంగ్ల మూలం తరువాయి పేజీలో)

JIVANMUKTA

...He who from Time's dull motion escapes and thrills
Rapt thoughtless, wordless into the Eternal's breast,
    Unrolls the form and sign of being,
        Seated above in the omniscient Silence.

Although consenting here to a mortal body,
He is the Undying; limit and bond he knows not;
    For him the aeons are a playground,
        Life and its deeds are his splendid shadow.

Only to bring God's forces to waiting Nature,
To help with wide-winged Peace her tormented labour
    And heal with joy her ancient sorrow,
        Casting down light on the inconscient darkness,

He acts and lives. Vain things are mind's smaller motives
To one whose soul enjoys for its high possession
    Infinity and the sempiternal
        All is his guide and beloved and refuge.

Sri Aurobindo

(*SABCL* Vol. 5, p. 576)

రూపాంతరీకరణము[1]

దేహరూపాంతరీకరణము (Bodily transformation) సర్వోత్కృష్ట ఆధ్యాత్మిక పునర్జన్మ. భూతకాల విషయసంబంధ వాసనలేవీ వుండవు. పూర్తిగా తుడిచిపెట్టుకొనిపోతాయి. ఆధ్యాత్మిక పునర్జన్మ కలగటమంటే – మన పురాకృత కర్మసంబంధాలను వాసనలను, సంస్కారాదులను పూర్తిగా త్యజించటం. *ప్రతి క్షణంలోనూ మనమొక నూతనజన్మ నెత్తిన అనుభవం కలుగుతుంది.* ప్రకృతి విసిరే వల మనపై పడదు. అంటే బంధనం తొలగిపోతుంది. ప్రకృతి సహజమైన కార్యకారణ రూపభ్రమణం నుండి విడిపోవటం అదొక మహత్తరమైన బంధవిముక్తి. చైతన్యంలో ఎప్పుడీ భూతకాలిక ప్రభావం ధ్వంసమౌతుదో అప్పటి పొరపాట్లు, తప్పులు, పాపాలు – వాటి వాటి వాసనల ముద్రలు మనలను జలగల్లా పట్టుకొని నెత్తురును బొట్లు బొట్లుగా చప్పరిస్తాయో – అవన్నీ వాటంతటవి పండుటాకుల్లా రాలిపోతాయి.

ఈ పరిపూర్ణ స్వాతంత్ర్యమొక అందమైన ఊహ కాదు. అది పరమ వాస్తవం. అనుభవ సిద్ధం. అది నిజమైన స్వేచ్ఛ. ఏదీ బంధించదు. దేని ప్రభావమూ వుండదు. బాధ్యతలు, ఆలోచనా పరాధీనతలూ వుండవు. బంధానికి ప్రతిచర్య – భూతపరాధీనతను తిరస్కరించటం – దాని కబంధహస్తాల నుండి బైటపడటం – పశ్చాత్తాపాలు వంటి వాటి ద్వారా జరిగే పని కాదు. భూతకాల జాడలు లేవు, అవి జాగృత చేతనలోంచి అదృశ్యమైపోయినై! అప్పుడు వాటి లంగరు ఎత్తేసినట్లే. బంధన విముక్తి లభించినట్లే. పునర్జన్మించటమంటే – మొట్టమొదటగా మన చైత్యపురుషుని లోనికి ప్రవేశించటం. అదే మనకు కర్మబంధం లేని జీవేశ్వర సమైక్యస్థానం. ఈ చైత్యపురుష వివేకం లేకుండా రూపాంతరీక

---

[1] TRANSFORMATION ఇది శ్రీఅరవింద యోగదర్శనంలో ఒక శాస్త్రీయ సాంకేతిక పదం – ఊర్ధ్వచైతన్యం, శరీర-ప్రాణ-మనోమయకోశాలలోకి అవతరించి పూర్తి క్షుద్రప్రకృతిని నిర్మూలించటం.

రణం అసంభవం. ఎప్పుడు మనకా నిజమైన జీవాత్మ ఎరుక కల్గుతున్నదో, ఎప్పుడు మనలో దివ్యశరణాగతి ప్రాప్తిస్తున్నదో అప్పుడు సర్వబంధాల నుండి విముక్తి లభిస్తున్నది. వెంటనే ఒక నూత్నప్రకాశమయమైన జీవితం ప్రారంభమౌతున్నది. భూతకాలం పట్టు సడలిపోతున్నది. ఈ ఆధ్యాత్మిక పునర్జన్మ ఔన్నత్యప్రాప్తి ఎలా వుంటుందో చెబుతాను. అది లభించగానే సర్వవిశ్వమూ లయించి, అదృశ్యమై ప్రతి క్షణం మరొక నూత్న విశ్వసృష్టి జరగటం నీకు నిత్యానుభవంలో గోచరిస్తుంది!

మూలం: శ్రీమాత
అనువాదం: తుమ్మపూడి కోటేశ్వరరావు

ఆంగ్లమూలం:

The bodily transformation will be the supreme spiritual rebirth – an utter casting away of all the ordinary past. For spiritual rebirth means the constant throwing away of our previous associations and circumstances and proceeding to live as if at each virgin moment we were starting life anew. It is to be free of what is called Karma, the stream of our past actions: in other words, a liberation from the bondage of Nature's common activity of cause and effect. When this cutting away of the past is triumphantly accomplished in the consciousness, all those mistakes, blunders, errors and follies which, still vivid in our recollection, cling to us like leeches sucking our life-blood, drop away, leaving us most joyfully free. This freedom is not a mere matter of thought; it is the most solid, practical, material fact. We really are free, nothing binds us, nothing affects us, there is no obsession of responsibility. If we want to counteract, annul, or outgrow our past, we cannot do it by mere repentance or similar things, we must forget that the untransformed past has ever been and enter into an enlightened state of consciousness which

breaks loose from all moorings. To be reborn means to enter, first of all, into our psychic consciousness where we are one with the Divine and eternally free from the reactions of Karma. Without becoming aware of the psychic, it is not possible to do so; but once we are securely conscious of the true soul in us which is always surrendered to the Divine, all bondage ceases. Then incessantly life begins afresh, then the past no longer cleaves to us. To give you an idea of the final height of spiritual rebirth, I may say that there can be a constant experience of the whole universe actually disappearing at every instant and being at every instant newly created!

The Mother

(*CWM* Vol. 3, pp. 176-77)

మనస్సు యొక్క జ్ఞాపకశక్తి ఎంత? అది ఒక జన్మకే పరిమితము. అంతకంటె మెరుగైన చైతన్యభూమిక లున్నవి. నీ దృష్టిని ఆ ఉన్నత చైతన్యంలోకి సారించుటవలన దానిలో నమోదై వున్న విషయములను తెలుసుకోగలవు. ఆ భూమికలో వెయ్యేళ్ల క్రిందటి సన్నివేశములు కూడ నమోదై వుంటాయి. అవి ఎప్పపోతుందిగాని, ఈ చేతనాభూమిక అటుల కాదు. ఒకసారి నువ్వు వాటిని స్ఫురించుకున్న తర్వాత వాటిని మరచిపోయే ప్రశ్నే లేదు. ఆ గర్భిత విషయాలను నువ్వు త్రవ్వి వెలుపలకు రప్పించాలి అంతే. ఈ విధంగా నువ్వు వెయ్యేళ్ళ క్రిందటి సంగతులను కూడ తెలుసుకోగలవు. క్రిందటి జన్మలను దర్శించనూ గలవు.

శ్రీమాత

సమాచార పత్రం

డా॥ నడ్కర్ణిగారు గీతావ్యాసములపై 23-2-05 నుంచి 5-3-05 వరకు సొసైటీ బీచ్ ఆఫీసులో ఒక అధ్యయన శిబిరమును నడిపెదరు. ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్రములు, శాఖల సమావేశము గుంటూరులో 4, 5 సెప్టెంబరు 2004 తేదీలలో జరుపబడినది. యువత, విద్య, యోగము ఆ సమావేశ విషయములు. శ్రీ ప్రదీప్ నరంగ్‌గారు ముఖ్య అతిథి, ఇతరులు శ్రీమతి ఒ. విజయలక్ష్మి జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్, (రిటైర్డు) శ్రీ రాఘవాచారి, విశాలాంధ్ర మాజీ ఎడిటర్, సీనియర్ జర్నలిస్టు, డా॥ మైలవరపు శ్రీనివాసరావు గారు ప్రిన్సిపాల్ కె.ఎల్.ఎన్. సంస్కృత కాలేజి, తెనాలి.

ఆంధ్రభవన్ నిర్మాణాన్ని గురించి 4 సెప్టెంబరు నాడు ఒక ముఖ్యమైన సమావేశమును నిర్వహించి కొన్ని ముఖ్యమైన నిర్ణయములు తీసుకొనబడినవి.

డెహారాడూన్ శాఖవారు ఒక ఉపాధ్యాయుల శిబిరము, భగవద్గీత మీద కొన్ని ప్రసంగములు జరిపిరి. పంజాబు యూనివర్సిటీ చండీఘర్, శ్రీఅరవింద సొసైటీలు కలిసి 'Sri Aurobindo's Vision of Humanity' అను విషయముపై ఒక గోష్ఠి నిర్వహించిరి.

నూతన ప్రచురణలు

స్తోత్రావళి: సంస్కృతంలో ప్రార్థనలు, శ్లోకములు – సంకలనము డా॥ సంపదానంద మిశ్ర. పుటలు 12+304 వెల 195/- శబ్ద నుంచి లభ్యము.

ప్రకటన

శ్రీఅరవింద సొసైటీ ఆంధ్రపదేశ్ 10 వ రాష్ట్ర సమావేశములు చిత్తూరులో టి.టి.డి వారి కళ్యాణ మండపమందు 18, 19 డిసెంబరు 2004 తేదీలలో జరుపబడును. దీని కందరూ ఆహ్వానితులే.